# Rācapāḷeṁ' sāhitya vimarśa - cāritraka adhyayanaṁ

A Thesis submitted to the University of Hyderabad in partial
Fulfilment of the requirement for the award of

Doctor of Philosophy
In
Telugu

Researcher
**ALLURU MASTHAN**
**(Reg No: 16HTPH01)**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad- 500046
Telangana, India
March - 2021

# ‘రాచపాళెం’ సాహిత్య విమర్శ - చారిత్రక అధ్యయనం

పిహెచ్.డి., పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి

సమర్పించిన పరిశోధన గ్రంథం


పరిశోధకుడు

అల్లూరు మస్తాన్

16HTPH01

పర్యవేక్షకులు

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు- 500046



మార్చి – 2021

# DECLARATION

I, **Alluru Masthan** hereby declare that this dissertation entitled **'Rācapāḷeṁ' sāhitya vimarśa - cāritraka adhyayanaṁ** submitted by me under the guidance and supervision of Prof. Darla Venkateswara Rao is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

Signature of the Student

Date: 5.3.2021

Name**: Alluru Masthan**
Registration No. **16HTPH01**

# CERTIFICATE

This is to certify the Thesis entitled **'Rācapāḷeṁ' sāhitya vimarśa - cāritraka adhyayanaṁ** submitted by **Mr. Alluru Masthan** bearing **Regd. No. 16HTPH01** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:** Parts of this thesis have been: (NOT EXACT PARTS) Issues discussed in the following papers have been presented elaborately in the chapter 3 and 4 of the thesis.)

1. ***"Bahumukha prajñāśāli ācārya rācapāḷeṁ candraśēkhara reḍḍi*" (ISSN 2456-4702),** Vol:14. Bhāvavīṇa Pg. No. 96-99, November- 2017. Chief Editor "Dr. B. Venkataswamy'', P.A.S. College, Pedanandipadu -522235, Guntur Dist., A.P.
2. ***"Ācārya rācapāḷeṁ dr̥ṣṭilō sāhitya prayōjanaṁ",*** " **(ISBN 978-81-942990-9-7),** Part -1, 'Nature and Environmental Conservation in Ancient and Modern Indian literature – A Study' Pg. No. 151-154, Chief Editor "Dr. B. Naga padmavathy'', Visakhapatnam., A.P.

**B. Presented in the following National and International seminars:** (Issues presented in the following papers have been discussed elaborately)

**1."** ***Ācārya rācapāḷeṁ dr̥ṣṭilō sāhitya prayōjanaṁ",*** 'Nature and Environmental Conservation in Ancient and Modern Indian literature – A Study, National seminar, conducted by SKSD Mahila Kalasal Degree&PG(A), TANUKU, on September 6&7, 2019.

**2**. "***Prācīna telugu sāhityaṁ - 'Darla' punarmūlyāṅkana dr̥kpathaṁ***", 'pracheena Telugu Sahityam – Aadhunikula Punarmulayankanam'International seminar Conducted By Prof. G.BalaSubrahmanyam, Prof. Dept.of Telugu, Sri Krishnadevaraya University, Anantapur, Frebraury 27&28, 2019.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D.

| Course Code | Name | Credits | pass/fail |
|---|---|---|---|
| 1. HT-801 | Research Methodology | 4.00 | PASS |
| 2. HT-802 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT-803 | Studies in Literature and Language | 4.00 | PASS |
| 4. HT-804 | Specialized Area and Broad Field | 4.00 | PASS |

(Prof. DARLA VENKATESWARA RAO)
**Research Supervisor**

(Prof. G. ARUNA KUMARI)

Prof. S.SARAT JYOTSNA RANI

**Head, Dept. of Telugu** **Dean, School of Humanities**

# విషయసూచిక

పుటలు


I. కృతజ్ఞతలు

II. సంకేత పద వివరణ


## ప్రవేశిక (i–xii)


1. పరిశోధనాంశ పరిచయం (Introduction) i

2. పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research) i

3. పూర్వ పరిశోధనల పరామర్శ (Review of Literature) ii

4. పరిశోధన ఆకరాలు (Research Source) iii

5. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research) vi

6. అనుబంధాలు (Annexures) ix

7. పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు (Research Objects/Results) ix


మొదటి అధ్యాయం

## రాచపాళెం చంద్రశేఖరరెడ్డి జీవితం, రచనలు - పరిచయం (1–39)


1.0. పరిచయం 1

1.1. రాచపాళెం జీవిత విశేషాలు 1

1.2. రాయలసీమ నేపథ్యం 1

1.3 . 'రాయలసీమ' చారిత్రక నేపథ్యం 2

1.4. 'రాయలసీమ' ప్రాంత సాహిత్య నేపథ్యం 3

1.5 'రాయలసీమ'లో సాహిత్య విమర్శ ప్రస్థానం 5

1.6. జననం 5

1.7. విద్యాభ్యాసం 6

1.8. వైవాహిక జీవితం 7

1.9. ఆచరణీయం, అనుసరణీయం రాచపాళెం జీవితం 7

1.10. అధ్యాపకుని నుండి ఆచార్యునిగా
రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 7

1.11. ప్రముఖులైన గురువులతో పరిచయాలు – సాహిత్య సంబంధాలు 9

1.12. పాఠ్యాంశాల పై ప్రత్యేక దృష్టి 9

1.13. విశ్వవిద్యాలయాలకు, దూర విద్యా కేంద్రాలకు పాఠ్యాంశాల రచన 10

1.14. సమాజంలోకి రాచపాళెం 10

1.15. సాంస్కృతిక భాగస్వామ్యం 12

1.16. కీలక ప్రభుత్వ బాధ్యతల నిర్వహణ 13

1.17. సాహితీ సామాజిక సంస్థల నిర్వహణ భాధ్యతలు 13

1.18. సాహితీ పురస్కారాలు 15

1.19. 'రాచపాళెం' – సాహిత్య ప్రస్థానం 16

1.20. సాహిత్యంలో జీవితం 18

1.21. పర్యవేక్షక పాళీ 19

1.21.1. పిహెచ్.డి లు 19

1.21.2. ఎం. ఫిల్ లు 20

1.22. సంపాదకత్వం వహించిన గ్రంథాలు 22

1.23. 'రాచపాళెం' – రచనలు 23

1.23.1. కవిత్వ సంపుటాలు 24

1.23.2. అనువాద గ్రంథాలు 24

1.23.3. విమర్శ గ్రంథాలు 25

1.24. రాచపాళెం సాహిత్యం మీద జరిగిన పరిశోధనలు 36
1.25. కవిగా రాచపాళెం 37
1.26. రైతు జీవిత ఆలంబన కవిగా రాచపాళెం 37
1.27. రాచపాళెం పై వచ్చిన ప్రత్యేక సంచికలు 39

రెండవ అధ్యాయం

## తెలుగు సాహిత్య విమర్శ: పుట్టుక – పరిణామం

(40-81)

2.0 పరిచయం 40
2.1 విమర్శ నిర్వచనం 40
2.1.1.విమర్శ ప్రాచ్యుల నిర్వచనాలు 41
2.1.2. పాశ్చాత్యుల నిర్వచనాలు 42
2.2. 'రాచపాళెం' సాహిత్య విమర్శ– 'శిల్ప ప్రభావతి'తో ప్రారంభం 44
2.3. సాహిత్య విమర్శ – పూర్వ రంగం 44
2.3.1. అవతారికలు 45
2.3.2. లక్షణ గ్రంథాలు 49
2.3.3. చాటువులు 50
2.3.4. వ్యాఖ్యానాలు 52
2.4. తెలుగు సాహిత్య విమర్శ– వికాస దశ 52
2.5. ప్రాచీన సాహిత్య విమర్శ 55
2.5.1. రసం 56
2.5.2. ధ్వని 56

2.5.3. ఔచిత్యం 56
2.6. 'తంగేడుపూల'తో ‘రాచపాళెం’ ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ 57
2.7. ఆధునిక సాహిత్య విమర్శ 57
2.7.1. గ్రాంథిక విమర్శ 59
2.7.2. గ్రంథ పరిష్కార విమర్శ 59
2.7.3. చారిత్రక విమర్శ 60
2.7.4. సాంఘిక విమర్శ 60
2.7.5. మనో వైజ్ఞానిక విమర్శ 60
2.7.6. కవి జీవిత విమర్శ 61
2.7.7. తులనాత్మక సాహిత్య విమర్శ 62
2.7.8. కళా సౌందర్య దృక్పథ విమర్శ 62
2.7.9. మార్క్సిస్టు విమర్శ 62
2.7.10. రూపవాద విమర్శ 63
2.7.11. అభిరుచి విమర్శ 63
2.7.12. ప్రతీకవాద విమర్శ 64
2.8. విమర్శ –ప్రతి విమర్శ 64
2.9. సాహిత్యోద్యమ విమర్శ 65
2.9.1. జాతీయోద్యమ విమర్శ 65
2.9.2. భావ కవిత్వోద్యమ విమర్శ 66
2.9.3. అభ్యుదయ కవిత్వోద్యమ విమర్శ 67
2.9.4. హేతువాద విమర్శ 68
2.9.5. దిగంబర కవిత్వోద్యమ విమర్శ 69
2.9.6. విప్లవోద్యమ కవిత్వ విమర్శ 70
2.10. స్త్రీవాద సాహిత్య విమర్శ 71
2.11. దళిత సాహిత్య విమర్శ 73

2.12. ముస్లింవాద సాహిత్య విమర్శ 75

2.13. ప్రాంతీయ వాద విమర్శ 76

2.14. ఆధునికోత్తర వాద విమర్శ 78

2.15. ద్రవాధునికత 79

## మూడవ అధ్యాయం

## 'రాచపాళెం' సాహిత్య విమర్శ – తొలిదశ (1972-2000)

## (82-180)

3.0. పరిచయం 82

3.1. సాహిత్య అధ్యయన పద్ధతులు 83

3.1.1. కాలానుసరణ అధ్యయన పద్ధతి 83

3.1.2. చారిత్రక అధ్యయన పద్ధతి 84

3.1.3. తులనాత్మక అధ్యయన పద్ధతి 85

3.2. చారిత్రక అధ్యయనం 86

3.3. చారిత్రక అధ్యయన పద్ధతులు 86

3.4. రాచపాళెం సాహిత్య విమర్శ –తొలిదశ (1972-2000) **87**

3.5. రాచపాళెం పరిశోధనలోకి ప్రవేశం 87

3.6. ప్రాచీన సాహిత్య విమర్శ 88

3.7. సిద్ధాంత గ్రంథ రచన అవిరళ కృషి 88

3.8. పరిశోధన క్రమంలో రాసిన వ్యాసాల అనుశీలన 89

3.9. ప్రభావతీ ప్రద్యుమ్నం కావ్య పరిచయం 90

3.10. పింగళి కథా నిర్మాణ సౌందర్య నిరూపణ 91

3.11. కథా నిర్మాణం 92

3.12. శిల్ప ప్రభావతీ రచన నైపుణ్యం 93

3.13. శిల్పం 95
3.14. శిల్ప ప్రభావతీ శిల్ప వైశిష్ట్యం 95
3.14.1. మెట్టాయితనము 97
3.14.2. విచ్చిత్తి 98
3.14.3. కిలకించితము 98
3.14.4. బిబ్బోకము 98
3.14.5. వ్రీడ 98
3.15. కవిత్వ రచనా దిక్సూచి నన్నయ్య 101
3.16. కావ్య రామణీయకత 106
3.17. కవిత్వ రామణీయకత 107
3.18. ప్రాచీన సాహిత్యం మీద మరులు 109
3.19. ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు –అభిరుచులు 110
3.20. అధి కవిత్వం 112
3.21. రాచపాళెం పై మార్క్సిజం ప్రభావం 116
3.22. శ్రీనాథుని సాహిత్యం సాహితీ సామాజిక విలువలు 117
3.23. వేమన దృక్పథం 118
3.24. కవిత్వ విమర్శ 119
3.24.1. ఆధునికాంధ్ర కవిత్వ విమర్శ ప్రారంభం 119
3.24.2. 'తంగేడు పూలు' కావ్య విశ్లేషణ 119
3.24.3. పాటతో విమర్శకు బాట 121
3.24.4. కవిత్వం పై మౌలికమైన సూత్రీకరణలు 123
3.24.5. పరిణామానికి ప్రతీక శ్రీశ్రీ 123
3.24.6. మట్టిమనిషి కవి(త) కోసం 126
3.24.7. విప్లవ కవిత్వం మౌలిక భావన 126
3.24.8. కవిత్వం వస్తు రూప విశ్లేషణ 127

3.24.9. భావ కవిత్వం పలాయనత్వం 128
3.24.10. భావ కవిత్వం జాషువా ప్రత్యేకత 130
3.24.11. ప్రాంతీయ కవిత్వం పై ఒక చూపు 132
3.24.12. దళిత కవిత్వం ఒక అవగాహన 137
3.25. కథా విమర్శ 141
3.25.1. గురజాడ సాహిత్యం రాచపాళెం దృష్టి 141
3.25.2. తిలక్ కథలు సామాజిక దర్శనం 147
3.25.3. మార్క్సియ కోణంలో రాయలసీమ కథలు 149
3.25.4. తెలంగాణ విప్లవోద్యమ కథ 151
3.25.5. తెలంగాణోద్యమ కథ– పరిణామం 152
3.25.6. పెద్దిభొట్ల కథల్లో మార్క్సిజం – అభ్యుదయ సమన్వయం 153
3.25.7. అనంత కథకుల దళితుల శిల్ప కథనం 154
3.25.8. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగు కథానిక 155
3.25.9. తెలుగు కథ– స్త్రీ అభ్యుదయం 158
3.26. నవలా విమర్శ 158
3.26.1 రాచపాళెం సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం 159
3.27. మార్క్సిస్టు సాహిత్య విమర్శ 160
3.28. సాహిత్యం – శాస్త్రీయ దృక్పథం 161
3.29. తొలి దశలో మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా రాచపాళెం 162
3.30. సామాజిక నేపథ్యమే మార్క్సిస్టు విమర్శా? 166
3.31. ఆధునిక సాహిత్య విమర్శ సాధికార సమీక్ష 167
3.32. మార్క్సిస్టు దృక్పథ విమర్శ వస్తు శిల్పాల సమన్వయం 172
3.33. సాహిత్య విమర్శకులకు కర దీపికలుగా నవలా శిల్పం, కథా శిల్పం 175
3.34. తులనాత్మక సాహిత్యం పై ఒక చూపు 176

నాలుగవ అధ్యాయం

# ‘రాచపాళెం’ సాహిత్య విమర్శ – మలిదశ (2001–2017)

(181–236)


4.0. పరిచయం 181

4.1. ‘రాచపాళెం’ సాహిత్య విమర్శ – లక్షణాలు 182

4.2. ప్రాచీన సాహిత్య విమర్శ 183

4.3. ఆధునిక సాహిత్య విమర్శ 184

4.3.1. ఆధునిక తెలుగు కవిత్వం – ప్రాపంచిక దృక్పథం 184

4.3.2. అస్తిత్వ ఉద్యమ కవిత్వం – పరిశీలన 187

4.3.3. విప్లవ సాహిత్యం – మౌలికత 192

4.4 కవుల తెలంగాణం (తెలంగాణ కవుల కవిత్వ పరామర్శ) 194

4.4.1. కాళోజీ 195

4.4.2. మాస్టార్జీ (మార్క్సిస్ట్ & అంబేద్కర్ భావాలు) 196

4.4.3. దాశరథి (ధ్వజమెత్తిన ప్రజలలో' కవికి గల అభ్యుదయ భావాలు) 197

4.4.4. సి.నారాయణరెడ్డిగారి “కవిత నా చిరునామా” 197

4.4.5. గద్దర్ (మార్క్సిస్టు & అంబేద్కర్) 198

4.4.6. ఎన్. గోపి 199

4.4.7. విమల 200

4.5. కథా విమర్శ 203

4.5.1. తెలుగు కథ, పరిణామ వికాసం 203

4.5.2. కథాశిల్పం సంప్రదాయాలు, ప్రయోగాలు 205

4.5.3. తెలుగు కథా సాహిత్య విమర్శ – సాధికార సమీక్ష 207

4.6. జాషువా సాహిత్యంపై ప్రత్యేక అధ్యయనం 211

4.6.1. 'జాషువ' స్వప్నం – సందేశం 212
4.6.2. వర్ణ వ్యవస్థ 212
4.6.3. జాషువా సందేశం– 'రాచపాళెం' వివరణ 213
4.6.4. దళిత సమైఖ్యత ప్రభోధం 214
4.6.5. జాషువా రచనల్లో స్త్రీ – 'రాచపాళెం' దృష్టి 214
4.6.6. జాషువా రాజకీయ సందేశం – 'రాచపాళెం' దృష్టి 214
4.6.7. ఆర్థిక సందేశం 215
4.6.8. జాషువా సాహిత్య సిద్ధాంతం – 'రాచపాళెం' దృష్టికోణం 215
4.6.9. సమతా వాదిగా జాషువా – 'రాచపాళెం' దృష్టి 216
4.6.10. జాషువా శ్రామిక దోపిడీ నిరసన – 'రాచపాళెం' కమ్యూనిస్టు దృష్టి 216
4.6.11. జాషువా స్త్రీ దృక్పథం – 'రాచపాళెం' దృష్టి 217
4.6.12. జాషువా సాహిత్య కృషి – 'రాచపాళెం' దృష్టికోణం 218
4.6.13. దళిత సమైఖ్యత కోరిన జాషువా 218
4.6.14. అందమైన అచ్చమైన భారతీయ కవి గుర్రం జాషువా 219
4.6.15. రచయిత, రాజ్యం జాషువా 221
4.7. నవలా విమర్శ 221
4.7.1. 'రాచపాళెం' సాహిత్య విమర్శ – అంబేద్కరిజం, మార్క్సిజాల సమన్వయం 224
4.7.2. మార్క్సిజం (Marxism) 225
4.7.3. అంబేద్కరిజం (Ambedkarism) 225
4.7.4. సమన్వయం 226
4.8. తెలుగు సాహిత్య పరిణామాలు 228
4.9. మూల్యాంకనం, పునర్మూల్యాంకనం అనివార్యం 231
4.10. 'రాచపాళెం' సాహిత్య విమర్శ–చారిత్రక పరిణామం 233
4.11. 'రాచపాళెం' సాహిత్య విమర్శ 'మలిదశ' విమర్శలోని ప్రధానాంశాలు 234

ఐదవ అధ్యాయం

## ‘రాచపాళెం’ ఇతర సాహిత్య విమర్శలు

**(237-269)**

5.0 పరిచయం 237

5.1 అధి విమర్శ 238

5.2 అధి విమర్శకులు 238

5.3 దిన పత్రికల్లో వచ్చిన సాహిత్య పుటల సమీక్ష 238

5.4 విమర్శ 2009 240

5.5 జానపద, ప్రాచీన సాహిత్య అధ్యయనం – మౌలిక భావనలు 241

5.6 ప్రాచీన సాహిత్యం – మనువాద ప్రభావం 243

5.7 కథా విమర్శ 246

5.8 తొలి తెలుగు కథపై వచ్చిన విమర్శలు – విశ్లేషణ 247

5.9 కవిత్వంపై వచ్చిన వ్యాసాల అనుశీలన 253

5.10 వచన కవిత్వం – ప్రక్రియల అనుశీలన 255

5.10.1 నానీలు 255

5.10.2 రెక్కలు 255

5.10.3 మినీ కవితలు 256

5.10.4 హైకూలు 256

5.11 నవలా విమర్శ 256

5.12 నాటక విమర్శ 258

5.13 విమర్శ –2011 259

5.14 పీఠికలు – సమీక్షలు 261

5.15 సాహిత్య పీఠికలు 262

5.16 పీఠికా రచయితగా రాచపాళెం 263

5.17 రాచపాళెం పీఠికలు – నిర్మాణ ద్వైవిధ్యం 265

5.18 ఆధునిక కావ్యాలకు రాసిన ముందుమాటలు 268

**ఉపసంహారం** **269**

**ఉపయుక్త గ్రంథ సూచి** **272**

**అనుబంధం 1** **279**

**ఆచార్య 'రాచపాళెం' గారితో జరిపిన ఇంటర్వ్యూ**

**అనుబంధం 2** **287**

**'రాచపాళెం', ఇతర సమకాలీన సాహిత్య విమర్శకులతో దిగిన ఛాయాచిత్రాలు**

**అనుబంధం 3** **304**

**సదస్సులు మరియు పరిశోధన వ్యాసాలు**

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి నేనెప్పుడూ ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షిస్తూ నేనింతటి వాడిని అవ్వడానికి కారణ భూతులైన నా తల్లికి, నా ప్రగతికి మూలకారణమై, ఆ ఫలితాన్ని అనుభవించ కుండానే నాకు దూరమైన కీ. శే మా నాన్న గారికి మనఃవందనాలు. ఏ కష్టం వచ్చినా నీకు మేమున్నాం అంటూ నన్ను నిరంతరం ప్రోత్సహించిన అన్న వదినలకు నా ధన్యవాదాలు.

హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన రోజు నుండి నాలో నాకే తెలియని స్ఫూర్తిని నింపి, నా అభ్యున్నతిని కోరుకుంటూ, దాని ఆచరణకు అనువైన, విలువైన సలహాలను అందించి, నాపరిశోధన సకాలంలో పూర్తికావడానికి సహకరించిన నా పర్యవేక్షక గురువులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికీ, ఎప్పుడు ఇంటికి వెళ్ళినా ఆప్యాయతతో పలకరించి, ఎల్లవేళలా తన ఆశీర్వచనాలు అందించే మాతృ సమానురాలు డా॥ఎం.మంజుశ్రీ గారికి నా నమోవాకాలు.

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య జి. అరుణకుమారి గారికీ, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికీ, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికీ, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికీ, ఆచార్య ఎం. గోనానాయక్ గారికీ, ఆచార్య ఎండ్లూరి సుధాకరరావు గారికీ, ఆచార్య డి. విజయలక్ష్మి గారికీ, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికీ, డా॥ బాణాల భుజంగరెడ్డి గారికీ, డా॥ డి. విజయకుమారి గారికీ నా కైమోడ్పులు.

నాలో ఎల్లప్పుడూ ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింప చేస్తూ నాతో చేరి నాలో సగమైన నా అర్థాంగి శ్రీమతి విజయలక్ష్మికి నా మనః పూర్వక కృతజ్ఞతలు.

పాఠశాల స్థాయిలో గురువు శ్రీదేవి గారికీ, ఇంటర్మీడియట్ స్థాయిలో గురువులు వెంకటరత్నం, రామ చంద్రన్, అబ్దుల్ రజాక్ గారికీ, డిగ్రీ స్థాయిలో గురువులు విజయ, పాండురంగ దంపతులకు, విశ్వనాథ్ గారికీ, హజరత్తయ్య గారికీ, ఎం. వి. యన్. సుధారాణి గారికీ, తెలుగు పండిత శిక్షణ స్థాయిలో గురువులు ఉంగూరు సురేష్ గారికీ, వీరే కాక ఇంకా అనేక స్థాయిల్లో, అనేక రకాలుగా ప్రాథమిక స్థాయి

నుండి పరిశోధన స్థాయి వరకు వివిధ దశలలో నన్ను వివిధ రకాలు ప్రోత్సహించిన ఎందరో గురువులు అందరికీ వందనాలు.

ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన నాటి నుండి ఎప్పటికప్పుడు వారి విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ నా అభ్యున్నతిని కాంక్షించే నా సహోపాధ్యాయులు యరమల రాజు(ప్రిన్సిపాల్) గారికీ, ఇరువూరు పాపయ్య గారికీ, జేష్టాది చిరంజీవి గారికీ నా ధన్యవాదాలు.

నేను పరిశోధన చేయడానికి అన్ని వేళల తమ తోడ్పాటును అందించి, నా సందేహాలను ఎప్పటికప్పుడు నివృతి చేసి నా పరిశోధన పురోగతిని సాధించడానికి తమ వంతు సహాయ సహకారాలు విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారికీ, వారి సతీమణి లక్ష్మి గారికీ, వారి సుపుత్రులు ఆనంద్ గారికీ నా నమస్సులు.

పరిశోధనకు సంబంధించి నా ఆలోచనల స్థాయి పరిణతి సాధించడానికి ఎప్పటికప్పుడు విలువైన సలహాలు, సూచనలను అందించిన నా సీనియర్ పరిశోధక మిత్రులు డా॥ శివన్న చంద్రయ్య అన్నకూ, డా॥ మంత్రి మల్లేష్ అన్నకూ, డా॥ మల్లిపూడి రవిచంద్ర అన్నకూ, డా॥ బడిగె ఉమేష్ అన్నకూ, డా॥ ఎ. వి. వి. కె చైతన్య అన్నకూ, నా సహ పరిశోధక మిత్రుడు డా॥ బడికాల రమేష్ కు, నా ప్రత్యేక ధన్యవాదాలు.

హైదరాబాదు విశ్వవిద్యాలయంలో నాపై నేను ఎప్పుడూ విశ్వాసం కోల్పోకుండా నా వెంటే ఉంటూ నన్ను మున్ముందుకు నడిపించిన మిత్రులు కసిపాక రాఘవేందర్ అన్నకు, మణిగిల్ల మల్లిఖార్జున్ కు, వయస్సులో చిన్నవారైనా జీవితంలో ఎదుర్కోవలసిన ఎన్నో అనుభవాలను ఎల్లప్పుడూ నాతో పంచుకుంటూ నిత్యం నన్ను ప్రోత్సహించిన శ్రీపతి మారుతి, సారిపల్లి నాగరాజు, బుగదురు మదన్ మోహన్ రెడ్డి, భోగిని మహేష్, బట్టు విజయ్ కుమార్, జవ్వాజి రాణా ప్రతాప్ లకు అడిగినది కాదనకుండా ఎల్లవేళలా నన్ను ఆదరించిన నా అనుంగు మిత్రుడు అలిసెట్టి మధుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఏ రక్త సంబంధం లేకున్నా నాకు బంధుమిత్రులుగా ఉంటూ ఎప్పుడూ తమ విలువైన సలహాలను సూచనలను అందించిన మంజు, సునీత, పుష్పిణి, గీత, ఊర్మిళ, శారద అక్క, శ్రీలత లకు నా కృతజ్ఞతలు.

# సంకేత పద వివరణ

| | | |
|---|---|---|
| సం.పా | : | సంపాదకుడు/ సంపాదకత్వం |
| రాచపాళెం | : | రాచపాళెం చంద్రశేఖరరెడ్డి |

# ప్రవేశిక

## 1. పరిశోధనాంశం పరిచయం (Introduction)

ప్రసిద్ధి చెందిన వర్తమాన తెలుగు సాహిత్య విమర్శకులలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఒకరు. ఈయన "రాచపాళెం" అనే తన ఇంటి పేరుతో కూడా ప్రసిద్ధి పొంది అదే పేరుతో ఎక్కువగా పిలువబడుతున్నారు. ఈయన ఆచార్యునిగా, రచయితగా, విమర్శకునిగా తెలుగు సాహిత్య చరిత్రలో ఒక స్థానం ఉంది. ఈయన చిత్తూరు జిల్లా, కుంట్రపాకంలో 1948 అక్టోబర్ 16 న జన్మించారు. చిన్నతనం నుండి ప్రాచీన సాహిత్యం పై మక్కువ పెంచుకున్న ఈయన పింగళి సూరనార్యుని "ప్రభావతీ ప్రద్యుమ్నం " అనే కావ్యాన్ని తన పరిశోధనకు స్వీకరించి అందులోని శిల్ప నైపుణ్యాన్ని వివరించారు. ఇక అప్పటి నుండి ఆయన విమర్శా రంగంలో దాదాపు అయిదు దశాబ్దాలు పాటు తన విమర్శ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం 2014 లో ఆయన రచించిన "మన నవలలు-మన కథానికలు" అనే విమర్శ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ఇచ్చింది. ఇది ఆయన విమర్శ రంగంలో చేసిన కృషికి, గుర్తింపుకు నిదర్శనం.

రాచపాళెం వారు సుమారు 30 కి పైగా గ్రంథాలను రచించారు. వీటిపై ఎన్నో పరిశోధనలు కూడా జరిగాయి. అయితే చారిత్రక అధ్యయన దృష్టితో పరిశోధన జరగలేదని గ్రహించాను. మా పర్యవేక్షకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు సూచన మేరకు ఆయన సాహిత్య విమర్శ రచనలపై పరిశోధన చేయాలని భావించి "**రాచపాళెం సాహిత్య విమర్శ – చారిత్రక అధ్యయనం**" అనే అంశాన్ని నా పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను.

## 2. పరిశోధనావశ్యకత (Necessity of The Research)

రాచపాళెం రాసిన విమర్శ గ్రంథాలను పరిశీలిస్తే తనకు ముందు ఉన్న విమర్శకులను అనుసరిస్తూ కొనసాగినట్లుగా తెలుస్తుంది. మార్క్సిస్టు భావాలను ఒంటపట్టించుకున్న

రాచపాళెం వారు ఆ దిశగా అడుగులు వేసి తన విమర్శనా దృక్పథాన్ని ఎంత వరకు సమన్వయించారో, కేవలం మార్క్సిస్టు భావజాలంతోనే తన విమర్శ ప్రస్థానాన్ని కొనసాగించారా లేక ఇతర ఏవైనా భావజాలాల ప్రభావం ఉందా? అనే విషయాలు పాఠకులకు తెలియాల్సిన అవసరం ఉంది. కాబట్టి ఆయన తన రచనల ద్వారా సమాజాన్ని, దాని స్వభావాన్ని ఏ విధంగా అవగాహన చేసుకున్నాడో విశ్లేషణ చేయవలసిన అవసరం ఉంది. ఇంత వరకు రాచపాళెం సాహిత్య విమర్శ మీద ఇప్పటికే కొన్ని పరిశోధనలు జరిగాయి. అవి ప్రాచీన సాహిత్య విమర్శ, కవిత్వ విమర్శ పరిధులలో జరిగాయి. కానీ ఆయన రాసిన సాహిత్య విమర్శ మొత్తాన్ని ఒక చారిత్రక క్రమంలో ఇంతవరకు అధ్యయనం చేయడం జరగలేదు. చారిత్రక క్రమంలో ఆయన సాహిత్య విమర్శను అధ్యయనం చేస్తే విమర్శకుడుగా రాచపాళెం ఎలా ఎదుగుతూ వచ్చారో అర్థమౌతుంది.

తెలుగులో మార్క్స వాద దృక్పథంతో వెలువడిన విమర్శకు దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర ఉంది. తెలుగు సాహిత్యంలో మార్క్స వాద భావాలు ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రచించిన మాలపల్లి(1930) నవలలో మొదటి సారి కనిపించగా, మద్దుకూరి చంద్రశేఖర రావు గారు రాసిన 1944 లో అచ్చయిన రెండు వ్యాసాలను తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ప్రారంభంగా ఇప్పటివరకు పరిశోధకులు పేర్కొంటున్నారు. కాబట్టి నాటి నుండి నేటి వరకు మార్క్సిస్టు విమర్శ ఏ విధంగా పరిణామం చెందిందో విశ్లేషణ చేయవలసిన అవసరం ఉంది.అంతేగాక ఈయన మార్క్స సిద్ధాంతాన్ని సాహిత్యానికి ఏ విధంగా అన్వయింప చేసాడో పరిశోధించవలసిన ఆవశ్యకత ఉంది.

## 3. పూర్వ పరిశోధనల పరామర్శ (Review of Literature)

నాకు తెలిసినంత వరకు ఇంతవరకు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి విమర్శనాత్మక రచనలపై చారిత్రక అధ్యయన కోణంలో పరిశోధనలు జరగలేదు. కానీ ఆయన రాసిన వ్యాసాలు వివిధ సంకలనాలు, సంపుటిల రూపంలో వచ్చినప్పుడు వాటి విశిష్టతను గుర్తిస్తూ సమకాలీన విమర్శకులు కొన్ని సమీక్షలు చేశారు. ఈ విధంగా వెలువడిన సమీక్షాత్మక వ్యాసాలలో ఆయన విమర్శలోని వస్తు, శిల్పవైవిధ్యాన్ని ప్రశంసించారు. రాయలసీమలో జన్మించిన కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, రాచమల్లు రామచంద్రారెడ్డి,

వల్లంపాటి వెంకటసుబ్బయ్య మొదలైన వారి విమర్శా దృక్పథముతో పోల్చి చూడటం వల్ల వీరి విమర్శనా వైశిష్ట్యాన్ని తెలుసుకోవచ్చు. కాబట్టి రాయలసీమలో సాహిత్య విమర్శకు అంకురార్పణ ఏ విధంగా జరిగింది? దాని వికాసాలేమిటి? అనే దిశగా నా పరిశోధన కొనసాగుతుంది. నేను సేకరించిన సమాచారం మేరకు (నిత్యానందరావు, వెలుదండ.2013. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.:331.) రాయలసీమ విమర్శకులపై జరిగిన పరిశోధనలను ఈ కింద పొందుపరుస్తున్నాను.

5.1. విమర్శకునిగా రాళ్ళపల్లి, వి. రమాంజనీకుమారి. కె. వీరభద్రరావు. 1983. హైదరాబాదు విశ్వవిద్యాలయం.

5.2. సాహిత్య విమర్శకునిగా ఆర్. ఎస్. సుదర్శనం, టి. కిరణ్ బాబు, ఎస్. శరత్ జ్యోత్స్నరాణి. 2007. హైదరాబాదు విశ్వవిద్యాలయం.

5.3. విమర్శకునిగా వల్లంపాటి, పి. సుధాకుమార్, పి. రాములు, 2007. హైదరాబాదు విశ్వవిద్యాలయం.

5.4 రాచపాళెం ప్రాచీన సాహిత్య విమర్శ, పద్మావతి, 2010. శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం.

5.5 రాచపాళెం కవిత్వ విమర్శ–సమగ్ర అధ్యయనం, మోహన్ బాబు, 2012. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం.

5.6 రాచపాళెం సాహిత్య విమర్శ సమగ్ర అధ్యయనం, ఎ. ఎ. నాగేంద్ర, 2016. శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం.

## 4. పరిశోధన ఆకరాలు (Research Source)

### ప్రాథమిక ఆకరాలు :

1. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***మన నవలలు –మన కథానికలు.*** విజయవాడ : విశాలాంధ్ర

పబ్లిషింగ్ హౌస్, 2016.

2. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***మరో చర్చ***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012
3. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం,***చర్చ*** . హైదరాబాదు ;విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2010
4. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం (సం.పా), ***1980 తరువాత తెలుగు దళిత నవల*** .హైదరాబాదు; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2003
5. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం,***కథాంశం .*** హైదరాబాదు ;విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2006
6. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం, ***గురజాడ తొలి కొత్త తెలుగు కథలు .***అనంతపురం ; ఆంధ్ర భారతి శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం .1985
7. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం,***ప్రతిఫలనం.***హైదరాబాదు ;విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2014
8. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***విమర్శ – 2009***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2010
9. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం,***విమర్శ–2011***. హైదరాబాదు;నవోదయ బుక్ హౌస్.2012

10 .చంద్రశేఖర రెడ్డి,రాచపాళెం, ***కొన్ని కావ్యాలు కొందరు కవులు.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2008

## ద్వితీయ ఆకరాలు:

11.అనిల్, రాజింవాలె. ***మార్క్సిజం అంటే ఏమిటి ?***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2007

12. అహోబలరావు, కల్లూరు. ***రాయలసీమ రచయితల చరిత్ర***. హిందూపూరు; శ్రీకృష్ణ దేవరాయ గ్రంథమాల. 1977

13. నాగశేషు.బి, *వారధి(ఆలోచనాత్మక వ్యాసాలు).* హిందూపురం;విజయవాణి ప్రింటర్స్. 2015

14. నారాయణ, సింగమనేని , ***కథావరణం.*** కడప ;పెన్నేటి పబ్లికేషన్స్. 2013.

15.నిత్యానందరావు,వెలుదండ.***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.*** హైదరాబాదు; నవోదయ బుక్ హౌస్. 2013.

16. భాస్కర చౌదరి, బి. ***సాహితీ మూర్తి కట్టమంచి.*** విజయవాడ; నవోదయ పబ్లిషర్స్. 1983.

17.భూమయ్య, అనుమాండ్ల. ***ఆద్యుడు కట్టమంచి.*** హైదరాబాదు; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.1992.

18.మందేశ్వరరావు,వడలి.***పాశ్చాత్య సాహిత్య విమర్శ– చరిత్ర – సిద్ధాంతాలు.*** హైదరాబాదు:తెలుగు విశ్వవిద్యాలయం. 1994.

19. రామచంద్ర. ఎన్, ***తేనెపల్కులు తీపి గుర్తులు*** . ప్రొద్దుటూరు; సుధీర్ గ్రాఫిక్స్ . 2014.

20. రామారావు, ఎస్వీ. ***తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు.*** హైదరాబాదు;చిత్రలిపి ప్రింటర్స్. 2014.

21. లక్ష్మణ చక్రవర్తి, సిహెచ్. ***ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు.*** హైదరాబాదు; ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ. 2005.

22. వీరభద్రయ్య, ముదిగొండ. ***జీవియస్ విమర్శాదర్శనం***. హైదరాబాదు; శ్రీ సాయి ప్రాసెస్.2000.

23. వీరభద్రయ్య, ముదిగొండ. ***సంపత్కుమార విమర్శ దేశీయతా భూమిక***. హైదరాబాదు; శ్రీసాయి ప్రాసెస్. 2000.

24. వీరభద్రయ్య, ముదిగొండ. ***సాహితీ విమర్శ సూత్రం – అన్వయం.*** విజయవాడ; పల్లవి పబ్లికేషన్స్. 1998.

25. వీరభద్రయ్య, ముదిగొండ. ***సుప్రసన్న సమన్విత విమర్శ***. హైదరాబాదు; మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక. 2000.

26. వెంకటయ్య, తవ్వా. ***సీమకథా తొలకరి (వ్యాససంపుటి)*** .తవ్వారుపల్లి(కడప); అక్షర దీపిక పబ్లికేషన్స్. 2014.

27. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి, ***కథాశిల్పం***. విజయవాడ; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2016

28. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. ***రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ***.హైదరాబాదు; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2006.

29. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. ***విమర్శా శిల్పం.*** హైదరాబాదు; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2002.

30. సంపత్కుమారాచార్య, కోవెల. ***ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ – సంప్రదాయిక రీతి.***హైదరాబాదు; దక్షిణ భారత ప్రెస్. 1981.

31.సిమ్మన్న, వెలమల. ***తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు***. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్. 2005.

32. సుబ్రహ్మణ్యం, జి. వి. ***ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం***. సికిందరాబాదు; యువభారతి.1983.

## 5. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research):

ఈ పరిశోధన చారిత్రక అధ్యయన పద్ధతి(Historical Study)లో కొనసాగింది. రాచపాళెం వారి సాహిత్య విమర్శ కృషిని దృష్టిలో పెట్టుకొని నా సిద్ధాంత గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. అవి

మొదటి అధ్యాయం : **రాచపాళెం చంద్రశేఖరరెడ్డి జీవితం, రచనలు – పరిచయం**

రెండవ అధ్యాయం : **తెలుగు సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం**

మూడవ అధ్యాయం : **రాచపాళెం సాహిత్య విమర్శ – తొలిదశ (1972 – 2000)**

నాల్గవ అధ్యాయం : **రాచపాళెం సాహిత్య విమర్శ – మలిదశ (2001 – 2017)**

అయిదవ అధ్యాయం : **రాచపాళెం ఇతర సాహిత్య విమర్శలు**

మొదటి అధ్యాయం *'రాచపాళెం చంద్రశేఖరరెడ్డి జీవితం, రచనలు – పరిచయం'* లో రాచపాళెంవారి జీవితంలోని కొన్ని దశలు స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. రాచపాళెంగారి కలం నుండి వెలువడిన సృజనాత్మక, విమర్శనాత్మ రచనల సంక్షిప్త సమాచారం ఇవ్వబడింది. రాచపాళెం వారి అపూరూపమైన విమర్శా గ్రంథ రచనల నేపథ్యాలను, వాటిలోని విశేషాలను సంక్షిప్తంగా తెలుపబడింది. అదేవిధంగా ఆయన సాహిత్య విమర్శా రచనకు దారితీసిన పరిస్థితులను ఈ అధ్యాయంలో క్రోడీకరించడం జరిగింది.

రెండవ అధ్యాయం *'తెలుగు సాహిత్య విమర్శ – చారిత్రక పరిణామం'* లో తెలుగులో సాహిత్య విమర్శకు సంబంధించి లభ్యమైన రచనల ఆధారంగా సాహిత్య విమర్శ పూర్వాపరాలు పరిశీలించబడ్డాయి. తెలుగు సాహిత్యవిమర్శ పుట్టుక నేపథ్యం వివరించబడింది. నిర్వచనాలు, లక్షణాలు, భేదాల్నీ పేర్కొంటూ సాహిత్య విమర్శలు రాసిన ప్రముఖుల పేర్లను స్మరించుకొన్నాం. రాచపాళెంగారి సమకాలికులు రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, సింగమనేని నారాయణల విమర్శా రచనా విధానాలు ఉదాహరణ సహితంగా పరిశీలించబడ్డాయి. వివిధ సాహిత్య విమర్శ ధోరణులను సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. అంతేకాక ప్రాచీన సాహిత్య విమర్శ నిర్మాణాన్ని కూడా విశ్లేషించడం జరిగింది. ఆధునిక సాహిత్య విమర్శ లక్షణాలను గుర్తించడం జరిగింది. రాచపాళెంవారి *'శిల్ప ప్రభావతీ' 'తెలుగు కవిత్వం నన్నయ ఒరవడి', 'ప్రాచీనాంధ్ర కవులు సాహిత్యాభిప్రాయాలు',* అనే విమర్శా గ్రంథాలను వాటి గొప్పతనాలు పరిచయం చేయబడ్డాయి. పాశ్చాత్య సాహిత్య విమర్శ

ప్రభావంతో తెలుగులో సాహిత్య విమర్శ ఆవిర్భవించిన విధానాన్ని పరిచయం చేయబడింది. సాహిత్య విమర్శ తొలిదశలో వచ్చిన కొన్ని విమర్శలను సమీక్షించడం జరిగింది.

మూడవ అధ్యాయం *'రాచపాళెం సాహిత్య విమర్శ – తొలిదశ(1972-2000)'* లో రాచపాళెం తొలిదశలో రాసిన విమర్శలను స్వీకరించి వాటిలోని ప్రత్యేకతను తెలియజేశాను. కాలక్రమంలో ఆయన సాహిత్య విమర్శ ఏ విధమైన పరిణామం పొందిందో ఆధారాలతో సహా నిరూపించాను. ఆయన సాహిత్య విమర్శ స్వరూప స్వభావాలను ఆధారాలతో నిరూపించడం జరిగింది. సాంప్రదాయ సాహిత్యంతో మొదలైన ఆయన సాహిత్య విమర్శ ఆధునికతను ఏ విధంగా సంతరించుకుందో వివరించాను. మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా ఆయన పుట్టుకను, అందుకు దారి తీసిన పరిస్థితులను వివరించాను.

నాల్గవ అధ్యాయం *'రాచపాళెం సాహిత్య విమర్శ –మలిదశ(2001-2017)'* లో రాచపాళెం సాహిత్య సాహిత్య విమర్శ తొలిదశను విశ్లేషించిన నేపథ్యం నుండి ఆయన సాహిత్య విమర్శలోని మౌలికమైనలక్షణాలను గుర్తించడం జరిగింది. రాచమల్లు రామచంద్రారెడ్డి తమ మార్క్సిస్టు భావజాలంతో తెలుగు సాహిత్య విమర్శకు కొత్త దారిని చూపిస్తే, రాచపాళెంవారు ఆ కొత్త దారికి, శిల్పం, వస్తువు అనే కొత్త అంశాలను జోడించి ఓ పటిష్ఠమైన మార్గాన్ని ఏర్పరచి ముందుకు తీసుకెళ్ళిన క్రమాన్ని సుస్పష్టంగా వివరించడం జరిగింది. కాగా రాచపాళెంవారు తమ సాహితీ వ్యాసంగంలో కనబరిచిన ప్రాపంచిక దృక్పథం, శాస్త్రీయ అవగాహన, వివేచనా దృష్టి, సాహిత్య సిద్ధాంతాల సమన్వయం, సామాజిక నేపథ్యాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది. దరిమిలా కట్టమంచి, రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య మొదలైన వారి సాహిత్య విమర్శా, భావజాల ప్రభావాలు రాచపాళెంగారిపై ప్రసరించిన పరిస్థితులను కళ్లకుకట్టించం జరిగింది.

ఐదవ అధ్యాయం *'రాచపాళెం' ఇతర సాహిత్య విమర్శలు'* లో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు తొలి నుంచి తుది దాకా చేసిన సాహిత్య కృషిని సంక్షిప్తంగా వివరించబడి,

ఆ కృషికి అదనంగా చేసిన దినపత్రికల్లోని సాహితీ పుటల సమీక్ష, వివిధ గ్రంథాలకు రాసిన ముందుమాటలను గురించి స్థూలంగా విశ్లేషించి చెప్పడం జరిగింది.

## 6. అనుబంధాలు (Annexures)

ఈ పరిశోధనా గ్రంథం చివర్లో రెండు అనుబంధాలను జత పర్చటం జరిగింది.

**మొదటి అనుబంధంలో** రచయిత ఆచార్య రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి గారితో తీసుకున్న ఇంటర్వ్యూను పొందుపరిచాను. రాచపాళెం జీవితం, సాహిత్యం నేపథ్యంగా ప్రశ్నావళి రూపంలో కొన్నింటిని తయారు చేశాను.

**రెండవ అనుబంధంలో** నేను వివిధ సదస్సులలో సమర్పించిన పరిశోధనా వ్యాసాలను, వాటికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను పొందుపరిచాను.

**మూడవ అనుబంధంలో** రచయిత ఆచార్య రాచపాళెం గారితో కలిసి తీసుకున్న ఛాయాచిత్రాలను పొందుపరిచాను. అదేవిధంగా నా పరిశోధనకు సంబంధించిన అనేక సందేహాలను నివృత్తి చేసుకునే క్రమంలో ఆయన సమకాలీన సాహిత్య విమర్శకులను కొందరిని కలిశాను. వారితో తీసుకున్న ఛాయాచిత్రాలను కూడా ఈ అనుబంధంలో పొందుపరిచాను.

## 7. పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు (Research Objects/Results)

1. రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి జీవితాన్ని సాహిత్య విమర్శ కృషిని పరిచయం చేయడమే ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం.

2. సనాతన సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన రాచపాళెం దాని నుండి బయటపడి తనదైన భావజాలాన్ని అలవర్చుకున్నారు. ఈ భావజాలానికి కట్టుబడి ఉండే క్రమంలో ఆయన ఎన్నో

అవమానాలకు గురికావలసి వచ్చింది. అయినా వాటిని సంయమనంతో స్వీకరించారు. దీని నుండి స్ఫూర్తి కలుగుతుంది.

3. రాచపాళెం వారు కేవలం విమర్శ రచనలను మాత్రమే కాకుండా సృజనాత్మక, అనువాద రచనలను కూడా చేసారు.వీటి వల్ల ఎన్నో విశేషాంశాలు బోధపడతాయి.

4. రాచపాళెం తన విమర్శలో పూర్వపరాలను చర్చించడం, కవి ఉద్దేశించిన అర్థాన్ని పరిశీలించి అవగాహన చేసుకోవడం, కాల నిర్ణయం, రచన మూలం తులనాత్మకత వంటివి ఆయువుపట్టులని చెప్పవచ్చును.

5. ప్రాచీన సాహిత్య రచనలో అవలంభించిన సూత్రాలు, విరచించిన పద్య గద్యాలు ఆ తరువాతి కవులకు శాశ్వత ప్రమాణాలుగా నిలుస్తాయని రాచపాళెం చెప్పారు. దీనిని సాహిత్య విమర్శ భేదాలలో 'సూత్ర విమర్శ'గా చెప్పుకోవచ్చు. ప్రాచీనాంధ్ర కవుల కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు మొదలైనవి సూత్ర విమర్శకు నెలవులుగా చెప్పుకోవచ్చు.

6. 1985 నాటికే రాచపాళెం ఆలోచనా విధానంలో మార్పులు వచ్చినట్టు ఆయన రచనలలోని దృక్పథాన్ని బట్టి తెలుస్తుంది. అప్పటికే ఆయన మీద మార్క్సిజం ప్రభావం పడినట్టుగా పరిశోధకులు గుర్తించారు. ఆయనలో సాంప్రదాయికవాదం నశించి హేతువాదం మొలకెత్తింది. చాటింపు సాహిత్యానికి స్వస్తి చెప్పి చారిత్రక దృక్పథానికి అలవాటు పడ్డారు.

7. రాచపాళెం సాహిత్య విమర్శ క్రమంగా పరిణామం చెందుతూ ఉన్న సమయంలో 'వస్తువు ఆధునిక సాహిత్యంలోనైతే సమాజానికి దగ్గరగానూ, ప్రాచీన సాహిత్యమైతే వాస్తవానికి దూరంగానూ ఉంటుందనే విషయాన్నీ గ్రహించారు.

8. ప్రాచీన కావ్య విశ్లేషణతో మొదలైన ఆయన విమర్శ ప్రస్థానం ప్రాపంచిక దృక్పథ అవగాహన వరకు పయనించింది. ఈ నేపథ్యంలో కవిత్వానికి సంబంధించిన మౌలికమైన ప్రతిపాదనలను చేసారు. తన కవిత్వ విమర్శకు మార్క్సిస్టు సాహిత్య విమర్శ దృక్పథంతో పునాదులు వేసాడు. పాశ్చాత్య మార్క్సిస్టు భావన మీద నిర్మాణమైన తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శతో

ప్రాంతీయ కవిత్వాన్ని ఆ భావజాల దృక్పథం నుండి విశ్లేషించి దానిని ప్రాదేశికం చేసారు రాచపాళెం.

9. రాచపాళెం వారు, గురజాడ సాహిత్య అధ్యయన అనంతరం సాహిత్యాన్ని సమాజ జీవిత వాస్తవికతకు దగ్గరగా చూసే కొత్త సంస్కారాన్ని అలవరచుకున్నారు. ఈ నేపథ్యం నుండి గురజాడ తన సాహిత్యంలో అ భౌతిక కల్పనలకు సమాధిని కట్టడం ఆరంభించాడు. సాహిత్య సామాజికం కాకపోతే మరేదీ కాదన్నాడని, తన రచనల ద్వారా రచయితకుగల బాధ్యతను గుర్తుచేసాడనే వంటి విషయాలను అవగతం చేసుకున్నారు.

7. ఈయన తన విమర్శలో ఆ గ్రంథ రచనకు సంబంధించిన అన్ని విషయాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడాన్ని మనం గమనించవచ్చు. ఏదైనా ఒక గ్రంథాన్ని విమర్శన చేసేటప్పుడు అవసరమైన కొన్ని దశలను ఈయన మౌలికంగా వివరించారు. అవి రచయిత పరిచయం, గ్రంథ నేపథ్యం, విశ్లేషణ, లోపాలు, పరిష్కారాలు, సూత్రీకరణలు మొదలైన వాటిని ఆయన విమర్శలోని సోపానాలుగా చెప్పవచ్చు.

8. ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణాన్ని రచయితకు సూచించడం, దాని బాధ్యతను తెలియజేయడం ఆయన విమర్శలో ప్రధానాంశం.

9. విమర్శకుడు కేవలం ఒక ప్రక్రియకో, ఒక దృక్పథానికో పరిమితం కాకుండా ఉండేలా తన తరువాతి విమర్శకులకు మార్గదర్శనం చేస్తూ అభ్యదయ, దళిత, స్త్రీ, విప్లవ, మార్క్సిస్టు మొదలైన అన్ని భావజాలాల పట్ల తన దృక్పథాన్ని తెలియజేస్తూ విమర్శ రాసారు.

10. ఒక ప్రాంతంలోని రచయిత కేవలం ఆ ప్రాంతంలోని రచనలను మాత్రమే విమర్శా వస్తువుగా స్వీకరించడం వలన అతని ఆలోచనా ధోరణి అంతగా పరిణతి చెందినట్లుగా కనిపించకపోవచ్చు. కాబట్టి ఈయన జన్మతః రాయలసీమలో జన్మించినప్పటికి ఇతర అన్ని ప్రాంతాల నుండి వెలువడిన సాహిత్యాన్ని నిబద్ధతతో విశ్లేషించారు. ఆ విధంగా వచ్చిన గ్రంథాలలో "కవుల తెలంగాణం" (2016) ముఖ్యమైనది.

11. రచయితలు వారు చెప్పగలిగే వాస్తవాలను, తాత్విక దృక్పథాన్ని, భావజాలాన్ని బయట పెట్టకపోవడాన్ని ఈయన నిరసించారు.

12. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన విమర్శలో వస్తుగతమైన చర్చకు ప్రాధాన్యత ఇచ్చారు.

13. రాచపాళెం వారి సాహిత్య విమర్శ అటు మార్క్సిజం, ఇటు అంబేద్కరిజాన్ని అనుసరించి సమన్వయం చేసే విధంగా ఉంది.

14. రాచపాళెం వారి సాహిత్య విమర్శలను చదవడం వల్ల అభ్యుదయ దృక్పథం, భావాలు అలవడతాయి. చారిత్రక, తులనాత్మక దృష్టి పెంపొందుతాయి.

15. రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి గారి జీవితం, సాహిత్య ప్రస్థానం, సాహిత్య విమర్శలో ఆయనకు గల నిబద్ధతా లక్షణం భావి సాహిత్య విమర్శకులకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని విశ్వసిస్తున్నాను.

# అధ్యాయం-1

## అధ్యాయం -1

# రాచపాళెం చంద్రశేఖర రెడ్డి జీవితం, రచనలు

### 1.0. పరిచయం

సాహిత్యానికి, సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుంది. కనుకనే సమాజం సాహిత్యంతోనూ, సాహిత్యం సమాజంతోనూ ముడిపడి ఉంటాయి. అందువల్ల ఒక రచయితకు సంబంధించిన సాహిత్యాన్ని గురించి అధ్యయనం చేసేటప్పుడు ఆ రచయిత జీవిత నేపథ్యాన్ని, ప్రాంతీయ నేపథ్యాన్ని గురించి కూడా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. కాబట్టి నేను పరిశోధన చేయబోయే పరిశోధనాంశానికి సంబంధించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి జీవితాన్ని, వారు నివసించిన ప్రాంతానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ముందుగా తెలుసుకుందాం!

### 1.1. రాచపాళెం జీవిత విశేషాలు

ఒక రచయిత జీవిత విశేషాలను తెలుసుకోవడం వల్ల ఆ రచయిత రచనలకు సంబంధించిన వివిధ నేపథ్యాలను తెలుసుకోవచ్చు. కాబట్టి ముందుగా నా పరిశోధనలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారికి సంబంధించిన జీవిత విశేషాలను వివరిస్తాను.

### 1.2. రాయలసీమ నేపథ్యం

అనాదిగా రాయలసీమ అనగానే గుర్తొచ్చేది కరువు కాటకాలు ముఠాకక్షలు, గుండాయిజాలు, రౌడీయిజాలు. కానీ ఇటువంటి అపవాదు వెనుక అనేకమైన రాజకీయ, సామాజిక కారణాలు లేకపోలేదు. రెండు తెలుగు రాష్ట్రాలలోని తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతాలతో పోల్చుకుంటే రాయలసీమ ఆర్థికంగా, సామాజికంగా, వెనుకపడి ఉంది. కానీ

సాహిత్యపరంగా మాత్రం రాయలసీమ సర్వతోముఖంగా అభివృద్ధి చెందింది. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలైన కథ, నవల, నాటకం, విమర్శ మొదలైనవన్నీ కోస్తాంధ్రలో పుట్టినప్పటికీ అవి ప్రకృష్టమైనజీవం పోసుకుని వికసించింది మాత్రం రాయలసీమలోనే అనేది నిర్వివాదాంశం. మిగతా ప్రాంతాలకంటే రాయలసీమ భిన్నమైంది. దీనికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. రాయలసీమకు చెందిన అనేకమంది ప్రముఖులు వివిధ రంగాలలో రాణిస్తున్నారు. తరతరాలుగా రాయలసీమ అంటే అదేదో ఒక ఎడారి ప్రాంతం అనే విష సంస్కృతి ప్రచారం ఉంది. అలాగనీ పూర్తిగా లేదని చెప్పడం ఇక్కడ ఉద్దేశ్యం కాదు. ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్ 1970 నుండి 1995ల మధ్య కాలంలో మాత్రమే ఉండేది. ఆ తరువాత సాధించిన ప్రగతి వలన ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. దీనిని మనం నేడు గమనిస్తూనే ఉన్నాం. ఆధునిక కాలంలో సినిమాల ప్రభావం ప్రజలపైన విపరీతంగా ఉండటంతో రాయలసీమను సినిమాలలో ముఠాకక్షలు, గుండాయిజాలు, రౌడీయిజాలు నేపథ్యంగా చిత్రించడంతో ఆ ప్రాంతానికి ఆ విధమైన అప్రతిష్ఠ కలిగింది.

## 1. 3 . 'రాయలసీమ' చారిత్రక నేపథ్యం

నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెండు ముఖ్యమైన ప్రాంతాల్లో రాయలసీమ ఒకటి. రాయలసీమ అంటే నాలుగు జిల్లాల సమాహారం. కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలను కలిపి 'రాయలసీమ'గా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంలో రత్నాలు రాశులుగా పోసి అమ్మినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కానీ నేడు సామాజికంగా ఈ ప్రాంతం చాలా వెనుకబడి ఉంది. దీనికి అనేకమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. అయితే రాయలసీమ ప్రాంతం సామాజికంగా వెనుకబడి ఉందేమో గానీ సాహిత్యపరంగా మాత్రం అన్ని ప్రాంతాల కంటే ముందంజలో ఉందంటే అతిశయోక్తి కాదు.

ఈ ప్రాంతానికి 1928లో చిలుకూరి నారాయణరావుగారు 'రాయలసీమ' అని పేరు పెట్టారు. ఆ తరువాత 1953 వరకు రాయలసీమ ప్రాంతం సంయుక్త మద్రాసు రాష్ట్రంలో

భాగంగా ఉండేది. అప్పటి తెలంగాణా, కోస్తా, రాయలసీమ నాయకులు జరిపిన అనేక సంవత్సరాల ఉద్యమ ఫలితంగా 1953 లో ప్రత్యేక 'ఆంధ్రరాష్ట్రం' ఏర్పడింది. కోస్తా ప్రాంతంతో పోలిస్తే రాయలసీమ అభివృద్ధి పరంగా వెనుకబడి ఉంది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు రాయలసీమ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలోని కర్నూలును కొత్త రాష్ట్ర రాజధానిగా నిర్ణయించారు. ఆ తరువాత మరో మూడేళ్ళకు విశాలాంధ్రప్రదేశ్ ఏర్పడటంతో రాజధానిని హైదరాబాదుకు మార్చారు. అయితే క్రమక్రమంగా తెలంగాణా ప్రత్యేకరాష్ట్ర భావన నాటి తెలంగాణా ప్రజల్లో కలగటంతో అది ఒక ఉద్యమంగా మొదలై కార్యరూపం దాల్చి జూన్ 2, 2014 తేది నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో సువిశాల తెలుగురాష్ట్రం రెండు ముక్కలైంది. ఇక అప్పటి నుండి మొదలైన ధోరణే ఈ ప్రాంతీయ అస్తిత్వధోరణి. తత్ఫలితంగా మున్ముందు ఎవరి అస్తిత్వాలకు ఎటువంటి ముప్పు కలుగుతుందోనన్న గుబులు ప్రజల్లో బలంగా, వేగంగా బయలుదేరింది. అట్టి ఈ అస్తిత్వవాద ముప్పును పసిగట్టిన వారిలో సాహిత్య కారులు ముఖ్యులని చెప్పవచ్చు.

## 1.4. 'రాయలసీమ' ప్రాంత సాహిత్య నేపథ్యం

వేదాల్లో కవిని భగవత్ స్వరూపునిగా భావించారు. పరమాత్మ సాక్షాత్కారం పొందే ఋషులను కవి శబ్దంతో సంభోధించారు. భవిష్యత్తును దర్శించగల 'క్రాంత దర్శనత్వం' కవికి ఉండాలనే లక్ష్యంతో "కవయః క్రాంత దర్శనః" అనే నానుడి ప్రసిద్దమైంది. తెలుగు మాట్లాడే ఇతర ప్రాంతాలతో పోలిస్తే రాయలసీమ వైశాల్యంలో చిన్నదైననూ తెలుగు, తమిళం, కన్నడ, ఉర్దూ కళలు, సంస్కృతులు, సాహిత్యాల ప్రభావం ఈ ప్రాంతంపై ఎక్కువగా ఉంది. రాయలసీమలో ఎందరో తత్వ వేత్తలు జన్మించారు. వారిలో యోగివేమన, వీరబ్రహ్మేంద్ర స్వామి, హజరత్ షా అమీర్, జిడ్డు కృష్ణ మూర్తి, ముంతాజ్ అలీ సత్సంగ్ ముఖ్యులు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి అయిన శ్రీకృష్ణ దేవరాయల హయాంలో ఈ ప్రాంతపు సంస్కృతి చాలా ఉన్నతి చెందింది. అష్టదిగ్గజాలలోని ఎనిమిది మందిలో అల్లసాని పెద్దన, నంది

తిమ్మన, ధూర్జటి, కందుకూరి రుద్రకవి, మాదయగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు ఈ రాయలసీమ ప్రాంతానికి చెందిన వారే. అదే విధంగా వీరి తరువాతి తరం సాహిత్య నేపథ్య విషయానికొస్తే ఈ ప్రాంతంలో అనేక మంది కళాకారులు, సినీ ఉద్దండులు, రాజకీయ ప్రముఖులు, సామాజిక వేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు ఇలా అన్ని రంగాల్లో అనేక మంది ప్రముఖ వ్యక్తులు ఉద్భవించారు. అన్నమయ్య, కుందాచార్యుడు, తరిగొండ వెంగమాంబ, తాళ్ళపాక తిమ్మక్క, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, వేమన, ఆతుకూరి మొల్ల, గువ్వల చెన్నడు మొదలైనవారు ఆధ్యాత్మిక గురువులుగా, కవులుగా ప్రసిద్దులు కాగా ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బళ్ళారి రాఘవ మొదలైన వారు నాటక రంగంలో ప్రసిద్ధి గాంచారు.

ఆధునిక సాహిత్య విమర్శా రంగానికి విశేషమైన సేవలందించిన వారిలో ప్రథమంగా కట్టమంచి రామలింగారెడ్డి గారిని చెప్పుకోవచ్చు. ఈయన రాసిన ***"ముసలమ్మ మరణం(1900)"*** కావ్యంతో తెలుగులో ఆధునిక యుగం ప్రారంభమైందని చెప్పవచ్చు. అదే విధంగా కట్టమంచివారు రచించిన ***"కవిత్వ తత్త్వ విచారం(1914)"*** అనే విమర్శ గ్రంథం తెలుగు సాహిత్య విమర్శా లోకంలో కొత్తబోదెలు తవ్విందని సాహిత్య విమర్శకులు పేర్కొన్నారు. ఈయన కంటే ముందుగా రొద్దం హనుమంతరావు అనే విమర్శకుని రచనలను పేర్కొంటూ ఆయనే తొలి తెలుగు విమర్శకుడని యోగి వేమన విశ్వవిద్యాలయంలో చీమల లలిత అనే పరిశోధకురాలు *"కట్టమంచికి అటు ఇటు"*[12] అనే వ్యాసంలో నిరూపించే ప్రయత్నం చేశారు. కానీ తగినన్ని ఆధారాలు లేనందువలన కట్టమంచే మొదటి ఆధునిక విమర్శకుడు అనే భావన బలపడింది. ఆ తరువాత రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పునాదులపై సాంప్రదాయ ఆధునికతను నిర్మింపజేసి తెలుగులో అనేక విమర్శనా రీతులను ప్రతిపాదించాడు. తదనానంతరం 1965లో రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా) రాయలసీమ సాహిత్య విమర్శలోనే గాక తెలుగు సాహిత్య

[1] https://rayalaseema-sahityam.blogspot.com/2013/04/blog-post_6273.html

విమర్శకు ఒక వన్నెను తెచ్చిపెట్టారు. రా.రాతో పాటు త్రిపురనేని మధుసూదనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ఆర్.ఎస్.సుదర్శనం, సర్దేశాయి తిరుమలరావు మొదలైనవారిని రాయలసీమ నుండి సాహిత్య విమర్శను వెలువరించిన వారిలో ప్రముఖులుగా చెప్పవచ్చు.

## 1.5 'రాయలసీమ'లో సాహిత్య విమర్శ ప్రస్థానం

తెలుగు సాహిత్య విమర్శకు రాయలసీమ సాహిత్య విమర్శకులు చేసిన కృషి ఎంతో ఉంది. సాహిత్య విమర్శ చరిత్రలో కొత్త బోదెలు తవ్విన *"కవిత్వతత్త్వ విచారము"* తో తెలుగు సంప్రదాయ విమర్శ వికాసాన్ని పొందింది. కట్టమంచి రామలింగారెడ్డిగారు చూపిన దారి ఆతరువాతి విమర్శకులకు మార్గదర్శనం చేసింది. ఈ క్రమంలో పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, గడియారం వెంకటశేషశాస్త్రి, ధర్మవరపు కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు మొదలైన వారు గొప్ప సాహిత్య విమర్శకులుగా పుట్టుకొచ్చారు. ఆ తరువాత కొన్నాళ్ళకు అంటే 1965 తరువాత రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు వారి విమర్శను భిన్న దృక్పథాల వైపుకు మళ్ళించి తమ విమర్శ ప్రస్థానాన్ని కొనసాగించారు. వీరికి భిన్నమైన మార్గాన్ని ఆర్. ఎస్. సుదర్శనం అవలంభించారు. ఆ తరువాత వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు రాసిన ***'నవలాశిల్పం', 'కథాశిల్పం', 'విమర్శాశిల్పం'*** మొదలైన విమర్శా గ్రంథాలు విభిన్న రీతులకు ఒరవడిని దిద్దాయి. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కవిత్వ, వచన ప్రక్రియల మీద రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు రాస్తున్న సాహిత్య విమర్శ తెలుగు సాహిత్య విశ్లేషణకు తోడ్పడుతుందని అనుకుంటున్నాను. కాబట్టి నాపరిశోధనలో భాగంగా రాచపాళెం వారి జీవితం, సాహిత్య ప్రస్థానానికి సంబంధించిన వివరాలను ఈ కింది విధంగా వివరింస్తున్నా.

## 1.6. జననం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లాలోని, తిరుపతి రూరల్ మండలంలో 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న కుంట్రపాకం గ్రామంలో అక్టోబరు 16, 1948 న, మంగమ్మ, రామిరెడ్డి దంపతులకు కలిగిన నలుగురు సంతానంలో రెండో కుమారునిగా జన్మించారు. ఈయనకంటే ముందు ఒక కుమార్తె, ఒక కుమారుడు, ఈయన తరువాత ఒక కుమార్తె మొత్తం నలుగురు సంతానం. వీరి కుటుంబంలో ఎవరూ పెద్దగా చదువుకోలేదు. చిన్నతనంలోనే ఈయన తల్లిని కోల్పోవడంతో తన తండ్రి రెండవ వివాహం చేసుకున్నారు. [3]

## 1.7. విద్యాభ్యాసం

రాచపాళెం ప్రాథమిక విద్యాభ్యాసం తన స్వస్థలమైన కుంట్రపాకం గ్రామంలో వెలసిన ప్రాథమిక పాఠశాలలో 1954-59 మధ్యకాలంలో  పూర్తయింది. ఆ తరువాత కాణిపాకంలో 6 వ తరగతి 1960 ల ప్రాంతంలో మిషనరీ హైస్కూల్లో పూర్తయి, 7 తరగతి నుండి 10 వ తరగతి వరకు తిరుపతి పురపాలకోన్నత పాఠశాలలో 1961-64ల మధ్య పూర్తి చేశారు. ఆ తరువాత  పి.యు.సి. శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో, బి. ఏ (చరిత్ర, తత్త్వశాస్త్రం, తెలుగు) 1967-70ల మధ్య కాలంలో శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో పూర్తయింది. ఆ తరువాత స్నాతకోత్తర విద్య యం. ఏ  తెలుగు అధ్యయన విభాగం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ముగించి అటు నుంచి అటే అదే విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి ప్రవేశం పొందారు. ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావుగారి పర్యవేక్షణలో *"శిల్ప ప్రభావతి"* అనే అంశాన్ని తన పరిశోధనాంశంగా స్వీకరించి పింగళి సూరన రచించిన *'ప్రభావతీ ప్రద్యుమ్న'* కావ్యాన్ని విమర్శనాత్మక దృష్టితో పరిశోధించి డాక్టరేట్ పట్టా పొందారు. దీనితో పాటు వయోజన విద్యలో

---

[3]. రచయితతో ముఖాముఖి

డిప్లొమాను, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి తమిళంలో సర్టిఫికేట్ కోర్సును పూర్తి చేశారు.

## 1.8. వైవాహిక జీవితం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారికి 1974 జులై 11న, చిత్తూరు జిల్లాలోని వడమాలపేట మండలంలోని తిరుమండ్యం గ్రామానికి చెందిన చెంచమ్మ, పట్టాభిరెడ్డి దంపతుల కుమార్తె లక్ష్మీకాంతమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. వారిలో ఒకరు కుమార్తె శ్రీవిద్య, మరొకరు కుమారుడు ఆనందకుమార్. ఆయనకున్న భావజాల ప్రభావంతో దానిని ఆచరణలో పెట్టాలనే ఉద్దేశ్యంతో తన రెడ్డి అనే కులవాచకాన్ని పూర్తిగా త్యజించారు. అంతేగాక తన కుటుంబంలోని సభ్యులందరికీ అభిప్రాయ విషయాల్లో ఎనలేని స్వేచ్ఛను ఇచ్చారు. వారి పెళ్లి, చదువులు మొదలైన విషయాల్లో వారికే పూర్తి స్వతంత్రతను కల్పించారు.

## 1.9. ఆచరణీయం, అనుసరణీయం రాచపాళెం జీవితం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు తాను నమ్మిన సిద్ధాంతాలను స్వయంగా ఆచరించి ఇతరులకు ఆదర్శప్రాయుడు, అనుసరణీయుడయ్యారు. ఆ ఆచరణను మొదట తన కుటుంబం నుండే ప్రారంభించారు. సాధారణంగా అనేక మంది వ్యక్తుల భావజాలాలు కేవలం చెప్పటం వరకే పరిమితమై ఉంటాయి. కానీ వాటిని ఆచరణలో పెట్టడం కొంతమందికే సాధ్యం అవుతుంది. ఈక్రమంలోనే తన ఇద్దరి పిల్లలకు ఒకరికి కులాంతర వివాహం, మరొకరికి మతాంతర వివాహం చేశారు. తాను మొదట ఇంట్లో తన సిద్ధాంతాలని, సూత్రాలను పాటించి, ఆ తరువాత సమాజం వైపు తన అడుగులు వేసి సంస్కరించపూని తాను ఆచార్యునిగా పనిచేస్తూనే అనంతపురం ప్రాంతంలో అనేకమైన కులాంతర, మతాంతర వివాహాలను ఆయన నాయకత్వంలో జరిపించారు.

## 1.10. అధ్యాపకుని నుండి ఆచార్యునిగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

రాచపాళెం తన పరిశోధనను 1977 లో ముగించిన రాచపాళెం వారు అదే సంవత్సరం ఆగస్టు 25 న శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం లోని పిజి సెంటర్ లో తెలుగు అధ్యాపకునిగా చేరారు. ఈ సమయంలో అదే శాఖలో ఆచార్య కోరాడ మహదేవ శాస్త్రి, ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆచార్య శలాక రఘునాథ శర్మ, ఆచార్య హెచ్. ఎస్ బ్రహ్మానంద పని చేస్తూ ఉన్నారు.విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని అలవర్చడం కోసం రాచపాళెం కేవలం ఒక అధ్యాపకునిగా మాత్రమే మిగిలిపోకుండా పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునే వారు. అలా చేసిన వాటిలో జాతీయ సేవ పథకం (NSS) ఒకటి. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆయన కో-ఆర్డినేటర్ గా వ్యవహరించారు. అంతే కాకుండా వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు కన్వీనర్ గా కూడా తన బాధ్యతలను నిర్వర్తించారు.

రాచపాళెం వారు బోధనావృత్తిలో ప్రవేశించిన వెంటనే ఆయన చేపట్టిన మహత్తర కార్యక్రమాలలో ముఖ్యమైనవి విద్యా విషయక కార్యకలాపాలు. ఈ నేపథ్యంలో ఆయన అంత వరకు ఉన్న పాఠ్య ప్రణాళికలను పునర్నిర్మించపూని సిలబస్ లో కొత్తగా భారతీయ సాహిత్యం, అనువాదం, రాయలసీమ సాహిత్యం మొదలైన నూతన అంశాలను బోధనాంశాలుగా చేర్చారు. 4

తెలుగుశాఖలో ఈ విధంగా అంచెలంచెలుగా ఎదిగిన ఈయన 1985 న తెలుగు శాఖలో రీడర్ అయ్యారు. ఆ తరువాత దాదాపు ఏడేళ్లకు అంటే 1993 నవంబరు 2 న ఆచార్యులుగా పదోన్నతి పొందారు. అప్పటికే సుమారు పదహారు సంవత్సరాల బోధనానుభవం ఉన్న రాచపాళెం వారికి ఆ విశ్వవిద్యాలయం అధికారులు కొన్ని అదనపు భాద్యతలను కూడా అప్పగించారు. వీటన్నింటిని రాచపాళెం వారు సమర్థంగా నిర్వహించి కృతకృత్యులైనారు. ఈ విధంగా ఆచార్యునిగా తన బాధ్యతలను నిర్వహించిన ఆయన 2008 అక్టోబరు 31 న పదవీ విరమణ చేశారు. అప్పటికే దాదాపు 31 సంవత్సరాలు తెలుగు ఆచార్య బాధ్యతలు నిర్వర్తించిన

[4] యోగి వేమన విశ్వ విద్యాలయం, ఎం.ఏ, తెలుగు పాఠ్య ప్రణాళిక

రాచపాళెం వారు తన ఆచార్య ప్రస్థానానికి మరింత న్యాయం చేకూర్చే దిశగా యోగివేమన విశ్వవిద్యాలయంలో మరో ఏడు సంవత్సరాలు విశ్రాంత ఆచార్యులుగా పని చేసి విశిష్ట సేవలందించారు. అధ్యాపకునిగా జీవితాన్ని ప్రారంభించిన రాచపాళెం వారు ఆ తరువాత రీడర్ గా, తెలుగు శాఖాధ్యక్షులుగా, ఆచార్యునిగా తన ఉద్యోగ బాధ్యతలను కొనసాగించారు.

## 1.11. ప్రముఖుకులైన గురువులతో పరిచయాలు – సాహిత్య సంబంధాలు

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తాను డిగ్రీ చదివే రోజు నుండే గొప్ప గొప్ప సాహితీవేత్తలతో పరిచయాలను పెంచుకున్నారు. తాను బి. ఏ చదివే రోజుల్లో తుమ్మపూడి కోటీశ్వరరావు, తంగిరాల వెంకటసుబ్బారావు, కోరాడ మహదేవశాస్త్రి, మద్దూరి సుబ్బారెడ్డి, జి.నాగయ్య, కె. వెంకటరెడ్డి  మొదలైన వారి దగ్గర వీరు ఉన్నత విద్యను అభ్యసించారు. అంతేగాక ఈయన పిహెచ్.డి చేసే సమయంలో ఆచార్య జి. యన్. రెడ్డి గారు అప్పటి తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నారు. అలాగే తన పిహెచ్.డి గ్రంథ పరీక్షకులుగా ఆచార్య ఎస్. వి జోగారావు, ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య తిమ్మావజ్జల కోదండరామయ్య గార్లు వ్యవహరించారు. ఇంతమంది సమక్షంలో ఆయన తన విద్యను పూర్తి చేయడమే కాక వారి వారి అడుగుజాడల్లో నడిచి  సాహిత్యాభిప్రాయాలను అందిపుచ్చుకొని వివిధమైన వ్యాసాలను, కవితలను రాసే ప్రయత్నం చేసేవారు.

## 1.12. పాఠ్యాంశాల పై ప్రత్యేక దృష్టి

రాచపాళెం వారు తాను అధ్యాపక వృత్తిలో ప్రవేశించినప్పటి నుండి తన వృత్తి ప్రస్థానంలో నూతన పద్ధతులను పాటించారు. అవి ఏమిటంటే ఒకటి వాచకాల బోధనకు అధిక ప్రాధాన్యతనివ్వడం, వాచకేతర విషయ బోధనకు తక్కువ ప్రాధాన్యతను ఇవ్వటం. ఎందుకంటే వాచకాల ద్వారా నూతనాంశ విశ్లేషణ సామర్థ్యం అలవడుతుందని ఆయన ప్రగాఢ నమ్మకం.

ఈ నేపథ్యంలో ఆయన కొన్ని వివాదస్పద వ్యాఖ్యలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది.[5] వాచకాలను బోధించడం వలన అధ్యాపకులకు కూడా నూతన ఆలోచనలు వచ్చి వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన విశ్వాసం

## 1.13. విశ్వవిద్యాలయాలకు, దూర విద్యా కేంద్రాలకు పాఠ్యాంశాల రచన

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు అనేక విశ్వవిద్యాలయాలకు, దూర విద్యా కేంద్రాలకు పాఠ్య రచనలను చేపట్టారు. సాహిత్యంలోని వివిధ కోణాలను స్పృశిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మొదలైన అనేక విశ్వవిద్యాలయాలకు పాఠ్య రచన చేశారు.

## 1.14. సమాజంలోకి రాచపాళెం

అంతవరకూ కేవలం విశ్వవిద్యాలయం లో ని ఒక సామాన్య అధ్యాపకునిగా ఉన్న రాచపాళెం వారు తన పూర్వ గురువు ఆంగ్ల అధ్యాపకుడు అయిన ఆచార్య వెంకటరెడ్డికి ఈయనకు మధ్య ఉన్న సాన్నిహిత్యంతో రాచపాళెం వారిని తొలిసారిగా జాతీయ సేవా పథకం (ఎన్. ఎస్. ఎస్) లోకి ఒక ప్రోగ్రాం ఆఫీసర్ గా ప్రవేశింపజేశారు.

రాచపాళెం వారికి సామాజిక పరమైన అవగాహనకు పునాది ఇక్కడి నుండే మొదలైందని చెప్పవచ్చు.అంతే గాక ఆయన పాఠ్యబోధనలో భాగంగా చెప్పే గురజాడ పాఠ్యాంశం, ఆయనలో గల హేతువాద లక్షణాలు ఈ మూడు ఆయనను ఒక పరిపూర్ణ సామాజిక అవగాహన కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దడానికి దోహదం చేసాయి.

[5] రచయితతో ముఖాముఖి

ఈ విధంగా విశ్వవిద్యాలయం లోపల, వెలుపల కార్యక్రమాల్లో క్రమంగా పాల్గొంటూ , సమాజంలో జరిగే కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం ప్రారంభించారు. ఈ క్రమంలో 1987 లో ప్రారంభమైన జనవిజ్ఞాన వేదికలో సభ్యునిగా చేరి ఆ తరువాత జిల్లా అధ్యక్షులై, క్రమంగా రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కూడా బాధ్యతలు  నిర్వర్తించారు. జన విజ్ఞాన వేదిక వారు నిర్వహించే కార్యక్రమాల్లో ఈయన చురుగ్గా పాల్గొనే వారు. ముఖ్యంగా రాచపాళెం వారు అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయంలో ఆచార్యునిగా పనిచేస్తునందువల్ల ఆ ప్రాంతంలోని సామాజిక సమస్యలపై తన దృష్టిని కేంద్రీకరించి ఆదిశగా కార్యక్రమ రూపకల్పన ప్రణాళికను రూపొందించారు.

ఉదాహరణకు :

- అనంతపురం లోని పీస్ మెమోరియల్ హాల్ ను బార్ గా మార్చే ప్రయత్నాలను ప్రతిఘటించి నిలుపుదల చేయడం.
- అనంతపురం జిల్లాకు సంబంధించి అభివృద్ధి కై సదస్సులను నిర్వహించి వాటి నివేదికలను ప్రభుత్వానికి పంపడం .
- ఒకానొక సమయంలో సంభవించిన కరువు వలన తీవ్ర ఆహార సమస్యను ఎదుర్కొన్న ప్రజలకు జన విజ్ఞాన వేదిక ద్వారా గంజికేంద్రాలను ఏర్పాటు చేయించారు.[6]

పైన వివరించిన ఉదాహరణలన్నీ రాచపాళెం వారికి పనిపట్ల గల నిబద్ధతను తెలియచేస్తాయి. ఈ విధంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులుగా ఆయన కీలకపాత్ర పోషించారు.  జన విజ్ఞాన వేదిక తన కార్యక్రమ నిర్వహణలో భాగంగా అనేకమైన ప్రజా సంఘాలను సమీకరించి, దళిత సంఘీభావ సమితి అనే సంస్థను రూపొందించారు. అనేక

[6] రాచపాళీయం, పుట: 210

గ్రామాలలో సదస్సులు, పాదయాత్రలు నిర్వహించింది. వీటన్నింటి నిర్వహణలో కూడా రాచపాళెం వారు విశేషంగా కృషి చేశారు.

## 1.15. సాంస్కృతిక భాగస్వామ్యం

రాచపాళెం వారి సాంస్కృతిక ప్రయాణం అనంతపురంలోనే ప్రారంభమైంది. తన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథమైన *"శిల్పప్రభావతి"* ని ముద్రించే సమయంలో ప్రెస్ లో మంచిరెడ్డి శివరాం అనే వ్యక్తి పరిచయం ఆయనను సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామిని చేయడానికి పునాది వేశారు. ఆ రోజుల్లో అనంతపురం జిల్లాలో 'రాయల కళాగోష్ఠి' అనే సాహితీ సంస్థను ఆశావాది ప్రకాశరావు ప్రధాన కార్యదర్శిగా నడిపేవారు. ఈ సంస్థ నడిపే కార్యక్రమాల్లో రాచపాళెం వారు మంచిరెడ్డి శివరాంతో కలిసి  రెండు మూడు పర్యాయాలు పాల్గొనటంతో అక్కడికి తరచూ వచ్చే చిలుకూరి దేవపుత్ర, బండి నారాయణ స్వామి, గోవాడ రఘురాం కుమార్, కార్తికేయ శర్మ, పి. దక్షిణామూర్తి మొదలైన యువ రచయితలు పరిచయం అయ్యారు. అదే విధంగా యంగ్ రైటర్స్ వర్క్ షాప్, లిటరరీ మీట్ అనే సాంస్కృతిక, సాహిత్య వేదికలు నిర్వహించే కార్యక్రమాలలో  పాల్గొనే వారు, ఈ సమావేశాలలో తెలుగు కథానికల మీద చర్చోపచర్చలు జరిగేవి. ఈ చర్చలలో పాల్గొనటం వలనే అనంతపురంలో అనేక మంది కథకులు పుట్టుకొచ్చారని రాచపాళెం వారు అంటూ ఉంటారు.

అంతే కాకుండా జిల్లా స్థాయిలో రచయితల సంఘాలను స్థాపించడానికి రాచపాళెం వారి కృషి ఎన్నదగినది. జిల్లా రచయితల సంఘాల్ని పునరుద్ధరించే క్రమంలో డా॥ శాంతి నారాయణ, డా॥ కేతు బుచ్చిరెడ్డి  మొదలైన వారు కీలక పాత్ర పోషించారు. రాచపాళెం వారు జిల్లా రచయితల సంఘానికి 8 సంవత్సరాలు అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షునిగా పనిచేశారు. అంతకు ముందు కేవలం ప్రాచీన సాహిత్య ధోరణులు మాత్రమే రాయలసీమలో వెలసిల్లుతూ ఉండేవి. ముఖ్యంగా అవధానాల బెడద అనంతపురంలో ఎక్కువగా ఉండేది. వాటన్నింటికీ స్వస్తి పలుకుతూ రాచపాళెం వారు ఆధునిక సాహితీ సదస్సులను, చర్చా గోష్టులను నిర్వహించి

కాళీపట్నం రామారావు, చేకూరి రామారావు, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, జ్వాలాముఖి, మధురాంతకం రాజారాం, అక్కినేని కుటుంబరావు, ఓల్గా, మృణాలిని మొదలైన ప్రముఖులను ఆహ్వానించి వారిచే ప్రసంగాలను ఇప్పించి యువతలో సాహిత్య పిపాసను పెంపొందించే ప్రయత్నం చేశారు.

## 1.16. కీలక ప్రభుత్వ బాధ్యతల నిర్వహణ

సాధారణ శాఖాధ్యక్షులుగా, జాతీయ సేవా పథకం (NSS) కో – ఆర్డినేటర్ గా బాధ్యతలు స్వీకరించిన రాచపాళెం వారు తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక కీలక బాధ్యతలను చేపట్టారు. వాటిలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సంస్థలైన నేషనల్ బుక్ ట్రస్ట్, కేంద్ర సాహిత్య అకాడమీ లలో సభ్యునిగా కొనసాగారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అధికార భాషా సంఘంలో సభ్యునిగా 2005 – 2007 ల మధ్యకాలంలో కొనసాగారు. అదే విధంగా డిగ్రీ, ఇంటర్ తెలుగు పాఠ్య ప్రణాళికా నిర్మాణ కమిటీలో సభ్యుడిగాను, ఏపి ఓపెన్ సొసైటీలో తెలుగు వాచక నిర్మాణ కమిటీ సభ్యునిగా పని చేశారు. అంతేగాక దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలకు పాఠ్య ప్రణాళిక సభ్యునిగా, అకడమిక్ సెనేట్ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## 1.17. సాహితీ సామాజిక సంస్థల నిర్వహణ భాద్యతలు

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు వివిధ సాహితీ సామాజిక సంస్థలకు అధ్యక్షునిగా, ఉపాధ్యక్షునిగా, సభ్యుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. వాటిలో అనంతపురం జిల్లా రచయితల సంఘానికి కొన్ని సంవత్సరాలు అధ్యక్షునిగా, మరికొన్ని సంవత్సరాలు ఉపాధ్యక్షునిగా భాద్యత వహించారు. ఈయన నిర్వహించిన భాద్యతలలో కీలకమైంది గుర్రం జాషువా శతజయంతి కమిటీ అధ్యక్ష బాధ్యతల నిర్వహణ.

అనంతపురంలో 1994 లో జాషువా శత జయంతి కమిటీ ఒకటి ఏర్పాటైంది. ఈ కమిటీని శ్రీ మునుస్వామి, శ్రీ బి. నల్లప్ప, హెచ్ నాగలింగప్ప, బాల గంగాధర్, డి. కృష్ణమూర్తి మొదలైన కొంతమంది ఈ కమిటీని ఏర్పాటు చేశారు. అది దళితసాహిత్యం మొలకెత్తుతున్న తొట్ట తొలికాలం ఇటువంటి సమయంలో తను ఈ కమిటీలో ఒక కార్యకర్తగా మాత్రమే ఉంటానని, అధ్యక్ష భాద్యతలు తనకు వద్దని రాచపాళెం వారు సున్నితంగా తిరస్కరించారు. కానీ ఆ కమిటీ సభ్యులు రాచపాళెం వారినే ఆ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అదే సంవత్సరం అక్టోబర్ 2 న జాషువ శతజయంతి ఉత్సవాలను జాషువ కుమార్తె హేమలత, అల్లుడు లవణం చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటినుండి ప్రతి ఏడాది ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించే వారు. 1995 లో జాషువా శతజయంతి ఉత్సవాలను ఎక్కడా లేని విధంగా 3 రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత 1996 లో నిర్వహించిన ఉత్సవాలకు కంచె అయిలయ్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఈ కమిటీకీ అధ్యక్షుడుగా ఉండటం తనకు ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు ఏడాది అంటే 1995 లో ప్రసిద్ధ దళిత కవి కత్తి పద్మారావు గారు ఒక సందర్భంగా వచ్చిన సమయంలో రాచపాళెం వారి గురించి అడిగి తెలుసుకున్నారు. ఒక దళిత సాహిత్య సంబంధ కమిటీకీ ఇంకో సామాజిక వర్గ వ్యక్తిని అధ్యక్షునిగా పెట్టడాన్ని ఆయన విమర్శించారు. కానీ తరువాత రాచపాళెం వారి నిబద్ధతను గురించి తెలుసుకున్న పిమ్మట, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ లో స్థాపించబడే జాషువా సాహిత్య పీఠానికి కూడా రాచపాళెం వారినే అధ్యక్షులుగా నియమించాలని చెప్పినప్పుడు ఆయనకు గల నిబద్దత ఏమిటో అందరికీ అర్థమైంది. ఇక అప్పటినుండి అనంతపురంలో ఏ సాహిత్య సామాజిక సదస్సులు జరిగినా రాచపాళెం వారినే అధ్యక్షులుగా నియమించేవారు.

అంతేగాక ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘానికి సలహాదారునిగా కొనసాగారు. ఈయన సంపాదకత్వంలో 'సీమ సాహితి' అనే మాస పత్రిక వెలువడింది. సెప్టెంబరు 2016 నుండి

రాచపాళెంవారు భారతీయ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. పైవిధంగా ఆయన అనేక సాహితీ సామాజిక సంస్థల బాధ్యతలను నిర్వర్తించారు.

## 1.18. సాహితీ పురస్కారాలు

రాచపాళెంవారు విమర్శ రంగంలో చేసిన కృషికిగాను ఆయనను ఎన్నో సాహిత్య సంస్థలు వివిధ పురస్కారాలతో సత్కరించాయి. ఆవిధంగా 1986 – 87 సంవత్సరానికిగానూ తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ వ్రాతప్రతి అవార్డును ***"ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు–అభిరుచులు"*** గ్రంథానికిగాను ఇచ్చింది. అదేవిధంగా తాపీధర్మారావు సాహితీ పురస్కారం (2002), ***"చర్చ"*** అనే విమర్శ గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథం(2008) పురస్కారాలు లభించాయి. ఇవేగాక ఇంకా అనేక సాహితీ పురస్కారాలు ఆయనకు లభించాయి. వాటిలో తుమ్మల స్మారక సాహితీ పురస్కారం(2004), గురజాడ పురస్కారం, తెలుగు భాషా పురస్కారం, నూతలపాటి గంగాధరం సాహితీ పురస్కారం, పురిపండ అప్పలస్వామి స్మారక పురస్కారం, గురజాడ ఫౌండేషన్ పురస్కారం ముఖ్యమైనవి. కాగా ఈయన రాసిన ***"మన నవలలు – మన కథానికలు"*** అనే విమర్శ గ్రంథానికి 2014 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ కింది పట్టికలో వాటిని తెలియజేస్తాను.

| క్రమ.సం | పురస్కారం | సంవత్సరం |
|---|---|---|
| 1 | తిక్కవరపురామిరెడ్డి ధర్మనిధి పురస్కారం. తెలుగు విశ్వవిద్యాలయం. | 1997 |
| 2 | ప్రతిభా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం. | 2007 |
| 3 | ఉత్తమ విమర్శ గ్రంథం పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం. | 2008 |
| 4 | తాపీ ధర్మారావు సాహిత్య పురస్కారం, విశాలాంధ్ర విజ్ఞాన సమితి. | 2002 |
| 5 | తుమ్మల స్మారక పురస్కారం విశాలాంధ్ర విజ్ఞాన సమితి. | 2004 |
| 6 | కొండేపూడి శ్రీనివాసరావు స్మారక పురస్కారం, అరసం, గుంటూరు. | 2002 |

| | | |
|---|---|---|
| 7 | పురిపండా సాహితీ పురస్కారం, అరసం, విశాఖ. | 2002 |
| 8 | నూతలపాటి సాహితీ పురస్కారం, తిరుపతి. | 2007 |
| 9 | గురజాడ సాహితీ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. | 2011 |
| 10 | ఉగాది పురస్కారం, సాంస్కృతిక శాఖ, హైదరాబాదు | 2012 |
| 11 | కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం(మన నవలలు – మన కథానికలు) | 2014 |
| 12 | | |

## 1.19. 'రాచపాళెం' – సాహిత్య ప్రస్థానం

తెలుగు సాహిత్య విమర్శ ప్రస్థానంలో పరిచయం అక్కరలేని పేరు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి. ఈయన సాహిత్య విమర్శను కొత్త పుంతలు తొక్కించారు. విమర్శా రంగంలో ఈయన స్పృశించని ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రాచీన సాహిత్యంలోని ప్రబంధాలు మొదలుకొని ఆధునిక సాహిత్యంలోని కథ, నవల, కవిత్వం, అనువాదం మొదలైన అన్ని ప్రక్రియలకు సంబంధించిన విమర్శ చేశారు. అంతేగాక రాచపాళెం వారు ***స్వర్ణ భారతి సాక్షిగా, సీమ నానీలు, పొలి, రెండు ప్రపంచాలు*** అనే నాలుగు కవిత్వ సంపుటాలు కూడా రచించారు. కవికి, విమర్శకునికి మధ్యగల వ్యత్యాసాన్ని తెలియజేస్తూ ఆచార్య ఎస్వీ రామారావు గారు తెలుగులో సాహిత్య విమర్శ అనే పుస్తకంలో "కవిత్వము, విమర్శనము అవినాభవ సంబంధం కలవి "కౌతి శబ్దాయతే విమృశతి రసభావాన్ ఇతి కవిః" అని భట్టగోపాలుని నిర్వచనము. కవి యందు విమర్శనా శక్తి ఉన్నట్లుగనే, విమర్శకుని యందును కవితాశక్తి అంతర్గతమై ఉండును"[7]. అని పేర్కొన్నారు.

[7] తెలుగులో సాహిత్య విమర్శ ,ఎస్వీ రామారావు. పుట:2

అంటే విమర్శకునికి కూడా కవితాశక్తి  ఉంటుందని ఈయన అభిప్రాయపడ్డారు. ఈ విధంగానే రాచపాళెం వారిలో కూడా కొంత కవితాశక్తి ఉన్నట్లు మనం గుర్తించవచ్చు. ఈ ఒరవడిలో వచ్చిన కవితా సంపుటాలుగా స్వర్ణభారతి సాక్షిగా, సీమ నానీలు, పొలి, రెండు ప్రపంచాలు లను చెప్పుకోవచ్చు. వీరు మొట్టమొదట రాసిన ***"సినిమా కవిత్వం – సాహిత్య విలువలు"*** (1972) అనే వ్యాసాన్ని ఆయన సాహిత్య ప్రస్థానంలోని తొలి అడుగుగా మనం గుర్తించవచ్చు. ఈ వ్యాసం "స్రవంతి" (అక్టోబరు1972) పత్రికలో అచ్చయింది. తాను స్నాతకోత్తర విద్యనభ్యసించే సమయంలో వారి ఆచార్యులు నిర్వహించే వారాంతపు తరగతి సదస్సుల నిర్వహణలో భాగంగా ప్రతి వారం ఒక పరిశోధక పత్రాన్ని సమర్పించేవారు. ఈ కాలంలో రాసినదే పైన తెల్పిన "సినిమా కవిత్వం – సాహిత్య విలువలు" అనే వ్యాసం. "నేను రాసిన ప్రచురించిన తొలి విమర్శ వ్యాసం ఇదే"[8] అని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు.

పై విధంగా ఆయన సాహిత్య ప్రయాణానికి బీజం పడింది. ఆ తరువాత పిహెచ్. డి పరిశోధనకు ప్రభావతీ ప్రద్యుమ్నం కావ్యాన్ని ఎంచుకున్నారు. ఈ సిద్ధాంత రూపకల్పనలో తన పర్యవేక్షక గురువు తుమ్మపూడి కోటీశ్వరరావు గారి సిద్ధాంత గ్రంథం "ఆముక్తమాల్యదా సౌందర్యం", జి. వి సుబ్రహ్మణ్యంగారి "ప్రథమాంధ్ర మహాపురాణం", విశ్వనాథ సత్యనారాయణ గారి విమర్శ గ్రంథాలు ఉపయోగపడ్డాయి.  ఈ విమర్శ గ్రంథాలలోని విమర్శ సూత్రాలను అవగాహన చేసుకున్న రాచపాళెం వారు  "పింగళి సూరన కవితా సిద్ధాంతం – ఆలంకారికులు" (1975) అనే వ్యాసాన్ని రాసారు. అది  శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాల మ్యాగజైన్ లో అచ్చయింది.  అదే మ్యాగజైన్ లో *"కళాపూర్ణోదయం – కథానిర్మాణ సౌందర్యం(1977)"* అనే వ్యాసం కూడా అచ్చయింది. రాచపాళెం వారి పరిశోధన పూర్తయిన తరువాత తన సిద్ధాంత వ్యాసాన్నే *"శిల్పప్రభావతి(1980)"* పేరుతో పుస్తకంగా అచ్చువేశారు. ఇంతవరకు ఆయన అభిరుచి, భావజాలాలు, దృక్పథాలు ప్రాచీన సాహిత్యంపై మాత్రమే

---

[8] రాచపాళీయం,షష్టిపూర్తి సంచిక. పుట:208

ప్రసరించేవి. తన పరిశోధన సిద్ధాంత గ్రంథం పూర్తయిన తరువాత అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్తర తెలుగు శాఖలో అధ్యాపకునిగా చేరారు. ఆ తరువాత కూడా ప్రాచీన సాహిత్యంపై విమర్శ చేశారు. అట్టివాటిలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి అందించిన "తెలుగు కవిత్వం – నన్నయ ఒరవడి"(1980), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు రచనా పోటీ నిర్వహించగా రాసిన ***"ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయలు – అభిరుచులు"*** అనేవి ముఖ్యమైనవి. వీటిలో రెండవ రచనకు తెలుగు విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన రచనా పోటీలో ఉత్తమ వ్రాతప్రతి పురస్కారం లభించిందని ముందే చెప్పాను. అంతవరకు ఆధునిక సాహిత్యంతో పరిచయం లేని రాచపాళెం వారికి అనంతపురంలో అధ్యాపకునిగా చేరిన తరువాత గురజాడ 'కన్యాశుల్కం' నాటకాన్ని చెప్పవలసి వచ్చింది. ఆ అనివార్యతే ఆయనను గురజాడ సాహిత్యాన్ని మొత్తం చదివేలా చేసింది. ఈ సందర్భంగా "కొత్త ప్రపంచం అనుభవంలోకి వచ్చింది"[9] అని ఆయన చెప్పారు. సర్దేశాయి తిరుమల రావు, కె. వి రమణారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి మొదలైన వారు తననొక కొత్త విమర్శ లోకంలోకి తీసుకెల్లారని ఆయన పేర్కొన్నారు.

## 1.20. సాహిత్యంలో జీవితం

అంతవరకు ప్రాచీన సాహిత్యం మోజులో ఉన్న రాచపాళెం వారికి కొన్ని భిన్న అనుభవాలు ఎదురయ్యాయి. అది ఎలా అంటే 1980 లో తనకు గురువుతో సమానమైన కె. నాగిరెడ్డి అనే అతను ఎన్. గోపి గారు రచించిన 'తంగేడు పూలు' కావ్యాన్ని రాచపాళెం వారికి ఇచ్చారు. ఆ కావ్యాన్ని చదివిన రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు మొదటిసారిగా తన అనుభవ జీవితాన్ని సాహిత్యంలో చూడగలిగారు. అప్పటినుండి ఆయన దానిని అధ్యయనం చేసి ఒక వ్యాసం రాసారు. అది స్రవంతి పత్రికలో 1980 జులై లో అచ్చయింది. పైన వివరించిన

---

[9] రాచపాళీయం,షష్టిపూర్తి సంచిక. పుట:209

అంశాలన్నీ ఆయన సాహిత్య విమర్శకుడిగా ఆవిర్భవించడానికి కారణమైన అంశాలుగా చెప్పవచ్చును.

## 1.21. పర్యవేక్షక పాళీ

రాచపాళెం వారు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా చేరిన నాటి నుండి పర్యవేక్షకునిగా అనేకమంది పరిశోధకులకు దిశానిర్దేశం చేశారు. పరిశోధనాంశం ఎంపిక విషయంలో లోతుగా ఆలోచించి వారిలో విమర్శనా శక్తిని పెంపొందించే విధంగా పరిశోధనాంశాలను ఇచ్చి వారి పరిశోధనకు సహకరించేవారు. ఈ విధంగా ఈయన పర్యవేక్షణలో 25 పిహెచ్.డి లు, 20 ఎం.ఫిల్ లు చేయించారు. వాటి వివరాలు ఈ కింద పొందుపరుస్తున్నాను.

### 1.21.1. పిహెచ్.డి లు

| క్ర.సం | పరిశోధనాంశం | పరిశోధకుని పేరు |
|---|---|---|
| 1. | తిక్కన(తెలుగు), కుమార వ్యాసుడు(కన్నడం) మహాభారతం – తులనాత్మక పరిశీలన | ఎం. జగన్నాథాచారి |
| 2. | శుకసప్తతి – ఒక పరిశీలన | సి. వెంకటరామిరెడ్డి |
| 3. | ఆధునికాంధ్ర కవిత్వంలో గేయకథా కావ్యాలు | కె. చెంగారెడ్డి |
| 4. | అనిసెట్టి సాహిత్యానుశీలన | పి. వి. సుబ్బారావు |
| 5. | ఆధునికాంధ్ర సాహిత్యం – తొలిదశ (క్రీ. శ. 1900 వరకు) | బి. ఎస్. ఎస్. సాయి |
| 6. | తెలుగు కథాకావ్యాలు – జక్కన విక్రమార్క చరిత్ర | శాంతి నారాయణ |
| 7. | ఇరవయ్యారేళ్ల తెలుగుకథ (1910 – 1935) : సామాజికజీవితం | జి. ప్రభాకర్ |
| 8. | ఒక దశాబ్ది తెలుగు కథ సామాజిక జీవితం (1936 – 45) | ఎన్. నారాయణ స్వామి |
| 9. | ఒక దశాబ్ది (1956 – 65) తెలుగు కథ : సామాజిక జీవితం | కె. శ్రీదేవి |
| 10. | కొడవటిగంటి కుటుంబరావు కథాశిల్పం | జె. స్వరూప కృష్ణమూర్తి |
| 11. | తెలుగు వచన కవిత్వం – విభిన్న ధోరణులు | జె. ప్రేంచంద్ |

| | | |
|---|---|---|
| 12. | అల్లం రాజయ్య (తెలుగు), మహాశ్వేతాదేవి (బెంగాలీ) నవలలు – తులనాత్మక పరిశీలన | కె.నాగేశ్వరరావు |
| 13. | భారతీయ నవల – దళిత సమస్య – తులనాత్మక అధ్యయనం | టి. ఆనందరావు |
| 14. | భారతీయ కథానిక – భారతీయ జీవితం (అయిదేళ్ళ విపుల పత్రిక ఆధారంగా) | కె. పవన చౌదరి |
| 15. | ప్రాచీన తెలుగు సాహిత్యం : విధి వంచిత స్త్రీ పత్రాలు | ఎ. శ్రీదేవి |
| 16. | జాషువ సాహిత్యం – సామాజిక న్యాయం | టి. వరప్రసాద్ |
| 17. | రావి శాస్త్రి కథా శిల్పం | ఎస్. సి. సంజీవ రెడ్డి |
| 18. | కాలువ మల్లయ్య కథలు – వస్తు రూప అధ్యయనం | సి. ఆదినారాయణ |
| 19. | రాయలసీమ కథానిక : వ్యవసాయ రంగచిత్రణ | బి. రాఘవేంద్ర |
| 20. | విశాలాంధ్ర తెలుగు కథ – ఒక అధ్యయనం | ఎం. అన్వర్ హుస్సేన్ |
| 21. | పదేళ్ల కథావార్షికలు – వస్తు శిల్పాలు | ఎం. జయరాం |
| 22. | తెలుగు కథానిక వస్తు విశ్లేషణ (1966 – 80) | డి. అనితమ్మ |
| 23. | తెలుగు కథానిక (1991 – 95) | కె. మురళీధర్ |
| 24. | రాధేయ కవిత్వం : వస్తు శిల్పాలు | టి. నాగేంద్ర |
| 25. | 'మా సీమ' పత్రికా సాహిత్యం – అధ్యయనం | ఎస్. లక్ష్మీరామనాయక్ |

## 1.21.2. ఎం. ఫిల్ లు

| | | |
|---|---|---|
| 26. | శుకసప్తతి – దేశీయతా చిత్రణ | సి వెంకట రామిరెడ్డి |
| 27.<br>28. | క్రీడాభిరామం – వ్యంగ్య కావ్యం<br>విశ్వనాథ ప్రణయ కవిత్వం | కె. నారాయణ రెడ్డి<br>ఎం. మంజుల వాణీశ్రీ |

| | | |
|---|---|---|
| 29. | విశ్వనాథ చిన్న కథలు | టి. కె. దివాకర్ |
| 30. | పాండురంగ మాహాత్మ్యం – అలంకార వైచిత్రి | కె. సరస్వతి |
| 31. | కె. శివారెడ్డి – రక్తం సూర్యుడు – ఒక పరిశీలన | జె. స్వరూప కృష్ణమూర్తి |
| 32. | నారాయణ బాబు – రుధిరజ్యోతి – ఒక పరిశీలన | జె. ప్రేంచంద్ |
| 33. | మాలపల్లి(తెలుగు) కూలిగింజలు(మలయాళం) నవలలు – తులనాత్మక పరిశీలన | టి. మౌలాలి |
| 34. | అల్లం రాజయ్య కథలు – జీవిత సంఘర్షణ | కె. నాగేశ్వరాచారి |
| 35. | గిరీశం(కన్యాశుల్కం) శాస్త్రి(అతడు–ఆమె) తులనాత్మక పరిశీలన | టి. ఆనందరావు |
| 36. | మాలపల్లి – వేయిపడగలు : తులనాత్మక పరిశీలన | టి. వరప్రసాద్ |
| 37. | బ్రహ్మ వివాహం(తెలుగు) ఇగ్గప్ప హెగ్గడే వివాహ ప్రహసన(కన్నడం)తులనాత్మక పరిశీలన | బిక్కి కృష్ణప్ప |
| 38. | వేమన – గురజాడ తులనాత్మక పరిశీలన | మాధవయ్య |
| 39. | ఆముక్తమాల్యద – అలంకార వైచిత్రి | ఎన్. సరస్వతి |
| 40. | చివరి గుడిసె – ఒక పరిశీలన | సి. శ్రీనివాసులు |
| 41. | త్వమేవాహం – ఒక పరిశీలన | వి. రామిరెడ్డి |
| 42. | 'అనంత' కథ – వ్యవసాయ చిత్రణ | బి. రాఘవేంద్ర |
| 43. | ఇనుప గజ్జెల తల్లి – ఒక అధ్యయనం | ఉమాదేవి |
| 44. | మగ్గం బతుకు వస్తు శిల్పాల అధ్యయనం | టి. నాగేంద్ర |

పై పరిశోధనాంశాలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఎక్కువ భాగం తులనాత్మక సాహిత్య అధ్యయనానికి ప్రాధాన్యం ఇచ్చినట్లుగా తెలుస్తుంది. అంతేగాక భావి పరిశోధకులకు మార్గదర్శనంగా ఉన్నాయి. పైన చెప్పిన పరిశోధనాంశాల వరుసలో, పరిశోధకుల అభిరుచి మేరకు ప్రాచీన కావ్యాలు మొదలుకొని కథ, నవల, కవిత్వం, అనువాదం, భారతీయ సాహిత్యం తదితర సాహిత్య ప్రక్రియలన్నింటికి సమ ప్రాధాన్యం ఇచ్చి వారికి ఆ అంశాలను ఎంపిక చేసినట్లుగా తెలుస్తుంది. ఈ విషయంలో రాచపాళెం వారు మనకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

## 1.22. సంపాదకత్వం వహించిన గ్రంథాలు

- దళిత కథలు(కె. లక్ష్మీ నారాయణతో కలిసి) : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు 1996
- అనంతదర్శిని (అనంతపురం జిల్లా సమాచార దర్శిని) : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు 1996
- స్వంతంత్ర భారత సావనీర్ : : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు 1998
- విమర్శ – ప్రతి విమర్శ (సర్దేశాయి తిరుమల రావు సాహిత్య విమర్శ వ్యాసాలు) : తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ 2002
- జాతీయోద్యమ కథలు : తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ 2007
- 1980 తరువాత తెలుగు దళిత నవల(కె.లక్ష్మీ నారాయణతో కలిసి): రమా పబ్లికేషన్స్, అనంతపురం 2003
- పొరుపు (శాంతి నారాయణతో కలిసి): అనంతపురం జిల్లా రచయితల సంఘం, అనంతపురం 2003

- 1980 తరువాత స్త్రీల నవలలు(కె.లక్ష్మీ నారాయణతో కలిసి): రమా పబ్లికేషన్స్, అనంతపురం 2008
- వేమన-2 (వేమనపై విమర్శ వ్యాసాలు): సి. పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప 2013
- సిపి బ్రౌన్ (బ్రౌన్ పై విమర్శ వ్యాసాలు): సి. పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప 2013
- కొలకలూరి ఇనాక్ సాహిత్య పరిశోధనం : జ్యోతి గ్రంథమాల, అనంతపురం 2009
- ఆచార్య జి.యన్.రెడ్డి పీఠికలు: ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ 2017
-
- 1.23. **'రాచపాళెం'–రచనలు**
-

నాలుగున్నర దశాబ్దాలుగా నిర్విరామంగా సాహిత్య విమర్శను రాస్తున్న రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు దాదాపు 24 విమర్శ గ్రంథాలు రచించారు. వీటిలో కొన్ని ప్రాచీన సాహిత్యంపై చేసిన విమర్శ గ్రంథాలు, మరికొన్ని ఆధునిక సాహిత్యంపై రాసిన విమర్శ గ్రంథాలు కాగా, మరికొన్ని భారతీయ, దాక్షిణాత్య, తులనాత్మక సాహిత్యంపై వెలువడిన విమర్శ గ్రంథాలుగా ఉన్నాయి. ప్రక్రియల వారిగా రాచపాళెం వారి విమర్శ గ్రంథాలను పరిశీలించినట్లయితే ప్రబంధం, కథ, నవల, కవిత్వం మొదలైన వాటిపై విమర్శ చేశారు.

సాధారణంగా ఒక వ్యక్తి సాహిత్య విమర్శకుడు కావడం చాలా కష్టం. ఎందుకంటే సాహిత్య విమర్శకుడిగా రాణించాలంటే కేవలం సాహిత్య జ్ఞానం మాత్రమే ఉంటే సరిపోదు, సాహిత్య విషయాలతో పాటు ఇతర సామాజిక శాస్త్రాల పరిజ్ఞానం అవసరం. ఈ సందర్భంలో మనం కట్టమంచి రామలింగారెడ్డి గారు రచించిన "కవిత్వ తత్త్వ విచారము" అనే విమర్శ

గ్రంథానికి మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు రాసిన పీఠికలోని ***"పట్టుపట్టి చదువుకొని పండితుఁడైనఁ గావచ్చునుగాని కవియగుట కష్టము. ఎట్లో శ్రమపడి భాషాంతరీకరించియో యనుకరించియో కవియైనఁ గావచ్చునుగాని విమర్శకుఁడగుట యంతకంటెఁ గష్టము."*** [10] పై వాక్యాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది కవి కావడం కష్టమైన పని అని, సాహిత్య విమర్శకుడు కావటం అంతకంటే చాలా కష్టమని అర్థమౌతుంది. కాబట్టి రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి గారు అటు సాహిత్య విమర్శ రంగంలోనూ, ఇటు సృజనాత్మక సాహిత్య పరంగానూ ఏ విధంగా పేరు పొందారో, ఏ యే రచనల ద్వారా ఆయన ప్రఖ్యాతి చెందారో వాటిని కింది రచనల పరిచయం వల్ల తెలుస్తుందని అనుకుంటున్నాను. ఇవే గాక కొన్ని వందల పరిశోధక వ్యాసాలను రాసారు. ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలను గనుక పరిశీలించినట్లయితే ఒక నిత్య పరిశోధక, నిరంతర అధ్యయనశీలి ఆయనలో ప్రస్పుటంగా కనిపిస్తారు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు దాదాపు 200 కి పైగా వివిధ సాహిత్య పరిశోధక వ్యాసాలను రాశారు.

### 1.23.1. కవిత్వ సంపుటాలు

- స్వర్ణ భారతి సాక్షిగా
- సీమ నానీలు
- పొలి
- రెండు ప్రపంచాలు

### 1.23.2. అనువాద గ్రంథాలు

- మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ (మోనోగ్రాఫ్): సాహిత్య అకాడమీ, 1988
- దేవుడే బలుదైతే (కిషన్ చందర్) : విశాలంధ్ర పబ్లిషింగ్ హౌస్ 1989
- పున్నమి రాత్రి – ఇతర కథలు (కె. ఎస్ దుగ్గల్, పంజాబీ) : సాహిత్య అకాడమీ 2005

[10] కవిత్వ తత్త్వ విచారము, కట్టమంచి రామలింగారెడ్డి, పుట:11

- దేవుళ్ళు, దెయ్యాలు, భూతాలు (అబ్రహం. టి. కోవూర్ వ్యాసాలు) : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
- కిషన్ చందర్ కథలు : సాహిత్య అకాడమీ
- రక్తనది (తమిళ నవల) : సాహిత్య అకాడమీ
- రాజేంద్ర సింహ బేడి కథానికలు : సాహిత్య అకాడమీ

## 1.23.3. విమర్శ గ్రంథాలు

ఆచార్య రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి గారి విమర్శ రచనలను కాలానుక్రమ పద్ధతిలో నా పరిశోధనలో భాగంగా మొదటగా పరిశీలిస్తున్నాను. ఆయన విమర్శ రచనలను పరిశీలించడం వల్ల ఆ రచనల చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవచ్చు.

## 1. శిల్ప ప్రభావతి (1980)

ఇది రాచపాళెం వారి  పరిశోధనా సిద్ధాంత గ్రంథం. వీరి పరిశోధన 1973 –77 కాలంలో పూర్తయింది. అప్పటికి ఆధునిక భావజాల ప్రభావం లేకపోవడంతో, సంప్రదాయ కుటుంబ నేపథ్యం కావడంతో ప్రాచీన సంప్రదాయ సాహిత్యంపై ఆసక్తి ఉన్న రాచపాళెం వారు పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని తన పరిశోధనాంశంగా స్వీకరించి ఆ కావ్యంలోని శిల్ప నైపుణ్యాన్ని నిరూపించారు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని పుస్తక రూపంలో “శిల్ప ప్రభావతి” పేరుతో 1980లో ప్రచురించారు. “శిల్ప ప్రభావతి” గ్రంథాన్ని సరళ గ్రాంథికంలో రాసారు. ఈ పరిశోధన గ్రంథం రాసే నాటికి ఈయనపై ఆధునిక సాహిత్య ప్రభావం లేదు. ఆ తరువాత నన్నయ పై రాసిన విమర్శ గ్రంథాన్ని కూడా ప్రాచీన కావ్య శిల్ప దృష్టితోనే విశ్లేషించారు.

## 2. తెలుగు కవిత్వం – నన్నయ ఒరవడి (1985)

రాచపాళెం వారు ప్రాచీన సాహిత్య విమర్శ రాసిన రెండో విమర్శ గ్రంథం "తెలుగు కవిత్వం – నన్నయ ఒరవడి" (1987). వాస్తవానికి రాచపాళెం వారు రాసిన మొదటి విమర్శ గ్రంథం ఇదే. ఈ గ్రంథంలో నన్నయ మహాభారత కావ్యం ద్వారా తన తరువాతి కవులకు ఏవిధంగా మార్గదర్శనం చేసాడో సవిమర్శక దృష్టితో విశ్లేషించారు. ఈ పుస్తకం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వాళ్ళు పుస్తక రచన పోటీకి రాచపాళెం వారు రాసారు. కానీ ఆ సమయానికి దీనిని వీరు పూర్తి చేయలేకపోయారు. ఆ తరువాత కొంత కాలానికి దీనిని పూర్తి చేసి పొట్టి శ్రీరాములు తెలుగు యునివర్సిటీ వారి ఆర్థిక సహాయంతో స్వీయ ప్రచురణతో దీనిని పాఠకులకు అందించారు.

## 3. గురజాడ – తొలి కొత్త తెలుగు కథలు (1985)

*"గురజాడ – తొలి కొత్త తెలుగు కథలు"* అనే ఈ గ్రంథాన్ని 1985 లో రచించారు. కెవి రమణారెడ్డి గురజాడ జీవితాన్ని సాహిత్యాన్ని ఆసరాగా చేసుకొని రచించిన 'మహోదయం' గ్రంథాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాచపాళెం ఈ గ్రంథాన్ని రచించినట్లు తెలుస్తుంది. ఈ గ్రంథాన్ని మహాకవి గురజాడ అప్పారావుకి అంకితమిచ్చారు. గురజాడ రచించిన తొలి తెలుగు కథ 'దిద్దుబాటు' (1910) ను రచించి 75 ఏళ్ళు అయిన సందర్భంగా ఈ పుస్తకాన్ని రాసినట్టు ఆయన పేర్కొన్నారు. గురజాడ జీవితాన్ని, కథా సాహిత్యాన్ని గురించి విమర్శతో కూడిన విశ్లేషణతో దీనిని రచించారు.

## 4. ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయలు – అభిరుచులు (1992)

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు రచించిన ఈవిమర్శనా గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం పురష్కారం లభించింది. ప్రాచీన సాహిత్యంపై ఇంతవరకు రాసిన విమర్శకు దీనికి చాలా భేదం ఉంది. ఈ గ్రంథంలో ఆదికవి నన్నయను మొదలుగా చేసుకొని, వారి

సాహిత్య అభిప్రాయాలను క్రోడీకరించి, ఇతర ప్రాచీన కవుల అభిప్రాయాలను తులనాత్మకంగా అధ్యయనం చేశారు. నాటి ప్రాచీన కవుల సాహిత్య అభిప్రాయాలు నేటి ఆధునిక రచయితలకు ఎలా మార్గ దర్శనం చేసాయో ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించారు. అంతే గాక ప్రాచీన కావ్య అవతారికల్లో కవులు వివరించిన కావ్య లక్షణాలు, కావ్య హేతువులు మొదలైన సాహిత్యాంశాలను ఈ గ్రంథంలో స్థూలంగా అధ్యయనం చేశారు.

## 5. సాహిత్య పరిశోధనా సూత్రాలు (1996)

హెచ్. ఎస్ బ్రహ్మానందతో కలిసి రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఈ గ్రంథాన్ని రచించారు. 1996లో వచ్చిన ఈ రెండు గ్రంథాల రచనకు ప్రోత్సాహమిచ్చినవారు వారి గురువు తుమ్మపూడి కోటీశ్వరరావు గారు. ఈ గ్రంథంలోని సాహిత్య బోధనా పద్ధతులు పాఠశాల, కళాశాల అధ్యాపకులను ఉద్దేశించి రచించినట్లు తెలుస్తుంది. కేవలం పద్యం చదివి, దాని తాత్పర్యం చెప్పి దానికి కొన్ని చమత్కారాలు జోడించినంత మాత్రాన సాహిత్య బోధన కాదని అది ఒక సృజనాత్మక శాస్త్రమని చెప్పడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశ్యంగా తెలుస్తుంది. స్వయంగా సాహిత్య అధ్యాపకులైన ఇద్దరు రాసిన గ్రంథం కనుక దీనిలో సాహిత్య బోధన పద్ధతులను స్థూలంగా వివరించగలిగారు.

సాహిత్య పరిశోధన విశ్వవిద్యాలయాల్లో ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఆ పరిశోధనకు సంబంధించిన సూత్రాలను ఎవరూ అంతగా పట్టించుకున్నట్టుగా కనపడటం లేదు. పైగా ఎటువంటి పరిశోధన సూత్రాలను పాటించని పరిశోధకులు రాసిన సిద్ధాంత గ్రంథాలు అనేక విమర్శలకు గురవుతున్నాయి. ఈ విధమైన సమస్యలకు పరిష్కారాన్ని చూపుతూ రాసిన గ్రంథమే "*సాహిత్య పరిశోధనా సూత్రాలు*". గంథం అప్పారావు, ఆర్వీయస్

సుందరం, ఎస్. జయప్రకాష్, పులికొండ సుబ్బాచారి వంటి వారు ఇంతకుముందే ఇటువంటి పరిశోధన సూత్రాలకు సంబంధించిన గ్రంథాలను రాశారు. సాహిత్య పరిశోధనలకు సంబంధించిన సూత్రాలను తెలియజేస్తూ తెలుగులో అతి తక్కువ గ్రంథాలు మాత్రమే వెలువడ్డాయి. వాటిలో ఇది కొంత ప్రత్యేకతను కలిగి ఉందని చెప్పవచ్చు.

## 6. ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు – సందర్భాలు (2002)

*"ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు – సందర్భాలు"* అనే ఈ విమర్శనా గ్రంథంలోని వ్యాసాలన్నింటిని 1980–2000 సంవత్సరాల మధ్య కాలంలో రాసినట్టుగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు ఈ పుస్తకాన్ని గురించి వివరిస్తున్న సందర్భంలో తెలియజేశారు. ఈ గ్రంథంలో ఆధునికాంధ్ర కవిత్వంపై వెలువడిన 25 విమర్శనాత్మక వ్యాసాలున్నాయి. ఈ గ్రంథానికి అఫ్సర్ *'ఆత్మపరిశీలనకు ఒక సందర్భం'* అనే పేరుతో ముందుమాట రాశారు. ఈ ముందుమాటలో రాచపాళెం వారి విమర్శ ప్రారంభ భూమిక మొదలుకొని వారి విమర్శనా సిద్ధాంత మౌలికత వరకు ఉన్న సాహిత్య నేపథ్యాన్ని వివరించారు. అంతేగాక రాచపాళెం"ఇప్పుడు సంప్రదాయ సాహిత్యానుశీలన చేసినా, ఆధునిక అత్యాధునిక సాహిత్య విమర్శ చేసినా ఆయనకు బలమైన ప్రాతిపదిక మార్క్సిస్టు సిద్ధాంతమే" అని స్పష్టపరిచాడు. అలాగే రాచపాళెం వారి విమర్శ మౌలిక స్వభావం గురించి ఈ ముందుమాటలో అఫ్సర్ గారు క్లుప్తంగా వివరించారు. ఈ విమర్శనా గ్రంథంలో గరిమెళ్ళ సత్యనారాయణ పాటల గురించి రాసిన *'తిరుగుబాటు బాట – గరిమెళ్ళ పాట'* అనే వ్యాసంతో మొదలుపెట్టి అఫ్సర్ రాసిన *'వలస'* కవిత్వ సంపుటిపై జీవన వలసలపై ఆగ్రహం అఫ్సర్ *'వలస'* అనే వ్యాసం వరకు ఆధునికాంధ్ర కవిత్వంపై వెలువడిన వ్యాసాలున్నాయి.

## 7. కథాంశం (2006)

1984 – 2004 సంవత్సరాల మధ్య రెండు దశాబ్దాలలో వచ్చిన కథానికలపై రాచపాళెం రాసిన వ్యాసాలన్నింటిని కలిపి *"కథాంశం"* పేరుతో పుస్తకంగా 2006 లో ప్రచురించారు. ఈ పుస్తకంలో మొత్తం 23 సాహిత్య వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలన్నీ ప్రముఖ కథకులైన తిలక్, గురజాడ, శ్రీపాద, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సింగమనేని నారాయణ, శాంతినారాయణ మొదలైన వారిపై రాసారు. ఈపుస్తకానికి 'కథాంశం' అనే పేరును సూచించినది ప్రముఖ కథకులు సింగమనేని నారాయణ గారని రాచపాళెం చెప్పారు. భారతీయ భాషల కేంద్ర సంస్థ (CIIL) మైసూరు వారి ఆర్థిక సహాయంతో ఈ పుస్తకాన్ని ముద్రించారు. దీనిని ప్రముఖ కథకులు కాళీపట్నం రామారావు గారికి అంకితం ఇచ్చారు.

## 8. కొన్ని కావ్యాలు – కొందరు కవులు (2008)

ఈ విమర్శ గ్రంథాన్ని 2008లో ముద్రించారు. ఇందులో మొత్తం 20 వ్యాసాలున్నాయి. వీటిలో ఆరు వ్యాసాలు ప్రాచీన తెలుగు కవిత్వానికి సంబంధించినవి కాగా, మిగిలినవి ఆధునిక తెలుగు కవిత్వం మీద రాసినవి. ఈ సంకలనంలోని వ్యాసాలలో ఒకటి జానపద సాహిత్యానికి సంబంధించింది కూడా ఉంది. ఈ విమర్శ గ్రంథంలోని కొన్ని వ్యాసాల్లో రచయితలను అంచనా కట్టడానికి అవసరమైన 'ప్రాపంచిక దృక్పథాన్ని' గురించి వివరించారు. ఈ గ్రంథాన్ని రాచపాళెం వారు తన మనుమలు, మనుమరాలుకు అంకితమిచ్చారు. దీనిని కూడా భారతీయ భాషల కేంద్ర సంస్థ (CIIL) మైసూరు వారి ఆర్థిక సహాయంతో ముద్రించారు.

## 9. దరి దాపు (2008)

ఈ విమర్శ గ్రంథం తొమ్మిది వ్యాసాలతో ప్రచురితమైనది. రాచపాళెం వారు రాసిన సాహిత్య విమర్శ గ్రంథాల కంటే కొంత ప్రత్యేకమైనదని చెప్పవచ్చు. ఎందుకంటే ఇంతవరకు రాసిన విమర్శా గ్రంథాలన్నీ అన్వయ విమర్శకు సంబంధించినవి కాగా ఈ పుస్తకంలోని వ్యాసాలు సైద్ధాంతిక చర్చకు సంబంధించినవిగా ఉన్నాయి. సాహిత్యంలో నిబద్ధత, సామాజిక

సమస్యలు, పరిష్కార మార్గాలు, సాహిత్య పరిణామం, సామాజిక పరిణామం – సాహిత్యం శాస్త్రీయ అవగాహన వంటి మౌలికమైన అంశాల మీద ఈ వ్యాసాలను రాశారు. ప్రతి రచయితకు ఒక సాహిత్య నిబద్ధత ఉండాలని రాచపాళెం సిద్ధాంత ప్రతి పాదన చేశారు. రచయిత సామాజిక సమస్యలను స్పృశించడమే కాకుండా వాటికి సాధ్యమైనన్ని పరిష్కార మార్గాలను సూచించాలని ప్రతిపాదించారు. సాహిత్య చరిత్ర సామాజిక చరిత్రలో ఒక భాగమని, దానిని సామాజిక దృష్టి కోణం నుండి అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రచయితకు పక్షపాతం ఉంటుందని, అది అతని రచనలో అనేక విధాలుగా వ్యక్తమవుతుందని చెప్తూ దీనిని "కంఠస్వరం" అని నిర్వచించారు. రాచపాళెం కు ఈ గ్రంథం రాసేనాటికి 'ప్రాపంచిక దృక్పథం' అనేది అలవడిందని చెప్పవచ్చు. ఏ దృక్పథమూ లేకుండా రచయితలు ఏమీ రాయలేరని ఒక వ్యాసంలో సిద్ధాంతీకరించారు. ప్రాపంచిక దృక్పథం భావవాదం, భౌతిక వాదం అని రెండు రకాలుగా ఉంటుందని పేర్కొంటూ, వాటి లక్షణాలను వివరించారు. ఏ కాలపు సాహిత్యన్నైనా శాస్త్రీయంగా అవగాహన చేసుకోవాలని సమ సమాజం వంటి ఆధునిక భావనలు ప్రాచీన సాహిత్యంలోనే ఉన్నాయని వాదించడం వల్ల ప్రయోజనం శూన్యమని వివరించాడు.

## 10. తులనాత్మక దాక్షిణాత్య సాహిత్య వ్యాసాలు (2009)

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు రచించిన విమర్శ గ్రంథాలలో ఒక ప్రత్యేకత కలిగిన గ్రంథం ఇది. ఆయన రాసిన అన్ని గ్రంథాల కంటే భిన్నమైంది. ఇందులో భారతీయ భాషలకు సంబంధించిన తులనాత్మక సాహిత్య విమర్శ వ్యాసాలు ఉన్నాయి. మొత్తం 10 వ్యాసాలున్న ఈ గ్రంథం ద్రావిడ విశ్వవిద్యాలయం వారే ప్రచురించారు. దక్షిణ భారతదేశ భాషలకు సంబంధించిన సాహిత్యాన్ని తులనాత్మక దృష్టితో అధ్యయనం చేస్తూ ఈ వ్యాసాలను రచించారు.

## 11. చర్చ (2010)

ఈ గ్రంథాన్ని రాచపాళెం వారి సాహిత్య విమర్శ చరిత్రలో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. దీనికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి 'ఉత్తమ సాహిత్య విమర్శ పురస్కారం(2008)' లభించింది. ఇందులో 1988 – 2005 సంవత్సరాల మధ్య దాదాపు మూడు దశాబ్దాల కాలంలో రాసిన వ్యాసాలు ఉన్నాయి. ఈ పుస్తకంలో ప్రచురించిన వ్యాసాలు కదలిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, ప్రజాసాహితీ, అరుణతార పత్రికలలోను, వివిధ గ్రంథాలలో అచ్చయ్యాయి. ఈ పుస్తకం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంవారి ఆర్థిక సహాయంతో ముద్రించారు. రాచపాళెం వారి పెద్దమ్మ, పెదనాన్నలకు (వారి శ్రీమతి అమ్మమ్మ తాతయ్యలు) ఈ విమర్శ గ్రంథాన్ని అంకితం ఇచ్చారు. దాదాపు 38 విమర్శ వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ పుస్తకం 2006, 2010 లలో రెండు సార్లు ముద్రితమైంది.

## 12. మన నవలలు – మన కథానికలు (2010)

ఆధునిక సాహిత్యంలోని నవలలు, కథానికలను ఆసరాగా చేసుకొని మార్క్సిస్టు దృక్పథంతో రాసిన ఈ విమర్శ వ్యాసాల సంపుటికి 2014 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ గ్రంథంలో మొత్తం 24 వ్యాసాలు ఉన్నాయి. అందులో 13 వివిధ నవలలపై రాసిన విమర్శ వ్యాసాలు కాగా, 11 వ్యాసాలను కథానికలపై రాసారు. 2010 లో ముద్రణ అయిన ఈ గ్రంథం 2014 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును కైవసం చేసుకుంది.

## 13. విమర్శ – 2009 (2010)

పైన పరిచయం చేసిన విమర్శ గ్రంథాల కంటే భిన్నమైనది ఈ విమర్శ గ్రంథం. ఎందుకంటే ఇంతకు ముందు వెలువరించిన సాహిత్య విమర్శ మొత్తం ఒక వ్యక్తి సాహిత్యానికో, ఒక ప్రక్రియకో, ఒక భావజాలనికో ముడిపెట్టి రాసినదిగా చెప్పవచ్చు. కానీ ఈ విమర్శ గ్రంథం అటువంటిది కాదు. నిజానికి రాచపాళెం వారి విమర్శన శక్తి ఇటువంటి సందర్భాలలోనే తేట తెల్లమౌతుంది. ఇటువంటి విమర్శ చేయడానికి చాలా సమర్థత అవసరం అవుతుంది. ఒక సంవత్సర కాలంలో వివిధ దిన, వార్షక, మాస, త్రైమాసిక పత్రికలలో వచ్చిన సాహిత్య విమర్శ వ్యాసాలను వాటిని సేకరించి విశ్లేషణ చేస్తూ రాసిన గ్రంథమే ఈ *"విమర్శ–2009".* ఈ విధమైన దృక్పథంతో రాసిన మొట్టమొదటి విమర్శ గ్రంథం ఇది. ఇందులో 2009 సంవత్సరంలో వచ్చిన విమర్శనంతటినీ సమీక్ష చేస్తూ వ్యాసాలను రాసారు.

## 14. దీప ధారి గురజాడ (2010)

రాచపాళెం వారు 1977లో అనంతపురంలో లెక్చరర్ గా చేరిన తరువాత మహాకవి గురజాడ రచించిన 'కన్యాశుల్కం' నాటకాన్ని బోధించాల్సి వచ్చింది. ఆవిధంగా నాలుగేళ్ళపాటు గురజాడ సాహిత్యాన్ని విద్యార్థులకు బోధించిన ఆయనకు అంతకుముందెప్పుడు ఆధునిక సాహిత్యంతో పరిచయం లేదు. కాబట్టి గురజాడ సాహిత్యాన్ని చెప్పడానికి ఆధునిక విమర్శకుల్లో ఒకరైన సర్దేశాయి తిరుమలరావు గారు రచించిన *"కన్యాశుల్క నాటకకళ"* అనే పుస్తకం ఎంతగానో తోడ్పడింది. ఈ నేపథ్యం నుండి రాసిన గ్రంథమే *"దీప ధారి గురజాడ".* గురజాడ పై మొట్టమొదటి సారిగా 1985లో *"గురజాడ తొలికొత్త తెలుగు కథలు"* అనే విమర్శ గ్రంథాన్ని రచించారు. దాని తరువాత గురజాడ సాహిత్యంపై రాసిన గ్రంథమే ఇది. ఈ పుస్తకాన్ని 2010 లో ప్రచురించారు.

## 15. విమర్శ – 2011 (2012)

*"విమర్శ-2009"* గ్రంథానికి కొనసాగింపుగా రాసిన గ్రంథమే *"విమర్శ–2011"* ఒక ఏడాదిలో దినపత్రికల్లో వచ్చిన దాదాపు 500 విమర్శనాత్మక వ్యాసాలను ఆసరాగా చేసుకొని వాటిలోని విషయాలను సమీక్ష చేసే దృష్టితో రాసిన వ్యాసాలనే ఈ గ్రంథరూపంలో ముద్రించారు. ఈ గ్రంథ రచనలో ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, వార్త, సూర్య, సాక్షి, విశాలాంధ్ర, ప్రజాశక్తి, ప్రజాసాహితి, పాలపిట్ట, సాహిత్య ప్రస్థానం మొదలైన పత్రికల మీద ఆధారపడి ఈ వ్యాసాలను రచించారు. గత ఏడాదిలో లాగే 2011 సంవత్సర కాలంలో వివిధ దినపత్రికలో వచ్చిన సాహిత్య విమర్శ వ్యాసాలను సమీక్ష చేస్తూ రాచపాళెం వారు ఈ గ్రంథాన్ని రచించారు.

## 16. భారత జాతీయోద్యమ సాహిత్యం (2012)

స్వాతంత్ర్యానికి పూర్వం భారత ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు కొందరిని శక్తి హీనులుగా తయారు చేస్తే మరి కొందరిని సృజనకారులుగా, సాహితీ స్రష్టలుగా తయారు చేసాయి. ఈ నేపథ్యం నుండి అనేక సాహిత్య ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. బ్రిటీషు పాలన పట్ల భారతీయుల నిరసనను తమ రచనల ద్వారా తెలియచేయడం మొదలుపెట్టారు. రచయితలు ఈ విధంగా గేయం, నవల, కథానిక, నాటకం మొదలైన అనేక సాహిత్య ప్రక్రియలు జీవం పోసుకున్నాయి. ఈ విధమైన సాహిత్యం పై సమగ్ర గ్రంథాన్ని క్లుప్తంగా అందించమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014 లో నిర్వహించిన నాల్గవ ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా కోరడంతో ఆచార్య రాచపాళెంచంద్ర శేఖర రెడ్డి గారు అతి తక్కువ కాలంలోనే ఎంతో క్లుప్తంగా, వివరంగా ఈ భారత జాతీయోద్యమ సాహిత్యం అనే గ్రంథాన్ని రచించారు.

## 17. మరో చర్చ (2012)

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు 2010 సంవత్సరంలో 'చర్చ' అనే విమర్శనా గ్రంథాన్ని వెలువరించారు. ఈ గ్రంథం తెలుగులో వచ్చిన సాహిత్య విమర్శపై రాసిన విమర్శ

గ్రంథం. ఈ కోవలోనే చర్చ అనే గ్రంథానికి కొనసాగింపుగా 2012 వ సంవత్సరంలో *"మరో చర్చ"* అనే మరొక విమర్శనా గ్రంథాన్ని రాసారు. ఇది కూడా తెలుగు విమర్శ పై వెలువడిన విమర్శా గ్రంథమే. ఈ పుస్తకంలో అయిదేళ్ళ వ్యవధిలో రాసిన వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలన్నీ పూర్తిగా ఆధునిక సాహిత్యంపై రాసినవి. ఇందులో మొత్తం 26 వ్యాసాలున్నాయి. తెలుగులో సాహిత్య విమర్శ వచ్చినంతగా విమర్శపై విమర్శ వెలువడలేదని రాచపాళెంవారి అభిప్రాయంగా చెప్పవచ్చును. ఈ క్రమంలో ఆ లోటును భర్తీ చేసే దృష్టితో *చర్చ(2010), మరో చర్చ (2012)* అనే రెండు విమర్శనా గ్రంథాలను రచించారు.

## 18. ప్రతిఫలనం (2014)

ఈ పుస్తకం వెలువడటానికి ముందే ఆధునిక సాహిత్యంపై *"ఆధునికాంధ్ర కవిత్వం – ఉద్యమాలు, సందర్భాలు (2008)", "కొన్ని కావ్యాలు కొందరు – కొందరు కవులు(2008)"* అనే రెండు విమర్శ వ్యాస సంపుటాలను ప్రచురించారు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు ఆధునిక సాహిత్యంపై వెలువరించిన ముఖ్యమైన విమర్శ వ్యాస సంపుటుల్లో *"ప్రతిఫలనం"* అనే విమర్శ గ్రంథం ముఖ్యమైనది. ఈ గ్రంథంలోని వ్యాసాలన్నీ 2008 తరువాత రాసినవే అయినా ఈ పుస్తకం 2014 లో ప్రచురితమైంది. ఇందులో మొత్తం 25 వ్యాసాలున్నాయి. ఇందులోని వ్యాసాలు ఒక్కోటి ఒక్కో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వివిధ భావజాల దృక్పథాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకంలోని వ్యాసాలున్నాయి. ఇందులో అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీ, బహుజన, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ కవితల మీద వ్యాసాలున్నాయి.

## 19. జాషువా స్వప్నం – సందేశం (2015)

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు జాషువా శతజయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా పనిచేశారని ఇంతకుముందే తెలియజేసాను. ఈ నేపథ్యంలో జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం, అవకాశం కలిగాయి. ఈ క్రమంలో రాసిన వ్యాసాల సంపుటే ఈ

*"జాషువా స్వప్నం – సందేశం"* అనే గ్రంథం. ఈ విమర్శ గ్రంథాన్ని 2015లో గుర్రం జాషువా 120వ జయంతి ఉత్సవ కమిటీ వారు ప్రచురించారు. ఈ పుస్తకం కేవలం ఆరు వ్యాసాలు మాత్రమే కలిగిన అతి చిన్న విమర్శ గ్రంథం. వాస్తవానికి 1994 వరకు రాచపాళెం వారు గుర్రం జాషువా సాహిత్యాన్ని అతికొద్దిగా మాత్రమే చదువుకున్నారు. ఆ తరువాత అంటే 1994 తరువాత జాషువా శత జయంతి ఉత్సవాల నిర్వహణను చేపట్టిన అనంతరం జాషువా సాహిత్యాన్ని స్థూలంగా అధ్యయనం చేసిన రాచపాళెం వారు ఆ అధ్యయనం నుండి రాసినవే ఈ పుస్తకంలోని వ్యాసాలు అని చెప్పవచ్చు.

## 20. కవుల తెలంగాణం (2016)

తెలుగు సాహిత్య విమర్శకులు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, వివిధ ప్రాంతాలను సమన్వయం చేసుకుంటూ సాహిత్య విమర్శ చేసిన వారిలో రాచపాళెం వారిని కూడా చెప్పవచ్చు. సహృదయుడైన విమర్శకుడు మాత్రమే అలాంటి పని చేయగలడు. విమర్శకునిలో సహృదయత గనుక లేకపోతే ఆ విమర్శ వివాదాలకు తావివ్వగలదు. రాచపాళెం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనానంతరం రాసిన "కవుల తెలంగాణం" అనే విమర్శ గ్రంథంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ కవుల కవిత్వాన్ని విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలున్నాయి. ఒక విమర్శకుడు కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన సాహిత్యాన్ని మాత్రమే చదివి, ఆ ప్రాంత సాహిత్య విశ్లేషణకు మాత్రమే పరిమితమైపోతే అతను సహృదయుడైన విమర్శకునిగా తయారుకాలేడు. ఈ విమర్శ గ్రంథంలో తెలంగాణకు చెందిన సినారె, కాళోజి, మాస్టార్జీ, గద్దర్, ఎన్. గోపి, అఫ్సర్, విమల, ఆశారాజు, నందిని సిద్ధారెడ్డి, కందుకూరి శ్రీరాములు, జూలూరి గౌరీశంకర్, మొదలైన వారి కవిత్వంపైన వ్యాసాలు ఉన్నాయి.

## 21. ఎన్. గోపి సాహిత్యానుశీలనం (2017)

మొదట ప్రాచీన తెలుగు సాహిత్యంపై సాహిత్య విమర్శను రాసిన రాచపాళెంవారికి ఆధునిక సాహిత్యంపై విమర్శను రాయడానికి ఉపయోగపడిన మొదటి కావ్యం ఎన్. గోపి గారు రాసిన "తంగెడు పూలు" కావ్యం. ఆధునిక సాహిత్యంపై విమర్శ రాయడం ఈ కావ్యంతోనే మొదలైందని రాచపాళెంవారు ఎన్నో సందర్భాల్లో చెప్పుకున్నారు. రాచపాళెంచంద్రశేఖర రెడ్డి, ఎన్. గోపి గార్ల స్నేహానికి ఈ తంగేడు పూలు కావ్యంపై రాసిన విమర్శ వారధిగా పని చేసిందని చెప్పవచ్చు. ఈ విధంగా వీరిద్దరూ అత్యంత సన్నిహితులుగా, స్నేహితులుగా మారారు. ఆ తరువాత గోపి గారు రాసిన సాహిత్యాన్ని కొంత సమీక్షిస్తూ కొన్ని వ్యాసాలు రాసారు. ఈ వ్యాసాలన్నింటిని కలిపి ఎన్. గోపి సాహిత్యానుశీలనం అనే పేరుతో పుస్తకంగా ప్రచురించారు.

## 1.24. రాచపాళెం సాహిత్యం మీద జరిగిన పరిశోధనలు

- శ్రీదేవి– రాచపాళెం ప్రాచీన తెలుగు సాహిత్య విమర్శ : శ్రీ కృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం, అనంతపురం, ఎం.ఫిల్
- ఎ. ఎ నాగేంద్ర – 'పొలి' వస్తు శిల్ప అధ్యయనం : శ్రీ కృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం, అనంతపురం, ఎం.ఫిల్
- గోపి–'పొలి' ఒక అధ్యయనం – శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం : తిరుపతి, ఎం.ఫిల్
- ఎస్. వాణి – రాచపాళెం కవిత్వం వస్తురూప అధ్యయనం : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు, ఎం.ఫిల్
- మోహన్ బాబు – రాచపాళెం కవిత్వ విమర్శ – సమగ్ర అధ్యయనం : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, పిహెచ్. డి
- ఎ. ఎ నాగేంద్ర–రాచపాళెం సాహిత్య విమర్శ – సమగ్ర అధ్యయనం : శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం, అనంతపురం, పిహెచ్. డి
- వెంకటేష్– రాచపాళెం కవిత్వం – సమగ్ర అధ్యయనం : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, ఎం.ఫిల్

## 1.25. కవిగా రాచపాళెం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు తన విమర్శ, సృజనాత్మక సాహిత్యం ద్వారా వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా సమకాలీన సమాజాన్ని తనదైన సాహిత్య దృక్పథంతో వ్యక్తీకరించడం ఒక గొప్ప పరిణామంగా భావిస్తున్నాను. చాలామంది సాహిత్య కారులకు కేవలం ఆయనొక విమర్శకునిగా మాత్రమే తెలుసు. కానీ ఆయనలో ఒక గొప్ప సృజనాత్మక కవి కూడా ఉన్నాడన్న విషయం అతి కొద్దిమందికి మాత్రమే తెలుసు.

వీరు విమర్శ గ్రంథాలతో పాటు సృజనాత్మక రచనలు కూడా చేశారు. రాచపాళెం వారు స్వర్ణ భారతి సాక్షిగా, సీమ నానీలు, రెండు ప్రపంచాలు, పొలి అనే నాలుగు కవిత్వ సంపుటాలను రచించారు. ఒక వైపు సాహిత్య విమర్శను ఒక బాధ్యతగా స్వీకరించి, ఆచరణలో పెడుతూనే మరో వైపు కవిత్వ ప్రక్రియను మరొక ఆసరాగా చేసుకొని రాయలసీమ జీవితాలను ప్రతిబింబిస్తూ నాలుగు కవిత్వ సంపుటాలను వెలువరించారు. కరువు, ఫ్యాక్షనిజం, వర్తమాన రాజకీయాలు మొదలైనవి ఈయన కవితా వస్తువులు. కవిత్వంలో, కథల్లో సజీవ జీవిత చిత్రణ కనపడాలని రాచపాళెం వారు కోరుకుంటారు. అందుకు తగ్గట్టుగానే రెండు ప్రపంచాలు, స్వర్ణ భారతి, సీమ నానీలు, పొలి అనే కవితా సంపుటాలను రాసారు.

## 1.26. రైతు జీవిత ఆలంబన కవిగా రాచపాళెం

ఏ కవికైనా ఒక సామాజిక నేపథ్యం ఉంటుంది. ఆ సామాజిక నేపథ్యం తన రచనల్లో ప్రతిఫలించాలి. తను ఏ ప్రాంతంలో నివసిస్తున్నాడో, ఆ ప్రాంతీయ నేపథ్య జీవితాన్ని తన రచనల్లో మిళితం చేయాలి. కానీ నేటి సమాజంలో కొందరు రచయితలు వర్తమాన అంశాలను వదిలేసి ప్రాచీన కల్పిత గాథలు, వస్తువులపైనే ఆధారపడి ఇంకా గతంలోనే కొట్టిమిట్టాడుకోవడం పాఠకులు గమనించిన విషయమే, అయినా మరి కొందరు రచయితలు సమాజంలోని స్థితిగతులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకొంటూ సామాజిక అవసరాలకు

అనుగుణంగా వాటిని సృజనాత్మక సాహిత్య రూపంలో తీసుకురావడం అభినందించదగ్గ విషయం. ఆ విధంగా వర్తమాన సమాజాన్ని, దానికి సంబంధించిన పూర్వాపరాలను అవగాహన చేసుకుని వాటిని సాహిత్యీకరించిన వారిలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఒకరు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు తన కవిత్వం ద్వారా వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా సమకాలీన సమాజాన్ని తనదైన సాహిత్య దృక్పథంతో వ్యక్తీకరించడం ఒక గొప్ప పరిణామంగా భావిస్తున్నాను.

రచయిత ఏ దృక్పథంతో సాహిత్యాన్ని సృష్టించినా అందులో రెండు వర్గభేదాలు తప్పనిసరిగా ఉంటాయి. ఉదాహరణకు మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచించినప్పుడు పీడకవర్గం, పీడితవర్గం, దళిత దృక్పథంతో చూసినప్పుడు అగ్రఆధిపత్య కులాలు నిమ్న కులాలు, స్త్రీవాద దృక్పథంతో పరిశీలించినప్పుడు పురుషులు, స్త్రీలు మొదలైన పరస్పర విరుద్ధ వర్గాలను మనం గమనిస్తాం.

ఈ నేపథ్యంలో శ్రామిక వర్గం, దోపిడీ వర్గం అనే రెండు వర్గాలను కూడా మనం గమనించే ఉంటాం, గమనిస్తూనే ఉన్నాం. వేగవంతంగా అభివృద్ధి చెందిన పారిశ్రామికీకరణ శ్రామికులకు నిజమైన ఫలాలను అందనివ్వడం లేదు. దీనికి కారణం వాటికి సంబంధించిన సంపూర్ణ నిర్ణాయక శక్తి ఆ శ్రామిక వర్గానికి లేకపోవడమే. ఈ సందర్భంలో అత్యంత దోపిడీకి గురవుతున్న మొదటివరుస వ్యక్తులుగా రైతులను చెప్పవచ్చు. వీరు పండించే పంటలకు సంబంధించిన ధరలను నిర్ణయించే శక్తి వారికి లేకపోవడమే ఇందుకు కారణం. అటువంటి రైతులు పడుతున్న కష్టాన్ని కళ్ళకు కట్టినట్లుగా "పొలి" అనే దీర్ఘకవితలో రాచపాళెం వారు వ్యక్తీకరించారు. ఈ కావ్య నేపథ్యాన్ని తెలుసుకున్నట్లయితే కవి అభివ్యక్తి వ్యక్తమవుతుందని అనుకుంటున్నాను. ఏదైనా ఒక రచనని పరిశీలించేటప్పుడు ఆ రచనకు సంబంధించిన నేపథ్య, వస్తు, భాషా, శిల్పాలను గురించి అధ్యయనం చేయవలసి ఉంటుంది. అలా చేసినప్పుడే ఆ రచనకు సంబంధించిన సమగ్రమైన అవగాహన పాఠకునికి అందుతుందని అనుకుంటున్నాను.

## 1.27. రాచపాళెం పై వచ్చిన ప్రత్యేక సంచికలు

- రాచపాళీయం : ఆచార్య ఎన్. గోపి, (గౌరవ సంపాదకులు) డా కె. శ్రీదేవి (సంపాదకులు).
- 40 ఏళ్ల సాహిత్య విమర్శలో రాచపాళీయం : సాహిత్య నేత్రం ప్రత్యేక సంచిక, శశి శ్రీ అక్టోబరు 2012.

# అధ్యాయం-2

అధ్యాయం –2

# తెలుగు సాహిత్య విమర్శ: పుట్టుక – పరిణామం

## 2.0. పరిచయం

తెలుగు సాహిత్య విమర్శ అవతరణ ఏ విధంగా జరిగింది? దాని పరిణామ వికాసాలు ఏమిటి? అనే అంశాలను స్థూలంగా ఈ అధ్యాయంలో వివరిస్తాను. అంతే గాక సాహిత్య విమర్శలో చోటు చేసుకున్న ఈ పరిణామం నేటి సాహిత్య విమర్శకులకు ఏ విధంగా దోహదపడిందో తెలియజేస్తాను. "'రాచపాళెం' సాహిత్య విమర్శ చారిత్రక అధ్యయనం" అనే నా పరిశోధనాంశానికి సంబంధించి ఈ అధ్యాయం ఎంతో కీలకమైనదని భావిస్తున్నాను. కాబట్టి తెలుగు సాహిత్య విమర్శ పుట్టుక మొదలు, దాని పరిణామ, వికాసాలు ఈ అధ్యాయం ద్వారా తెలియపరుస్తాను.

## 2.1. విమర్శ నిర్వచనం

సాధారణార్థంలో విమర్శ అంటే తిట్టడం, నిందించడం, తప్పొప్పులను ఎంచడం అనే అర్థాలు ఉన్నాయి. కానీ సాహిత్యవిమర్శ అంటే సాహిత్యతత్వ వివేచనగా భావించవలసి ఉంటుంది. ఇక్కడ సాహిత్యతత్వ వివేచన అంటే ఏమిటి? అనే మరొక ప్రశ్న వేసుకోవలసి వస్తుంది. అసలు సాహిత్యతత్వ వివేచన ఎలా చేయాలి? కేవలం తప్పులను వెదకడమే సాహిత్య వివేచనా? కేవలం ఒప్పులను వెదకడమే సాహిత్య వివేచనా? లేక తప్పొప్పులను సమానంగా వెదకడమా? అనే ప్రశ్నలు మన ముందున్నాయి. కాబట్టి ఏది సాహిత్యవిమర్శ, దాని లక్షణాలు ఏమిటి అనే ప్రశ్నలకు అనేకమంది సాహిత్య కారులు అనేక రకాలైన నిర్వచనాలు చెప్పారు. వాటిని ఈ కింది విధంగా పరిశీలిద్దాం.విమర్శ అనే పదానికి ప్రాచ్య, పాశ్చాత్యులు ఈ కింది విధమైన నిర్వచనాలను ఇచ్చారు. అవి :

## 2.1.1 . విమర్శ – ప్రాచ్యుల నిర్వచనాలు

- విమర్శ అనగా వస్తు తత్త్వ నిరూపణం.[1]

  – ఎస్. వి.రామారావు

- విమర్శ గంభీరమైన సామాజిక బాధ్యత.[2]

  –రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి

- ఒక రచనలో దోషం చూపించాలంటే ఎంతో ఆత్మ విశ్వాసం ఉండాలి. దీర్ఘ వాదోపవాదాలకు సిద్ధమై ఉండాలి. కొంతైనా సాహసం ఉండాలి.[3]

  – రాచమల్లు రామచంద్రా రెడ్డి

- ప్రతి యుగంలోనూ సృజనాత్మక సాహిత్యానికి వినూత్న దర్శనాన్ని కానీ, అభినవానుశీలన విధానాన్ని కానీ అందించి ప్రయోగ ప్రస్థానాలకు ప్రగతి పథాలను చూపించేది సాహిత్య విమర్శ.[4]

  – జి వి సుబ్రహ్మణ్యం

- రచనలను వివరించడమూ, సమర్థించడమూ, వ్యతిరేకించడమూ, విశ్లేషించడమూఅంచనా కట్టడమూ వంటి పనుల్ని విమర్శగా భావిస్తారు.[5]

  –ఎస్ ఎస్ నళిని

- సాహిత్యాన్ని పరిశీలించి, సహృదయుని అనుభవాన్ని క్రమ బద్ధ మొనర్చడమే విమర్శ.[6]

---

[1] ఎస్.వి. రామారావు, "తెలుగులో సాహిత్య విమర్శ", పుట:1

[2] రాచపాళెం చంద్రశేఖర రెడ్డి "చర్చ ", పుట :51

[3] రాచమల్లు రామ చంద్రా రెడ్డి "సారస్వత వివేచన", పుట: 41

[4] జి వి సుబ్రహ్మణ్యం "ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం" పుట: 1

[5] ఎస్ ఎస్ నళిని సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ" పుట: 161

[6] వడలి మందేశ్వరరావు "సాహిత్యం – విమర్శ" పుట:1

– వడలి మందేశ్వర రావు

- ఒక రచనలోని వస్తు శిల్పాల ప్రత్యేకతలను ఆ రచన పుట్టిన సమాజం యొక్క సామాజిక మేథోగత చరిత్రతో అనుసంధించి, వివరించి విశ్లేషించే ప్రయత్నమే విమర్శ.[7]

–వల్లంపాటి వెంకట సుబ్బయ్య

- కప్పి ఉంచితే కవిత్వం, విప్పి చెబితే విమర్శ.

– సినారె

- ఒకరు చేసిన పనియందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట[8].

– పింగళి లక్ష్మీకాంతం

- విమర్శనమనగా నేదైనా గ్రంథమునుగానీ, కళారూపమును గానీ లెస్సగా పరిశీలించి, దానిని గూర్చి మననము చేసి చర్చా పురస్సరముగా నందలి బాగోగులను ప్రదర్శించుట.[9]

– దివాకర్ల వెంకటావధాని

### 2.1.2 . పాశ్చాత్యుల నిర్వచనాల

- 'To criticize' etymologically, meant 'to analyze' and later, 'to judge'. If usage were to be restricted to both these meanings some coherence could be given to a now dangerously over-extended term. Literary scholarship and literary history, then, should be so named and should be regarded as complementary to literary criticism, not as part of it. Critical theory too should be distinguished from criticism, since it

[7] వల్లంపాటి వెంకట సుబ్బయ్య "విమర్శ శిల్పం" పుట: 15

[8] పింగళి లక్ష్మీకాంతం *"సాహిత్య శిల్ప సమీక్ష"* పుట:190

[9] దివాకర్ల వెంకటావధాని "సాహిత్య సోపానాలు" పుట:1

concerns itself with the analysis of concepts rather than works[10].

-Peter Child's and Roger Fowler

- According to the Oxford English Dictionary criticism is the art of estimating the qualities and character of literary or artistic work; the function or work of a critic.

- Criticism, or more specifically literary criticism, is the overall term for studies concerned with defining, classifying, analyzing, interpreting, and evaluating works of literature. Theoretical criticism proposes an explicit theory of literature, in the sense of general principles, together with a set of terms, distinctions, and categories, to be applied to identifying and analyzing works of literature, as well as the criteria (the standards and norms) by which these works and their writers are to be evaluated[11].

-M H Abrams and Geoffrey Galt Harpham

- కళా రూపాల్ని అక్షర రూపంలో వ్యాఖ్యానించేది, వివరించేది విమర్శ.

  (Criticism is the commentation and exposition of works of art by means of written words.)[12]

- విమర్శ అంటే వస్తు తత్వాన్ని తెలిపేది, గుణ గణాల్ని వ్యాఖ్యానించేది. (Criticism may be regarded as having two different functions that is interpretation and that of judgement)

– T. S Eliot

[10] The Routledge Dictionary of Literary Terms, pg. No: 38
[11] A Glossary of Literary Terms, pg. no: 67
[12] The dynamics of criticism into Eliot by Mohammad hanief, Pg. No: 86

- అనుభూతుల తారతమ్యాలను వివేచించి వాటి విలువల్ని అంచనా వేసేదే విమర్శ.(Criticism as I understood, it is an endeavor to discriminate between experiences up to evaluate them)

  – I.A Richards

పై నిర్వచనాలను పరిశీలిస్తే మౌలికంగా విమర్శ అంటే ఒక శాస్త్రీయమైన విశ్లేషణ అని తేట తెల్లమౌతుంది.

## 2.2. రాచపాళెం సాహిత్య విమర్శ – 'శిల్పప్రభావతి' తో ప్రారంభం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తాను పరిశోధనలో ప్రవేశించే క్రమంలో పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని పరిశోధనాంశంగా ఎన్నుకున్నారు. ఈ పరిశోధన గ్రంథం తరువాతి కాలంలో 'శిల్ప ప్రభావతి' పేరుతో ప్రచురింపబడింది. ఈయన అంతకు ముందే కొన్ని చిన్న చిన్న సమీక్షాత్మక వ్యాసాలను రాసినప్పటికీ, ఆయన రాసిన శిల్ప ప్రభావతి గ్రంథాన్నే మొదటి విమర్శా గ్రంథంగా చెప్పవచ్చు. ఈయన సాహిత్య విమర్శ ప్రారంభాన్ని గమనించినట్లయితే తెలుగు సాహిత్య విమర్శను అనుసరించినట్టుగా అనిపిస్తుంది. తెలుగులో సాహిత్య విమర్శ ప్రారంభం కూడా ప్రాచీన సాహిత్యంలోని వివిధ విమర్శనాంశాలతో ప్రారంభమైందని చెప్పవచ్చు.దీనిని ఈ కింది విధంగా పరిశీలించవచ్చు.

## 2.3. తెలుగు సాహిత్య విమర్శ – పూర్వరంగం

తెలుగులో సాహిత్య విమర్శ అన్నది ఆధునిక కాలంలో వెలువడిన ఒక కొత్త శాస్త్రీయమైన ప్రక్రియ. అయితే ప్రాచీన కాలంలో సాహిత్య విమర్శ లేదని చెప్పలేము. ఎందుకంటే నాటి కాలంలో జరిగిన చర్చాగోష్ఠులు, సాహిత్య సమావేశాలు మొదలైన వాటిని కూడా విమర్శగానే పరిగణించాల్సి ఉంటుంది. సాహిత్య విమర్శ పూర్వరంగంలో కావ్యావతారికలు, లక్షణగ్రంథాలు, వ్యాఖ్యానాలు, చాటువులు, టీకలు రూపంలో ఉండేది. వాటిని ఈ కింది విధంగా వివరించవచ్చును.

### 2.3.1. కావ్యావతారికలు

తెలుగు వాఙ్మయ చరిత్రలో ఆదికవిగా ప్రసిద్ధి చెందిన నన్నయ తన మహాభారత అవతారికలో కవితా లక్షణాలను ఈ కింది విధంగా వివరించాడు.

**"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థ యుక్తిలో**
**నారసి మేలునితరులక్షరరమ్యత నాదరింపనా**
**నా రుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా**
**భారత సంహితా రచన బంధురడయ్యె జగద్ధితంబుగన్"**

అనే పద్యంలో నన్నయ కవిత్వ లక్షణాలను విమర్శనాత్మక దృష్టితో వివరించాడు. దీనిని కూడా విమర్శలో భాగంగానే పరిగణించాలి . తన రచనలో ప్రతి ఉపాఖ్యానంలోనూ ప్రసన్నమైన కథలతో కూడి అర్థ యుక్తమైన సూక్తులను పేర్కొనడం నన్నయ భారతంలో మనం గమనించవచ్చు. రాజరాజ నరేంద్రుడి కోరిక మేరకు సంస్కృత భారతాన్ని ఆంధ్రీకరించిన తరుణంలో వర్ణాశ్రమ ధర్మాలను నిలబెట్టడమే గాక మానవ జీవితం ఔన్నత్యవంతంగా ఉండడానికి కూడా అవసరమైన మార్గ నిర్దేశకాలను సూచించాడు.

అదేవిధంగా మహాభారతంలో శౌనకాది మహామునులు ప్రారంభంలో సూతున్ని కథ చెప్పమని కోరే సందర్భంలో ఎలాంటి కథ కావాలని సూతుడు వారిని అడుగగా వాళ్ళు....

**ఏయది హృద్య మపూర్వం**
**బేయది, యెద్దాని వినిన యెరుక సమగ్రం**
**బై యుండు, నఘనిబర్హణ**
**మేయది, యక్కథయ వినగ నిష్టము మాకున్** (1-1 -30)

తెలుగు సాహిత్య చరిత్రలో కావ్యానికి, మహా కావ్యానికి గల భేదాన్ని గురించి మొట్ట మొదటగా చెప్పిన సాహితీ స్రష్ట నన్నయ. ఆయన దృష్టిలో మహా కావ్యం అంటే హృద్యంగా అంటే మనసుకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, సంతోషాన్ని కలిగించేదిగా, అపూర్వంగా అంటే ఇంతకు ముందు వాఙ్మయ చరిత్రలో లేనిదై ఉండి, అఘనిబర్హణం అనగా చెడును

సంహరించేదిగా, ఏ కావ్యమైతే వింటూనే సమగ్రమైన జ్ఞానాన్ని ఇస్తుందో అలాంటి కావ్యాన్ని మహా కావ్యం అంటారని పైపద్యం ద్వారా చెప్పారు నన్నయ్య.

తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ తరువాత పేర్కొనదగిన కవి నన్నెచోడుడు. ఈయన తెలుగు సాహిత్యంలో అంతవరకూ ఆదరాభిమానాలను పొందుతూ వస్తున్న మార్గ కవిత్వాన్ని నిరసించి ఒక్కసారిగా దేశీ సాహిత్యం వైపు సాహిత్య కారుల చూపుని మళ్ళించాడు. నన్నెచోడుడికి పూర్వమే దేశి కవిత ఉన్నప్పటికీ నాటి చాళుక్య రాజుల ఆదరణ లేక అది నన్నెచోడుడి కాలానికి ఒక ప్రత్యేకమైన ఆదరణను పొందింది. నన్నెచోడుడు మార్గ కవిత్వాన్ని కుమార్గంగా పేర్కొన్నాడు. దీనిని ఈ కింది పద్యం ద్వారా వివరించాడు.

**మును మార్గకవిత లోకం**
**బున వెలయగ దేశీకవిత పుట్టించి తెనుం**
**గు నిలిపి రంధ్ర విషయంబున**
**జన సత్యాశ్రయముని దొట్టి చాళుక్య నృపుల్** (కుమా. ప్ర.23)

తెలుగు సాహిత్యంలో నన్నయ మొదటగా కావ్య నిర్వచనాన్ని చెప్పినట్టుగానే నన్నెచోడుడు కూడా మహా కావ్యం ఎలా ఉండాలి అనే దానికి ఈ కింది విధమైన వివరణ ఇచ్చాడు.

**మృదురీతి సూక్తు లింపొదవింప మేలిల్లు**
**భావమ్ము నెలమి క్రీడావహముగా**
**మెరుగుల గన్నులు మిరుమిట్లు వోవంగ**
**గాంతిసుధానూతికాంతి బెనయ**
**వర్ణనలెల్ల చో వర్ణ కెక్కంగ**
**రసములు దళుకొత్తి రాలువార**
**దేశీ మార్గంబులు దేశీయములుగా న**
**లంకారముల దానలకరింప**
**నాదరించి విని సదర్థాతిశయమున**

బుధులు నెమ్మనమున నిధులు నిలుప

వలవదే సమస్త వస్తు కవీశ్వర

నూత్న రుచిర కావ్య రత్న వీథి?

తనకు పూర్వులైన కవులను నుతించిన కుకవులను కవులను  నన్నెచోడుడు తీవ్రంగా విమర్శించాడు. గుణాలను దోషాలుగా చేసి విమర్శించే కుకవులను నన్నెచోడుడు ఈ కింది విధంగా దుయ్యబట్టాడు.

“నెరయ రసవంతమగు కృతి కెరగనేర

రల్ప రసకృతి కెరగుదు రల్పులెల్ల

జెరకు పిడిచిన రసమున కెరగిరాక

పిప్పి కరిగెడు నీగలపెల్లువోలె(1-30)

పై పద్యం ఆధారంగా అంటే చెడ్డ ప్రాచీన కవుల దృష్టిలో కుకవియే విమర్శకుడిగా భావింప వచ్చని, సహృదయత లోపించుటచే కేవల దోషాన్వేషణకు పూనుకొనిన విమర్శకులను కవులు అసహనంతో కుకవులని పేర్కొని ఉండవచ్చని చెప్పిన ఎస్వీ రామారావు గారి మాటలు సత్యదూరాలు కావు.

ఉరుతర గద్య పద్యోక్తులకంటే

సరసమై పరగిన జానుదెనుంగు

చర్చింపగా సర్వ సామాన్యమగుట

గూర్చెద ద్విపదలు గోర్కిదై వార

దెలుగు మాట లనంగ వలదు,వేదములు

కొలదియకాజూడు డిలనెట్టులనిన

బాటితుమునకును బాటియౌనేని

బాటింప సోలయుబాటియకాదె

**అల్పాక్షరముల ననల్పార్ధరచన**

**కల్పించుటయకాదె కవి వివేకంబు**

తెలుగు వాఙ్మయ సాహిత్యంలో నన్నయ పాటించిన మార్గ సాహిత్యాన్ని కాదని నన్నెచోడుడు తరువాత పాల్కురికి సోమన దేశి సాహిత్యన్ని పాటించి అల్పాక్షరములతో అనల్పార్ధరచనలు చేసి,తన తరువాత వచ్చిన కవి లోకానికి అల్పాక్షరముల ననల్పార్ధరచన చేయాలని దిశానిర్దేశం చేసాడు.

**శబ్దంబు ననుసరించియు**

**అభిప్రాయంబు గుర్తించియు**

**భావంబు పలక్షించియు**

**రసంబు పోషించియు**

**అలంకారంబు భూషించియు**

**ఔచిత్యం బాదరించియు**

**అనౌచిత్యం బరిహరించియు**

పై పద్యంలో తిక్కన సోమయాజి కావ్య రచనలో తాను ఉపయోగిస్తున్న పద్దతిని, తన పూర్వీకుల సాహిత్య సృజనను ఆలంబనగా చేసుకొని కావ్యం రచిస్తానని తన కావ్యావతారికలో చెప్పుకున్నాడు.

అదేవిధంగా ఈ కింది పద్యంలో కవి సార్వభౌముడు శ్రీనాథుడు ఎవరి కవిత్వంలో ఏ గుణం ప్రధానమో వివరించడం లోతైన విమర్శకి నిదర్శనం.

**వచియుంతు వేములవాడ భీమన భంగినుద్దండ లీల నొక్కొక్కమాటు**

**భాషింతు నన్నయ భట్టు మార్గంబున నుభయ వాక్ప్రౌడి  నొక్కొక్కమాటు**

**వాకృత్తు తిక్కయజ్వ ప్రకారంబు రసాభ్యుచిత బంధమున నొక్కొక్కమాటు**

**పరిడవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు**

**నైషదాంధ్రీ మహా ప్రబంధములు పెక్కు**

**చెప్పినాడవు మాకు నాశ్రితుడ వనఘ**

**ఇప్పుడు చెప్పదొడంగిన యీ ప్రబంధ**

**మంకితము సేయు వీరభద్రయ్య పేర (కాశీ. 1.18)**

పైన వివరించినట్టుగా శ్రీనాథ మహాకవి అభిప్రాయాలను గమనించినట్లైతే తన పూర్వీకుల రచనా విశేషాలను ఆదర్శంగా తీసుకొని తను రచనకు పూనుకుంటానని చెప్పుకున్నాడు. ఈ విధమైన విమర్శనా రీతిని మనం ప్రాచీన కాలంలో గమనించవచ్చు.

## 2.3.2. లక్షణ గ్రంథాలు

లక్షణ గ్రంథాలను కూడా సాహిత్య విమర్శలో భాగంగా చెప్పవచ్చును. లక్షణ గ్రంథాలలోని అంశాలను వివరించే క్రమంలో వాటి స్వభావాలలో విమర్శ ఉందని చెప్పవచ్చును. తెలుగు భాషకి సంస్కృతంలో నన్నయ "ఆంధ్ర శబ్దచింతామణి"అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలో కావ్యప్రయోజనాన్ని తెలియజేస్తూ "విశ్వ శ్రేయః కావ్యమ్' అని చెప్పారు. మల్లియ రేచన రచించిన 'కవిజనాశ్రయం' అనే లక్షణ గ్రంథంలో కావ్య దోషాలు, కావ్య భేదాలు వివరించారు. ఆంధ్ర భాషా భూషణం అనే వ్యాకరణ గ్రంథాన్ని కేతన తెలుగులో రచించారు. మొట్టమొదటి తెలుగు వ్యాకరణ గ్రంథంగా దీనిని పేర్కొంటారు. ఈ గ్రంథ నేపథ్యాన్ని గురించి కేతన ....

**సంస్కృత ప్రాకృతాది లక్షణముఁ జెప్పి**

**తెనుఁగునకు లక్షణముఁ జెప్ప కునికి యెల్లఁ**

**గవిజనంబుల నేరమి గాదు నన్ను**

**ధన్యుఁ గావింపఁ దలఁచినతలఁపుగాని (పద్యం.6. పుట:2)**

సంస్కృతం, ప్రాకృతం వంటి భాషల లక్షణాలు వివరించే వ్యాకరణ గ్రంథాలున్నాయి కాని తెలుగుకు లక్షణ గ్రంథం లేకపోవడం పూర్వ కవుల నేరం కాదు. నన్ను ధన్యుడిని చెయ్యడానికే వారు ఈ పనిని నాకోసం వదిలివేశారు. అని చెప్పుకున్నారు.

అదే విధంగా14వ శతాబ్దికి చెందిన విన్నకోట పెద్దన తన 'కావ్యాలంకార చూడామణి'లో మొత్తం తొమ్మిది అధ్యాయాలలో మొదటి ఆరు అధ్యాయాలలో కావ్య లక్షణాలను గురించి, ఏడు, ఎనిమిది అధ్యాయాలు ఛందస్సు గురించి చివరి అధ్యాయంలో తెలుగు వ్యాకరణం గురించి వివరించారు. ఈ గ్రంథంలోని అధ్యాయాలను విన్నకోట పెద్దన ఉల్లాసములు అని పేర్కొన్నాడు. ఈ విషయాలన్నీ సాహిత్య విమర్శ కిందకే వస్తాయి.

తెలుగు వ్యాకరణాలలో ఎంతో ప్రసిద్ధి చెందిన గ్రంథం అప్పకవీయము. అప్పకవి తన గ్రంథంలోనే చెప్పుకున్నట్లు, ఆయన శాలివాహన శకం 1578లో (అంటే క్రీ. శ. 1656లో) ఈ గ్రంథ రచనకు శ్రీకారం చుట్టాడు. నిజానికి ఇది ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యాన గ్రంథం. ఆంధ్రశబ్దచింతామణిలో స్థూలంగా చెప్పిన సూత్రాలను విస్తారమైన వ్యాఖ్యానాలతో వివరించడం వల్ల ఈ గ్రంథం గొప్ప ప్రామాణికతను సంతరించుకొంది. తెలుగు కవుల అసాధు ప్రయోగాలను, ఇతర వైయాకరణుల గ్రంథాలలో తనకు నచ్చని అంశాలను పరుషంగా విమర్శించడంలో అప్పకవి ఏ మాత్రం వెనుకాడలేదు.

అలంకారాలు, వ్యాకరణం, ఛందస్సు మొదలైనవి కావ్య రచనకు ఆధార భూతాలు కాబట్టి వాటిని గురించి లక్షణ కర్తలు వివరించారు. ఈవిధమైనటువంటి లాక్షణిక చర్చలు, భేదాభిప్రాయాలు మొదలుగా గల విషయాలన్నీ సాహిత్య విమర్శలో భాగంగానే పరిగణించాలి.

### 2.3.3. చాటువులు

చతుర్విధ కవితా రూపాలలో ఆశుకవిత ఒకటి. "చతుర్విధ కవిత ప్రాచీనాంధ్ర లక్షణ కర్తలు ఆశు–మధుర – చిత్ర– విస్తర కవితా మయమని అర్థము చెప్పిరి". (మీగడ తరగలు.పుట:93) చతుర్విధ కవితా నిర్వాహకుడని రామరాజ భూషణుడు రాసినాడు. (వసు చరిత్రము1–167).

ఆశు కవిత్వంలో చాటువులను ఒక రకంగా పరిగణించవచ్చు. ఈ చాటు పద్యాలలో కూడా కవి, కావ్య విమర్శలు చోటు చేసుకున్నాయి. తెలుగులో తొలి చాటుకవిగా

వేములవాడ భీమ కవిని చెబుతారు. కానీ ఈయన చాటువుల్లో వ్యక్తిగత విమర్శ తప్ప, కావ్యగత విమర్శ కనపడదు. ఆ తరువాత శ్రీనాథుడు తెలుగు కవులలోకెల్లా అత్యధికంగా చాటువులను చెప్పాడు. దేశ సంచారం చేయటం వలన ఈ చాటువుల రచన తనకు సాధ్యమైనదని చెప్పవచ్చు. అదేవిధంగాపెద్దన తన చాటు పద్యం ద్వారా "ఒప్పు తప్పరయు రసజ్ఞులు" అవసరమని. మంచి రచనలు చేయడానికి అవసరమైన కవితా సామగ్రిని ఈ కింది పద్యంలో చెప్పాడు.

**నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క**
**ప్పురవిడె మాత్మకింపయిన భోజన మూయలమంచ మొప్పు త**
**ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్**
**దొరికినగాని యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే!**

తెలుగు సాహిత్య చరిత్రలో వికటకవిగా పేరు పొందిన తెనాలి రామకృష్ణుడు ఈ కింది చాటువు ద్వారా కవిత్వ విమర్శ చేస్తున్నాడు.

**"ప్రౌఢ దీర్ఘ సమాసముల గూర్చి**
**శ్రీనాథుడు కూలార్చే నైషధంబు**
**దాని తల్లిగ అల్లసాని పెద్దన చెప్పె**
**ముదిమది తప్పి ఆముక్తమాల్యద**
**దూహించి తెలియరాకుండ సురపరాజు**
**భ్రమ కళా పూర్ణోదయము రచించె**
**అతి శ్లేష శబ్ద వాగాడంబరంబొప్ప**
**పస ఘటించెను మూర్తి వసుచరిత్ర"**

పై విధంగా చాటువులలో వ్యక్తి దూషణలు, సాహిత్య చర్చలు, లోకరీతి మొదలైనవి వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాలన్నింటినీ సాహిత్య విమర్శ రూపాలుగా పేర్కొనవచ్చు.

## 2.3.4. వ్యాఖ్యానాలు

కావ్యంలోని ఆలంకారికతను తెలియజేస్తూ కవి హృదయాన్ని ఆవిష్కరించడంలో కావ్య వ్యాఖ్యానాలు ప్రముఖ పాత్ర వహించాయి. కవిని పునరుజ్జీవింపజేసి కావ్య పరమార్థాన్ని పాఠకులకు విశదపరచాలనే క్రమంలో వెలసిన ఈ వ్యాఖ్యానాలు సాహిత్యాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తాయి. విమర్శ ప్రాథమిక దశ రూపంలో భాగంగా కావ్యావతారికలు, లక్షణ గ్రంథాలు, చాటువుల తర్వాత అత్యంత ప్రాధాన్యం ఉన్న అంశంగా వీటిని గుర్తించారు. ఈ వ్యాఖ్యానాలను ప్రాచీన కాలంలో విశిష్టమైన సాహిత్య విమర్శగా పరిగణించారు.

16 వ శతాబ్దం నుండి తెలుగులో వ్యాఖ్యానాల రచన మొదలైందని తెలుస్తుంది. ముద్దరాజు పెద్దరామన రాఘవపాండవీయానికి రాసిన *'ఆదర్శ వ్యాఖ్య'* తెలుగులో తొలి వ్యాఖ్యానంగా చెప్పవచ్చు. అంతే కాకుండా శృంగార నైషధ కావ్యానికి కేతవరపు వెంకటశాస్త్రిగారు రాసిన *'గూఢార్థ ప్రకాశినీ వ్యాఖ్య,* వేదం వేంకటరాయశాస్త్రిగారి *'సర్వంకషవ్యాఖ్యలు'*, *'ఆముక్తమాల్యద'* కావ్యానికి వావిళ్ళ రామస్వామిశాస్త్రులు రాసిన *'రుచి వ్యాఖ్యాసహితం'*, వేదం వేంకటరాయశాస్త్రి రాసిన *'సంజీవనీ వ్యాఖ్య'*, తుమ్మపూడి కోటేశ్వరరావు *'సౌందర్యలహరీ వ్యాఖ్యానం'* విజయవిలాస కావ్యానికి తాపీ ధర్మారావు రాసిన *'హృదయోల్లాసవ్యాఖ్య'లను* ముఖ్యమైనవిగా చెప్పవచ్చును.

పై విధంగా సాహిత్య విమర్శ ప్రాథమిక దశలో కావ్యం, కవులు, శైలి, ఛందస్సు వంటి వాటిపై వెలిబుచ్చిన అభిప్రాయాలు కావ్య విమర్శలో భాగంగా ఉండేవి. వ్యాఖ్యానాలలో చాలా వరకు సాహిత్య విమర్శ కనపడుతుంది. వ్యాఖ్యాతలను విమర్శకులుగా భావించవచ్చు.

## 2.4. తెలుగు సాహిత్య విమర్శ – వికాస దశ

తెలుగు సాహిత్య విమర్శా చరిత్రలో కందుకూరి వీరేశలింగం గారిని ప్రథమ విమర్శకులుగా చెప్పవచ్చును. అయితే ఆయన కన్నా ముందు కావలి వెంకట రామస్వామి

రచించిన *"బయోగ్రాఫికాల్ స్కెచెస్ ఆఫ్ దక్కన్ పోయెట్స్ (1829)"* పీఠికలోనూ, సి. పి బ్రౌన్ పరిష్కరించి వెలువరించిన గ్రంథాలకు రాసిన పీఠికలలోను, వివిధ గ్రంథములకు ఆయన రాసుకున్న 'నోట్సు' రూపంలో రేఖాప్రాయంగా, 'కామెంట్స్' రూపంగా సాహిత్య విమర్శ కొంత స్ఫురించకపోదని, కోవెల సంపత్కుమారాచార్య అన్నారు.[13] అయితే అదంతా ఆంగ్లంలోనే ఉండటం వల్ల అప్పటికి సాహిత్య విమర్శ తెలుగులో లేదనే చెబుతారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు "తెలుగు సాహితీ సుక్షేత్రమునందు విమర్శనా స్రవంతిని అవతరింప చేసిన భగీరథుడు కందుకూరి వీరేశలింగం పంతులు" అని చెప్పిన మాటలను బట్టి విమర్శ అవతరణకు ఆద్యుడుగా కందుకూరి వీరేశలింగం అని తెలుస్తుంది. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో విమర్శ తెలుగులో ప్రవేశించింది. మన దేశాన్ని ఆంగ్లేయులు 1947 దాకా పరిపాలించారు. ఇదే శతాబ్ది చివరలో కందుకూరి వీరేశలింగం గారు తెలుగులో అన్ని సాహిత్య ప్రక్రియలను స్పృశించారు. కొక్కొండ వేంకటరత్నం పంతులు రాసిన 'విగ్రహతంత్రం'పై *"విగ్రహతంత్ర విమర్శనం(1876)"* అనే విమర్శ గ్రంథం రాసి 'వివేక వర్ధిని' పత్రికలో ప్రచురించారు. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి కందుకూరి వీరేశలింగం నవల 'రాజశేఖర చరిత్ర'పై 'వివేక చంద్రికా దర్శనం' పేరుతో విమర్శ వ్యాసం రాశారు. వీరేశలింగం క్షీణ యుగాన్ని విమర్శిస్తూ *'సరస్వతీ నారద విలాపం'* పేరుతో పద్య గ్రంథం రాశారు. వీటిని తెలుగు సాహిత్య విమర్శకు నేపథ్యాలుగా భావించవచ్చు. ఇదే సమయంలో పత్రికల వ్యాప్తి వలన తెలుగులో సాహిత్య విమర్శ వికాసవంతమైనదని పేర్కొనవచ్చు. కందుకూరి వీరేశలింగం గారి *"వివేకవర్ధిని"* పత్రిక ఈ సమయంలో అనేక రకాలైన విమర్శనా వ్యాసాలను ప్రచురించేది. శృంగార కావ్యాలను విమర్శిస్తూ *"అభాగ్యోపాఖ్యానం"*, ప్రబంధాలను విమర్శిస్తూ *"సరస్వతీ నారద విలాపం"*, అనే కావ్యాలను రచించారు. అందుకనే వీరేశలింగం యుగంలో విమర్శ వికాసాన్ని పొందిందని చెప్తారు. ఈ యుగాన్నే 'అవతరణ యుగం' అని కూడా అంటారు.

---

[13] కోవెల సంపత్కుమారాచార్య *"ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ – సాంప్రదాయిక రీతి"* పుట: 16

కందుకూరి వీరేశలింగం గారు రచించిన *'ఆంధ్రకవుల చరిత్ర'* ఆయనలోని విమర్శనా శక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ గ్రంథంలో అనేక సాహిత్యచర్చలు జరిగాయి. అంతేగాకుండా నాచన సోమనకవిత్వం ఎఱ్ఱన కవిత్వం కంటే బాగుందన్నారు. శేషం వేంకటపతి రాసిన *"శశాంక విజయం"* కావ్యాన్ని తీవ్రంగా విమర్శించారు. *"ఆంధ్ర కవుల చరిత్ర'*లో వేమన గురించి లేకపోవడం విమర్శలకు దారి తీసిందని చెప్పవచ్చు.

*"మను వసుచరిత్ర రచనా విమర్శనము"* పేరుతో వెన్నేటి రామచంద్రరావు 1899లో తులనాత్మక విమర్శకు పునాదులు వేశారు. ఇందులో వస్తు, శిల్పాలకు సంబంధించిన చర్చ ప్రధానమైనదిగా తెలుస్తుంది. మను చరిత్ర, వసుచరిత్ర కావ్యాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి విమర్శించి "మను చరిత్ర యందలి స్వభావ వర్ణనలందు గలుగు పరిపూర్ణ రసము వసుచరిత్ర వర్ణనలందు గలుగుట లేదని"[14] అన్నారు. ఆ తరువాత అనేక సాహిత్య పత్రికలు వెలువడి విమర్శను మరింత పరిపుష్టం చేశాయి. అట్టి పత్రికల్లో కొక్కొండ వేంకటరత్నం సంపాదకులుగా ఉన్న "ఆంధ్ర భాషా సంజీవని", పూండ్ల రామకృష్ణయ్య సంపాదకులుగా ఉన్న "ఆముద్రిత గ్రంథ చింతామణి" పత్రికలు ముఖ్యమైనవి. పై విధంగా తెలుగు సాహిత్య విమర్శకు పునాదులు పడ్డాయి. అయితే తెలుగు సాహిత్య విమర్శకు ఒక కొత్త మార్గాన్ని చూపిన వాడు కట్టమంచి రామలింగారెడ్డి. ఈయన తన *"కవిత్వతత్త్వ విచారం"* అనే విమర్శ గ్రంథంతో తెలుగు సాహిత్య విమర్శను కొత్త పుంతలు తొక్కించాడు. పింగళి లక్ష్మీకాంతం విమర్శను బాహిర జగత్తు నుండి అంతర జగత్తుకు కొనిపోయిన వారిగా కట్టమంచి రామలింగారెడ్డి గారిని పేర్కొన్నారు.

*"కవిత్వ తత్త్వ విచారం"* లో కట్టమంచి రామలింగారెడ్డి 'భావనాశక్తి' అనే కొత్త దృక్పథాన్ని ప్రతిపాదించారు. "భావనాశక్తియనగా విషయములను మనసులో

---

[14] వెన్నేటి రామచంద్రరావు *"మను వసుచరిత్ర రచనా విమర్శనము"*, పుట: 46

ప్రతిబింబించునట్లు చేయు సామర్థ్య"మని ఆయనంటారు.[15] ఈగ్రంథంతోనే తెలుగులో ఆధునిక సాహిత్యవిమర్శ ప్రారంభమైనదని చెప్పవచ్చు.

19వ శతాబ్దం వరకు తెలుగు సాహిత్యరంగంలో సాహిత్యవిమర్శ లేదు. అంతేకాదు తెలుగులో సంస్కృతానికి భిన్నమైన సాహిత్యసిద్ధాంతం కూడా లేదు. దాదాపు ఏడువందల సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో ఒక యుగాన్నో, ధోరణినో, కావ్యాన్నో పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ ఎవరూ విమర్శ రాయలేదు. కవుల చరిత్రలూ, వ్యాఖ్యానాలూ మాత్రమే సాహిత్యవిమర్శగా చెలామణి అవుతుండేవి. ముఖ్యంగా ఒక కావ్యాన్ని తీసుకొని అందులోని వస్తువునూ, రూపాన్నీ విశ్లేషిస్తూ, వాటి పరస్పర సామంజస్యాన్ని చర్చిస్తూ, ఆ కావ్య ఉద్దేశాన్ని నిరూపిస్తూ విమర్శలు రాసే సంప్రదాయం అప్పటికింకా ప్రారంభం కాలేదు. కవిత్వవిమర్శ మొత్తం కావ్యం ప్రాతిపదికగా కాకుండా ఒక పద్యమో, శ్లోకమో ప్రాతిపదికగా సాగుతూ వచ్చింది. ఈ ధోరణికి స్వస్తి చెప్పి ఒక కావ్యాన్ని సమగ్రంగా విశ్లేషించే విమర్శకు రామలింగారెడ్డి గారు *"కవిత్వతత్వవిచారం'*లో బాటలు వేశారని వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు చెప్పారు[16].

## 2.5. ప్రాచీన సాహిత్య విమర్శ

సాహిత్య విమర్శ పద్ధతులను రెండు రకాలుగా చెప్పవచ్చును. అవి ఒకటి ప్రాచీన సాహిత్య విమర్శ పద్ధతి, రెండోది ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతి. ప్రాచీన ఆలంకారికుల లక్షణ శాస్త్రాల్ని అధ్యయనం చేసి కావ్య లక్షణాలను వెలువరించడమే 'ప్రాచీన సాహిత్య విమర్శ'గా చెప్పవచ్చు. అయితే ఈరకమైన విమర్శలో స్థూలంగా ఏయే అంశాలు చోటుచేసుకుంటాయో పరిశీలిస్తే రసాలంకారాదులు, రీతి, గుణ, ధ్వని, ఔచిత్యాల పరిశీలన, విశ్లేషణల సమాహారంగా చెప్పవచ్చు. అయితే ఒక గ్రంథంలోని లోపాలోపాలను, ఔచిత్య, అనౌచిత్యాలను, భావ గంభీరతను, అలంకార రచనా పాటవాన్ని, ధ్వని విశేషాల్ని, శయ్యా

[15] కట్టమంచి రామలింగారెడ్డి *'కవిత్వ తత్వ విచారం'*, పుట:12

[16] కట్టమంచి వారి *'కవిత్వ తత్వ విచారం'* పై అంతర్జాల పత్రిక 'ఈమాట'లో వ్యాసం

సౌభాగ్యాన్ని, వస్తు నిర్మాణ సౌష్టవాన్ని, పాత్ర పోషణ, రస పోషణ, సన్నివేశ కల్పనలను, ఆ గ్రంథానికి సంబంధించిన సర్వ విషయాలను కూలంకషంగా చర్చించి సాహిత్యంలో ఆ గ్రంథానికి ఉన్న స్థానాన్ని నిర్ణయించడాన్ని స్థూలంగా 'ప్రాచీన సాహిత్య విమర్శ' అంటారు.

## 2.5.1. రసం

రస సిద్ధాంతం భారతీయ కావ్య సిద్ధాంతాలలోనే ప్రథమమైనది. అతి ప్రాచీనమైనది. రసం, ధ్వని, గుణౌచిత్యాదులలో ఏది కావ్యానికి ఆత్మ అని ఎన్నో చర్చలు జరిగాయి. వీటిలో ప్రధానమైనది రసమే అని ఆలంకారికులు గుర్తించారు. ఈ రస సిద్ధాంతాన్ని కావ్యానికి ఆత్మగా పేర్కొనవచ్చును. అందుకే విశ్వనాథుడు 'వాక్యం రసాత్మకం కావ్యం' అనీ, 'రసేనైవ జీవతి సర్వం' అని అభినవ గుప్తుడు వంటి ప్రాచీన ఆలంకారికులు రస సిద్ధాంత ప్రాధాన్యతను తెలుపగా, 'రసము వేయి రెట్లు గొప్పది నవ కథాదృతిని మించి' అని విశ్వనాథ సత్యనారాయణ, 'కానీవోయ్ రస నిర్దేశం' అని శ్రీశ్రీ వంటి అధునికుల వల్ల కావ్య రచనలో రస సిద్ధాంత ఆవశ్యకత తెలుస్తుంది.

## 2.5.2. ధ్వని

భారతీయ అలంకారశాస్త్రంలో ధ్వని ప్రధానమైనది. ధ్వని సిద్ధాంత ప్రవర్తకుడు ఆనందవర్ధనుడు. 'ధ్వన్యాలోకం' అనే ఆలంకారిక గ్రంథంలో ధ్వని సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ధ్వనిని 'కావ్యాత్మ' గా పేర్కొంటారు. కావ్యంలో ఏదైతే వాచ్యం చేయడానికి వీలుకాదో అదే ధ్వని అని ఆనందవర్ధనుడు సిద్ధాంతీకరించారు. వ్యంగ్య ప్రధానమైన కావ్యాన్ని ఉత్తమ కావ్యం అని అంటారు. ధ్వనికావ్యం అనే మరో పేరు కూడా దీనికి ఉంది.

## 2.5.3. ఔచిత్యం

రసవాది అభినవ గుప్తుని శిష్యుడైన క్షేమేంద్రుడు కాశ్మీర దేశానికి చెందిన సంస్కృత కవి, అలంకారికుడు. ఈయన రచించిన 'ఔచిత్య విచార చర్చ' అనే గ్రంథంలో ఔచిత్యమే

కావ్యానికి జీవితం అని పేర్కొన్నాడు. కావ్యంలో ఔచిత్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఆనందవర్ధనుడు వివరిస్తూ

**"అనౌచిత్యాదృతే నాన్యద్రసభంగస్య కారణమ్**

**ప్రసిద్ధౌ చిత్యబన్దస్తు రసస్యోపనిషత్ పరా"(ధ్వన్యాలోకం 314)**

రస భంగానికి అనౌచిత్యాన్ని మించిన కారణం ఏదీ లేదు. ఔచిత్యాన్ని పాటించడం రసానికి సంబంధించిన గొప్ప ఉపనిషత్తు (రహస్యం) అని పేర్కొన్నాడు.

## 2.6. 'తంగెడు పూల'తో ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు ఆధునిక సాహిత్య విమర్శ ఆచార్య ఎన్.గోపి రచించిన 'తంగేడు పూలు' కావ్య విశ్లేషణతో ప్రారంభమైంది. తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వెలువడిందని విమర్శకులు అందరు ఇప్పటికే పేర్కొని ఉన్నా కూడా ఆచార్య రాచపాళెం పై మాత్రం అటువంటి పాశ్చాత్య సాహిత్య ప్రభావం పడినట్టుగా కనిపించలేదు. అయితే అప్పటికే పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో విమర్శ రచనలు చేసి ఉన్న కట్టమంచి రామలింగా రెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, రాచమల్లు రామ చంద్రా రెడ్డి మొదలైన సాహిత్య విమర్శకుల ప్రభావం ఈయన పై కొంత వరకు ఉన్నట్లు తెలుస్తుంది. తెలుగులో ఆంగ్ల సాహిత్య విమర్శ ప్రభావం ఏ విధంగా ఉందనే విషయాన్నీ కింది విధంగా విశ్లేషించుకోవచ్చు.

## 2.7. ఆధునిక సాహిత్య విమర్శ

తెలుగులో సాహిత్య విమర్శ ప్రాచీన కాలంలో నుండి ఉందని భావించినప్పటికీ విమర్శ అనేది ఒక సాహిత్య ప్రక్రియగా ఆధునిక కాలంలోనే పుట్టిందని చెప్పవచ్చు.

ఈ ఆధునిక సాహిత్య విమర్శ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చింది. ఈ కాలంలో తొలితరం విమర్శకులుగా భావిస్తున్న కట్టమంచి రామలింగారెడ్డి వారి విమర్శనా రచనలను ఉదాహరణలుగా చెప్పవచ్చు. అయితే ఈ ఆధునిక సాహిత్య విమర్శ

నిర్మాణాన్ని గురించి తెలియాలంటే పాశ్చాత్య సాహిత్య విమర్శ ప్రక్రియలను, విమర్శ దృక్పథాలను అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం గారు తన "ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం" అనే విమర్శన గ్రంథంలోని ఎనిమిదవ అధ్యాయంలో ఈ పాశ్చాత్య ప్రభావాన్ని గురించి సమీక్షించారు.

జి. వి. సుబ్రహ్మణ్యం గారు తెలుగులో సాహిత్య విమర్శపై ఆంగ్ల ప్రభావాన్ని గురించి చెబుతూ "ఏ సాహిత్యంలోనైనా అన్య సాహిత్య ప్రభావం ఒక్క విమర్శకుల పైనే పడదు. ఇతర సాహిత్య ప్రక్రియలను నిర్వహించే రచయితల పైన కూడా పడుతుంది. వారిలో ఉత్తమ విమర్శకులుగా రాణింపదగిన శక్తి సామర్థ్యాలున్నా, సృజనాత్మక రచనా వ్యాసంగంలో కృషి సాగిస్తూ, ఆ రచనలలో తమ దార్శనిక శక్తినో, దృక్పథ విశేషాన్నో ఆలోచన వైఖరినో, విమర్శా వివేకాన్నో పొదిగి పెడుతూ ఉంటారు. వారి ఆలోచనా ప్రభావం విమర్శ క్షేత్రంలో వెలుగులు చల్లుతూ ఉండవచ్చును"[17] అన్న మాటలను బట్టి తెలుగులోని ఇతర సాహిత్య ప్రక్రియల కంటే విమర్శ ప్రక్రియపై పాశ్చత్య సాహిత్య ప్రభావం ఎక్కువని తెలుస్తుంది. ఈయన తన గ్రంథంలో పాశ్చాత్య సాహిత్య విమర్శను గ్రీకు, లాటిన్, రోమన్, ఎలిజబెతన్, రెస్టోరేషన్, నియో క్లాసికల్, రొమాంటిక్, విక్టోరియన్, ఆధునికం అని అనేక రకాలుగా వింగడించారు. ఈ నేపథ్యంలో ఎన్నో విమర్శనా దృక్పథాలు వెలువడ్డాయని చెప్పవచ్చు. ఆధునిక సాహిత్య విమర్శలో అనేక రకాలైన విమర్శ భేదాలు కనిపిస్తాయి. దీనికి ప్రక్రియా నిర్మాణ వైవిధ్యతను ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

తెలుగులో సాహిత్య విమర్శ పరిణామాన్ని ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం గారు ఈ కింది విధంగా విభజించారు. [18]

1. గ్రంథ పరిష్కార విమర్శ యుగం
2. వికాస యుగం

[17] '*ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం*' జీ. వి సుబ్రహ్మణ్యం, పుట.12

[18] '*ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం*' జీ. వి సుబ్రహ్మణ్యం, పుట.159

3. కావ్యానుశీలన యుగం
4. శిల్పానుశీలన యుగం
5. సమన్వయ యుగం
6. పరిశోధన యుగం
7. సమీక్షా యుగం
8. ఉద్యమ విమర్శ యుగం

పైన పేర్కొన్న అనేక యుగాలలో వెలువడిన వివిధ విమర్శనా పద్ధతులు ఆవిర్భవించాయి. ఈ నేపథ్యంలో ఆ విధంగా ఏర్పడిన అనేక విమర్శనా పద్ధతులను విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాచీన కాలం నుండి సాహిత్య విమర్శ ఒక ప్రక్రియగా ఈ విధంగా రూపాంతరం చెందిదనే విషయం ఈ కింది పద్ధతుల వల్ల తెలుస్తుంది.

## 2.7.1. గ్రాంథిక విమర్శ

గ్రాంథిక విమర్శ అనేది ఒక గ్రంథానికి మాత్రమే సంబంధించినది. కాబట్టి ఆ గ్రంథంలోని విషయాలకు తప్ప ఇతర విషయాలకు ప్రాధాన్యతను ఇవ్వరు. ఈ రకమైన విమర్శకు గ్రంథమే ప్రమాణం. రచనా పద్ధతి, పాత్రలు,వర్ణన, ఛందస్సు మొదలైన వాటి గురించి చేసే విమర్శే గ్రాంథిక విమర్శ అవుతుంది. వాస్తవానికి ఇది ప్రాచీన కాలానికి సంబంధించినదే అయినా, నేటి ఆధునిక కాలంలో కూడా ఈ పద్ధతినే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

## 2.7.2. గ్రంథ పరిష్కార విమర్శ

సి. పి. బ్రౌన్, కల్నల్ కాలిన్ మెకంజీ గ్రంథ పరిష్కార విమర్శకు కృషి చేసారు. ఒక రచనకు సంబంధించిన అనేక ప్రతుల్ని తీసుకొని, వివిధ అంశాలను పరిశీలించి, సరైన శుద్ధ ప్రతిని నిర్ణయించటానికి చేసే విమర్శనే గ్రంథ పరిష్కార విమర్శ అంటారు. ఈ రకమైన విమర్శలో సరైన పాఠాన్ని నిర్ణయించడం, ప్రక్షిప్తాలను గుర్తించడం, పూర్వపరాలను

చర్చించడం మొదలైనవి ముఖ్యాంశాలుగా ఉంటాయి. కవి ఉద్దేశించిన అర్థాన్ని పరిశీలించి అవగాహన చేసుకోవడం,కాల నిర్ణయం, రచన మూలం తులనాత్మకత వంటివి గ్రంథ పరిష్కార విమర్శకు ఆయువుపట్టులని చెప్పవచ్చును.

### 2.7.3. చారిత్రక విమర్శ

ఒక రచనలోని వివిధ అంశాల్ని చారిత్రక దృష్టితో పరిశీలించి, పూర్వాపర సంబంధాల్ని, స్వరూప స్వభావాల్ని వివరించే విమర్శ చారిత్రక విమర్శ అవుతుంది. దీనినే తొలి సమగ్ర శాస్త్రీయ విమర్శగా పేర్కొంటారు. ఒక గ్రంథం ఏ యుగంలో వెలువడిందో అప్పటి పరిస్థితులు ఏమిటో, ఆ యుగ లక్షణాలు ఆ గ్రంథంలో ఏ మేరకు ప్రతిఫలిస్తున్నాయో విశ్లేషించేది చారిత్రక విమర్శ. ఒక రచయిత రచన మీద అనేకమైన సాంఘీక, రాజకీయ పరిస్థితుల ప్రభావం ఉంటుంది. ప్రాచీన సాహిత్యాన్ని నేడు విశ్లేషించినా అప్పటి పరిస్థితులకు అనుగుణంగానే విశ్లేషించవలసి ఉంటుంది.

### 2.7.4. సాంఘిక విమర్శ

ఫ్రాన్స్ దేశానికి చెందిన 'టెయిన్' ను సాంఘీక విమర్శకు ఆద్యుడుగా చెప్తారు. ఈయన సమాజం, పరిసరాలు, ఆచార వ్యవహారాలే సాహిత్యమని ప్రకటించాడు. అరిస్టాటిల్ మానవుడు సంఘ జీవి అన్నాడు. అదేవిధంగాకవిని కూడా సంఘ జీవిగానే పేర్కొనవచ్చును. సమకాలీన సమాజాన్ని ప్రతి కవి తన రచనల్లో ప్రతిఫలింప చేస్తాడు. తిక్కన భారతంలో, శ్రీనాథుని చాటు కవితల్లో, శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో సమకాలీన సమాజంలోని విశేషాలెన్నో ఉన్నాయి.

### 2.7.5. మనో వైజ్ఞానిక విమర్శ

సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్ ప్రవేశపెట్టిన మనో వైజ్ఞానిక శాస్త్ర సిద్ధాంతాల ఆధారంగా చేసే విమర్శనే 'మనో వైజ్ఞానిక విమర్శ' అంటారు. 'అసమర్థుని జీవిత యాత్ర', 'చివరకు మిగిలేది', 'అల్పజీవి' మొదలైన అనేక నవలలపై వచ్చిన విమర్శనా వ్యాసాలు ఈ

రకమైన విమర్శా ధోరణికి చెందుతాయి. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ అనే గ్రంథంలో కోడూరి శ్రీరామమూర్తి గారు మనో వైజ్ఞానిక విమర్శ కనిపిస్తుంది. సాహిత్య నిర్మాణం, మనో వైజ్ఞానిక దృష్టికి మధ్య గల అవినాభావ సంబంధమే మనో వైజ్ఞానిక విమర్శ ఆవిర్భావానికి దారి తీసిందని కోడూరి శ్రీరామమూర్తి గారు చెప్పారు. ఈడిపస్ కాంప్లెక్స్, ఎలక్ట్రా కాంప్లెక్స్, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటి కాంప్లెక్స్ మొదలైన వాటి ఆధారంగా రచనలలోని పాత్రల్ని విశ్లేషిస్తారు. ప్రతి వ్యక్తిలోనూ, ప్రతి రచనలోని పాత్రల మనస్తత్వాలలోను చేతనావస్థ(consciousness), అచేతనావస్థ (unconsciousness) అనే రెండు మానసిక స్థితుల ఉంటాయి. చేతన అనేది బయటకు కనపడుతుంది. అచేతన అంతరంగంలోనే ఉండి పోతుంది. మనో వైజ్ఞానిక విమర్శ ఈ అచేతనావస్థకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తుంది.

## 2.7.6. కవి జీవిత విమర్శ

కవి జీవిత విమర్శ కవి జీవితానికి, అతని రచనకు సంబంధించినది. అతని నేపథ్యం, వ్యక్తిత్వం, అతని రచనలో ప్రతిఫలించాయా, లేదా అన్న విషయాలు కవి జీవిత విమర్శ ద్వారా బయటపడతాయి. దీనికే కవి ఆత్మీయ విమర్శ అనే మరో పేరు కూడా ఉంది. ఈ రకమైన విమర్శన పద్ధతి పాశ్చాత్య సాహిత్య ప్రభావం నుండి వచ్చింది. ఈ రకమైన కవి జీవిత విమర్శ కు మూలపురుషుడుగా డ్రైడన్ ను పేర్కొంటారు. తెలుగులో కె.వి రమణారెడ్డి కవి జీవిత విమర్శకు ఆద్యులుగా కొల్లు వెంకటేశ్వరరావు గారు అన్నారు. కెవి రమణారెడ్డి రచించిన 'మహోదయం' కావ్యంలో మహాకవి గురజాడ సమగ్ర జీవితాన్ని ఆయన రచనలను కవి జీవిత విమర్శ నేపథ్యం నుండి విమర్శించారు.వేటూరి ప్రభాకర శాస్త్రి 'శృంగార శ్రీనాథం',రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచించిన 'వేమన' మొదలైన రచనలు కూడా కవి జీవిత విమర్శ కిందకే వస్తాయి.

### 2.7.7. తులనాత్మక సాహిత్య విమర్శ

తెలుగు సాహిత్య విమర్శ పద్ధతుల్లో విశ్వవ్యాపితంగా ఉన్నదే ఈ తులనాత్మక సాహిత్య విమర్శ. తులనాత్మక విమర్శ అంటే కేవలం పోల్చి చెప్పడం అనుకుంటే పొరబాటు.ఈ పోల్చి చూడటానికి వైజ్ఞానిక దృక్కోణం, అంతర దృష్టి, ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంటే అది తులనాత్మక విమర్శ అవుతుంది. పోల్చి చూడటం కంటే విస్తృతమైనది, లోతైనదీ అని అభిప్రాయ పడతారు శిఖామణి(కె.సంజీవరావ్). విభిన్న సాహిత్యాలలోని పరస్పర సంబంధాలను అధ్యయనం చేయటాన్నే తులనాత్మక సాహిత్య విమర్శ అని స్థూలంగా చెప్పవచ్చును.

### 2.7. 8. కళా సౌందర్య దృక్పథ విమర్శ

ప్రపంచంలోనే తొలిసారిగా గ్రీకులు కళాదృష్టి, కళా సౌందర్యం అనే అంశాల గురించి ప్రస్తావించారు. ప్లేటో సౌందర్య శాస్త్రమే నిజమైన శాస్త్రం అంటారు.సృష్టికి సహజమైనవి కళ, సౌందర్యాలు. అందుకే ఆస్కార్ వైల్డ్ 'కళ కళ కొరకే' (Art for Art sake) అన్నాడు. తెలుగులో సౌందర్య శాస్త్ర మూలాలున్న తొలి విమర్శకునిగా కట్టమంచి రామలింగారెడ్డిని పేర్కొనవచ్చు. ఇటువంటి కళావిమర్శ 1914 లోనే చేశారు. అయితే కళల కంటే కళాసౌందర్యాన్ని విశ్లేషించడం కంటే కళాతత్వాన్ని కొంతవరకు పరిశీలించాడు కానీ, పాశ్చాత్యులు భావించిన కళాతత్వం లేదా సౌందర్య శాస్త్రం అనే దృష్టితో సాహిత్యాన్ని విమర్శ చేసి ఆ తత్వాన్ని ప్రతిఫలించేటట్టు చేసి 'విమర్శక పారిజాతం' అనే పేరు పెట్టినవాడు పురాణం సూరి శాస్త్రి. అందువల్ల తొలి తెలుగు కళాతత్వ విమర్శకుడిగా పురాణం సూరి శాస్త్రిని గుర్తిస్తున్నారు.

### 2.7. 9. మార్క్సిస్టు విమర్శ(Marxist Criticism)

గతితార్కిక చారిత్రక భౌతిక వాదం తాత్విక పునాదిగా ఏర్పడినది మార్క్సిజం. ఏదైతే మార్క్సిజానికి తాత్విక పునాదిగా నిలిచిందో, అదే మార్క్సిస్టు విమర్శకు కూడా పునాదిగా

నిలుస్తుంది. ఈ మార్క్సిస్టు విమర్శ కళా సౌందర్య దృక్పథ విమర్శకు పూర్తిగా భిన్నమైనది. మార్క్సిస్టు విమర్శ కళ కళకోసమే అనే సిద్ధాంతాన్ని పూర్తిగా తిరస్కరిస్తుంది. అంతేగాకుండా సాహిత్యాన్ని విమర్శించడానికి సాహిత్య ప్రమాణాలే అవసరం అనే పిడివాదాన్ని కూడా మార్క్సిస్టు విమర్శ తిరస్కరిస్తుంది. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు అన్నట్లుగా మార్క్సిస్టు విమర్శ సాహిత్యాన్ని విమర్శించడానికి సాహిత్య ప్రమాణాలతో పాటు సాహిత్యేతర ప్రమాణాలను కూడా సమానంగా స్వీకరిస్తుంది.కార్ల్ మార్క్స్ సిద్ధాంతాల నేపథ్యంలో వెలువడిన విమర్శ రీతి ఇది. సాహిత్యం ప్రజలపరం కావాలన్నదే మార్క్సిస్టు విమర్శకుల లక్ష్యం.

## 2.7.10. రూపవాద విమర్శ

Formalism అనే ఆంగ్ల పదానికి తెలుగులో 'రూపవాదం' అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. తెలుగులో చేకూరి రామారావు, వెల్చేరు నారాయణరావు, జి. లక్ష్మీనరసయ్య, వల్లంపాటి వెంకటసుబ్బయ్య పరిమి రామ నరసింహం మొదలైన వారిని రూపవాద విమర్శకులుగా పేర్కొనవచ్చును. రసం, ధ్వని, వక్రోక్తి, ఔచిత్యం వంటి వాదాలు ప్రాచీన కాలంలో సాహిత్య స్వరూపాన్ని వివేచన చేసాయి. అయితే ఆధునిక యుగంలోని ఈ రూప వాద విమర్శలో అప్పటి భారతీయ సంప్రదాయం లోని సామ్యాన్ని గమనించవచ్చు.

## 2.7.11. అభిరుచి విమర్శ

Impressionistic Criticism అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో అభిరుచి విమర్శ అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రాచీన ఆలంకారిక విమర్శలో నవ్య దృక్పథాన్ని ప్రసరించే క్రమంలో రూపొందినదే 'అభిరుచి విమర్శ' అని విమర్శకులు భావిస్తున్నారు. ఈ విమర్శలో విమర్శకుని అనుభవమే మూలం కాబట్టి దీనిని 'ఆత్మాశ్రయ రీతి విమర్శ' అని కూడా అంటారు. ఈ విధమైన విమర్శలో విమర్శకుడు సృజనాత్మకత కలిగిన వ్యక్తి అయితే అభిరుచి విమర్శ ఉత్తమమైనదిగా వెలువడుతుందని చెప్పవచ్చు.

## 2.7.12. ప్రతీకవాద విమర్శ

ప్రతీకలు అనేవి ప్రాచీన కలం నుండి సాహిత్యంలో ప్రయోగింప బడుతూనే ఉన్నాయి. అయితే ప్రతీక వాదం అనేది ఒక విమర్శనా రీతిగా మాత్రం ఆధునిక కాలంలోనే స్థిరపడిందని చెప్పవచ్చు. ప్రతీకవాదాన్నే ఆంగ్లంలో సింబాలిజం అని అంటారు. ఈ సింబాలిజం అనే పదానికి సంకేత చిహ్నం అనే అర్థం ఉంది. ప్రపంచంలోనే మొట్టమొదట ఫ్రాన్స్ లో ప్రతీకవాదం బయలుదేరింది. సింబాలిస్టు కవులు విలక్షణమైన శైలిని అలవర్చుకోవాలి సంవిధాన శిల్పాన్ని  సాధించుకోవాలి. విలక్షణమైన కవితా సామగ్రిని సమకూర్చుకోవాలి. విశ్లేషణకు అతీతమైన అర్థాలను కలిగి ఉండాలి. అని అన్నారు. వడలి మందేశ్వరరావు. కవి తాను పొందిన అనుభూతిని ఉన్నదున్నట్లుగా వ్యక్తీకరించడానికి ప్రతీకకు మించిన సాధనం లేదని చెప్పవచ్చు.

## 2.8. విమర్శ – ప్రతి విమర్శ

ఆధునిక సాహిత్యంలో వెలువడిన సాహిత్య ప్రక్రియ విమర్శ. ఈ ప్రక్రియ ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చింది. ఈ విమర్శ ప్రారంభంలో కేవలం అలంకార లక్షణ బద్ధమని భావించడం జరిగింది. ఆ తరువాత పాశ్చాత్య ప్రభావం చోటుచేసుకున్న విమర్శ మనకు కనిపిస్తుంది. ఈ కాలంలో విమర్శలో ఒక నవ్య మార్గం చోటుచేసుకుంది.కట్టమంచి, రాళ్ళపల్లి, దువ్వూరి రామిరెడ్డి గార్లను ఈ దశలోని ముఖ్యమైన విమర్శకులుగా పేర్కొనవచ్చు. వీరు పూర్వం వ్యాఖ్యన రూపంలో ఉన్న విమర్శను కావ్యార్థాలకు విలువ కట్టే  నవ్య రూపంలోకి మార్చారు. ఆ తరువాత విమర్శలో వాదోపవాదాలు మొదలయ్యాయి. సాధారణంగా ఒక రచనతో విమర్శ పుడుతుంది. ఆ విమర్శను ఆసరా చేసుకుని ప్రతిగా వెలువడేది ప్రతి విమర్శ. ఈ విమర్శ, ప్రతి విమర్శల వలన కొందరు నొచ్చుకున్నా సాహిత్య ప్రయోజనం మాత్రం తప్పకుండా నెరవేరుతుంది. ప్రాచీన లాక్షణిక గ్రంథాలన్నీ ప్రతి విమర్శలే అని వెల్చేరు నారాయణరావు గారు అన్నారు. సాహిత్యంలో ప్రతి విమర్శ అనేది ముఖ్యంగా అంతకు ముందు వచ్చిన విమర్శలను ఖండిస్తూ

వచ్చినదై ఉంటుంది. సర్దేశాయి తిరుమలరావు గారు రాసిన వ్యాసాలన్నింటిని కలిపి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు విమర్శ-ప్రతి విమర్శ పేరుతో ఒక గొప్ప విమర్శనా గ్రంథాన్ని ప్రచురించారు. అదేవిధంగాఎస్వీ అచ్యుతశర్మ అనే పరిశోధకుడు "తెలుగులో ప్రతి విమర్శ – పరామర్శ" అనే పేరుతోఒక లఘు సిద్ధాంత గ్రంథాన్ని మొట్టమొదటగా రచించినట్లు తెలుస్తుంది. అంతకుముందు వచ్చిన విమర్శ అసమగ్రమో, పాక్షికమో అని కానీ నిరాధారాలతో కూడినదని కానీ భావించినప్పుడు ప్రతి విమర్శకు అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి ప్రతి విమర్శ వెలువడాలంటే ముందుగా విమర్శ రావలసి ఉంటుంది.

## 2.9. సాహిత్యోద్యమ విమర్శ

ఉద్యమం అనే పదం 'యమ్' ధాతువుకు 'ఉత్' ఉపసర్గ చేరగా ఏర్పడినది. 'యమ్' అంటే 'స్వాధీనంలో ఉంచుకొను' అనీ 'ఉత్ అంటే పైకి లేచిన అనీ అర్థం ఉంది. ఆంగ్లంలో Movement అనే పదానికి సమానార్థంలో ఉద్యమ శబ్దాన్ని ప్రయోగిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే తీవ్రమైన ఏకోన్ముఖ ప్రయత్నం ఉద్యమం అని అర్థమవుతుంది. ఉద్యమం అనేది వ్యష్టి-సమిష్టి ప్రయోజనాల సమాహారంగా చెప్పుకోవచ్చు. ఉద్యమంలో ఒక తీవ్రమైన సంకల్ప లక్ష్యం చైతన్య వాహినిగా మరి అనేక వేలమంది ఆమోదం పొంది ముందుకు సాగుతుంది. ఆ తరువాత అది ఒక సాంఘీక చైతన్యంగా పరిణమిస్తుంది. అంతకు ముందు కాలంలోనూ, ప్రస్తుత కాలంలోనూ ఉన్న ఒకానొక తత్వాన్ని నిరోధించడానికి ఉద్యమం అనేది ఏర్పడేందుకు అవకాశం ఉంది. నిర్మాణము, విధ్వంసం అనే రెండు కోణాలు ఉద్యమానికి రెండు నేత్రాలవంటివి.

### 2.9.1 జాతీయోద్యమ విమర్శ

పరాయి పాలన నుండి విముక్తి పొందాలనే ఉద్దేశ్యంతో జాతీయోద్యమం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో అనేకమంది జాతీయోద్యమ నేపథ్యంలో సాహిత్యాన్ని సృష్టించారు. ఆ విధంగా వెలువడిన సాహిత్యంలో మొదటగా జాతీయ గీతాలు ఆ తరువాత కొన్ని కథలు, నవలలు వెలువడ్డాయి. వీటితో పాటుగా ఎంతో సాహిత్య విమర్శ, ఎన్నో

సాహిత్య వ్యాసాలు, మరెన్నో సిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి 'భరతఖండంబు చక్కని పాడియావు' అనే పద్యాన్ని జాతీయోద్యమ సాహిత్యంలో తొలి పద్యంగా చెప్తారు. అదేవిధంగా గడియారం వెంకటశేష శాస్త్రి గారి శివభారత కావ్యంపై, దుర్భాక రాజశేఖర శతావధాని గారి రాణా ప్రతాపసింహ చరిత్ర కావ్యంపై, విశ్వనాథ సత్యనారాయణ ఆంధ్ర ప్రశస్తి కావ్యం మొదలైన వాటిపై ఎన్నో సిద్ధాంత గ్రంథాలు, విమర్శ వ్యాసాలు వెలువడ్డాయి. తెలుగునాట జాతీయోద్యమ కవిత్వానికి ఒరవడిపెట్టిన ప్రముఖ కవి గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన 'మాకొద్దీ తెల్ల దొరతనం' అనే గేయం జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించింది. ఈ పాట ఆనాడు ప్రతి తెలుగువాడి నోటా మారుమోగింది. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన 'ఇలాంటి తవ్వాయి వస్తే' అనే కథను, వేలూరి శివరామ శాస్త్రి రాసిన 'డిప్రెషన్ చెంబు' అనే కథను కూడా విమర్శకులు జాతీయోద్యమ సాహిత్యంలో ప్రముఖమైనవని వివరించారు. అదేవిధంగా విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు' ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవలలపై అనేకమైన విమర్శలు వెలువడ్డాయి.

## 2.9.2 భావకవిత్వోద్యమ విమర్శ

ఆంగ్ల కవిత్వంలోని రొమాంటిసిజం ప్రభావంతో తెలుగులో వచ్చిన ఉద్యమమే భావ కవిత్వోద్యమం. గాడిచర్ల హరి సర్వోత్తమ రావు భావకవిత్వం అనే పదాన్ని మొట్టమొదటిసారిగా ఉపయోగించినట్టు తెలుస్తుంది. రాయప్రోలు సుబ్బారావును భావకవిత్వోద్యమానికి నాయకునిగా చెప్పవచ్చు. దేవులపల్లి కృష్ణశాస్త్రి వల్ల ఈ ఉద్యమం ప్రాచుర్యం పొందింది. ఈ భావకవిత్వం 1910 లో మొదలై సుమారు పాతికేళ్ళు కొనసాగిందని చెప్పవచ్చు. ప్రకృతిని ఆరాధించడం, ఆత్మాశ్రయత్వం, స్వేచ్ఛ కాంక్ష, స్వచ్ఛమైన ప్రేమ మొదలైనవి ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటిలోని 'స్వచ్ఛమైన ప్రేమ' అనే దానిని అమలిన శృంగార సిద్ధాంతం అని అంటారు. రాయప్రోలు రచించిన తృణకంకణం, స్నేహలత, ఆంధ్రావళి. దేవులపల్లి – కృష్ణపక్షం, ఊర్వశి, ప్రవాసం మొదలైన వాటిని భావకవిత్వంలోని ముఖ్య కావ్యాలుగా చెప్పుకోవచ్చు. భావకవిత్వంపై అనేక విమర్శ

వ్యాసాలు, సిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి. అట్టి వాటిలో అక్కిరాజు రమాకాంతం రచించిన "నేటికాలపు కవిత్వం" అనే పుస్తకాన్ని మంచి విమర్శనా గ్రంథంగా చెప్పుకోవచ్చు.

## 2.9.3 అభ్యుదయ కవిత్వోద్యమ విమర్శ

తెలుగులో భావకవిత్వానికి తిరుగుబాటుగా అభ్యుదయ సాహిత్యం ప్రారంభమైంది. 'ప్రోగ్రెసివ్' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా ఈ అభ్యుదయం అనే పదాన్ని ప్రయోగిస్తున్నారు. 1929 తరువాత ఈ అభ్యుదయ కవిత్వం తెలుగులో ప్రారంభమైంది.

అంతకుముందు రచనల్లో శబ్ద వ్యక్తీకరణకు ప్రాధాన్యం ఏర్పడి, అర్థ గాంభీర్యం అడుగంటిపోయింది.పదాల పొందికపైనే దృష్టి ఏర్పడి, భావనా బలం సంనగిల్లిపోయింది. ఆత్మ వ్యక్తీకరణ ధోరణి నానాటికి ముదిరిపోయి సంఘ దృష్టి మరుగునపడిపోయింది. ఈ స్థితిలో భావ కవిత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, సరికొత్త ప్రయోగాలు చేసిన కవులుగా శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, పఠాభి, ముద్దుకృష్ణ, పురిపండా అప్పలస్వామి,కె.వి రమణారెడ్డి, సోమసుందర్, కుందుర్తి, బెల్లంకొండ రామదాసు, అనిసెట్టి, ఏల్చూరి సుబ్రహ్మణ్యం మొదలైన వారిని చెప్పుకోవచ్చు. అయితే అభ్యుదయం సాహిత్యంలో ఎంతవరకు ఉందో చర్చించి చేసే విమర్శనే అభ్యుదయ సాహిత్య విమర్శ అంటారు. సాహిత్య విమర్శలో అభ్యుదయ చైతన్యాన్ని కలిగించిన విమర్శకులలో ఆరుద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, అద్దేపల్లి రామమోహనరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పేర్కొనదగినవారు.పి. సంజీవమ్మ 'తెలుగు నవలల్లో సామజిక చైతన్యం', తెలుగు కథానిక(1925-1980) అనే విమర్శ గ్రంథాలలో అభ్యుదయ ప్రభావం, ప్రాధాన్యాన్ని వివరంగా తెలిపారు. అదేవిధంగా కేతు విశ్వనాథ రెడ్డి అభ్యుదయ సాహిత్యంపై విమర్శా వ్యాసాలు రాసారు. కుందుర్తి తన వచన కవిత్వంలో అభ్యుదయ లక్షణాలకే ప్రాధాన్యమిచ్చారు. రాచమల్లు రామ చంద్రారెడ్డి సంపాదకత్వం వహించిన సంవేదన పత్రికలో ఎక్కువగా అభ్యుదయ సాహిత్య విమర్శకే ప్రాధాన్యతనిచ్చారు. అయితే అభ్యుదయ సాహిత్యంపై ప్రతి విమర్శ కూడా వెలువడింది.

అభ్యుదయ ఉద్యమానికి ఊపిరినిచ్చిన శ్రీ శ్రీ పై అతని మహాప్రస్థాన కావ్యంపై అనేకమంది విమర్శలు చేసారు.మహా ప్రస్థానంలో శబ్దశిల్పం తప్ప ఏమీ లేదని, కొన్ని భావ కవిత్వపు ఛాయలు గల ఖండికలున్నాయనీ విమర్శలు వెలువడ్డాయి. అద్దేపల్లి రామమోహనరావు మొట్టమొదట ''శ్రీశ్రీ కవితా ప్రస్థానం'' అనే పేరుతో విమర్శ గ్రంథం రాసి మహాప్రస్థానంలోని ధ్వని, శిల్పం, భావ చిత్రణ వంటి వాటిని వివరించారు. రాచమల్లు రామచంద్రారెడ్డి అద్దేపల్లి విమర్శను ఖండించారు. వీరిద్దరి మధ్య పరస్పర చర్చలు జరిగాయి. అదేవిధంగా మిరియాల రామకృష్ణ శ్రీశ్రీ కవిత్వంపై రాసిన సిద్ధాంత గ్రంథం కూడా ప్రతి విమర్శకు గురైందని చెప్పవచ్చు.

## 2.9.4 హేతువాద విమర్శ

హేతువు అంటే కారణం అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. హేతువాదం అంటే ప్రతి విషయాన్నీ గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించి, అందులోని గుణదోషాలను విశ్లేషించడమే అని చెప్పవచ్చు. ఇటువంటి తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించేవారిని హేతువాదులు అంటారు. హేతువాదాన్ని ఆంగ్లంలో "రేషనలిజం" అంటారు. దీనికి గల అర్థాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు. Rationalism, a philosophical position, theory, or view that reason is the source of knowledge. వేమన, పోతులూరి వీరబ్రహ్మం, సామినేని ముద్దు నరసింహం, ఆరుద్ర, ముద్దుకృష్ణ, చలం, కొడవటిగంటి కుటుంబరావు లను తెలుగులో ప్రముఖ హేతువాదులుగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా హేతువాదం అనేది కార్యకారణ సంబంధంతో ముడిపడి ఉండేదని చెప్పవచ్చు. తెలుగులో హేతువాద సాహిత్య ప్రభావాన్ని దాని పరిణామాలను గురించి విశ్లేషిస్తూ డా, కనుపర్తి విజయలక్ష్మి "తెలుగు సాహిత్యం హేతువాద భావాలు – ప్రభావాలు" అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. తెలుగు సాహిత్యంలో ఎ.జి.కె గా ప్రసిద్ధులైన ఆవుల గోపాలకృష్ణ మూర్తి, జస్టిస్ ఆవుల సాంబశివరావు, ప్రముఖ హేతువాది అనే పత్రికా స్థాపకులైన రావిపూడి వెంకటాద్రి గారిని హేతువాద రథ సారథులుగా చెప్పవచ్చు. తెలుగులో ప్రాచీన కాలంలో వేమన " విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి,

సతిపతులను గూర్చి సమ్మతమున, మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా? అంటూ తన తర్కాన్ని వినిపించగా, ఆ తరువాత తెలుగు కవిత్వంలో హేతువాదానికి పెద్దపీట వేసింది త్రిపురనేని రామస్వామి చౌదరే అని చెప్పవచ్చు. ఈయన హేతువాదాన్ని గురించి చెపుతూ "శాస్త్రమునెల్ల చదివి విజ్ఞానమెరిగి, సంశయింపక సర్వదా చర్చ జేసి, నిజమెరుంగ వలయునిది నేర్వకున్న, మూడ విశ్వాసమున చేటు మూదుచుండు. అంటూ శంబూకవధ, సూత పురాణం, ఖూని, కుప్పుస్వామి శతకం వంటి రచనలు చేసి సంచలనాన్ని రేకెత్తించాడు.

అదేవిధంగా నార్ల వెంకటేశ్వరరావు, చలం, ముద్దు కృష్ణ, జివి కృష్ణారావు బోయిభీమన్న వంటి వారి రచనలలో హేతువాద భావాలు కనపడతాయి.

## 2.9.5 దిగంబర కవిత్వ విమర్శ

ఆరు మంది కవులు ఆరు వైవిధ్యమైన కలం పేర్లతో తెలుగు కవిత్వానికి ఇచ్చిన "షాక్ ట్రీట్మెంట్" దిగంబర కవిత్వోద్యమం. సమజానికి పట్టిన ఈ కుష్టు వ్యాధిని చీల్చి చెండాడటానికి ఉన్నది ఉన్నట్లుగా నగ్నంగా ఎటువంటి పొరలు లేకుండా నగ్నంగా దిగంబర కవులు వచ్చారు. "బోధి వృక్షం పిడికెడు నీడనియ్యలేదు, గాంధీపథం గరిటెడు గంజి పోయలేదు.." అంటూ మానవుడు తమాషా జంతువై తరమబడ్డాడని అన్నారు. దిగంబర కవిత్వాన్ని ఎంతగా సమర్ధించారో అంతకంటే రెండింతలు విమర్శకు గురైందని చెప్పవచ్చు. "వాళ్ళు నిజమైన కవులు, అయితే వాళ్ళ కవితా శక్తుల్ని సరైన మార్గంలో పెట్టలేకపోతున్నారని" శ్రీశ్రీ అన్నాడు. "Negative గానే సమజాన్ని విమర్శిస్తూ ఉండిన దిగంబర కవులు పాఠక లోకానికి విద్యుచ్ఛికిత్స చేయడంలో కృతార్థులయ్యారు" అని కె.వి రమణారెడ్డి, "ఇది నిజమైన విప్లవ తిరుగుబాటు కవిత్వం, ఈ కవిత్వం ఈనాడు ప్రజలకు అవసరం. అని  కొడవటిగంటి కుటుంబరావులు దిగంబర కవిత్వాన్ని సమర్ధించారు. అదేవిధంగాసమాజం కుళ్ళుకు వీళ్ళు ఒక చిహ్నం అని రాచమల్లు రామచంద్రా రెడ్డి, సమాజం మీద కక్షగట్టిన వాళ్ళు దిగంబరులు అని ఆరుద్ర, "కొత్త పదజాలం

ప్రయోగిస్తున్నామనుకొని అసహ్యమైన జుగుప్సాకరమైన పదచిత్రాల వక్రీకృతతో వీళ్ళు సాధించింది మానవ జాతికి రుగ్మతని, సిఫిలిస్నీ కుష్టునీ తప్ప అన్యము కాదు" అని సోమసుందర్ మొదలైన వారు విమర్శించారు. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం అనే విమర్శ గ్రంథంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు దిగంబర కవిత్వాన్ని గురించి చెపుతూ "దిగంబర కవిత్వ విమర్శకు వస్తు ద్రుష్టి ముఖ్యం, వస్తు వ్యాప్తి దర్శించాలి. వస్తు దర్శనం నిరసన నేపథ్యం నుండి గ్రహించాలి. బూతు అశ్లీలం ఈ సాహిత్య నేపథ్యంలో జాగురూకంగా అర్థం చేసుకొని విమర్శ కొనసాగించాలి. (పుట:107) అని పేర్కొన్నారు. అదేవిధంగాకడియాల రామ మోహన రాయ్ తన ***"20వ శతాబ్ది తెలుగు కవిత్వం"*** అనే పుస్తకంలో "దిగంబర కవిత్వం ఒక చారిత్రక అవసరం, తెలుగు సాహిత్యంలో ఒక సంధి యుగంలో జడత్వాన్ని తొలగించి, సాహితీపరుల నరాల్లో నిప్పు రగిలించి, విప్లవ ఝంఝ వీచడానికి దిగంబర కవిత్వం తోడ్పడింది.(పుట:134) అని పేర్కొన్నారు.

## 2.9.6 విప్లవోద్యమ విమర్శ

విప్లవ రచయితల సంఘం ప్రథమ మహా సభలు 1970 అక్టోబర్ మాసంలో ఖమ్మం జిల్లాలో జరిగాయి. ఈ సమావేశంలో సాహిత్యం ఒక ఆయుధ విశేషమని, సమగ్రమైన మానవ స్వాతంత్ర్యం వైపే విప్లవ సాహిత్యం నడిపే మహా ప్రస్థానం" అని విరసం తన పోరాట మార్గాన్ని నిర్దేశించుకున్నది. విశ్వ మానవతా మార్గాన్ని మార్క్సిజం, లెనినిజం క్రాంతి మార్గంలో వెలుగెత్తి చాటడమే ప్రధాన ధ్యేయంగా పేర్కొన్నది. వాస్తవానికి విరసం అన్ని సాహిత్య ప్రక్రియలను సమాదరిస్తుంది. అయితే తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కవిత్వం వాటా విప్లవోద్యమ సాహిత్యంలో ఎక్కువేనని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో వెలువడిన మొదటి విప్లవ కవితా సంపుటి "ఝంఝ" వెలువడింది. ఆ తరువాత 'లే', విప్లవం వర్ధిల్లాలి, మార్చ్ వంటి కవితా సంపుటులు వెలువడ్డాయి. కమ్యునిస్టు పార్టీ స్థాపనకు ముందు ఈ సాహిత్య విప్లవోద్యమం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది.విప్లవ సాహిత్య దృక్పథంతో సానుకూల విమర్శ చేసిన వారిలో సొదుం రామ్మోహన్, త్రిపురనేని మధు సూదనరావు, ఎన్ వేణుగోపాల్, దివికుమార్, కెవిఆర్, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ మొదలైన వారిని పేర్కొనాలి.

అయితే విప్లవ సాహిత్యంలో విమర్శకి ప్రతి విమర్శ చేసే వారిలో కె.రమణారెడ్డి గారిని ప్రముఖులుగా పేర్కొనవచ్చు.

## 2.10. స్త్రీవాద సాహిత్య విమర్శ

19 వ శతాబ్ది ఉత్తరార్థంలోను, 20వ శతాబ్దం పూర్వార్థంలోను పాశ్చాత్య విద్యా ప్రభావం, సంఘ సంస్కరణోద్యమ ప్రభావంతో స్త్రీపట్ల సానుభూతిని ప్రకటించి, స్త్రీ జనాభ్యుదయం కోసం సాహిత్యాన్ని వెలువరించిన వారిలో మొట్ట మొదట పేర్కొనదగిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు, వారిని అనుసరించి గురజాడ అప్పారావుగారు స్త్రీల పట్ల సానుభూతిని ప్రకటించారు. అదేవిధంగా చలం స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాహిత్యంలో ప్రతిపాదించాడు. శ్రీదేవి, మాలతీ చందూర్, రంగ నాయకమ్మ, కె. రామలక్ష్మి, వాసిరెడ్డి సీతాదేవి, డి. కామేశ్వరి, ఆనందరామం 1950 నుండే స్త్రీ సమస్యలను వాటి నుండి బయట పడే మార్గాలను తమ సాహిత్యంలో అన్వేషించ సాగారు. స్త్రీవాద సాహిత్యం అంటే పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో 1975 నుండి వచ్చిన సాహిత్యాన్నే స్త్రీవాద సాహిత్యంగా పరిగణిస్తున్నారు.

స్త్రీవాదాన్ని ఆంగ్లంలో ఫెమినిజం అంటారు. ఇది ఈ విధంగా నిర్వచించబడింది "అణచివేతకు గురవుతున్న స్త్రీలు విముక్తికై తపన పడుతూ, చైతన్యాన్ని పెంపొందించుకోవడంలో రూపుదిద్దుకున్న ఒక ఆలోచన విధానంగా ఆచరణ కార్య కలాపంగా ఫెమినిజాన్ని అర్థం చేసుకోవచ్చు. స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా ఎలా తక్కువగా చూడబడుతున్నారో వివరిస్తూ, ప్రశ్నిస్తూ వచ్చిన ఉద్యమమే ఫెమినిజం"(స్త్రీవాద ధోరణులు సమకాలీన సాహిత్యం, యువభారతి ప్రచురణ.పుట.11). "స్త్రీ పురుష సమానత్వం కొరకు స్త్రీ తన జీవితాన్ని తానూ నిర్మించుకొనే హక్కు కొరకు పోరాడేది. జీవితంలోని ప్రతి అంశంలోనూ సమాజంలోని ప్రతి రంగంలోనూస్త్రీ పట్ల అమలులో ఉన్న వివక్షతల్ని వ్యతిరేకించేది స్త్రీ వాదం"గా గుర్తించారు. అంటే మొత్తం మీద స్త్రీలు తమ అస్తిత్వానికై సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడం కోసం

పురుషాధిక్య పితృస్వామ్య సమాజాన్ని వ్యతిరేకించడాన్ని స్త్రీవాదంగా గుర్తించవచ్చును. ఈ దృష్టితో వెలువడిన సాహిత్యమే స్త్రీవాద సాహిత్యం. ఈ స్త్రీవాద సాహిత్యం తెలుగులో నవలా, కథానిక, కవిత్వం, నాటిక మొదలగు ప్రక్రియలలో వస్తోంది. విమర్శ కేవలం సాహిత్య వ్యాఖ్యానం కాదు. అది జీవిత ప్రతిబింబమైన సాహిత్యంలో అభివ్యక్తమైన జీవితాన్ని వివిధ దృష్టి కోణాలలో విశ్లేషించే ఒక కళ. పాశ్చాత్య విమర్శకులు చెప్పిన 'Psychical Distance' అన్న విమర్శ సూత్రం నేపథ్యంలో చెబితే ఒక పురుషుడు జీవితాన్ని చూసే దృష్టి వేరు. ఒక స్త్రీ జీవితాన్ని చూసే దృష్టి వేరు. ఈ అభిప్రాయమే స్త్రీవాద సాహిత్యానికి, విమర్శకు మూలా బీజంగా గుర్తించవచ్చు.

సాహిత్యం మొత్తం మీద స్త్రీవాద సాహిత్యంలోనే విమర్శనా ధోరణులు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పవచ్చు. తెలుగులో మొట్ట మొదటిగా 1984లో రంగనాయకమ్మ గారు "స్త్రీ స్వేచ్ఛ" అనే వ్యాస సంకలనంలో స్త్రీవాద ఆలోచన ధోరణిని, స్త్రీవాద తత్వాన్ని సామ్యవాద దృక్పథంతో స్పష్టంగా విశ్లేషించారు. 1994లో యువభారతి ప్రచురించిన స్త్రీవాద ధోరణులు సమకాలీన సాహిత్యం అనే వ్యాస సంకలనం ప్రధానమైనది. ఇన్దులొం పలువురు విమర్శకులు భిన్న ప్రక్రియలలో వచ్చిన స్త్రీవాద సాహిత్యాన్ని విశ్లేషించడమే కాకుండా కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను, స్త్రీవాద ఆశయాల సాధనకు పోరాటం సాగించడమే లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకు స్త్రీలను ఉత్తేజ పరిచి చైతన్యవంతం చేసి కార్యోన్ముఖులను కావించడమే స్త్రీవాద సాహిత్య ప్రయోజనంగా స్త్రీవాదులు తెలియజేశారు.

స్త్రీవాద సాహిత్యంలో ప్రధాన ధోరణులైన రాడికల్, లిబరల్, సామ్యవాద, మానవతావాద ధోరణులను అనుసరించి కూడా కొందరు విమర్శకులు విమర్శను వెలువరించారు. ఈ ధోరణిలో వెలువడిన మొట్టమొదటి పరిశోధనాత్మక విమర్శ జయప్రభ గారి "భావకవిత్వంలో స్త్రీ" లో స్త్రీవాద కవిత్వంపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి.

చలం శతజయంతిని పురస్కరించుకొని వెలువడిన 'చలం – స్త్రీవాదం' 'నూరేళ్ళ చలం' మొదలగు వ్యాస సంకలనాలు స్త్రీవాద విమర్శ ధోరణికి బలాన్ని చేకూర్చి ఉద్యమ

స్ఫూర్తిని అందించాయనవచ్చును. 1995 లో కాత్యాయనీ విద్మహే ప్రకటించిన కేతవరపు రామకోటిశాస్త్రి గారి మహిళా సమాజవాద సాహిత్య వ్యాసాలు కూడా స్త్రీవాద విమర్శనా ధోరణిని తెలియజేస్తున్నాయి.

స్త్రీవాద సాహిత్య విమర్శ రెండు కోణాల్లో సాగుతోంది. అందులో ఒకటి స్త్రీవాద సాహిత్యంలో విశేషాలు విమర్శించడం, రెండోది మొత్తం సాహిత్యాన్ని స్త్రీవాద దృష్టి నుండి పరిశీలించడం, మొదటిది స్త్రీలు, పురుషులు విడివిడిగానే చేస్తున్నారని, రెండవ దాంట్లో జయప్రభ, కాత్యాయనీ విద్మహే, కనకదుర్గ మొదలైన వాళ్ళు ప్రాచీన కావ్యాలను, ఆధునిక కవిత్వాన్ని విమర్శించారని చేరా గారి అభిప్రాయం.

స్త్రీవాద సాహిత్య విమర్శా వికాసానికి చేరా, ఓల్గా, లక్ష్మీ నరసయ్య, జయప్రభ, పద్మలత, కాత్యాయనీ విద్మహే, సత్యవతి, కొండేపూడి నిర్మల మొదలగువారు చేస్తున్న దోహదం చెప్పుకోదగినది. కొలకలూరి ఇనాక్ గారు ఆధునిక సాహిత్య విమర్శ సూత్రంలో స్త్రీవాద విమర్శ సూత్రాలను గురించి వివరించారు. ఇంతవరకు జరిగిన స్త్రీవాద సాహిత్య విమర్శలో స్త్రీ సమాజ చిత్రణ, స్త్రీల సమస్యలు, ఆ సమస్యల పరిష్కారాలు మొదలగు సామాజికాంశాలు మాత్రమే విశ్లేషించబడ్డాయి.

ఈనాటి స్త్రీవాద సాహిత్యం సుస్థిరతను పొందాలంటే లోతైన అధ్యయనం, వివేచన, విశ్లేషణ, స్పష్టమైన, ఖచ్చితమైన దృష్టి కోణాలు చాలా అవసరం. ఇటీవల వస్తున్నా సాహిత్య చరిత్రలలో కూడా స్త్రీవాద సాహిత్యాన్ని అనుశీలించడం జరిగింది. ముదిగంటి సుజాతారెడ్డి గారు రచించిన 'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ' అనే విమర్శ గ్రంథం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

## 2.11. దళితవాద సాహిత్య విమర్శ

1960 నుండే దళిత సాహిత్యం భారతీయ సాహిత్యంలో చోటుచేసుకుంది. 1970లో మరాఠీ, కన్నడ భాషలలో నిర్దిష్ట లక్ష్యాలతో దళిత్ర సాహిత్యం పురోగమించింది. 1980 నుండే తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ప్రారంభమై 1990 నాటికి

నిలదొక్కుకుంది. దళిత సాహిత్యాన్ని విమర్శకులు ఇలా గుర్తించారు. తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట సాంస్కృతికంగా హీనంగా చూడబడి, విద్యా సౌకర్యాలు కరువై, సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై. ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడికి గురైన వాళ్ళు తమ హక్కుల కోసం, సమానత్వం కోసం తిరుగబడే ధోరణులలో వెలువడే సాహిత్యం. ఈ దళిత సాహిత్యంపై అంబేద్కర్ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. సెంట్రల్ యునివర్సిటీ విద్యార్థుల 'దళిత మేనిఫెస్టో'లో విప్లవ ధోరణిలో దళితుల ప్రతి ఘటనను వివరించారు. మొట్టమొదటిగా తెలుగులో దళిత సాహిత్యాన్ని వెలువరించిన వాడిగా జాషువాను విమర్శకులందరూ గుర్తించారు. అంతకు ముందు కొందరు దళితేతరులు కొంతమంది సానుభూతితో దళితోద్ధరణకై కొంత సాహిత్యాన్ని వెలువరించారు.అయితే దానిని దళిత సాహిత్యంగా అంగీకరించడం లేదు. తెలుగులో దళిత సాహిత్యంపై వచ్చిన విమర్శలు తక్కువేనని చెప్పవచ్చు. అయితే దళిత వాదానికి సైద్ధాంతిక తాత్త్విక భూమికను తెలుగులో ఏర్పరచిన వాళ్ళలో బన్న అయిలయ్య, దార్ల వెంకటేశ్వర రావు, లక్ష్మీ నరసయ్య, కత్తి పద్మారావు మొదలైన వారిని పేర్కొనవచ్చు. దళిత వాదం కూడా స్త్రీవాదం లాగే నవల, కథానిక, కవిత్వం, నాటిక మొదలగు ప్రక్రియలలో వెలువడుతుంది. యువ భారతి వారు ప్రచురించిన ఆధునిక సాహిత్యం దళిత స్పృహ అన్న వ్యాస సంకలనంలో కె.కె రంగనాథాచార్యులు, ఎస్వీ. సత్యనారాయణ , కె. శ్రీనివాస్ దళితవాదం పుట్టుపూర్వోత్తరాలను, దాని లక్ష్యాలను వివరిస్తూ దళితులూ తమ భావజాలాన్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్య ఆకాంక్షలను తమ సాహిత్యంలో ఎలా ప్రదర్శించారో వివరించారు.

దళిత సాహిత్య విమర్శ క్షేత్రంలో ఇనాక్ గారి కృషి గుర్తించదగినది. వారు దళిత సాహిత్యం రచించడమే కాకుండా విశ్లేషణను కూడా చేసారు. వారి పర్యవేక్షణలో వెలువడిన నాగరాజు గారి "తెలుగు నవల – హరిజనాభ్యుదయం"(1984), ఆనంద రావు గారి హరిజనాభ్యుదయం – ఆధునిక ఆంధ్ర కవిత్వం (1992), పోతన్న గారి 'హరిజనాభ్యుదయం – తెలుగు నాటకం, కె.లక్ష్మీనారాయణ గారి "హరిజనాభ్యుదయం –

తెలుగు కథానిక(1997) సిద్ధాంత వ్యాసాలు పేర్కొనదగిన దళిత సాహిత్య పరిశోధనాత్మక విమర్శలుగా చెప్పుకోవచ్చు. వీరే కాక ననుమాస స్వామి, జి. భాను కూడా పరిశోధనాత్మక విమర్శలు చేసారు. గబ్బిలం పత్రిక దళిత సాహిత్య విమర్శకు కృషి చేస్తుంది. అనేకమైన దిన, వార, మాస పత్రికలలో విమర్శనా వ్యాసాలు వెలువడుతూనే ఉన్నాయి. అయితే ఇంకా దళిత సాహిత్యంపై సమగ్రమైన విమర్శ రావలసిన అవసరం ఉంది.

## 2.12. ముస్లింవాద సాహిత్య విమర్శ

తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగ్గ మరొక గొప్ప అస్తిత్వవాదమే ముస్లింవాదం. సమాజంలో ముస్లింలు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి కొంతమంది అభ్యుదయ భావాలు కలిగిన ముస్లింలు కలిసి కొంత కొత్త సాహిత్యాన్ని సృష్టించారు. ఈ సాహిత్యం ముస్లింల ఐక్యతను కాపాడటానికి ఉపయోగపడుతుంది.ఈ నేపథ్యం నుండి ప్రముఖ కవి ఖాదర్ మొహిద్దిన్ రచించిన 'పుట్టుమచ్చ' కవితా సంకలనం మొదటిగా చెప్పుకోవచ్చు.

**నేను పుట్టకముందే**
**దేశద్రోహుల జాబితాలో**
**నమోదై ఉంది నాపేరు**

అంటూ సాగే ఈ కవితలో కవి తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నట్టుగా తెలుస్తుంది. అభద్రతా భావం, నిర్లక్ష్యం, అణచివేత, పరాయివారిగా చూడటం అనే అంశాలను నేపథ్యంగా తీసుకుని ముస్లిం రచయితలు వారి రచనలను సాగించారని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో ముస్లింవాద ధోరణి ప్రాముఖ్యతను ప్రముఖ కవి ఖాజా తెలియ జేస్తూ " ముస్లింలు రాయడం మొదలు పెట్టాక తెలుగు కవిత్వానికి, కథకు కొత్త సంస్కృతీ, కొత్త భాష కొత్త పదాలు ఎన్నో పరిచయమయ్యాయి. నిజానికి తెలుగు భాషలోనే బ్రాహ్మణీయ పదాలు అగ్రహార వాక్యాలు తప్ప నిజ జీవితాల్లోని పదాలు సాహిత్యంలోకి రావడం తక్కువే. దళిత స్త్రీవాదాల తరువాత భాష పరిధి కొంత మేరకు పెరిగింది. అది ముస్లిం వాదం వచ్చాక ఒక

కొత్త రూపాన్ని తీసుకుంది"(తెలుగు సాహిత్యానికి అదనపు గౌరవం. ముందుమాట. వతన్ కథల సంపుటి.పు:11) అని పేర్కొన్నారు. ముస్లిం వాద సాహిత్యానికి అనుకూలంగా కరీముల్లా, స్కైబాబా, షాజహానా, ఖదీర్ బాబు ఇక్బాల్ చంద్, అఫ్సర్, అన్వర్, ఖాజా మొదలైన వాళ్ళు విమాషలు వెలువరించారు. శ్రీశ్రీ "కసాయి+సాయిబు" ను కలిపి కసాయిబు అనే పదంగా వాడటంపై ముస్లింవాదులు ధ్వజమెత్తారు. తమ వృత్తిని, జాతిని కించపరుస్తున్నారని నిరసించారు. ఈ నేపథ్యంలోనే దిలావర్ విమర్శగా "నేను కసాయిబును కాదు, అనివార్య హింసా వృత్తిలో జీవన పరమార్థాన్ని దర్శించే ముస్లిం ధర్మ వ్యాధున్ని" అన్నారు. భారతదేశంలో మాంసం అమ్ముకునే ధర్మవ్యాధుడు గొప్పవాడైతే అదే వృత్తిలో ఉన్న సాయిబులు కూడా గొప్పవారే అవ్వాలి కదా! అని డా॥ ఎస్. షమీ ఉల్లా "మైనారిటీ కవిత్వం తాత్విక నేపథ్యం" అనే సిద్ధాంత వ్యాసం ప్రచురించారు. ముస్లింవాద కవితా సంకలనాలకు గల ''ముందుమాటలు'' ముస్లింవాద విమర్శకు చెందినవనే చెప్పవచ్చు. ముస్లింల మూలాల అన్వేషణ, ఏయే కులాల నుంచి ఎంతమంది ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారారో అధ్యయనాలు జరగాలి. తద్వారా వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేస్తూ వారికి రాజ్యాంగపరంగా దక్కాల్సిన హక్కులు కల్పించాల్సిన అవసరముంది. వృత్తులు కోల్పోయి, భూములు లేక, చదువు లేక, రిజర్వేషన్లు లేక ముస్లింలు పెద్దఎత్తున వెనకబడిపోయిన విషయం ఆయా కమిటీలు, కమిషన్లు తేటతెల్లం చేశాయి. రోడ్డు పక్కన చిల్లర పనుల్లోకి ముస్లింలు దిగజారిపోయి బతుకులు గడవని స్థితిలోకి నెట్టబడ్డారు. అలాంటి వారందరినీ ప్రభుత్వాలు పట్టించుకోవడమే కాకుండా రిజర్వేషన్లు కల్పించి మరీ ఆదుకోవాల్సిన అవసరముందని చెప్పవచ్చు.

## 2.13. ప్రాంతీయ వాద విమర్శ

ఏ ప్రాంతం వారి అనుభవాలు, సంస్కృతులను వారే రాసుకోవాలని ఉన్న తపనే ప్రాంతీయ వాద సాహిత్యానికి దారితీసింది. తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం, దళిత వాదం, మైనారిటీ వాదాలు ఏ విధమైన ముద్ర వేసుకున్నాయో, అదే విధమైన ముద్రను ప్రాంతీయ వాద ధోరణి కూడా బలమైన ముద్రను తెలుగు సాహిత్యంలో వేసుకుందని చెప్పవచ్చు. పొట్టి

శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ త్రి, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ‘3 దశాబ్దాల తెలుగు సాహిత్యం’ అనే అంశంపై జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రముఖ విమర్శకులు గత 3 దశాబ్దాల్లో తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం, ప్రాంతీయ వాదం గాఢమైన ముద్ర వేశాయని అన్నారు. డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి ‘సాహిత్యంలో ప్రాంతీయవాదం’ పై ప్రసంగిస్తూ తెలంగాణ సాహిత్యంలో ప్రాంతీయ వాదం ప్రస్ఫుటించిందని, దీనికి చారిత్రక నేపథ్యం ఉందని అన్నారు. ప్రాంతీయ వాదం రాజకీయ ఉద్యమంతోనే బలపడుతుందనే విషయాన్ని తెలంగాణ ఉద్యమం నిరూపించిందని, ఉత్తరాంధ్ర సాహిత్యంలోనూ ప్రాంతీయ వాదం కనిపించినప్పటికీ అది వాదంగా బలపడలేదని వివరించారు. అయితే ఈ ప్రాంతీయవాద ధోరణి బాల పడటానికి గల కారణాలను ఈ కింది విధంగా చెప్పవచ్చును.అవి ఆర్థికంగా సామాజికంగా వివక్షకి గురి కావడం, ఇతర ప్రాంతాల వారి ఆధిపత్యం, తమ భాష సంస్కృతులు అవహేళనకు గురి కావడం, రాజకీయ నాయకుల స్వార్థంమొదలైన వాటిని కారణాలుగా చెప్పుకోవచ్చు.

తెలంగాణా వైతాళికులుగా పేర్కొంటున్న సురవరం ప్రతాప రెడ్డి గారు తెలంగాణా కవులపై వెలువరించిన “గోల్కొండ కవుల సంచిక” ను ఈ ప్రాంతీయ వాద సాహిత్యానికి స్ఫూర్తిగా చెప్పవచ్చును. ఆ తరువాత చాసో తీసుకొచ్చిన " కళింగాంధ్ర కథలు' సంకలనం తొలిసారిగా ఒక ప్రాంత ప్రజల ఆకాంక్షల్ని ఒక చోటికి తెచ్చిందని విమర్శకులన్నారు. ఆ తర్వాత "సీమ కథలు' వచ్చాయి. “ప్రతి సమస్యనీ ప్రాంతంతో ముడిపెట్టి చూడడం ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యంలో మరో ముఖ్యాంశం. కులం, మతం వంటి సమస్యలు తమని వెంటాడుతున్నప్పటికీ, అవి ప్రాంతంతో ముడిపడినప్పుడు ఆ సమస్యల పరిష్కారం ద్వితీయమే అవుతుంది. తెలంగాణ ప్రాంతంలోని ముస్లిం వాదం ప్రాంతీయ వాద అస్తిత్వంతో ముడిపడి కొనసాగుతుంది. దళిత సాహిత్యంలో కనిపించే వర్గీకరణ విషయంలోనూ ప్రాంతీయ వాద ఉద్యమ ప్రభావం ఉన్నప్పటికీ, దానికింకా అంత తీవ్రత లేదు. కుల, మత అస్తిత్వ ఆరాటం తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ వాదానికి ఉప ప్రాంతీయవాదంగా మారలేదు. రాష్ట్రంలోని మిగతాప్రాంతాలైన రాయలసీమ, కళింగాంధ్ర,

మధ్యాంధ్రలలో ఉన్న మాదిగలు వర్గీకరణ ఉద్యమాన్ని దళితుల సమానత్వాన్ని ఆకాంక్షించే దిశగానే కొనసాగిస్తున్నా"రని దార్ల వెంకటేశ్వర రావు గారు "వివక్ష ధిక్కార స్వరమే ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం" అనే వ్యాసంలో చెప్పారు .

## 2.14. ఆధునికోత్తర వాద విమర్శ

ఆంగ్లంలోని పోస్ట్ మోడర్నిజం అనే పదానికి సమానార్థకంగా తెలుగులో ఆధునికోత్తర వాదం లేదా ఆధునికానంతర వాదం అనే పదాలను ఉపయోగిస్తున్నారు. 1960 నాటికి ఈవాదం ఒక రూపం తీసుకుని, క్రమంగా మిగతా ప్రపంచానికి విస్తరించటం మొదలైంది. 1980ల నుంచి ఆధునికానంతర వాద భావనలు తెలుగు సాహిత్య రంగంలో ప్రాముఖ్యతని సంతరించుకోవడం మొదలైంది. ఆనతి కాలంగా యురోపియన్ సమాజంలో ఉన్న తాత్త్వికమైన సిద్ధాంతాలను ఒక్క సారిగా పునఃసమీక్ష చేసుకునే నేపథ్యంలో వెలువడిన ధోరణినే తెలుగులో ఆధునికోత్తర వాదం అని అంటున్నాము. ఈ ధోరణి గురించి ప్రముఖ విమర్శకులు యాకుబ్ ఇలా అంటున్నారు.

"ఆధునికానంతరవాద తాత్విక చైతన్యమేమంటే అఖండ నిర్వచనాలను (Absolute definitions), వర్గీకరణలను నిరాకరించడం. అందువల్ల ఆధునికానంతరవాదాన్ని నిర్వచించడమనేది చాలా సాపేక్షార్థంలో మాత్రమే సాధ్యపడుతుందని చెబుతూ Tim Wood అనే అమెరికన్ విమర్శకుడు చెప్పిన నిర్వచనాన్ని ఉదాహరించాడు. అది ఈ విధంగా ఉంది.

"Post modernism has acquired a senamtic instability or a shifting meaning that shadows and echoes its notes of indeterminacy and insecurity. The establishment of its relativistic cultural politics as a new orthodoxy coupled with the complexity of grasping all the philosophical discourses and terminology, means it has the Potential for discussive ambiguity and meta phoric

appropriation (for example, being used in another discipline with completely different associations and reference points)

స్థూలంగా చెప్పాలంటే పాశ్చాత్య ప్రపంచంలో గత కొన్ని శతాబ్దాల్లో తలెత్తిన తాత్విక భావాలను, సిద్ధాంతాలను సంశయాత్మకం చేసిన ఒకానొక సాంస్కృతిక, తాత్విక ఉద్యమమే ఆధునికానంతరవాదం. ఇది వర్తమాన సమాజాల్లో శరవేగంగా ముందుకు వస్తున్న మార్పులు, ముఖ్యంగా శాస్త్ర సాంకేతికరంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు స్థలకాలాలకు సంబంధించి శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు స్థలకాలాలకు సంబంధించి మనిషి అనుభవంలోకి వస్తున్న మార్పులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుని మానవ అనుభవంలో ఉండే 'విభిన్నతల్ని'ఇది ఆవిష్కరిస్తుందని ఆయన తెలియజేశారు. Post Modernism పై తెలుగులో కేవలం ఒకే ఒక్క పుస్తకం వెలువడింది. బి. తిరుపతి రావు అనే విమర్శకులు 'Post modernism' పేరుతో వెలువరించినదే తెలుగులో ఈవాదంపై వచ్చిన మొదటి పుస్తకంగా చెప్పవచ్చును.

## 2.15. ద్రవాధునికత (Liquid Modernity)

అత్యాధునిక పోకడల పుణ్యమా అని మనుషులు ద్రవ్యం (డబ్బు) మత్తుకు ఎంతగా బానిసలైనారో, ఆ మడుగు స్థాపనకు మూలధ్రువంలా 'ద్రవాధునికత' అనే మాయాభావన ఎలా దోహదపడుతుందనే విషయాన్నీ ప్రముఖ విమర్శకులు పాపినేని శివ శంకర్ తన 'ద్రవాధునికత' అనే విమర్శ గ్రంథంలో వివరించారు.

పోలండ్‌కు చెందిన ప్రఖ్యాత సామాజిక తత్వవేత్త జిగ్మంట్ బౌమన్ (85) సృష్టించిన Liquid Modernity అనే సరికొత్త సైద్ధాంతిక భావనతో కూడిన ఈ పుస్తకం తెలుగులో ద్రవాధునికత పేరుతో వెలువడింది. పోస్ట్ మోడర్నిజం తరువాత వచ్చిన అత్యాధునిక సాహిత్య ధోరణిగా దీనిని చెప్పుకోవచ్చు. ద్రవాధునికత అంటే ఏమిటి? అనే ప్రశ్నకు ఒక్క మాటలో ఉరకలేసే వర్తమానం అన్న బౌమన్ మాటను సమాధానంగా ఉదహరించారు. అంతేగాక దానిని గాడితప్పిన జీవన విధానం గా అభివర్ణించాడు.

## ఈ అధ్యాయంలోని ముఖ్యాంశాలు

1. ప్రాచీన సాహిత్య అధ్యయనంలో భాగంగా ఒక లక్షణ చర్చగా తెలుగులో సాహిత్య విమర్శ ప్రారంభమైంది.

2. కట్టమంచి కవిత్వ తత్త్వ విచారంలో కావ్యాన్ని అంచనా కట్టడానికి కొత్త సాహిత్య ప్రమాణాల్ని ప్రతిపాదించిన తర్వాత ఆధునిక విమర్శ కొత్త పుంతలు తొక్కిందని చెప్పవచ్చు.

3. ఆ తరువాత ఆధునికతెలుగు సాహిత్య విమర్శలోని వివిధ వాదాలు ధోరణులూ ఉద్భవించాయి. అవి రూప పరామర్శకే పరిమితమయ్యా యని తెలుస్తుంది.

4. సామాజిక స్పృహ లేని వాదాలు, ధోరణులు అంతగా ప్రాచుర్యాన్ని పొందలేక పోయాయి.

5. సైద్ధాంతిక బలం కలిగిన మార్క్సిస్టు – ఆధునికానంతర వాద విమర్శలు మాత్రమే అప్పటి వరకూ వున్న అన్ని అసమానతలను ప్రశ్నించాయని చెప్పవచ్చు.

6. మార్క్సిస్టు తత్త్వ శాస్త్రం వెలుగులో రాచమల్లు రామచంద్రా రెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, త్రిపురనేని మధుసూదనరావు, కెకె రంగనాథాచార్యులు, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి మొదలైన వారు సాహిత్య విమర్శను రాసినట్టుగా తెలుస్తుంది.

7. మార్క్సిస్టు సాహిత్య విమర్శలోని పరిమితుల్ని గుర్తిస్తూ అస్తిత్వంలోకి వచ్చిన స్త్రీ దళిత ప్రాంతీయ మైనార్టీ మొదలైన నిర్దిష్టతా వాదాలన్నిటినీ ఆధునికానంతర వాదం తిరస్కరించింది.

8. స్త్రీవాద దృక్పథంతో జయప్రభ, కాత్యాయినీ విద్మహే, శిలాలోలిత వంటివారు ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడం కూడా గమనిస్తాం.

9. సాహిత్యంలో సాంప్రదాయికంగా స్థిరపడ్డ అన్ని వాదాలనూ – మార్క్సిజంతో సహా – తిరస్కరించడమే ఆధునికానంతరవాదం లోని మౌలిక సూత్రమని చెప్పవచ్చు.

10. సాహిత్యంలో తాత్విక చర్చలు ద్రవ రూపంలో స్థిరంగా ఉండక నిరంతరం మార్పులు చెందుతున్న సామాజిక స్థితి గతులే ఆధారంగా ద్రవాధునికత అనే కొత్త సాహిత్య ధోరణి తెలుగులో ప్రారంభమైంది.

11. ప్రగతి గత కొన్నేళ్లుగా ఎంతగా వ్యక్తిగతమైందో, విధాన రహితమైందో వివరిస్తూ పాపినేని శివ శంకర్ 'ద్రవాధునికత' పేరుతో ఒక వ్యాస సంపుటిని ప్రచురించారు. ఈ విధమైన సాహిత్య ధోరణిని ద్రవాధునికత అంటారు.

ఈ విమర్శ పరిణామాలను ఆధారం చేసుకొని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి విమర్శదృక్పథాన్ని రాబోయే అధ్యాయాల్లో వివరించుకుందాం.

# అధ్యాయం-3

అధ్యాయం – 3

# 'రాచపాళెం' సాహిత్య విమర్శ – తొలిదశ (1972–2000)

## 3.0 పరిచయం

తెలుగు సాహిత్యానికి వెయ్యేళ్ళ చరిత్ర ఉందంటే మనల్ని విస్మయానికి గురిచేస్తుంది. ఈ గత వెయ్యేళ్ళ నుండి సాహిత్యం ఎన్నో పరిణామాలను చవి చూసింది. ప్రాచీన శాసన కాలంనాటి నుండి నేటి ఆధునిక కాలం వరకు అసంఖ్యాకమైన రచనలు వెలువడ్డాయి. ఈ క్రమంలో సాహిత్యం అనేక ప్రక్రియలుగా రూపాంతరం చెందింది. ఇంకా చెందుతూనే ఉంది. ఈ నేపథ్యంలో దాని పరిణామ వికాసాన్ని నెమరు వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ క్రమంలో నా సిద్ధాంత గ్రంథానికి సంబంధించిన మూడవ అధ్యాయం రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి సాహిత్య విమర్శ రచనలను 1972 నుండి 2000 సంవత్సరం వరకు తొలి దశగా విభజించుకొన్నాను. ఎందుకంటే ఆయన సాహిత్య విమర్శ 1972లో మొదలైంది. ఆ సమయానికి రాచపాళెం వారి భావజాలం పూర్తి సంప్రదాయధోరణితో ఉంది. ఆ తరువాత కాలక్రమంలో ఆయన భావజాలంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కాబట్టి వారి విమర్శను చారిత్రక అధ్యయన దృష్టితో పరిశోధించి ఆ పరిణామక్రమాన్ని నిరుపించాలనేదే ఈఅధ్యాయం ముఖ్య ఉద్దేశ్యం.

నా ఈ సిద్ధాంత గ్రంథం శీర్షికను "రాచపాళెం' సాహిత్య విమర్శ– చారిత్రక అధ్యయనం" గా నిర్ణయించుకున్నాను. చాలా మంది 'చారిత్రక' అనగానే వారి దృష్టి చరిత్ర వైపుగా వెళుతుంది. అది నిజమే కానీ నేను చేయబోయే పరిశోధన ప్రాచీన భారతదేశ చరిత్రకో, ఆధునిక అంధ్రప్రదేశ్ చరిత్రకో సంబంధించినది కాదు. ప్రసిద్ధి చెందిన వర్తమాన విమర్శకుల్లో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి విమర్శ రచనలకు సంబంధించిన

చరిత్రను పరిణామక్రమంలో అధ్యయనం చేయడమే నా పరిశోధన ప్రథమ లక్ష్యం. కాబట్టి విమర్శ అనేది సాహిత్యంలో ఒక భాగమే కనుక సాహిత్య అధ్యయనమే నా పరిశోధనలో ప్రధానంగా చోటుచేసుకుంటుందని తెలియజేస్తున్నాను.

## 3.1. సాహిత్య అధ్యయన పద్ధతులు

"సాహిత్యం అనేది మానవుని అంతరంగ జగత్తుకు సంబంధించినది. హేతు విశ్లేషణములకు, తాత్త్విక ప్రమాణములకు అతీతమైనది. అందువలన సాహిత్య లోకమున సమగ్రము సర్వాంగీకృతము నిర్దుష్టమైన సిద్ధాంతం చేయుట సుసాధ్యము కాలేదు. కావ్యనుశీలన రీతులను, సాహిత్య అధ్యయన పద్ధతులను తెలిసికొని కావ్యములను పఠించు వారికి మాత్రమే సాహిత్య తత్వము కొంత అవగత మగును"[1] కాబట్టి ఈ సాహిత్య అధ్యయన పద్ధతులను గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉంది. సాహిత్య అధ్యయన పద్ధతులను ఆచార్య జి.నాగయ్యగారు ముఖ్యంగా మూడు పద్ధతులుగా పేర్కొన్నారు. 1. కాలానుసరణ అధ్యయన పద్ధతి, 2. చారిత్రక అధ్యయన పద్ధతి, 3. తులనాత్మక అధ్యయన పద్ధతి.

### 3.1.1. కాలానుసరణ అధ్యయన పద్ధతి (Chronological Study Method)

కావ్యాలను కవుల జీవిత కాలానుసారంగా అధ్యయనం చేయడాన్ని కాలానుసరణ పద్ధతి అంటారు. ఒక కవి అనేక గ్రంథాలను రచించినప్పుడు, రచనా కాలాన్ని బట్టి వాటి పూర్వా పరాలను నిర్ణయించుకొని వాటిని అధ్యయనం చేయడమే ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశ్యం. దీని వలన ఏ యే కాలంలో ఏ యే కవుల కృషి కారణంగా సాహిత్యం అభివృద్ధి చెందిందో, లేక అభివృద్ధికి నోచుకోలేదో అన్న విషయాన్నీ తెలుసుకోవచ్చు. కవి అంతర జీవితం, శిల్ప సంపద పరిణామాలను, కవి అనుభూతులను, మానసిక నైతిక ప్రవృత్తుల క్రమాభివృద్ధిని, కళా పరివర్తన ప్రకారాన్ని కాలానుసరణ పద్ధతి ద్వారా తెలుసుకోవచ్చు. రచనా కాలాన్ని బట్టి

[1] తెలుగు సాహిత్య సమీక్ష. జి. నాగయ్య.మొదటి సంపుటం.పుట:4

కావ్యాన్ని అధ్యయనం చేస్తే కవి మనః ప్రవృత్తిలో కలిగిన పరివర్తనాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో పూర్వ కవుల జీవిత చరిత్రలు సమగ్రంగా తెలియకపోతే ఈ పద్ధతిని అనుసరించి కావ్యాన్ని అధ్యయనం చేయడం కష్టతరమని చెప్పవచ్చు.

### 3.1.2. చారిత్రక అధ్యయన పద్ధతి (Historical Study Method)

ఒక భాషలో వచ్చిన సాహిత్యాన్ని కాలక్రమ దృష్టితో పరిణామ స్వరూపాన్ని, పూర్వ పర సంబంధాన్ని నిరూపించే విధానమే చారిత్రక అధ్యయన పద్ధతి. “సమకాలిక జగత్తునకు సామాజిక సంచలమునకు అతీతముగా ఏ మహాకవియు జీవించలేదు. కవి రమ్య హర్మ్యములోని రత్న స్తంభము కాదు. నిర్జనారణ్యములోని శిథిలాలయమును కాదు. కవి సమకాలీన సమాజములో చైతన్య వంతుడైన మనిషి. సమాజంలోని పురోగామి శక్తుల అక్షర రూపమే కావ్యము. కనుక పరిసర సాంఘిక ప్రభావము ప్రతి కావ్యమున అనివార్యముగా ప్రసరించును”[2] అనే నాగయ్య గారి వాక్యాల్లో కవి అంటే విమర్శకుడు గాను, కావ్యం అంటే విమర్శ గ్రంథం గానూ కూడా గ్రహించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ కవి, కావ్యం అనే పదాలు బహుముఖార్థాల్ని సూచిస్తున్నాయి. ఒక కవి తన కాలంలోని సాంఘిక, రాజకీయ దేశ పరిస్థితులు అతని జీవితం మీద అతని రచనల మీద ప్రభావాన్ని చూపుతాయి. ఈ ప్రభావమే చారిత్రక అధ్యయన పద్ధతికి తోడ్పడుతుంది. ఒక కావ్యంలో గానీ, విమర్శ గ్రంథంలో గానీ గుణ దోషాలను వివరించడానికి చారిత్రక అధ్యయన పద్ధతిఎంతగానో ఉపయోగపడుతుంది. చారిత్రక సామాజిక శక్తులతో సంబంధము

[2] తెలుగు సాహిత్య సమీక్ష. జి. నాగయ్య.మొదటి సంపుటం.పుట:6

లేక చేయు కావ్య పతనము నిష్ప్రయోజనము.[3] అని ఆచార్య నాగయ్యగారు చెప్పిన మాటలు సత్యదూరాలు కావు.

### 3.1.3. తులనాత్మక అధ్యయన పద్ధతి (Comparative Study Method)

ఏదైనా ఒక అధ్యయనం వల్ల సమగ్రమైన విజ్ఞానం లభించిందంటే అది తులనాత్మక అధ్యయనమే అని చెప్పాలి. ఎందుకంటే ఇందులో అనేక రకాలైన రచనలను మరికొన్ని సారూప్యం కలిగిన రచనలతో పోల్చి చూడటం జరుగుతుంది. తారతమ్య దృష్టితో కావ్య నిరూపణ చేయడం ఈ అధ్యయనంలో ముఖ్యాంశం. "ఇరుగుపొరుగు భాషల్లో, లేదా భిన్న దేశాల్లో వెలసిన సాహిత్యాలను సరిపోల్చి వాటిలోని సామ్యవైషమ్యాలను పరస్పర ప్రభావాదులను, ప్రత్యేక లక్షణాలను పరిశీలించడమే తులనాత్మక పద్ధతి. ఈ పద్ధతి అర్వాచీనం, పాశ్చాత్య దేశాల్లో పాతికేళ్ళ నుండి ప్రాముఖ్యానికి వచ్చింది. భారతీయ సాహిత్య విషయంలో తులనాత్మక పరిశీలనకు సాటిలేని ప్రాధాన్యం ఉంది. తులనాత్మక పద్ధతిలో భారతీయ సాహిత్యాలను అధ్యయనం చేయడం జాతి సమైక్యతకు, భావ సమైఖ్యతకూ దోహద పడుతుంది."[4]

పైన వివరించిన సాహిత్య అధ్యయన పద్ధతులు మూడు ఒక దానికి మించి మరొకటి అత్యంత అధ్యయన ప్రయోజనాన్ని కలిగి ఉంటాయి. దీనినే సాహిత్య పరిభాషలో 'ఉత్తరోత్తర శ్రేష్టతామాల' అని అనవచ్చు. అంటే కాలానుసరణ అధ్యయన పద్ధతి కంటే చారిత్రక అధ్యయన పద్ధతి, చారిత్రక అధ్యయన పద్ధతి కంటే తులనాత్మక అధ్యయన పద్ధతి శ్రేష్టమైనవి.

---

[3] తెలుగు సాహిత్య సమీక్ష. జి. నాగయ్య.మొదటి సంపుటం.పుట:7

[4] డాక్టర్ జి. నాగయ్య గారి 'దాక్షిణాత్య సాహిత్య సమీక్ష'(మొదటి సంపుటి.1976)కు రాసిన ప్రవేశిక

కాబట్టి సాహిత్య పరిణామ వికాసాన్ని అర్థం చేసుకోవాలంటే పైన తెలిపిన అధ్యయన పద్ధతుల్లో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

## 3.2. చారిత్రక అధ్యయనం (Historical Study)

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో వచ్చి చేరిన సాహిత్య ప్రక్రియల్లో సాహిత్య విమర్శ ఒకటి. ఈ విమర్శకు సంబంధించి శాస్త్రీయమైన సైద్ధాంతిక రచనలను ఒక పరిణామ క్రమపద్ధతిలో విశ్లేషించి చేసే అధ్యయనాన్నే 'చారిత్రక అధ్యయన పద్ధతి'(Historical Study) అంటారు.

## 3.3. చారిత్రక అధ్యయన పద్ధతులు

చారిత్రక అధ్యయన పద్ధతుల్లో ముఖ్యమైన మూడు విధానాలను కింది విధంగా చెప్పవచ్చును. అవి: సంఘటనల పద్ధతి, క్రమానుగత పద్ధతి, విశ్లేషణ పద్ధతి. రాచపాళెం సాహిత్య విమర్శలోని అంశాలను చారిత్రక అధ్యయనం చేయడానికి వీలుగా ఉన్న కొన్ని ముఖ్యాంశాలను కింది విధంగా చెప్పవచ్చు.

1. రాచపాళెం ఏ యే దశలలో ఏ యే విమర్శా విధానాలను అనుసరించారో గుర్తించవచ్చు.

2. రాచపాళెం సాహిత్య విమర్శలో సమాజం గురించి సాహిత్యం గురించి ఏ యే అంశాలను కేంద్రీకృతం చేయాలనుకున్నారో తెలుసుకోవచ్చు.

3. సాహిత్య విమర్శలో రాచపాళెం ప్రదర్శించిన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ దృక్పథాలను గుర్తించవచ్చు.

4. విభిన్న, సామాజిక, సాహిత్య భావజాలాల పట్ల రాచపాళెం దృక్పథం – మనువిజం, గాంధీయిజం, మార్క్సిజం, అంబేద్కరిజం, ఫెమినిజం మొదలైనవి.

5. తెలుగు సాహిత్య విమర్శాభివృద్ధికి రాచపాళెం చేసిన మౌలిక కృషి.

మొదలైన అంశాలను నా పరిశోధన ద్వారా విపులీకరించే ప్రయత్నం చేస్తాను.

## 3.4. రాచపాళెం సాహిత్య విమర్శ – తొలిదశ (1972–2000)

మూడవ అధ్యాయంలో భాగంగా రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు రచించిన విమర్శ రచనలను ఒక కాలక్రమ పద్ధతిలో జాబితాను తయారు చేసుకుని ఆయా కాలాల వారిగా అధ్యయనం చేసి వాటిని విశ్లేషించి వివరించే ప్రయత్నం చేస్తాను. ఇందులో భాగంగా రాచపాళెం వారు 1972 లో మొట్టమొదటి సారిగా 'సినిమా కవిత్వం' అనే అంశంపై వ్యాసం రాసారు. అది 1972 అక్టోబర్ మాసపు స్రవంతి పత్రికలో అచ్చయింది. అయితే రాచపాళెంవారు అప్పుడు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం లో స్నాతకోత్తర విద్యను అభ్యసిస్తూ ఉన్నారు. యువకులవడం చేత, పైగా ఆ వయసులో సినిమాలపై ఉన్న మక్కువ చేత రాచపాళెం వారిని ఆ సమయంలో సినిమాలకు సంబంధించిన సాహిత్యంపై వ్యాసం రాసేలా ఉసిగొల్పిందేమోనని నా ఊహ. ఏదైనా ఒక విషయానికి సంబంధించిన సమాచారం సమగ్రంగా అందుబాటులో లేనప్పుడు అక్కడ కొన్ని ఊహాత్మక ఆలోచనలకు తావు ఏర్పడుతుంది. పరిశోధనలో భాగంగా ఈ వ్యాసం కోసం అనేక గ్రంథాలయాలను, అనేకమంది రచయితలను, స్వయంగా రాచపాళెం వారినే కలిసాను. కానీ రాచపాళెం వారు రాసిన ఆ వ్యాసం నాకు లభించలేదు.

## 3.5. రాచపాళెం – పరిశోధనలోకి ప్రవేశం

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు 1973 లో పరిశోధన రంగంలోకి ప్రవేశించారు. ఈయన పరిశోధనకు ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావుగారు పర్యవేక్షకత్వం వహించారు. పింగళి సూరన రచించిన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని తన పరిశోధనాంశంగా స్వీకరించారు. ఆప్పటికే రాచపాళెం వారికి గురువులుగా ఉన్న ఆచార్య జి ఎస్ రెడ్డి, తుమ్మపూడి కోటీశ్వరరావు గార్ల సాన్నిహిత్యం వల్ల పైగా వారు స్వభావరీత్యా సాంప్రదాయ వాదులు అవ్వడంతో రాచపాళెం వారు కూడా సాంప్రదాయ సాహిత్యానికి సంబంధించిన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని పరిశోధనకు తీసుకున్నారు. అప్పటికే 'ఆముక్తమాల్యద

సౌందర్యం' అనే గ్రంథాన్ని తుమ్మపూడి కోటీశ్వరరావు రచించి ఉన్నారు. కాబట్టి ఆయన శిల్పదృష్టి కలిగిన వ్యక్తిగా సాహిత్య కారులందరికి సుపరిచితమే. రాచపాళెం వారి పర్యవేక్షక గురువు శిల్పదృష్టి కలిగిన వ్యక్తీ కాబట్టి తన విద్యార్థికి కూడా శిల్ప వివేచనకు సంబంధించి ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని సూచించి ఉంటారు. ఆ విధంగా "శిల్ప ప్రభావతి" పేరుతో ఆయన తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. రాచపాళెం వారు రచించిన మొట్టమొదటి విమర్శన గ్రంథంగా దీనిని పేర్కొనవచ్చు. అయితే మొదట దీనిని రాసే క్రమంలో 1977 సంవత్సరంలో రాచపాళెం వారు ఉపయోగించిన భాష గ్రాంథికంతో, సంధి పదాలతో కూడి ఉంది. ఆ తరువాత 1980లో దానిని "శిల్ప ప్రభావతి" పేరుతో అచ్చు వేసేటప్పుడు సరళ గ్రాంథికంలోకి మార్చి దానిని ప్రచురించారు. రాచపాళెం వారి సాహిత్య విమర్శను ప్రాచీన సాహిత్య విమర్శ, ఆధునిక సాహిత్య విమర్శ అని, తులనాత్మక సాహిత్య విమర్శ అని మూడు రకాలుగా విభజించుకోవచ్చు. వాటిని ఈ కింది విధంగా వివరించుకోవచ్చు.

## 3.6. ప్రాచీన సాహిత్య విమర్శ

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి సాహిత్య విమర్శ మొదట ప్రాచీన సాహిత్యం పై వెలువడింది. ఈ విభాగంలో ప్రాచీన కావ్యాలు, అందులోని అవతారికలు, శిల్ప నైపుణ్యం, రచనా పాటవం మొదలైన విషయాలను ఈ ప్రాచీన సాహిత్య విమర్శ విభాగంలో వివరించారు.

## 3.7. సిద్ధాంత గ్రంథ రచన అవిరళ కృషి

1973 వ సంవత్సరంలో ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు గారి దగ్గర పరిశోధక విద్యార్థిగా చేరిన రాచపాళెంవారు పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని పరిశోధనాంశంగా ఎంచుకున్నారు. ఆ తరువాత వావిళ్ళ వారు ప్రచురించిన ఆ కావ్య ప్రతిని ఒక్క దానిని కొని వారి పొలంలో చెట్ల కింద పద్యాల్ని అవపోశనపట్టేవారు.అలా ఒకటి రెండుసార్లు ఆ కావ్యాన్ని చదవడంతో దానిని శిల్ప దృష్టితో వివేచించడానికి కావలసిన శక్తిని సంపాదించు కున్నారు. అదే క్రమంలో పింగళి సూరనపై వచ్చిన కొన్ని విమర్శనా గ్రంథాలు,

వారి పర్యవేక్షక గురువైన ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు గారి "ఆముక్తమాల్యదా సౌందర్యం'', ఆచార్య జి వి సుబ్రహ్మణ్యం గారి "ప్రథమాంధ్ర పురాణం", విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన అనేక విమర్శ గ్రంథాలను అధ్యయనం చేసారు. ఆ విధంగా కొన్ని విమర్శా సూత్రాలను తెలుసుకున్న ఆయన *"పింగళిసూరన కవితా సిద్ధాంతం–ఆలంకారికులు"* అనే వ్యాసాన్ని రాసారు. అది 1975 లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాల మ్యాగజైన్ లో ప్రచురితమైంది. ఆ తరువాత అదే మ్యాగజైన్లో 1977లో *"కళాపూర్ణోదయం - కథా నిర్మాణ సౌందర్యం"* అనే మరో వ్యాసం ప్రచురితమైంది. ఆ తరువాత ఎన్నో కుటుంబ సమస్యలను ఎదుర్కొంటూనే తన సిద్ధాంత గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించారు. ఇందులో కథా శిల్పానికి సంబంధించిన అధ్యాయంలోని కథా నిర్మాణం అనే విభాగాన్ని వారి పర్యవేక్షక గురువైన ఆచార్య ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావుగారు మూడు సార్లు రాయించారు[5]. రాచపాళెం వారిలోని ప్రతిభను వెలికితీసే ఉద్దేశ్యంతోనే ఇలా చేసుంటారని అనుకోవచ్చు. ఈ విధంగా రాచపాళెం వారు తన సిద్ధాంత గ్రంథాన్ని 1976 లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారికి సమర్పించాడు.

## 3.8. ప్రభావతీ ప్రద్యుమ్నం కావ్య పరిచయం

సంప్రదాయ తెలుగు సాహితీకారుల్లో "కతరాజు" గా పేరుపడ్డ పింగళి సూరన ఎంతో విశిష్టుడు. ఈయన రచించిన "కళాపూర్ణోదయం", "ప్రభావతీ ప్రద్యుమ్నం" తెలుగు సాహిత్యంలో అపూర్వ కథా రచనలుగా పేరు పొందాయి. కథా నిర్మాణ కౌశలంలో, కథన నిర్మితి పరిణతిలో ఇతనికున్న ప్రతిభ అనన్య సామాన్యం. స్వయంకల్పిత కథల్ని అల్లటంలోనూ, పురాణం పాత్రలను వినియోగించటంలోను, ఉత్కంఠత పెంచుకుంటూ కథను చెప్పటం లోనూ ఇతనికితనే సాటి. ఇవి రెండూ కాక చిన్నతనంలోనే "రాఘవపాండవీయం" అనే ద్వ్యర్థి కావ్యం కూడ రాసిన కవిమూర్తి పింగళి సూరన. ఈ "ప్రభావతీప్రద్యుమ్న" కావ్యాన్ని అతను 1590 ప్రాంతాల్లో రాసి వుంటాడని పరిశోధకుల

[5] 'సాహిత్య విమర్శకుడిగా నా పుట్టుక'(వ్యాసం) "రాచపాళీయం"( షష్ట్యబ్ది అభినందన సంచిక).పుట: 209

అభిప్రాయం. ఆ కావ్యం రచించిన ఇంత కాలానికి కూడా ఇంకా గుర్తుపెట్టుకొని పరిశోధనకు నోచుకుందంటే ఆ కావ్య ప్రత్యేకతను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 3.9. పరిశోధనా క్రమంలో రాసిన వ్యాసాల అనుశీలన

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తాను పరిశోధనలోకి ప్రవేశించిన తొలిరోజుల్లో పింగళి సూరన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉండేవారు. ఈ క్రమంలో పింగళి సూరన కవితా సిద్ధాంతం – ఆలంకారికులు, కళాపూర్ణోదయం – కథా నిర్మాణ సౌందర్యం, పింగళి సూరన కథా నిర్మాణ చాతుర్యం అనే వ్యాసాలను రచించారు.

మొదటి వ్యాసంలో పింగళి సూరన తన కావ్యాల్లో, అవతారికల్లో, కావ్య మధ్య భాగాన చెప్పిన సాహిత్య సిద్ధాంత విషయాలను విశ్లేషించి, అలంకారికుల అభిప్రాయాలతో సమన్వయం చేశారు. శబ్ద సంస్కారం, పద మైత్రి, శబ్ద సమయోజనం, శబ్దాలంకారాలు, అక్లిష్టత మొదలైన అంశాలను ఆలంకారికులు పేర్కొన్న కావ్య గుణ దోషాల నేపథ్యంలో పరిశీలించారు. ఏ చిన్న అంశాన్ని సంపూర్ణంగా భావించకుండా కావ్యం రాయకూడదని సంపూర్ణంగా భావించినప్పుడు కవి ఆ అనుభూతికి పరవశుడై పోతాడని, కావ్యం రాయడం సాధ్యం కాదని అందువల్ల కవి అనుభూతి పారవశ్యంలో నుంచి బయటకు వచ్చి కావ్యం రాయాలని పింగళి సూరన భావించినట్లు పేర్కొన్నారు.

**'ఏ యంగకమును భావన**
**చేయక వ్రాయంగ రాదు వ్రాసిన నానం**
**దాయత్తత మది జొక్కు ప**
**రాయత్తపు బుద్ధి జెలువ నలవియ వ్రాయన్'**

ఈ పద్యభావం భారతీయ అలంకారశాస్త్రంలో ఎక్కడా చెప్పబడలేదని ప్రపంచ దేశాల సాహిత్యాలన్నింటిలో అప్పుడప్పుడే రూపు దిద్దుకోబోతున్న కాల్పనిక యుగ లక్షణమైన అనుభూతికి భారతీయ కవి లోక ప్రతినిధిగా పింగళి సూరన ఈ పద్యం రాసినట్టు అభిప్రాయపడ్డారు. పింగళి సూరన ప్రబంధ కవుల్లో ప్రయోగవాది. ప్రబంధ కవులందరూ

వర్ణనకు ప్రాముఖ్యం ఇస్తున్న రోజుల్లో, వర్ణనతో పాటు కథకు కూడా ప్రాముఖ్యం ఇచ్చిన కవి పింగళి సూరన, పద్యమయ నవలగా కళాపూర్ణోదయం, పద్య నాటకంగా ప్రభావతీ ప్రద్యుమ్నం విద్వాంసుల చేత ప్రశంసించబడ్డా[6]యి. కళాపూర్ణోదయంలో కథ చాలా సంక్లిష్టమై జరిగిన కథను జరిగినట్లు చెప్పకుండా, కొంత తాను చెప్పి మరికొంత పాత్రతో చెప్పించటం వల్ల, పాత్రలు అప్పుడప్పుడు రూప పరివర్తన చెందటంతో కళాపూర్ణోదయ కథను అర్థం చేసుకోవడంలో పాఠకుడు శ్రమించవలసి వస్తుంది. అందుకే పింగళి సూరన కళాపూర్ణోదయం గురించి చెప్తూ 'అత్యాపూర్వకథ సంవిధాన వైచిత్రి మాయనీయం' అని పేర్కొన్నారు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు రెండవ వ్యాసంలో దీనినే ఋజువు చేసారు.

## 3.10. పింగళి కథా నిర్మాణ సౌందర్య నిరూపణ

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన పరిశోధనలో భాగంగా పింగళి సూరన కథా నిర్మాణ వైచిత్రిని నిరూపించడం కోసం కళాపూర్ణోదయం కావ్యంపై మొదటి భాగంగాను, ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంపై రెండో భాగంగాను రాశారు. ఈ మొదటి భాగం 1979 స్రవంతి పత్రిక సెప్టెంబరు సంచిక లోను, రెండవ భాగం శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి వార్షిక సంచికలోను ప్రచురితమయ్యాయి. రెండు భాగాలుగా ఉన్న ఈ వ్యాసాల్లో మొదటి భాగంలో పింగళి సూరనార్యుడు ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలో ప్రదర్శించిన కథా నిర్మాణ పద్ధతిని పరిశీలించి నిరూపించారు.

కావ్యంలోని సంఘటనలు వర్ణనలు వేటికవిగా రమణీయ శిల్పభూములుగా ఉన్నా అవి చమత్కారమైన సమన్వయ శిల్పంగా రూపొందినప్పుడే అది ఉత్తమ రమ్య కావ్యం అవుతుందని, ఉత్తమ కావ్య శిల్పం ప్రతిభా వంతుడైన కవికి పరీక్షా పత్రం వంటిది రాచపాళెం పేర్కొన్నారు.

---

[6] *'సమగ్రాంధ్ర సాహిత్యం'*,(8వ సంపుటం),ఆరుద్ర. పుట:205

పింగళి సూరన కథా నిర్మాణ కౌశలాన్ని గురించి తెలుసుకునే ముందు అసలు కథా నిర్మాణ అంటే ఏమిటో తెలుసుకుందాం!

## 3.11. కథా నిర్మాణం

కథా నిర్మాణం అంటే కథలో సంఘటనల్ని ఓ క్రమపద్ధతిలో అమర్చటం. దేనినే ఆంగ్లంలో plot అనీ తెలుగులో 'నిర్మాణం'అనీ అంటారు.

కానీ పైన చెప్పినంత సులభంగా కథా నిర్మాణం సాధ్యం కాదనే చెప్పవచ్చు. ఎందుకంటే కథా నిర్మాణం అనేది ఒక్క ఉదుటున వచ్చేది కాదు. అది కథారంభం మొదలు చివరి వరకు ప్రత్యేక శ్రద్ధతో రూపొందించాల్సిందే. అలాగే సంఘటనల్ని, సన్నివేశాల్ని ఒకదాని తర్వాత మరొకటి పేరుస్తూ వెళ్లిపోవటం వల్ల కథకి ఓరూపం వస్తుందేమో కానీ, అది అందరూ గుర్తుంచుకునేంత గొప్పగా రూపొందాలంటే నిర్మాణం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అయితే, నిర్మాణం మీద అంత శ్రద్ధ పెట్టినట్లు బయటికి కనపడకూడదు. అంటే, నిర్మాణం అనేది మిగతా అంశాలని (కథనం, సంభాషణలు, పాత్ర చిత్రణ, వగైరా) కమ్మేయకుండా రచయితలు జాగ్రత్త పడాలి. కథ ఓ పూల మాల అనుకుంటే, plot అందులో దారం అనుకోవచ్చు. దారం లేనిదే దండ లేదు కానీ, దండలో అంతటా దారమే అగుపిస్తే ఎంత బోసిగా అనిపిస్తుందో, కథని నిర్మాణ కౌశలం డామినేట్ చేస్తే అది కూడా అలాగే వెలవెలాపోతుంది. కాబట్టి కథా నిర్మాణం కత్తిమీద సాము వంటిది.[7] ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలో పింగళి సూరన కథా మూల సూత్రాన్ని కవి స్వయంగా చెప్పకుండా సంఘటనో, సంభాషణ, కావ్య మధ్య భాగంలోనో వ్యక్తం చేసి పాఠకులను ఆశ్చర్యానికి గురి చేసారని రాచపాళెం వారు గుర్తించారు. కళాపూర్ణోదయంలో కథా బీజం నాయిక పరంగానూ కావ్యనామం నాయక పరంగానూ ఉన్నాయి. కానీ ప్రభావతీ ప్రద్యుమ్నంలో కథా బీజం, కావ్య నామం రెండూ నాయకానాయికల ఇద్దరి పరంగా ఉందని చెప్పవచ్చు. ప్రభావతీ, ప్రద్యుమ్నల ప్రణయ వృత్తాంతం. కళాపూర్ణోదయంలోని కలభాసిణి వృత్తాంతం, మధురలాలస

[7] 'కథాయణం' బ్లాగు నుండి తీసుకోబడింది. 'కథా నిర్మాణం' గురించి అనిల్ రాయల్ వివరణ.

వృత్తాంతం, సరస్వతి చతుర్ముఖుల ప్రణయ వృత్తాంతాలను సమన్వయించి తీరును గమనిస్తే అ కావ్యాల మూలబీజాల్ని కథలో గాఢంగా సమన్వయించి కథా నిర్మాణాన్ని పటిష్టం చేసాడని రాచపాళెం వారు నిరూపించారు. అదేవిధంగా ఈ కావ్యంలోని సమస్యాత్మక సంఘటలను రుపొందిచేటప్పుడు సూరనను ఒక జ్ఞాత శిల్పిగా అభివర్ణించారు. కథా నిర్మాణంలో కవి మర్మజ్ఞతను తెలియజేసే మరొక అంశం ఏంటంటే కావ్యంలోని ఒక విషయాన్ని రెండుగా విభజించి వాటిని అనేక చోట్ల అన్వయించడం అని చెప్పవచ్చు.

## 3.12. శిల్ప ప్రభావతీ రచనా నైపుణ్యం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి సిద్ధాంత గ్రంథం 1980 వ సంవత్సరంలో "శిల్ప ప్రభావతీ" పేరుతో మొదట ప్రచురింపబడింది. కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతం, వింజమూరి రంగాచార్యులు మొదలైన వారు పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని అంతకు పూర్వమే విమర్శించారు. కానీ వారి విమర్శ కేవలం నామమాత్రం అగుటచే దానిని కూలంకషంగా అధ్యయనం చేసే అదృష్టం, ఆవశ్యకత రాచపాళెం వారికి దక్కింది. ఆచార్య జి. ఎన్.రెడ్డి గారు ఈ గ్రంథానికి 'శిల్ప సమీక్ష' పేరుతో ముందుమాట రాస్తూ "ప్రభావతీ ప్రద్యుమ్న ప్రబంధంలోని బహుముఖ శిల్పాన్ని సప్రమాణంగా, అపూర్వంగా నిరూపించే విమర్శ గ్రంథం ఇది"[8] అన్నారు. అదేవిధంగా రాచపాళెంవారు ఆ కావ్యాన్ని విమర్శించిన తీరును గమనిస్తే 'శిల్ప ప్రభావతి'లో సహృదయ విచారణ ప్రత్యంగుళమూ స్పందిస్తుంది. హృదయంలాగా కవిహృదయం లాగా నామకరణంలోనే ఆ చైతన్య సౌందర్యం ఉంది. భారతీయ శిల్ప మాధుర్యముంది. అంటే ఈ విమర్శ గ్రంథంలో సహృదయ విచారాధారశీలమైన ఆర్ద్రత ఉందని వ్యక్తమౌతుంది'[9]. అదేవిధంగా సర్దేశాయి తిరుమల రావుగారు కట్టమంచివారు చేసిన కళాపూర్ణోదయ కావ్యవిమర్శ, ప్రభావతీ ప్రద్యుమ్న కావ్య విమర్శలను రాచపాళెం వారి శిల్ప వివేచనతో పోల్చి

[8] శిల్ప ప్రభావతీ గ్రంథానికి జి ఎన్ రెడ్డి గారు రాసిన ముందుమాట.

[9] శిల్ప ప్రభావతీ గ్రంథానికి తుమ్మపూడి కోటీశ్వర రావు గారు రాసిన ముందుమాట

చూసారు. అయితే రాచపాళెం వారు కట్టమంచి వారిని వ్యతిరేకించిన తీరును శిల్పప్రభావతిలో గమనించవచ్చు. ఈ విమర్శ గ్రంథం కేవలం శిల్ప దృష్టితో మాత్రమే రచించారు. కాబట్టి శిల్ప నిర్మాణానికి సంబంధించిన విమర్శే ఇందులో సంధి చేసుకుందని చెప్పవచ్చు.

గ్రంథారంభంలో కవి కావ్యం పేరుతో పింగళి సూరన కవికి సంబంధించిన వంశ వృక్షాన్ని పుట్టుపూర్వోత్తరాలను తెలియజేసి, ప్రభావతీ ప్రద్యుమ్న కావ్య రచనకు దోహదం చేసిన పరిస్థితులను వివరించారు. పింగళి అనే ఇంటి పేరు మొదలుకొని ఆయన వంశజుల తాలూకు ప్రాంతాల వరకు సంబంధించిన చారిత్రక ఆధారాలను ఇందులో వివరించారు. అయితే రాఘవపాండవీయం, కళాపూర్ణోదయం వంటి గొప్ప కావ్యాలను రాసిన పింగళి సూరనకు ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యం ఎందుకు రాయవలసి వచ్చిందో దానిని ఈ కింది పద్యంలో వివరించారు.

**ఏనుం బిత్రు పూజన నాచే**
**నైనట్లెద్దియైన చేయగా వలయున్**
**గాన కృతి యిచ్చి మేదిని**
**పై నిలుపుదు నతని కీర్తి పరమేశు కృపన్.(1-9)**

పితృ పూజనార్థమే ఈ కథను ఎందుకు రచించాడంటే, ఈ కావ్యంలోని ప్రద్యుమ్నుడు తండ్రికి శత్రు నాశము అయ్యేలా చేసి తానూ కన్యా లాభాన్ని పొందాడు. ఇది ఇద్దరికీ ప్రయోజనమే కనుక ఈ సామ్యమును చూచిన సూరన ఈ కథనే ఎన్నుకొని కావ్యంగా రచించినట్లు రాచపాళెం వారి వివరణ.

అదేవిధంగా తిలకాయ మానంబుగా అని చెబుతూ ప్రబంధం, పురాణంల మధ్యగల తేడాలను వివరించారు. ప్రబంధం అనేది నేటి పరిమిత కుటుంబంలాంటిదని దానిపరిమాణానికి ఉపమానంగా కుటుంబాన్ని తీసుకున్నారు. అసంక్షిప్తత, అనతి విస్తృతి అనేవి పురాణం నుండి ప్రబంధాన్ని వేరు చేసే లక్షణమని చెప్పడం రాచపాళెంవారి సూక్ష్మదృష్టికి తార్కాణంగా చెప్పవచ్చు. పురాణంలోని వర్ణనలను తంత్రి వార్తలతో పోల్చి,

ప్రబంధంలోని వర్ణనలు ఒక వ్యక్తి ఒక విషయము గూర్చి సంపూర్ణముగా పూసగుచ్చినట్టు చెప్పి ఒకరాత్రి మనఇంట గడిపి పోయినట్లు ఉండును.[10] అని చెప్పుటలో రాచపాళెం వారి వర్ణనా నైపుణ్యం వ్యక్తమవుతుంది. కథా విస్తృతికి సంబంధించి ప్రబంధానికి, పురాణానికి మధ్యగల భేదాల్ని వివరిస్తూ ప్రబంధ కథ అతి సూక్ష్మమైనది కాగా, పురాణకథ స్థూలమైనది. ఇంతకుముందు చెప్పినట్టుగా ప్రబంధం ఒక పరిమిత కుటుంబం లాంటిది కాగా పురాణాన్ని వసుధైక కుటుంబంగా అభివర్ణించారు. ప్రబంధం అనేది అందులోని ఒక వ్యక్తి కుటుంబం. పురాణ మహా వృక్షానికి పుట్టిన ఒక కొమ్మయో, రెమ్మయో ప్రబంధ కథ. పురాణములో ఉపాఖ్యానములు ఎక్కువ. అని రెండింటికి మధ్య కథా విస్తృతిలో ఉన్న తేడాలను వివేచించారు. ఈ రకమైన విమర్శ విమర్శ భేదాలలోని 'అలంకార విమర్శ'కి చెందుతుంది. దీన్నే 'కావ్య విమర్శ' అంటారు.

## 3.13. శిల్పం

"శిల్పమనగా కథాసంవిధానం, పాత్ర చిత్రణం, రస పోషణం, అలంకార భూషణం, రీతి, శయ్య, పాకమిత్యాదిగా గల కావ్యగత బహు విషయ సమాహారభూతమైన యొకానొక మహా విషయము శిల్పము"[11] ప్రబంధంలో శిల్పం బహు ముఖాలుగా ఉంటుంది. కథ, కథన, రస, పాత్ర, వర్ణనాలంకార, శైలి మొదలైన భంగిమలలో కావ్యశిల్పం ఉంటుందని రాచపాళెం వారు వ్యాఖ్యానించారు. ఒక బండరాయి లోపల శిల్పం దాగి ఉన్నట్టుగా, ఒక కావ్యంలోని కథను లోతుగా అధ్యయనం చేయడం వలన దానిలోని 'శిల్ప సౌందర్యం' బయట పడుతుంది.

## 3.14. శిల్ప ప్రభావతి – శిల్ప వైశిష్ట్యం

'శిల్ప ప్రభావతి' గ్రంథం మొత్తం శిల్పం చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. అది కథాశిల్పం కావచ్చు, కథన శిల్పం కావచ్చు, పాత్రల శిల్పం కావచ్చు. అందుకే ఈ గ్రంథానికి

[10] శిల్పప్రభావతి .పుట:10

[11] తిక్కనగారి ఉభయ కావ్య ప్రౌఢి. ముదిగొండ ఈశ్వర చరణ్.పుట:24

‘శిల్ప ప్రభావతి’ అని నామకరణం చేసారు. ఈ గ్రంథంలోని మొదటి అంశమైన కథాశిల్పం విషయానికొస్తే ప్రబంధాలు పరిమిత కథా సహితాలనీ కాబట్టి మార్పులు చేర్పులు సహజమని రాచపాళెం వారు చెప్తారు. ఈ విధమైన దృష్టితోనే ఈ కావ్యంలోని కథా శిల్పాన్ని పరిశీలించారు. ఆ విధంగా పరిశీలించి సంస్కృత హరివంశ కథయు, నాటక కథయు ప్రభావతీ ప్రద్యుమ్నమునకు మూలములగుచున్నవి.[12] అని కథా శిల్పంలో ప్రభావతీ ప్రద్యుమ్న కావ్య కథకు మూలాన్ని అన్వేషించి పింగళి సూరన కవి చేసిన కథా మార్పులను, సంతరించిన కూర్పులను హేతుబద్ధంగా నిరూపించారు.

కల్పనా సాహిత్యం (Fiction)లో కథ అనేది ఒక ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ. పాశ్చాత్య సాహిత్యం నుండి తెలుగులోకి వచ్చిన సాహిత్య ప్రక్రియ కథ. కథ చెప్పడం అనే సాంప్రదాయం ప్రాచీన కాలం నుంచి ఉన్నా కూడా నేడు మనం చదువుకునే కథ ఆధునికమైనదే అని గమనించాలి. పాశ్చాత్య సాహిత్యంలో ప్రముఖులైన కథకులు మపాసా, ఓ. హెన్రీ, హెచ్. ఎ. బేట్స్, రడ్యార్డ్ కిప్లింగ్, చెకోవ్ మొదలైన వారు రాసిన కథలు చదవటం వల్ల కథా ప్రక్రియ మూలాలు కొంత వరకు అర్ధమవుతాయి.

ప్రభావతీ ప్రద్యుమ్నంలోని శిల్పాన్ని ఆవిష్కరించడానికి కథాశిల్పమనీ, కథన శిల్పమనీ, రసశిల్పమనీ పాత్ర చిత్రణ శిల్పమనీ వర్ణనాలంకార శిల్పమనీ, శైలీ శిల్పమనీ, తులనాత్మక శిల్పమనీ రచయిత చేసిన వింగడింపు సరికొత్తది, ప్రశంసార్హమైంది. ప్రతి తెలుగు ప్రబంధంలోని శిల్పాన్ని సమీక్షించడానికి పై వింగడింపు ఆదర్శప్రాయమే కాదు. ఉపయోగకారి కూడా అని అన్న జి.ఎన్. రెడ్డి గారి మాటలు భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశాలుగా పనిచేస్తాయి.

అదేవిధంగా కావ్య నామాన్ని బట్టి కూడా ఆ కావ్యంలోని అంగిరసముని నిర్ణయించవచ్చు అని చెబుతూ ప్రభావతీ ప్రద్యుమ్నం అనే కావ్యం ప్రభావతీ ప్రద్యుమ్నులకు సంబంధించిన కథ. ఈ కావ్యనికున్న పేరు నాయికా నాయకుల స్త్రీ పురుష సంబంధమైన

[12] ప్రభావతీ ప్రద్యుమ్నం పీఠిక.

శృంగారాన్ని తెలియజేస్తుందని కాబట్టి అది వీర రసం అనడానికి వీలు లేదని సాధికారికంగా చెప్పారు. పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలో పేర్కొన్న 'అత్యంత సరసమగు' అనే పదం లోని సరస శబ్దాన్ని శృంగారరసానికి సూచిక అని తెలియజేశారు. రాచపాళెం వారు ఈ కావ్యంలో గల రస సిద్ధాంతాన్ని నిరూపించడానికి ఎన్నో ప్రాచీన తెలుగు సాహిత్య పదాల నిఘంటువులను అధ్యయనం చేసినట్టుగా తెలుస్తుంది. ఈక్రమంలో

శబ్దరత్నాకరము (బహుజనపల్లి సీతారామాచార్యులు) 1912

ఆంధ్రవాచస్పత్యము (కొట్ర శ్యామలకామశాస్త్రి) 1953 (2వ ముద్రణ)

ఆంధ్రశబ్దరత్నాకరము (చెలమచెర్ల రంగాచార్యులు) 1966

తెలుగువ్యుత్పత్తికోశం (ఆంధ్రవిశ్వకళాపరిషత్తు) 1978

వావిళ్ల నిఘంటువు (వావిళ్ల) 1949

శబ్దార్థదీపిక (ముసునూరి వేంకటశాస్త్రి) 1956

శ్రీహరి నిఘంటువు తెలుగు-తెలుగు (రవ్వా శ్రీహరి) 2004

తెలుగు నిఘంటువు తెలుగు-తెలుగు (జి.ఎన్.రెడ్డి-ఆం.ప్ర.సా.అ.) 1979

తెలుగు పర్యాయపద నిఘంటువు (జి.యన్.రెడ్డి) 1990

మొదలైన వాటిని పరిశీలించి ఆ నిఘంటువులలో రస సిద్ధాంతంలోని సూత్రాలకు సరిపోయే శృంగార రస పదజాలాన్ని ఒడిసి పట్టుకొని తన సిద్ధాంత గ్రంథంలో ఉదాహరణ సహితంగా చేర్చారు. వాటిలో మచ్చుకు కొన్నింటిని ఈ కింద తెలియపరుస్తున్నాను.

## 3.14.1. మెట్టాయితము

ప్రియుని గుణాలను తలచుకొని తనదైన అభిలాషను సూచించుట.

ఉదాహరణ–ప్రద్యుమ్నుని చిత్రపటం చూసి ప్రభావతి పొందిన అవస్థలు, ఆమె, చేష్టలు, వాక్కులు అనుభావాలు మొదలైన వాటిని కలిపి మెట్టాయితము అనే పారిభాషిక పదంతో సూచించారు.

## 3.14.2. విచ్ఛిత్తి

తక్కువ అలంకరణతో ఉన్నా కానీ ఎక్కువ అందంగా కనపడుట.

ఉదాహరణ–'తరుణి యొకింత సేపు"....(4–140) అనే పద్యంలో 'ఒక్క పరిశుద్ధపు సైకపుటొల్లె గట్టి భాసురత గడు వెలార్చె' అని విచ్ఛిత్తి అనే పదానికి వివరణ ఇచ్చారు.

## 3.14.3 కిలకించితము

రోషము, దుఃఖము, భీతి, సిగ్గు మొదలైనవి కలిసి ఉండటం.

ఉదాహరణ– 'అతి శీఘ్రంబున నా లతాంగియు(దదీయాలింగన స్పర్శనామృత సేకంబున"(5-9) అనే పద్యంలో "భయకంప స్వేద లజ్జాత్మయై" అన్న సందర్భంలో కిలికించితము అనే పదాన్ని ఉదాహరణగా తీసుకున్నారు.

## 3.14.4 బిబ్బోకము

నాయికకు గర్వాతిశయముచేత ఇష్టవస్తువునందేనియు కలిగెడు అనాదరము– శబ్దరత్నాకరము (బహుజనపల్లి సీతారామాచార్యులు) 1912

ఉదాహరణ– ఘన దుఃఖ వశంబున నొక యుత్తరము నీక పొలతుక నిట్టూర్పు నిగిడ్చి యూరకుండిన(5–117) అనే పద్యంలో 'బిబ్బోకం' అనే పదానికి ఉన్న అర్థాన్ని ప్రయోగించారు

## 3.14.5. వ్రీడ

సిగ్గు, లజ్జ, బిడియం (తెలుగు పర్యాయపద నిఘంటువు (జి.యన్.రెడ్డి) 1990)

ఉదాహరణ- అన విని కపోల యుగళము ఘన పులకితముగా మరల్చే గ్రక్కున నాత్మా ననము ప్రభావతి యాలోకన జాలకమునకు నెగడ కడు లజ్జమెయిన్(4-108) 'వ్రీడ' అనే పదాన్ని ఈ అర్థంలో ప్రయోగించారు. పై విధంగా నవరసాల్లో రసరాజం అయిన శృంగారాన్ని ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యానికి అంగి రసంగా పేర్కొంటూ రస సిద్ధాంతంతో కావ్యాన్ని అన్వయించే ప్రయత్నం చేసారు.

ఇకపోతే ఈ కావ్యానికి అంగ రసంగా వీర రసాన్ని పేర్కొన్నారు. అయితే ఈ కావ్యంలో అంగరసంగా వీరంతో పాటు ఇంకొన్ని రసాలు కావ్యంలో ఎక్కడెక్కడ చోటు చేసుకున్నాయో వివరిస్తూ ఇంద్రుడు శ్రీకృష్ణుడికి వజ్రనాభుని దౌష్ట్యాన్ని చెప్పేటప్పుడు, రాక్షసుని దౌష్ట్యము కన్నా, ఇంద్రుని బాధలే ఎక్కువగా పాఠకుల ను కరిగించాయని కాబట్టి అక్కడ కరుణ రసం ఉందని చెప్పారు. అదేవిధంగా భద్ర నటుని నాట్య సందర్భమున జరిగిన నట వటు సంవాదమున హాస్యము ఉందని రాచపాళెం వారు వివరించారు.

పైన వివరించినట్టుగా ప్రభావతీ ప్రద్యుమ్న కావ్య రస శిల్పాన్ని నిరూపించే క్రమంలో రస సిద్ధాంతాన్ని దానిని అన్వయింప చేసి మౌలికమైన ప్రతి పాదనలుచేసారు. ఆయన చేసిన అంగి, అంగ రస ప్రతిపాదనలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే వాటి మధ్య సమన్వయాన్ని కుదిర్చి చక్కగా వివేచనా చేసినట్టుగా తెలుస్తుంది.

పాత్ర చిత్రణ విషయంలో పింగళి సూరన రచించిన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలోని పాత్రలతో ఇతర కావ్యాల పాత్రలను పోల్చి చూడటం వలన ఆయా కవుల పాత్ర చిత్రణా నైపుణ్యం తేటతెల్లమవుతుంది. ఈ విభాగంలో పింగళి సూరన తన కావ్యంలో చేసిన వర్ణనలను నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి కథాపరములు, కాల సూచకములు, పాత్రానుగుణములు, రసానుగుణములు అని విభజించి ప్రబంధ రచనకు, వర్ణనలకు ఉన్న అవినాభావ సంబంధాన్ని సూచించారు.[13] ప్రబంధాలలో స్త్రీ అంగాంగ వర్ణనని రాచాపాళెం వారు వ్యతిరేకించి ఆంధ్ర ప్రబంధ కవులందరికి ఇంతటి అంతరంగ సౌందర్య దృష్టి ఉన్నదని

---

[13] శిల్ప ప్రభావతి-రాచపాళెం వివేచన(వ్యాసం). ఆచార్య సుమతీ నరేంద్ర

చెప్పుటకు వీలులేదని తేల్చి చెప్పారు. అయితే ఈ అభిప్రాయానికి కొంత మినహాయింపుగా తిక్కనను పేర్కొంటూ అసభ్యతకు ఆస్కారం లేని స్త్రీ వర్ణన ఒక్క తిక్కనలో మాత్రం కనిపిస్తుందని చెప్పారు.

శైలీ శిల్పం అనే విభాగంలో 'శైలి' పద పుట్టు పూర్వోత్తరాలు మొదలుకొని, కావ్యంలో సందర్భానుసారంగా కవి ఏయే శైలులను అనుసరించాడో నిరూపించే ప్రయత్నం చేశారు. ప్రభావతీ ప్రద్యుమ్నములో నాటక, సుకుమార, దేశీయ శైలుల మేలు కలయిక ముప్పేట వలే ఉందని చెప్పారు. లెక్కలో లేనంతగా కథన, వర్ణన శైలులు కలవు. కథా కథనంలో నాటకీయ శైలి, పద్య రచనలో సుకుమార శైలి, వ్యావహారికత, సహజతలలో దేశీయ శైలి, కవి స్వయంగా వర్ణన చేసేటప్పుడు వర్ణనా శైలి ఈ ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలో ప్రయోగింపబడ్డాయి.

'శిల్ప ప్రభావతీ' విమర్శా గ్రంథంలో చివరి విభాగమైన తులనాత్మక శిల్పంలో తులనాత్మక అధ్యయనం అంటే ఏంటో ముందుగానే చెప్పినట్టుగా ఒక ఒక రచనను మరొక రచనతో గానీ ఒక రచయితను మరొక రచయితతో కానీ పోల్చి అధ్యయనం చేయటాన్ని తులనాత్మక పరిశీలన అంటారు. అభివృద్ధి చెందుతున్న సాహిత్య విభాగాలలో తులనాత్మక సాహిత్యం ముఖ్యమైనది. తులనాత్మక సాహిత్యం ఈ పోల్చి చూడడమనే ప్రాతిపదిక మీదనే పుట్టింది. 'పోల్చి చూడడం', 'తులనాత్మక సాహిత్యం' రెండూ ఒక కుదురులోనే పుట్టినప్పటికీ ప్రాథమికంగా ఇవి రెండూ భిన్నమైనవి. పోల్చడం ఆత్మాశ్రయమైనదైతే, తులనాత్మక సాహిత్యం వస్త్వాశ్రయమైనది. పోల్చడం అనుభూతి ప్రధానమైనదైతే, తులనాత్మక సాహిత్యం శాస్త్రీయమైనదని చెప్పవచ్చు. ఈ రకమైన విమర్శ పద్ధతిని "తులనాత్మక విమర్శ పద్ధతి" అంటారు.

పింగళి సూరన అనుసరించిన రచనా శిల్పంలో తన పూర్వ కవుల ప్రాభవం ఎంతవరకు ఉందో నిరూపించే ప్రయత్నం చేసారు. పింగళి సూరన రచనా విధానాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసినట్లయితే తిక్కనలోని నాటకీయత , శ్రీనాథునిలోని సీసపద్య

రచన, వర్ణనలో తన పూర్వీకులందరి ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. అంతేగాక ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలోని నాయిక అయిన ప్రభావతిని, పారిజాతాపహరణం లోని కావ్య నాయిక అయిన సత్యభామతో పోల్చి చూసి, ప్రభావతిని సత్యభామలాగా తీర్చి దిద్దకపోవడం పెద్ద లోపమేమీ కాదని సమర్ధించారు. ఏ పాత్రలైనా వాటి వాటి స్వభావాన్ని బట్టి కొంత, కవి చిత్రణలో కొంత మూర్తిమత్వాన్ని సంతరించుకుంటాయి. భారతంలో ద్రౌపది, మను చరిత్రలో వరూధిని, పారిజాతాపహరణంలో సత్యభామ అలాంటి శాశ్వతత్వాన్నే సంతరించుకున్నాయి . కాబట్టి పాత్రల మనస్తత్వాన్ని బట్టి వాటిని కవులు ప్రతిభతో తీర్చిదిద్దుతారని చెప్పవచ్చు.

రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి గారు తానూ ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని విమర్శించే క్రమంలో ఎన్నోసార్లు ఆ కావ్యాన్ని చదివి ఆ కావ్యాన్ని ప్రాచీన భారతీయ కావ్య సిద్ధాంతాలకు, ఆధునిక సాహిత్య విమర్శ సిద్ధాంతాలకు అన్వయించుకుంటూ, సోదాహరణంగా నిరూపించి రాయడం వెనుక ఎంతో శ్రమ ఉందని తెలుస్తుంది.

## 3.15. కవిత్వ రచనా దిక్సూచి నన్నయ్య

ఏదైనా ఒక పనిని అనేక సార్లు పదేపదే చేసినప్పుడు ఆ పనిపై మనకు తెలియకుండానే మమకారం ఏర్పడుతుంది. ఆ పనితో మమేకం అయిపోతాం. తర్వాత రోజుల్లో మరింత కృషి జరపడానికి ఆ మమకారం కారణం అవుతుంది. ఆచార్య రాచపాళెం వారు ప్రాచీన సాహిత్యాన్ని ఆ విధంగా పదే పదే చదవటం వల్ల ఆసాహిత్యంపై మక్కువ పెరిగి ముఖ్యంగా తెలుగు సాహితీలోకం ఆదికవిగా భావిస్తున్న నన్నయపై ఒక సాధికారమైన విమర్శనా గ్రంథం రచించాలని సంకల్పించారు.

ఆచార్య ఎస్వీ రామారావు గారు 'తెలుగులో సాహిత్య విమర్శ' అనే పరిశోధన గ్రంథంలో వ్యాఖ్యాతకు ఉండాల్సిన లక్షణాలను ఇలా చెబుతారు. ''కావ్య వ్యాఖ్యానమైన విమర్శనము భావుకుడైన కవికి, సహృదయుడైన పాఠకునకు మధ్య వారధి వంటిది. సహృదయుడు కావ్య పఠనం వల్ల రసానందం పొంది కవితో తదాత్మ్యం పొందుతాడు. కాని

ప్రతి సహృదయ పాఠకుడు విమర్శకుడు కాలేడు. ఈ తదాత్మ్య స్థితిని వీడి రసానంద హేతువును జిజ్ఞాసతో వివేచించువాడే విమర్శకుడు. ఈ హేతుజిజ్ఞాస వలననే సహృదయుని స్థాయిని అధిగమించి విమర్శకుడు వ్యాఖ్యాత అగుచున్నాడు"[14]. కాబట్టి ప్రతి విమర్శకుడు కూడా హేతుజిజ్ఞాసను కలిగి మాత్రమే విమర్శకు పూనుకోవాలని సూచిస్తున్నారు.

తెలుగు వాఙ్మయంలో కావ్య రచనకు శ్రీకారము చుట్టిన నన్నయ ఆ తరువాత కవులకు మార్గనిర్దేశనం చేశారు. ఆయన సాహిత్య దృక్పథాలను అధ్యయనం చేస్తే, ఆయన ప్రభావం తరువాతి కవులపై ఏ విధంగా పడిందనే చారిత్రకాంశాన్ని వెల్లడి చేయవచ్చు. ఈయన సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడం ద్వారా మిగిలిన కవుల కావ్యానుశీలన సుగమం అవుతుంది. ఈ ఆలోచనతో నన్నయ్యసాహిత్య సేవను సమీక్షిస్తూ విపుల విమర్శనా గ్రంథమైన *"తెలుగు కవిత్వం – నన్నయ్య ఒరవడి"* పేరుతో 1987లో వెలువరించారు. విద్యార్థులకు, పరిశోధకులకు ఇదొక కరదీపికగా తోడ్పడుతుందని అనుకుంటున్నాను. ఈ గ్రంథంలో ఒరవడి, నన్నయ్య ఒజ్జ, నన్నయ్యఒరవడి అనే మూడు ప్రధాన భాగాలు, కావ్య రామణీయకత, కవిత్వ కామనీయకత అనే రెండు ఉప విభాగాలు ఉన్నాయి. నన్నయ్య తరువాత కవులలో కనిపించే ఎన్నో రచనా విశేషాలు నన్నయలో బీజప్రాయంగా కనిపిస్తున్నాయి.[15]ఈ పుస్తకంలో రాచపాళెం వారు ఆ విషయాలను నిరూపించారు. ఈ గ్రంథంలో మొదటి భాగమైన 'ఒరవడి' అనే అధ్యాయంలో ఒరవడి శబ్దానికి నిఘంటువులలో గల అర్థాన్ని పరిశీలించారు. 'ఒర' అంటే 'దిద్దు' అనీ 'ఒరవు' అంటే 'విధం', 'ఒరవు' అంటే 'రాచు' అని నైఘంటికార్థాలున్నాయి. 'వడి' అంటే వేగం, గమనం అని అర్థాలున్నాయి. కాబట్టి ఒరవడి అంటే 'పోలికగా నడచు' అని "అనుసరించి నడచు" అనే శబ్దార్థం కుదురుతుందని వివరించారు. అంటే మార్గ నిర్దేశకుడు భవిష్యత్ తరాల వారికి మార్గ నిర్దేశం అందిచడం అనేది అతని బాధ్యత. అతడు నిర్దేశించిన మార్గం

[14] తెలుగులో సాహిత్య విమర్శ. ఆచార్య ఎస్వీ. రామారావు. పుట:3

[15] "తెలుగు కవిత్వం-నన్నయ్య ఒరవడి" పుస్తకానికి 'మనకిప్పుడు కావల్సిన విమర్శకుడు' పేరుతో చేకూరి రామారావు గారు రాసిన ముందుమాట.

సక్రమమైనదై తర్వాతి తరాల వాళ్ళు దానిని ఆచరిస్తారు. ఈ అనుసరించడంలో సమకాలీక లక్షణాలకు అనుగుణంగా ప్రాచీన మార్గాన్ని సంస్కరించడం, మలచడం, మార్చడం ఉంటాయి. అయితే మూలాన్ని పూర్తిగా తిరస్కరించడం ఉండదనే చెప్పవచ్చు. దీనినే ఒరవడి అంటారు. అంటే గతం, వర్తమానానికి నిర్దేశించే మార్గాన్నే ఒరవడిగా చెప్పవచ్చు.

నన్నయపై వెలువడిన ప్రామాణిక గ్రంథం “తెలుగు కవిత్వం – నన్నయ్య ఒరవడి”. ఇందులో రాచపాళెం అనేక సూత్రీకరణలు చేసారు. ప్రతి మనిషి తన పూర్వులెట్లా బతికినారో తెలుసుకున్నట్లే, ప్రతి కవీ తన పూర్వకవుల రచనా రీతుల్ని, మెలకువల్ని గమనిస్తాడు. అట్లా గమనించనివాడు చరిత్రను చూడలేకపోయిన వాడవుతాడు. పూర్వకవుల్లోని భావాన్నో, సన్నివేశాన్నో, పద్య రచనా నైపుణ్యాన్నో, పాత్ర చిత్రణలోని విజ్ఞానాన్నో, పద ప్రయోగ చాతుర్యాన్నో, వాక్య విన్యాసాన్నో, అలంకార సౌందర్యాన్నో, శైలీ రమ్యతనో, కథా శిల్పాన్నో, వర్ణనా వైభవాన్నో, చూసి ఆర్వాచీన కవి ఆకర్షితుడవుతాడు,అనుసరిస్తాడు.జీవితంలో సందర్భాలున్నట్లే కావ్యంలో కూడా సందర్భాలుంటాయి. ఆయా సందర్భాల్ని కవులు ఒక పద్ధతిలో నిర్వహించి వర్ణిస్తారు. ఇది తరువాతి కవులకు మార్గదర్శనమవుతుంది. తర్వాతి కవులు పూర్వ కవుల పద్ధతిని ఒరవడిగా చేసుకుని తన రచనలో ఉపయోగించుకుంటారని దానికి ఉదాహరణగా

నన్నయ్య శ్రీకారం చుట్టిన మహాభారతం "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్" – "ఇందులో ఏది ఉందో అదే ఎక్కడైనా ఉంది. ఇందులో లేనిది మరెక్కడా లేదు" అని ప్రశస్తి పొందింది. హిందువులకు ఎంతో పవిత్ర గ్రంథాలైన భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రము కూడా మహాభారతంలోని భాగాలే. దీనిని బట్టి ఈకావ్య విశిష్టతను అంచనా వేయవచ్చును. నైమిశారణ్యానికి వచ్చిన ఉగ్ర శ్రవనుడు, శౌనకాది మహా మునులకు భారత కథను చెబుతాడు. కథను ప్రారంభిస్తూ భారత మాహాత్మ్యాన్ని వర్ణిస్తూ. సంస్కృత మహాభారతార్థాన్ని తెలుగు భారతంలో ఇలా అన్వయిస్తున్నారు.

**ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని,**

**యధ్యాత్మవిదులు వేదాంతమనియు,**

**నీతి విచక్షణుల్ నీతి శాస్త్రశాస్త్రంబని,**

**కవివృషభులు మహా కావ్యమనియు**

**లాక్షణికులు సర్వ లక్షణ సంగ్రహమని,**

**ఐతిహాసికు లితిహాసమనియు,**

**పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ**

**యంబని మహిఁగొనియాడు చుండ.....**

అని కొనియాడతారు. వివిధ తత్త్వవేది, విష్ణు సన్నిభుడు అయిన వేదవ్యాసుడు దీనిని విశ్వజనీనమయ్యేలా సృజించాడు. భారతం ఒకనాటి విజ్ఞాన సర్వస్వం. ఈ సత్యాన్ని నన్నయ్య పై పద్యంలో విస్తరించాడు.

నన్నయ్య ప్రతిపాదించిన వైదిక మతాన్ని తీవ్రంగా నిరసించిన పాల్కురికి సోమన కూడా పై పద్యంలోని నన్నయ్యఒరవడిని అందుకున్నాడంటే ఆశ్చర్యం కలుగుతుందని రాచపాళెంవారు వివరించారు. 'చతుర్వేదసారం' కావ్య విశిష్టతను సోమన ఇలా వర్ణించాడు.

**వైదికులిది శుద్ధ వైదికంబని యెన్న**

**శాస్త్రజ్ఞులిది ధర్మశాస్త్రమనగ**

**తార్కికులిది మహాతర్కంబనంగ బౌ**

**రాణికులిదియె పురాణమనగ**

**ఆగమ విదులు దివ్యాగమంబిదియన**

**తంత్రజ్ఞులిది వీరతంత్రమనగ**

**భక్తవారంబిది భక్తిమార్గంబన**

**ముక్త్యర్థులిది మహాముక్తిద మన**

**కవులు భువిని నిదియె కావ్యంబనంగను....**

పై పద్యం అచ్చంగా నన్నయ్య రాసిన పద్యంలాగే ఉందంటే అతిశయోక్తి కాదు. పై పద్యం శిల్పం అప్పుడే కాదు. నేటి ఆధునిక కాలంలో కూడా ప్రభావితం చేసి ఒరవడిని కలిగిస్తుంది. ఇరవయ్యో శతాబ్దపు కవి అయిన మరింగంటి శేషాచార్యులు 'గాంధీ భారతం'

అనే కావ్యాన్ని రాసారు. ఆయన ఈ కావ్యంలో నన్నయ్య ఒరవడిని అనుకరిస్తూ చెప్పిన పద్యం ఈ కింది విధంగా ఉంది.

**కాంగ్రేసు వీరులు కాంగ్రెసు చరితన**
**ఖద్దరు వారు మాసుద్దియన**
**సంఘ సంస్కర్తలు సంస్కార కథ యన**
**సత్యాగ్రహంబు వారి సాధననగ**
**విప్లవ ప్రియులెల్ల విప్లవా దర్శినా**
**నార్థికుల్ తమ నుత్నయామ మనగా**
**హరిజనోద్యమ వాదు   లురుతరనిధి యన**
**హిందుముస్లిము లైక్య సింధువనగా.... ..(బాలపర్వం-ప్రస్తావన)**

పై పద్యం 20 వ శతాబ్దంలోనిది. నేటి ఆధునిక కాలం కవిని కూడా 11 వ శతాబ్దం నాటి పద్యం ఆకర్షించిందంటే ఆకవి శిల్పపు పునాదులు ఎంత పటిష్టమైనవో ఉహించుకోవచ్చని రాచపాళెం వారు ఉదాహరించారు. శిల్ప ప్రభావతి కావ్యంలో కేవలం ఆ కవి రాసిన కావ్య శిల్పాన్ని మాత్రమే నిరూపించే ప్రయత్నం చేయగా, “తెలుగు కవిత్వం – నన్నయ్యఒరవడి” అనే పుస్తకంలో నన్నయ్య ప్రభావం ఇతర కవులపై ఏ విధంగా ప్రభావాన్ని చూపిందనే విషయాన్నీ పరిశోధించి నిరూపించారు.

రాచపాళెం వారు నన్నయ్యను ‘ఒజ్జ’ అని సంభోదించారు. ఒజ్జ అంటే గురువు, ఉపాధ్యాయుడు అనే అర్థాల్ని నిఘంటువులు సూచిస్తున్నాయి. (తెలుగు వ్యుత్పత్తి కోశం.1978) కాబట్టి ఈ ప్రకరణంలో నన్నయ్యను తన తరువాతి తరం వారు ఏవిధంగా కీర్తించారనే విషయాన్ని తెలిపారు. తిక్కన తన మహాభారత రచన ప్రారంభిస్తూ నన్నయ్యను ఆంధ్ర కవిత్వ విశారదుడు, విద్యాదయితుడు, మహితాత్ముడు అని మూడు విశేషణాలతో కీర్తించిన విషయాన్ని రాచపాళెం గుర్తించి వాటిలోని అంతరార్థాన్ని తెలియజేస్తూ వీటిల్లో ఆంధ్ర కవిత్వ విశారదుడు, విద్యాదయితుడు, అనేవి నన్నయ్య కవితా వ్యక్తిత్వాన్ని, మహితాత్ముడు అనేడి ఆయన వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా తిక్కన శిష్యుడైన మారన నన్నయ్యను 'ఆంధ్రకవితా గురుడు' అని కీర్తించారు. తిక్కన నన్నయ్యను ఒక సందర్భంలో విద్యాదయితుడు అని కీర్తిస్తే ఆయన శిష్యుడు మారన మాత్రం విద్యారమనీయుడు అన్నాడు. ఎర్రన నన్నయ్యను 'వ్యాస హృదయావిష్కర్త' గా పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీనాథుడు "శబ్ద శాసను నన్నపార్యుదలచి"(కాశీ ఖండం) అనీ, మొల్ల "మంజుల వాగ్దుర్య నన్నపార్యు"(రామాయణం) అనీ, అయ్యలరాజు రామభద్రుడు "శబ్ద శాసన సుకవి కంజలి యొనర్చి"(రామాభ్యుదయం) అనీ, రామరాజభూషణుడు "మహిమున్ వాగను శాసను సృజయింపన్"(వసుచరిత్ర) అనీ వివిధ రకాలుగా నన్నయ్యను కీర్తించారు.

నన్నయ్య ఒరవడి అనే విభాగంలో కావ్య రామణీయకత, కవిత్వ రామణీయకత అనే రెండు ఉప విభాగాలు ఉన్నాయి. ఇందులో మొదటి విభాగమైన కావ్య రామనీయకతలో అవతారిక, ఆశ్వాసాంత పద్యాలు, ఆశ్వాస నిర్మాణం మొదలైన అంశాలను వివరించారు. రెండో విభాగంలో కథ, వర్ణన, పద్యం మొదలైన అంశాలను వివరించారు.

## 3.16. కావ్య రామణీయకత

ఒక కావ్యం రాజాస్థానం నుండి ఎలా వెలువడుతుందనే దృగ్విషయం అవతారిక వల్ల తెలుస్తుందని, తెలుగులో ఈ అవతారికకు పునాదులు వేసింది నన్నయ్యనే అని రాచపాళెం వారు వివరించారు. 'అవతారిక గ్రంథ రచనా సౌధానికి ముఖద్వారం వంటిది' అన్న రామారావు నిర్వచనం అవతారిక ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. అదేవిధంగా కావ్య ప్రారంభ శ్లోకం విషయంలో నన్నయ్య తరువాతి కవులు నన్నయ్యను కేవలం పాక్షికంగా మాత్రమే అనుసరించినట్లు తెలుస్తుంది. రాజరాజ నరేంద్రుని సభా వర్ణన ఒరవడిగా శ్రీనాథుడు, పింగళి సూరనాదులు స్వీకరించడాన్ని, నన్నయ్యచెప్పిన "తత్కథా ప్రారంభం బెట్టిదనిన" అంటూ అవతారికలో చెప్పిన పద్యాన్ని అనేక మంది స్వీకరించడం, దానిని పోతన తన భాగవతంలోను, మారన తన మార్కండేయ పురాణంలోను అనుకరించడం మొదలైన విషయాలను సోదాహరణంగా చూపడం జరిగింది. అదేవిధంగా ఆశ్వాసాంత పద్యాలలోని

రచనా విధానాన్ని ఆయన తరువాతి కవులైన ఎర్రన మారన, పోతన కొరవి గోపరాజు వంటి వారు అనేకమంది ఒరవడిగా గ్రహించడాన్ని రాచపాళెం వారు చూపారు. అలాగే  అశ్వాస నిర్మాణ చాతుర్యం వివరించి, ఆది, సభా, అరణ్య పర్వాలు ఒకదాని నుండి మరొకటి ఎలా పుట్టుకొచ్చాయో చూపుతూ, ఆయా పర్వాలు వివిధ కథలను ఎలా నడిపాయో చూపడం అనేది మహాభారతం పట్ల, నన్నయ్య పట్ల రాచపాళెం వారికున్న అవగాహనా సామర్థ్యాన్ని తెలియజేస్తుంది.

## 3.17. కవిత్వ రామణీయకత

ఈ విభాగంలో నన్నయ్య కథా కథనాన్ని, నాటకీయతను సన్నివేశ కల్పనను, వర్ణనలను వివరించాడు. నన్నయ్యకు కథ చెప్పడంలో ప్రత్యేక నైపుణ్యం ఉందని చెప్పవచ్చు.ఎలాగంటే నన్నయ్య మూలంలోని కథను తీసుకొని దానిని సందర్భోచితంగా తగు మార్పులతో వివరిస్తాడు. మూలంలోని భారతాన్ని మనం 'ఇతిహాసం' అనీ, తెలుగు భారతాన్ని కావ్యం అని అంటాము. దీనికి కావ్య రూపం ఇవ్వడానికి నన్నయ్య కావలసిన విధంగా పాత్రపోషణ, రస పోషణ చేశారు. ఈ కథాకథన విభాగంలో మహాభారతంలోని అర్జునుడు, అంగార పర్ణుని పాత్రలతో, అల్లసాని పెద్దన మను చరిత్రలోని వరూధిని ప్రవరాఖ్యులతో పోల్చి చూపాడు. నన్నయ్య నుండి తొలుత తిక్కన నాటకీయత లక్షణాన్ని స్వీకరించగా, ఆ తరువాత కవులు దానికి ఏ విధంగా ఒరవడి పెట్టారు అనే విషయాలను చర్చించడం వల్ల రాచపాళెంలోని విమర్శా విస్తృతి తెలుస్తుంది.

పద్య విద్యా ప్రవీణులైన నన్నయ్య అందరికీ చిరపరిచితమైన ఉత్పలమాలాదుల్లోనే కాక అతిఅరుదుగా కనిపించే తోటకము, వనమయూరము, దృతవిలంబితము, మాలిని, స్వాగతము, అంబురుహము లాంటి ఛందోమాధ్యమాల్ని వాడుకున్న తీరును ఎత్తిచూపారు. ఇది నన్నయ్య భట్టారకుని ఛందశ్శాస్త్ర ప్రావీణ్యతకు తార్కాణం. 'నన్నయ్యప్రశంసలో నన్నయను అభినందిస్తూ వారివారి గ్రంథాలలో రచించిన తిక్కన, మంచన, ఎర్రన మొదలగువారి పద్యాలను యథాతథంగా ఉదాహరించారు. 'ప్రథమాంధ్ర కవియైన

నన్నయకు కైమోడ్పులర్పిస్తూ తిక్కన నుండి నిన్నమొన్నటి వరకు ఎంతో మంది కవులు ప్రశంసా గానాలు చేశారు. పోతన, శ్రీనాథుడు, ఎర్రనలాంటి లబ్ధప్రతిష్ఠుల సంగతి సరేసరి. కాని, ఎవరికీ పరిచయం లేని ఈశ్వర ఫణిభట్టు, అత్తనూరి పాపకవి, ఇమ్మడిజెట్టి చంద్రయ్య, కట్టావరదరాజు వంటి విస్మృత కవులు నన్నయను ఎలా కీర్తించారో ఉదాహరించడం' రాచపాళెం వారి పరిశీలనాశక్తిని, పరిశోధనాసక్తిని తెలియజేస్తుంది.

*"తెలుగు కవిత్వం – నన్నయ్య ఒరవడి"* అనే ఈ విమర్శనా గ్రంథానికి చేకూరు రామారావు(చేరా)గారు *'మనకిప్పుడు కావాల్సిన విమర్శకుడు'* పేరుతో ముందుమాట రాశారు. అయితే ఆయన ఈ ముందుమాటలో కేవలం ప్రశంసలతో కూడిన మాటలనే కాకుండా, ఆ గ్రంథంలోని లోపాలను నిర్మొహమాటంగా అదే ముందుమాటలో తెలియజేశారు. ఇలా తెలియ జేయడం వల్ల విమర్శకుడు భవిష్యత్తులో ఎలాంటి పొరపాట్లు మళ్ళీ చేసే అవకాశం ఉండదని అనుకుంటున్నాను. అయితే రాచపాళెం వారు రచించిన ఈ పుస్తకం 1987 లో వెలువడగా, ఈ పుస్తకం లాంటి మరో పుస్తకాన్ని *'నన్నయ్య దర్శనం'* పేరుతో 1998 లో వెలువరించారు. రాచపాళెం వారు రచించిన పుస్తకానికి, చేకూరి రామారావు గారు రచించిన పుస్తకానికి దగ్గర పోలికలు ఉన్నట్టు తెలుస్తుంది.

పై విధంగా నన్నయ్య సాహిత్య రచనలో అవలంభించిన సూత్రాలు, విరచించిన పద్య గద్యాలు ఆ తరువాతి కవులకు శాశ్వత ప్రమాణాలుగా నిలుస్తాయి. దీనిని సాహిత్య విమర్శ భేదాలలో 'సూత్ర విమర్శ'గా చెప్పుకోవచ్చు. ఇది సాహిత్య రచనకు సంబంధించిన సూత్రాలను ప్రతిపాదిస్తుంది. 'కవులకు మార్గదర్శకం అయ్యే కావ్య లక్షణాలను ప్రతిపాదించి, శాశ్వత సాహిత్య ప్రమాణాలను నిర్దేశించే లక్షణ విమర్శ పేర్కొనే శాశ్వత ప్రమాణాలకంటే ప్రక్రియాను గుణమైన సాపేక్ష సిద్ధాంతాలను ఇది నిర్దేశించును. స్వతంత్ర బుద్ధిగల కవులు చేయు కావ్యమీమాంసలో ఇట్టి సూత్రములు గోచరించును'[16]. ప్రాచీనాంధ్ర కవుల కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు మొదలైనవి సూత్ర విమర్శకు నెలవులుగా

[16] తెలుగులో సాహిత్య విమర్శ. ఆచార్య ఎస్వీ. రామారావు. పుట.8

చెప్పుకోవచ్చు. నన్నయ్య, నాచన సోమనాది కవులు తమ కావ్యనుశీలనకు అనువైన సాపేక్ష ప్రమాణ సూత్రాలను పేర్కొన్నారు. కాబట్టి కవులకే గాక విమర్శకులకు కూడా సూత్ర విమర్శ మార్గదర్శకమగుచున్నదని ఆచార్య ఎస్వీ రామారావు గారి ఉవాచ.

## 3.18. ప్రాచీన సాహిత్యం మీద మరులు

ప్రాచీన సాహిత్యంపై చేసిన విస్తృతమైన అధ్యయనంతో దాదాపు ఒక దశాబ్దం పాటు నన్నయ, తిక్కన, పింగళి సూరన సాహిత్యాన్నే గాక ఇంకా అనేకమంది ప్రాచీన కవుల సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ విమర్శ కొనసాగించారు. అయితే ఇదంతా దాదాపుగా రూప సంబంధమైనదనే చెప్పవచ్చు. అది కూడా సాంప్రదాయ భావాలతో కూడుకున్నది. వస్తుపరంగా జరిగినది చాలా స్వల్పమే. అయితే ఆ తరువాత ఎన్.గోపి తంగెడుపూలు కావ్య విశ్లేషణతో మొదలైన ఆయన ఆధునిక సాహిత్య విమర్శ ప్రస్థానం క్రమేపి అనేక సాహిత్య ధోరణులు, పద్ధతులను స్పృశిస్తూ వస్తున్నది. ఆ విధంగా ఆయనను పలకరించిన సాహిత్య విమర్శ పద్ధతి “కవి జీవిత విమర్శ”. ఈ ధోరణి నుండి గురజాడ, గరిమెళ్ళ సత్యనారాయణ, శ్రీశ్రీ వంటి రచయితలపై విమర్శను రాసారు. ఆ తరువాత ఇస్మాయిల సిద్ధాంత వక్రీకరణను వ్యతిరేకిస్తూ మార్క్సిస్టు భావజాల భూమికను ప్రాథమికంగా వెలువరించారు. అయినా కూడా ప్రాచీన సాహిత్యంపై మొహాన్ని వదలలేక *“భారత కథకు ప్రాగ్రూపం-నలకథ(1988)”* అనే వ్యాసాన్ని రాసారు. ఆధునిక సాహిత్యంలోకి ప్రవేశించినా ప్రాచీన సాహిత్యం మీద మరులు వదలని సంధి దశలో[17] ఈ వ్యాసం రాసినట్టు రాచపాళెం వారే పేర్కొన్నారు. ఆయన అధ్యాపకునిగా ఎం. ఏ విద్యార్థులకు నలోపాఖ్యాన్ని బోధించే క్రమంలో ఈ వ్యాసం ఆయన రాసినట్లు తెలుస్తుంది.

రాచపాళెం వారు తాను రచనా వ్యాసంగంలో ప్రవేశించిన నాటి నుండి మహా భారత ప్రస్తావన ఏదో ఒక సందర్భంలో తీసుకొస్తూ దానిని వెనకేసుకొస్తూ ఉన్నాడు. అయితే ఇప్పుడు దానికి కొంచెం విభిన్నంగా రూప రీత్యా దాని జోలికి పోకుండా కేవలం మహా భారత

[17] ‘కొన్ని కావ్యాలు కొందరు కవులు’ పుస్తకానికి రాసిన ముందుమాటలో

కథలోని ఉపాఖ్యానం అయిన నలుని కథను తీసుకొని అది మహాభారత కథకు ఏ విధంగా ప్రాగ్రూపం అయిందనే విషయాన్నీ సోదాహరణంగా వివరించారు.

## 3.19. ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు

*"ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు"* అనే అంశంపై తెలుగు విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన పుస్తక పోటీలో ఈ పుస్తకం గెలుపొంది బహుమతిని పొందింది. రాచపాళెం తన అధ్యాపక వృత్తిలో భాగంగా ప్రాచీన సాహిత్యాన్ని బోధించే క్రమంలో ఆ కావ్యాలకు ముందు ఉన్న కావ్యావతారికలను అధ్యయనం చేయవలసి ఉండేది ఈ అధ్యయనమే క్రమంగా ఈ పుస్తక రచనకు దారి తీసిందని రాచపాళెం వారు అన్నారు. ఈ గ్రంథ రచనకు తగిన సలహాలను ఆచార్య చేకూరి రామారావు, ఆచార్య ఎన్. గోపిలు అందించగా ఈ పుస్తకం ముద్రణకు నోచుకోవడానికి రాచపాళెం వారి గురువులైన ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు, ఆచార్య శలాక రఘునాథశర్మ గారు సహకారం అందించారు.

ఈవిమర్శ గ్రంథంలో ప్రాచీన కవులు వెలువరించిన సాహిత్యాభిప్రాయాలను క్రోడీకరించడం జరిగింది. ఈవిధమైన కృషిని తెలుగులో ఇదివరకే ఆచార్య జి. నాగయ్య 'తెలుగులో కావ్యావతారికలు' అనే పేరుతో వెలువరించారు. నిజానికి ఈ గ్రంథం కేవలం కావ్యావతారికల్లోని అంశాలకే పరిమితమైనా సాహిత్యాంశాలను కూడా సుదీర్ఘంగా చర్చించింది. విశ్వనాథ సత్యనారాయణగారు *"నన్నయ్య ప్రసన్న కథా కలితార్థయుక్తి"*, *"అల్లసానివాని అల్లిక జిగిబిగి"*, *"ఒకడు నాచన సోమన"* అనే విమర్శ గ్రంథాలను 'ఒక కవి అభిప్రాయాలను లేదా ఒక కవి కవిత్వాన్ని గురించి ఇంకో కవి చెప్పిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని వివరించి రచనకు అన్వయించే ధోరణిలో' రచించారు. అయితే ఈ *"ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు"* అనే ఈగ్రంథం ప్రాచీనాంధ్ర కావ్యాల అవతారికల్లోనూ, కావ్యాల్లోనూ ప్రత్యక్షంగా పరోక్షంగా కవులు వెలిబుచ్చిన సాహిత్యాభిప్రాయాలను, అభిరుచులను క్రోడీకరించి విశ్లేసిస్తూ ఒక ప్రణాళిక ఆధారంగా

చర్చిస్తుందని[18] చెప్పవచ్చు. పూర్వీకుల సాహిత్యాభిప్రాయలు కాలక్రమంలో ఎలా మారుతూ వచ్చాయో ఇది వరకే డా॥ వెల్చేరు నారాయణరావుగారు *"తెలుగులో కవితా విప్లవాల స్వరూపం"* అనే పుస్తకంలోను, ఆధునికాంధ్ర కవిత్వాభిప్రాయలకే పరిమితమై జి.శాంతి గారు రచించిన 'వచన కవిత్వంలో కవిత్వ కవిత' అనే పుస్తకాలలో వివరంగా ఉంది.

భారతీయ అలంకార శాస్త్రం భారతీయ సాహిత్యంలో అణువణువు ఆక్రమించేసింది. భరతుని 'నాట్య శాస్త్రం' నుండి ధనంజయుని 'దశ రూపకం' వరకు అనేక కావ్య శాస్త్ర గ్రంథాలు మన దేశంలో పుట్టాయి. అయితే ఇవి కావ్యాలు కావు. కావ్యాలను ఎలా రచించాలో కొన్ని నిర్దేశకాలు మాత్రమే ఈ నియమాలే కవుల అభిప్రాయాలను విస్మరించి ఆలంకారికుల అభిప్రాయాల మధ్య కవులను బంధించడం సాహిత్యానికి సగం న్యాయం మాత్రమే చేయడమనిపిస్తుంది అని రాచపాళెం వారు ఆవేదన చెందారు. ఈ ఆవేదన నుండి పుట్టిన పుస్తకమే ఇది. అయితే ఈ పుస్తకం ఆధునిక కవి లోకానికి ఏ విధంగా ప్రయోజనాన్ని చేకూరుస్తుంది అనే విషయాన్ని గురించి రాచపాళెం వారు చెబుతూ ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు మధ్య గల అంతరాలను తెలియజేస్తూ "ఆధునిక కాలానికి సంబంధించిన ఫలానికంటే భిన్నమైనది ప్రాచీన కాల ఫలం. మనిషికి సంబంధించిన భౌతిక జగత్తు కంటే, అతడి అనుభవాన్ని స్పృశించే అంతర జగత్తుకు ప్రాధాన్యమిస్తుంది ప్రాచీన కాలం. ఇందుకు భిన్నంగా అంతర జగచ్చిత్రణను, అనుభవాన్ని అప్రధాన విషయాలుగా భావించి లౌకిక జగత్తుకు సంబంధించిన హితచింతనకు ప్రాధాన్యమిస్తుంది ఆధునిక కాలం" అని అన్నారు. భారతీయ అలంకారశాస్త్రం నేటి ఆధునిక కాలానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే విషయాన్నీ ఆచార్య పుల్లెల్ల శ్రీరామ చంద్రుడు *"అలంకారశాస్త్రము – ఆధునిక సాహిత్యము"* అనే విమర్శా గ్రంథంలో వివరించారు.

[18] 'ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు' పుస్తకాన్ని గురించి రాచపాళెం వారి మాటల్లో

## 3.20. అధి కవిత్వం (Meta Poetry)

తెలుగు సాహిత్య విమర్శలో విమర్శపై చేసే విమర్శను 'అధి విమర్శ(Meta Criticism)' అన్నట్లే కవిత్వాన్ని గురించి చెప్పే కవిత్వాన్ని 'అధి కవిత్వం'[19] అంటారని వెల్చేరు నారాయణరావు గారు పేర్కొన్నారు. సాహిత్య చరిత్రలో ఏదైనా ఒక వినూత్న ధోరణి బయలుదేరినప్పుడు దాని ప్రతిపాదన కోసమో, సమర్థన కోసమో ఖండన కోసమో, సంప్రదాయానుసరణం కోసమో విభిన్న కాలాల్లో, విభిన్న భాషల్లో సాహిత్యాన్ని గురించి రచయితలు ప్రకటించుకున్న అభిప్రాయాలే సాహిత్యాభిప్రాయాలని చెప్పవచ్చు.

"*ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు*" అనే ఈ గ్రంథాన్ని రాచపాళెం వారు ఇరవై ఉప భాగాలుగా విభజించి ఆయన సేకరించిన పద్యాల ద్వారా తెలుసుకున్న విలువైన అంశాలను క్రోడీకరించారు. ఆముఖంలో ప్రాచీన కవులను గురించి చెబుతూ ప్రాచీన తెలుగు కవులంటే భారతదేశ చరిత్రలో మధ్య యుగ కవులని స్పష్టం చేశారు. నన్నయ్య నుంచి గోపీనాథ కవి వరకు గల కవులను ప్రాచీన తెలుగు కవులని నిర్ధారించాడు. ప్రాచీన తెలుగు కవులు ఎక్కువగా కావ్యం, కృతి, ప్రబంధం, కవిత అనే మాటలనే ఉపయోగించారని సోదాహరణంగా వివరించి, ప్రాచీన తెలుగు కవులు కావ్యం, కవిత్వం అనే పాదాలను ఒకే అర్థంలో వాడినట్లు అభిప్రాయపడ్డారు.

అదేవిధంగా 'కవి' అనే మాటను నిర్వచిస్తూ ప్రాచీన తెలుగు కవుల దృష్టిలో కవి అసామాన్యుడని రాచపాళెం పేర్కొన్నారు. నన్నయ్య వ్యాసున్ని సంసార వికారము అనే చీకటిని పోగొట్టే సూర్యునిగా కీర్తిస్తే, నన్నెచోడుడు వాల్మీకిని 'వస్తు కవ్యాబ్జరవి' అని కీర్తించాడు. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో సేకరించి ప్రాచీన కవులు 'కవికి' ఎంత స్థానం ఇచ్చారో పేర్కొన్నాడు. తన పూర్వ పరిశోధన ప్రభావంతో ఇక్కడ పింగళి సూరన ను ఆకాశము నుంచి భూమికి దిగే గంగకు శివుని జటాజూటము, హిమవత్ పర్వతము వసతి స్థలాలు అయ్యాయని, రసవంతమైన కావ్య భారతికి వ్యాస వాల్మీకులు వసతి స్థలాలు

---

[19] తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.పుట.49

అయ్యారని అభిప్రాయపడినట్లు పేర్కొన్నాడు. ప్రాచీన కవుల దృష్టిలో కవి శక్తి అపారమైనదని కవికర్ణ రసాయనంలో సంకుసాల నృసింహకవి పద్యం ఆధారంగా పేర్కొన్నాడు. ఈ క్రమంలోనే కవులను విభజన చేస్తూ సుకవులు, కుకవులు అని రెండు విధాలుగా పేర్కొన్నారు. ఈ విధమైన సుకవి స్తుతి, కుకవి నిందకు సంబంధించిన పద్యాలను ఉదాహరించి ప్రాచీన తెలుగు కవులు సుకవిని 'తజ్ఞుడు' అనీ 'కోకిలా' అని, 'నిగర్వి' అని నిర్వచించి, కుకవిని 'అజ్ఞుడు' అని 'కాకి' అని 'గర్వాంధుడు' అని విశ్లేషించాడు. అలాగే సుకవి కావ్యంలో మౌలికత ఉంటుందని, అది శాశ్వతంగా ఉంటుందని, కుకవి కావ్యంలో గ్రంథచౌర్యం ఉంటుందని అది అశాశ్వతం అవుతుందని ప్రాచీన కవులు భావించినట్లు పేర్కొన్నాడు. అయితే కవి ఎటువంటి వాడైనా ఆ కవి రాసిన కావ్యానికి ఒక శ్రోత తప్పకుండా ఉండాలి. ఈ ఉద్దేశ్యంతో రాచపాళెం ప్రాచీన తెలుగు కవుల కావ్యాలకు శ్రోత ఎవరు? అనే విషయాన్ని అనేకమంది ప్రాచీన కవుల అభిప్రాయాలను ఆధారంగా పెట్టుకొని పరిశోధించారు. వెల్చేరు నారాయణరావు గారు తన తెలుగులో కవితా విప్లవాల స్వరూపం అనే పుస్తకంలో పురాణానికి శ్రోతలు మామూలు మనుష్యులని, ప్రబంధానికి శ్రోతలు సంపన్నులైన రసికులని ఈ ప్రశ్నకు సమాధానాన్ని ఇచ్చారు. అయితే ఇది రకమైన నిజమే అయినా నన్నయ్య ఆదిపర్వంలో ఒక్కొక్క పర్వం ప్రాశస్త్యాన్ని చెబుతూ ఆ పర్వాలన్నీ సభలలో పండితుల మెప్పు పొందాయని పేర్కొని, ప్రబంధాలలో కానీ, పురాణాలలో కానీ ఎక్కడా సామాన్యుని శ్రోతగా పేర్కొనలేదని రాచపాళెం వారు కొట్టి పారేశారు.

అదేవిధంగా 'విమర్శకుడు–విమర్శ' అనే నాలుగో విభాగంలో ప్రాచీన తెలుగు కవులు తమ సాహిత్యానికి ఒక విమర్శకుడు ఉండాలని, ఒకవేళ ఉంటే అతడు రసజ్ఞుడై ఉండాలని ప్రాచీన కవులు భావించినట్లు రాచపాళెం పేర్కొన్నారు. అలాగే ప్రాచీన కావ్యంలో సాహిత్య విమర్శ ఒక ప్రత్యేక ప్రక్రియగా రూపొందలేదని, రాజాస్థానాలలో పండితులు, కవులు చేసుకునే చర్చలే సాహిత్య విమర్శలని సోదాహరణంగా నిరూపించాడు.

**ఎట్టికవికైన దన కృతి యింపుబెంప**

**జాలు గావున గావ్యంబు సరసులైన**
**కవుల చెవులకు నెక్కిన గాను నమ్మ**
**డెందు బరిణతి గలుగు కవీశ్వరుండు**

**(నిర్వచన. ఆవ.9)**

అనే తిక్కన పద్యం ఆధారంగా రాచపాళెం ఈ చర్చ చేసినట్లు తెలుస్తుంది. ఒక కావ్యం విమర్శకుల మధ్య బాగా నలిగినప్పుడే రాణిస్తుందని చాలామంది ప్రాచీన కవులు అభిప్రాయపడ్డారని, అదే సమయంలో విమర్శకులు తప్పులే ప్రధానంగా చూడరాదని రాచపాళెం పేర్కొన్నారు.

తెలుగులో సప్త సంతానాలు, కావ్యం మొదలైన విషయాలను గురించి చర్చిస్తూ తెలుగులో మొదటిసారిగా నన్నెచోడుడు సప్త సంతానాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అగ్రహారం, పుత్రుడు, దేవాలయం, విద్యాదానం, చెరువు, నిధి, కావ్యం అనేవి సప్తసంతానాలని పేర్కొన్నారు. అయితే సప్త సంతాన సంప్రదాయం తెలుగులో తప్ప ఇతర భారతీయ భాషల్లో ఉన్నట్లు లేదని రాచపాళెం అభిప్రాయపడుతూ తెలుగులో మధ్యయుగాల్లో శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, రామరాజభూషణుడు, మట్ల అనంతరాజు, మంచన, కొరవి గోపరాజు మొదలైన వాళ్ళు సప్తసంతాన సిద్ధాంతాన్ని కొనసాగించినట్లు రాచపాళెం పరిశోధించినట్లు తెలుస్తుంది. ప్రాచీన కవులు సప్త సంతానాల్లో కావ్యం శాశ్వతమైనదని గుర్తించారు. అయితే అలా గుర్తించటానికి కారణం ఆ సాహిత్యానికి ఉన్న ప్రచార గుణం ప్రాచీన కవులకు తెలియడమేనని రాచపాళెం అభిప్రాయపడ్డారు.

అలాగే ప్రాచీన కావ్యంలో కవి, కావ్యం, రాజుకు గల అవినాభావ సంబంధాన్ని గురించి వివరిస్తూ ప్రాచీన సాహిత్యాన్ని ఆస్థాన సాహిత్యం, ఆస్థానేతర సాహిత్యం అని రెండు రకాలుగా విభజించుకోవచ్చని తెలిపారు. ఆస్థాన సాహిత్యం అంటే కవులు రాజుల ఆస్థానాలలో ఉండి, వాళ్ళ పోషణలో జీవితాన్ని గడుపుతూ రచించిన సాహిత్యం. రాజాస్థానాలతో సంబంధం లేకుండా స్వంతంత్రంగా బతుకుతూ రచించిన సాహిత్యం ఆస్థానేతర సాహిత్యం. రాజాస్థాన సాహిత్యంలో కవిని రాజును కలిపేది కావ్యం. కవి కావ్య

కర్త, రాజు కావ్య భర్త లేదా శ్రోత. కవి రాసిన కావ్యంలో కథా నాయకుని కీర్తిని, రాజుకు కావ్యాన్ని అంకితం ఇవ్వవలసిన అవసరాన్ని చెపుతూ ప్రాచీన కవులు చెప్పిన పద్యాలనూ సేకరించి భూస్వామ్య రాచరిక వ్యవస్థలో కావ్యాంకితం ఒక అనివార్య కార్యక్రమం అని భయపడ్డారు. కావ్య రచనా ప్రతిభా ఏ విధంగా వస్తుందనే విషయంపై ప్రాచీన కవుల అభిప్రాయాలను తెలియజేస్తూ ప్రాచీన కవుల్లో చాలామంది కవిత్వం సరస్వతీ దేవి వరప్రసాదంగా భావించి చెప్పిన పద్యాలను క్రోడీకరించి కవిత్వ రచనాప్రతిభకు సంబంధించిన ప్రాచీన తెలుగు తెలుగు కవుల అభిప్రాయాలను విశ్లేషించారు. కవిత్వ రచనకు అవసరమైన కావ్య హేతువులను గురించి ప్రాచీన కవులు చెప్పిన అభిప్రాయాలను చెపుతూ...

> 'శక్తిర్నిపుణతాలోక శాస్త్ర కావ్యాద్య వేక్షనాత్
> కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుద్భవే'

అని మమ్మటుడు తన కావ్య ప్రకాశంలో చెప్పిన  పై శ్లోకాన్ని ఉదాహరించి ఆ శ్లోక భావాన్నే ప్రాచీన కవులందరూ చెప్పుకుంటూ వచ్చారని వాళ్ళ పద్యాల ఆధారంగా పరిశీలించారు. తిక్కన విరాటపర్వంలో వ్యాసుని స్తుతిస్తూ "విద్వత్సం స్తవనీయ భవ్యకవితా వేశుండు విజ్ఞాన సంపద్వి ఖ్యాతుడు అని చెప్పిన విశేషణాలు కూడా మమ్మటుని అభిప్రాయాలను తలపిస్తున్నాయని" రాచపాళెం ఉదాహరించారు. అదేవిధంగా "కావ్యం –సామ్యం" అనే విభాగంలో ప్రాచీన తెలుగు కవులు కావ్యాన్ని ఏయే కాలాల్లో ఏయే వస్తువులతో పోల్చారో ఈ విభాగంలో చర్చించారు. 'కవిత నైరంతర్యం' అనే విభాగంలో ఆ కాలంలోని కవులు సాహిత్యాన్ని సరస్వతిగా భావించారని, సరస్వతి అంటే ప్రవహించేదని ఈ విభాగంలో రుజువు చేసారు. కావ్య రచనలోని కష్టసుఖాలను గురించి రాచపాళెం కావ్య రచన కష్ట సుఖాలు అనే అధ్యాయంలో వివరించారు. కావ్య రచనకు అవసరమైన ప్రముఖ కవులు చెప్పిన కావ్య సిద్ధాంతాన్ని గురించి చర్చిస్తూ నన్నయ్య నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, తిక్కన, పింగళి సూరన మొదలైన కవుల సాహిత్య సిద్ధాంతాలను కూలంకషంగా చర్చించాడు. కావ్యాల్లోని కథ ఎలా ఉండాలి అనే విషయంపై నన్నయ చెప్పిన పద్యం...

'ఏ యది హృద్య మపూర్వం
బేయది యెద్దాని వినిన నెరుక సమగ్రం
బైయుండు నఘ నిబర్హణ
మేయది యక్కథయ వినగ నభీష్టము మాకున్'

అనే పద్యాన్ని ఉదాహరిస్తూ ఆధునిక దృక్పథంతో రాచపాళెం వారు వ్యాఖ్యానించడాన్ని ఆయన విమర్శలోని గొప్ప విశేషంగా చెప్పుకోవచ్చు. అదేవిధంగా కావ్యం రస ప్రధానంగా ఉండాలని, రసవంతంగా ఉండాలని, ఇదే విషయాన్నీ ప్రాచీన కవులందరూ ముక్త కంఠంతో చాటారని చెప్పారు. అలాగే వర్ణనల గురించి ప్రాచీన కవులు ఏవిధంగా ఆలోచించారో తెలుపుతూ భారతీయ ఆలంకారికులకు, ప్రాచీన తెలుగు కవులకు భావ సాద్రుశ్యత ఉందని రాచపాళెం వివరించారు. కావ్య రచన ప్రథమ ఉద్దేశ్యాన్ని గురించి చెపుతూ *"నృసింహపురాణం"* లోని పద్యాన్ని ఉదాహరించారు. సంస్కృతీ నిర్మాతయైన కళాకారుడు, తన కళ ద్వారా మనిషిలో మానవ సమాజంలో పరివర్తన తీసుకొస్తాడనే వాస్తవాన్ని ఈ పద్యం చాటుతున్నదని రాచపాళెం ప్రతిపాదించారు.

*'ప్రాచీనాంధ్ర కవుల – సాహిత్యాభిప్రాయాలు'* అనే ఈ పుస్తకంలో రాచపాళెం వారు ప్రాచీన కవులు ఉపయోగించిన సాహిత్య పరమైన పారిభాషిక పదాల పట్టికను ఇచ్చాడు. ఆచార్య నాయని కృష్ణ కుమారిగారు ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ ఆధునిక కవులు సైతం తమ కవిత్వ సిద్ధాంతాలను నిర్దేశించుకోవడానికి ప్రాచీన కవుల సాహిత్యాభిప్రాయాల మీద రాచపాళెం గ్రంథం ఉపయోగపడుతుందని ప్రశంసించారు. ఈ విధమైన దృష్టితో చూసినప్పుడు తెలుగు సాహిత్య పరిశోధనా, విమర్శ రంగంలో ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.

## 3.21. రాచపాళెంపై మార్క్సిజం ప్రభావం

రాచపాళెం ఆలోచనా విధానంలో1985 నాటికే మార్పులు వచ్చినట్టు ఆయన రచనలలోని దృక్పథాన్ని బట్టి తెలుస్తుంది. అప్పటికే ఆయన మీద మార్క్సిజం ప్రభావం

పడినట్టుగా పరిశోధకులు గుర్తించారు. ఆయనలో సాంప్రదాయికవాదం నశించి హేతువాదం మొలకెత్తింది. చాటింపు సాహిత్యానికి స్వస్తి చెప్పి చారిత్రక దృక్పథానికి అలవాటు పడ్డారు. అనవసరమైన రచనలతో సమయపాలన చేయకుండా సామాజిక దృష్టి బలంగా ఉన్న రచనలు చేయడానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యం నుండి ప్రాచీన సాహిత్య కోణం నుండి రెండు వ్యాసాలను రాశారు.

## 3.22. శ్రీనాథుని సాహిత్యం సాహితీ సామాజిక విలువలు (1998)

ఈ వ్యాసం నెల్లూరు వర్ధమాన సమాజం వారి ఆహ్వానం మేరకు నెల్లూరు టౌన్ హాలులో 1998 అక్టోబరు లో చేసిన ప్రసంగ సారాంశం. ఈ వ్యాసంలో శ్రీనాథుని కాలపు సామాజిక పరిస్థితులను పేర్కొని ఆయన భావవాద దృక్పథాన్ని నిరూపించారు. ప్రాచీన కవులలో శ్రీనాథుని వైభవాన్ని ఉగ్గడించి ఆయన సాహిత్యంలో ప్రతిబింబించే సాహితీ సామాజిక విలువల్ని వివరించారు. తెలుగు ప్రజల జీవితాన్ని ప్రత్యక్షంగా సాహిత్యంలో చిత్రించిన మొదటి కవి శ్రీనాథుడని గుర్తించారు. ఇతర విషయాల్లాగానే సాహిత్యం కూడా సామాజిక అవసరాల నుంచే పుట్టింది. భాషలాగా, భాషకు ఉన్నత రూపమైన సాహిత్యం కూడా శ్రమ నుంచి శ్రమలోనే, శ్రమతోపాటే పుట్టి పెరిగింది. ప్రకృతితో, సమాజంతో ఆవేశంతో కూడిన సంబంధాల ఫలితమే సాహిత్యం. ఈ విధంగా సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం వుంది. గతంలో తుప్పు పట్టిన ఇనుప ముక్కలేకాదు, వెదికిపట్టుకుని పరిరక్షించుకోవాల్సిన వజ్రాలూ, రత్నాలూ కూడా ఉంటాయన్న చారిత్రక వాస్తవాన్ని మన సమాజం స్వీకరించి, ఆచరిస్తుంది. అందువల్ల, ప్రాచీన యుగంలో సృష్టించబడ్డ విలువలు వజ్రాలూ, రత్నాలూ ఆధునిక యుగంలోకి ప్రవహించాయి. సాహిత్యం ఆ అనంత విలువలపట్ల నిరంతర చైతన్యం కలిగిస్తుందని చెప్పవచ్చు. అదేవిధంగా క్రీ. శ 15వ శతాబ్దం నాటికి ఉన్న తెలుగు కవులలో సమాజంలో వస్తున్న మార్పులను గ్రంథస్తం చేసిన మొదటి కవిగా శ్రీనాథుణ్ణి గుర్తించారు. అయితే ఆయన చాటువుల్లోనూ, కాశీఖండంలో లోపాముద్ర

బృహస్పతి చేసిన సంభాషణలోనూ కన్పించే స్త్రీల పట్ల గల శ్రీనాథుని భావాలు ఏమాత్రం ఇవాళ గౌరవించదగినవిగా లేవని అభిప్రాయపడ్డారు.

## 3.23. వేమన దృక్పథం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు తనలో మారిన ఆలోచనలకు తెలుగు సాహిత్యాన్ని సమాజ కోణం నుంచి చూసే ప్రయత్నానికి ఈవ్యాసాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు. వేమన తెలుగులో మొట్టమొదటి భౌతికవాదకవి అని, ఆయన కుల వివక్ష, మత సంఘర్షణ, ఆర్థిక అసమానత విగ్రహారాధన వంటి రుగ్మతలు లేని సమ సమాజాన్ని ప్రతిపాదించారని వేమన పద్యాల ఆధారంగా సిద్ధాంతీకరణ చేసారు రాచపాళెం.

**కులములోన నొకడు గుణవంతుడుండిన**
**గులము వెలయు వాని గుణము వలన**
**వెలయు వనములోన మలయజంబున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ**

అని చెప్పిన వేమన కులాచార నియమాలను నూటికి నూరుపాళ్ళు పాఠించిన సమాజంలోని వాడు. ఆయా సమయాలను ఆచారాలను బట్టి కలిగే కష్ట నష్టాలను స్వయంగా చూసిన వాడు వేమన. అందుకే ఆయన కులాలకు మతాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. గుణానికే అగ్రతాంబూలమిచ్చాడు. సమ సమాజానికి పెద్దపీట వేసాడు. నిరర్థకాలుగా అనిపించిన కొన్ని ఆచారాలను సిద్ధాంతాలను నిర్మొహమాటంగా విమర్శించారు. ఈ విషయాలన్నింటిని వేమన ప్రతిపాదించిన మానవీయ విలువలుగా పేర్కొన్నారు.

ప్రాచీన సాహిత్యంపై రాచపాళెం వారు రాసిన ఏకైక ఆంగ్ల వ్యాసం 'Ancient Telugu Poets and Theory of Translation' ఈ వ్యాసాన్ని రాచపాళెం వారు 1987అక్టోబర్లో కేంద్రసాహిత్య అకాడెమీ తిరువనంతపురంలో నిర్వహించిన అనువాద పాఠశాలలో ప్రసంగించినట్టు తెలుస్తుంది.

## 3.24. కవిత్వ విమర్శ

ఆచార్య రాచపాళెం చంద్ర శేఖరరెడ్డిగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు చదువుతున్నప్పుడు అప్పటి వారి శాఖాధ్యక్షులు ఆచార్య జి.ఎన్ రెడ్డి గారు రెండో సంవత్సరం విద్యార్థులతో సెమినార్ చేయించే వారు. ఇదే ఏడాది తన మిత్రుడు కె. నాగిరెడ్డి ద్వారా 'తంగేడు పూలు' కావ్యాన్ని సంపాదించి దానిపై తొలిసారిగా విమర్శ రాసారు. ఈ వ్యాస రచనలో సి. నారాయణ రెడ్డి గారు రచించిన *'ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు –ప్రయోగాలు'* అనే పుస్తకం, జి.వి సుబ్రహ్మణ్యం గారు రచించిన *'ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం'* అనే పుస్తకాలను నమునాగా తీసుకొని ఈ వ్యాసాన్ని రాసినట్టుగా రాచపాళెం వారే *'ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు – సందర్భాలు'* అనే పుస్తకానికి రాసిన ముందుమాటలో పేర్కొన్నారు.

### 3.24.1. ఆధునికాంధ్ర కవిత్వ విమర్శ ప్రారంభం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు 1980 వరకు ఆధునిక సాహిత్యం జోలికి పోలేదు. అదే ఏడాది తన మిత్రుడైన కె. నాగిరెడ్డి గారి ద్వారా ఎన్.గోపి గారు రాసిన 'తంగేడు పూలు' కావ్యాన్ని తొలి సారిగా చదివి దానిపై విమర్శ రాయబూనారు. అప్పటికి ఆయనకు విమర్శా సూత్రాలు కూడా తెలియకపోవడంతో ఆ కావ్యంపై కేవలం సమీక్షాత్మకంగా ఒక వ్యాసం రాసారు. దీనినే ఆధునిక సాహిత్యంపై ఆయన రాసిన తొలి వ్యాసంగా చెప్పవచ్చు. అయితే దీనిని పూర్తిగా విమర్శనాత్మక దృష్టితో కాకుండా మచ్చుకు సమీక్షాత్మక వ్యాసంగానే రాసి దానికి 'తంగేడుపూలు – విశ్లేషణాత్మక సమీక్ష' అని పేరు పెట్టారు. ఈ వ్యాసం 1980లో స్రవంతి పత్రికలో అచ్చయింది.

### 3.24.2. 'తంగేడుపూలు' కావ్య విశ్లేషణ

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు ఆధునిక సాహిత్యంపై వెలువరించిన తొలి సాహిత్య విమర్శ ప్రయత్నంగా దీనిని చెప్పుకోవచ్చు. తన స్నేహితుడైన వి. నాగిరెడ్డి నుండి

‘తంగేడుపూలు’ కావ్యాన్ని అందుకున్న రాచపాళెం వారు ఆ కావ్య సమీక్షకు పూనుకుని ఆదీర్ఘమైన వ్యాసాన్ని రాసారు. ఆ వ్యాసం 1980 సంవత్సరం స్రవంతి పత్రికలో అచ్చయింది. ఈ కావ్యాన్ని రాచపాళెం వారు సమీక్షిస్తూ ఇది సామాన్యునికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కావ్యంలోని కవితలన్నీ అన్యాయం జరిగినప్పుడు, అజ్ఞానం ముసిరినప్పుడు, ఆకలి అయినప్పుడు కేకలు వినినప్పుడు పుట్టుకొచ్చినవి అని రాచపాళెం వారు ఆ కావ్య నేపథ్యాన్ని గురించి వివరించారు. ఈ కావ్యంలో తొంభై భాగాలు వస్తువును సామాన్య మానవుని దగ్గర నుండే తీసున్నారని, ఆకలి కేకలు, అజ్ఞానం, జడత్వం, బానిసత్వం, కన్నీళ్ళు ఇందలి వస్తు వైవిధ్యానికి నిదర్శనాలని వివరించారు. సమాజంలో ఎందుకూ పనికిరావని అనుకునే తంగేడుపూలను సామాన్యుడికి ప్రతీకగా స్వీకరించి, సామాన్యుడికి, తంగేడుపూలకు ఉన్న సంబంధాన్ని వ్యంగ్యంగా చిత్రించాడు. సమాజంలో ఈనాడు మనం అన్నో అసమానతలను చూస్తున్నాం. అటువంటి వాటిలో ఆర్థిక అసమానతలు ముఖ్యమైనవి. స్వాతంత్ర్యం కోసం కలలుగన్న భారతదేశం అది సాధించుకుని ఇన్ని సంవత్సరాలైనా దేశంలో ఆర్థిక అసమానతలు అలాగే ఉన్నాయి. దానికి గల కారణాన్ని వివరిస్తూ “స్వేచ్ఛ ముసుగులో స్వార్థం బలిసి మానవత చచ్చి, పెద్దవాడు ఇంకా పెద్ద వాడుగాను, చిన్నవాడు ఇంకా చిన్నవాడు గానూ తయారయ్యాడని” వివరించారు. ‘తంగేడుపూలు’ కావ్యాన్ని సామాన్యుడికి అతి చేరువగా ఉండి అలతి అలతి పదాలతో సృష్టించారు.

ఆచార్య ఎన్ గోపి గారు రచించిన ఈ తంగేడుపూలు కావ్యాన్ని, దానిపై ఆచార్య రాచపాళెం వారు రాసిన సమీక్షాత్మక వ్యాసాన్ని చదివినట్లయితే సమకాలీన సమాజానికి అద్దం పట్టేవిగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ కావ్యంలోని అన్నీ కవితలను చదివిన రాచపాళెం వారు ఒక్కొక్క కవితలో స్పృశించిన సామాజిక కోణాన్ని వివరించే ప్రయత్నం చేసారు. ఏ కవియైనా తన కవిత్వ నేపథ్యాన్ని ఏదోఒక సందర్భంలో తెలియజేస్తారు. ఈ సందర్భంగా తంగేడుపూలు కావ్య ఆవిష్కరణ సభలో గోపి గారు “ నాది మట్టిలో పుట్టిన మనిషి కోసం ఉద్దేశించిన కవిత్వం. మానవాళి పట్ల కవిగా నాకు గల బాధ్యతను నిర్వర్తించడం,

మానవత్వానికి కాపలా కాయడం నా గేయాల పరమార్థం[20]" అని తన కవిత్వం గురించి తానే చెప్పుకున్నారు.

## 3.24.3. పాటతో విమర్శకు బాట

ఆధునికాంధ్ర కవిత్వంలోని గరిమెళ్ళ సత్యనారాయణ గారు రాసిన "మాకొద్దీ తెల్ల దొరతనం" అనే జాతీయోద్యమ గేయంపై తొలిసారిగా సాధికారమైన విమర్శ రాసినట్లు తెలుస్తుంది. అప్పటికే కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యార్థి నాయకునిగా పనిచేసిన అనుభవంతో  రాచపాళెం వారికి దేశభక్తి గేయంపై సమీక్ష చేయాలన్న కుతూహలం ఏర్పడి ఉంటుందని అనుకుంటున్నాను. ఈ క్రమంలో జాతీయోద్యమ కాలంలో కీలక పాత్ర పోషించిన గరిమెళ్ళ సత్యనారాయణ గారు రచించి ఆలపించిన  "మాకొద్దీ తెల్ల దొరతనం" అనే గేయాన్ని విమర్శిస్తూ ఆ రోజుల్లో ఈ గేయానికి గల ప్రాముఖ్యతను వివరించారు.

జాతీయోద్యమ కాలంలో దేశాభక్తుల్ని సృష్టించిన అపరకవి బ్రహ్మ గరిమెళ్ళ సత్యనారాయణ. ఈ గేయంలో 'శ్రమిస్తున్నా తిండి దొరక్కపోవడం, మద్యపాన వ్యసనంలో చివికిపోయిన బ్రతుకు, అందుకు తెల్లదొరల బాధ్యత, విభజించి పాలించే కుటిల నీతి, జాతీయ భావాన్ని దేశ ద్రోహంగా చిత్రించడం, పన్నులభారం, పోలీసుల జులుం, ప్రజా వ్యతిరేక శాసనాలు, ఉద్యమాన్ని అణచివేసే కుట్రలు, గోమాంసభక్షణం, నాయకులను నిర్బంధించడం' మొదలైన వాటిని నిశితంగా విమర్శించడం ఈ గేయంలోని ప్రధాన వస్తువుగా కనిపిస్తుందని చెప్పవచ్చు . రాచపాళెం వారు ఈ విషయాలన్నింటిని అవగతం చేసుకుని సామాజిక అవసరాలకు అనుగుణంగా సాహిత్య సృజన జరగాలని పేర్కొన్నారు. అదేవిధంగా అస్పృశ్యతను నివారించడంలో భాగంగా గాంధీ గారు చేసిన కృషిని తెలిపి దళితులకు "హరిజనులు" అని పేరు పెట్టడం వెనుక ఉన్న ఆంతర్యాన్ని కనుగొన్నారు.

అదేవిధంగా

[20] తిరుమల రామ చంద్ర, ఆంధ్ర సచిత్ర వార పత్రిక (1976), తంగెడు పూలు ఆవిష్కరణ సభలో గోపి గారి మాటలు.

"స్నాన ధ్యానము చేసి రామకృష్ణా యంచు దేముడి గుడిలోకి రండి
అభిషేక మతనికి చేయరండి నిర్మలత్వామాత్మను పెంపొంది,
ధర్మమార్గమును తగిలి రండీ! మాలలు రండీ"

అంటూ హరిజనులను దేవాలయాల ప్రవేశానికి నిరాకరించడం వంటి అంశాలను ప్రస్తావించాడు. ఈ విషయంలో గాంధీజీ, గరిమెళ్ళ వారికి మధ్య ఉన్న సామ్యాన్ని రాచపాళెం వారు తెలియజేశారు. "వ్యర్థ పద్య ప్రచురణమెక్కువై నోటిలో నుంచి వచ్చెడి తుంపరలు అచ్చుపడుచున్నవే యని విచారింపవలసి వచ్చినది"[21] అంటూ సామాజిక బాధ్యతను స్పృశించని సాహిత్యం వ్యర్థమనే విచారణను వ్యక్తం చేసిన గొప్ప సంఘ సంస్కర్త గరిమెళ్ళ. అందుకు భిన్నంగా జాతీయ భావనతో సమరగీతాలు రాసి ప్రచారం చేస్తూనే పద్య, భావ కవిత్వాలను పై విధంగా విమర్శించడం వల్ల ఆయన సాహిత్య దృక్పథం తేట తెల్లమౌతుంది. ఈ విషయాలన్నింటిని రాచపాళెం వారు తన వ్యాసంలో వివరించారు. 'సాహిత్యం సాహిత్యం కోసమే అని కాకుండా అది ప్రజాభివృద్ధి కోసం అని నమ్మి దాన్ని ఆచరించిన వాడు గరిమెళ్ళ' అన్న జయధీర్ తిరుమల రావు గారి మాటలను మనం ఈ సమయంలో గుర్తుకు చేసుకోవాలి. సాంఘీకోద్యమానికి, ఆధునిక సాహిత్యానికి మధ్య ఉన్న తొలి బంధుత్వాన్ని స్థిరపరచడానికి ఆయన(రాచపాళెం) గరిమెళ్ళ పాట మూలాల్ని శోధించారని చెప్పవచ్చు. ఈ విషయం 'గరిమెళ్ళలో గురజాడ కంటే బలంగా కనిపిస్తుందని' ప్రముఖ కవి అఫ్సర్ పేర్కొన్నారు.

పై విధంగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారిలో అప్పటికే (1980) ఒక సామాజిక పక్షపాత పునాది పడినట్టుగా తెలుస్తుంది. కాబట్టి ఆయన జన్మరీత్యా ఒక సంప్రదాయ అగ్రకులానికి చెందినప్పటికీ, ఆయనలోని ఈ కులనిర్మూలనా దృష్టి, సామాజిక అసమానతలపై ఆయనకున్న అవగాహనతోనే ఈ వ్యాసాన్ని రచించినట్లు తెలుస్తుంది. ఈ రకమైన విమర్శా పద్ధతి విమర్శనా భేదాలైన "జాతీయోద్యమ సాహిత్య విమర్శా ధోరణి"కి చెందుతుంది.

[21] నూతన సాహిత్య విజ్రుంభణము(వ్యాసం). గరిమెళ్ళ వ్యాసాలు.బి.కృష్ణకుమారి.పుట.8

## 3.24.4. కవిత్వంపై మౌలికమైన సూత్రీకరణలు

అంతవరకూ ఉన్న ప్రాచీన సాహిత్య అధ్యయన అనుభవం, ఆ తరువాత అప్పుడప్పుడే ఒడి ఒడిగా ఆధునిక సాహిత్యం వైపుకు అడుగులు పడిన నేపథ్యం నుండి వెలువడిన కొన్ని మౌలికమైన సూత్రీకరణలే *"కవిత్వం: నిన్న, నేడు, రేపు"* అనే వ్యాసం. ఈ వ్యాసంలో ప్రాచీన కాలంలోని కవితా స్వరూపం ఎలా ఉంది. ఆధునిక కవితా స్వరూపంతో అది ఏ విధంగా విభేదించిందనే విషయాలను రాచపాళెం వారు జాగ్రత్తగా అధ్యయనం చేసి తెలియజేశారు. అదేవిధంగా కవిత్వం లోని వస్తువు ఆధునిక సాహిత్యంలోనైతే సమాజానికి దగ్గరగానూ, ప్రాచీన సాహిత్యమైతే వాస్తవానికి దూరంగానూ ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా భవిష్యత్తులో కవిత్వం ఏవిధంగా ఉండబోతోంది. అనే కవిత్వ భవిషద్దర్శనాన్ని చెప్పడమనేది ఆయన స్థూల అవగాహనను తెలియజేస్తుంది. భవిష్యత్తులో ప్రాచీన, ఆధునికాంధ్ర కవిత్వాలను విశ్లేషించాలనే ధ్యేయంతోనే ఆయన కవిత్వాన్ని సాధ్యమైనంత విస్తారంగా పఠించి ఈ వ్యాసం రాసినట్టుగా తెలుస్తుంది. దీనిని సాహిత్య విమర్శ పరిభాషలో "సూత్రీకరణ విమర్శ"గా భావిస్తారు.

## 3.24.5. పరిణామానికి ప్రతీక శ్రీశ్రీ

సాధారణ నామ సంవత్సరంలో జన్మించి అసాధారణ వ్యక్తిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి శ్రీశ్రీ. తన తొలి రోజుల్లో కావ్యభాషా శైలిలో ఛందోబద్ధ రచనలు చేసేవాడు. విశ్వనాథ, దేవులపల్లి ప్రభావంతో ప్రభవ(1927), సుప్తాస్థికలు(1928) అనే రెండు కావ్యాలు వెలువడ్డాయి. ఆ తరువాత దాదాయిజం, అధివాస్తవిక ప్రయోగం అనే కవితా సంకలనాన్ని అబ్బూరి వారు తనకివ్వగా చదివి స్వీయభిప్రయలను, భావాలను వ్యక్తీకరించడానికి  మరో ప్రత్యామ్నాయాన్ని అన్వేషించాడు. అప్పటి కాలంలో వచన పద్య రచనల్లో ఆరితేరిన శిష్ట్లా, గురజాడ రచనలను చదవడం ప్రారంభించారు. ఆ తరువాత తానూ కూడా అలా ఎందుకు రాయకూడదు అని ఆలోచించాడు. ఆ తరువాత 1928 లో విద్యాభ్యాసం కోసం మద్రాసుకు వెళ్ళినప్పుడు, అక్కడ విద్వత్కవి వేటూరి ప్రభాకర శాస్త్రి, చారిత్రకేతిహాసిక పరిశోధకుడు

మల్లంపల్లి సోమశేఖర శర్మ, నండూరి సుబ్బారావు వంటి ఉత్తమ వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత తన ప్రభవ కావ్యాన్ని నిర్దాక్షిణ్యంగా విమర్శ చేసిన కొంపెల్ల జనార్ధన రావు తో పరిచయం ఏర్పడి ఆ పరిచయం కాస్త శ్రీ శ్రీ తన మహా ప్రస్థాన కావ్యాన్ని అంకితమిచ్చేటంత స్నేహంగా పరిణమించింది. ఆ తరువాత కొంత కాలానికి మల్లవరపు విశ్వేశ్వర రావు, జల సూత్రం రుక్మిణీ నాథశాస్త్రి, సామినేని ముద్దు కృష్ణ లు శ్రీశ్రీ కి మిత్రులయ్యారు. ఈ మిత్రులతో ఎక్కువగా సాహితీ చర్చలు చేయడం వల్ల అతనిలో విశాల దృష్టి, విమర్శనాత్మక ప్రతిభ అలవడ్డాయి. శ్రీశ్రీ లో పరిణామానికి పైన వివరించిన పరిస్థితులను నేపథ్యంగా చెప్పుకోవచ్చు.

శ్రీశ్రీ తన రచనా జీవితాన్ని భావకవిగా ప్రారంభించి విప్లవ కవిగా ముగించాడు. తానూ భావ కవితా లోకంలో ఉన్నప్పుడు *"ప్రభవ"*, అభ్యుదయ కవిగా ఉన్నప్పుడు *"మహా ప్రస్థానం"*, విప్లవ కవిగా ఉన్నప్పుడు *"మరో ప్రపంచం"* అనే మూడు కవితా సంకలనాలను రచించారు. తను భావ కవిగా ఉన్నప్పుడు ప్రకృతి ప్రీతి, ప్రణయ తత్త్వం, పద్యం, ఛందస్సు, సుదీర్ఘ సమాసాలతో తన కవిత్వాన్ని సృష్టించాడు. ఈవిధంగా కొన్ని సంవత్సరాలు శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. 1930 లో శ్రీశ్రీ టైఫాయిడ్ బారిన పడ్డాడు. ఆ రోజుల్లో సమాజం ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యంతో విలవిలలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీశ్రీ ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టాడు. ఈ అధ్యయనం వలన శ్రీశ్రీకి సంఘం పట్ల, సాహిత్యం పట్ల పూర్వమున్న దృక్పథాన్ని మార్చివేసింది. సమాజం, సాహిత్యం వర్గ దృష్టితో దర్శనమిచ్చాయి. దీనితో ఆయనకు సామాజిక బాధ్యత తెలియవచ్చింది. ఈక్రమంలో జయభేరి అనే కావ్యాన్ని రచించాడు. అంతవరకు ప్రతి ధ్వనుల్ని వినిపిస్తూ వస్తున్న శ్రీశ్రీ

**నేను సైతం**
**ప్రపంచాగ్నికి**
**సమిధనొక్కటి ఆహుతిచ్చాను**

అంటూ తన సొంత గొంతుకను వినిపించడం ప్రారంభించాడని రాచపాళెం వారు తెలియజేసారు. ఇక ఇక్కడ నుండి సామాజిక వాస్తవికతే ఆదర్శంగా తీసుకుని రచనలను కొనసాగించినట్టు ఆయనలోని ప్రాపంచిక దృక్పథాన్ని తెలియ జేశారు. ఈ విధమైనటువంటి సామాజిక స్పృహే ఆయనను 1930 దాకా కవిత్వం తనను నడిపించిందని, 1930 తరువాత తాను కవిత్వాన్ని నడిపిస్తున్నానని చెప్పుకునేలా చేసిందని వివరించారు. అదేవిధంగా పౌరాణిక ప్రతీకలని ఆధునిక కవిత్వంలో ఉపయోగించడం అనే కొత్త ప్రయోగానికి శ్రీశ్రీ ఆద్యులని రాచపాళెంవారు గుర్తించారు. అందుకే "శ్రీశ్రీ ఒక అపకారం చేయకపోలేదు తన తరువాత మరోలా రాయడానికి వీలు లేకుండా చేసాడని" నండూరి రామమోహనరావు గారు అన్నారు. అదేవిధంగా 'మహా ప్రస్థాన' గేయంలో *'పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి'* అంటూ ప్రపంచ నిర్మాణానికి ప్రజలను సమాయత్తం చేస్తున్నట్టు తెలుస్తుంది. ఆయన కవితలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే 'దేశ చరిత్రలు'లో చరిత్రను తిరగరాయ వలసిన ఆవశ్యకతను గుర్తించారు. అయితే శ్రీశ్రీ రచించిన *'జయభేరి', 'మహాప్రస్థానం'* వంటి రచనలు అరసం ఏర్పడక ముందే రచించాడని ఈ గేయాలన్నీ రాయడం పూర్తయ్యాకే అరసం(1943) ఆవిర్భవించిందని తెలియజేసారు. 1941 తరువాత విభిన్న ఇజాలతో రచనలు చేస్తూ 1955 లో అరసానికి అధ్యక్షుడయ్యాడు. ఆ తరువాత 1965 లో దిగంబర కవిత్వ ఉద్యమం ప్రారంభమైంది. శ్రీకాకుళ గిరిజన పోరాటం నగ్జల్బరి ఉద్యమ ప్రభావంతో ఝుంఝు, జట్కావాలా వంటి రచనలు చేశారు. 1970 జూలై 4 న విరసం అధ్యక్షుడయ్యాక 'విరసం నా శాశ్వత చిరునామా' అని ఉద్ఘాటించారు. ఆ విధంగా శ్రీశ్రీ ఆస్తికుని నుండి నాస్తికునిగా పరిణామం చెంది, ప్రాచీన సాహిత్యం నుండి ప్రపంచ సాహిత్యం దాకా పయనించి తన భావజాలాన్ని ఏవిధంగా బలోపేతం చేసుకున్నాడో రాచపాళెం వారు తన రచనలను ఉదాహరిస్తూ విమర్శించారు.

## 3.24.6. మట్టి మనిషి కవి (త) కోసం

కె.శివారెడ్డి గారు ప్రముఖ వచన కవిగా ప్రసిద్ధులు. *'రక్తం సూర్యుడు', 'ఆసుపత్రి గీతం', 'చర్య', 'గాథ', 'మోహనా ఓ మోహనా'* అనే వచన కవితా సంపుటులను రచించారు. వీటిలో *'మోహనా ఓ మోహనా'(1990)* అనే కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు కె. శివారెడ్డి గారి కవిత్వ రచనలపై వ్యాసాన్ని రాస్తూ ఆయనను మట్టి మనిషి అని అభివర్ణించి ఆయనకు గల నిరాడంబరతను తెలియజేసారు. ఆయన కవితా సంకలనాల నుండి కొన్నింటిని స్వీకరించి వాటిని ఈ వ్యాసంలో విశ్లేషించే ప్రయత్నం చేసారు. శివారెడ్డి గారి కవిత్వంలో మానవ హృదయం ద్రవిస్తుందని, ఆయన కవితలు మట్టి వాసనతో కూడుకొని ఉన్నాయని, ఆయన సాహిత్యం ఎప్పుడు మట్టిమనిషి పక్షపాతంగా ఉంటుందని ఆయనెప్పుడు సామాన్య మానవుడి వైపు పయనిస్తాడని రాచపాళెం వారు విశ్లేషించారు. మనిషి ఎప్పుడూ ఒంటరి వాడు కాదని అతనికి ఎప్పుడు ఒక సమూహం ఉండాలని సముహంలోనే ఆనందంగా ఉంటాడని కవి తెలియజేస్తూ మానవులందరూ సమైక్యతతో ఉండాలనే విషయాన్నీ చెప్పకనే చెప్తున్నారు. ఆ విషయాన్నీ విమర్శకులైన రాచపాళెం వారు ఒడిసి పట్టుకున్నారు. ప్రతి మనిషి స్వేచ్చను కోరుకోవాలని స్వేచ్ఛ ఎవడి వరప్రసదమో కాదంటారని ఆయన దృష్టిలో మనిషి ప్రాణం కన్నా స్వేచ్ఛ విలువైనదని రాచపాళెం తెలిపారు.

## 3.24.7. విప్లవ కవిత్వం – మౌలిక భావన

ఆంగ్లంలో 'రెవల్యూషన్' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'విప్లవం' అనే పదాన్ని ఉపయోగిస్తున్నాం. విప్లవం అంటే వ్యవస్థలో మార్పు. సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పు ఏదైనా 'విప్లవం' గా స్థూలార్థంలో భావించారు. దీనినే ఆచార్య కొలకలూరి ఇనాక్ ఇలా అంటారు. "విప్లవం అంటే ఇక్కడ మానవ పరిణామం అనే భావం ఈ మానవ పరిణామంలో కోరుకున్న రాజకీయ వ్యవస్థను సంస్థాపించటం లక్ష్యం. ఆ వ్యవస్థను రూపెత్తించటానికి మునుపటి నుంచి చెల్లుబాటులో ఉన్న రాజకీయ వ్యవస్థను

బలప్రయోగంతో సమూలంగా పెకలించడం. ఇందుకు కారణం ఆర్థిక వ్యవస్థలోకి రాజకీయం పరిణమించే టట్టు చేయటమని అర్థం. ఈ మార్పు వెనుక ఆర్థిక పీడన దోపిడీ ఉండటం వల్ల, పీడితుల మేలు కోసం నూతన ఆర్థిక వ్యవస్థను స్థాపించడం విప్లవ లక్ష్యం”[22] అందుచేత విప్లవం అంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వ స్థాపనగా భావించవచ్చు. అయితే రాచపాళెం వారు ఈ విధమైన విప్లవ కవిత్వంలో కొంత మార్పును కోరుతూ ఆ మార్పు పైన చెప్పిన ప్రధాన లక్ష్యానికి తిలోదకాలివ్వటం కాదని, విప్లవ కవిత్వంలో మార్పు అంటే విప్లవోద్యమాన్ని మరింత గాడంగా భావుకతతో చిత్రించడం అని చెప్పారు. వచనం, పాట అనే రెండు ప్రక్రియలు విప్లవ కవిత్వాన్ని సుసంపన్నం చేసాయని, అయితే వచనంలో కూడా బలమైన భావుకతను మేళవించి విప్లవ కవిత్వాన్ని కొందరు రచిస్తే, మరి కొందరు పాట రూపంలో విప్లవ భావాలను ఒలికించారని రాచపాళెం వారు చెప్పారు. అయితే ఈ కవిత్వం ఏ రూపంలో ఉన్నా వాటిలోని విప్లవ భావాలే ఆ కవిత్వానికి పునాదిగా చెప్పవచ్చు. ఏ కవిత్వమైనా ఒక ఆశయసిద్ధి లక్షణాన్ని కలిగి ఉంటుంది గనుక ఆ లక్ష్యాన్ని చేరుకున్న కవి క్రాంతి దర్శి అవుతాడని చెప్పవచ్చు. అయితే రాచపాళెం వారు ఈ విప్లవ రచయితల్ని రెండు రకాలుగా పేర్కొన్నారు. అది ఉద్యమంలో గానీ, ఉద్యమానికి సమీపంగా కానీ ఉంటూ రాసే వాళ్ళు, ఉద్యమాన్ని గురించి విని చదివి రాసే వాళ్ళు అని విభజించారు. అయితే విమల రాసిన ‘అడవి ఉప్పొంగిన రాత్రి’ అనే కవితా సంకలనంపై రెండింటిలో మొదటి రకానికి చెందుతుందని ఆమె కవితల ద్వారా నిరూపించారు.

## 3.24.8. కవిత్వం – వస్తు రూప విశ్లేషణ

సాహిత్య చరిత్రలో తొమ్మిదో దశాబ్దాన్ని ‘కవిత్వ దశాబ్దిగా’ రాచపాళెం పేర్కొన్నారు. అన్నీ భావజాలాల రచయితలు వస్తు, రూపాలకు సమ ప్రాధాన్యమిచ్చి కవిత్వం రాయడం ఈ దశాబ్ది లక్షణంగా పేర్కొన్నారు. అయితే దీనిని సోదాహరణంగా వివరించి ఉంటే స్పష్టత ఉండేదని చెప్పవచ్చు. ఈ సంకలనంలో రచయిత్రి సౌందర్యాత్మక హింస, వేశ్యా శిశువు,

[22] తెలుగు సాహిత్య విమర్శ సూత్రం. కొలకలూరి ఇనాక్ పుట:96

వంటిల్లు, తెగబడిన మా కలల ప్రపంచం అనే కవితల్లో సమాజంలోని సమస్యల్లో స్త్రీ సమస్యలు ఒక భాగమని అన్నిటితో పాటు అవి కూడా ఉమ్మడి పోరాటం ద్వారా పరిష్కార మవుతాయని రచయిత్రి మార్క్సిస్టు దృక్పథంతో చెప్పినట్టు రాచపాళెం చెప్పడంలో ఉమ్మడి పోరాటం అనేది మార్క్సిస్టు ధోరణికి గల లక్షణాలలో ఒకటిగా తెలుస్తుంది.

ఎంత సంక్లిష్ట సామాజిక పరిస్థితులనైనా కవి అవగాహన చేసుకోగలిగితే వాటిని కళాత్మకంగానే స్పష్టంగా వివరించగలడని చెపుతూ ఇటువంటి సంక్లిష్టత రెండు రకాలని చెప్పారు. ఒకటి దైనందిన జీవితంలోని సంక్లిష్టత, రెండు ఉద్యమ పోరాట జీవితంలోని సంక్లిష్టత. మొదటి సంక్లిష్టత – మనిషి పరిసర పరిస్థితుల తాకిడికి లోనవటం, చలించి పోవటం మారుతున్న నాగరికతలో చుట్టూ ఎంతో మంది ఉన్నా ఒంటరితనం అనుభవించడం, ఎవరూ ఎవరికీ ఏమీ కారనుకోవడం, ఒక్కోసారి  జీవితం అర్థరహితం అనుకోవడం, తనకెందుకు ఈ పరిస్థితి కలిగిందో అర్థం కాక విలపించడం, అన్నిటా వెలితిని భావించడం – ఇలా ఉంటుందని, రెండో సంక్లిష్టత ఆలోచనకు ఆచరణకు సంబంధించినది. ఆలోచనల మధ్య సంఘర్షణ ఏర్పడటం, ఆచరణల మధ్య వైరుధ్యం కలగడం, శత్రు పక్షం నుంచి, మిత్రపక్షం నుంచి విరుద్ధ పరిస్థితులు ఎదురుకావడం లాగా ఉంటుందని చెప్పడం అనేది అప్పటికి ఆయనకున్న మార్క్సిస్టు అవగాహన అని చెప్పవచ్చు. అదే ఆయన సాహిత్య విమర్శ తొలిదశలో కనిపిస్తుంది. ఈ సంక్లిష్టతల్ని కవిత్వంలో చెప్పవలసి వచ్చినప్పుడు కొన్ని పరిమితుల వల్ల కవి అనివార్యంగా అస్పష్టతను ఆచరించవలసి వస్తుందని, తేలిగ్గా చెబితే కవిత్వం కాకుండా పోతుందని, వస్తుగతమైన సంక్లిష్టత శిల్పంలో ప్రవేశించకుండా ఉండటం అవసరం అని రాచపాళెం వారు భావించి గౌరీశంకర్ రచించిన దీర్ఘకావ్యం 'ఎలియాస్'ను విశ్లేషించారు.

## 3.24.9. భావ కవిత్వం – పలాయనతత్వం

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించిన 'భావ కవిత్వం' రొమాంటిసిజం పేరుతో పాశ్చాత్య దేశాలలో అది ప్రాధాన్యతను సంతరించుకుంటే. తెలుగులో అది కాల్పనిక

కవిత్వం, భావ కవిత్వం అనే పేరుతో ప్రాచుర్యం పొందింది. "ఆంగ్ల సాహిత్య చరిత్రలో సంప్రదాయ విధానముపై తిరుగుబాటుగా క్రీ.శ 18 వ శతాబ్దంలో మొదలైన ఉద్యమము కాల్పనికోద్యమము"[23] కాగా "రొమాంటిసిజం అనే పదాన్ని వివిధ దేశాలలో, వివిధ కాలాల్లో, విభిన్న అర్థాలతో పిలిచారు. జర్మనీలో ఆదర్శ వాదంగా, ఫ్రాన్స్ లో స్వేచ్ఛా వాదంగా, ఇంగ్లండులో సౌందర్య వాదంగా, కాల్పనిక వాదంగా ప్రకటితమైంది"[24] ఇదంతా 18వ శతాబ్దంలో జరిగితే తెలుగులో మాత్రం 20 వ శతాబ్దం ప్రారంభంలో కాల్పనిక కవిత్వం మొదలైందని చెప్పవచ్చు. కాల్పనిక కవిత్వ లక్షణాలలో రసోద్వేగం ప్రధానమైనదని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు అభిప్రాయ పడ్డారు. అదేవిధంగా ప్రకృతి ఆరాధన, ప్రణయతత్వం, ఆత్మాశ్రయ రీతి దీనికున్న మరికొన్ని ముఖ్య లక్షణాలని చెప్పవచ్చు. అయితే 1940 కి ముందున్న భావ కవిత్వ విభజనకు దాని లక్షణాలకు ఏ మాత్రం పొంతన కుదరదని రాచపాళెం వారు అభిప్రాయపడి, దేశభక్తి కవిత్వం, సామాజిక స్పృహ అనేవి భావకవిత్వ ప్రాథమిక రూపాలని పేర్కొన్నారు. భావ కవిత్వం అనే కేవలం ప్రణయం గురించి, ప్రకృతిని గురించి ఆరాధించి రాసిందే అనే భావన పాఠకులలో పాతుకు పోయిందని కానీ ఈ భావకవిత్వంలో పలాయన తత్వంకూడా కొంత బయలుదేరిందని రాచపాళెం వారు *'భావకవిత్వం – పలాయనతత్వం'* అనే వ్యాసం ద్వారా నిరూపించారు.

అయితే ఈ పలాయనవాదం భావ కవిత్వంలో ఎలా ఉంటుంది అనే విషయాన్నీ చెబుతూ భౌతిక సమాజాన్ని వదలి స్వాప్నిక సమాజంలో నివసించడం, వాస్తవికతను విస్మరించి ఊహకు పట్టం కట్టడం, జీవితంలోని కష్టాలను ఎదుర్కోలేక తిరోగమన మార్గాన్ని అనుసరించడం, భౌతిక సమస్యలకు భౌతికేతర రీతుల్లో పరిష్కారాన్ని అన్వేషించడం పలాయనవాదంగా చెప్పారు. ఈ విధమైన పలాయన ధోరణికి ఉదాహరణగా ప్రధాన ధ్వనిగా దేవులపల్లి కృష్ణశాస్త్రిని పేర్కొన్నారు. అయితే ఆతరువాత వచ్చిన కవులందరూ కృష్ణశాస్త్రికి ప్రతిధ్వనులగానే పేర్కొని శ్రీశ్రీని ఉదాహరించారు. భావ కవిత్వాన్ని నెగేట్ చేస్తూ పఠాభి

23 . డా. జి నాగయ్య, తెలుగు సాహిత్య సమీక్ష–2, పుట: 642

24 . వెలమల సిమ్మన్న, తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, పుట:431

కవిత్వం వచ్చింది. భావ కవిత్వాన్ని తన వచన పద్యాలనే దుడ్డుకర్రలతో కొడతానన్నాడు. నేను భావకవిని కాను, నేనహంభావ కవిని అని ప్రకటించుకున్నాడు. అశ్లీలం అనుకునే పదాలతో కూడా అతను ప్రయోగాలు చేశారు. అదే క్రమంలో శిష్ట్లా, నారాయణరావు కవిత్వాలు వచ్చాయి. శ్రీశ్రీ చేతిలో అభ్యుదయ కవిత్వం పూర్తిగా రూపుదిద్దుకుంది. అయితే, శ్రీశ్రీ కూడా పాత వస్తువును నెగేట్ చేసే పని పెట్టుకున్నాడు. ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణమంటూ పాత వస్తు స్థితిని వ్యతిరేకించాడు. ఈ కవిత వస్తు మార్పిడి సూచిస్తుంది. మహాప్రస్థానం కవితలు అభ్యుదయ కవిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. సాహిత్యం సామాజిక వాస్తవికతను విస్మరిస్తే ఏ గతి పడుతుందో ఈ భావకవిత్వ ఉద్యమం నిరూపించిందని, కాబట్టి సమాజ ప్రగతికి చైతన్యానికి దోహదం చేయని రచనను పలాయనవాద రచనగాను, ఆ రచయితను పలాయన వాద రచయితగానూ రాచపాళెం వారు పేర్కొన్నారు.

## 3.24.10. భావకవిత్వం జాషువా ప్రత్యేకత

పైన చెప్పినట్టుగా భావకవిత్వం కొన్ని అవాస్తవికత లక్షణాలను కలిగి ఉందని చెప్పవచ్చు. అయితే ఈ భావకవిత్వాన్ని ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు ప్రణయ, ప్రకృతి, దేశభక్తి, భక్తి, సంఘ సంస్కరణ, స్మృతి కవితా శాఖలున్నట్లు పేర్కొన్నారు అయితే భావకవిత్వ ప్రధాన లక్షణం 'అంతర్ముఖత్వం' అలాంటప్పుడు దేశభక్తి, సంఘ సంస్కరణ శాఖలు ఇందులో ఒదగవని రాచపాళెం చెప్పారు. అయితే జాషువా కవిత్వాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసిన రాచపాళెం వారు జాషువా రాసినవి ప్రణయ కవితలే అయినా ఆయన దారే వేరని చెప్పారు.ఆ ఉద్దేశ్యంతోనే భావ కవులకు జాషువాకు పొంతన లేదని చెప్పి ఇందుకు ఆయన నేపథ్యమే కారణం అని చెప్పారు. స్వప్నకథ,అనాథ, పిరదౌసి, ముంతాజు మహలు మొదలైన కావ్యాలను పరిశీలించి భావకవిత్వ ప్రధాన లక్షణమని చెప్పుకున్న అంతర్ముఖత్వ రీతిలో తన కవిత్వాన్ని రాసినా ఆయన ఎప్పుడూ శ్రామిక వర్గాన్ని విస్మరించలేదు. ఆయన ఆ విధమైనటువంటి కవిత్వం రాసినప్పటికీ ఆయన సారాంశంలో మాత్రం అంతర్ముఖుడు కాదు, బహిర్ముఖుడే అని విశ్లేషించారు.

ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా (సెప్టెంబర్ 28, 1895 – జూలై 24, 1971). సమకాలీన కవిత్వ ఒరవడియైన భావకవిత్వ రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశారు. తక్కువ కులంగా భావించబడ్డ కులంలో జన్మించి, ఆ కారణంగా అనేక అవమానాలు ఎదుర్కొన్నాడు. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు జాషువా: ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. ఈ నేపథ్యంలో భారతీయ సమాజంలోని అసమానతలను అనేక సందర్భాల్లో అనేక విధాలుగా విమర్శించిన జాషువా దళితులలోనే ఉంటున్న అసమానతను సైతం నిరసించడానికి వెనుకాడలేదు. భారతదేశంలోని కర్మ సిద్ధాంతం, కుల వ్యవస్థ మనుషుల్ని విడదీయడానికే ఉపకరించాయని చెబుతూ అవి ఎదుటి వారిని ప్రశ్నించే వీలులేకుండా చేసాయని వాపోయాడు. కర్మ సిద్ధాంత నిరసనను దార్ల వెంకటేశ్వరరావుగారు తెలియజేస్తూ అది కుల నిర్మూలనకు ఉపయోగపడదని చెబుతూ "అన్నమయ్య భావవాది. అందుకనే కర్మసిద్ధాంతాన్ని ఆచారించాలని తన కీర్తనల్లో చెప్పారు. పశుపక్ష్యాదుల్ని పుట్టించిందీ, వాటి జీవనాన్ని నిర్దేశించిందీ భగవంతుడే. వాళ్ళు ఎలాంటి ఆహారం తిన్నా, ఎక్కడ జీవిస్తున్నా, వాళ్ళందరినీ రక్షించేది భగవంతుడే. చివరికి వాళ్ళు లీనమైయ్యేదీ భగవంతుడిలోనే. కనుక, బ్రాహ్మలు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు తమ తమ కర్మలను విధిగా ఆచరించాలనే తాత్వికతే అన్నమయ్యలో కనిపిస్తుందని "బ్రహ్మమొకటే...పరబ్రహ్మమొకటే'' అనే కీర్తనను ఆధారంగా చేసుకొని అన్నమయ్య కర్మవాదే తప్ప, కులనిర్మూలనవాది కాదని విశ్లేషిస్తారు. కర్మసిద్ధాంతం కులనిర్మూలనకు ఉపయోగపడదని ఆయన వాదన. ఈవిధమైనటువంటి ప్రతిపాదననే మనం ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారిలో గమనించవచ్చు. దానిని ఈవిధంగా చెప్పుకోవచ్చు. కర్మ సిద్ధాంతం ద్వారా భక్తిమార్గాన్ని సర్వజీవులకు ప్రభోదించాడు అన్నమయ్య. అందులో దళితులు కూడా ఉండొచ్చు. పారలౌకిక జీవితం గురించి ప్రభోదించిన హిందూమతంలోని ఈ'కర్మమార్గమే' దళితుల్ని ఈ లోకంలో అథఃపాతాళానికి తొక్కేసింది. నేటికి అనేకరకాల రూపాల్లో

సామాజికంగా, ఆర్థికంగా, మరింత నాశనం చేస్తుందని.[25]అన్నారు. అయితే స్వయంగా దళితుడైన జాషువా దళితుల ఐక్యతను కోరుతూ తన వర్గంలోనే కనిపించే హెచ్చు తగ్గుల్ని సైతం విమర్శించి దళిత సమైఖ్యతను జాషువా ఆహ్వానించాడని రాచపాళెం వారు పేర్కొన్నారు. కులం లేని మతం క్రైస్తవమతంలోకి పోయినా, అక్కడ కూడా మాల క్రైస్తవులు, మాదిగ క్రైస్తవులు అని తయారయ్యారని, మతం మారినా మారని కుల వైషమ్యాలను జాషువా తీవ్రంగా నిరసించినట్టుగా రాచపాళెం వారు విశ్లేషించారు.

## 3.24.11. ప్రాంతీయ కవిత్వంపై ఒక చూపు

తెలుగు కవిత్వంలో వస్తు మార్పిడికి రాయలసీమ కవిత్వం అంటే స్థానీయ కవిత్వం కొండ గుర్తు అవుతుంది. రాయలసీమ నుంచి వచ్చేదంతా రాయలసీమ కవిత్వమని చెప్పకూడదనేది కొత్త నిర్వచనాన్ని రాయలసీమలో నెలకొన్న సామాజిక పరిస్థితి ఇచ్చింది. ప్రాంతీయతను లేదా స్థానికతను ఆలంబనగా చేసుకుని ఈ కవిత్వం వచ్చింది. సామాజిక పరిణామక్రమాన్ని మలుపు తిప్పే లక్ష్యంతో ఈ కవిత్వం వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని భిన్న తెలుగు సమాజాల మధ్య అసమానహోదాలు, అసమానావకాశాలు, వివక్ష కవిత్వానికి వస్తువులయ్యాయి. అంటే వాటికి సంబంధించిన భావనలు వస్తువుగా ముందుకు వచ్చాయని చెప్పాలి. ఈ నేపథ్యంలో వచ్చిన కవిత్వమే ఏ. ఎన్. నాగేశ్వరరావు గారు రాసారు. ప్రాచీన కాలం నుండి 'పెన్నేటి పాట' వరకు రాయలసీమ కరువును రచయితలు తమ రచనల ద్వారా ఏ విధంగా నిరూపించారనే విషయాన్ని తెలియజేస్తూ ఏ.ఎన్ కవితలను విశ్లేషించారు. అయితే సీమ కవులు రాసిందంతా సీమ జీవితాన్ని ప్రతి ఫలించదని రాచపాళెం వారంటారు. అయితే ప్రాచీన కాలంలో కవులు రాయలసీమ గురించి చెప్పిన అభిప్రాయాలకు ఇప్పటి అభిప్రాయాలకు పొంతన లేదని చెబుతూ రాయలసీమ నుండి వెలువడిన సాహిత్యంలో వైరుధ్యం కనిపిస్తుందని చెప్పారు. నాచన సోమన మొదలుగా విద్వాన్ విశ్వం వరకు గల కవులు తమ రచనలలో రాయలసీమను ఏ విధంగా చిత్రించారో సద్విమర్శ చేసారు.

[25] వెంకటేశ్వరరావు దార్ల, బహుజన సాహిత్య దృక్పథం.పుట:66

రాయలసీమ నుంచి ఎంతో కవిత్వం వచ్చిందని ఈ క్రమంలో ప్రాచీన కవులు భూస్వామ్య భావజాలాన్ని ఆహ్వానించడంలో, ఆధునిక కవులు చరిత్రను కీర్తించడంలోను, వచన కవులు అంతర్జాతీయ, జాతీయ సమస్యల మీద దృష్టి కేంద్రీకరించారని చెప్పారు.

రాయలసీమలో స్వాతంత్యనంతర ఆధునిక కవిత్వం ఏ విధంగా వెలువడిందనే విషయాన్నీ ఆ తరువాత రాసిన వ్యాసాలలో రాచపాళెం వారు విశ్లేషించారు. ఈ విధమైన ప్రాంతీయ సాహిత్య విమర్శను వెలువరించడానికి ఆయనకున్న ప్రాథమికమైన ప్రాపంచిక దృక్పథం ఉపయోగపడిందని చెప్పవచ్చు. ఆయనలో ఈ కొద్ది ప్రాపంచిక దృక్పథం అలవడటానికి రాయలసీమలోని భూస్వామిక భావజాలం వారిని ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. ఈ విధమైన నేపథ్యం నుండి గజ్జెల మల్లారెడ్డి, ఎస్. ముని సుందరం, యలమంచిలి తాయారు, ఎం. రామచంద్ర, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, ఎస్.జి.డి చంద్రశేఖర్ కలువకొలను సదానంద, సి. నారాయణస్వామిల కవిత్వాన్ని భావ, అభ్యుదయ, దిగంబర కోణాల నుండీ, జైరాం, ఏ.ఎన్ నాగేశ్వరరావు, హెచ్చార్కె, రాప్తాడు గోపాలకృష్ణ మొదలైన వారిని విప్లవ కవిత్వ కోణం నుండి విశ్లేషించారు. అదేవిధంగా శాంతినారాయణ జూపల్లి ప్రేమచంద్, నాగప్పగారి సుందర రాజు లను దళిత సాహిత్య నేపథ్యం నుండి వారి కవిత్వాన్ని విశ్లేషించారు.

ప్రాంతీయ కవిత్వం అంటే ఆప్రాంతంలో వారు ఎదుర్కొన్న అనుభవాలను తమదైన సంకల్పంతో రాసే కవిత్వం. అయితే అది వివిధ మాండలికాలతో ఉంది ఉండొచ్చు. కానీ వాటి సామాజిక లక్ష్యం మాత్రం ప్రాంతీయ అస్తిత్వమే అని చెప్పవచ్చు. ఈ విధమైన ప్రాంతీయ సమస్య ఆధారంగా వచ్చిన కావ్యం 'పెన్నేటి పాట'. విద్వాన్ విశ్వం దీనిని 1955 సంవత్సరంలో రచించాడు.ఈ కావ్యం రాయలసీమ నిజ పరిస్థితులను తెలుసుకోవడానికి అక్కడి ప్రజల జీవన విధానాన్ని పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ నాటికీ సామాజిక కోణంలో చూసినట్లయితే ఆధిపత్య వర్గాలు చేసే అన్యాయాలతో ఎడతెగని కరువులతో, కక్షల కార్పన్యాలతో ప్రకృతి చూపే నిర్దయతో నిండిన

సీమ నిజ పరిస్థితిని చూపే కావ్యమే 'పెన్నేటి పాట'. అయితే విమర్శకులందరూ విశ్లేషించినట్టుగానే దానిని రాయలసీమ కరువు చిత్రణకు సంబంధించిన కావ్యమని సూత్ర ప్రాయంగా చెప్పినా మరింత లోతుగా దానిని విశ్లేషించి పెన్నేటి పాట కావ్యానికి మూడు రకాల వైశిష్ట్యం ఉందని పేర్కొన్నారు. అది ఒకటి విశాలాంధ్ర దృక్పథం అనీ, రెండు ఆధునిక సాహిత్య చరిత్రలో 'స్తబ్దయుగం(1955-65)' అని పిలువబడే కాలంలో ఈ కావ్యం నిర్దిష్టమైన వస్తువుతో, అభ్యుదయ దృక్పథంతో రచించబడి ఆ కాలాన్ని పునరాలోచించుకునే విధంగా చేసింది. మూడోది రాయలసీమ నిర్దిష్ట జీవిత వాస్తవికతను కవిత్వీకరించిన మొదటి కావ్యం పెన్నేటి పాట. అని ఆకావ్యానికి ఉన్న మూడు వైశిష్ట్యాలను రాచపాళెం వారు వివరించారు. రాయలసీమ జీవిత వాస్తవికత నేపథ్యం నుండి వివిధ కావ్యాలను రాసిన కట్టమంచి రామలింగారెడ్డి *(ముసలమ్మ మరణం)*, పుట్టపర్తి నారాయణాచార్యులు *(పెనుగొండలక్ష్మి, శివతాండవం)*, గడియారం వెంకటశేషశాస్త్రి*(శివభారతం)*, దుర్భాక రాజశేఖరశతావధాని*(రాణాప్రతాపసింహ చరిత్ర)*, బెల్లూరి శ్రీనివాసమూర్తి*(తపోవనం)*, గజ్జెల మల్లారెడ్డి*(శంఖారావం)* మొదలైన అనేక మంది రచయితలు రచించిన కావ్యాలను పేర్కొని వాటిలో ఎక్కువభాగం పౌరాణిక చారిత్రక కావ్యాలే అని, అవి గత స్మరణకు, భక్తికి పరిమితమైనవని చెప్పి ఇందుకు కొంత మినహాయింపుగా *'ముసలమ్మ మరణం'* కావ్యాన్ని పేర్కొన్నారు. ఈ కావ్యానికి సామాజిక స్వభావముందని చెబుతూ, అది గతానికి చెందిన జానపద కథ అని దానికున్న పరిమితిని తెలియజేశారు. పెన్నేటి పాట కావ్యంలోని వస్తువు రాయలసీమలోని కరువు పరిణామమే అని పాఠకులు విమర్శకులు గుర్తించిన విషయమే. వస్తు నిర్దిష్టకు ఈకావ్యం మంచి ఉదాహరణగా రాచపాళెంవారు అభిప్రాయ పడ్డారు. కాగా రాయలసీమలో కరువు చిత్రణ, అప్పటి ప్రభుత్వం దాని నివారణకు చేపట్టిన చర్యలు, భూస్వామిక ఆచారాలు,శ్రమైక జీవన సౌందర్యం, వర్గ సమాజ చిత్రణ మొదలైన అంశాలను ఈ కావ్య విశ్లేషణ ద్వారా తెలియజేసారు.

ఈ విధంగా నిర్దిష్టమైన వస్తువు,వాస్తవికతతో కూడుకుని ఉన్న ఈ కావ్యాన్ని ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో సంఘ సంస్కరనోద్యమ నాటకంగా గురజాడ కన్యాశుల్కం,

స్వాతంత్రోద్యమ నవలగా ఉన్నవ మాలపల్లి,తొలి దళిత కావ్యంగా జాషువా గబ్బిలం, అభ్యుదయ మహా కావ్యంగా శ్రీశ్రీ మహా ప్రస్థానం బ్రిటీష్ వ్యతిరేక కవితగా గరిమెళ్ళ మాకొద్దీ తెల్ల దొరతనం, తెలంగాణా ప్రజా జీవిత దర్పణంగా వట్టికోట ప్రజల మనిషి మొదలైనవి ఎంత గొప్ప రచనలో పెన్నేటి పాట కావ్యం కూడా అంత గొప్ప రచన అని వాటితో రాచపాళెం పోల్చారు. అయితే విద్వాన్ విశ్వం గారి 'పెన్నేటి పాట' మహా ప్రస్థానంలో కవితావేశంలో దీటైన కావ్యం అని వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు అభిప్రాయపడ్డారు.[26]

రాయలసీమ నుండి వెలువడిన కవిత్వం అనగానే ఆక్కడి సామాజిక వాతావరణం, కరువు కాటకాలు, ఫ్యాక్షన్ రాజకీయాలు మొదలైన పరిస్థితులు గుర్తుకు వస్తాయి. అయితే అందుకు భిన్నంగా ఆ నేపథ్యం నుండి వచ్చిన నిర్దిష్ట జీవితంతో పాటు ఇతర సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల మీద రాసిన కవితలు కూడా ఉన్నాయని జూపల్లి ప్రేమచంద్ రాసిన కవిత్వంలో ఆచార్య రాచపాళెం గుర్తించారు. ఈ విధంగా గుర్తించిన లక్షణాలలో బాల కార్మికుల సమస్యల మీద కొన్ని కవితలు, మహిళా జీవితం మీద కొన్ని కవితలు, బాబ్రీ మసీదు కూల్చివేత మీద కొన్ని కవితలు, మైనారిటీల మీద జరుగుతున్న దాడుల మీద కొన్ని కవితలు ఉన్నట్లు గుర్తించి వాటిని విశ్లేషించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తుంది. అదేవిధంగా రాయలసీమ నుండి తొలినాళ్లలో వచ్చిన కవితల్లో విప్లవ కవితలు కూడా ఉన్నట్లు 'జైరాం' కవి రాసిన 'ఎర్రగాలి', 'విప్లవం వర్ధిల్లాలి', 'రక్తదానం' వంటి కవితా సంపుటుల్లో గుర్తించారు. కేవలం ఆ విధమైన దృక్పథంతో వచ్చిన కవితలను గుర్తించడమే గాక విప్లవ కవిత్వ స్వభావాన్ని సిద్ధాంతీకరించే ప్రయత్నం చేసినట్టుగా తెలుస్తుంది. విప్లవరచయితల సంఘం 1970 లో ఏర్పడింది. అప్పటి నుండి రచయితా, కవీ ఎవరి పక్షం వహించాలో తేల్చిచెప్పింది. ఇప్పటికీ చెబుతూనే ఉంది. రచయిత బాధ్యత ఏమిటో చెబుతూ కష్టజీవికి ఇరువైపులా నిలిచేవాడే కవి అని విరసం చాటి చెప్పింది. ప్రజలను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి అని కవి బాధ్యతను గుర్తుచేసింది. సరిగ్గా అలాంటి భావాలనే 'జైరాం'

---

[26] *రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక సాంస్కృతిక విశ్లేషణ*

రచించిన కవితల్లో చూడవచ్చని రాచపాళెం అంటారు. ఈ క్రమంలో ప్రగతిశీల విప్లవకవి కి తప్పకుండా ఉండవలసింది భౌతికవాద ప్రాపంచిక దృక్పథం అంటారు. వామపక్ష కవిది విశ్వజనీన దృష్టి అని చెబుతూ దానిని విశాలత్వ లక్షణాన్ని ఆపాదించారు. విప్లవకవి వర్గ సామరస్యాన్ని విశ్వసించడనీ, వర్గ సంఘర్షణ అతని సిద్ధాంతమని సూత్రీకరించాడు. మానవతావాది కానీ వాడెవడు కమ్యూనిస్టు కాడన్నారు శ్రీశ్రీ. ఈ వాక్యాలతో జైరాం "ఇజాలు వద్దు/సిద్ధాంతం వద్దంటూ అజ్ఞాన భావంతో దొర్లుతూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని మోసగిస్తున్న కళావేత్తలార! అని శుద్ధ మానవతావాదులను నిరసించినట్టు రాచపాళెం వారు విశ్లేషించారు. రాయలసీమలో విప్లవ కవిత్వానికి జరిగిన దోహదాన్ని గురించి జైరాం రచించిన 'ఎర్రగాలి' కవిత్వ సంపుటిపై రాసిన వ్యాసంలో రాచపాళెం వారు వివరించారు.

రాయలసీమలో వచన కవిత్వానికి కొదవ లేదన్న విషయాన్నీ తెలియజేస్తూ రఘుబాబు రాసిన 'సంఘటిత స్పర్శ' అనే వచన కవిత్వ సంపుటాన్ని విశ్లేషించారు. అయితే అంతకుముందు వచ్చిన కావ్యాలు కేవలం రాయలసీమలోని సమస్యలను మాత్రమే చిత్రించేవిగా ఉన్నాయని, ఈ సంఘటిత స్పర్శ అనే కావ్యంలో ఆ సమస్యలతో పాటుగా వాటికి పరిష్కార మార్గాలను కూడా కవి అందించినట్టు రాచపాళెం చెప్పారు. రాయలసీమ జీవన సమస్యల మీద, వాటి కారణాల మీద కవి ప్రకటించిన అక్షర యుద్ధమే ఈ కావ్యం అని అభివర్ణించారు.

కట్టమంచి రామలింగారెడ్డిగారు రచించిన 'ముసలమ్మ మరణం' కావ్యాన్ని గురించి ఇంతకుముందే చెబుతూ ఆ కావ్యానికి 'సామాజిక స్వభావముందని, అది గతానికి చెందిన జానపద కథ' అభిప్రాయపడ్డారు. అయితే అది ఏ విధంగా ఆ లక్షణాలను కలిగి ఉందనే విషయాన్నీ "ఊరందరి కోసం ఒకరి త్యాగమే 'ముసలమ్మ మరణం'(2000)" అనే వ్యాసంలో సోదాహరణంగా నిరూపించి చూపారు. ఆధునిక ఛాయలున్న తొలి కావ్యంగా 'ముసలమ్మ మరణం' కావ్యాన్ని విమర్శకులు గుర్తించారు. అయితే ఆ కావ్య రచనా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని దానిని విశ్లేసిస్తే అప్పటి దేశా స్థితి, జాతీయోద్యమ కాలంలోని వ్యక్తుల

త్యాగంతో సరిపోలేదిగా ఉందని, ఈ కావ్యంలో సమిష్టి కోసం ఒక వ్యక్తి చేసిన త్యాగం ఈ కథకు మరింత సొబగును తీసుకొచ్చిందని రాచపాళెం వారి వివరణ. అయితే కట్టమంచి వారి ఈ కావ్యంపై అనేకమంది ప్రాచీన కవుల ప్రభావం ఉన్నట్టు తెలుస్తుంది. అదే విషయాన్నీ సోదాహరణంగా రాచపాళెం వారు విశ్లేషించారు. కథాకథనంలో, పాత్ర చిత్రణలో కట్టమంచి వారు తిక్కన, పింగళి సూరనను అనుసరించినట్టుగా రాచపాళెం వారు చెప్పారు.అదేవిధంగా ముసలమ్మ భర్తతో మాట్లాడుతున్న సంధర్భంలో రచించిన 'ఇది తగునిది తగదమీదో దెలపరాలేదు' వంటి పద్యాల మీద నన్నయ్య ప్రభావం ఉన్నట్టు కనిపిస్తుందని రాచపాళెం చెప్పారు. కట్టమంచి వారు గ్రామ జీవితాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకోవడం వల్ల ఆయనపై పాశ్చాత్య దేశాలలో ఉన్న పాస్టరల్ పోయెట్రీ ప్రభావం ఉండొచ్చని, తాను అనుభవించిన జీవితాన్ని సాహిత్యంగా మలచడం వాస్తవికతకు అతి దగ్గరగా ఉంటుదన్న సాహితీ సిద్ధాంతానికి బహుశా తొలి ఉదాహరణ ముసలమ్మ మరణమే కావొచ్చు, అనే అభిప్రాయం కొంత అస్పష్టతకు దారి తీస్తుందని చెప్పవచ్చు .

## 3.24.12. దళిత కవిత్వం ఒక అవగాహన

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు మూడు దశాబ్దాలుగా ఆధునికాంధ్ర కవిత్వం పై విమర్శను రాసిన తరువాత అన్ని భావజాలాల ప్రభావం ఆయనపై పడినట్టుగా తెలుస్తుంది. ఆయనపై ఎన్ని భావజాలాల ప్రభావం పడినప్పటికీ ముఖ్యంగా సామాజికంగా వెనుకపడిన అట్టడుగు వర్గాల వారి పక్షాన ఆయన భావజాలం స్థిరమైనట్టుగా తెలుస్తుంది. దానిని దళితవాదం అనీ, బహుజన వాదం అనీ, విమర్శకులు భావిస్తున్నారు. అయితే జన్మ రీత్యా అగ్రకులానికి చెందిన రాచపాళెం వారు ఆధిపత్య, అట్టడుగు రెండు వర్గాల స్థితి గతులను అధ్యయనం చేసారు. ఈ నేపథ్యం నుండే సాహిత్యాన్ని తన విమర్శల ద్వారా విశ్లేషించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తుంది. మరింత లోతుగా ఈ విషయాన్నీ ఇలా చెప్పుకోవచ్చు. "ప్రపంచ సాహిత్యమంతా ప్రధానంగా రెండు మార్గాల్లో నడుస్తుందని చెప్పే వీలుంది. ఒకటి సమాజాన్ని కొన్ని ఆధిపత్య వర్గాలకు అనుకూలంగా మార్చుకోవడానికి

సాహిత్యాన్ని ఒ సాధనంగా వాడుకునే దృక్పథం దీన్ని భావవాద దృక్పథం అంటారు. సమాజం శ్రమ విభజనపై ఆధారపడి ఉందని భౌతిక పరిస్థితులే ఆ సమాజాన్ని నిర్దేశిస్తుంటాయనీ, ఇలా నిర్దేశించడంలో పాలకుల ఆధిపత్య వర్గాల వర్ణాల ప్రభావం పనిచేస్తుందని చెప్పేది రెండవ దృక్పథం. దీన్ని సామాజిక వాస్తవిక దృక్పథం అనొచ్చని[27]అంటారు దార్ల వెంకటేశ్వరరావు. ఆచార్య రాచపాళెం వారు దార్ల వారు చెప్పిన రెండు దృక్పథాలపై పట్టు కలిగిన వారని చెప్పవచ్చు కాబట్టి ఈ రెండు దృక్పథాల లక్షణాల మేళవింపు ఈయన విమర్శ అని చెప్పవచ్చు. అయితే ఎక్కువభాగం సామాజిక దృక్పథ నేపథ్యం నుండే ఆయన విమర్శ రాసినట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో దళిత కవిత్వాన్ని కూడా ఆయన అధ్యయనం చేసినట్టుగా తెలుస్తుంది. ఆ విధంగా అధ్యయనం చేసిన రాచపాళెం వారు దళిత కవిత్వం అంటే ఏంటో ఒక స్థూలమైన అవగాహనకు వచ్చినట్టు తెలుస్తుంది. అయితే దళిత కవిత్వం పై ఆయనకున్న అవగాహనను తెలుసుకోవాలంటే ముందుగా దళితులంటే ఎవరో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అనుకుంటున్నాను.

దళితులంటే “అంటరానితనానికి గురై మూడు సహస్రాబ్దాలు జైల్లో బ్రతికి, పంచములని పిలువబడ్డ షెడ్యుల్డు కులాలకు చెందిన వాళ్ళే దళితులు”అని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. దళిత కవిత్వం ప్రాచీనమైన సాంప్రదాయక స్వభావం కల్గిన సామాజిక నిర్మాణాన్ని తిరస్కరిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువల ప్రాతిపదికన నిర్మించబడే సమాజం పట్ల దళిత కవిత్వం విధేయతను కలిగి ఉంటుంది. స్థిరమైన అధికారాన్ని కొనసాగించే మనువాద సాహిత్యానికి వ్యతిరేకమైంది దళిత కవిత్వం అని చెప్పవచ్చు. ఇదే విషయాన్నీ తన కవిత్వంలో(పాదముద్ర) జూలూరి గౌరీ శంకర్ గారు చెప్పినట్టుగా ఆచార్య రాచపాళెం ఆయన కవిత్వంలో దళిత కవిత్వానికి ఉన్న తాత్విక భూమికను కనుకున్నాడు.

---

[27] వెంకటేశ్వరరావు దార్ల, బహుజన సాహిత్య దృక్పథం.పుట:16

1924వ సంవత్సరం మార్చి నెలలో గాంధీజీ మొదలుపెట్టిన హరిజనోద్ధరణకు సమాంతరంగా డా, బి. ఆర్ అంబేద్కర్ అస్పృశ్యతా నివారనోద్యమం ప్రారంభించాడు. దళితులు తమను తామే ఉద్దరించుకోవాలని తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలని ఉద్ఘాటించారు. అయితే సమాజంలో ఉన్న కులవ్యవస్థ చేసింది కేవలం శ్రమ విభజన మాత్రమే కాదని, శ్రామికుల విభజన కూడా అని రాచపాళెం వారు గుర్తించి, అది నిచ్చెనమెట్ల సమాజ నిర్మాణానికి దారితీసిందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థను వ్యతిరేకిస్తూ 1873 సంవత్సరంలో వెనుకబడిన కులంలో పుట్టిన జ్యోతిబాపూలే, సత్య శోధక సమాజం స్థాపించి దళితవాదాన్ని వెలుగులోకి తెచ్చాడు. ఆ తరువాత 1985 తరువాత ఆంధ్రప్రదేశ్లో నీరుకొండ, పదిరికుప్పం, కారంచేడు, చుండూరు సంఘటనల ఫలితంగా అంబేద్కర్ భావజాల ఊతంగా దళిత కవిత్వం పుట్టిందని రాచపాళెం అన్నారు.

ఆధునికాంధ్ర కవిత్వంలో సంఘ సంస్కరనోద్యమ ప్రభావంతో వెలువడిన కవిత్వాలలో హరిజనోద్ధరణ కవిత్వం 1900 నుంచే వెలువడింది. హరిజనోద్ధరనే ప్రధాన లక్ష్యంగా కవిత్వం రాసిన కవులలో గుర్రం జాషువా అగ్రగణ్యుడని చెప్పవచ్చు. ఆయన రాసిన 'గబ్బిలం' దళితవాద కవిత్వంలో ఆదికావ్యం అని విమర్శకులు భావించారు. అయితే అస్పృశ్యతను నిరసిస్తూ దళితుల పక్షం వహించి రచనలు చెయ్యడం గురజాడ నుంచే మొదలైందని ఆచార్య రాచపాళెం భావించారు.అయితే దానిని కేవలం ఒక సూచికగానే చెప్పవచ్చు. అయితే ముందుగా చెప్పుకున్నట్టు 1985 పూర్వం నుంచే దళిత కవిత్వం వెలువడుతుంది. ఆ ఏడాదికి పూర్వం వచ్చిన దళిత రచనలకు సంఘసంస్కరణ, జాతీయోద్యమాలు, మార్క్సిజం తాత్విక భూమికలైతే, ఆ తరువాత వచ్చిన దళిత కవిత్వ రచనలకు అంబేద్కరిజం తాత్విక భూమిక అని రాచపాళెం వారు అభిప్రాయపడ్డారు. జూలూరి గౌరీశంకర్, ఎండ్లూరి సుధాకర్, నాగప్పగారి సుందర్రాజు, అడిగోపుల వెంకట రత్నం వంటి దళిత కవులు రాసిన కవిత్వాన్ని దళిత తాత్విక నేపథ్యం నుండి విశ్లేషించారు. ఎన్ని ఉద్యమాలు నడిచినా, ఎన్ని సంస్కరణలొచ్చినా, ఎన్ని చట్టాలొచ్చినా దళిత సమస్య నిర్మూలన కానీ స్థితిని రాళ్లబండి కవితా ప్రసాద్ రాసిన కవిత్వంలో నిరూపించారు.

అదేవిధంగా దళిత కవిత్వం ప్రధాన సాహితీ స్రవంతిగాఎదిగే క్రమంలో దళిత స్త్రీలు కూడా కవిత్వం రాయడం ప్రారంభించడం అనేది దళిత సాహిత్య వికాసంలో ఒక మలుపుగా రాచపాళెం వారు అభివర్ణించారు. ఈ క్రమంలో చల్లపల్లి స్వరూపారాణి, మద్దూరి విజయశ్రీ, జి. విజయలక్ష్మి మొదలైన రచయిత్రుల కవిత్వాన్ని విశ్లేషించారు. చెరకు సుధాకర్ కవిత్వంలోని తిరుగుబాటు తత్వాన్ని, జూపల్లి ప్రేమ్చంద్ కవిత్వంలోని కర్తవ్య బోధను, జి.ఆర్ కుర్మే కవిత్వంలోని ప్రతిఘటనను గురించి విశ్లేసిస్తూ శివసాగర్ దళితుల్లో మొదలవుతున్న తిరుగుబాటు తత్వాన్ని కవిత్వీకరించినట్టు రాచపాళెం విమర్శించారు.

పైన చెప్పినట్టుగా కవిత్వ విమర్శను రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు గతకాలం మేలు వచ్చుకాలం కంటే అనే మాటను సమర్థించి అక్కడితో ఆగిపోకుండా వచ్చుకాలం మేలు గత కాలం కంటే అనేంత వరకు పరిపక్వత చెందినట్టుగా కనిపిస్తున్నాడు. ప్రాచీన కావ్య విశ్లేషణతో మొదలైన ఆయన విమర్శ ప్రస్థానం ప్రాపంచిక దృక్పథ అవగాహన వరకు పయనించింది. ఈ నేపథ్యంలో కవిత్వానికి సంబంధించిన మౌలికమైన ప్రతిపాదనలను చేసారు. తన కవిత్వ విమర్శకు మార్క్సిస్టు సాహిత్య విమర్శ దృక్పథంతో పునాదులు వేసాడు. పాశ్చాత్య మార్క్సిస్టు భావన మీద నిర్మాణమైన తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శతో ప్రాంతీయ కవిత్వాన్ని ఆ భావజాల దృక్పథం నుండి విశ్లేషించి దానిని ప్రాదేశికం చేసారు రాచపాళెం. ఆ మాటకొస్తే తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు నిచ్చాడు. సంప్రదాయ పద్మవ్యూహంలో ఇరుక్కుపోయిన ఆయనకు దాని నుండి ఎలా బయటపడాలో అనే విషయంపై స్పష్టత కలిగి విమర్శకు ప్రజాస్వామిక, ప్రగతిశీల, విప్లవ దృక్పథాలను అద్దాడు. విమర్శ అంటే శిల్పం చుట్టూ తిరిగే అలంకారిక శైలిని కాదని, సాహిత్య వస్తువే విమర్శకు భూమికగా ఉండాలని రాచపాళెం నిర్ణయించాడు. సాహిత్యంలోని శిల్పాన్ని నిరాకరించడం ఆయన సిద్ధాంతం కాదు, సాహిత్యంలోని వస్తువును ఆశ్రయించిన శిల్పాన్నే ఆయన తన సిద్ధాంతంగా మలచుకున్నట్లు తెలుస్తుంది. ఈ విధమైన ప్రాపంచిక దృక్పథం ముందుముందు ఏయే ఆవిష్కరణలకు దారీ తీసిందో తరువాత విభాగాలలో తెలుసుకుందాం.

## 3.25 కథా విమర్శ

ఆధునికాంధ్ర కవిత్వంపై విమర్శను రాస్తూ వచ్చిన రాచపాళెం వారు ఆధునిక సాహిత్యంలో భాగంగా అత్యంత ఆదరణ పొందుతున్న కథా ప్రక్రియపై కూడా విమర్శను కొనసాగించారు. దానిని ఈ కింది విధంగా విశ్లేషించే ప్రయత్నం చేయడం ద్వారా దానికి సంబంధించిన  చారిత్రక పరిణామం అవగతమౌతుందని అనుకుంటున్నాను. దానిని ఈ కింది విధంగా పరిశీలిద్దాం.

### 3.25.1 గురజాడ సాహిత్యం – రాచపాళెం దృష్టి

రాచపాళెంవారు 1977 ఆగస్టులో అనంతపురం లోని ఎస్.వి.యు పిజి సెంటర్లో లెక్చరర్ చేరారు. అప్పటిదాకా వారికి ఆధునిక సాహిత్యంతో పరిచయం లేదు. ఆ తరువాత గురజాడ సాహిత్యాన్ని పాఠ్యాంశంగా చెప్పవలసి వచ్చింది. ఆ విధంగా 1978 నుండి సుమారు ఆరేళ్ళు గురజాడ సాహిత్యాన్ని పాఠంగా చెప్పారు. తత్ఫలితంగా ఆయనకు ఆధునిక సాహిత్యంతో పరిచయం దాని మీద మక్కువ ఏర్పడ్డాయి. పైగా ఆయన సాంప్రదాయ పొలంలో పుట్టి  ప్రభావతీ ప్రద్యుమ్నం అనే పంటను విస్తారంగా పండించారాయన. మరి ఆ విధంగా సాంప్రదాయ పొలంలో వికసించిన పుష్పం, ఆధునికమైన ఫలాన్ని ఏవిధంగా అందుకున్నదో తెలుసుకోవాలన్న ఆత్రుత ఎవరికైనా ఉంటుంది. దానిని ఈ విభాగంలో పరిశీలిద్దాం.

ప్రాచీన సాహిత్యాన్ని సాంప్రదాయిక రీతిలో అధ్యయనం చేసిన రాచపాళెం గురజాడ సాహిత్య అధ్యయనంతో ఆధునికతలోకి ప్రవేశించారు. “100 ఏళ్ల క్రింద విమర్శ అంటే కేవలం తాత్పర్యం చెప్పేలా ఉండేది. ఇప్పుడు వస్తున్న రచనలపై అభిప్రాయాల్లో మార్పులు వచ్చాయి. దేశమంటే కేవలం మనిషిని ప్రేమించడమనే గురజాడ సిద్ధాంతంతనకు ఎంతో స్ఫూర్తి నిచ్చిందని, దీనికి తన గురువులు వెంకటరెడ్డి కూడా ఒక కారణమేనని”[28]

[28] ఈనాడు దినపత్రిక, చిత్తూరు జిల్లా ఎడిషన్, 20-12-2014

ఆయనంటారు. అయితే సాహిత్యంలో ఆధునికత అనేది ఒక ప్రత్యేక సిద్ధాంతం కాదు. ఈనాటి ఆలోచనా ధోరణి అంతటినీ ఆవరిస్తుంది ఈ పదం. దాని హద్దులను నిర్వచించడం కష్టమే అయినా, స్థూలంగా అది సాంప్రదాయిక ఆలోచనా ధోరణి కంటే భిన్నమైనదని రాచమల్లు రామచంద్రారెడ్డి(రారా) గారంటారు[29].

సాహిత్యానికి, మనవ జీవితానికి అవినాభావ సంబంధం ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే మానవ సమాజం మారేకొద్దీ సాహిత్యం కూడా తన వైఖరిని మార్చుకుని ఆ కాలానికి అనుగుణంగా వెలువడుతూ ఉంటుంది. ప్రాచీన కాలంలో రాజరిక వ్యవస్థ అమలులో ఉండేది. నేడు దానికి విరుద్దంగా ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులోకి వచ్చింది. నాటి రాజరిక వ్యవస్థలో రాజులు నిరంకుశంగా వ్యవహరించి ప్రజపై అజమాయిషీ చేసేవారు. నేడు అట్టి పరిస్థితులు లేవు.

నన్నయ్య రాజరాజ నరేంద్రుడికి విధేయుడు. తిక్కన మనుమసిద్ధికి విధేయుడు, ఎర్రన పెదకోమటి వేమారెడ్డికి విధేయుడు కాబట్టి వారి అడుగుజాడల్లోనే వీరి సాహిత్య నిర్మాణం జరిగేది. ఆ తరువాత వచ్చిన ప్రజాస్వామ్య రాజ్యంలో ఆ విధమైన విధేయతను ఎవరికీ కనబరచవలసిన అవసరం ఉండేదికాదు. తద్వారా సమాజం అనే కొత్త కోణం నుండి రచనలు వెలువడటం మొదలైంది. ఆ విధంగా స్వాతంత్ర్యానికి పూర్వం పోరాట కవిత్వం, ఆ తరువాత బతకటానికి దారి చూపే, బ్రతకడం నేర్పగలిగే ఆరాట సాహిత్యం వెలువడింది. దేనితో సమాజం ఒక్క సరిగా చైతన్యవంతం అవ్వడానికి ఆస్కారం ఏర్పడింది. ఈ సమాజం ఈ విధంగా చైతన్య వంతం కావడాన్నే సాంఘిక శాస్త్ర పరిభాషలో సామాజిక చైతన్యం(social consiousness) అంటారు. ఈ సామాజిక చైతన్యం గురించి తెలుసుకునే ముందు అది ఏవిధమైన పరిస్థితులను భూమికగా చేసుకుని ఒక రూపాన్ని పొందుతుందో గుండిమెడ సాంబయ్య "సాధారణంగా ఒక వ్యవస్థనో లేదా ఒక రంగాన్నో శాసిస్తున్నవారు కొత్తదనాన్ని అహ్వానించరు. ముఖ్యంగా ఆకొత్తదనం తమ పీఠాలను కదిలించేటట్లుంటే

[29] సాహిత్యంలో ఆధునికత(వ్యాసం), రారా సమగ్ర సాహిత్యం(సాహిత్య వ్యాసాలు),పుట:293

ఆరంభంలోనే దాన్ని భూస్థాపితం చేసేందుకు ఎన్నో సామ, దాన, భేద, దండోపాయాలు ఆచరిస్తారు. ఎన్ని చేసినప్పటికీ ఆ కొత్తశక్తిని ఆపడం తమ తరం కానప్పుడు జీవంలేని వాదాలతో దాని ప్రభావాన్ని తగ్గించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తారు. ఇట్టి ప్రయత్నాలు వారి మూర్ఖత్వాన్ని, వితండవాద బుద్దిని బట్టబయలు చేస్తాయేకాని ఆ నవ్యతలోని శక్తిని ఏ మాత్రం తగ్గింపజాలవు" [30] అనే వాస్తవాన్ని తెలియజేశారు. ఈ విధమైనటు వంటి భూమికనే సామాజిక చైతన్యానికి దారి తీస్తుందని చెప్పవచ్చు.

'సామాజిక చైతన్యం' అనే పదానికి సమానార్థకంగా ఆంగ్లంలో 'Social Conciousness' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. సమాజంలో ఉండే చైతన్యం, సమాజంలో ఉండాల్సిన చైతన్యం అని సామాజిక చైతన్యాన్ని రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. అనేకమంది వ్యక్తుల చైతన్యం కలిసి సామాజిక చైతన్యం అవుతుంది. నిర్దిష్ట కాలంలో నిర్దిష్టస్థలంలో మనుగడ సాగిస్తున్న ప్రజల సాముహిక చైతన్యమే సామాజిక చైతన్యం. సామాజిక చైతన్యాన్ని సామాజిక జీవితమే నిర్ణయిస్తుంది. సామాజిక జీవితం అంటే విభిన్న కాలాలలో విభిన్న స్థలాలలో ఉండే ప్రజల మధ్య గల సంబంధాలు అని అర్థం. మానవ సంబంధాలే సామాజిక చైతన్యాన్ని నిర్ణయిస్తాయి.

పైన చెప్పిన విధంగా సామాజిక జీవితమే సామాజిక చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. రాచపాళెం వారు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు ఉన్న సామాజిక జీవితం వేరు, అనంతపురంలో ఉన్నప్పటి సామాజిక జీవితం వేరు. మొదటిది సంప్రదాయంతో ముడిపడి ఉండేది. రెండోది ఆధునికతతో ముడిపడి ఉండేది. రాచపాళెం వారు సంప్రదాయం నుండి ఆధునికతలోకి అడుగుపెట్టడానికి రెండు అంశాలు దోహదం చేసాయనిఆయనే స్వయంగా చెప్పారు. అవి 1. గురజాడ సాహిత్యం, 2. అనంతపురం సాహితీ మిత్రులు, అక్కడి సామాజిక వాతావరణం.

---

[30] దళిత సాహిత్యం: మాదిగ దృక్పథం – ఒక పరిశీలన. సాంబయ్య గుండిమెడ (వ్యాసం)

అంతకుముందు కేవలం ప్రాచీన సాహిత్యం, దేవతా స్తుతి, రచనా శిల్పం వంటి వాస్తవికతకు అత్యంత దూరంగా ఉన్న విషయాలకే ప్రాధాన్యమిస్తున్న రాచపాళెం వారు, గురజాడ సాహిత్య అధ్యయన అనంతరం సాహిత్యాన్ని సమాజ జీవిత వాస్తవికతకు దగ్గరగా చూసే కొత్త సంస్కారాన్ని అలవరచుకున్నారు. ఈ నేపథ్యం నుండి గురజాడ తన సాహిత్యంలో అ భౌతిక కల్పనలకు సమాధిని కట్టడం ఆరంభించాడు. సాహిత్య సామాజికం కాకపోతే మరేదీ కాదన్నాడని, తన రచనల ద్వారా రచయితకుగల బాధ్యతను గుర్తుచేసాడనే వంటి విషయాలను అవగతం చేసుకున్నాడు. అంటే విమర్శకునికి గల ఆ విధమైనటువంటి దృష్టికోణం ఉండబట్టే ఆ విధమైన లక్షణాలను గురజాడలో గుర్తించడం సాధ్యమైంది. పైన చెప్పినట్టుగా ఆయన నివసించిన సామాజిక పరిస్థితులే ఆయనకు ఆ విధమైన దృష్టికోణాన్ని అలవడేలా చేసాయని చెప్పవచ్చు.

అంతవరకూ నన్నయ్య, తిక్కన, ఎర్రన, పింగళిసూరనలే సాహిత్యంలో కనిపించిన రాచపాళెం వారికి ఆ తరువాత రాజా రామమోహన రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహాదేవ గోవింద రనడే, మధుసూదన దత్తు, రవీంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్రసేన్, స్వామి దయానంద సరస్వతి వంటి సంస్కర్తలు సాహితీ వేత్తలు గుర్తొచ్చారు. ఆయన దృష్టి ప్రాచీన సాహిత్యం నుండి ప్రాపంచిక దృక్పథానికి మరలింది. రచయిత రచనా శిల్పం నుండి, రచయిత రచనాశీలం వరకు ఆయన ఆలోచన విస్తరించింది.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి పై విధంగా ఆధునికతలోకి అడుగుపెట్టి *“గురజాడ తొలి కొత్త తెలుగు కథలు”(1985)* అనే విమర్శా గ్రంథాన్ని రచించారు. రాచపాళెం వారు సామాజిక చైతన్యం వైపు మరలడానికి ప్రధాన కారకుడైన గురజాడ ఆయన సాహిత్యంపై పుస్తకం వెలువడడానికి నాటి సామాజిక పరిస్థితులే కారణమని చెప్పారు. *“మహోదయం”* తర్వాత గురజాడ కథల్ని వివరంగా విమర్శించిన పుస్తకం రాచపాళెం రాసిందే.[31] నని సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి తెలియజేశారు. ఈపుస్తకంలోని మొదటి

[31] *గురజాడ అడుగుజాడల్లో రాచపాళెం*(వ్యాసం). సన్న పురెడ్డి వెంకటరామిరెడ్డి

విభాగంలో గురజాడ పుట్టుక మొదలు ఆయన సాహిత్య రచనకు దోహదం చేసిన చారిత్రక కారణాలను తెలియజేసారు. అదేవిధంగా తెలుగు కథా వికాసానికి గురజాడ ఏ విధంగా కారకుడయ్యాడు, తెలుగు కథా పరిణామం ఏ విధంగా కొనసాగింది అనే విషయాలను రెండో విభాగంలో వివరించాడు. అయితే రాచపాళెం వారికి ఆధునికతా దృష్టికోణం పూర్తిగా అలవడిందని చెప్పుకోవడానికి వీలులేకపోలేదు. 'భారతంలోని వస్తువు ఏదైనా శిల్పం మాత్రం అనర్ఘం. మానవజీవిత సంఘటనల్ని గుర్తు చేస్తూ సాగే ఈ కథలు పుట్టిన తీరు చెప్పబడిన విధానం కూడా మనిషిని జీవిత సమస్యల వలయం నుండి బయటకు తీసుకు రాగల సామర్థ్యం కలిగి ఉన్నందువల్లనే అంతటి ఉద్గ్రంథాన్నిఇంతకాలం చదువగల్గు తున్నది సమాజం' అన్న మాటల వలన ఆయన ప్రాచీన సాంప్రదాయ సాహిత్య వాసనను పూర్తిగా విడిచిపెట్టినట్టుగా కనిపించడం లేదని అనుకుంటున్నాను. ఒక వైపు సాంప్రదాయ సాహిత్య సాహిత్యాన్ని సమర్థిస్తూనే, ఆధునిక కథ అచ్చంగా సామాజిక చైతన్యంతో ఉద్భవించిందని చెప్తూ రెండింటిని సమన్వయం చేసారు. ప్రాచీన సాహిత్య సమర్థన ఈ సందర్భంలో అనివార్యంగా విమర్శకునికి తోచి ఉండొచ్చేమోననే సందేహం కూడా వస్తుంది.

మహాకవి గురజాడ ఆధునిక సాహిత్యానికి వేగుచుక్కలాంటి వాడని చెప్పవచ్చు. ఎందుకంటే ఈయన తన రచనల ద్వారా సామాజిక జీవితాన్నే మార్చి వేసారు. 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అన్నట్లు ఆయన రచించిన కథల ద్వారా సమాజంలో అప్పటికే కుళ్లిపోయి ఉన్న సంస్కృతీ సంప్రదాయాలను అంతమొందించడానికి కంకణం కట్టుకున్నాడు. ఈ క్రమంలో దిద్దుబాటు, మీ పేరేమిటి, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం, మెటిల్డా కథలు 1910 లో(సంస్కర్త హృదయం. 1904) వెలువడ్డాయి. సంస్కర్త హృదయం కథను గురజాడ Stopping to Raise పేరుతో ఆంగ్లంలో రాయగా అవసరాల సూర్యారావు అనువాదాన్ని మనం తెలుగులో చదువుకుంటున్నాం. వీటిల్లో పెద్ద మసీదు, మీ పేరేమిటి అనే రెండు కథలు మతానికి సంబంధించినవి. మొదటిది హిందూ ముస్లిం మత సంబంధి అయితే, రెండవది హిందూ మతంలోని శైవ వైష్ణవ శాఖల కుమ్ములాటలకు సంబంధించినది.మొదటిది మతాభిమానానికి, హేతువాదానికి సంఘర్షణ అయితే రెండవది

మతం ఆధ్యాత్మికత లోపించి స్వార్థపర శక్తుల చేతుల్లో ఒక భౌతిక కర్మకాండగా మిగిలిపోయిన స్థితిని తెలియజేస్తుంది. దేవుని పేరు మీదున్న ఆస్తి మీదనే తప్ప, దేవుని మీద నమ్మకం లేని పరిస్థితిని చక్కగా చిత్రిస్తుంది రెండవది. పొట్టకూటి కన్నా స్వస్థల స్వమతాభిమానం మిన్నగా ఉండే పాత్ర పెద్ద మసీదులో ఉంటే, మతం కన్నా మతం పేర పొట్టకూటికే ప్రాధాన్యమిచ్చే పాత్రలు 'మీ పేరేమిటి' లో కనిపిస్తాయి. 'దిద్దుబాటు, మెటిల్డా, సంస్కర్త హృదయం అన్న మూడు కథలు చక్కని సాంఘిక కథా శిల్పాలు. మూడు కథలు మూడు రకాలు. ఇవన్నీ స్త్రీ ప్రధానమైన కథలు. మూడింటిలోనూ మోసగాళ్ళు, దుర్మార్గులు అయిన పురుషుల్ని, మగవాళ్ళను మార్చగలిగిన, మగవాళ్ళ చేత హింసింపబడిన స్త్రీలు దర్శన మిస్తారు'[32]. చెప్పే నీతికి చేసే చేతకీ సంబంధంలేని మగవాళ్ళు ఈ కథల్లో ఉన్నారని రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి గారు పేర్కొన్నారు.

కథానిక అనే విభాగంలో కథానిక పుట్టు పూర్వోత్తరాలను తెలిపి, ప్రముఖులైన కథకులు ఇచ్చిన నిర్వచనాలు పేర్కొన్నారు. అదేవిధంగా పోరంకి దక్షిణా మూర్తి గారు కథానిక, స్వరూప స్వభాలు అనే విమర్శన గ్రంథంలో తెలిపిన కథానికకు గల లక్షణాలు వివరించి గురజాడ కథలకు ఆ లక్షణాలను అన్వయించి, సోదాహరణంగా నిరూపించి చూపారు.

గురజాడ అప్పారావు గారు రచించిన పై అయిదు కథలను రాచపాళెం వారు వారు విశ్లేషించిన తీరును గమనిస్తే గురజాడ స్వభావం, ఆయన ఆత్మీయతా భావం, సమాజం పట్ల ఆయనకు గల బాధ్యత, సంఘ సమస్యల పట్ల ఆయనకున్న అవగాహన వ్యక్తమవుతుంది. ఈ విధమైనటువంటి విమర్శనుకవి జీవిత విమర్శగా పేర్కొనవచ్చు. కవి జీవితానికి కావ్యానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తూ "కవి ఆత్మీయత అతని రచనలో ప్రతిఫలించును. కావునా కవి జీవితమును పరిశీలించిన యెడల అతని కావ్య తత్వము సుగమమగును. కవి జీవితమునకు, కావ్య రచనకు ఉన్న సంబంధమును పరిశీలించి వాని సమన్వయముతో

---

[32] గురజాడ తొలి కొత్త తెలుగు కథలు. రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి. పుట.15

విమర్శకు పూనుకొనిన అది కవి జీవిత విమర్శగా పేర్కొనవచ్చును. కవి వ్యక్తిత్వము, అతని జీవితములోని భౌతిక తాత్త్విక, మానసిక విశేషములు అతని కావ్యములో ఎట్లు ప్రతిఫలించు చున్నవో ఇందు విశదీకరింప బడును."[33] పై విధంగా గురజాడ కథలపై సవిమర్శక దృష్టితో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు చేసిన విమర్శ ఆదర్శవంతమైనదిగా తెలుస్తుంది.

## 3.25.2. తిలక్ కథలు సామాజిక దర్శనం

గురజాడ తరువాత ఆధునిక తెలుగు కవులలో ప్రముఖుడైన దేవరకొండ బాలగంగాధర తిలక్ కథా సాహిత్యంపై రాచపాళెం వారు దృష్టి సారించారు. ఆయన కథల్లోని జీవిత వాస్తవికతను తెలుపుతూ ఒక వ్యాసం, ఆయన కథల్లోని పరిమితులను, లోపాలను తెలుపుతూ 'తిలక్ కథల్లో వీక్ పాయింట్' అనే పేరుతో మరో వ్యాసం రాశారు. గురజాడ కథా సాహిత్యంపై 1985 లో విమర్శా వ్యాసాలు రాసారు. ఆ తరువాత 1990 వరకు దాదాపు అర దశాబ్దం పాటు కథా సాహిత్యం జోలికి వెళ్ళినట్టుగా లేదు. అయితే తిలక్ కథలపై రాసిన ఈ రెండు వ్యాసాలు కూడా 1990 సంవత్సరంలోనే రాసినట్టుగా తెలుస్తుంది. ఆధునిక తెలుగు కథానిక సాహిత్యానికి సంబంధించి గురజాడను మొదట తన విమర్శనా వస్తువుగా తీసుకోగా ఆ తరువాత తిలక్ గా ప్రసిద్ధి చెందిన దేవరకొండ బాల గంగాధర తిలక్ కథలను తన విమర్శకు స్వీకరించారు. ఈ క్రమంలో తెలుగు కథానిక సాహిత్యం మొదలైన రోజు నుండి నేటి వరకు తెలుగు కథానికను సుసంపన్నం చేసిన రచయితలలో గురజాడ, శ్రీపాద లను మొదటి తరం కథకులుగా, చలం, కొడవటిగంటి కుటుంబరావు, కరుణ కుమార వంటి రచయితలను రెండో తరానికి చెందిన కథకులుగా పేర్కొన్నారు. అయితే అయితే 1910 లో పుట్టిన 'దిద్దుబాటు' కథానిక తరువాత తెలుగు కథానికకు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టినపాలగుమ్మి పద్మరాజు రచించిన కథ 'గాలివాన'(1952) ను ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో సువర్ణ ఘట్టంగా రాచపాళెం వారు అభివర్ణించారు. అప్పటి నుండి మనవ జీవిత వాస్తవికత చిత్రణను కథా సాహిత్యానికి సాధనంగా ఉపయోగించుకున్న

[33] తెలుగులో సాహిత్య విమర్శ. ఆచార్య ఎస్వీ. రామారావు. పుట:9

రచయితలలో తిలక్ అగ్రగణ్యుడని పేర్కొన్నాడు. అయితే తిలక్ 1935 ప్రాంతాల నుంచే రచనలు చేస్తున్నా ఆయనను స్వాతంత్ర్యానంతర రచయితగానే రాచపాళెం నిర్ణయించారు. తిలక్ కథల్లోని వస్తువు నాటి సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ఉండటమే ఈ విధమైన నిర్ణయానికి కారణం అని చెప్పవచ్చు.

స్వాతంత్ర్యానంతర కథా సాహిత్యాన్ని జాగ్రత్తగా పరిశీలించినట్లయితే అది కేవలం నినాద ప్రాయంగా, ప్రయోగాత్మకంగా, వ్యాపారాత్మకంగా ఉండేది. ఆ సమయంలో రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, వాసిరెడ్డి సీతాదేవి, రాచమల్లు రామచంద్రారెడ్డి వంటి కథకులు ఈ విధమైన విపరీత సాహితీ ధోరణుల్ని ప్రతిఘటిస్తూ రచనలు చేసారు. ఆ విధంగా కృత్రిమతకు ఆలవాలమై పోతున్న తెలుగు కథానికను వాస్తవిక మార్గం లోకి  మళ్ళించడానికి కృషి చేసిన రచయితల్లో తిలక్ ను ప్రముఖునిగా రాచపాళెం కీర్తించారు. తిలక్ గురించి శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు రాసిన పుస్తకాన్ని చదివితే తిలక్ రచనల్లోని తత్త్వం అర్థమవుతుంది. తిలక్ కవిత్వంలో  దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతో కాల్పనిక సౌందర్యమూ చోటు చేసుకున్నట్టే, శ్రీశ్రీ ప్రభావంతో సామాజిక వాస్తవికత చోటు చేసుకుంది. ఈ విధమైన సామాజిక వాస్తవికత ఆయన కథల్లో ఎక్కడెక్కడ చోటు చేసుకుందో వివరించారు. తిలక్ కథలన్నీ 'కథానిలయం' అనే అంతర్జాల పత్రికలో లభ్యమవుతాయి. తిలక్ రాసిన దాదాపు ముప్పై కథల్లో అధికభాగం మధ్య తరగతి జీవితాన్ని చిత్రించేవిగా ఉన్నాయనీ, నీతి నిజాయితీలను చిత్రించవలసి వచ్చినప్పుడు కింది తరగతి జీవితాన్ని వస్తువుగా తీసుకున్నారని రాచపాళెం వారు వాస్తవిక దృష్టితో ఆయన కథలను పరిశీలించారు. పైవిధంగా కవిగా, కథకునిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్న తిలక్ కవిగా అభ్యుదయ కాల్పనికుడైనా, కథకుడిగా మాత్రం ఆయన వాస్తవికవాది అని రాచపాళెం అంటారు.

## 3.25.3. మార్క్సీయ కోణంలో రాయలసీమ కథలు

ఒక నిర్దిష్టమైన సాహిత్య రచనకు ప్రేరణ, ప్రోత్సాహం, ప్రతిఫలం అందించగలిగే శక్తి ఒక్క విమర్శకి మాత్రమే సాధ్యం. ఆధునిక సాహిత్యంలో ఈ ప్రక్రియను ప్రారంభించిన కట్టమంచి వారి నుండి నేటి విమర్శకుల వరకూ ఉన్న విమర్శకులలో విశిష్టమైన వ్యక్తీ ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. తెలుగులో మార్క్సిస్టు సిద్ధాంతాల అన్వయవిమర్శకులుగా పేరుపొందిన త్రిపురనేని మధుసూదనరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య వంటి సరసన చేర్చదగిన మరొక గొప్ప నిబద్ధత కలిగిన సాహితీ విమర్శకులు రాచపాళెం. ఈ విధమైన భావజాల భూమిక ఆయన రాసిన ప్రతి వ్యాసంలో ఏదో ఒకచోట దర్శనమిస్తుంది. కాబట్టి ఆయన రాసేది మార్క్సిస్టు సిద్ధాంత అన్వయ విమర్శగానూ, ఆయనను మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగాను చెప్పవచ్చు. ఈక్రమంలో పోలు సత్యనారాయణ రాసిన ***"చదువు కథలు"*** ను విశ్లేసిస్తూ "చదువు అందరికీ గల హక్కు, మనిషి బతకటానికి ఆహారం అవసరమైనట్లే విద్య కూడా అవసరం" అని బుద్ధుడు చెప్పిన మాటలను గుర్తుకు చేస్తూ "నిచ్చెనమెట్ల సమాజంలో ప్రబుద్ధుల బుద్ధుల ముందు గౌతమ బుద్ధుల బుద్ధులు ఎందుకు పనికొస్తాయి?"[34]అని సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు రాచపాళెం. అదేవిధంగా ఈ వ్యాసంలో విద్యకున్న ప్రాముఖ్యతని దాని చారిత్రక ఆవశ్యకతను ఈ కథా సంపుటి ఆధారంగా వివరించారు.

రాయలసీమకు చెందిన ప్రముఖ కథకుడు చక్రవేణు రాసిన కథలను విశ్లేసిస్తూ ఆయనకు స్పష్టమైన భావజాలం ఉందని గుర్తించారు. చక్రవేను రాసిన కొత్త చదువు(1985),కసాయి కరువు(1986), కువైట్ సావిత్రమ్మ(1990), మృత్యు వాక్కు(1990) తెగినపేగు(1991), విముక్తి దారిలో(1993), కన్నీటి ధార(1993) మొదలైన ఏడు కథలను మార్క్సిస్టు దృష్టికోణం నుండి విశ్లేషించారు. మానవుల భౌతిక వాస్తవికత వాళ్ళ చైతన్యాన్ని నిర్ణయిస్తుంది (చూ.'మార్క్సిజం – సాహిత్యం' వ్యాసం) అనేది

---

[34] కథాంశం, చంద్ర శేఖర రెడ్డి రాచపాళెం. పుట:11

చారిత్రక గతితార్కిక సూత్రాలలో ఒకటిగా మార్క్స్ ప్రతిపాదించాడు[35]. ఆ విధమైన చైతన్యమే ఈ కథల్లో రచయితలు తెలియజేసారు. 'చదువు కథల'పై రాసిన వ్యాసంలో కేవలం రచయిత చదువు గల ప్రాధాన్యతను గుర్తించినట్టుగా తెలుస్తుంది. అయితే చక్రవేను రాసిన కొత్త చదువు కథలో ఆ చదువును భిన్న రూపాల్లో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో ఈ కథ ద్వారా తెలియజేసినట్టు రాచపాళెం వారు వివరించారు. కళాశాల విద్యార్థులు సెలవుల్లో పల్లెలకు పోయి గ్రామీణ పేద దళితుల్ని చైతన్యవంతుల్ని చేసి భూస్వామ్య వ్యవస్థ పట్ల అవగాహన కలిగించి తమ భూములను తాము అక్రమించుకునేట్లు చేయడమే ఈ కథ సారాంశం. ఈ విధమైన కథాంశం ద్వారా గ్రామ దళితులకు సంప్రదాయ, బానిస జ్ఞానం స్థానంలో విద్యార్థులు కొత్త జ్ఞానాన్ని అందిస్తారని రాచపాళెం వివరణ. బూర్జువా సంస్కృతిలో కూడా స్త్రీ పురుషాధిపత్యానికి బలవుతున్నది. పెట్టుబడి దారి సంస్కృతి స్త్రీని అంగడి సరుకుగా, ఆట వస్తువుగా మారుస్తున్నది. ఇలాంటి సమయంలో స్త్రీలు ప్రతిఘటించి తమ విముక్తి కోసం మరో పురుషుని ఆశ్రయించకుండా తమ చైతన్యంతో సాధించిన కథ 'విముక్తి దారిలో'(1993). ఈ విధమైన సామాజిక కట్టుబాట్లు మనిషి బతకటానికి ప్రతిబంధకాలైనప్పుడు స్త్రీ వాటిని ధిక్కరించి తన దారి తాను వెతుకుంటుందనటానికి సాక్ష్యం 'కువైట్ సావిత్రమ్మ'(1990) కథ. అయితే చక్రవేను ఆయన కథల్లో కొన్ని కొత్త కోణాలను ప్రదర్శించారని చెప్పారు. కథలో సమస్యలను ఫిర్యాదులు చేసే అనవసర పరిమితికి లోను కాకుండా ధైర్యంగా కారణాలను చెప్పి నిస్సంకోచంగా వాటికి రాజకీయ వ్యాఖ్యానం చెప్పడంతో ఆయనలోని నిబద్ధత బయట పడిందని రాచపాళెం అభిప్రాయపడ్డారు. ఈ విధంగా రచనతో బాటు రచయిత కూడా విప్లవోద్యమంలో(ఇక్కడ విప్లవం అంటే మార్పు అనే అర్థంలో తీసుకోవాలి)భాగస్వామి కావడం నిబద్ధత ప్రధాన లక్షణంగా చెప్పవచ్చు.[36]

[35] సాహిత్యంలో వస్తు శిల్పాలు, త్రిపురనేని మధుసూదన రావు. పుట:29

[36] సాహిత్యంలో వస్తు శిల్పాలు, త్రిపురనేని మధుసూదన రావు. పుట:34

## 3.25.4. తెలంగాణ విప్లవోద్యమ కథ

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు జన్మరీత్యా రాయలసీమ ప్రాంతానికి చెందిన వారైనప్పటికే కేవలం ఆ ప్రాంత సాహిత్యానికే పరిమితం కాలేదు. ఒకవేళ అలా అయ్యింటే ఆయన విమర్శా రంగంలో ఇంతటి పరిపక్వతను సాధించే వాడు కాదని చెప్పవచ్చు. సాహిత్యానికి ఏ విధంగా అయితే ఎల్లలు ఉండవో, సాహిత్య విమర్శకు కూడా అదేవిధంగా ఎల్లలు ఉండవని చెప్పవచ్చు. ఈ విధమైన కోణం నుండే రాచపాళెం వారు తెలంగాణా సాహిత్యంపై కూడా విమర్శను రాసారు. ఆ విధంగా ఆయన విమర్శ తొలిదశలో మొట్టమొదటి సారిగా "సామాజిక జీవిత ప్రతిబింబాలు తెలంగాణా జానపద గేయాలు" అనే వ్యాసాన్ని రాసారు. ఆ తరువాత కథా సాహిత్యానికి సంబంధించి తెలంగాణా విప్లవ నేపథ్యంలో వెలువడిన కథలను విశ్లేషించారు.

హైదరాబాద్ రాజ్యం నిజాం పాలనలో ఉన్నప్పుడు హైదరాబాదు, సికింద్రాబాదు నగరాల్లో వలసలు ఊపందుకున్నాయి. మన దేశంలోని వివిధ ప్రాంతాల నుండే కాక ఇరాన్, ఫ్రాన్స్ ఇంకా అనేక దేశాల నుంచి వలస వచ్చిన వారు హైదరాబాదును తమ శాశ్వత ఆవాసంగా మార్చుకున్నారు. అంతకు ముందు కుతుబ్‌షాహిల పాలన కూడా విదేశీ పర్యాటకుల పొగడ్తలతోపాటు, దేశీయుల మున్ననలందుకుంది. ఇబ్రహీం కులీ కుతుబ్ షా భాగమతి అనే హిందూ కన్యను వివాహమాడాడు. భాగమతి కుతుబ్‌షాహీ రాజ్య వరపత్నిగా వెలుగొందింది. తీరమతి, ప్రేమవతీలు గోల్కొండ రాజ్యంలో నాట్య ప్రతిభతో దేశదేశాల్లో పేరు పొందారు, అక్కన్న, మాదన్నలు కుతుబ్‌షాహి సేవలో తరించారు. ఉన్నత పదవుల్ని అధిష్టించారు. పై విధంగా తెలంగాణాలో తెలుగు సాహిత్యానికి బీజం పడిందని చెప్పవచ్చు.

అయితే 1948 కంటే ముందు వచ్చిన సాహిత్యం, తెలంగాణా నుండి వచ్చిన తెలుగు కథల్లో చోటు చేసుకుంది.ఈ నేపథ్యంలో ఇక్కడ హిందూ, ముస్లింలు సోదరుల్లా కలిసిపోయిన సంస్కతి. రాజకీయ సాంస్కతిక చైతన్యం ఈ కథల్లోని వస్తువుగా తయారైంది. దాదాపు ఆనాటి కథల్లో ఎక్కువగా హిందూ, ముస్లిం జీవితాలను చిత్రించేవారు. సురవరం

ప్రతాపరెడ్డి, భాస్కరభట్ల, కష్ణారావు, నెల్లూరు కేశవస్వామి, వట్టికోట ఆళ్వారుస్వామి, వెల్దుర్తి మాణిక్యరావు, కాంచనపల్లి చిన్న వెంకటరామారావు, నందగిరి ఇందిరాదేవి ఇంకా చాలామంది తమ సాహిత్యం ద్వారా తెలంగాణ కథకు శాశ్వతాన్ని కల్పించారు. ముస్లిం అబ్బాయిలతో తెలుగమ్మాయిలు. తెలుగువారితో ముడిపడ్డ ముస్లిం జీవితాలు. ఉద్యోగాలు కలివిడి తనం, విద్య, సంస్కరణ, ఆత్మగౌరవం ఇవన్నీ ఈ కథల్లో ప్రతిబింబించాయి. నిజాం ప్రభుత్వ అసహాయ వైఖరిని 1945 తర్వాత మూడేండ్ల కాలంలో కూడా తమ కథల్లో చూపారు.

## 3.25.5. తెలంగాణోద్యమ **కథ – పరిణామం**

1971 నాటికి 'మోతుబరి' లాంటి కథలు తెలంగాణాలో వచ్చినప్పటికీ జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన తర్వాతనే తెలంగాణాలో విప్లవ కథ పదునేక్కిందని రాచపాళెం అభిప్రాయం. అయితే తెలంగాణ కథకు 1970 నాటికే ఒక ప్రత్యేకత ఉందని చెప్పవచ్చు. ఆ సంవత్సరం నుంచే విప్లవోద్యమం గణనీయంగా ప్రభావితం చేయడం ప్రారంభమైంది. పీడితుల పక్షాన నిలిచి విప్లవోద్యమానికి భాసటగా నిలుస్తూ చాలామంది రచయితలు కథలు రాశారు. విప్లవ రచయితల సంఘంలో సభ్యులు కాని వారు కూడా ఆ ఉద్యమ ప్రభావంతో కథలు రాశారు. విప్లవోద్యమ ప్రేరణతో వచ్చిన తెలంగాణ కథలను నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి రైతాంగ పోరాట కథలు, గిరిజన పోరాట కథలు, కార్మిక పోరాట కథలు, సామ్రాజ్యవాద వ్యతిరేక కథలు. అల్లం రాజయ్య భూవిముక్తి పోరాట కథలు రాయగా, తమ్మేటి రఘోత్తమరెడ్డి, కార్మిక, సముద్రుడు, కారెంపూడి మార్కండేయ కార్మిక పోరాట కథలు రాసారు. బి ఎస్. రాములు రాసిన గిరిజన పోరాట కథలను, మంజీర రాసిన పెద్దకొడుకు, ఉప్పుతిని వంటి సామ్రాజ్యవాద వ్యతిరేకత కలిగిన కథలను రాచపాళెం వారు ఈ వ్యాసంలో విశ్లేషించారు.

## 3.25.6. పెద్దిభొట్ల కథల్లో మార్క్సిజం – అభ్యుదయ సమన్వయం

అభ్యుదయ రచయితల సంఘంలో ఎవరైనా ఉండొచ్చు. ఏ రాజకీయాభిప్రాయాల ప్రభావం పొందిన వారయినా ఉండవచ్చు. సమాజం మొత్తం ఒకానొక నూతన లక్ష్యం వైపు నడుస్తున్నప్పుడు. అంతకుముందున్న సమాజ స్థానంలో మరో కొత్త సమాజం ఉద్భవిస్తుంది. ఈ విధమైన దృష్టి కోణం నుండి చైతన్యంతో ఎవరు ఏరచన చేసినా అది అభ్యుదయ రచనే అవుతుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నట్లు 'పీడింపబడేవాళ్ళు, పీడించేవాళ్ళు ఉన్న ఈవర్గ సమాజం శాశ్వతంగా ఉండాలని ఎవరూ కోరుకోరు. రాబోయే రోజుల్లో సాధారణ మానవుడే మకుటధారి కావాలనేది ప్రతి ఒక్కరి ఆశయం.' ఈ విధమైన పురోగామి ఆలోచనను అణచివేసే వారు ఎప్పటికీ అభ్యుదయ వాదులు కాలేరు. ఈ వర్గ సమాజం పోవాలనుకోవడమే అభ్యుదయం. ఈ రకమైన ఉద్దేశ్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని వ్రాసేదే అభ్యుదయ రచన.

పై నిర్వచనాన్ని విశ్లేషించుకుంటే అభ్యుదయం అనేది మార్క్సిజం పునాది ఏర్పడేదని అర్థమవుతుంది. దోపిడీ వ్యవస్థ నిర్మూలన దిశగా, సామ్యవాదం కోసం ప్రయత్నిస్తూ, ఆధ్యాత్మిక, ఆదర్శ, వక్రభావజాలన్ని ఖండిస్తూ గతితార్కిక భౌతికవాద దృష్టితో రచనలు చేయడమే అభ్యుదయం. ప్రముఖ కథకులు పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారు రాసిన త్రిశంకు స్వర్గం కథ, అలజడి, నువ్వులూ తెలపిండి, దగ్ధగతం, దుర్దినం, సతీ సావిత్రి మొదలైన కథలను అభ్యుదయ దృక్పథంతో కూడిన మార్క్సీయ కోణం నుండి విశ్లేషించారు. పెద్దిభొట్ల కథా రచన ప్రారంభించే నాటి సమకాలీన పరిస్థితులు ఆయన కథా రచనకు ప్రతికూలంగా ఉండేవని అట్టి పరిస్థితుల్లో ఈ విధమైన అభ్యుదయ కథలు రాయడమనేది ఏటికి ఎదురీదడమేనని రాచపాళెం అభివర్ణించారు. "ఆయన చిత్రించింది మానవ జీవితంలోని విషాద దృశ్యాలే. అసమసమాజం మానవులలో అనేక రకాలుగా మిగిల్చే విషాదాన్ని పెద్దిభొట్ల అనేక పార్శ్వాల నుంచి చిత్రించారు. కానీ ఆయన కథానికల్ని చదివిన పాఠకులకు జీవితం మీద నిరాశ కలగదు. ఇంకా బతకాలన్న ఆశ కలుగుతుంది. అంటూ ఆయనలోని

అభ్యుదయ భావాలను వివరించారు రాచపాళెం. అదేవిధంగా 'త్రిశంకు స్వర్గం' కథలోని రమణయ్య పాత్రను గురించి విశ్లేషిస్తూ "నిచ్చెనమెట్ల సమాజంలో మెట్ల మధ్య సంఘర్షణకు రమణయ్య అంతర్మథనం వాస్తవిక దర్శనం. కారు ఓనరు కారు డ్రైవరు ఒక వర్గం వాళ్ళు కాదు. భిన్న వర్గాలు. అయినా కారు ఓనరు దగ్గర నివసించటం వల్ల డ్రైవర్ ఆ వర్గం బుద్ధులే వంటబట్టిచ్చుకుని తన సాటి వర్గాన్ని తేలికగా చూచే ధోరణిని"[37] (చూ. సగటుబతుకుల కథాసర్గం– త్రిశంకు స్వర్గం) ఈకథలో ఉందని చెబుతారు. పైవిధంగా పెద్దిభొట్ల కథల విశ్లేషణ ద్వారా మార్క్సిజం –అభ్యుదయాల సమన్వయంతో విమర్శించినట్టుగా తెలుస్తుంది.

## 3.25.7. అనంత కథకుల దళితుల శిల్ప కథనం

సామాజిక నడవడికకు, చరిత్ర పరిణామాలకు నిత్యం అద్దం పడుతూ కొనసాగేది సాహిత్యం. ఇక్కడ సాహిత్యం అంటే సాహిత్య విమర్శ కూడా అందులో భాగమే అని గ్రహించాలి. అది సాహిత్యమైనా, దాన్ని విశ్లేషించే విమర్శ అయినా దాని ప్రధాన లక్ష్యం విశ్వ శ్రేయస్సే. ఈ విధంగా సాహిత్యం ఎన్నో తరాల నుండి తన పాత్రను నిర్వహిస్తుంది. అయితే దాని ఫలాలను మాత్రం కొంతమందే అనుభవిస్తున్నారు. ఈ క్రమంలోసాహిత్యం దాని రూపాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యం నుండి అనేక సాహిత్య ఉద్యమాలు బయలుదేరాయి. ఆ విధంగా తెలుగు సాహిత్యంలో ఆధునికత దృక్పథాలు వచ్చిన కాలంలోనే తెలుగు కథా ప్రక్రియ కూడా ఆవిర్భవించింది. ఆ తరువాతి కాలంలో దళిత కథా సాహిత్యానికి కూడా అంకురార్పణ జరిగింది. దాదాపు అన్నీ వచన సాహిత్య ప్రక్రియలు సంస్కరనోద్యమ కాలంలోనే మొదలయ్యాయి. కథా ప్రక్రియ కూడా ఈ కాలంలోనే పుట్టి విభిన్న సంస్కరణల వ్యక్తీకరణ మాధ్యమంగా రూపుదిద్దుకుంది. అందులో ఒక నూతన భావజాల దృక్పథంతో దళిత కథ ఆవిర్భవించింది. అలా మొదలైన దళిత కథ స్వాతంత్ర్యానంతర కాలంలో ఉధృతంగా బలమైన సాహిత్యంగా వెలువడింది.

---

[37] కథాంశం. చంద్రశేఖర రెడ్డి రాచపాళెం, పుట:51

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఉద్యోగ రీత్యా తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి అనంతపురంలోని శ్రీ కృష్ణ దేవరాయ పి. జి సెంటర్ కు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆ జిల్లాలోని దళిత రచయితలతో కొంత అనుబంధం ఏర్పడింది ఆ విధంగా ఆయనకు అనంత దళిత కథకులలో ప్రముఖుడైన సింగమనేని నారాయణ కథలను పరిశీలించి *"అనంత కథానిక శిల్పి – సింగమనేని" (1999)* అనే వ్యాసం రాసారు. ఈ వ్యాసంలో ఆయన రచించిన కథల్లోని శిల్పాన్ని పరిశీలించి వాస్తవికతకు భంగం కలిగించే ప్రయోగాలకు పూనుకోలేదని, సంభాషణల్లో అనంతపురం జిల్లా స్థానిక భాషా మాధుర్యాన్ని చవి చూపించారని వివరించారు. ఇప్పటి వరకూ మనకు లభించిన ఆధారాలను పరిశీలించి చూస్తే, అనంతపురం జిల్లాలో స్థానిక జీవిత చైతన్యం సింగమనేని నారాయణ కథలతో ప్రారంభమయిందని అంటారు. సింగమనేని మొదటి స్థానిక జీవిత చైతన్య కథ 'జూదం', 1978 లో 'ప్రజాసాహితి'లో ప్రచురితమైంది. అయితే అనంతపురం జిల్లాలోని దళిత కథకులు తమ కథల్లో దళిత కథనాన్ని ఏ విధంగా నిర్మించారు అనే విషయాన్ని అనంత కథకుల దళిత కథనం (1999) అనే మరో వ్యాసంలో విశ్లేషించారు.

దళితులు స్వాతంత్ర్యానికి పూర్వం సరైన విద్య లేకపోవడం వల్ల సమాజంలో వాళ్ళు అనేక దయనీయ పరిస్తితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా కూడా, దళితులు అగ్ర వర్ణాల వాళ్ళకంటే అధిక విద్యావంతులైనప్పటికీ కూడా సమాజంలో ఇంకా అనేక విధాలుగా అవమానాలను ఎదుర్కొంటున్న తీరును ఈ కథల్లోఉన్నట్టు రాచపాళెం వారు విమర్శించారు.

## 3.25.8. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగు కథానిక

గురజాడతో మొదలైన ఆధునిక తెలుగు కథా విమర్శా ప్రస్థానం ఆ తరువాత తిలక్ కథల విశ్లేషణతో కథా విమర్శకు అవసరమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదన చేసిన రాచపాళెం క్రమేపి తన జన్మ స్థానమైన రాయలసీమ నుండి వెలువడిన కథలను తన విమర్శకు తీసుకున్నారు. కేవలం ప్రాంతీయ సాహిత్యం దగ్గరే ఆగిపోకుండా తెలంగాణా కథను

విప్లవోద్యమకాలం నేపథ్యం నుండి విశ్లేషించారు. అంతేగాక కోస్తాంధ్ర ప్రాంతానికి చెందినా కథకులు పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలను, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలను కూడా మార్క్సియ కోణం నుండి విమర్శించారు. ఈ విధమైన పరిణతి నుండి మొత్తం తెలుగు కథానికను స్వాతంత్ర్యోద్యమ కాలం నేపథ్యంలో విమర్శించదలిచారు రాచపాళెం. ఈ కాలంలో రాసిన వ్యాసమే *"భారత స్వాతంత్ర్యోద్యమం తెలుగు కథానిక"*. ఈ వ్యాసంలో నాటి కాలంలో ప్రజలు జాతీయోద్యమం ఫలితంగా అందరూ ఏకతాటిపై నడిచిన తీరును విమర్శకుడు ప్రశంశిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా జాతీయోద్యమంలో పాల్గొని తమ సామాజిక బాధ్యతను నిర్వహించారని రాచపాళెం అంటారు. ఈ క్రమంలో కవుల పాత్ర ఎక్కువగా ఉందని చెబుతారు. అలా అనేక సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమ నేపథ్యం నుండి వెలువడ్డాయి. అలా వెలువడిన సాహిత్యంలో కవితలు కావ్యాలు ఎక్కువగా వచ్చాయని, నవలలు, కథానికలు పరిమిత స్థాయిలోనే వచ్చాయని విమర్శించారు. అది కూడా ఉత్తర భారతం నుండి జాతీయోద్యమ సాహిత్యం విస్తృతంగా వెలువడిందని, దక్షిణ భారతదేశం నుండి అంతగ వెలువడలేదని చెప్పారు. ఉత్తర భారతీయులతో పోల్చుకుంటే దక్షిణ భారతీయులకు దేశభక్తి కొంత తక్కువే అని చెప్పవచ్చు. ఏదైనా దేశభక్తికి సంబంధించిన సినిమా భారతదేశమంతా విడుదల అయితే అది కేవలం ఉత్తర భారతదేశంలోనే విజయవంతంగా ప్రదర్శింప బడటానికి అవకాశం ఉంది. దక్షిణ భారత దేశంలో అది వారానికి మించి ఎక్కువ రోజులు ప్రదర్శింప బడదు. దీనికి కారణం దక్షిణ భారతీయులకు దేశభక్తి తక్కువ అని చెప్పవచ్చు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో వచ్చిన కథల్లోని వస్తు వైవిధ్యాన్ని గురించి విమర్శిస్తూ ఎక్కువ కథానికలు సహాయ నిరాకరనోద్యమంలోని విదేశి వస్త్ర దహనం, ఆంగ్ల విద్యా బహిష్కరణ, స్వదేశీ ఖాది వస్త్ర ధారణ, అస్పృశ్యతా నిరసన మద్యపాన వ్యతిరేకత మొదలైన అంశాలనే చిత్రించాయని, ప్రతి కథా వ్యక్తిగత వాంఛలు, సుఖ సంతోషాల కన్నా దేశ విముక్తే ప్రధానమన్న లక్ష్యాన్ని నొక్కి చెప్పాయని వివరించారు. అదేవిధంగా తల్లులు తమ బిడ్డలను జాతీయోద్యమంలో పాల్గొనటానికి ఏ విధమైన ప్రోత్సాహాన్ని అందించారో నాటి కాలం

కథలను పరిశీలిస్తే వ్యక్తమవుతుందని వివరించారు. దిక్కులేని వారిని, తిరస్కృతులను చేరదీసి స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తలుగా తీర్చిదిద్దిన స్వచ్ఛంద సేవిక కథ "నే ధన్యుడనైతి" అని దానిని ఆ నేపథ్యం నుండి విశ్లేషించారు. అదేవిధంగా మెట్టినింటి వాళ్ళు మత దృష్టితో తిరస్కరిస్తే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జీవితాన్ని ధన్యం చేసుకున్న స్త్రీ కథ "ఎవరిదదృష్టం" అనీ, స్వదేశీ ఉద్యమం పెద్దలలోనే గాక పిల్లల్లోకి కూడా ఎలా చొచ్చుకు పోయిందో తెలిపే కథ "నా ఇంట్లో కూడా ప్రవేశించిందే" అనీ, స్వదేశీ నిబద్ధత విషయంలో అద్దకం వ్యాపారంలో బాగా అభివృద్ధి చెంది మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావంతో దివాలా తీసిన కుటుంబాన్ని సహాయ నిరాకరనోద్యమంలో భాగమైన ఖద్దరు ఉద్యమం ఎలా ఆదుకుందో నిరూపించిన కథ "కుటీర లక్ష్మి" అనీ, స్వాతంత్ర్యోద్యమ కుటుంబ సంబంధాల్లో కలిగించిన ఘర్షణను చిత్రించిన కథలలో పేర్కొనదగింది అనిర్వచనీయ ఖ్యాతి అని విమర్శనాత్మకంగా నిరూపించారు. జాతీయోద్యమాన్ని ప్రోత్సహిస్తూ కథలు వచ్చినట్లే, దానిని ఆరాధనా భావంతో, భక్తితో సమర్థిస్తూ అనేకమంది రాసిన కథలను పరిశీలించారు. వాటిలో మల్లాది రామకృష్ణ శాస్త్రి రాసిన 'కైంకర్యం' ముద్దుకృష్ణ రాసిన 'నా మంత్రి', కొడవటిగంటి కుటుంబరావు రచించిన 'షావుకారు సుబ్బయ్య', 'రసికుడు' వంటి కొన్ని కథానికలను విశ్లేషించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశంలో రాజకీయాలు ఊపందుకున్నాయి. ఆ సమయంలో అంతకు ముందున్న సంఘసంస్కరనోద్యమం, ఆ తరువాత వచ్చిన స్వాతంత్ర్యోద్యమాల్లో ఏది ముఖ్యం అనే భావన ప్రజల్లో కలిగింది. ఈ విషయాన్నీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తన 'మొదటి దాడి' కథలో సృష్టించినట్టు తెలుస్తుంది. పై విధంగా స్వాంతంత్ర్యోద్యమాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, అనుకూలంగానో, విమర్శనాత్మకంగానో లభించిన తెలుగు కథా సాహిత్యాన్ని విమర్శించి అప్పటి సాధక బాధకాలను రచయితలు తమ కథల్లోని పాత్రల ద్వారా ఏ విధంగా ఫలింపచేసారో రాచపాళెం వారు సహృదయంతో విమర్శించారు.

## 3.25.9. తెలుగు కథ – స్త్రీ అభ్యుదయం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తానూ గురజాడ కథలపై విమర్శ రాసే కాలం నుండే స్త్రీ పై ప్రత్యేకమైన శ్రద్ధను కనబరిచినట్లు తెలుస్తుంది. గురజాడ రాసిన దిద్దుబాటు కథపై రాచపాళెం వ్యాసం రాస్తూ మొదటిసారిగా సమాజానికి స్త్రీ ఆవశ్యకతను కమలిని పాత్ర ద్వారా వివరించారు. ఆ ఉద్దేశ్యంతోనే 'ప్రశ్నించే తత్వానికి సాహిత్య స్రష్ట గురజాడ[38]' అని పేర్కొన్నారు. అయితే ఆ సృష్టికి స్థిర రూపం ఇచ్చింది మాత్రం శ్రీపాద అని పేర్కొన్నారు. ఈ సరసన చలాన్ని కూడా చేర్చారు రాచపాళెం వారు. శ్రీపాద కథల్లోని స్త్రీ పాత్రలు చురుకైనవిగా, తెలివైనవిగా ఉంటాయంటారు. ఈ కోణం నుండి శ్రీపాద రాసిన కథల్లో కొన్నింటిని తీసుకొని సోదాహరణంగా విమర్శించారు. అన్నపూర్ణ కథలో సూరమ్మ పాత్ర ద్వారా, కిందకా పైకా కథలో కృష్ణవేణమ్మ పాత్ర ద్వారా, ఖచ్చితమైన జవాబు కథలో పూర్ణ పాత్ర ద్వారా, పెల్లాడ తగ్గ మొగుడేడి కథలో సుభద్రమ్మ పాత్ర ద్వారా సమాజాన్ని, సమాజంలో చోటు చేసుకున్న దురాచారాలను ఎత్తి చూపుతూ అనేక పాత్రలను శ్రీపాద వారు సృష్టించినట్టు రాచపాళెం వారు పేర్కొన్నారు. సంఘ సంస్కరణ జాతీయోద్యమ కాలంలో కథా రచన చేసిన శ్రీపాదఅప్పటి సమాజానికి పట్టిన బూజును కథలలోని స్త్రీపాత్రల ద్వారా రూపుమాపినట్టుగా ఆయన పేర్కొన్నారు.

## 3.26. నవలా విమర్శ

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తొలిలి దశలో ఇంత వరకు ప్రాచీన సాహిత్య విమర్శకు సంబంధించి కేవలం సాహిత్య ప్రమాణాలను ఆధారంగా చేసుకొని విమర్శ రాసారు. ఆ తరువాతి కాలంలో ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక దృష్టితో చూడటం మొదలుపెట్టారు. తెలుగు సాహిత్య విమర్శలో ప్రక్రియా విమర్శకు నాంది పలికిన విశ్వనాథ సత్యనారాయణ ప్రాచీన సాహిత్యం పై వెలువరించిన విమర్శ గ్రంథాలను ఆధారంగా చేసుకొని రాచపాళెం విమర్శ రాసారు. ఆ తరువాత కొంత కాలానికి సాహిత్యాన్ని కేవలం

---

[38] తిరుగుబాటు స్త్రీపాత్రల శ్రీపాద (వ్యాసం)

సాహిత్య ప్రమాణాలతో చూడవలసిన అవసరం ఉందా? లేదా? అనే అంశాలపై ఆయనకు ఒక కలిగిన స్థూలమైన అవగాహన నుండి సాహిత్య ప్రమాణాలతో మాత్రమే విమర్శించడం సమగ్రమైన పద్ధతి కాదని గ్రహించారు. ఈ నేపథ్యంలో అప్పటి నుండి ఏ రచనను విమర్శించడానికి పూనుకున్నా ఆ రచనలో ఆనాటి సమకాలీన సమాజం వ్యక్తమవుతోందా, ఆ రచన వల్ల నాటి సామాజిక పరిస్థితులు తెలుస్తున్నాయా, సాహిత్యం సాంఘిక చరిత్రను నిర్మించడానికి చక్కని సాధనం కనక రచనలో ఆ కోణం నుండి పరిగణించాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయా అనేది తన విమర్శ ద్వారా చూడటం మొదలుపెట్టాడు. ఈ విధమైనటువంటి సామాజిక దృక్పథం ఆయనకు మార్క్సిస్టు సిద్ధాంతాల పరిచయం కలిగిన తరువాతనే అలవడిందని చెప్పవచ్చు, అంతకు ముందు అంటే ప్రాచీన సాహిత్య విమర్శను రాసే తొలినాళ్ళలో కూడ ఈ విధమైన ప్రచారం ఉన్నప్పటికీ ఆధునికాంధ్ర కవిత్వంపై విమర్శ రాసేనాటికి మాత్రమే ఆయనకు మార్క్సిస్టు సిద్ధాంతాల పైన పూర్తి అవగాహన వచ్చినట్టుగా తెలుస్తుంది. అయితే ఈ అవగాహన పూర్తిస్థాయి పరిపక్వతగా మారింది మాత్రం నవలా విమర్శ రాసే దశలోనే అనేది స్పష్టంగా తెలుస్తుంది.

రాచపాళెం సాహిత్య విమర్శ తొలిదశలో కేవలం అయిదు నవలలపై మాత్రమే మార్క్సిస్టు దృక్పథంతో విమర్శను రాసినప్పటికీ ఆ కొద్దిపాటి విమర్శే అల్పక్షరాలలో అనల్పార్థ రచన అన్నట్టుగా మొత్తం మార్క్సిస్టు సిద్ధాంత మేనిఫెస్టోని ప్రతిఫలిస్తున్నట్టుగా ఉంది.

## 3.26.1. 'రాచపాళెం' సాహిత్య విమర్శ – చారిత్రక పరిణామం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి విమర్శా ప్రస్థానం శిల్పగతమైన చర్చతో ప్రారంభమై అది వస్తుగతమైన చర్చగా వికాసాన్ని పొందింది. ఆయన రాసిన సాహిత్య విమర్శను దశల వారిగా పరిశీలించినట్లయితే వీరి సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం అర్థమౌతుంది. ఒక వ్యక్తి సామాజిక పరిస్థితులు ఆ వ్యక్తి సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి అన్నది ఎంత సత్యమో, కాలక్రమంలో ఆ వ్యక్తి సాహిత్యం పరిణామం చెందుతుందన్న మాట కూడా అంతే సత్యం.

కాబట్టి రాచపాళెం సాహిత్య విమర్శ ఒక చారిత్రక పరిణామాన్ని సంతరించుకుందని చెప్పవచ్చు. రాచపాళెం వ్యక్తిత్వం గురించి సినారె *"సంప్రదాయంలో మొలకెత్తిన రాచపాళెం వ్యక్తిత్వం పరిణామ క్రమంలో ప్రయోగశీలాన్ని, ప్రగతి దృక్పథాన్ని తనలో మేలవించుకుందని"* అంటారు. ఇక్కడ వ్యక్తిత్వం అంటే కేవలవ్యక్తిత్వం అని కాదు. ప్రతి కవి, విమర్శకుల వ్యక్తిత్వాలు వారి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయని ఆయన అంతరార్థం కావచ్చు. నిజానికి ఆయన సాహిత్య విమర్శ శిల్ప విశ్లేషణతో ప్రారంభమై వస్తు విశ్లేషణతో వికాసాన్ని పొంది సామాజిక దృక్పథంతో ప్రగతి శీల భావాలతో కొనసాగుతుందని చెప్పవచ్చు. మొదటి రచన నుండి ఇప్పటివరకు వచ్చిన రచనల పరిణామాన్ని విశ్లేసిస్తే రాచపాళెం వారి చారిత్రక విమర్శన దృక్పథం స్పష్టమౌతుంది. ఒకప్పుడు కొంత శిల్పదృష్టి ప్రదర్శించినా కాలక్రమంలో చారిత్రక, గతి తార్కిక భౌతిక వాద సాహిత్య విమర్శ వైపే ఆయన పయనం కొనసాగింది. వీటిని మరింత సోదాహరణంగా వివరించాల్సిన అవసరం ఉంది.

## 3.27. మార్క్సిస్టు సాహిత్య విమర్శ

ఆరు దశాబ్దాలకు పైగా తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శకి ఉనికి ఉంది. తెలుగు సాహిత్యంలోకి మార్క్సిస్టు భావాల ప్రవేశం 1930 మధ్యకాలం నుండి ప్రవేశించింది, 1930లలోనే కొడవటిగంటి కుటుంబరావు, జి.వి.కృష్ణారావు రాసిన 'కావ్యజగత్తు' పుస్తకం ఉన్నప్పటికీ, మద్దుకూరి చంద్రశేఖరరావు రాసిన, ఆంధ్ర సాహిత్యంలో కొత్త పోకడలు(1944), అనే వ్యాసాన్ని తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ప్రారంభంగా విమర్శకులు గుర్తించారు. ఈ వ్యాసానికి కొనసాగింపుగా శ్రీశ్రీ రాసిన 'ఏది విప్లవ పంథా?' వ్యాసాలను కూడ చెప్పుకోవాలి. ఇవి రెండూ కూడ 1946 అక్టోబర్ లో ప్రచురితమైన అభ్యుదయ మొదటి సంచికలో అచ్చయ్యాయి. వీటిలో 'ఆంధ్రసాహిత్యంలో కొత్త పోకడలు' వ్యాసంలో మార్క్సిస్టు దృక్పథం సరిగా వ్యక్తం కాలేదని, యాంత్రికంగా ఉందని, తేల్చివేశారని పుచ్చలపల్లి సుందరయ్య 1947లోనే విమర్శించారు. ఆ విమర్శతో ప్రత్యేకంగా కమ్యూనిస్టు పార్టీ ఒక సర్క్యులర్ ను సభ్యులకు పంపింది. అంటే, తెలుగులోకి మార్క్సిస్టు సాహిత్యవిమర్శ ప్రవేశమే 'దృక్పథం' గురించిన వివాదంతో మొదలయిందని చెప్పవచ్చు.

## 3.28 సాహిత్యం – శాస్త్రీయ దృక్పథం

సామాజిక, విజ్ఞానశాస్త్రాలు సాధించిన విజయాల వెలుగులో సాహిత్య ప్రయోజనాన్ని పరిశీలించటాన్ని 'శాస్త్రీయదృక్పథం'[39] అంటారు త్రిపురనేని మధుసూధనరావు. రుజువు చేయగలగటం, ప్రత్యక్ష ప్రమాణానికి, ఆచరణకు సన్నిహితంగా ఉండటం శాస్త్రీయ దృక్పథ ప్రధాన లక్షణమని ఆయనే చెప్పారు. ఈ విధమైన శాస్త్రీయ దృక్పథంతో ఏ రచననైనా పరిసీలిన్చినప్పుడే ఆ రచన సాధించే సామాజిక ప్రయోజనం అర్థమవుతుంది. అసలు దృక్పథమే లేకపోవడమనేది సాహిత్యం పట్ల జీవితం పట్ల సరైన అవగాహన లేకపోవడమేనని ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య అభిప్రాయపడ్డారు.

'సాహిత్య ప్రయోజనం గురించీ మార్క్సిస్టు దృక్పథంలో ప్రత్యేకమైన సైద్ధాంతిక అవగాహన ఉంది. ఆ అవగాహన మార్క్స్, ఎంగెల్స్ ల రచనలతోనే ప్రారంభమై, గత నూట అరవై సంవత్సరాలలో ఎంతగానో విస్తరించింది. సోవియట్ యూనియన్, చైనా వంటి దేశాలలో ఆచరణలోకి వచ్చి, ఆ ఆచరణ క్రమంలో మార్పులు చేర్పులకు గురయిన సాహిత్య సైద్ధాంతిక అవగాహన ఒకవైపు ఉండగా, జర్మనీ, ఫ్రాన్స్, హంగేరీ, బ్రిటన్, చెకొస్లవేకియా, అమెరికాలలోని విశ్వవిద్యాలయాలలోనూ, కమ్యూనిస్టుపార్టీలలోనూ మేధావుల విశ్లేషణా కృషిలో అనేక కొత్త అంశాలు, ఆలోచనలు వెలికివచ్చాయి. ఇరవయో శతాబ్ది పొడవునా అద్భుతంగా వికసించిన ఈ మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్నంతా మదింపు వేసి, మన సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతలతో జతచేసి మనకై మనం ఒక విస్పష్టమైన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్ని రూపొందించుకోవలసి ఉంది. అందులో మార్క్సిస్టు దృక్పథంలోని సార్వజనీన, సార్వకాలీన అంశాలు ఉంటాయి. వాటిలో అదనంగా వచ్చిచేరే అంశాలూ ఉంటాయి, మన సమాజ, సాహిత్య ప్రత్యేకతలను వివరించగల ప్రత్యేక అంశాలూ ఉంటాయి. తెలుగులో అటువంటి మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం అభివృద్ధి చేయడానికి అవసరమయిన

---

[39] సాహిత్యంలో వస్తుశిల్పాలు, త్రిపురనేని మధుసూదన రావు, పుట:27

కృషి చాల తక్కువ జరిగిందని[40] ఎన్. వేణుగోపాల్ అంటారు. ఈ విధంగా తక్కువగా జరిగిన కృషిలోకే రాచపాళెం వారు వస్తారని చెప్పవచ్చు.

## 3.29. తొలిదశలో – మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా రాచపాళెం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి సాహిత్య విమర్శను 1972లో మొదలుపెట్టిన మూడు దశాబ్దాలకు అంటే 1997 నాటికి మార్క్సిస్టు సిద్ధాంతం పైన స్పష్టమైన అవగాహన వచ్చినట్టుగా తెలుస్తుంది. ఈ అవగాహనతో తాను పుట్టిన ప్రాంతమైన రాయలసీమ రచయితల రచనలను విమర్శించారు. అప్పటికే రాయలసీమ నుండి ఒక స్పష్టమైన భావజాలంతో రచనలు చేస్తున్న రచయితల్లో స్వామి రాసిన 'గద్దలాడతండాయి' చిలుకూరి దేవపుత్ర *'అద్దంలో చందమామ'* సి హెచ్ వెంకట రత్నం *'పల్లె పిలిచింది'* వి. ఆర్. రాసాని *'చీకటి రాజ్యం'* కేతు విశ్వనాథ రెడ్డి రచించిన *'వేర్లు', 'బోధి'* మొదలైన నవలలను మార్క్సిస్టు దృక్పథం నుండి విమర్శించారు. అయితే ఆప్పటికి ఆయనకున్న అవగాహన కేవలంప్రాంతీయ సాహిత్యానికే పరిమితమైనట్టుగా తెలుస్తుంది. *"స్థానికత, ప్రాంతీయ సాహిత్య విమర్శకు రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ అనువర్తన ద్వారా పునర్మూలకనం చేయగలిగే మార్గాన్ని సూచించగలగటం."*[41]అనేది వల్లంపాటి వెంకటసుబ్బయ్య సాహిత్య విమర్శలోని ముఖ్యాంశంగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. "***తెలుగు నవలపై మార్క్సిజం ప్రభావం***" అనే వ్యాసంలో నిఖిలేశ్వర్ గారన్నట్లు నూరేళ్ళ తెలుగు నవలా చరిత్రలో వేలాది నవలలు పాఠకులను అలరించినా, మార్క్సిజం ప్రభావంతో వచ్చిన నవలలు తక్కువేనని చెప్పవచ్చు. సంఘ సంస్కరణ మూల సూత్రంగా వెలువడిన నవలల సంఖ్య మాత్రం ఎక్కువగా ఉన్నా అధిక సంఖ్యలో మాత్రం కథా కాలక్షేపానికి పనికొచ్చినవే! అయితే ఈ వ్యాసంలో నిఖిలేశ్వర్ గారు

---

[40] తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ – పునరాలోచనలు(వ్యాసం). ఎన్. వేణుగోపాల్.Kadali Taraga : A Wave in the Ocean !

[41] విమర్శకుడిగా 'వల్లంపాటి వెంకట సుబ్బయ్య (వ్యాసం)

భారతీయ సామాజిక వ్యవస్థలో అంతర్ వైరుధ్యాలను వర్గ పోరాట దృక్పథంతో చిత్రించిన నవలలు ఇరవై వరకే ఉన్నాయని చెబుతూ ఆ ఇరవై నవలల పట్టికను ఇచ్చారు. అయితే ఆ పట్టికలో రాచపాళెం వారు మార్క్సిస్టు విమర్శా దృక్పథంతో విమర్శించిన రచనల్లో ఒక్కటైనా లేకపోవడం గమనార్హం. బహుశా ఆయన వ్యాస పరిమితిని దృష్టిలో ఉంచుకొని అలా చేసారేమో అనుకున్నా కూడా ఆయన నిర్ణయించిన నవలల సంఖ్య దానిని కొట్టిపడేస్తుందని చెప్పవచ్చు.

కేవలం ప్రసిద్ధులైన నవలా రచయితల నవలలను మాత్రమే పరిగణిలోకి తీసుకొని విమర్శించడం కాకుండా సమకాలీన రచయితల రచనలను కూడా తన విమర్శా వస్తువుగా స్వీకరించడం రాచపాళెం విమర్శలోని ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు. 'సమాజాన్ని విడిచి ఏ రచయితా ఏదీ మాట్లాడలేడు' అనే ఆయనలోని నిశ్చితాభిప్రాయమే ఈ లక్షణానికి కారణం కావచ్చని అనుకుంటున్నాను.

రాయలసీమకు చెందిన రచయితల నవలలను విమర్శించి పాశ్చాత్య మార్క్సిస్టు భావన మీద నిర్మాణమైన తెలుగు సాహిత్య విమర్శను రాచపాళెం ప్రాదేశికం చేశారు. స్వామి రాసిన 'గద్దలాడ తండాయి' నవలలో ఒక కులం తనపై చేత పీడింపబడుతూ తన కింది కులాన్ని పీడించడానికి ప్రయత్నిస్తుందని ఈ విధమైన విపరీత ధోరణికి ఫ్యూడల్ బ్రాహ్మణీయ భావజాలమే అని, ఇదే నిచ్చెన మెట్ల సమాజ లక్షణం అని, ఈ నవలను విశ్లేషించి ఆ లక్షణాన్ని ఇందులో నిరూపించారు. భౌతికవాద దృక్పథంతో ఈ నవలను విశ్లేషించి ఒక రచయిత తానూ రచనలో చెప్పబోయే అంశం ఏ విధంగా ఉండాలనే విషయాన్ని గురించి చెబుతూ రచయిత ఉన్న సామాజిక పరిస్థితిని చిత్రించడమే గాక, దానిని మార్చడానికి తనదైన ఆలోచనలను బయటపెట్టడం ఈరచనలో కనిపిస్తున్నాయని చెబుతూ ప్రత్యామ్నాయ సమాజాన్ని సూచించడం అన్నది ఏ రచయితకైనా కనీస బాధ్యత అని ఈ నవలలోని లోపాన్ని సున్నితంగా విమర్శించారు. రచయిత ఈ నవలలో వాస్తవాలను, తను అర్థం చేసుకొనే తాత్విక దృక్పథాన్ని భావజాలాన్ని ఎక్కడా బయట పెట్టకపోవడం, రచయిత ఏ పాత్రలోనైనా దాగున్నాడా అని వెదికితే ఎక్కడా కనిపించలేదని చెబుతూ రచయితకు ఉండాల్సిన నిబద్ధతను

గుర్తుకు చేస్తున్నాడు. "***రచనతో బాటు రచయిత కూడా విప్లవోద్యమంలో భాగస్వామి కావడం నిబద్ధత ప్రధాన లక్షణం***"[42] అని త్రిపురనేని మధుసూదనరావు అంటారు. రచయిత తన రచనలో ఎదో ఒక సందర్భంలో పాత్రలకు ప్రతినిధిగా ఉండాల్సిన ఆవశ్యకతను రాచపాళెం తెలియజేస్తున్నారు.

'అద్దంలో చందమామ' నవలలో చిలుకూరి దేవపుత్ర నాటి ఆంధ్రదేశంలో ఉన్న లోపభూయిష్టమైన భూ సంస్కరణలను వివరిస్తుంది. అదేవిధంగా భూసంస్కరణల చట్టం పేరుతో ప్రజలను దళారులు ప్రజలను ఏవిధంగా మోసగించిది రచయిత ఈ నవలలో చిత్రించాడు. రాచపాళెం మార్క్సిస్టు దృక్పథంతో దీనిని విశ్లేషించి మానవతా దృష్టి, ప్రజాస్వామిక ఆలోచన, సామాజిక మార్పు పట్ల నిబద్ధత సామాజిక న్యాయ దృక్పథం కలగలిసిన దేవపుత్ర రచనలు సామాజిక వాస్తవికతను విమర్శనాత్మకంగా ప్రతిఫలిస్తున్నాయని వివరించాడు. సాహిత్యం సామాజిక ప్రయోజనంగా ఉండాలని రాచపాళెం ఎప్పుడు భావిస్తూ ఉంటారు. ఎదో ఒక ప్రయోజనాన్ని సాధిస్తేనే ఆ రచన శిల్పవంతం అవుతుందని ఆయనంటారు. కాబట్టి చిలుకూరి దేవపుత్ర రచించిన అద్దంలో చందమామ నవల మనిషి మనుగడకు సమాజ ప్రగతికి మూలమైన భూమి కొందరి సొత్తైనప్పుడు, అది అందరికీ చెందాలంటే ఆ కొందరు చేసే ఆగడాలు, పాలక వర్గం ఆ కొందరి కొమ్ము కాయడం ప్రచారాలతో, ఆర్భాటాలతో పేదల్ని దగా చేయడం, దళారులు సంపన్నుల ప్రయోజనాలకు ఉపయోగపడటం వంటి వాస్తవాలను సృజనాత్మకంగా విశ్లేషించి ప్రజల్ని భూమి రాజకీయాల్లో జ్ఞానుల్ని చేయడం అది సాధించిన సామాజిక ప్రయోజనం అని రాచపాళెం విమర్శించారు.

సి.హెచ్.వెంకటరత్నం రచించిన *"పల్లె పిలిచింది"* నవలలో ప్రసాద్ అనే ఒక ఉపాధ్యాయుడు ఒక మారుమూల పల్లెటూరిని తనకున్న పరిమితమైన జ్ఞానంతో సంస్కరించిన తీరును ఈ నవలలో రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించాడు. ఈ విధమైన సంస్కరణ భావజాలంతో ఉన్న ఉపాధ్యాయుని చేత అలా చేయించడం ద్వారా అతనిలో

---

[42] సాహిత్యంలో వస్తు శిల్పాలు, త్రిపురనేని మధుసూదనరావు, పుట: 34

‘భౌతిక తాత్విక దృక్పథం’ ఉందని రాచపాళెం అంటారు. సమాజంలో ఇప్పటికే పాతుకు పోయిన ఆయా రంగాలను సంస్కరించాలంటే భౌతిక తాత్విక దృక్పథం ఎంతైనా అవసరం అని విమర్శకుడు సూచిస్తున్నాడు.

మార్క్సిస్టు సాహిత్య విమర్శ ప్రధాన లక్షణం సామ్యవాదం. ఈ సామ్యవాదాన్ని సాధించాలంటే వర్గ, వర్ణ వ్యవస్థలు సమూలంగా అంతమవ్వాలి. భారతీయ సమాజంలో వర్ణ వ్యవస్థ ఏవిధమైన పర్యావసానాలకు దారితీసిందో చెబుతూ భారతీయ సమాజం వర్ణ సమాజం మనుధర్మం దీనిని శాశ్వతం చేసింది. వర్ణవ్యవస్థ మనుషుల్ని విభజించింది. శారీరక శ్రమ చేసే అత్యధిక సంఖ్యాకులను సామాజిక గౌరవానికి సుఖానికి దూరం చేసింది అంటూ ఆవేదన చెందారు. ఎప్పుడు పేదల పక్షం ఉండే తన కలాన్ని కదిలించే రాచపాళెం శ్రామికుల మీద శాశ్వతంగా అగ్రవర్ణ భూస్వాముల పెత్తనం కొనసాగటానికి కులాలలో ఉపకులాలను సృష్టించి, కర్మ సిద్ధాంతంతో దానిని సమర్థించిందని దానిని వర్ణ వ్యవస్థ పై విరుచుకుపడ్డారు. ఇటువంటి సామాజిక వాస్తవికతనే *‘చీకటి రాజ్యం’* నవల ప్రతిబింబిస్తుందని దానిని మార్క్సియ కోణం నుండి విమర్శించారు. ఈ నవలను రాయలసీమలో ప్రముఖులైన రచయితలలో ఒకరైన వి. ఆర్ రాసాని రాసారు. స్వయంగా ప్రగతిశీల భావాలూ కలిగిన రచయిత రచించిన ఈనవలను ‘శ్రామికులు, పీడితులు ఏకమై పడకుల పీచమణచాలన్న ప్రబోధంతో ముగించటం అనేది ప్రగతిశీల నవలా సాహిత్యంలో భాగంగా రాచపాళెం భావించారు.

ఈనాడు అస్తిత్వానికి సంబంధించిన అన్ని అంశాలు తుడిచిపెట్టుకుపోవడం మనం గమనిస్తూనే, ఎదుర్కొంటూనే ఉన్నాం. కోల్పోతున్న వాటిని గురించి ఆవేదన చెందడం, ప్రతిఘటించడం అనేవి కూడా ప్రగతిశీల భావాలలో భాగంగా భావించవచ్చు. ఈనాడు కవులందరూ రాస్తున్న కులం, మతం, ఆర్థిక, రాజకీయ, మానవ సంబంధాలు, పండుగలు, ప్రేమలు– ఇలాంటి వన్నీ విస్తృతం కావడానికి కారణం, మన సమాజంలోని మౌలికమైన లక్షణాలు నిలుపుకోవాలనే ఆవేదనయే! కుల వ్యవస్థను సమూలంగా అంతమొందించాలనే లక్ష్యమే! పెట్టుబడి సంస్కృతిని ప్రతిఘటించాలన్న సంకల్పమే! ఒకప్పుడు మార్క్సిస్టులు

మాత్రమే పోరాడతారనుకున్న అంశాలు, ఇప్పుడు రచయితలకు, విమర్శకులందరికీ(కొందరు మినహాయింపు) సంబంధించినవిగా మారాయి. ఉదాహరణకు స్త్రీకి పూర్తి స్వేచ్ఛ లేకుండా చేయడం, పురుశషాధిపత్యానికే ప్రాధాన్యమివ్వడం, అణగారిన వర్గ ప్రజలను ఇంకా అనచే ప్రయత్నం చేయడం. ఇలాంటి సంఘటనలు సర్వవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇటువంటి సమస్యలను కేతు విశ్వనాథ రెడ్డి తన నవల 'వేర్లు' లో చిత్రించాడు. ఈ నవలలో దళితులకు సంబంధించిన సమస్యలను రచయిత చిత్రించాడు. అదేవిధంగా ఆయనే రచించిన ఇంకో నవల 'బోధి' లో స్త్రీ పురుష సంబంధాలు చిత్రింప బడ్డాయి. భారతీయ సమాజం పురుషాధిపత్య సమాజం అని, ఈ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు సంస్కారవంతంగా ఉండవనీ, అవి అసమ సంబంధాలని రాచపాళెం వారు పైన చెప్పినట్టుగా మార్క్సిస్టు దృక్పథం నుండి విశ్లేషించారు.

## 3.30. సామాజిక నేపథ్యమే – మార్క్సిస్టు విమర్శా?

సామాజిక నేపథ్యాన్ని భూమికగా చేసుకుని రాసే విమర్శను మార్క్సిస్టు విమర్శగా విమర్శగా విమర్శకులు భావించారు. మార్క్సిస్టు విమర్శ సాహిత్యాన్ని సామాజిక చైతన్య రూపంగా గుర్తించి పరిశీలిస్తుందని[43] రాచపాళెం వారంటారు. మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని పరిశీలించటమంటే ప్రకృతిని, చరిత్రను, సాహిత్యాన్ని గతి తార్కిక భౌతికవాద పరంగా పరిశీలించడమని మరికొందరంటారు. ఇక్కడ ప్రకృతి, చరిత్ర అనేవి కూడా సమాజంలోని అంతర్భాగాలే అని అర్థం చేసుకోవాల్సి ఉంది. మరి కేవలం సామాజిక నేపథ్యంలోనే సాహిత్యాన్ని పరిశీలిస్తే మార్క్సిస్టు సాహిత్య విమర్శ అవుతుందా? అనే ప్రశ్నకు బాలగోపాల్ గారు ఈ విధంగా సమాధానమిస్తున్నారు. “సాహిత్యాన్ని సామాజిక నేపథ్యంలో పరిశీలించడం తప్పనిసరిగా అవసరమే. కానీ ఆ నేపథ్యాన్ని వివరించడంతో మార్క్సిస్టు సాహిత్య విమర్శ అయిపోదు.”[44] అని అంటారు. అయితే ఇక్కడ సామాజిక నేపథ్యం అనేది కేవలం ఆవిమర్శకు వస్తువుగా మాత్రమే ఉంటుంది. సమాజం నేరుగా సాహిత్య వస్తువు

[43] 'చర్చ' చంద్రశేఖర రెడ్డి రాచపాళెం. పుట:149

[44] 'రూపం – సారం' సాహిత్యం పై బాలగోపాల్.పుట:116

అయినప్పుడు ఆ సాహిత్యం అంత సంతృప్తి కరంగా ఉండదు. అంటే ఇక్కడ మార్క్సిస్టు సాహిత్య విమర్శకు వస్తు, శిల్పాల సమన్వయము అవసరం అనే అర్థం స్ఫురిస్తుంది.

## 3.31. ఆధునిక సాహిత్య విమర్శ – సాధికార సమీక్ష

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు 1970–72ల మధ్యకాలంలో స్నాతకోత్తర విద్యను చదివారు. అప్పటి తమ గురువులైన ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు, జి. ఎన్.రెడ్డి, మద్దూరి సుబ్బారెడ్డి వంటి సాంప్రదాయ భావజాలం కలిగిన ఉపాధ్యాయుల సాంగత్యంలో ఉండటం వల్ల ఆ విధమైన అభిరుచులే అలవడి ఉంటాయి. ఈ నేపథ్యం నుండి నన్నయ్య మొదలుకొని ప్రబంధ యుగ కవుల వరకు గల సాహిత్యాన్ని విశ్లేసిస్తూ సాహిత్య వ్యాసాలు, మోనోగ్రాఫ్లు, విమర్శా గ్రంథాలుగా వివిధ రూపాల్లో వెలువరించారు. అయితే ఒక దశాబ్దం కాలంపాటు ఆ విధమైన ఒక ఊబిలో ఆయన చిక్కుకుని సరిగ్గా ఒక దశాబ్దం తరువాత అంటే 1980లో ఆధునిక సాహిత్యంపై విమర్శ రాయడానికి పూనుకున్నారు. ఈ విధమైన ప్రారంభం పరిపక్వతగా మారి అది సమాజాన్ని స్పృశించేంతగా సాగింది. ఈ నేపథ్యం నుండి రాసిన విమర్శే ఆయనను ఒక గొప్ప విమర్శకునిగా నిలబెట్టిందని చెప్పవచ్చు.

అలా సాగిన ఆయన సాహిత్య విమర్శ ప్రస్థానం ఎక్కువగా ఆధునికాంధ్ర కవిత్వంపై ప్రసరించింది. ఆ తరువాత దాని కన్నా కొంచెం తక్కువ స్థాయిలో కథా సాహిత్యంపై, నవలా సాహిత్యంపై విమర్శ రాసారు. ఇదే పరిణామాన్ని తెలుగు సాహిత్య విమర్శా చరిత్రలో కూడా మనం గమనించవచ్చు. ఇంతవరకు రాసిన విమర్శ కేవలం కల్పనా సాహిత్యంపైనే ప్రసరించింది. ఈ మొత్తం కల్పనా సాహిత్యాన్ని వడపోత పోసే ప్రక్రియగా 'సాహిత్య విమర్శ'ను పేర్కొనవచ్చు. కల్పనా సాహిత్యాన్ని విమర్శించే పనిలో భాగంగా అక్కడక్కడా విమర్శ ప్రక్రియ మౌలిక లక్షణాలను వివరించినా అవి ఆ విమర్శలో అంతర్భాగాలని మాత్రమే చెప్పవచ్చు. అయితే ఆధునిక సాహిత్య విమర్శ సిద్ధాంత మౌలికతను కేవలం నాలుగు వ్యాసాలలో ఆయన స్థూలంగా వివరించారు.

'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకులు' అనే వ్యాసంలో తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శ ఆవిర్భావం దాని చారిత్రక పరిణామాన్ని వివరించారు. అయితే తొలినాళ్ళలో వచ్చిన సాహిత్య విమర్శకు, మలినాళ్ళలో వచ్చిన సాహిత్య విమర్శకు గల భేదాన్ని వివరిస్తూ ఆధునిక కాలంలో ఆధునిక అవసరాల కోసం సాహిత్య విమర్శ అనే ప్రత్యేక ప్రక్రియ రూపొందిందని పేర్కొన్నారు. ముద్రణా యంత్రం పుట్టుకతో సాహిత్య విమర్శ కూడా మారిందని వివరించారు. క్రీ. శ.19 శతాబ్దంలో ప్రారంభమైన ఆధునిక సాహిత్య విమర్శలో కందుకూరి వీరేశలింగం రాసిన 'విగ్రహతంత్రం విమర్శనము' అనే గ్రంథాన్ని తొలి విమర్శా గ్రంథంగా రాచపాళెం భావించారు. అంతేగాక ఆయన పురాణాలపై, ప్రబంధాలపై రాసిన విమర్శా వ్యాసాలలో ఆధునిక దృష్టి ఉందని ఆయన గుర్తించారు. క్షీణ ప్రబంధ యుగల్లోని సాహిత్యాన్ని నిరసిస్తూ కందుకూరి వీరేశలింగం రాసిన 'సరస్వతీ నారద విలాప' కావ్యాన్ని ఆధునిక సాహిత్య విమర్శకు సాహిత్యం గురించి ఆధునిక దృష్టితో ఆలోచించడానికి తొలి అధికారికమైన గ్రంథంగా రాచపాళెం అభిప్రాయపడ్డారు. ఆ తరువాత కందుకూరి రచించిన 'రాజశేఖర చరిత్ర మీద కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు రాసిన 'వివేక చంద్రికా విమర్శనము' గ్రంథాన్ని ఆధునికాంధ్ర సాహిత్యం మీద వచ్చిన తొలి విమర్శనా గ్రంథంగా విమర్శులు భావించారు. అయితే ఆధునిక రచనలోని ఆధునికతను వ్యతిరేకించే గ్రంథంగా ఇది పేరు పొందిందని రాచపాళెం విమర్శించారు. పైన పేర్కొన్న మూడు విధాలైన రచనలను విమర్శకులందరూ ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు నేపథ్యాలుగా చెప్పారు. అయితే రాచపాళెం ఆ మూడు గ్రంథాలలో కూడా ఒక్కొక్క దాని నుండి ఒక్కో ప్రత్యేకతను కలిగినవిగా విశ్లేషించారు. ఏ రచయిత రచించిన రచన అయినా ఏదో ఒక సామాజిక ప్రయోజనాన్ని కలిగి ఉండాలనేది రాచపాళెం వారి విమర్శలోని ప్రాథమిక లక్షణం. అయితే ఇటువంటి సాహిత్యానికి ఉండవలసిన గొప్ప సామాజిక ప్రయోజనాన్ని ఉద్దేశించిన గురజాడే, ఆ ప్రయోజనాన్ని రచనలోంచి చూపడమే విమర్శ ప్రయోజనంగా భావించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆధునిక నాటక సాహిత్య చరిత్రలో మకుటాయమానంగా పేర్కొంటున్న

గురజాడ రాసిన 'కన్యాశుల్కం' నాటకానికి ఆయన రాసుకున్న పీఠిక ఆధునిక సాహిత్య విమర్శా సూత్రాలకు పుట్టినిల్లుగా భావించారు.

ఆధునిక సాహిత్య విమర్శ చరిత్రలో కొత్త బోదెలు తవ్వినట్టుగా పేర్కొనే 'కవిత్వతత్త్వ విచారం' అనే విమర్శాగ్రంథంలో అందులోని కొత్త బోదేలేవో తెలపడంలో చాలామంది విమర్శకులు విఫలమయ్యారనే చెప్పాలి. ఆటువంటి ప్రశ్నలకు సమాధానంగా రాచపాళెం వారు ప్రాచీన సాహిత్యాన్ని సమాజంతో ముడిపెట్టి చూడటమనేదే ఆయనలోని కొత్తదనం అని సూటిగా సమాధానమిచ్చాడు. పాశ్చాత్య అలంకార శాస్త్రం తెలుగు వాళ్ళకు అస్సలే వంటబట్ట లేదు. అనే నిశ్చితాభిప్రాయంతో ఉన్న రాచపాళెంవారు అందుకు కట్టమంచివారిని మినహాయింపుగా పేర్కొన్నట్టుగా తెలుస్తుంది. అందుకే ఆయన శిల్ప పరంగా చెప్పిన 'ఏకాకృతి సిద్ధాంతాన్ని' మన ఆలంకారికులు చెప్పిన 'సుశ్లిష్ట సంధి బంధానికి దగ్గరగా ఉండొచ్చనే సందేహాన్ని వెలిబుచ్చారు. ఈ క్రమంలో కట్టమంచి వారు పేర్కొన్న 'భావనాశక్తి' సిద్ధాంతాన్నే రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు భావ, వస్తు, రచనా సిద్ధాంతంగా భావించారని రాచపాళెం నిర్ణయించారు. ప్రాచీనాలంకారిక గ్రంథాలను ప్రాచీన కావ్యాలకు అన్వయించే ప్రయత్నం ఆధునిక కాలంలో కూడా అధికంగానే జరిగిందని చెపుతూ పాటిబండ మాధవశర్మ 'ఆంధ్ర మహాభారతం – చందః శిల్పము', శలాక రఘు నాథ శర్మ రచించిన 'ఆంధ్ర మహాభారతం – ధ్వని దర్శనం' అనే గ్రంథాలను ఉదాహరణలుగా చెప్పారు. అయితే ఆధునిక కవిత్వానికి కూడా ప్రాచీనాలంకారిక గ్రంథాల సూత్రాలను అన్వయిన్చాబోయి చాలా మంది దెబ్బతిన్నారని సూచించారు. అయితే అందుకు సంబంధిచిన ఉదాహరణలను మాత్రం పేర్కొనలేదు.

ఆధునిక సాహిత్యంపై ఒక స్పష్టమైన అవగాహనకు వచ్చిన రాచపాళెం వారు ఆ విధమైన అవగాహన నుండి వచ్చిన సాహిత్య విమర్శను అక్కడక్కడా ప్రశంసిస్తూ ఉంటారు. రాచపాళెం వారి సాహిత్య విమర్శకు భూమిక భౌతిక దృక్పథంతో కూడిన సామాజిక ప్రయోజనం ఇలాంటి దృష్టికోణంతో ఏ విమర్శకుడైన తెలుగు సాహిత్య విమర్శా చరిత్రలో

కనబడితే వారిని వెతికిపట్టుకోవడం మొదలుపెట్టారు. దీనినే సాహిత్య విమర్శ పరిభాషలో మూల్యాంకన విమర్శగా చెప్పవచ్చు. ఆ విధంగా తన విమర్శ  మూల్యాంకన దృష్టితో తొలిసారిగా కట్టమంచి పై ప్రసరించింది. ఆ తరువాత అదే దృక్పథం అంటే ప్రాచీన సాహిత్యాన్ని వాస్తవిక దృక్పథంతో చూసిన వారిలో కట్టమంచి తరువాత తాపీ ధర్మారావుగారిని పేర్కొంటున్నారు రాచపాళెం. ఆయన 'కొత్తపాళి'లో రాసిన వ్యాసాలు, విజయ విలాస కావ్యానికి రాసిన హృదయోల్లాస వ్యాఖ్య ప్రాచీన సాహిత్యం మీద ఒక ప్రాపంచిక దృక్పథంతో కూడిన వినూత్న దృష్టిని ప్రసరించాయని నిరూపించారు. ఈ విధంగా ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక దృష్టితో చూసిన వారిలో మార్క్సిస్టు దృక్పథం కలిగిన వాళ్ళే ఎక్కువగా ఉన్నారని చెప్పవచ్చు. అయితే వారిలో శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబ రావు ఈ విధమైన మార్క్సిస్టు దృక్పథానికి సిద్ధాంత రూపాన్నిచ్చారని చెప్పారు. అయితే సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథం నుండి చూడటం మొదలు పెట్టిన రాచపాళెం ఆయన భావజాలాన్ని ఆ దృక్పథంతో సమన్వయించే ప్రయత్నం చేసారు. ఈనేపథ్యంలో శ్రీశ్రీ రాసిన 'మన గురజాడ', కొ.కు రాసిన 'సాహిత్య ప్రయోజనం' ఆయనకు మార్గదర్శకాలుగా ఉన్నట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో  రచయితను, రచనను, అతని కాలం, జీవితంతో ఏ విధంగా సమన్వయించాలో అనే విషయాన్ని కె.వి రమణారెడ్డి, దువ్వూరి మీద రాసిన 'కవికోకిల', గురజాడ మీద రాసిన 'మహోదయం' అనే గ్రంథాలు నేర్పిస్తాయని ఆయనంటారు. అదేవిధంగా ఒక ఉద్యమ సాహిత్యాన్ని ఉద్యమంతో అన్వయించే విమర్శకు మద్దూరి సుబ్బారెడ్డి 'తెలుగులో జాతీయోద్యమ కవిత్వం', ఒక గ్రంథాన్ని వ్యక్తివాదం దృష్ట్యా వ్యాఖ్యానించడం అనే ధోరణికి ఆర్. ఎస్ సుదర్శనం రాసిన సాహిత్యంలో దృక్పథాలు అనే విమర్శా గ్రంథాలను ఉదాహరణలుగా పేర్కొన్నారు. తెలుగు విమర్శ చరిత్రలో కథా విమర్శకు గల స్థానాన్ని వివరించారు రాచపాళెం. అదేవిధంగా తెలుగు సాహిత్య విమర్శలో భాగంగా వచ్చిన భిన్న వాదాలను ఆయన విశ్లేషించే ప్రయత్నం చేసారు.

పై విధంగా విమర్శ రూపం లేని ఒక సాహిత్య క్రియగా మొదలై సంపూర్ణ రూపం గల సాహిత్య ప్రక్రియగా రూపాంతరం చెందింది. అయితే అది ఒక ప్రక్రియగా రూపాంతరం

చెందిన తరువాత విభిన్న వాదాలు బయలుదేరి ఆ ప్రక్రియను మరింత విస్తృతం చేసాయి.అయినా కూడా ఈ విమర్శా ప్రక్రియ కూడా అనేక విమర్శలకు గురైందని చెప్పవచ్చు. ఇలా వచ్చిన విమర్శలలో తెలుగులో సాహిత్య విమర్శ ఎదగలేదు. చచ్చిపోయింది. అనే కొన్ని ఉదాసీనత కలిగిన అంశాలు ఉత్పన్నమయ్యాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలను రాచపాళెం వారు తెలుగులో సాహిత్య విమర్శ ఎదగాలేదా? అంటూ ఒక వ్యాసంలో వెలిబుచ్చుతూ, ఒకవేళ నిజంగానే ఎదగలేదంటే అది ఎందుకు? అనే విషయాలను చర్చించారు.

నేటి కాలంలో చాలామంది విమర్శ రాస్తున్నారు. వీళ్ళలో ఎక్కువమంది తమకు నచ్చిన కవుల గురించి చిన్నపాటి వ్యాసాలు రాస్తున్నారు. వాటిలో పొగడ్తలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. గుణదోష నిర్ధారణలు కనిపించడం లేదు. కవి రాసిన రచననే శిరోధార్యంగా భావించి పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఇది విమర్శకాదు. ప్రశంస అని కూడా అనడానికి వీలు లేదు. ఎందుకంటే ప్రశంసకు అర్హమైన విషయాలు ఏమిటో కూడా చెప్పడం లేదు. ఒక వాచకం బాగుందంటే ఎందుకు బాగుందో చెప్పాలి. ఏ కారణంగా ఒక వాచకం పాఠకుల్ని ఆకట్టుకుంటుందో వివరించాలి. బాగుందనగానే సరిపోదు. ఈ మాట చెప్పడానికి విమర్శకులే కానక్కర్లేదు. పాఠకులు కూడా తమకు నచ్చిందో లేదో చెబుతారు. బాగుందనో, లేదనో అంటారు. బాగుంటే ఎందుకు బాగుందో పాఠకులు చెప్పలేరు. ఎందుకుంటే వారు ఒక రచనని చదివి ఆనందించగలరు. కానీ తమకు ఆనందాన్నిచ్చే అంశాలు ఆ రచనలో ఏమున్నాయో వారు వివరించలేరు. ముఖ్యంగా తెలుగులో సాహిత్య విమర్శ ఎదగలేకపోవడానికి కారణం విశ్వవిద్యాలయ పరిశోధనలే కారణం అని వాటిలో తొంబై శాతం గ్రంథాల్లో ఏ సిద్ధాంతం గానీ, భావజాలం గానీ, ప్రతిపాదన గానీ ఉండకుండానే వెలువడుతున్నాయని విమర్శించారు. పరిశొధకునికి భావజాలం, తాత్విక నేపథ్యం తప్పనిసరిగా ఉండాలని రాచపాళెం భావించారు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన ఈ విధంగా ఉండటానికి స్నాతకోత్తర స్థాయిలోని పాఠ్య ప్రణాళిక అస్తవ్యస్తంగా ఉండటమేనని అభిప్రాయపడ్డారు. భావజాలాన్ని అవకాశవాదంగా చేసుకుని రచనలు చేసే వాళ్ళను

“సాహిత్య విధ్వంసకులు”గా రాచపాళెం అభివర్ణించారు. అయితే రామాయణ,మహాభారతం లాంటి కావ్యాలలోని పాత్రలను అభ్యుదయ పాత్రలుగానో, సంఘసంస్కరణ పాత్రల గానో చిత్రించడం వల్ల సాహిత్య విమర్శకు ఎంత నష్టం వస్తుందో చెబుతూ ఆ విధంగా పోగైన విమర్శను తూర్పార బట్టాలని అప్పుడే విమర్శ ఎదుగుదల తెలుస్తుందన్నారు.అయితే పైన చెప్పిన లోపాలను నేడు వస్తున్న విమర్శలలో తొలగించాలంటే ఏమి చేయాలి, నేటి తరం విమర్శకులకు ఎటువంటి మార్గదర్శకాలను సూచించాలి అని ఎంతో మంది వివిధ సిద్ధాంత గ్రంథాలను రాసారు. కొందరు ప్రత్యేకించి సాహిత్య విమర్శనే రాస్తారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కట్టమంచి రామలింగారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, జి.వి.సుబ్రమణ్యం, చేకూరి రామారావు, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కోవెల సంపత్కుమారాచార్య, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కాత్యాయనీ విద్మహే వంటి వారు ప్రత్యేకించి విమర్శ రాశారు. ఈవిధంగా సీరియస్‌గా విమర్శని చేపట్టి నిర్వహించేవారి అవసరం ఇవాళ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం ఇతర ప్రక్రియల్లో రచనలు చేస్తూ విమర్శలు రాసేవారు ఉన్నారు. కానీ విమర్శని చేపట్టి నిర్వహించేవారు అరుదు.

## 3.32. మార్క్సిస్టు దృక్పథ విమర్శ– వస్తు శిల్పాల సమన్వయం

తెలుగులో సాహిత్య విమర్శను ఒక భాద్యతగా రాస్తున్న వారిలో పైన పేర్కొన్నట్టుగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఒకరు. సాహిత్యకారుడుగా నాకు జీవితం ప్రమాణం. సిద్ధాంతంకోసం జీవితాన్ని వక్రంగా చిత్రిస్తే ఆ రచన ఉత్తమ రచన ఎట్లా అనిపించుకుంటుందో నాకు యేనాడూ అర్థం కాలేదు యిది కుటుంబరావుగారి ప్రగాఢ విశ్వాసం. ఇదే విశ్వాసం రాచపాళెం వారిలో కూడా కనిపిస్తుంది. ఎందుకంటే ఆయన విమర్శలో ప్రధానంగా కనిపించేవి మూడే మూడు లక్షణాలు అవి సమాజం, ప్రజలు, భౌతిక దృక్పథం. ఈ విధమైన భావజాలంతో తెలుగులో సాహిత్య విమర్శ రాసిన వారు అతి కొద్దిమంది మాత్రమే అని చెప్పవచ్చు. వారిలో రాచమల్లు రామచంద్రా రెడ్డి ఒకరు ఈయన

విమర్శా శైలిని ఒక వ్యాసంలో, వారి సాహిత్య దృక్పథాన్ని మరొక వ్యాసంలో రాచపాళెం తెలియజేసారు.

నిబద్ధత కలిగిన సాహిత్య విమర్శకులల్లో రాచమల్లు రామచంద్రారెడ్డి ఒకరు. రా.రా పేరుతో ప్రసిద్ధులైన రాచమల్లు రామచంద్రారెడ్డి సాహిత్య విమర్శలో సూటిదనమూ, నిరాడంబరత్వమూ యెవరైనా గుర్తించవచ్చు, కానీ, ఆయనకొక శైలి ఉన్నట్లు చాలామంది గుర్తించరు. రాచపాళెం వారు దీనిని గుర్తించడం అభినందించదగ్గ విషయం. అయితే ఈ సాహిత్య విమర్శ శైలిని నిర్ణయించేవి రెండు అంశాలని రాచపాళెం వారు నిర్ణయించారు. అవి సాహిత్య విమర్శ ఎవరికోసం అనేది ఒకటి, ఆ విమర్శ ఉద్దేశించిన ప్రయోజనం ఏమిటన్నది రెండు. అయితే మొదటి దాంట్లో శైలి డాంబికంగా ఉంటుందని పేర్కొని, రెండవ దానిని ఆరోగ్యకరమైన విమర్శగా పేర్కొన్నారు. ఈయన కట్టమంచి ప్రతిపాదించిన వాస్తవికవాదాన్ని మార్క్సిస్టు దృక్పథంతో సమన్వయం చేసుకుని తనదైన విమర్శా పద్ధతిని నిర్మించుకున్నట్టు రాచపాళెంవారు తెలియజేసారు. రా.రా సాహిత్య విమర్శలోని నిర్మొహమాటమి అనే లక్షణం, ఆయన అభిప్రాయలలోనేగాక ఆయన విమర్శ శైలిలోనూ కనిపిస్తుంది. దీనిని రాచపాళెంవారు గుర్తించారు. రా.రా విమర్శా శైలి నిరలంకారికంగా ఉంటుందని చెబుతూ, ఒక మేధావి ఒక సమస్యను విడమర్చి చెప్పినట్టుగా ఆయన సాహిత్య విమర్శ శైలి ఉంటుందని పేర్కొన్నారు. ఆలంకారిక శైలికి కాలం చెల్లిందని, అది కృత్రిమ మైనదని, ఈనాటి సంస్కారవంతులెవరూ దానిని సమర్థించరని రా. రా అభిప్రాయం. ఈ అభిప్రాయం బలంగా ఆయన విమర్శ రచనలో ఉంది కాబట్టే ఆయన సాహిత్య విమర్శకు స్పష్టత, సూటిదనం, చురుకుదనం తేగలిగారు.

సాహిత్య విమర్శలో నిబద్ధత అనే భావం ప్రాచీన సాహిత్య విమర్శ ఉన్న కాలంలో లేదు. 1970 తరువాత విరసం ఈ నిబద్ధతా వాదాన్ని ప్రవేశపెట్టింది. మార్క్సిజానికి, ప్రజల పోరాటానికి మధ్య విమర్శకుడు నిబద్ధుడు కావాలి. సాహిత్య విమర్శలో ప్రజల పక్షం నిలిచి మార్క్సిస్టు దృక్పథం నుంచి రాయడం నిబద్ధతా లక్షణంగా చెప్పవచ్చు. ఈ నిబద్ధతా సిద్ధాంత

వివరణకి జీన్ పాల్ సార్త్రే ని ప్రమాణంగా తీసుకోవచ్చు. సార్త్రే what is literature అనే గ్రంథంలో ఈ నిబద్ధత గురించి చర్చించాడు.

సాహిత్యం, రచయితలూ స్వేచ్ఛ కోసం నిబద్ధం కావాలనీ సార్త్రే చెప్పాడు. “One does not write for Slaves, The art of prose is bound up with the regime in which prose has meaning democracy. When one is threatened the other is too. And it is not enough to defend them with the pen. A day comes when the pen is forced to stop, and the writer must then take up arms.writing is a certain way of wanting freedom: once you have begin, you are committed”[45]

పై విధంగా స్వేచ్ఛ కోసం సాహిత్యం నిబద్ధం కావాలని సార్త్రే వివరించాడు. అభ్యుదయ వ్య తిరేకమైన అంశాల మీద, సమాజంలో అధిక సంఖ్యాక ప్రజలు వ్యతిరేకించే అంశాల మీద గొప్ప రచన చేయడం సాధ్యం కాదని సార్త్రే అన్నాడు. ఈయన అస్తిత్వ వాది. నిబద్ధత గురించి చెప్పినప్పటికీ, స్వేచ్ఛ కోసం రచయిత నిలవాలని చెప్పినప్పటికీ సార్త్రే దృష్టిలో స్వేచ్ఛ అంటే అభ్యుదయ వాదులు చెప్పే సామాజిక స్వేచ్ఛ కాదు, వ్యక్తి స్వేచ్ఛ. “అభ్యుదయ రచయితను అని చెప్పుకుంటూ అభ్యుదయ సాహిత్యోద్యమంలో ప్రవేశించిన వాడు కనీసం అభ్యుదయ వ్యతిరేక రచనలు చెయ్యకుండా ఉండటానికైనా మార్క్సిజం తెలుసుకుని ఉండటం అవసరం.” అభ్యుదయ రచయితకు మార్క్సిస్టు పరిజ్ఞానం తప్పనిసరి అనే భావం విమర్శకుల్లో ఉందని చెప్పవచ్చు. కానీ రాను రాను అభ్యుదయ రచయిత మార్క్సిజానికి నిబద్ధుడు కావాలనే అభిప్రాయం బలపడి స్థిరపడింది. “భౌతిక వాద దృక్పథంతో సామాజిక విప్లవం కావాలని కోరేవారు మాత్రమే ఈ నిబద్ధత అనే మాటను ఎక్కువగా వాడుతూ ఉండటం వల్ల ‘నిబద్ధత’ అంటే సామాజిక విప్లవానికి నిబద్ధులై

[45] “Committed to what? Defending freedom?”-‘what is literature’ jean Paul Sartre. Translation by Bernard Fretchman. Page no: 47

ఉండాలనే వారి సంకల్పం మాత్రమేనని మనం అర్థం చేసుకోవచ్చు”[46]. కాబట్టి మార్క్సిజానికి, సామాజిక విప్లవానికి అంకితం కావడం ‘నిబద్ధత’ అని స్పష్టమౌతుంది.

రచయితలకు వర్గ దృక్పథం ఉండాలి అని భావించే రా. రా స్వయంగా భౌతికవాది. అయితే భౌతిక వాదులంతా మార్క్సిస్టులు, ప్రజా రచయితలు కాదంటారు రాచపాళెం. మార్క్సిస్టులైన భౌతిక వాదులే ప్రజా రచయితలు అని రాచపాళెం అంటారు. ప్రగతిశీల దృక్పథం కలిగిన రా రా “మన ప్రధాన శత్రువు లెవరో నిర్ణయించుకోవాలి, స్వలాభమే ఏకైక చోదక శక్తిగా గల ఈ పెట్టుబడీ దారి నాగరికత మీద రాజీలేని పోరాటం చేయడానికి సిద్ధపడేవాడే ఈనాడు అభ్యుదయ రచయిత కాగలడు.” అన్న మాటలను బట్టి ఆయనను స్పష్టమైన వర్గ దృష్టి ఉన్న విమర్శకునిగా పేర్కొన్నాడు. ‘మానవత్వవాదమొక్కటే నిజమైన సాహిత్య వాదం’ అనే సత్యాన్ని నరనరాన జీర్ణించుకున్నవాడే నిజమైన సాహిత్యకారుడు కాగలడని చెప్పి రా.రా ది స్పష్టమైన ప్రగతిశీల దృక్పథం అని సాధికారమైన విమర్శ చేసారు.

## 3.33. సాహిత్య విమర్శకులకు కర దీపికలుగా నవలా శిల్పం, కథా శిల్పం

ఆధునిక సాహిత్య విమర్శ ప్రవేశానంతరం రాచపాళెం వారు కట్టమంచి మొదలుకొని అనేక మంది విమర్శకుల దృక్పథాలను పరిశీలించి విశ్లేషించారు. ఈ క్రమంలో ఎక్కువగా రాయలసీమకు చెందిన మార్క్సిస్టు సాహిత్య విమర్శకులపై ఆయన దృష్టి సారించారు. ఈ విధంగా కట్టమంచి, రాచమల్లు రామ చంద్రారెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య లు వెలువరించిన సాహిత్య విమర్శను పరామర్శించారు. అలా పరామర్శ చేసే క్రమంలో ఒక విమర్శకునికి, మరొక విమర్శకునికి మధ్యగల సిద్ధాంత సారూప్యతను గమనించడం మొదలుపెట్టారు. ఆ దృష్టితోనే వల్లంపాటిని కట్టమంచితో పోలుస్తూ కట్టమంచి లాగ అవతలివాళ్ళకి చిరాకెత్తించే విధంగా విమర్శ రాయలేదని పేర్కొని వల్లంపాటి రారా లాగా నిర్దాక్షిన్యుడు మాత్రమేనని అన్నారు. అదేవిధంగా త్రిపురనేని లాగా వ్యక్తిని గాయపరచలేదని, కె.వి.ఆర్ లాగా వాక్యాలను సంక్లిష్టం చేసి పాఠకులను ఇబ్బంది పెట్టలేదని ఎత్తి చూపారు.

[46] “సాహిత్య మీమాంస’ – శ్రీ రాంభట్ల కృష్ణ మూర్తి., అభ్యుదయ –జూలై 1979, పుట:42

వల్లంపాటి వారు రాసిన వచన సాహిత్య విమర్శల్లో ముఖ్యమైనవి నవలా శిల్పం(1989), కథా శిల్పం(1995) గ్రంథాలు. ఈ గ్రంథాలు రెండు నేడు నవలలపై, కథలపై పరిశోధనలు చేస్తున్న వారికి కరదీపికలుగా ఉపయోగపడతాయని రాచపాళెం నిర్ధారించారు. అదేవిధంగా సాహిత్య విమర్శ వాళ్ళ సమాజానికి సాహిత్యానికి కలిగే మేలును వల్లంపాటి తన విమర్శలో మామూలు పాఠకులకు సైతం అర్థమయ్యేటట్లు వివరించారని తెలిపారు.

## 3.34. తులనాత్మక సాహిత్యం పై ఒక చూపు

నేటి సాహిత్య విమర్శలో అత్యంత ప్రామాణికతను కలిగి ఉన్నట్టుగా చలామణి అవుతున్న సాహిత్య విమర్శలలో తులనాత్మక సాహిత్య విమర్శ ఒకటి. ఈవిధమైన సాహిత్య విమర్శలో రెండు వేర్వేరు సాహిత్యాలలోని పరస్పర సంబంధాలను అధ్యయనం చేయడం ప్రధానం. అంటే వేర్వేరు భాషా సాహిత్యాల, తులనాత్మక పరిశీలన ఇందులో ముఖ్యం. ఒకే రచనను ఇద్దరూ లేదా అంతకుమించి చేసినపుడు కూడా అందులో తులనాత్మక సాహిత్య విమర్శ ఉంటుందని చెప్పవచ్చు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు 1977లో అనంతపురం పి.జి సెంటర్ లో లెక్చరర్ గా పని చేస్తున్నప్పుడు గాథాసప్తశతిని భోధించవలసి వచ్చేది. ఆ క్రమంలో తన దగ్గరికి వచ్చిన పరిశోధక విద్యార్థులకు కొన్ని తులనాత్మక సాహిత్యానికి సంబంధించిన పరిశోధనాంశాలను ఇచ్చేవారు. ఆ విధంగా తన దగ్గరికి వచ్చిన మొదటి పరిశోధక విద్యార్థి ఎం. జగన్నాథాచారికి "తిక్కన(తెలుగు), కుమారవ్యాసు(కన్నడం)ల భారతం – కథా కథన సౌందర్యం అనే విషయాన్ని పరిశోధనాంశంగా ఇచ్చారు. ఆ సమయంలోనే రాచపాళెం వారికి కన్నడ భాషతో కొంత పరిచయం ఏర్పడింది. అదేవిధంగా కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో జరిగిన సాహిత్య శిబిరంలో పాల్గొన్న రాచపాళెం వారికి విశ్వసాహిత్య భావన అనే దృష్టి కలిగినట్టు చెప్తారు. అయితే 'సాహిత్యాన్ని గురించి ఇతర భాషల వాళ్ళు ఏమనుకుంటున్నారో తెలుగు పాఠకులకు తెలపడమే' తన ఉద్దేశ్యం అని రాచపాళెం వారు తన తులనాత్మక సాహిత్య విమర్శ లక్ష్యాన్ని తెలియజేసారు. 1982 లో 'తిక్కన – విల్లి భారతాల'ను తులనాత్మకంగా

విమర్శించి ఒక వ్యాసం రాసారు. ఆ తరువాత *'భారత జాతీయోద్యమం – దాక్షిణాత్య సాహిత్యం'* అనే మరో వ్యాసాన్ని 1990 లో రాసారు. తెలుగు కన్నడ భాషల్లో చారిత్రక నవలలు అనే అంశాన్ని తీసుకుని తులనాత్మకంగా అధ్యయనం చేసారు రాచపాళెం వారి తొలిదశ సాహిత్య విమర్శలో సాహిత్యాన్ని కేవలం సాహిత్య ప్రమాణాలతో మాత్రమే ఉన్నది ఉన్నట్టుగా విశ్లేషించారు. ఆ తరువాతి దశలో అది సమాజ కేంద్రీకృతంగా కొనసాగిందని చెప్పవచ్చు. అయితే తులనాత్మక విమర్శ అంటే కేవలం పోల్చి చెప్పడం అనుకుంటే పొరబాటు. ఈ పోల్చి చూడ్డానికి వైజ్ఞానిక దృక్కోణం, అంతర దృష్టి, ఒక నిర్దిష్ట లక్ష్యం వుంటే అది తులనాత్మక విమర్శ అవుతుంది. పోల్చిచూడటం కంటే విస్తృతమైందీ లోతైనదీ అని అభిప్రాయ పడ్డారు శిఖామణి. పైన చెప్పిన లక్షణాలన్నీ సంపూర్ణంగా ఉన్నాయనీ చెప్పలేము గానీ కొంతవరకు రాచపాళెం వారి తులనాత్మక సాహిత్య విమర్శలో ఆ లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పవచ్చు.

## 3.23. రాచపాళెం సాహిత్య విమర్శ తొలిదశ – ముఖ్యాంశాలు

రాచపాళెం తొలిదశ సాహిత్య విమర్శలోని ముఖ్యాంశాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు.

1. రాచపాళెం వారు తొలిదశ సాహిత్య విమర్శ మొదట ప్రాచీన సాహిత్యం పై వెలువడింది. ఈ విభాగంలో ప్రాచీన కావ్యాలు, అందులోని అవతారికలు, శిల్ప నైపుణ్యం, రచనా పాటవం మొదలైన విషయాలను అధ్యయనం చేసారు.

2. కావ్యాల్లో, అవతారికల్లో, కావ్య మధ్య భాగాన చెప్పిన సాహిత్య సిద్ధాంత విషయాలను విశ్లేషించి, అలంకారికుల అభిప్రాయాలతో సమన్వయం చేశారు.

3. శిల్ప ప్రభావతి కావ్యంలో కేవలం ఆ కవి రాసిన కావ్య శిల్పాన్ని మాత్రమే నిరూపించే ప్రయత్నం చేయగా, "తెలుగు కవిత్వం – నన్నయ్యఒరవడి" అనే పుస్తకంలో నన్నయ్య

ప్రభావం ఇతర కవులపై ఏ విధంగా ప్రభావాన్ని చూపిందనే విషయాన్నీ పరిశోధించి నిరూపించారు.

4. రాచపాళెం వారు నన్నయ్యను 'ఒజ్జ' అని సంభోదించారు. ఒజ్జ అంటే గురువు, ఉపాధ్యాయుడు అనే అర్థాల్ని నిఘంటువులు సూచిస్తున్నాయి.

5. నన్నయ్య సాహిత్య రచనలో అవలంభించిన సూత్రాలు, విరచించిన పద్య గద్యాలు ఆ తరువాతి కవులకు శాశ్వత ప్రమాణాలుగా నిలుస్తాయని చెప్పారు. దీనిని సాహిత్య విమర్శ భేదాలలో 'సూత్ర విమర్శ'గా చెప్పుకోవచ్చు. ప్రాచీనాంధ్ర కవుల కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు మొదలైనవి సూత్ర విమర్శకు నెలవులుగా చెప్పుకోవచ్చు.

6. ఎన్.గోపి తంగెడుపూలు కావ్య విశ్లేషణతో మొదలైన ఆయన ఆధునిక సాహిత్య విమర్శ ప్రస్థానం క్రమేపి అనేక సాహిత్య ధోరణులు, పద్ధతులను స్పృశిస్తూ వస్తున్నది. ఆ విధంగా ఆయనను పలకరించిన సాహిత్య విమర్శ పద్దతి "కవి జీవిత విమర్శ". ఈ ధోరణి నుండి గురజాడ, గరిమెళ్ళ సత్యనారాయణ, శ్రీశ్రీ వంటి రచయితలపై విమర్శను రాసారు.

7. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు మధ్య గల అంతరాలను తెలియజేస్తూ "ఆధునిక కాలానికి సంబంధించిన ఫలానికంటే భిన్నమైనది ప్రాచీన కాల ఫలం. మనిషికి సంబంధించిన భౌతిక జగత్తు కంటే, అతడి అనుభవాన్ని స్పృశించే అంతర జగత్తుకు ప్రాధాన్యమిస్తుంది ప్రాచీన కాలం. ఇందుకు భిన్నంగా అంతర జగచ్చిత్రణను, అనుభవాన్ని అప్రధాన విషయాలుగా భావించి లౌకిక జగత్తుకు సంబంధించిన హితచింతనకు ప్రాధాన్యమిస్తుంది ఆధునిక కాలం" అని అన్నారు.

8. 1985 నాటికే రాచపాళెం ఆలోచనా విధానంలో మార్పులు వచ్చినట్టు ఆయన రచనలలోని దృక్పథాన్ని బట్టి తెలుస్తుంది. అప్పటికే ఆయన మీద మార్క్సిజం ప్రభావం పడినట్టుగా పరిశోధకులు గుర్తించారు. ఆయనలో సాంప్రదాయికవాదం నశించి హేతువాదం మొలకెత్తింది. చాటింపు సాహిత్యానికి స్వస్తి చెప్పి చారిత్రక దృక్పథానికి అలవాటు పడ్డారు.

9. రాచపాళెం సాహిత్య విమర్శ క్రమంగా పరిణామం చెందుతూ ఉన్న సమయంలో 'వస్తువు ఆధునిక సాహిత్యంలోనైతే సమాజానికి దగ్గరగానూ, ప్రాచీన సాహిత్యమైతే వాస్తవానికి దూరంగానూ ఉంటుందనే విషయాన్నీ గ్రహించారు.

10. ప్రాచీన కావ్య విశ్లేషణతో మొదలైన ఆయన విమర్శ ప్రస్థానం ప్రాపంచిక దృక్పథ అవగాహన వరకు పయనించింది. ఈ నేపథ్యంలో కవిత్వానికి సంబంధించిన మౌలికమైన ప్రతిపాదనలను చేసారు. తన కవిత్వ విమర్శకు మార్క్సిస్టు సాహిత్య విమర్శ దృక్పథంతో పునాదులు వేసాడు. పాశ్చాత్య మార్క్సిస్టు భావన మీద నిర్మాణమైన తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శతో ప్రాంతీయ కవిత్వాన్ని ఆ భావజాల దృక్పథం నుండి విశ్లేషించి దానిని ప్రాదేశికం చేసారు రాచపాళెం.

11. రాచపాళెం వారు, గురజాడ సాహిత్య అధ్యయన అనంతరం సాహిత్యాన్ని సమాజ జీవిత వాస్తవికతకు దగ్గరగా చూసే కొత్త సంస్కారాన్ని అలవరచుకున్నారు. ఈ నేపథ్యం నుండి గురజాడ తన సాహిత్యంలో అ భౌతిక కల్పనలకు సమాధిని కట్టడం ఆరంభించాడు. సాహిత్య సామాజికం కాకపోతే మరేదీ కాదన్నాడని, తన రచనల ద్వారా రచయితకుగల బాధ్యతను గుర్తుచేసాడనే వంటి విషయాలను అవగతం చేసుకున్నాడు.

12. తెలుగులో మార్క్సిస్టు సిద్ధాంతాల అన్వయవిమర్శకులుగా పేరుపొందిన త్రిపురనేని మధుసూదనరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య వంటి సరసన చేర్చదగిన మరొక గొప్ప నిబద్ధత కలిగిన సాహితీ విమర్శకులు రాచపాళెం. ఈ విధమైన భావజాల భూమిక *"చర్చ"*, *"మరో చర్చ"*, *"మన నవలలు – మన కథానికలు"* అనే విమర్శా గ్రంథాల్లో దర్శనమిస్తుంది. కాబట్టి ఆయన రాసేది మార్క్సిస్టు సిద్ధాంత అన్వయ విమర్శగానూ, ఆయనను మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగాను చెప్పవచ్చు.

13. సాహిత్యాన్ని కేవలం సాహిత్య ప్రమాణాలతో చూడవలసిన అవసరం ఉందా? లేదా? అనే అంశాలపై ఆయనకు ఒక కలిగిన స్థూలమైన అవగాహన నుండి సాహిత్య ప్రమాణాలతో మాత్రమే విమర్శించడం సమగ్రమైన పద్ధతి కాదని గ్రహించారు. ఈ నేపథ్యంలో అప్పటి

నుండి ఏ రచనను విమర్శించడానికి పూనుకున్నా ఆ రచనలో ఆనాటి సమకాలీన సమాజం వ్యక్తమవుతోందా, ఆ రచన వల్ల నాటి సామాజిక పరిస్థితులు తెలుస్తున్నాయా? సాహిత్యం సాంఘిక చరిత్రను నిర్మించడానికి చక్కని సాధనం కనక రచనలో ఆ కోణం నుండి పరిగణించాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అనేది తన విమర్శ ద్వారా చూడటం మొదలుపెట్టారు. ఈ విధమైనటువంటి సామాజిక దృక్పథం ఆయనకు మార్క్సిస్టు సిద్ధాంతాల పరిచయం కలిగిన తరువాతనే అలవడిందని చెప్పవచ్చు,

14. రాయలసీమకు చెందిన స్వామి రాసిన 'గద్దలాడతండాయి' చిలుకూరి దేవపుత్ర 'అద్దంలో చందమామ' సి. హెచ్ వెంకట రత్నం 'పల్లె పిలిచింది' వి. ఆర్. రాసాని 'చీకటి రాజ్యం' కేతు విశ్వనాథ రెడ్డి రచించిన 'వేర్లు', 'బోధి' మొదలైన నవలలను మార్క్సిస్టు దృక్పథం నుండి విమర్శించి పాశ్చాత్య మార్క్సిస్టు భావన మీద నిర్మాణమైన తెలుగు సాహిత్య విమర్శను రాచపాళెం ప్రాదేశికం చేశారు.

# అధ్యాయం-4

# అధ్యాయం 4

# ‘రాచపాళెం’ సాహిత్య విమర్శ – మలిదశ (2001–2017)

## 4.0. పరిచయం

ఎనిమిది దశాబ్దాలకు పైబడిన తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో అసంఖ్యాకంగా కవులు, రచయితలు, వేలకొద్ది ప్రసిద్ధ రచనలను, బహుళ విస్తృత సంఖ్యలో సాహితీ ప్రక్రియలను వెలువరించారు. ప్రాచీనకాలం నుంచి ఆధునిక కాలం వరకు సాగిన తెలుగు సాహిత్య విమర్శలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సమాజంలోనూ వ్యక్తుల ఆలోచనల్లోనూ వచ్చిన మార్పు దీనికి కారణం కావచ్చు. లక్షణ విమర్శగా పుట్టి, ప్రక్రియా విమర్శగా, ఉద్యమ విమర్శగా వికసించి, విస్తరించింది. ఈ విధమైన ఉద్యమ విమర్శే మార్క్సిస్టు సాహిత్య విమర్శకు బాసటగా నిలిచింది. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి సాహిత్య విమర్శ ప్రస్థానం మొదలై దాదాపుగా నాలుగు దశాబ్దాలైంది. ఈ కాలంలో ఆయన కలం నుండి వెలువడిన సాహిత్య విమర్శ అనేకమైన కీలక మార్పులకు గురైంది. ‘మార్పు’ అనే పదానికి సమానార్థకంగా ఇక్కడ ‘పరిణామం’ అనే పదాన్ని ఉపయోగిస్తున్నాం. ఈ పరిణామం ఆవిర్భావంలో పాక్షికంగానే కనిపించినా కాలక్రమంలో అది పరిణతి చెందుతుంది. సరిగ్గా ఆ విధమైన పరిణతి రాచపాళెంవారి సాహిత్య విమర్శలో కనిపిస్తుంది. తనదైన మార్క్సిస్టు సిద్ధాంతంపై ఆయనకున్న స్పష్టమైన అవగాహన దీనిని తెలియజేస్తుంది.

మార్క్సిజంపై ఒక స్పష్టమైన అవగాహన కలిగి, నిబద్ధతతో దానిని తెలుగు సాహిత్యానికి సమన్వయం, సైద్ధాంతీకరణ చేయడంలో రాచపాళెం ఏరోజూ రాజీపడినట్టుగా కనిపించడం లేదు. మొత్తం తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో సగభాగం ఆయన వాటా ఉందంటే అతిశయోక్తి కాదు. నా పరిశోధనాంశంలో ఆయన సాహిత్య

విమర్శ మొత్తాన్ని చారిత్రక అధ్యయన దృష్టితో పరిశీలించడానికి ప్రయత్నించాను. ఈ క్రమంలో ఎన్నో మార్పులును నేను ఆయన సాహిత్య విమర్శలో కనుగొన్నాను. ఆ విధంగా మూడో అధ్యాయాన్ని (1972-2000) వరకు కాలక్రమంలో ఆయన సాహిత్య విమర్శలో ఏ విధమైన పరిణామాలు చోటుచేసుకున్నాయో తెలుసుకున్నాను. అయితే పరిణామాలు తరువాతి కాలంలో ఏవిధమైన వికాసాన్ని పొందాయో వాటిని వివరిస్తాను. ఈ అధ్యాయంలోకి వెళ్ళడానికంటే ముందుగా ఇంతకు ముందు అధ్యాయంలోని అంశాల వల్ల ఆయన సాహిత్య విమర్శలోని లక్షణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది.

## 4.1. రాచపాళెం సాహిత్య విమర్శ – లక్షణాలు

రాచపాళెంసాహిత్య విమర్శ తొలిదశలో చేసిన పరిశోధన వల్ల ఆయన సాహిత్య విమర్శలో ప్రధానంగా నాలుగు లక్షణాలు ఉన్నట్టు తెలుస్తుంది.

1. విశ్లేషణ,

2. అభినందన,

3. బేరీజు

4. అభిప్రాయ వ్యక్తీకరణ.

ఈ నాలుగు లక్షణాలు ఆయన సాహిత్య విమర్శలోని ప్రత్యేకతను తెలుసుకోడానికి దోహదం చేస్తాయి. అటువంటి విశిష్టమైన లక్షణాలను కలిగి ఉన్న ఆయన సాహిత్య విమర్శకు నాలుగు దశాబ్దాలకు పైబడిన చరిత్ర, అనుభవం ఉంది. ఆ చరిత్ర తొలినాళ్ళలో *'ప్రాచీన తెలుగు సాహిత్యం శాస్త్రీయతతో నిండి సృజియింపబడిందనే'* అభిప్రాయంతో పురుడు పోసుకుంది. అయితే ఆదిలో అది పూర్తి విమర్శ రూపాన్ని సంతరించుకోలేదనే చెప్పాలి. మొదట్లో అది ధ్వని, వ్యంగ్య, ఔచిత్య, వాచ్య, వక్రోక్తి, స్వభావోక్తి, శిల్పంలాంటి రూపాల్లో మాత్రమే ఉండేది. ఆయన తొలిరోజుల్లో విమర్శ, కళాపూర్ణోదయం, శిల్పప్రభావతి, ఆంధ్ర మహాభారతం లాంటి గ్రంథాలపై వ్యాఖ్యాన రూపంలో ఉండేది.

సాహిత్యాన్ని విశ్లేషించి మూల్యంకనం చేసే ప్రయత్నాలు తొలినాళ్ళలో జరగలేదని చెప్పాలి. మార్క్సిస్టు సిద్ధాంతంపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చిన తరువాత, ఆయనకున్న సాహిత్య సిద్ధాంతమైన "నిబద్దత" కాలక్రమంలో నిలదొక్కుకున్న తరువాత రాచపాళెం సాహిత్య విమర్శలో పెనుమార్పులు సంభవించాయి.

## 4.2. ప్రాచీన సాహిత్య విమర్శ

రాచపాళెం తన విమర్శ రచన తొలిదశలో నన్నయపై *"తెలుగు కవిత్వం నన్నయ్య ఒరవడి"* అనే విమర్శా గ్రంథాన్ని వెలువరించారు. ఇక్కడ 'ఒరవడి' అనే పదబంధం 'మార్గనిర్దేశనం' అనే అర్థాన్ని స్ఫురిపజేస్తుంది. దీన్నే తొలినాళ్ళలో నన్నయ్యపై రాచపాళెంవారికున్న అభిప్రాయంగా చెప్పవచ్చు. అయితే *"కచుడా ఆదర్శం?"* అనే వ్యాసంలో మాత్రం ఈ నిర్ణయాన్ని మరొకసారి మూల్యాంకనం(Evaluate) చేసే ప్రయత్నం చేశారు. అంతవరకూ సాహిత్యాన్ని కేవలం సాహిత్యంగానే చూడాలనే నిశ్చితాభిప్రాయంతో ఉన్న రాచపాళెం ఆతరువాత సాహిత్యాన్ని సాంఘిక, ఆర్థిక, రాజకీయాది మొదలైన సాహిత్యేతరదృష్టితో చూడటం మొదలుపెట్టారు. ఈక్రమంలో నన్నయ్య భారతంలోని కచునివృత్తాంతాన్ని విశ్లేషించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యామండలివారు 2003 – 2004 విద్యా సంవత్సరానికిగానూ *'సాహితీ సౌరభం'* పేరుతో తెలుగు వాచకాన్ని మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ప్రచురించారు. ఈ వాచకంలో 'విద్యా సముపార్జన' పేరుతో ఒక పాఠ్యాంశాన్ని చేర్చారు. ఈ పాఠ్యాంశంలో కచుని వృత్తాంతం ప్రధానమైనది. అయితే ఈ వృత్తాంతం ప్రయోజనాత్మకమా? ఒకవేళ అయితే ఆ ప్రయోజనం ఎలాంటిది? అనే ప్రశ్నలను లేవదీశారు. ఈ విధమైన ఆలోచన ఆయనకున్న సాహిత్య మూల్యాంకన దృష్టి నుండి అలవడిందని చెప్పవచ్చు. పైవిధంగా సాహిత్యాన్ని సామాజిక నేపథ్యం నుండి చూడటం మొదలుపెట్టిన రాచపాళెం క్రమేపి సంప్రదాయాన్ని తిరస్కరించడం మొదలుపెట్టారు. అంతేగాక దానిని పునర్మూల్యాంకనం చేసే ప్రయత్నం చేశారు. ఈ

క్రమంలో అప్పటికే తనదైన మార్క్సిస్టు సిద్ధాంతం పై ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్న ఆయనకు 'బౌద్ధం' ఒక గొప్ప జీవనవిధానంగా తోచింది. బౌద్ధమత లక్షణాలైన శాంతి, అహింస, జీవకారుణ్యం, విశ్వమానవ ప్రేమ మొదలైనవి రాచపాళెంవారిని విశేషంగా ఆకర్షించాయి. అందుకే భారతదేశంలో అమలులో ఉన్న వర్ణవ్యవస్థకు భిన్నంగా సామాజిక గౌరవమూ, సామాజిక న్యాయమూ గల ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను బౌద్ధం ప్రతిపాదించిందని అన్నారు. అటువంటి ఆలోచన నుండి తెలుగులో బౌద్ధమత నేపథ్యంతో వచ్చిన కావ్యాలను కూడా ఆయన విశ్లేషించారు.

## 4.3 ఆధునిక సాహిత్య విమర్శ

### 4.3.1 ఆధునిక తెలుగు కవిత్వం – ప్రాపంచిక దృక్పథం

అర్థాన్ని కప్పి ఉంచి చేసే రచనను 'కవిత్వం' అని వ్యవహరిస్తున్నాం. ఇక్కడ కవిత్వం అంటే ఆధునిక కవిత్వం అని అర్థం చేసుకోవాలి. సైద్ధాంతికంగా (Theoretical) ఇలా అంటున్నా ప్రయోగంలో(Practical) ఈ పదం ఇంకా విస్తృతార్థంలో కనబడుతుంది. ఉదాహరణకు– కాదేదీ కవితకనర్హం అంటూ చెప్పిన మహాకవి శ్రీశ్రీ ఆధునిక కవిత్వం అర్థం కాలేదంటే, ఆధునిక జీవితం అర్థం కాలేదన్న మాటే అని 'ఆధునిక కవిత్వం' గురించి మరింత స్పష్టత నిచ్చాడు. కాబట్టి ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ పాఠకుడికి ఉంది. అయితే దానిని మరింత లోతుగా విశ్లేషించవలసిన బాధ్యత విమర్శకులకు ఉందని చెప్పవచ్చు.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు రాసిన సాహిత్య విమర్శలో ఎక్కువ భాగం కవిత్వం పైనే రాసారు. అలా రాసిన కవిత్వ విమర్శ తొలిదశలో కేవలం కొన్ని మౌలికమైన సూత్రీకరణలకే పరిమితమై కాలక్రమంలో అదొక సైద్ధాంతికరూపాన్ని సంతరించుకుంది. ఆక్రమంలో *"ఆధునికాంధ్ర కవిత్వం – ఉద్యమాలు, సందర్భాలు(2002)"* తరువాత అచ్చయిన మరో పుస్తకం *"కొన్ని కావ్యాలు– కొందరు కవులు(2008)"* ఈగ్రంథంలో కొన్ని వ్యాసాలు కవిత్వ విమర్శకు సంబంధించినవి. ఈ

పుస్తకంలోని కొన్ని వ్యాసాలను తొలిదశలో భాగంగా విశ్లేషించాను. ఈ అధ్యాయంలో మరికొన్నింటిని విశ్లేషించే ప్రయత్నం చేస్తాను. ఇందులోని వ్యాసాలు రాచపాళెంవారు కొన్ని కవిత్వ సంపుటులకు రాసిన ముందుమాటలు కాగా మిగిలినవి నాలుగు వ్యాసాలున్నాయి. ఈ మిగిలిన వ్యాసాలలో రచయితకు ఉండాల్సిన 'ప్రాపంచిక దృక్పథాన్ని' వివరించారు. గురజాడపై రాసిన విమర్శతో మొదలైన రాచపాళెంవారి ఆధునికతా దృష్టి కాలక్రమంలో అది 'ప్రాపంచిక దృక్పథం'గా రూపాంతరం చెందింది. విమర్శ అంటే శిల్పం చుట్టూ తిరిగే అలంకారిక శైలిని కాదని, సాహిత్య వస్తువే విమర్శకు భూమికగా ఉండాలని రాచపాళెం ఇంతకుముందే నిర్ణయించినట్లు నిర్ధారించాను. అయితే సాహిత్యంలోని శిల్పాన్ని నిరాకరించడం ఆయన సిద్ధాంతం కాదు, సాహిత్యంలోని వస్తువును ఆశ్రయించిన శిల్పాన్నే ఆయన తన సిద్ధాంతంగా మలచుకున్నట్లు తెలుస్తుంది. దీనినే 'ప్రాపంచిక దృక్పథం'గా చెప్పవచ్చు. దీనినే సంప్రదాయవాదులు కాలస్పృహ  అంటారు. కాలక్రమంలో ఈ ప్రాపంచిక దృక్పథంలో కొన్ని మార్పులు సంభవించవచ్చు.

ఈ ప్రాపంచిక దృక్పథం గురించి అనేకమంది తత్వవేత్తలు చర్చించారు. కార్ల్‌మార్క్స్ ఈ ప్రాపంచిక దృక్పథానికి ఒక శాస్త్రీయ వివరణను ఇచ్చారు. ఈ ప్రాపంచిక దృక్పథాన్ని జర్మన్ భాషలో weltanschauung అని, ఇంగ్లీష్‌లో world view అని పిలుస్తారు. మార్క్స్, ఏంగెల్స్ లు ఈ భావనను The German Ideology, Grundrisse గ్రంథాలలో వివరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అధికారవర్గ భావజాలమే రాజ్యమేలుతుంది. ప్రభుత్వం, కోర్టులు, విద్యాలయాలు, ప్రసార మాధ్యమాలు, పత్రికలు, పుస్తకాలు తదితరాల ద్వారా ప్రజాబాహుళ్యం యొక్క మనసుల్లో ఈ పెట్టుబడిదారీ వ్యస్థకు వేరే ప్రత్యామ్నాయం లేదని, అన్ని ఆర్థిక సామాజిక వ్యవస్థల కంటే ఇదే ఉన్నతమైనదని ప్రజలు నమ్మేటట్టుగా చేస్తారు. దీనిని ఎదిరించడం అసాధ్యం అనే భావనను కలగచేస్తారు. దీనినే ఇటాలియన్ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త ఆంటోనియో గ్రామ్చి(Antonio Gramsci) 'మానసిక ఆధిపత్యం (hegemony)' అని పిలిచారు. అంతకు ముందు మార్క్స్, లెనిన్‌లు ఈ విషయాన్ని ప్రస్తావించినా, ఈ భావనకు సైద్ధాంతిక భాష్యం చెప్పినది గ్రామ్చినే.

ఎందుకంటే గ్రామ్చి కాలం నాటికి (1920-30 దశకాలు) రేడియో, వార్తా పత్రికలు, సినిమాలు ప్రజాబాహుళ్యం ఆలోచనా విధానంపై ప్రభావం చూపించటం ప్రారంభం అయ్యింది. సరిగ్గా ఇలాంటి భావననే రాచపాళెంవారు ఇవాళ కవిత్వం రాసే కవి తనకొక సామాజిక బాధ్యత ఉన్నదని భావించే కవి ఎవరైనా సరే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వ్యవస్థను వ్యతిరేకించకుండా ఉండలేడు. ఎందుకంటే అది ప్రజావ్యతిరేక వ్యవస్థ అని అడిగోపుల వెంకటరత్నం రాసిన కవిత్వాన్ని విశ్లేషించిన సందర్భంలో అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఆయన కవిత్వంలోని ప్రాపంచిక దృక్పథాన్ని గుర్తించిన రాచపాళెంవారు ఆయన కవిత్వ వస్తువు వర్తమాన జీవిత వాస్తవికత. అతను కోరేది నవసమాజం. మరో ప్రపంచం, అతనిది శ్రామిక పక్షపాతం, అతని లక్ష్యం సామాజిక చైతన్యం అని పేర్కొన్నారు. "రచయిత యొక్క సాహిత్య వ్యాసంగాన్ని పరిశీలించినప్పుడు కాలంలో కారుడు కట్టుకుపోయే చారిత్రక బంధాల నుంచి మనిషికి విముక్తి కలిగించే చైతన్య స్ఫురణ, ప్రేరణ, స్పృహ సృజనాత్మక రచనలో వ్యంగ్యంగా అభివ్యక్తం అయితే దాన్ని సాహిత్యంలో సాహిత్యంలో 'సామాజిక స్పృహ'గా గుర్తించదమౌతుందని"[1] ఆర్. ఎస్.సుదర్శనం గారు అంటున్నారు. అయితే ఇదే అంశాన్ని *"జాషువా స్వప్నం – సందేశం"* అనే మరో వ్యాసంలో ప్రస్తావిస్తూ రచయితలకు ఒక సామాజిక స్వప్నం ఉంటుందని పేర్కొంటూ సామాజిక బాధ్యతతో రచన చేసే ఏ రచయితకైనా నాలుగు ప్రశ్నలెదురౌతాయని చెప్తూ వాటిని ఈ విధంగా పేర్కొన్నారు. అవి 1) తాను నివసిస్తున్న సమాజం ఎలా ఉంది? 2) అది అలా ఉండటానికి కారణాలేమిటి? 3) సమాజం ఎలా ఉండాలి? 4) ఆ సమాజం ఎలా ఏర్పడుతుంది? ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానమే 'ప్రాపంచిక దృక్పథం' అని చెప్పవచ్చు. దీనినే రచయితకు గల స్వప్నంగానూ, సందేశంగానూ చెప్పవచ్చని రాచపాళెంవారు నిర్ధారించారు. ప్రపంచీకరణ ప్రభావంతో రైతు ఏ విధంగా నష్టపోతున్నాడో *'గ్లోబల్ నేపథ్యంలో రైతు కవిత'* అనే వ్యాసంలో వివరించారు. రాచపాళెంవారి కవిత్వ విమర్శను స్థూలంగా పరిశీలించినట్లయితే సామాజిక పరివర్తనే ఆధునిక తెలుగు కవిత్వమనే

[1] 'నేటి సాహిత్యం – సామాజిక స్పృహ' – సమాలోచనం', పుట. 5

అభిప్రాయం వెల్లడవుతుంది. కాబట్టి ఆ విధమైన సామాజిక పరివర్తన నేపథ్యం నుండే రాచపాళెం ఆధునిక కవిత్వ విమర్శ చేసినట్టుగా తెలుస్తుంది.

### 4.3.2. అస్తిత్వ ఉద్యమ కవిత్వం – పరిశీలన

రాచపాళెం విమర్శ గ్రంథాలన్నింటిని అధ్యయనం చేస్తే మౌలికంగా ఆయన మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడని అర్థమౌతుంది. అదే సమయంలో పిడివాదానికి పోకుండా ప్రజాతంత్ర స్వభావం గల ఇతర భావజాలాల, ఉద్యమాల సాహిత్యాన్ని కూడా ఆలింగనం చేసుకుంటారని కూడా స్పష్టమౌతుంది. మార్క్సిస్టు భావజాలం కలిగిన రాచపాళెం దళిత, బహుజన, ప్రాంతీయ, అస్తిత్వ మొదలైన వాదాల సాహిత్యం మీద కూడా విమర్శ రాశారు. అయితే ముస్లింవాద కవిత్వాన్ని ఇంకా జీర్ణం చేసుకునే ప్రయత్నంలోనే ఉన్నట్టు తెలుస్తుంది. వర్గసమాజంలో భావజాలాలు, ఉద్యమాలు, వాటి సాహిత్యమూ వర్గీకరింపబడి ఉంటుందనే అవగాహన రాచపాళెంకి ఉంది. మిత్రవైరుధ్యం గల పురోగమన ఉద్యమాల, భావజాలాల సాహిత్యాలను గౌరవించడం సాహిత్య అధ్యయనంలో ఒక ప్రజాస్వామిక ఆచరణ. రాచపాళెంకి ప్రాపంచిక దృక్పథం, నిబద్ధత రెండు కళ్ళు. ప్రజాపక్షం ఆయనకు గుండెకాయ. సామాజిక స్పృహ ఆయన సాహిత్య విమర్శ సిద్ధాంతంలో ప్రధానాంశంగా ఉంటుంది. "'సామాజిక స్పృహ' మార్క్స్ దర్శనం ఆధారంగా వామపక్ష రాజకీయవాదులు అభ్యుదయ సాహిత్యోద్యమ సందర్భంగా సాహిత్య రంగంలో ప్రవేశపెట్టిన ప్రత్యయం(concept)"[2] అని ఆర్ యస్ సుదర్శనం గారన్నారు. *'ప్రతిఫలనం(2014)'* అనే కవిత్వ విమర్శ గ్రంథంలో అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీ, బహుజన, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ కవితల మీద వచ్చిన వ్యాసాలున్నాయి. పై ఉద్యమాలలో వచ్చిన ఆధునిక తెలుగు కవిత్వాన్ని రాచపాళెం పరామర్శించారు. ఈ పుస్తకంలో మొత్తం 25 వ్యాసాలున్నాయి.

రాచపాళెం మొదట ప్రాచీన సాహిత్యంపై సాహిత్య విమర్శ రాసారు. ఆ తర్వాత అది విప్లవోద్యమాలుగా విడివడి, అస్తిత్వ ఉద్యమాలుగా నిలదొక్కుకున్న స్త్రీవాద, దళితవాద

---

[2] 'నేటి సాహిత్యం – సామాజిక స్పృహ' - సమాలోచనం, పుట 1

సాహిత్య ఉద్యమాలుగా రూపుదిద్దుకుంది. సృజనాత్మక ప్రక్రియల్లోనూ, విమర్శలోనూ కొత్తపోకడలు ప్రారంభమయ్యాయి. ఇది ప్రధానంగా కవిత్వంపై వచ్చిన విమర్శకు సమాధానంగా ప్రారంభమైంది. ప్రశ్నించడమే ప్రధాన లక్షణంగా వెలువడిన ఆధునిక సాహిత్యం తొలి రోజుల్లో మూఢ విశ్వాసాలను ప్రశ్నించింది. ఆ తరువాత పరాయిపాలనను ప్రశ్నించింది. ఆ తరువాత లైంగిక వివక్షను, కుల వివక్షను ప్రశ్నించింది. ఈ ప్రశ్నలన్నింటికి వచ్చిన సమాధానంగా వచ్చిన వ్యాసాలు క్రమంగా అస్తిత్వ ఉద్యమ విమర్శకు రూపురేఖలను అందించాయి.

మార్క్సిస్టువిమర్శలో వర్గం ప్రాతిపదికగా జరిగిన విమర్శ లోపభూయిష్ఠమైనదనీ, జండర్, కులం అన్నవాటిని పట్టించుకోని విమర్శ సమగ్రం కాదనీ, జీవితాన్ని కేవలం వర్గ దృక్పథంతో చూడకూడదనీ, సమాజంలో అసమానతలకు డబ్బు ఒక్కటే కారణం కాదు; జెండర్, కులం మరింత ముఖ్య కారణాలవుతున్నాయనీ, వీటిని ప్రతిబింబించేదే అసలైన సాహిత్యమనీ ఈ విమర్శకుల వాదన. కాబట్టి అటువంటి విమర్శలకు తావివ్వకుండా రాచపాళెంవారు అస్తిత్వ ఉద్యమవాద నేపథ్యంతో వచ్చిన ఆధునిక కవిత్వాన్ని విమర్శించారు. ఈ దృక్పథాల నుంచి వెలువడిన విమర్శ రెండు విధాలుగా ఉంది.

1)ఆధునిక కవులు సృష్టించిన కవిత్వానికి ఒక సిద్ధాంతభూమికను అందించడం,

2) ప్రాచీనకాలం సాహిత్యాన్ని ఆధునిక దృష్టికోణం నుండి విశ్లేషించి, మూల్యాంకనం చేయడం.

అయితే ఈ *"ప్రతిఫలనం"* అనే పుస్తకంలోని వ్యాసాలన్నీ కూడా మొదటి రకానికి సంబంధించినవని చెప్పవచ్చు. వాటిలో కొన్నింటిని ప్రాంతీయ అస్తిత్వవాద నేపథ్యం నుండి విమర్శించారు. ఈ క్రమంలో స్థానికతలో నుండి విశ్వజనీనతలోకి ప్రయాణించడం రచయితలకు అనివార్యం అని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమకు చెందిన ఆధునిక కవులను దృష్టిలో పెట్టుకొని ఈ అభిప్రాయాన్ని చెప్పినట్టుగా తెలుస్తుంది. ప్రాంతీయ అస్తిత్వ

ఉద్యమ నేపథ్యంలో కవిత్వం రాసిన మల్లెల నరసింహ మూర్తి, రాధేయ, రాజారాం మొదలైన వారి కవిత్వానికి ఒక సైద్ధాంతిక భూమికను ఏర్పరిచారు.

వర్గసమాజాన్ని వ్యతిరేకించే వామపక్ష ఉద్యమ నేపథ్యంతో సమసమాజాన్ని కాంక్షించే వారిగా వేమన, గురజాడ, జాషువా, శ్రీశ్రీ లను పేర్కొన్నారు. అయితే గురజాడ కంటే ముందుగానే ఆకలిగొన్న డొక్కలను అమ్మగా ఆదరించి నిమిరి అన్నంపెట్టి పంపే ఉద్యమాన్ని ఒంటి చేతి మీదుగా నిర్వహించిన గొప్ప భారతీయ మహిళ డొక్కా సీతమ్మ అని అభివర్ణిస్తూ ఈమె జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని ఎమ్మెస్ సూర్యనారాయణ "దయా మేఘ మల్హరి'' అనే కావ్యాన్ని రచించిన తీరును విశ్లేషించారు. ప్రముఖ దళిత రచయిత్రి చల్లపల్లి స్వరూప రాణి తన కవిత్వం ద్వారా కులం కోణం నుంచి, సాంఘిక కోణం నుంచి అలోచించి ఆమె రాసిన కవిత్వాన్ని అధ్యయనం చేయాలని రాచపాళెం వివరించారు. దళితులైన స్త్రీలు తాము ఎదుర్కొనే రెండింతల వివక్షతను సమగ్రంగా తన కవిత్వం ద్వారా అందివ్వగాలిగారని రాచపాళెం విశ్లేషించారు. దళితస్త్రీ ఒకవైపు కులం నుంచి, మరో వైపు జండర్ నుంచి సమస్యలు ఎదుర్కొంటున్న దృశ్యాన్ని ఆవిష్కరించినట్టుగా అభిప్రాయపడ్డారు. శ్రామిక దళిత స్త్రీ దృష్టితో స్వరూప రాణి కులవివక్ష, లైంగిక దౌర్జన్యాలతో పాటు శ్రమ దోపిడిని కూడా గుర్తించి కవిత్వీకరించినట్టుగా పేర్కొన్నారు. ఇదే వరుసలో మరొక దళిత రచయిత్రి జూపాక సుభద్ర. ఈమె రాసిన 'అయ్యయ్యో దమ్మక్కా' కావ్యాన్ని విశ్లేషించే క్రమంలో దళిత సాహిత్యంలో కలుపులేని మొక్క 'అయ్యయ్యో దమ్మక్కా'(2012) అనే వ్యాసాన్ని రాసారు రాచపాళెం. సొంతజీవితాన్ని కవితా వస్తువుగా తీసుకోవడం దళిత సాహిత్యోద్యమం ముమ్మరంగా ఉన్నరోజుల్లో విశేషం కాకపోయినా సొంత భావుకతతో, సొంతభాషలో పాఠకుడిని నిలబెట్టి చదివించే గుణం సుభద్ర గారి కవిత్వంలో ఉన్నట్టు రాచపాళెం గుర్తించారు. ఈకావ్యంలో ఆమె స్వీకరించిన వస్తువు దానిపట్ల ఆమె ప్రదర్శించిన భావుకత కొలకలూరి ఇనాక్ గారి సాహిత్య విమర్శలోని ప్రధాన లక్షణాలైన నిబద్ధత, నిమగ్నత, నిబిడతలు ముప్పేటగా ముడివేసుకున్న ఉత్తమ కావ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఈ కావ్యాన్ని దళిత కోణం నుండి వ్యవసాయ సంక్షోభం,

పల్లెల విధ్వంసం, అత్యాచారాలు మొదలైన వాటిని విశ్లేషించారు. అయితే నా చుట్టూ ఉన్న అణచి వేతలు, వివక్ష, సంతోషం, దు:ఖానికి అద్దం.. నా కవితల సంపుటి 'అయ్యయ్యో దమ్మక్క'. ఎన్నో తరాలుగా నా తల్లులు పడ్డ తండ్లాట ఉంది. మాదిగ మహిళలు డప్పును రూపొందిస్తే.. ఆ డప్పును కొట్టే అధికారాన్ని మగవాళ్లు దక్కించుకున్నారు. దాన్ని వాయించుకుంటూ పాడే సంతోషానికి మహిళలను దూరం చేసిన మాదిగ మగ వివక్ష మీద రాసిన కవిత *'అయ్యయ్యో దమ్మక్క'* అని రచయిత్రి చెప్పిన మాటలను రాచపాళెంవారు ఈ వ్యాసంలో ఎక్కడా ఉదాహరించలేదు. వ్యాసానికి ఉన్న పరిమితి దానికి కారణం కావచ్చు.

ఈ రెండు విమర్శ దృక్పథాలు ప్రధానంగా వస్తుదృష్టితోనే చేసినట్టుగా తెలుస్తుంది. సాహిత్యాన్ని భాషాదృష్టితో కూడ చూడడం, ఇంతవరకూ వచ్చిన సాహిత్యంలో పురుషుల రచనల్లో స్త్రీల పరంగా కనిపించే అసమదృష్టి వస్తు రూపంలోనూ, భాషా రూపంలోనూ ఎలా ఉన్నదీ స్త్రీవాదం ఎత్తి చూపితే, అగ్రకులాల సాహిత్యంలో వస్తువు, భాషల పరంగా దళితుల పట్ల ఉన్న అసమదృష్టిని దళిత వాదం ఎండగట్టింది.

దళిత సాహిత్యం అనతికాలంలోనే ఎంత వేగాన్ని అందిపుచ్చుకుందో అంతే వేగంగా దళిత సాహిత్య విమర్శ కూడా వచ్చింది. వెనుకబాటు తనం, అంటరానితనం దీనికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఇలాంటి  దళితుల బాధల నుండి వెలువడిన కవితా ధోరణులు కొందరి కవుల ద్వారా మత విశ్వాసాలపై గురిపెట్టడం, అగ్రవర్ణాలపై విమర్శాత్మక రచనలుగా పరిణామం చెందటంగా చెప్పుకోవచ్చు. పాఠకులుగా మొదలైన దళితులు తరువాతి కాలంలో కవులు రచయితలూ అయ్యారు. అన్నీ సాహిత్యాలకు ఒక సిద్ధాంతం ఉన్నట్లే దళిత సాహిత్యానికి కూడా ఒక సిద్ధాంతం ఉంది. అదే అంబేద్కరిజం. 'మార్క్సిజం' వర్గాన్ని పట్టించుకున్నట్లే 'అంబేద్కరిజం' వర్ణాన్ని పట్టించుకుంటుంది. మార్క్సిజం వర్గ దృష్టితో సమాజాన్ని చూస్తే అంబేద్కరిజం వర్గదృష్టితో పాటు వర్ణదృష్టికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది.

దళిత సాహిత్యంతో పాటు, దళిత సాహిత్య విమర్శను కూడా రాస్తూ ఈ సాహిత్యం దినదినాభివృద్ధి చెందటానికి కారణమైన అనేకమంది రచయితలున్నారు. వారిలో కొలకలూరి ఇనాక్, జి. లక్ష్మీనరసయ్య, కత్తి పద్మారావు, బొజ్జాతారకం, దార్ల వెంకటేశ్వరరావు లను ముఖ్యులుగా పేర్కొనవచ్చు. వీరిలో కత్తి పద్మారావు గారి కవిత్వ తత్వాన్ని, ఆ కవిత్వంలోని జీవిత తత్వాన్ని నిరూపిస్తూ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు 'కవిత్వ తత్వవేత్త: కత్తి పద్మారావు', 'జీవిత తత్వవేత్త : కత్తి పద్మారావు' అనే రెండు వ్యాసాలను రాసారు. ఈ వ్యాసాలలో కత్తి పద్మారావు రచించిన *ముళ్ళకిరీటం(2002), భూమిభాష(2004), కట్టెలమోపు(2007), ఆత్మగౌరవ స్వరం(2010)* కవిత్వ సంపుటాలను అధ్యయనం చేసి కవిత్వ దృక్పథాన్ని బహిర్గతం చేశారు. కారంచేడు, చుండూరు సంఘటనలతో ఆయన కుల ఉద్యమానికి నాయకత్వం వహించారు. కుల వ్యవస్థ విశ్లేషణకు, దాని నిర్మూలనకు, కుల రహిత సమాజ నిర్మాణానికి అవసరమైన జ్ఞానాన్ని అందించడానికి ఆయన ఆ విధమైన సామాజిక కోణం నుండి విస్తృతమైన రచనలు చేశారు. అందుకే దళిత సాహిత్య విమర్శను విశ్లేషించే క్రమంలో సాహిత్యం రెండు రకాలుగా ఉత్పత్తి అవుతుందని రాచపాళెం అంటారు. అది అనుభవంలోంచి, పరిశీలనలోంచి, అవసరమైతే మూడో దాన్ని కూడా గుర్తించవచ్చని తెలిపి దానిని 'ఊహలోంచి' అని పేర్కొని అది పూర్తిగా నిరాదరింపదగినదిగా పేర్కొన్నారు. మొదటి రెండూ ఆదరింపదగినవిగాను, అనుభవంలోంచి రాసే దాంట్లో విశ్వసనీయత సమగ్రంగా ఉంటుందని దీనికి కారణం కొలకలూరి ఇనాక్ గారి 'నిబిడత' అనే విమర్శా సూత్రం అని నిర్వచించారు. అయితే పరిశీలనలోంచి రాసే దాని గురించి పేర్కొంటూ పరిశీలించి రాసేది ఒక సామాజిక నిబద్ధతలోంచి పుడుతుందని పేర్కొన్నారు. పీడితులు, బాధితులు తమను గురించి తామేమనుకుంటున్నారో చెప్పడమే 'అనుభవ వాదం' అని చెప్పి కత్తి పద్మారావు గారు ఈ అనుభవ వాదాన్ని తన కవిత్వ సిద్ధాంతంగా రూపొందించారని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా కత్తి పద్మారావు కవిత్వంలో 'జీవితతాత్వీకరణ' లక్షణం అనేక కవితల్లో కనిపిస్తుందన్నారు. బౌద్ధాన్ని, అంబేద్కరిజాన్ని తాత్విక నేపథ్యంగా చేసుకున్న పద్మారావు

సామాజిక పరిణామాలను ఆవిష్కరిస్తూ వ్యాఖ్యానిస్తూ వాటి సారాంశంగా జీవితమంటే ఏమిటో క్లుప్తంగా నిర్వచించారని తెలిపారు. అస్తిత్వ ఉద్యమ సాహిత్యాల్లో స్వాతంత్రోద్యమ సాహిత్యం ప్రధానమైనది. ఈ ఉద్యమ నేపథ్యమే మిగిలిన అస్తిత్వ ఉద్యమాలకు బాసటగా నిలిచింది. ఈక్రమంలో కాళోజి నారాయణరావు గారి పై వ్యాసాన్ని రాస్తూ స్వాతంత్రోద్యమ కవిత్వ చరిత్రలో కాళోజికి ఇవ్వాల్సినంత స్థానం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి కారణం కోసం అన్వేషించే క్రమంలో స్వాతంత్రోద్యమ కవిత్వం పరిమితంగానే రాయడమే ఇందుకు కారణమని తెలిపారు[3]. పైన వివరించిన విధంగా అస్తిత్వ సాహిత్యాన్ని తనదైన విశ్లేషణతో రాచపాళెంచంద్రశేఖర రెడ్డి గారు విమర్శించారు .

## 4.3.3. విప్లవ సాహిత్యం – మౌలికత

విప్లవ కవిత్వం, విప్లవ సాహిత్యం అనే పదాలకు స్పష్టమైన నిర్వచనం ఇవ్వడం కష్టం. ఎందుకంటే విప్లవోద్యమ చరిత్రను ప్రతిఫలిస్తూ, విప్లవ భావాలను ప్రచారం చేస్తూ, విప్లవాన్ని సమర్థిస్తూ, రాసే సాహిత్యం విప్లవ సాహిత్యం. ఆ నేపథ్యంగా రాసే కవిత్వాన్ని విప్లవ కవిత్వం అంటారు. మరి విప్లవం అంటే ఏమిటి అంటే? ప్రస్తుతం ఉన్న సామాజిక ధర్మాన్ని కాదని కొత్త నియమాలను స్థాపించడానికి జరిగే క్రియారూపం. అసమానతావ్యవస్థను నశింపజేసి సమానతా ధర్మస్థాపన చేయడం విప్లవం. తెలుగు ప్రాంతాలకు చెందిన విప్లవ కవుల్లో కాళోజి నారాయణరావు నిఖిలేశ్వర్, చెరబండరాజు, గద్దర్, వరవరరావు, కె శివారెడ్డి, అలిశెట్టి ప్రభాకర్, గద్దర్, విజయచంద్రలను ముఖ్యులుగా చెప్పుకోవచ్చు. పైన చెప్పినట్టుగానే విప్లవ సాహిత్య స్వభావాన్ని రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు ప్రజా యుద్ధ నౌకగా పేరు పొందిన గద్దర్ లో గుర్తించి "*మరో ప్రపంచకవి గద్దర్*"[4] అనే వ్యాసంలో విశ్లేషించారు. "ప్రజా శ్రేయస్సే పరమావధిగా సామాజిక విప్లవమే అంతిమ లక్ష్యంగా పెట్టుకొన్నారు విప్లవ రచయితలు. విప్లవ కవిగానీ, విప్లవ రచయితగానీ కేవలం

[3] ప్రతిఫలనం, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పుట:209

[4] ప్రతిఫలనం, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పుట:156

రాయటం, వాటిని ప్రజలల్లోకి విసరటమే కాదు. తాము చెప్పిన ఆశయాన్ని చూపిన లక్ష్యాన్ని సాధించేందుకు స్వయంగా విప్లవ కార్యక్రమాల్లో ఉద్యమాల్లో పాల్గొనాలంటారు"[5] జూలూరి గౌరీశంకర్ గారు. ఈవ్యాసంలో పైన చెప్పిన సామాజికమైన మార్పు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వల్ల సాధ్యంకాదని ప్రజల తిరుగుబాటు ఉద్యమాలవల్లనే నూతన ప్రజాస్వామిక విప్లవం సాధ్యమౌతుందని అదే 'విప్లవవాద సిద్ధాంతం' అని చెప్పి ఈ సిద్ధాంతానికి గద్దర్ వాగ్గేయకారుడని అభిప్రాయపడ్డారు. ఎవరైతే సమాజం మారాలని కోరుకుంటారో ఆ రచయిత కోరుకునే సమాజాన్ని ఆవరించి ఉన్న తాత్త్విక భావజాలం నుంచి విముక్తం చేయాలనీ రాచపాళెం భావించారు. ***'మతాలల్లో మర్మాన్ని ఇప్పి సెప్పుదాం/దేవుండ్ల గుట్టంత బయట పెట్టుదాం/ గుణంలేని కులాల గుట్టు చెప్పుదాం/హిందూమత పిచ్చిగాల్ల మత్తు దించుదాం'*** అని గద్దర్ పాడిన పాటలోని మార్మికతను విశ్లేషిస్తూ మనిషి ఉనికిని తిరస్కరించే దైవ సిద్ధాంతం నుండి మనిషి విముక్తం కాకుండా సమాజంలో మార్పును తీసుకురావడం సాధ్యం కాదు. తీసుకొచ్చినా అది సమగ్రంగా ఉండదని చెపుతూ ఈ విధమైన కర్తవ్యాన్ని గద్దర్ తన పాటల ద్వారా నిర్వహించారని చెప్పారు. గద్దర్ రాసిన ఏ పాటను తీసుకున్నా అందులో శ్రామిక వర్గానికి చెందిన ఒక కులం వారిదో, కొన్ని కులాల సమూహానిదో, వృత్తుల వారిదో జీవితాన్ని చిత్రించి వాళ్ళు శ్రమదోపిడీకి గురికావడాన్ని ఎత్తిచూపి దానికి పరిష్కారంగా తిరుగుబాటును ప్రతిపాదించడం గద్దర్ నిర్మాణ పద్ధతిగా కనిపిస్తుందని చెప్పారు. ఈ విధమైన విశ్లేషణ అంబేద్కరిజం, మార్క్సిజం సిద్ధాంత సమన్వయ దృష్టితో చేసినట్టుగా తెలుస్తుంది.

రాచపాళెం అధ్యయనం చేసిన ఆధునిక కవిత్వం మొత్తాన్ని సామాజిక కోణం నుండే విశ్లేషించారు. విప్లవ కవిత్వం, మార్క్సిస్టు కవిత్వం రెండింటికి సమాన లక్షణాలున్నప్పటికే పరస్పరం భిన్నమైన లక్షణాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రముఖ మార్క్సిస్టు విమర్శకుడు

[5] స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలోని ఉద్యమాలు, జులూరి గౌరీశంకర్, పుట:133

క్రిష్టోఫర్ కాడ్వెల్ 'Modern poerty always capitalist poetry' అంటారు. ఆధునిక కవిత్వం అంటే పెట్టుబడిదారి కవిత్వం అని ఆయన భావన. ఇది నిందార్థకమైన మాట కాదు. అది వస్తుగత వాస్తవికతకు సంబంధించిన మాట. ఈయన దృష్టిలో ఆధునిక కవిత్వం అంటే పెట్టుబడిదారి వ్యవస్థను వ్యతిరేకిస్తూ సోషలిస్టు వ్యవస్థ కోసం రాసే కవిత్వం అని చెప్పుకోవచ్చు.

తెలుగు సాహిత్య చరిత్రలో అనేకమంది రచయితలు, కవులు గుర్తింపుకు నోచుకోలేదు. అటువంటి రచయితలను గుర్తించడం, వారి సాహిత్యాన్ని చదివి, విశ్లేషించి పాఠకులకు చేరవేయడం ఒక బాధ్యతగా స్వీకరించారు. ఈ బాధ్యతలో భాగంగా ఒరిస్సా రాష్ట్రంలోని బరంపురంలో ఉంటున్న విజయ చంద్ర సాహిత్యాన్ని అధ్యయనం చేసి దానిని విప్లవ నేపథ్య దృష్టితో దానిని వ్యాఖ్యానించారు. *'బాధల సంచి పట్టుకొని బజారుకు పరుగెత్తేవాడా/ధరల అగ్నిగుండంలో కాలుతున్న వాడా/ఓ మానవుడా/ ఓ విప్లవ కథా నాయకుడా/ ఓ మహా యోధుడా'* అంటూ విప్లవ స్ఫూర్తితో సాగిన గేయంలో మొక్కవోని విప్లవ భావజాలం ఉన్నట్టు రాచపాళెం విశ్లేసించారు. ప్రగతిశీల రచయితలు తప్పకుడా భౌతికవాదులు కావాలని ఎప్పుడూ ఆకాంక్షించే రాచపాళెం విజయచంద్రను ఆయన సాహిత్యాన్ని చదివిన తరువాత ఒక భౌతికవాదిగా గుర్తించారు. అందుకే *"మొక్కవోని విప్లవ స్ఫూర్తి విజయచంద్ర కవిత్వ రీతి"* అనే వ్యాసం రాసారు. ఈ వ్యాసంలో అతని రచనల్లోని మానవతావాదం, అతని కవిత్వ దృక్పథం, విప్లవ స్ఫూర్తి, అతని కవిత్వ నిర్మాణ పద్ధతులను గురించి వివరించారు .

## 4.4. కవుల తెలంగాణం (తెలంగాణ కవుల కవిత్వ పరామర్శ)

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేసి రిటైరయినవారు. సాహిత్య నిబద్ధతతో కూడిన విమర్శకులు. ఒక కావ్యాన్ని తనదైన శైలిలో అనుశీలించగల నేర్పరి.

రచయిత గ్రహించే వస్తువు, దాన్ని అభివ్యక్తం చేసే తీరు ద్వారా రచయితల వ్యక్తిత్వాలను అంచనా వేయవచ్చునని రాచపాళెం వారు విశ్వసిస్తారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఈ గ్రంథం అంకితం ఇవ్వడం ఎంతో ఔచితీమంతంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాకారమైన తరుణంలో దాదాపు నలభైఏళ్ల సాహిత్య వ్యాసంగంలో తెలంగాణ రచయితల మీద రాసిన కొన్ని వ్యాసాలలో పదిహేడింటిని మాత్రం ఏర్చికూర్చిన సంకలనమే *"కవుల తెలంగాణం".* తెలంగాణ ప్రాంతానికి చెందిన 16 మంది కవుల కవిత్వ అనుశీలనం ఈ గ్రంథంలో చేయబడింది. ఇది తెలంగాణ సాధించిన క్రమంలో వచ్చిన ఒక పరిణామంగా అనుకోవచ్చు.

ఈ వ్యాస సంకలంలో కాళోజి, సినారె, మాష్టార్జీ, గద్దర్, ఎస్వీ సత్యనారాయణ, జూపాక సుభద్ర, జూలూరి గౌరీశంకర్, ఎన్.గోపి, అఫ్సర్, విమల, ఆశారాజు, నందిని సిధారెడ్డి, కందుకూరి శ్రీరాములు, ఎన్.అరుణ, నవీన్‌ల రచనల మీద రాచపాళెంవారు చేసిన విశ్లేషణలు ఉన్నాయి. తెలంగాణ సంస్కృతిలో జానపద గేయాలను ఒకటిగా కలుపుతూ, వీటికి తోడుగా తెలంగాణ *"జానపద గేయాలు – సామాజిక జీవిత ప్రతిబింబాలు"* అనే వ్యాసాన్ని దీనిలో చేర్చారు చంద్రశేఖరరెడ్డిగారు.

## 4.4.1. కాళోజీ

తెలంగాణా అనగానే మనకు కాళోజీ గుర్తుకు వస్తారు. కాళోజీ అనగానే *'నాగొడవ'* గుర్తుకు వస్తుంది. కానీ ఈ పుస్తకంలో "స్వాతంత్ర్యోద్యమ కవిగా" కాళోజీ మనకు కనిపిస్తారు. ఆయన స్వయంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం, ఉద్యమానికి సంబంధించిన కవితలు రాయడం లాంటి విషయాలు ఈ వ్యాసం చదివితే తెలుస్తుంది. "నీతికి తావేది బాపు? నీ వారసుని రాజ్యంలో అడుగు తీసి అడుగేస్తే అవినీతి తప్పనిసరి" వంటి వాక్యాలు చదివినపుడు ఇంకా ఇప్పటికి కూడా ఈ పరిస్థితి మారలేదే అని మనసు సమాధానపడుతుంది. కాళోజిలో నున్న బ్రిటిష్ వ్యతిరేకతను తెలియజేస్తూ, ఆయన

తదనంతర కాలంలో స్వార్ధపరులుగా మారిన పరిణామాన్ని, దాన్ని కాళోజి గుర్తించిన క్రమాన్ని చంద్రశేఖరరెడ్డి ఈవ్యాసంలో వివరించారు.

*"బాపూజి బ్రతికిన యప్పటి/ సత్యాహింసల దుప్పటి*

*బొంకుల బొంతగ మారెను/ ఘనతలు సొంతము దీరెను.*

*అరచేతిలో స్వర్గం జూస్తూ/ నరకంలో పడతామని*

*కాంగ్రెసు వాదుల చేతనే/ గాంధీయిజం చస్తుందని"* (పుట: 26)

అంటూ కాళోజి "ఈ అలజడి కొన్నాళ్లు" కవితను 1951లో రాసాదని ఉదాహరిస్తూ, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తర్వాతి స్వాతంత్ర్యానంతర భారతీయ రాజకీయాలను నిశితంగా పరిశీలించిన వ్యక్తిగా కాళోజిని విశ్లేషించారు. ఈయన స్వతంత్ర ఉద్యమ కాలంలో కాళోజి కవిత్వంలో నిజాం వ్యతిరేకత, బ్రిటిష్ వ్యతిరేకత, ఆంధ్రోద్యమ స్ఫూర్తి, వర్గ సంఘర్షణ అనే నాలుగు పార్శ్వాలున్నట్లు ఈ వ్యాస సంపుటి రచయిత పేర్కొన్నారు.

## 4.4.2. మాస్టార్జీ (మార్క్సిస్ట్ & అంబేద్కర్ భావాలు)

మాస్టార్జీ గురించి చెబుతూ ఆయన శ్రామిక కులాల్లో చైతన్యం తీసుకొని రావడమే కాదు, విశ్రాంతి కులాల వారిలో కుడా భావ పరివర్తనను తీసుకొచ్చి వాళ్ళను కూడా ఉద్యమోన్ముఖులను చెయ్యగల చేవ మాస్టార్జీ పదాలకుంది. ఆయన కవిత్వం చదువుతుంటే రైతులు మడకలతో కలుపు నిండిన పొలాన్ని దున్నుతున్నట్లుగా ఉంటుందని చెబుతూ

*"మనిషి మానవతకు విలువనిచ్చినావూ*

*మిధ్యవాదాన్ని బద్దలు చేసావూ*

*కర్మ సిద్ధాంతాన్ని కూల్చివేసిన క్రాంతి"* అని వివరిస్తూ

ఏదైనా సామాజిక ప్రయోజనం సాధించాలంటే అది భౌతికవాదం వల్లే సాధ్యమౌతుంది. అందుకే మాస్టార్జీ ఒక భౌతికవాది ఆయనది భౌతికవాద దృక్పధమని

తెలియజేస్తూ, పై ఉదాహరణ తో బుద్ధున్ని కీర్తిస్తూ ఆయన ఉద్దేశ్యాన్ని ఈ వ్యాసంలో తెలియజేశారు.

## 4.4.3. దాశరథి (ధ్వజమెత్తిన ప్రజలలో' కవికి గల అభ్యుదయ భావాలు)

దాశరథి గురించి 'ధ్వజమెత్తిన ప్రజలలో(1981)' కవికి గల అభ్యుదయ భావాలతో వివరిస్తారు రచయిత. దాశరథి అంటే *'గాలిబ్ గీతాలు', 'తిమిరంతో సమరం'* వంటి కావ్యాలు సాహిత్య లోకంలో పరిచయమైనవే కానీ పాఠకులకు అంతగా పరిచయం లేని ఈ కావ్యంలోని అభ్యుదయ కవిత్వ ధోరణులను, ఆయనలోని కార్మిక, కర్షక పక్షపాతం, సమసమాజ నిర్మాణ సంకల్పం, పురోగమన ఆకాంక్ష, అణ్వస్త్ర వ్యతిరేకత, భారత స్వాతంత్ర మరియు మానవత వాదం వంటి వివిధ కోణాల్లో చక్కగా విశ్లేషించారు రాచపాళెం.

“మానవతావాది కానివాడు కమ్యూనిస్ట్ కాలేడు. మార్క్సిస్ట్ కాలేడు. మార్క్సిస్ట్ కావడమంటే మనిషి పక్షం వహించడమే. మనిషి మానవతావాది మార్క్సిస్ట్ కావడమే, అయితే మార్క్సిజాన్ని వ్యతిరేకించేవాళ్ళు, మితవాదులు, పరిమితవాదులు, మార్క్సిజంలోని భౌతికవాద భావాలకు తట్టుకోలేక సారాంశంలో మార్క్సిజాన్ని జీర్ణం చేసుకోలేక 'మానవతావాదం' అనే దాన్ని కనిపెట్టారని (పుట:32)” దాన్ని దాశరథి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో కమ్యూనిజాన్ని ఆలింగనం చేసుకున్నాడని, కాని పోరాటం అనంతరం ఆయనలో మార్పు వచ్చినట్లు చంద్రశేఖర రెడ్డి విశ్లేసిస్తూ దాశరథి మానవత వాదంతో రాసిన

**“ మరచిపోండి అన్ని వాదాలు**

**మానవత వాదాలే మన వేదాలు”** అని

మానవత వాదాన్ని దాశరథి ప్రతిపాదించినట్లుగా చెబుతారు ఈ వ్యాసంలో.

## 4.4.4. సి.నారాయణరెడ్డిగారి "కవిత నా చిరునామా"

సి.నారాయణరెడ్డిగారి కవితా రీతులను "కవిత నా చిరునామా" లోని కవితల ఆధారంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. వ్యాస సంపుటి కర్త. దీనిలో సినారె కవిత్వ అభివ్యక్తిలో గ్రామీణ వ్యవసాయ నేపథ్య ప్రభావం ఎలా వుందో సోదరాహరణంగా చెప్పారు.

**"జీవితం జీవించేది నక్షత్రాలలో కాదు**

**నేల కోడి పొదిగే మట్టి గుడ్లలో"** అంటూ

చాల సులభమైన పదాలతో సరళ శైలిలో కోడిగుడ్లను పొదిగే ప్రక్రియను తీసుకోని జీవితానికి నేలకు మధ్యగల ఒక అవినాభావ సంబంధాన్ని సమన్వయం చేసిన తీరును రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పట్టుకోగలిగారు. అలాగే సినారె తన కవిత్వంలో

**"కాలం నేలతో బతికిన**

**క్షణాలైన స్వేద కణాలైనా**

**పలికించాలి ఆశల విత్తనాలను**

**వెలిగించాలి ఆశయాల వృక్షాలను (చేజారితే) పుట:42"** అని

విశ్వమానవ సందేశాన్ని 'కవిత నా చిరునామా' కవిత్వ సంపుటి ద్వారా ఎంతో అద్భుతమైన అభివ్యక్తిని ఒక మంచి వ్యావసాయిక నేపథ్యం ద్వారా అందించారని రాచపాళెం విశ్లేషణ దీనిలో కొనసాగింది.

## 4.4.5. గద్దర్ (మార్క్సిస్టుల& అంబేద్కర్)

మార్క్సిస్టుల వర్గ పోరాటం మాత్రమే కాదు. అంబేద్కర్ స్ఫూర్తితో కుల పోరాటం కూడ ఉండాలి. అంటూ..

**"వెనుకబడ్డ కూలన్నల– కూడ గట్టుదాం**

**కుల పోరు, వర్గ పోరు– కల్సి పోరుదాం**

**భూపోరులో మన పోరు –మొదలుపెట్టుదాం**

**రైతు కూలి దండుగట్టి – రాజ్యమేలుదాం"**(పుట66)

నూతన ప్రజాస్వామిక విప్లవ సిద్ధాంతానికి దాని కార్యాచరణకు, కళాత్మక అభివ్యక్తి అయిన గద్దర్ పాటలను విశ్లేషణాత్మకంగా వివరించారు. గద్దర్ పాటల్లో శ్రమదోపిడి, వర్గదోపిడిని చిత్రించడమే ప్రధానంగా ఉంటుందని చెబుతూ, దానికి పరిష్కారంగా తిరుగుబాటునే ప్రతిపాదించడమే అతని కవిత్వ నిర్మాణ పద్దతిగా వాఖ్యానించారు. పోరాట వాస్తవికతకు కళాత్మక రూపకల్పన చేయడంలో గద్దర్ మంచి అనుభవమున్న వ్యక్తిగా తేల్చిచెప్పారు రాచపాళెం.

## 4.4.6. ఎన్.గోపీ

అంతకుముందు పద్య కవిగా వుండి తర్వాత వచన కవిగా మారి కవిత్వంలో 'నానీ' లు వంటి కవిత ప్రక్రియలను ప్రవేశపెట్టి, గత మూడున్నర దశాబ్దాలుగా వచన కవితా ప్రక్రియలో ఎన్నో కవితా సంపుటులు రచించిన ఎన్.గోపీ గారి గురించి, శ్రామిక దళిత జనపక్షం వహించి రాసిన కవితల గురించి 'అవ్యవస్థపై అక్షరాగ్రహం' వ్యాసంలో విపులంగా వ్యాఖ్యానించారు.

**"నా అక్షరాలు**

**చెమట సిరాతో తడిసిన పాదాలతో**

**కాగితాల మీద**

**అడుగు జాడల్ని ముద్రిస్తూ**

**జనం గుండెలోకి**

**నడిచిపోతాయి" (కవి)**(పుట 69)

అని చెప్పిన గోపిది ఒక మంచి కవిత్వ దృక్పథంగా వివరించారు చంద్రశేఖరరెడ్డి. ఇదే క్రమంలో గోపి రాసిన కవిత్వ పరిణామ వికాసాన్ని ఉదాహరణ యుక్తంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. 'కవిత్వంలో ఉత్తీర్ణత కోసం నేను రోజుకో ప్రవేశ పరీక్ష రాస్తుంటాను' అని భావించుకునే నిరంతర కవి ఆచార్య ఎన్.గోపి కవిత్వ పరిణామాన్ని విశ్లేషిస్తూ రాచపాళెం తొలినాటి కవిత్వం జీవితాన్ని ప్రదర్శించి వివరించే దశ, మలి దశ కవిత్వంలో వస్తు వైవిధ్యం, వ్యాఖ్యానం, నిర్వచనం సూత్రీకరణ కనబడుతుంది. ప్రస్తుత దశ తాత్వికత, భావుకత కనబడుతున్నాయని వ్యాఖ్యానించడం వాస్తవాన్ని దర్శించడమే.

## 4.4.7. విమల

తెలుగు సాహిత్య చరిత్రలో ఈ తొమ్మిదో దశాబ్దం నవల పరంగా నిరాశను మిగిల్చినా, కవిత్వ పరంగా గర్వకారణంగా నిలిచిందని చెబుతూ దానికి విమల కవిత్వాన్ని ఉదాహరణగా చూపించారు. రాచపాళెం. ఈమె రాసిన 'అడవి ఉప్పొంగిన రాత్రి' కవిత్వ సంపుటిని వీరు అందుకు ఉపయోగించుకున్నారు.

**"పదాల పరదాల చాటున**

**భావాల్ని దాచుకోకండి**

**వ్యక్తికరణకు సున్నితపు**

**జిలుగు నగిషీల్ని తొడక్కండి**" అని చెప్పిన విమల

కవిత్వం 'అడవికి మైదానానికి మధ్య కొరియర్' లు అంటాడు కవి. ఈమె విప్లవ జీవితాన్ని , విప్లవ కారులు ఎదుర్కొనే దాడుల్ని వాళ్ళు చేసే త్యాగాలను చిత్రిస్తారని విమలగారి కవిత్వాన్ని వాఖ్యానించారు. ఈమె కవిత్వంలో వంటిల్లు, వేశ్యా శిశువు, తెగబడిన కలల ప్రపంచం, సౌందర్యాత్మక హింస వంటివి సమాజంలోని స్త్రీ సమస్యలను ప్రధాన వస్తువులుగా చేసుకొని కవిత్వికరిస్తున్నారని, ముఖ్యంగా వీటన్నింటిని మార్క్సిస్ట్ దృక్పథంతో రాస్తున్నారని రాచపాళెం వారంటారు.

తెలంగాణ సాహిత్య అకాడెమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి కవిత్వం సాంద్రత నుండి సరళత వైపు పయనించిందన్నారు. సిధారెడ్డి కవిత్వంలోని క్రియాంత వాక్యాల సమాహారం మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. (పుట: 127). సిధారెడ్డి కవిత్వం నిండా మనిషే వస్తువు. మనిషి శ్రమే వస్తువు. కులం, వర్గం పునాదుల మీద, ప్రాంతం మీద, పునాదుల మీద మనిషిని మనిషే దోపిడి చేసే అమానుషం మీద, మనిషి ఎన్నుకున్న పాలకులు చేసే దుర్మార్గం మీద, దోపిడీకి వివక్షకు వ్యతిరేకంగా తిరగబడే మనిషి మీద, రాజ్యం చేసే హింస మీద విమర్శ సిధారెడ్డి కవిత్వం. దానిన ఏ పద సమూహంలో అభివ్యక్తం చేయాలో, ఏ వాక్య సముదాయంలో బహిర్గతం చేయాలో సిధారెడ్డికి బాగా తెలుసునని రాచపాళెం వ్యాఖ్యానిస్తారు. (పుట.133)

ఒక ప్రదేశంలో తమ జీవనం సాగక, జీవన గమనంలో భాగంగా మరొక ప్రదేశానికి పోవడాన్నే 'వలస' అంటూ ఈ వలస అనే ప్రక్రియను వస్తువుగా తీసుకోని అఫ్సర్ రాసిన దాన్ని రాచపాళెం విశ్లేషించారు. ఒకే దేశం అన్ని దేశాల అవకాశాలను అభివృద్ధిని గ్లోబలైజేషన్ పేరు మీద కొల్లగొట్టడాన్ని అఫ్సర్, తన కవిత్వంలో ఆక్షేపించడాన్ని విశ్లేషించారు. గ్లోబలైజేషన్ వల్ల కలిగిన దుష్ఫలితాలను, దుష్పరిణామాలను ఎండగట్టాల్సిందేనని చెప్తూ. మరికొన్ని సత్ఫలితాలు కూడా లేకపోలేదని. కులమతాల ప్రాతిపదిక మీద రక్తసిక్తమవుతున్న సమాజాన్ని కవిత్వంలో అభివ్యక్తం చేయడానికి అఫ్సర్ **'రక్తం నెత్తురు'**ను ప్రధాన ఇమేజ్‌లుగా చేసుకున్నారని రాచపాళెం వారు గుర్తించారు.

**"నా కవిత్వ పాదానికి విగ్రహం లేదు**

**నిగ్రహం లేదు**

**ఆగ్రహం తప్ప"** అఫ్సర్ రాసిన ఈ

కవిత్వ పాదాలనే 'వలస' సంపుటి సారాంశం అని అంటున్నారాయన.

“వచన కవులను మూడు రకాలుగా విభజించుకోవచ్చు. విపరీతమైన భావ, పద చిత్రాలతో వాక్య విన్యాసాలతో పాఠకులకు అర్థం కాకుండా రాసేవాళ్ళు ఒకరకం. వార్తకు వచన కవిత్వానికి మధ్య వుండే సున్నితమైన సరిహద్దును చేరపేసి  కవిత్వాన్ని పలచన చేసేవాళ్ళు ఇంకోరకం. ఈ రెండు రకాల వాళ్లకు భిన్నంగా వస్తువును ఆవిష్కరించడానికి అవసరమైన భావుకతను జోడించి వస్తు రూపాల మధ్య సమన్వయాన్ని సామరస్యాన్ని సాధించే వాళ్ళు మరోరకం. ఆశారాజు గారు ఈ మూడో రకమైన కవి” అని చెబుతూ వార్తకు వచన కవిత్వానికి మధ్య ఉండే సున్నితమైన సరిహద్దును చెరిపేసి కవిత్వాన్ని పలచన చేసే వాళ్లలాగ కాకుండా వస్తురూపాల మధ్య సమన్వయాన్ని సామరస్యాన్ని సాధించిన కవి ఆశారాజు అని వ్యాఖ్యానిస్తారు.

1974లో ఐక్యత చైతన్యంతో మొదలైన కందుకూరి కవిత్వ రచన నేటికి అదే చైతన్యాన్ని కొనసాగిస్తూ ఇది ఒక కవిత్వ లాంగ్ మార్చ్ ని తలనిపిస్తుందని కందుకూరి శ్రీ రాములు కవిత్వాన్ని విశ్లేషించారు. ఎన్.అరుణ కవిత్వంలోని పల్లీయ పరిమళాన్ని, నవీన్ కవిత్వంలోని ప్రపంచీకరణను అభిశంసించిన తీరును సోదాహరణంగా చర్చించారు.

వస్తు  వైవిధ్యానికి అభివ్యక్తి తోడైతే అదే సత్యనారాయణ కవిత్వం అని, అయినా” కవీ! జీవితం ఊహ కాదు వాస్తవం / సాహిత్యం సమాజ చలనాలకు దర్పణం (పుట153)” భారతదేశంలో కలిగిన అనారోగ్యకర పరిణామాలన్నింటిని కావ్యంలో విమర్శనాత్మకంగా పరిశీలించారని ఎస్వీనీ వ్యాఖ్యానించారు.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి ప్రతి వ్యాసం విషయ నిర్భరతతో, ఆయా విషయాల కనుగుణమైన విశ్లేషణతో, స్వీయ దృక్పథంతో సాగుతాయి. శ్రీశ్రీలోని కవితావేశం, వరవరరావు లోని చరిత్ర సమన్వయ దృష్టి, మార్క్సిస్ట్ రచయితలకు వుండే ప్రేమ, భావాన్ని భావుకతగా మార్చే సృజనాత్మకత, సాహిత్య చరిత్ర పట్ల శాస్త్రీయ ఆలోచన సామాజిక పరిణామాలను చూడగల దృష్టి, అంతకు మించిన పద సంపద వాక్యాలను

చేర్చగల నేర్పరితనం అన్నీ జూలూరి గౌరీశంకర్ కవిత్వ లక్షణాలుగా రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు దీనిలో విశ్లేషించారు.

## 4.5. కథా విమర్శ

రాచపాళెం సాహిత్య విమర్శ తొలిదశలో (1972-2000) గురజాడ కథలతో కథా విమర్శ మొదలుపెట్టారు. ఆ తరువాత మలిదశలో చాసోగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ కథా రచయిత చాగంటి సోమయాజులు కుమార్తె చాగంటి తులసి రచించిన 14 కథలను అభ్యుదయ దృక్పథంతో విమర్శించారు. రాచపాళెం వారు కథావిమర్శపై రాసిన వ్యాసాలు కొన్ని తొలిదశలో రాయగా మిగిలినవి మలిదశలో రాసారు. లంకిపల్లె కన్నమనాయుడు అనే మరొక రచయిత కథలను కూడా పరిశీలించి విమర్శించారు. వీరిద్దరి కథలను కూడా భావజాల నేపథ్యంలో కథలను పరిశీలించి విమర్శించారు.

### 4.5.1. తెలుగు కథ, పరిణామ వికాసం

తెలుగు కథ పుట్టినప్పటి నుండి నేటి దాకా ఏ విధమైన వికాసాన్ని పొందింది వివరించారు. తెలుగు కథ సామాజిక పరివర్తనకు తాను స్పందిస్తూ, సామాజిక మార్పుకు దోహదం చేస్తూ తన సామాజిక బాధ్యతను నిర్వహిస్తూ వస్తున్నదని భౌతికవాద దృక్పథంతో విమర్శించారు. అప్పుడప్పుడు వ్యాపార మార్గం పట్టినా సందర్భాలు ఉన్నా కూడా కథానిక ఏనాడూ తన స్వభావాన్ని చంపుకోలేదని, ఏనాడూ సామాజిక బాధ్యతను పూర్తిగా విస్మరింపలేదని కథపై తనకున్న నిశ్చితాభిప్రాయాన్ని తెలియజేశారు. గురజాడ కథలపై విమర్శను రాసే క్రమంలో కథానిక పుట్టుపూర్వోత్తరాలను తెలియజేసిన రాచపాళెం మలిదశలో దాని పరిణామ వికాసాన్ని తెలియజేసే ప్రయత్నం చేశారు.

తెలుగు సాహిత్య చరిత్రలో 1956-65 కాలాన్ని స్తబ్దతాయుగంగా పేర్కొంటారు. కానీ సాహిత్యాభిప్రాయాలను ఒక పట్టాన ఒప్పుకోని రాచపాళెం దానిని మరింత అధ్యయనం చేసి పునర్మూల్యాంకన దృక్పథంతో ఈ యుగంలో ఎన్నో గొప్ప కథలు వచ్చాయని, తెలుగు

కథానికకు సంబంధించి క్షీణ స్తబ్దతాయుగాలు లేవని తేల్చి చెప్పారు. తెలుగు కథ ఒక వైపు సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తూనే అన్ని రకాల, ఆధిపత్యాన్ని, అణచివేతను, హింసను వ్యతిరేకిస్తూ విప్లవిస్తుందని, అంతేగాక దాని వికాసం క్రమంగా బడుగు బలహీన వర్గాల వైపు మరలిందని కూడా రాచపాళెం  గుర్తించారు. అయితే తెలుగు కథానికాభివృద్ధికి అనేక తెలుగు పత్రికలు కృషి చేసినట్టుగా తెలియజేస్తూ వాటిలో తెలుగు జనానా, కల్పలత, సాహితీ, ఆంధ్రపత్రిక, ప్రబుద్ధాంధ్ర, అభ్యుదయ, జ్వాల వంటి వాటిని పేర్కొన్నారు.

కథా సమీకరణలు రెండు రకాలుగా ఉన్నాయనీ, అవి ఒకటి రచయిత రాసిన కథానికల సంపుటి అని చెపుతూ గురజాడ కథానికలు, శ్రీపాద చిన్న కథలు మొదలైన వాటిని ఉదాహరణలుగా చెప్పారు. రెండోది విభిన్న రచయితలు రాసిన కథానికల సంకలనాలు అని సంకలనాలు రెండు విధాలుగా ఉంటాయని చెప్పారు. పైన చెప్పిన రెండోరకం సంకలనాలు అనేక విధాలుగా ఉంటాయని తెలిపారు. అవి: ఒక నిర్దిష్టకాలంలో వచ్చిన కథానికల సంకలనాలు, ఒక ఉద్యమ నేపథ్యంలోంచి వచ్చిన కథానికల సంకలనాలు, ఒక ప్రాంత జీవితం పరిధిగా వచ్చిన కథానికల సంకలనాలు, ఒక జీవిత సమస్య లేక ఒక సామాజికవర్గ జీవితం ఆధారంగా వచ్చిన కథానికల సంకలనాలు. అని విభజించారు.

ఈ నేపథ్యంలో వచ్చిన డా॥ కె.లక్ష్మీనారాయణ రచించిన దళిత కథా సంకలనాలను విశ్లేషించారు. తెలుగు కథానిక ప్రచురణలోనే గాక దళిత సాహిత్య చరిత్ర నిర్మాణంలోనే ఇదొక ఉజ్వల సంఘటన, బాధ్యతాయుతమైన చర్య, అపూర్వ కృషి అనన్య శ్రమ అని రాచపాళెం ఆయన కృషిని ప్రశంసించారు. ఈ కథలన్నింటిని అధ్యయనం చేస్తే "చాతుర్వర్ణం వంటి భ్రష్ట వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు." "మూడాచారుల చేతిలో కులం ఒక వజ్రాయుధం" "సాంఘీక నిరంకుశత్వం కంటే క్రూరమైనట్టిది" అన్న డా॥ బి.ఆర్ అంబేద్కర్ అభిప్రాయాలను ఉదాహరణలుగా తీసుకొని అవి వాస్తవాలని ప్రకటించారు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన *"ఇలాంటి తవ్వాయి వస్తే"(1934)*, మధురాంతకం రాజారాం *రచించిన "అజ్ఞాత వాసం" కథను*, కాళీపట్నం రామారావు *కథ "యజ్ఞం"*, కరుణకుమార *"కొత్త చెప్పులు"* మొదలైన కథలను దళిత సామాజిక నేపథ్యం నుండి విశ్లేషించారు.

## 4.5.2. కథాశిల్పం సంప్రదాయాలు, ప్రయోగాలు

కథా వస్తువును మలిచే విధానమే శిల్పం. ఏది ఎక్కువగా స్ఫుటంగా చిత్రించాలో నిర్ణయించడం కథా శిల్పంలో ముఖ్యమైనది. ఇతివృత్తానికి అనుగుణమైన రీతిలో, ధోరణిలో కళాత్మకంగా అందించే నేర్పరితనంతో కూడిన విధానమే కథా శిల్పం. ఇది వస్తు సంవిధాన శిల్పం, పాత్ర చిత్రణ శిల్పం, సంభాషణ శిల్పం, నేపథ్య శిల్పం, సంఘటన శిల్పం, సన్నివేశ శిల్పం, కథా కథన శిల్పం, శీర్షికా శిల్పం, ఆరంభ – సమాపక సమన్వయ శిల్పం అని తొమ్మిది రకాలుగా చెప్పవచ్చు. శిల్ప పరంగా చుస్తే రాచపాళెం వారు శిల్ప దృష్టి ఎక్కువగా కలిగిన విమర్శకులుగా కనిపించారు. ఈ విధమైన దృష్టి ఆయన సాహిత్య విమర్శ తొలిదశలో వ్యక్తమౌతుంది. అదేవిధంగా ఆ తరువాత కథా విమర్శ వస్తు శిల్పాల సమన్వయానికి సంబంధించిన విమర్శ ఈ మలిదశ సాహిత్య విమర్శలో కనిపిస్తుంది. మొదట చెప్పిన ఆయన కథా విమర్శ గురజాడ కథలను విశ్లేషించే క్రమంలో జరిగింది. అయితే గురజాడ కాలం నుండి ఇప్పటివరకు కథా సాహిత్యం మొదలై నూరేళ్ళు పూర్తయిన సందర్భంగా మొత్తం కథానిక సాహిత్యాన్ని ఒక్కసారి పునర్మూల్యాంకనం చేసే ప్రయత్నం చేశారు. ఈ పనిని ఇంతకు ముందే అనేక మంది చేసిన వారిలో వల్లంపాటి వెంకట సుబ్బయ్య(*కథా శిల్పం,1995*) వంటి వారు చేసిన కొంతమంది కృషిని మాత్రమే పాఠకులు గుర్తించడం జరిగింది. ఈ క్రమంలోనే రాచపాళెం వారు కూడా కథాశిల్పం అనే విమర్శా గ్రంథం అంత స్థాయిలో కాకపోయినా తనదైన కృషితో కథా విమర్శపై కృషి చేశారు. ఒక సంఘటనని వార్తగా కాకుండా కథగా చెప్పేదే శిల్పం.[6] అని విమర్శకులు అన్నారు.

---

[6] శీలా వీర్రాజు మహతి- కథా నిర్మాణ శిల్పం, పుట:144

ప్రముఖ సాహితీ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు తాను రచించిన *"కథా శిల్పం(1995)"* అనే గ్రంథంలో కథా కథనం అనే విభాగంలో చెప్పిన విషయాలనే రాచపాళెం కూడా తనదైన శైలిలో విశ్లేషించే ప్రయత్నం చేశారువాటిని ఈ కింద పరిశీలిద్దాం. వల్లంపాటి వారు కథా కథనంలో భాగంగా వాస్తవిక కథనం, లేఖా కథనం, ఊహా కల్పనా కథనం, అంతరార్ధ కథనం, చైతన్య స్రవంతి కథనం, మాజిక్ రియలిజం అనే ఆరు రకాలను గురించి సోదాహరణంగా వివరించారు.[7] ఈ విధమైన పద్ధతినే ఆదర్శంగా తీసుకుని రాచపాళెం వారు కూడా నూరేళ్ళుగా వస్తూ ఉన్న కథా సాహిత్యాన్ని తనదైన కథా కథన దృష్టితో వాస్తవిక కథా శిల్పం, ఉహా కల్పన, ఆత్మ కథాత్మక విధానం, ముఖాముఖి విధానం, లేఖా కథనం, టేప్ రికార్డర్ కథనం, వాగ్మూల కథనం, తులనాత్మక కథనం, పండిత శిల్పం అనే విభాగాలుగా చేసి విశ్లేషించే ప్రయత్నం చేశారు.[8] ఈ రకమైన విభజన చేయడంలో వల్లంపాటి వారిని ఆదర్శంగా తీసుకున్నట్టు తెలుస్తుంది. అయితే వల్లంపాటి వారికంటే కొన్ని భిన్నమైన కథా కథన పద్దతులను రాచపాళెం వారు కథా విమర్శలో ప్రవేశ పెట్టారు అవి: , టేప్ రికార్డర్ కథనం, వాంగ్మూల కథనం, తులనాత్మక కథనం, పండిత శిల్పం. రెండు దేశాల్లో ఉన్న రక్త సంబంధీకులు టేప్ రికార్డర్ ద్వారా విషయం తెలుసుకునే పద్ధతిని టేప్ రికార్డర్ కథనం అని పేర్కొంటూ జూకంటి జగన్నాథం రాసిన *"యాతన"* కథను ఇందుకు ఉదాహరణగా చెప్పారు. చరిత్రలో రాజకీయ నాయకులు, విప్లవకారులు కోర్టు బోనేక్కి చేసే వాంగ్మూల, ప్రసంగాల రూపంలో కథలు రాయడం చాల అరుదైన విషయం అని చెపుతూ బి ఎస్ రాములు రాసిన *'దక్ష యజ్ఞం'* కథను ఉదాహరించారు. ఒక సామాజికాంశాన్ని వివరించడానికి మరొక సామాజికాంశాన్ని తీసుకొని రెండింటినీ పోల్చి చెబుతూ కథను చెప్పడాన్ని తులనాత్మక విన్యాసం అంటారని రాచపాళెం చెప్పారు. ఈ విధమైన కథన పద్దతికి ఉదాహరణగా సలీం ఇరుకు నేమలురి భాస్కర రావు 'బాధా సప్తశతి' కథలను పేర్కొన్నారు. ఈ విధమైన కథాశిల్ప రీతి వాస్తవిక శిల్పానికి ప్రతీక శిల్పానికి మధ్య

---

[7] వల్లంపాటి వెంకటసుబ్బయ్య, కథా శిల్పం, పుట:53

[8] రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కథాంశం, పుట: 217

నిలబడుతుందని రాచపాళెం వ్యాఖ్యానించారు. ఇంతవరకు ఎవరు చెప్పని కొత్త శిల్ప రీతిని రాచపాళెం వారు పేర్కొన్నారు. అదే పండిత శిల్పం. సామాన్య పాఠకులకు వస్తువును అవగాహన చేసుకోవడంలో సహకరించని కథా శిల్పం పండిత శిల్పం అని పేర్కొన్నారు. సాధారణంగా ఇది అందరికి తెలిసిన విషయమే అయినా పండిత శిల్పం అని దానికొక పేరు పెట్టడం వెనుక రాచపాళెం వారి విమర్శ రీతిలోని ఔచిత్యం వ్యక్తమౌతుంది. అయితే రాచపాళెం దేనిని తీవ్రంగా వ్యతిరేకించారు.

సామాజిక దృక్పథం కలిగిన ఏ రచయిత అయినా రచన నుండి ఏదో ఒక సామాజిక ప్రయోజనాన్ని ఆశిస్తారు. అదే విధంగా రాచపాళెం కూడా ఒక సామాజిక దృక్పథం కలిగిన విమర్శకులు కనుక పండిత శిల్పాన్ని ఆయన వ్యతిరేకించారు. కథానిక శిల్పంలో అత్యంత ప్రధానమై న అంశం రచయిత కంఠస్వరం అని రాచపాళెం గుర్తించారు. కథన రీతికి సంబంధించి కథలు రెండు రకాలుగా వుంటాయి. ఒకటి మహా వృక్షాన్ని చూపించి విత్తనాన్ని ఊహించుకోమని చెప్పేవి. రెండు విత్తనాన్ని చూపించి మహా వృక్షాన్ని ఊహించుకోమని చెప్పేవి అని రాచపాళెం చాలా సులభంగా కథకులను విభజించడం అభినందించదగ్గ విషయం. ఎందుకంటే, విమర్శకుడికి అసంఖ్యాకంగా వున్న రచనలను స్థూలంగా వింగడించుకోకపోతే పరిశీలన, అధ్యయన క్రమంలో అనేక వొడిదుడుకుల్ని ఎదుర్కోవలసి వుంటుంది అయితే వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు తన *'కథాశిల్పం'* గ్రంథంలో కథా విమర్శను భౌతికవాద దృక్పథంతో విశ్లేషించగా, రాచపాళెం వస్తు శిల్పాల సమన్వయ దృష్టితో కథా కథన పద్ధతులను విశ్లేషించారు.

## 4.5.3. తెలుగు కథా సాహిత్య విమర్శ – సాధికార సమీక్ష

రాచపాళెం వారికి సాహిత్య విమర్శ పై ఒక స్పష్టమైన అవగాహన ఉన్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే ఆయన చేసే విమర్శ ఏదైనా ఒక క్రమ పద్ధతిలో ఉంటుంది. ఆ క్రమ పద్దతి ఏమిటంటే సిద్ధాంత అధ్యయనం, అన్వయం, విశ్లేషణ, పరిమితులు అనేవి ఆయన సాహిత్య విమర్శలో ప్రధాన అంగాలని చెప్పవచ్చు. ఆయన విమర్శ రాసిన తొలి

రోజుల్లో ఈ విధమైన క్రమాన్ని కొంత వరకు పాటించక పోయినప్పటికీ కాల క్రమంలో అది ఒక క్రమపద్ధతిని సంతరించుకుందని చెప్పవచ్చు. తెలుగులో కవిత్వ సాహిత్య విమర్శ ఎక్కువగా వెలువడిందని చెప్పవచ్చు. కవిత్వ విమర్శ తరువాత అధికంగా వెలువడిన విమర్శ కథా సాహిత్య విమర్శ. అయితే కథా సాహిత్య విమర్శకున్న పరిమితులను గురించి, వాటి విధి విధానాలను గురించి ప్రత్యేకంగా ఒక వ్యాసంలో పేర్కొన్నారు. కథా సాహిత్య విమర్శ గురించి ఎంతో విలువైన సమాచారాన్ని పాఠకులకు అందించారు. కథా సాహిత్యం పుంఖానుపుంఖాలుగా వెలువడినట్లే కథా సాహిత్య విమర్శ కూడా వస్తూ ఉంది. కానీ ఆ విమర్శకు సంబంధించి కొంత పరిమితిని తెలియజేస్తూ కొందరి విమర్శ కేవలం పరిచయానికి మాత్రమే పరిమితమైందని, మరికొందరు దాన్నొక సామాజిక ఆయుధంగా చేసుకున్నారనీ, సాహిత్య విమర్శకులకు నిబద్ధత ఉండకూడదని కొందరంటే, మరికొందరు ఈ నిబద్ధత సృజనాత్మకతను చంపేస్తుందని భావించారని రాచపాళెం విశ్లేషించారు.

కథా సాహిత్య విమర్శ అనేక రూపాలుగా వెలువడుతూ వస్తుంది. అయితే తెలుగు కథ పుట్టి నూరేళ్ళు అవుతుంటే తెలుగు కథావిమర్శ ఎనభై ఏళ్ళు మాత్రమే అయిందని రాచపాళెం చెప్పడం వెనుక కథా సాహిత్య విమర్శ వెనుకబడి ఉందని చెప్పకనే చెబుతున్నారు. కథా సాహిత్య విమర్శ రెండు రకాలుగా ఉంటుంది. అది ఒకటి విశ్వ విద్యాలయాల నుండి వెలువడేది, రెండు వాటికి వెలుపల పరిశోధించి విమర్శ రాసే వాళ్ళు అని చెప్పవచ్చని చెబుతూ వాటి ప్రమాణికతను తేల్చే విషయంలో అనుభవజ్ఞులైన విమర్శకులు, జీవితాన్ని విమర్శ కోసమే వెచ్చించే వాళ్ళ నుంచే అసలైన విమర్శ వస్తుందని అభిప్రాయ పడ్డారు.

విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనలను గురించి విశ్లేసిస్తూ, ఇంతవరకు దాదాపు 250 మంది 'తెలుగు కథ' మీద అనేక పార్శ్వాల నుంచి పరిశోధన చేసినట్టుగా తెలుస్తుందని చెప్పారు. వాటిలో కొన్నింటిని మాత్రమే ఎంపిక చేసుకుని వాటిని విశ్లేషించే ప్రయత్నం చేశారు. పోరంకి దక్షిణామూర్తి రచించిన *'కథానిక స్వరూప స్వభావాలు'* గ్రంథాన్ని కథా

విమర్శకు సంబంధించి అచ్చయిన మొదటి గ్రంథంగా పేర్కొన్నారు. దానిని సమీక్షించి పౌరాణిక, సామాజిక దృష్టికోణం నుండి వెలువడిన గ్రంథంగా చెప్పారు. కనక్ ప్రవాసి రచించిన *'శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు – సమగ్ర సమీక్ష'* అనే గ్రంథం సాంఘిక, చారిత్రక విభాగం ఆధారంగా రచించినట్టు చెప్పారు. అదేవిధంగా ఎన్.రామచంద్ర *'చలం సాహిత్యం – సామాజిక దృక్పథం'* అనే గ్రంథం సంఘ సంస్కరణ పార్శ్వం నుండి రచించినట్లు చెప్పారు. అయితే ఈ విధంగా కొన్నింటిని విశ్లేషించిన తరువాత కథా విమర్శ జరిగిన తీరును, జరగాల్సిన తీరును వివరించారు. అయితే సామాజికోద్యమాల నేపథ్యంలో కథాసాహిత్యాన్ని అధ్యయనం చేయడం మంచి పద్ధతి అని రాచపాళెం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 'రంజని' అనే సంస్థ ప్రచురించిన 'రజత రంజని' అనే వ్యాస సంకలనాన్ని విశ్లేషించారు. ఇందులో ఉద్యమాల పరంగా ఒక్కొక్కరు రాసిన వ్యాసాలను ఈయన విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఆ విధమైన విశ్లేషణ నుండి ఇందులోని వ్యాసాలు ఉద్యమ వాహికగా తెలుగు కథానిక నిర్వహించిన చారిత్రక భూమికను నిరూపించినట్లుగా నిర్ధారించారు.

తెలుగు కథానికను అనేక రకాలైన పద్ధతుల్లో విమర్శించవచ్చు. అవి సమీక్ష, విమర్శ, చారిత్రక పద్ధతి, తులనాత్మక పద్ధతి ఇవేగాక ఇంకా ఎన్నో రకాలుగా విమర్శ రాయడానికి అవకాశం ఉంది. ఈ పద్ధతులన్నింటిలో రాచపాళెం వారికి ఎక్కువగా చారిత్రక పద్ధతి నచ్చినట్టుగా నా అధ్యయనం ద్వారా తెలిసింది. ఈ విధమైన ఆసక్తి నుండే కథానిక పై చారిత్రక దృష్టితో సమీక్ష చేసిన కొంతమంది విమర్శకుల గ్రంథాలను రాచపాళెం వ్యాఖ్యానించారు. వాటిల్లో పోరంకి దక్షిణామూర్తి 1972లో ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా రచించిన *'తెలుగు కథానిక'* అనే మోనోగ్రాఫ్ ను, *"ఆధునికాంధ్ర సాహిత్య వికాసం"* పేరుతో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వాళ్ళు ప్రచురించిన గ్రంథంలో డి. వెంకట్రామయ్య కథను గురించి రాసిన వ్యాసాన్ని విశ్లేషించారు. ఒక ప్రక్రియ సార్థకత అది సమకాలీన సమాజాన్ని ఎంతవరకు ప్రతిబింబించింది? ఎట్టి సందేశాన్ని ఇవ్వగలిగింది? అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని మధురాంతకం రాజారాం రాసిన వ్యాసాలను విశ్లేషించారు.

తెలుగు కథా సాహిత్యం తీరు తెన్నుల్ని సామాజిక దృక్పథంతో విమర్శించడంలో రచయితలు కానీ విమర్శకుల పాత్ర కన్నా రచయితలైన విమర్శకుల పాత్ర ఎక్కువగా ఉందని సామాజిక దృష్టి కోణం నుండి రాచపాళెం చెప్పారు. అదేవిధంగా ప్రత్యేక సాహిత్య సంచికలు, పత్రికలూ కథా విమర్శ అభివృద్ధికి అవి చేసిన కృషిని కూడా రాచపాళెం ఈ సందర్భంగా వివరించారు. కథా విమర్శకు సంబంధించిన అన్ని విషయాలను నిశితమైన దృష్టితో అధ్యయనం చేసిన రాచపాళెం వారు కథా విమర్శలో భాగంగా ప్రాంతీయతను గుర్తించే ప్రయత్నం చేశారు. "తెలుగు కథానికి – ప్రాంతీయ అస్తిత్వం" పేరుతో కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల వారు ప్రచురించిన గ్రంథంలో తెలుగు నేలలోని అన్ని ప్రాంతాల కథల్లో ప్రాంతీయత ఏ విధంగా ఉందో చర్చించబడిందని వివరించారు. అదేవిధంగా *'తొమ్మిది పదుల తెలంగాణ కథ'* పేరుతో కాలువ మల్లయ్య తెలంగాణ కథా చరిత్రను రాసినట్టుగా చెప్పారు. పతంగి వెంకటేశ్వర్లు సంపాదకత్వంలో కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ప్రచురించిన *'తెలంగాణ తెలుగు కథ'* అనే గ్రంథంలో కథా చరిత్ర, కథకుల కథల విశ్లేషణ, కథా ధోరణుల పరిచయం ఉందని రాచపాళెం వారు విశ్లేషించారు. రాయలసీమకు సంబంధించిన కథా చరిత్రను అవగాహన చేసుకోవాలంటే *'రాయలసీమ కథకులు – సామాజిక అధ్యయనం'* పేరుతో కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్లలో గల శ్రీవాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారు ప్రచురించిన గ్రంథాన్ని చదివాలని రాచపాళెం సూచించారు. అదే విధంగా 1940కంటే ముందుగానే రాయలసీమలో కథ పుట్టిందని నిరూపిస్తూ తవ్వా వెంకటయ్య *'రాయలసీమ తొలినాటి కథలు'* అనే వ్యాస సంపుటిని ప్రచురించారు. కథాసాహిత్య విమర్శపై ఇంత సుదీర్ఘమైన అధ్యయనం చేసిన తరువాత చివరగా 21వ శతాబ్దిలో తెలుగు సాహిత్య విమర్శ కథాసాహిత్యంపైనే విస్తృతంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

*"కథాంశం(2006)"* పేరుతో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు వెలువరించిన ఈ విమర్శ గ్రంథంలో కథా విమర్శకు సంబంధించిన విలువైన వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలలో అన్నింటికంటే ప్రత్యేకంగా *'కథా సాహిత్య విమర్శ'* పై రాసిన వ్యాసం మరింత

ప్రామాణికమైనదిగా తెలుస్తుంది. ఈ విధమైన ప్రామాణికతను గుర్తించే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన *'తెలుగు సాహిత్య విమర్శ దర్శనం'* గ్రంథంలో 'తెలుగు కథానిక సాహిత్య విమర్శ' పేరుతో ఈ వ్యాసం పునర్ముద్రణకు నోచుకున్నది.

## 4.6. జాషువా సాహిత్యంపై ప్రత్యేక అధ్యయనం

ప్రముఖ సాహితీ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేసిన తరువాత అతి కొద్ది కాలంలోనే జాషువా గారి సాహిత్యం మీద ఒక సాధికారతను ఏర్పరచుకున్నారు. 1977వ సంవత్సరం ఆయన అధ్యాపకునిగా ఉన్న కాలంలో ఆనాటి విద్యార్థులకు జాషువా సాహిత్యాన్ని పరిచయం చేసే క్రమంలో జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. అప్పటి నుండి మొదలుకొని నేటి వరకు కూడా జాషువా గారి సాహిత్యాన్ని వివిధ విమర్శనాత్మక దృష్టికోణంలో పరిశీలిస్తూనే ఉన్నారు. జాషువా గారి శతజయంతి ఉత్సవ కాలం నాటికీ *'జాషువా– స్వప్నం, సందేశం"* అనే ఒక విమర్శనాత్మక పుస్తకాన్ని రాచపాళెం ప్రచురించారు.

1994వ సంవత్సరం నుండి సుదీర్ఘంగా మూడేళ్ళపాటు జాషువాగారి సాహిత్యాన్ని గురించి వివిధ రకాలైనటువంటి సమావేశాలను, సదస్సులను నిర్వహించారు. ఈ సాహితీ కార్యక్రమాలకు ప్రఖ్యాత సాహితీవేత్తలను ఆహ్వానించేవారు. ఈనేపథ్య క్రమంలోనే రాచపాళెం గారికి జాషువా సాహిత్యానంతా సాధ్యమైనంత వరకు చదువుకునే అవకాశం అవసరం కలిగింది. ఈ క్రమంలోనే రాచపాళెం కలం నుండి జాలువారిన విమర్శనాత్మక మచ్చుతునక ఈ పుస్తకం.

ఆధునిక తెలుగు సాహిత్య కవుల్లో జాషువా ప్రతిఘటన, చైతన్యానికి ఒక చిహ్నంగా నిలుస్తారు. ఆయన జీవితంలో ఎదుర్కొన్న అవమానాలను అనుభవంలోకి తెచ్చుకొని అనుభవ వాదానికి ఆద్యుడిగా, దళిత ఉద్యమం ముమ్మరంగా జరిగిన కాలం నుండి ఆయనను దళిత కవిగా ఈ సాహితీలోకం గుర్తిస్తుంది. జాషువా తాను జీవించి ఉన్న కాలంలో ఎంత శ్రేష్టమైన వాడో నేటి కాలానికి కూడా అంతే శ్రేష్టమైన వాడిగా రాచపాళెం

జాషువాను గుర్తిస్తూ ఆయన సాహిత్యనంతా పునర్మూల్యాంకనం చేయవలసిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉంది అని వక్కాణించారు. రాచపాళెంగారు కూడా ఈ పుస్తకంతో జాషువా సాహిత్య అధ్యయనాన్ని నిలిపివేయకుండా భవిష్యత్తులో జాషువా పై సమగ్ర రచన చేయడానికి ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.[9]

## 4.6.1. 'జాషువ' స్వప్నం – సందేశం

ప్రపంచం ఆధునికం కావడానికి రెండు ప్రధాన విప్లవాలు కారణమయ్యాయి. అవి ఒకటి ఫ్రెంచి విప్లవం, రెండు పారిశ్రామిక విప్లవం. ఈ రెండింటి ఆలోచనా సిద్ధాంతాల వల్ల సమాజానికి కొన్ని నూతన పనిముట్లు, నూతన ఆలోచనలను అందించాయి. ఈ ప్రపంచాన్ని అందులో నివసించే మానవుల్ని అర్థం చేసుకోవడానికి ఎన్నో నూతన సిద్ధాంతాలు పోకడలు వచ్చాయి. ఈ పారిశ్రామిక విప్లవం ఫలితంగానే సంఘ సంస్కరణోద్యమం సమ సమాజం ఆర్థిక స్వేచ్ఛ మొదలైన అంశాలెన్నో నూతనంగా పుట్టుకొచ్చాయి. ఇటువంటి వాటి ప్రభావం ఎంతోమంది ఈ సమాజంలో కళా కారులు సాహితీవేత్తలు తమ గొంతును వినిపించడానికి సహాయపడింది.

## 4.6.2. వర్ణ వ్యవస్థ

సమాజంలో తరతరాలుగా అణగదొక్కబడుతూ, నిరాదరణకు అగౌరవానికి నిరంతరం బలవుతున్న తన జాతివారికి ఆదరణ గౌరవం కల్పించాలని జాషువా ప్రాధేయపడినట్టుగా రాచపాళెం గారు చెప్పారు. ప్రతి రచయితకు సామాజిక బాధ్యతతో కూడిన రచన చేయవలసిన ఆవశ్యకత ఉంది. అలాంటి రచన చేసేటప్పుడు ఏ రచయితకీ అయినా నాలుగు ప్రశ్నలు తన ముందుంటాయి. అదే విధంగా జాషువా గారికి కూడా తన ముందు ఈ ప్రశ్నలు వెలిశాయని రాచపాళెం చెప్పారు.  వీటిని దృష్టిలో పెట్టుకొని రచనలను కొనసాగించవలసిన అవసరం ఉందని ఇంతకుముందే వివరించాను.

---

[9] 'జాషువా- స్వప్నం సందేశం' పుస్తకానికి రాసిన ముందుమాటలో

సాహితీ రచనలో ప్రతి రచయిత తమకంటూ ఒక సామాజిక స్వప్నాన్ని ప్రకటించుకుంటారు. అదేవిధంగా జాషువా సాహిత్యానంతా అధ్యయనం చేసిన రాచపాళెం కూడా జాషువా కంటూ ఒక స్వప్నం కలదని అది కులమత పీడన లేని వసుధైక కుటుంబం ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకొని ఈయన తన రచనలను నడిపించాడని రాచపాళెం చెప్పారు.

ఫ్రెంచి, పారిశ్రామిక విప్లవాల ద్వారా సమాజంలో వచ్చిన స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం జాషువా రచనల్లో కూడా స్పష్టంగా కనిపిస్తున్నట్లు రాచపాళెం చెప్పారు. జాషువా మీద గాంధీజీ, నేతాజీ, అంబేద్కర్ మొదలగు వాళ్ళ ప్రభావం ఉన్నట్లు రాచపాళెం గుర్తించారు.

## 4. 6. 3. జాషువా సందేశం– రాచపాళెం వివరణ

ప్రతి రచయిత రచనలో ఏదో ఒక సందేశం లేకుండా, ఏ రచయిత కూడా తన రచన చేయడు. అదేవిధంగా జాషువాగారి రచనలన్నీ కూడా సామాజిక పరివర్తనకు పనికొచ్చే రచనలుగా రాచపాళెం గుర్తించారు. జాషువాగారు సమాజానికి ఇచ్చిన ప్రబోధం కానీ, ప్రోత్సాహం కానీ అన్నింటిని రాచపాళెం తనదైన శైలిలో జాషువా గారిని విశ్లేషించారు. కడుపు కాలిన వాళ్ళు, కడుపు మండిన వాళ్ళు ఆక్రోశాల నుండి జాషువా తన సందేశాలను అందించారు. ఆయన ఇచ్చిన సందేశాలన్నీ కూడా సమాజంలో ఉన్న సోమరిపోతులకు శరాఘాతాలు, శ్రామికులకు ఆశా కుసుమాలు, ముందుచూపు కలవారికి కరదీపికలుగా వెనక ఉండే వారికి మార్గ నిర్దేశాలుగా ఉంటాయని ఒక నిశితమైన దృష్టితో రాచపాళెం విమర్శించారు.

జాషువా తన జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, చీత్కారాలు వర్ణవ్యవస్థను అన్నింటిని రంగరించి అనుభవ పూర్వకంగా తన రచనల్లో నింపారు. రాజకీయ స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, ఆర్థిక సమానత్వం గల సమాజం రావాలనుకున్న భావజాలం కలిగిన వ్యక్తిగా ఆయన జాషువాను గుర్తించారు. తన ప్రతి రచనలోనూ ఏదో ఒక రకమైన విప్లవాత్మకమైన

సందేశంతో రచనంతా నిండి ఉంటుందని రాచపాళెం నిశిత పరిశీలనలో తేలిన విషయంగా ఈపుస్తకం ద్వారా అవగతం చేసుకోవచ్చు.

### 4.6.4. దళిత సమైఖ్యత ప్రభోధం

సమాజంలో ఉన్న వర్ణ వ్యవస్థలో అగ్ర కులాల వాళ్ళు దళితుల పట్ల చూపుతున్న అగౌరవం చిన్నచూపును, వివక్షను ఎదుర్కొన్నారని జాషువా రచనల ద్వారా తెలుస్తుంది. దళితులలో చైతన్యాన్ని రగిలించి వారందరిని ఒక తాటిపై నిలబెట్టేందుకు జాషువా అనేక విధాలుగా కృషి చేశారు. అగ్ర వర్ణ పీడన నుండి విడుదలై సమ సమాజ నిర్మాణం జరగాలని జాషువా కాంక్షించి, తన రచనల ద్వారా  దళిత సమైఖ్యతా ప్రబోధం చేసారని జాషువా గారిని రాచపాళెం ప్రశంసిస్తూ జాషువా సాహిత్యాన్ని  విశ్లేషించారు.

### 4.6.5. జాషువా రచనల్లో స్త్రీ – రాచపాళెం దృష్టి

సమాజంలో స్త్రీ బాల్యంలో తండ్రి పోషణలో, యవ్వనంలో భర్త పోషణలో, వృద్ధాప్యంలో కొడుకు పోషణలో ఉంటుందని మనువాద సిద్ధాంతం పేర్కొంటుంది. మనువాదం ప్రకారం స్త్రీకి అన్యాయం జరిగిందని మార్క్సిస్టు భావాలు కలిగిన రాచపాళెం జాషువా రచనల ద్వారా సమాజంలో స్త్రీ పురుషుల సమానత్వాన్ని గుర్తించారు. శాస్త్రాలు పురుషాధిక్య సమాజానికి వంత పాడాయని జాషువా ఖండించారు. స్త్రీ లేకుంటే పురుషుని ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని అలాంటప్పుడు స్త్రీ పురుషులిద్దరూ సమానమనే భావన స్పష్టంగా కనిపిస్తుందని చెప్పవచ్చు.

### 4.6.6. జాషువా రాజకీయ సందేశం – రాచపాళెం దృష్టి

జాషువా మీద రాజకీయంగా గాంధీ, అంబేద్కర్, నేతాజీ మొదలైన వారి ప్రభావం తీవ్రంగా ఉందని రాచపాళెం వారు పేర్కొన్నారు. జాషువా గాంధీ మీద *“బాపూజీ”*కావ్యమే రాయడం కాకుండా గబ్బిలం కావ్యంలో కూడా అక్కడక్కడా గాంధీజీ గారిని పేర్కొనడం జరిగింది.

స్వాతంత్రోద్యమంలో ముమ్మరంగా పాల్గొన్న జాషువా భారత రాజకీయం అసంతృప్తి మిగిల్చిందని తన రచనల ద్వారా తెలియజేశారు. జాషువా మన దేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు పొంగిపోయి అనేక కవితలు రాశారు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో పెరిగిపోయిన అవినీతి పట్ల అక్రమాలు దౌర్జన్యాల పట్ల విభ్రాంతి చెందిన జాషువా 'దొరలు దాటిపోవ దొంగలు మిగిలారా' అనే ప్రశ్న విలువైనదే అని రాచపాళెం చెప్పారు.

## 4.6.7. ఆర్థిక సందేశం

పెట్టుబడీదారి ఉక్కు పిడికిళ్ళలో బందీ అయిన అనేకమంది శ్రామికుల పట్ల ఆర్థిక స్వతంత్రం కలిగి ఉండి సమ సమాజం ఏర్పడాలని జాషువా కోరుకున్నారు. తన *'అనాథ'* రచన ద్వారా ఈ విషయాన్నీ తెలిపినట్టుగా రాచపాళెం పేర్కొన్నారు.

ఉత్పత్తి రంగంలో ప్రధాన పాత్ర పోషించే దళితులు భూస్వామిక అగ్రవర్ణ వ్యవస్థ పుట్టు బానిసలుగా చేసుకుని వారిని ఉపయోగించుకుంటుంది. అలాంటి నేపథ్యంలో ఉన్న జాషువా రచన అయిన *'గబ్బిలం'* కావ్యంలో మనకు స్పష్టంగా కళ్ళకు కట్టినట్టుగా చూపించారు. దళితుల శ్రమను దోపిడీ చేయడానికి పురోహిత వర్గం సృష్టించిన కర్మ సిద్ధాంతాన్ని జాషువా తీవ్రంగా ప్రతిఘటించారు. తరతరాలుగా బానిసలై ఉంటున్న దళితులు వారి శ్రమకు తప్ప, సుఖానికి ఎప్పుడూ నోచుకోలేదని తనదైన శైలిలో దళితుల దైన్యాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించినట్లు రాచపాళెం తన విమర్శనాత్మక దృష్టి నుండి పరిశీలించారు.

## 4.6.8. జాషువా సాహిత్య సిద్ధాంతం – రాచపాళెం దృష్టికోణం

జాషువా తన 50 ఏళ్ళ సాహితీ జీవితంలో తన కలం నుండి అద్భుతమైన రచనలు వెలువడ్డాయి. సాహిత్య రచనచేసే ప్రారంభదశలో పౌరాణికమైన వస్తువుకు జాషువా పరిమితమైనట్లు రాచపాళెం గుర్తించారు. తర్వాతి కాలంలో తన రచనల్లో పరిణామం,

పరిపక్వత వచ్చిన నేపథ్యంలో లో సంఘ సంస్కరణకు సంబంధించిన రచనలు, అభ్యుదయ రచనలు, జాతీయోద్యమ రచనలు రచించినట్లు రాచపాళెం స్పష్టం చేశారు. జాషువా స్వప్నం నాగరిక సమాజం, శ్రమ ఫలితం. ఈ రెండింటిని జోడిస్తూ ఉన్న సమాజం ఆయన స్వప్నం. ఆయన రచనల్లోని వాస్తవికత, ఆధునికత, ఆవశ్యకత మొదలైన విషయాలతో కూడిన రచనా విధానంగా ఉందని రాచపాళెం గుర్తించారు. ఈయన రచనల్లో చారిత్రక క్రమాన్ని ఆయన పరిమితులను అర్థం చేసుకోకుండా ఆయన్ని అభివృద్ధి నిరోధక భావించే వాళ్ళపట్ల తీవ్రమైన నిరసన వ్యక్తం చేశారు. ఏరచన అయినా ఎంత పూర్వీకం అయిందా అని కాదు చూడాల్సింది. గతంలో దాని నుండి ఎంతవరకు బయటపడ్డారో చూడటం అవసరమని రాచపాళెం స్పష్టం చేశారు.

## 4.6.9. సమతా వాదిగా జాషువా – రాచపాళెం దృష్టి

జాషువా మీద ప్రథమంగా జాతీయ నాయకుల ప్రభావం ఉందని ఇంతకు ముందే చెప్పాను. అయితే అందరికంటే ఎక్కువగా గాంధీ ప్రభావం ఈయన మీద పడింది. ఆయన రచనల్లో గాంధీజీ గురించి వివరించినంతగా మరే ఇతర జాతీయ నాయకుల గురించి కొనియాడలేదు. 'గబ్బిలం' నుండి 'కొత్తలోకం' వరకు ఆయనకు సందర్భానుసారంగా వీలు చిక్కినప్పుడల్లా గాంధీజీ గురించి  రచించాడని రాచపాళెం జాషువా సాహిత్య అధ్యయన సమయంలో గుర్తించారు.

## 4.6.10. జాషువా శ్రామిక దోపిడీ నిరసన – రాచపాళెం కమ్యూనిస్టు దృష్టి

మార్క్సిస్టు దృక్పథం కలిగిన రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు జాషువా సాహిత్యాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తున్న క్రమంలో జాషువాలో మార్క్సిస్టు దృక్పథ లక్షణాలను గుర్తించారని, ఆయన ఆ సిద్ధాంతాలను ఆచరించడం పోయినా ఆయన కోరుకున్న సామాజిక పరమైన మార్పు అంతా కూడా మార్క్సిజం సిద్ధాంతానికి దగ్గరగా కనిపిస్తుందని పేర్కొన్నారు. జాషువా కూడా మార్క్సిజం చెప్పే ఆర్థిక స్వేచ్ఛ, సమ సమాజం, వర్ణవ్యవస్థ నిర్మూలన మొదలైన విషయాలను చూపిస్తూ తన రచనలను రచించినట్లుగా రాచపాళెం

గుర్తించారు. మార్క్సిస్టు సిద్ధాంతాలలో ప్రధానమైన శ్రమ దోపిడీని జాషువా తీవ్రంగా వ్యతిరేకించాడు. శ్రామికులు, కార్మికులు సృష్టించిన ఉత్పత్తిని దానితో సంబంధంలేని ఎవరో దాన్ని అనుభవించడం అన్యాయమని జాషువా తిరుగుబాటు చేశారు. ఇలాంటి భావాలు కలిగిన రాచపాళెం కూడా జాషువా ప్రకటించిన ఈ ప్రభోదాన్ని సమర్థించారు.

భారతదేశంలో పాతుకుపోయిన కుల వివక్ష, శ్రమ దోపిడీని సృష్టించిన అగ్రవర్ణాల వారి కర్మ సిద్ధాంతాన్ని జాషువా నిలదీశారు. శ్రమ అనుభవం అందరికీ అనేది మార్క్స్ సిద్ధాంతం. జాషువా కూడా ఈ విషయాన్ని సమర్థించాడని రాచపాళెం అభిప్రాయపడ్డారు. మార్క్సిస్టు సిద్ధాంతాలను జాషువా ఆచరించకపోయినా, ఎర్ర కండువా కప్పుకోకపోయినా, మార్క్సిస్టు మాటలనే తన రచనలలో సిద్ధాంతీకరించారని రాచపాళెం చెప్పారు. ఆవిధమైన దృక్పథంతోనే ఆయనలోని ఈ దృష్టికోణాన్ని వెలికితీశారు. మార్క్సిజం సాధారణంగా సామాజిక మార్పును కోరుకుంటుంది. మనిషిని వాస్తవికంగా గుర్తిస్తుందనే విషయాలను తన రచనల్లో చొప్పిస్తూ జాషువా తన రచనలను కొనసాగించినట్లు రాచపాళెం కీర్తించారు. జాషువా తన రచనలన్నింటిలోనూ కుల వివక్షతను, కుల పీడనను నిరసించినట్లు రాచపాళెం వ్యాఖ్యానించారు. దళితుల పక్షాన ఉండి వారి శ్రమ దోపిడీని నిరసిస్తూవారి కష్టార్జితాన్ని శ్రమను తన రచనలలో చూపిస్తూ వారి పక్షం వహించి ధిక్కారస్వరమై ఉన్నారని జాషువాను రాచపాళెం కీర్తించారు.

## 4.6.11. జాషువా స్త్రీ దృక్పథం – రాచపాళెం దృష్టి

సమాజంలో స్త్రీని దేవతామూర్తి తో సమానం అంటారు. కానీ ఏ ఒక్కరూ స్త్రీకి తగిన ప్రాధాన్యతను, స్వేచ్ఛను ఇవ్వడం లేదు. పురుష భూతాలు భార్యలను రాచరంపాలపై పెట్టి పిప్పి చేస్తున్నారని జాషువా తన ఆవేదనను స్త్రీల పట్ల తన దృక్పథాన్ని వివరించినట్లు రాచపాళెం నిశిత పరిశీలన వల్ల తెలుస్తుంది. కర్మ సిద్ధాంతం వలన స్త్రీలు వెర్రి వారుగా తయారైన స్థితిని రాచపాళెం దుయ్యబట్టారు.

## 4.6.12. జాషువా సాహిత్య కృషి – రాచపాళెం దృష్టికోణం

జాషువా భారతీయ సమాజాన్ని సాహిత్యాన్ని ఉద్ధరించడానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు రాచపాళెం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు సూత్రాల మీద సమాజ నిర్మాణం ఆధారపడి ఉందని ఆ ఇతివృత్తంతోనే జాషువా తన రచనలను కవిత్వరూపంలోనూ, పద్యరూపంలోనూ వివరించడం జరిగింది. వాస్తవికమైన విషయాలను కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించినట్లు రాచపాళెం చెప్పారు. ఆయన రాసిన సాహిత్యమంతా సరళీకృతం, సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే విధంగా రచించాడు. దీనికి నిదర్శనం నేటికి కూడా జాషువా పద్యాలు ప్రజల నాలుకల మీద నాట్యమాడటమేనని ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. జాషువా స్వయంగా తాను మార్క్సిస్టు అని ఎక్కడ చెప్పకపోయినా కూడా తన రచనలలోని సాహిత్యం ఆ విధమైన నేపథ్యంతోనే రచింపబడిందని రాచపాళెం జాషువా కవిత్వ అధ్యయనంలో భాగంగా నిగ్గు తేల్చిన విషయంగా చెప్పవచ్చును.

## 4.6.13. దళిత సమైఖ్యత కోరిన జాషువా

జాషువా సమకాలీన కవిత్వ ఒరవడి అయిన భావ కవిత్వానికి దూరంగా జరిగిన సామాజిక ప్రయోజనాలను ఆశించి రచనలను చేశారు. కుల వివక్షలపై మూడాచారాలపై తిరగబడ్డారు. తక్కువ కులంలో పుట్టడం వల్ల  ఆయన చిన్నతనం నుండి అనేక అవమానాలకు గురయ్యాడు. ఇటువంటి వాటిని ఎదిరించి ధైర్యంగా నిలబడ్డాడు గుర్రం జాషువా. ఇలాంటి ఇతివృత్తాలతో తన రచనల ద్వారా జనులను జాగృతం చేశారు.

జాషువా సాంఘిక, ఆర్థిక, అసమానతల విషఫలితాలను అనుభవించారు. ఆఖరికి తన కవిత్వానికి, పాండిత్యానికి సైతం తన కులం అడ్డురావడం ఆయనకు బాధను, ఆశ్చర్యాన్ని కలిగించాయి. అందుకే ఏ ఇతివృత్తం మీద ఆయన కవిత్వం రాస్తున్నా అస్పృశ్యతను స్పృశించకుండా రాయలేదని రాచపాళెం జాషువా పట్ల తనకున్న అభిప్రాయాన్ని వెల్లడించారు. భారతదేశంలో కర్మసిద్ధాంతం కులవ్యవస్థ మనుషుల్ని

విడదీయడానికే అవతరించాయని వాటిని ఎదుర్కొని నిలదొక్కుకున్నప్పుడే మనకు సమాజంలో గుర్తింపు వస్తుందని దళిత ప్రజలందరినీ తన కవిత్వం ద్వారా చైతన్యపరచి వాళ్ళలో ఉద్యమ భావాలను జాషువా మెండుగా నిండుగా నింపినట్లు రాచపాళెం గుర్తించారు.

భారతీయ సమాజంలో ఆర్థిక, సాంఘిక అగాథాన్ని, వెలితిని వలస పాలకులు బాగా వాడుకున్నారు. క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేశారు. సమాజంలో నిజంగా హీనంగా చూడబడుతున్న వాళ్లందరినీ క్రైస్తవులుగా మార్చడం మిషనరీలు ప్రధాన కర్తవ్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ క్రైస్తవీకరణ దళితులకు విద్య, వైద్యం, సాంఘికంగా గౌరవం ఇవ్వడంతో ఆ మతానికి ఎంతో ఆదరణ లభించింది. అప్పటికే సమాజంలో హెచ్చు తగ్గుల భావాలతో కొట్టుకుంటున్న వాళ్లు క్రైస్తవ మతంలోకి వెళ్లిన తర్వాత కూడా ఆ భావం వారిని వదిలి వెళ్ళలేదు. అక్కడ కూడా మాల క్రైస్తవులు, మాదిగ క్రైస్తవులు, రెడ్డి క్రైస్తవులు, కమ్మ క్రైస్తవులు అంటూ కులాలు తయారయ్యాయి. మతం మారినా ఈ కుల వైషమ్యాలు మారలేదని జాషువా తీవ్రంగా పోయినట్టు రాచపాళెం అభిప్రాయపడ్డారు.

మన సంఘాల మధ్య సహజంగా ఉండవలసిన సోదరభావం కులం కారణంగా నశించిందని జాషువా అభిప్రాయపడ్డారు. కులాలు కొందరిని అణచి పెట్టడానికి మాత్రమే కాదు, అణచివేయబడ్డ వాళ్లలో సైతం అణచివేసే వాళ్ళను సృష్టించడం చూశానని ఆ స్థితిని నిరసిస్తూ ప్రజలలో విశ్వజనీన భావాలను రేకెత్తించడానికి జాషువా ప్రయత్నించాడని రాచపాళెం పేర్కొన్నారు. ఈనేపథ్య క్రమంలోనే చైతన్యవంతం, సమైక్యవంతం చేయడానికి తమలో ఐక్యత లేకపోతే ఎవరిని ఎదిరించ లేమని జాషువా చెప్పిన ప్రతిఫలంగా పేర్కొన్నారు.

## 4.6.14. అందమైన అచ్చమైన భారతీయ కవి గుర్రం జాషువా

ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశం విముక్తి కోసం ఎన్ని విధాలుగా ప్రయత్నించిందో జాషువా కూడా ఈ దేశం గురించి పరిపరి విధాలుగా ఆలోచించి

తపించాడు. జాషువా స్వాతంత్ర్య సమర కాలంలో స్వాతి స్వాతంత్ర్యానంతర కాలంలోనూ భారతీయ తన గురించి తపించాడు ఆయన అందమైన నా అచ్చమైన భారతీయ కవిగా గుర్తింపు పొందారు. రవీంద్రనాథ్ ఠాగూర్, బంకించంద్ర చటర్జీ, శరత్ చంద్ర చటర్జీ, ప్రేమ్చంద్, సుబ్రహ్మణ్యభారతి వంటి గొప్ప రచయితలు భారతీయ కవులు ఎలా గుర్తించారో అదేవిధంగా జాషువాను కూడా రాచపాళెం గుర్తించి గౌరవించారు.

భారతదేశంలో ఎందరో గొప్ప రచయితల్లో జాషువా కూడా ఒకడు. ఆయన ఆజన్మాంతం తన రచనలన్నింటిలోనూ భారతదేశానికి సంబంధించిన ఇతివృత్తాలు కనిపిస్తాయి. భారతదేశ చరిత్ర భౌగోళికం సంస్కృతి ఆర్థిక, రాజకీయ, సాంఘిక స్థితిగతులు ఆయన రచనల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. మా భారతమాత, 'మాతలకు మాత సకల సంపత్సమేత" అని నిర్వచించిన జాషువాలో భారతీయ భావం ఉందని రాచపాళెం పేర్కొన్నారు.

జాషువా తన కావ్యాలలో సగర మాంధాతృ షట్చక్రవర్తుల నుండి కృష్ణదేవరాయల దాకా గాంధీ మహాత్ముని నుండి దామోదర సంజీవయ్య దాకా వ్యాసుని నుండి వేమన దాకా గౌతమ బుద్ధుని నుండి గోరా దాకా, కుంతీకుమారి నుండి హేమలతా లవణం దాకా అనేక మంది చక్రవర్తులు రాజులు వీరులు నాయకులు రచయితలు సంస్కర్తలు ఉద్యమకారులు మహిళలు అనేకమందిని తన రచనల్లో చేర్చినట్లు జాషువా సాహిత్య అధ్యయనం ద్వారా రాచపాళెం విశ్లేషించారు.

సాంఘికంగా దళితుడైన జాషువా మతపరంగా క్రైస్తవుడు. భారతదేశంలో చాలా ఏళ్లుగా అమలులో ఉండే శ్రామిక కులాల పట్ల అమానుషమైన వివక్ష ప్రదర్శించిన అగ్రకులాల ఆధిపత్యం నుండి దళితులు బయటపడటానికి ఆత్మగౌరవంతో బతకడానికి వలస పాలనా కాలంలో క్రైస్తవం ఊపందుకుంది. ఈనేపథ్యంలోనే జాషువా కూడా తన రచనలలో ఈవిషయం ప్రస్తావించినట్లు రాచపాళెం అభిప్రాయపడ్డారు. తరతరాలుగా భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న ఈ కులవ్యవస్థ శివుడు గానీ, ఏసుక్రీస్తు గానీ ఎంతమంది

వచ్చినా నిర్మూలించలేక పోయారని జాషువా బాధపడ్డాడు. 'వక్కానింప సిగ్గయ్యేడిన్' అని కళా విలాపము ఖండకావ్యంలో రాసినట్లు రాశిఫలాలు చెప్పారు. ఇలాంటి సమకాలీన సమాజంలో ఉన్న అంశాలను జాషువా తన రచనలలో నిబిడీకృతం చేస్తూ రచించడం వల్ల జాషువా అందమైన భారతీయకవిగా గుర్తింపు పొందినట్టు రాచపాళెం అభిప్రాయపడ్డారు.

## 4.6.15. రచయిత, రాజ్యం జాషువా

ప్రజా దృక్పథం గల రచయితలు సమాజం పట్ల తమకు బాధ్యత ఉందని భావించే రచయితలు ఎప్పుడూ ప్రతిపక్షంగానే ఉంటారు. రచయితలు ఎప్పటికప్పుడు మంచి సమాజాన్ని కోరుకుంటారు. వివక్షల సమాజంలో రచయిత ప్రతి పక్షంలో ఉన్నప్పుడే ప్రజా రచయిత అవుతాడు. గుర్రం జాషువా కూడా అలాంటి ప్రతిపక్ష రచయితే అని రాచపాళెం గారు చెప్పారు.

స్వాతంత్ర్యం రాగానే జాషువా కులమత వైషమ్యాలు పోవాలని భావించారు. అలాగే స్వతంత్ర భారతంలో అవినీతికి చోటు ఉండకూడదని ఆశించారు. ఇవ్వాల భారతదేశమంతటిని అవినీతి కోరలు బంధించాయి. ఈ ఆర్థిక అవినీతి బ్రిటీష్ వాళ్ళే నేర్పించినవే అని ఈయన భావం. వాళ్ళు మన దేశాన్ని విడిచి వెళ్లి ఏడు దశాబ్దాలు గడిచినా గానీ ఇప్పటికీ అసూయా, ద్వేషాలు, పగ, ప్రతీకారం మొదలైనవి మనల్ని విడిచి పెట్టలేదని జాషువా వాపోయాడు. పాలకులు చెడి, ప్రజలను కూడా అవినీతి పరులుగా చేస్తున్నారని మేథావులు వాపోతున్నారు. ఇలాంటి నేపథ్యం కలిగినదే నవ భారతం కవిత అని రాచపాళెం విశ్లేషించారు.

## 4.7. నవలా విమర్శ

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు నవలా సాహిత్యంపై విమర్శను పరిమితంగానే రాసారు. ఆయన రాసిన *'మన నవలలు – మన కథానికలు'* అనే విమర్శన గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. ఈపుస్తకంలో పదమూడు

నవలలపై రాసిన విమర్శనాత్మక వ్యాసాలున్నాయి. ఆయన నవలా సాహిత్యంపై రాసిన విమర్శ తక్కువేనని చెప్పవచ్చు. ఆ పరిమితమైన విమర్శలో అపరిమితమైన సామాజిక సిద్ధాంతాల సమన్వయాలు, విశ్లేషణలు, విభిన్న కోణాలు కనిపిస్తున్నాయి. ఆయన విమర్శించిన నవలల్లో ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన *'మాలపల్లి'*, శాంతి నారాయణ రచించిన *'పెన్నేటి మలుపులు'*, ఓల్గా రాసిన *'ఆకాశంలో సగం'*, బోయ జంగయ్య రాసిన *'జగడం'*, చిలుకూరి దేవపుత్ర రాసిన *'చీకటిపూలు'* మొదలైన నవలలను ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. ఈ నవలల్లో నవలల్లో కనిపించే జీవన దృక్పథం, రచయితల ప్రాపంచిక దృక్పథం మొదలైన విషయాలను దృష్టిలో ఉంచుకొని వాటిని విమర్శించినట్టు తెలుస్తుంది. సైద్ధాంతిక, వస్తు సమన్వయ చర్చ మీదనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్టుగా తెలుస్తుంది. నవలల్లోని విభిన్న కోణాల్ని విశ్లేషించారు.

తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధులైన వ్యక్తులు రాసిన నవలలోని వివిధ అంశాలపై విలువైన సమాచారంతో వచ్చిన వ్యాససంపుటి రాచపాళెం *'మన నవలలు – మన కథానికలు'*. నవలలు కథలలోని అనేక వైవిధ్యాంశాలపై చేసిన ఇరువై నాలుగు విశ్లేషణావ్యాసాల సమాహారం ఈ గ్రంథం. ఈ పుస్తకంలోని వ్యాసాలన్ని రచయిత తానుగా చెప్పుకున్నట్టు కొన్ని పుస్తకాలకు రాసిన ముందుమాటలు, మరికొన్ని ఇతరుల ప్రోత్సాహంతో రాసిన వ్యాసాలు ఉన్నాయి. ఆయా కాలాల రచయితల దృక్పథాలను పట్టుకున్న ఈ వ్యాసాలు అనేక చోట్ల విలువైన సమాచారాన్నిచ్చాయి. ఇవి ఆయా కవులు, రచయితలు, ప్రక్రియలను ఒకింత లోతుగా అర్థం చేసుకోడానికి ఉపకరిస్తాయి. ఇందులో వట్టికోట ఆళ్వారు స్వామి రాసిన *'ప్రజల మనిషి'* నవలలోని 'నవలా శిల్పం'పై చేసిన విశ్లేషణ ఒకటుంది. మిగిలిన వ్యాసాలలో వస్తు చర్చకే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టుగా తెలుస్తుంది. ఈ విశ్లేషణలలో రచయిత పరిశీలనానుభవం కనిపిస్తుంది.

రాచపాళెం తన సాహిత్య విమర్శ రచనా తొలి దశలో ప్రాచీన సాహిత్యంపై విమర్శను రాశారు. ఆ తరువాత ఆధునిక సాహిత్యంపై విమర్శ రాశారు. ఆచార్య దార్ల

వెంకటేశ్వరరావు '*విమర్శకుడిగా వల్లంపాటి వెంకటసుబ్బయ్య*' అనే వ్యాసాన్ని రాసారు. ఈ వ్యాసంలో వల్లంపాటి విమర్శలోని లక్షణాలను వివరిస్తూ 'ప్రాచీన విమర్శ నిర్దేశాత్మకం (Prescriptive) ఆధునిక విమర్శ వర్ణనాత్మకం (Descriptive) గాను, విశ్లేషణాత్మకం (Analytical) గాను ఉంటుందన్నారు. ఈ భేదాన్ని తెలుసుకున్నప్పుడు ఆధునిక ప్రక్రియా విమర్శలో నవల, కథా సాహిత్య విమర్శకు ఒక ప్రత్యేకత ఉందని దానికి భారతీయ అలంకార సూత్రాలు సరిపోవని స్పష్టం చేశారు. కల్పనా సాహిత్యం మూలాలన్ని పాశ్చాత్య సాహిత్యంతోనే చూడటం సరైన పద్ధతి అన్నారు. సృజనాత్మక సాహిత్యానికి అవసరమైన కథ, కథా వస్తువు, కథనం, నేపథ్య చిత్రణ, మనస్తత్వ చిత్రణ, దృష్టి కోణం, కంఠస్వరం (Tone), శైలీశాస్త్రం వంటి వన్నీ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోనే చూడాలి తప్ప ప్రాచీన ఆలంకారిక లక్షణాలను అన్వయించటం సరైనది కాదు అన్నారు. విమర్శలో కాలానుగుణ్యంగా వచ్చే ప్రమాణాలను సహృదయతో స్వీకరించాలని తద్వారా భారతీయ పాశ్చాత్య విమర్శ సూత్రాలను సమన్వయించుకోవాలనేది ఈయన విమర్శలో కనిపించే సమన్వయ దృక్పథం.[10] అని నిర్ధారించారు. ఈ విధమైన సమన్వయ దృక్పథమే రాచపాళెం సాహిత్య విమర్శలో కనిపిస్తుంది. వల్లంపాటి మాదిరిగానే రాచపాళెం కూడా పాఠకుడి దృష్టి కోణం నుంచి రచనను అంచనా వేస్తారు. ఏ రచనను విమర్శించినా అది పాఠకుడి మీద ఎలాంటి ప్రభావం చూపుతుందో చెబుతారు. రచయిత, రచనలో నచ్చిన అంశాన్ని ఎంత మక్కువతో చెబుతారో నచ్చని దాన్ని అంతే సున్నితంగా చెబుతారు. అలాగే రచయిత ఎంత పేరున్న వ్యక్తి అయినా వ్యతిరేకించాల్సి వచ్చినప్పుడు ఏ మాత్రం ఉపేక్షించరు.

రాచపాళెం సాహిత్య విమర్శనంతటినీ అధ్యయనం చేస్తే మార్క్సిజం అధ్యయనం ద్వారా ఆయన ఏర్పరచుకున్న సాహిత్యాభిప్రాయాలు తెలిసివస్తాయి. సాహిత్య సృజనకైనా, విమర్శకైనా ఆ అభిప్రాయాలు బాగా దోహదం చేస్తాయి. సామాజిక సాహిత్య విమర్శకుల్లో కట్టమంచి నుంచి లెక్కవేసుకుంటే నాలుగు తరాల వాళ్లు కనిపిస్తారు. మార్క్సిజం

---

[10] *" ఆధునిక సాహిత్య విమర్శకులు -ప్రస్థానాలు (2008)"*

స్పర్శలేకుండా సమాజ జీవితానికి సాహిత్యాన్ని దర్పణంగా ప్రతిఫలంగా భావించే కట్టమంచి తరంలో రాళ్లపల్లి, పుట్టపర్తి వంటి వాళ్లు వస్తారు. మార్క్సిజం తెలుగు వాళ్లకు పరిచయమైన తర్వాత పునాది ఉపరితల సిద్ధాంతం. దీని ప్రకారం సాహిత్యం, కళలు ఉపరితలాంశాలుగా భావించే తరం శ్రీశ్రీ, కొకు, పుచ్చలపల్లి మొదలైన వారిని చెప్పుకోవచ్చు. ఆ సిద్ధాంతాలను మరింత స్పష్టతతో ముందుకు తీసుకుపోయిన తరం రారా, వల్లంపాటి, కేతు, కొలకలూరి, చేరా, త్రిపురనేని మొదలైన వాళ్లు. ఆ తర్వాత తరంలో సింగమనేని, తెలకపల్లి, ఎస్వీ సత్యనారాయణ, కాత్యాయని విద్మహే, రాచపాళెం వంటి వాళ్లు ఉన్నారు. ఈ తరంలో దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీ, ప్రాంతీయ అస్తిత్వవాదాలు తమవైన ప్రమాణాలతో తెలుగు సాహిత్యం, విమర్శలోకి ప్రవేశించాయి. రాచపాళెం వీళ్లందర్నీ అధ్యయనం చేశారు.. చేస్తున్నారు.

### 4.7.1. రాచపాళెం సాహిత్య విమర్శ – అంబేద్కరిజం, మార్క్సిజాల సమన్వయం

ఏదైనా సాహిత్య సిద్ధాంతం ఆచరణలో పెట్టాల్సి వచ్చినప్పుడు దానికి కొన్ని అవరోధాలు ఎదురవుతాయి. ఈ సమయంలో వాటిని మరికొన్ని సాహిత్య సిద్ధాంతాలతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక సమాజంలో మానవుని సంక్షేమాన్ని కోరి అనేక సిద్ధాంతాలు ఆవిర్భవించాయి. అటువంటి సిద్ధాంతాలు సాహిత్య రంగంలో, సామాజిక, రాజకీయ, ఆర్థిక, రంగాల్లో పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. ఈ సిద్ధాంతాలు వివిధ కాలాలలో ప్రజలను ప్రభావితం చేస్తూ వచ్చాయి. సమాజంలోని వివిధ రంగాల్లో మెరుగైన సిద్ధాంతాలు పుట్టినప్పుడల్లా, పాత సిద్ధాంతాలు కాలగర్భంలో కలిసిపోయాయి. వాస్తవాలమీద ఆధారపడిన సిద్ధాంతాలే దేశ కాలాలను అధిగమించి మనుగడ సాగించగలుగుతాయి.

19,20 శతాబ్దాలలో ఉద్భవించిన సిద్ధాంతాలలో అన్నిటికంటే ఎక్కువగా ప్రపంచాన్ని ప్రభావితం చేసిన, చేస్తున్న సిద్ధాంతాలలో మార్క్సిజం, అంబేద్కరిజం ప్రధానమైనవి. వాటి గురించి స్థూలంగా తెలుసుకుందాం.

## 4.7.2. మార్క్సిజం (Marxism)

కారల్ మార్క్స్ ప్రతిపాదించిన కమ్యూనిస్టు సిద్ధాంతం గత 170 సంవత్సరాలుగా మార్క్స్ పేరుమీదుగా మార్క్సిజంగా ప్రచారమవుతోంది. మార్క్సిజం ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజల సిద్ధాంతంగా, కార్మికవర్గ విముక్తి సిద్ధాంతంగా పేరొందింది. చాలా దేశాల్లో అనేక మంది మేధావులను, రచయితలను, కళాకారులను, కార్మిక కర్షక జనాన్ని ఆకర్షించింది. ఆర్థిక అసమానతలు లేని సమసమాజమే దాని లక్ష్యమని ప్రచారం జరిగింది. మార్క్సిజాన్ని అందరూ భూలోక స్వర్గాన్ని స్థాపించే ఏకైక సిద్ధాంతంగా భావించి ఎన్నో కలలు కన్నారు. ఆ కలలను సాకారం చేసుకోవడానికై కమ్యూనిస్టు సంఘాలు, పార్టీలు ఏర్పడ్డాయి. వేలాది గ్రంథాల రూపంలో మార్క్సిస్టు సాహిత్యం వెలువడింది. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి– పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప' వంటి నినాదాలు అందరినీ ఆకర్షించాయి. పెట్టుబడిదారీ రాజ్యాలతో పోరాడడానికి కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. బలవంతంగా ఆరాజ్యాలను కూల్చడానికి ఆ పార్టీలు హింసామార్గాన్ని ఆశ్రయించాయి.

## 4.7.3. అంబేద్కరిజం (ambedkarism)

అంబేద్కరిజం అనేది భారతీయ సమాజానికి ఒక మానవ విమోచనావాదంగా పనిచేసింది. అంబేద్కరిజం పైకి పీడిత కులాల పక్షం మాత్రమే వహించినట్లు కనిపించినా దాని లక్ష్యసాధనలో అంబేద్కరిజం మొత్తం భారతీయులందరి కోసం ఉద్భవించిన విమోచనా సిద్ధాంతంగా కనిపిస్తుంది. కొంచెం విశాలదృక్పథంతో ఆలోచిస్తే అంబేద్కరిజంలో మొత్తం ప్రపంచ మానవుల విముక్తికి సంబంధించిన మార్గం ఉంది. నిర్దిష్టం నుంచి సాధారణీకరణకు జరిగిన ప్రయాణం ఉంది. చాలామంది అగ్రకుల మేధావులు చెబుతున్నట్లు, కొంతమంది బహుజన ఆలోచనాపరులూ అభిప్రాయపడుతున్నట్లు అంబేద్కరిజం అస్తిత్వవాదం కాదు. కేవలం గుర్తింపు కోసం ఆత్మగౌరవం కోసం జరపాల్సిన పోరాటాలకీ, సిద్ధాంతాలకీ మాత్రమే అంబేద్కరిజం

పరిమితం కాలేదు. కుల వ్యవస్థ వల్ల మనుషులు మనషులుగా ఉండలేకపోతున్న పరిస్థితి నుంచీ, అన్ని రకాల అణచివేతలకూ అధిక సంఖ్యాకుల్ని గురిచేస్తున్న నిచ్చెన మెట్ల వ్యవస్థ నుంచి విముక్తి సాధించటం ద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా సమాజాన్ని పునర్నిర్మించుకోవాల్సిన ఆవశ్యకతనీ, తీరుతెన్నుల్ని అంబేద్కరిజం అందిస్తుంది.

## 4.7.4. సమన్వయం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు తన విమర్శనా గ్రంథమైన *"మన నవలలు – మన కథానికలు"* అనే విమర్శనా గ్రంథంలో *"మాలపల్లి" నవలా వైశిష్ట్యం* పేరుతో ఒక వ్యాసాన్ని రాసారు. ఈ వ్యాసాన్ని అటు అంబేద్కరిజంతోనూ, ఇటు మార్క్సిజంతోనూ సమన్వయం చేసుకుంటూ విమర్శించారు. స్వాతంత్ర్యయోధుడు, సంఘ సంస్కర్త, తెలుగు నవల సాహిత్య వైతాళికుడుగా పేరొందిన ఉన్నవ లక్ష్మినారాయణ 1922లో తెలుగులో రచించిన *'మాలపల్లి' (The Village of Untouchable)* నవల ఆంధ్రప్రదేశ్ లో కుల, వర్గ దృక్పథంతో వెలువడిన తొలి అభ్యుదయ కావ్యంగా దీనిని పేర్కొంటారు. జాతీయోద్యమంలో భాగంగా పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని జైలు పాలైన ఉన్నవ లక్ష్మీనారాయణ రాయవెల్లూరు జైలులో ఉండగా ఈనవలను దేశభక్తి పూరితంగా సంఘసంస్కరణాభిలాషతో రచించారు. ఈ మాలపల్లి నవల ప్రగతి శీలక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మేలిమలుపుగా, సామాజిక దృక్పథంలో ఒక ముఖ్య ఘట్టంగా, సంఘ సంస్కరణ సాహిత్యంలో ప్రామాణికంగా నిలిచింది. అందువల్లనే రాచపాళెం దళిత జీవితంలోని ఆర్థిక, రాజకీయ సాంఘీక పార్శ్వాలను చిత్రించే ప్రయత్నం చేసిన తొలి తెలుగు నవల 'మాలపల్లి' అని అభిప్రాయపడ్డారు. అంబేద్కరిజం ప్రధాన ఆలోచనా స్రవంతిగా ఉన్న 'మాలపల్లిని' పోల్చి చూడాలన్నారు. (పుట.30)

అదేవిధంగా కులాన్నే వర్గంగా ప్రతిపాదిస్తున్న తీరును రాయలసీమకు చెందిన ప్రముఖ కవి శాంతి నారాయణ రాసిన "*పెన్నేటి మలుపులు*" అనే నవల ద్వారా విశ్లేషించే ప్రయత్నం రాచపాళెం వారు చేసినట్టుగా తెలుస్తుంది. ఈ నవల కులాన్నే వర్గంగా

ప్రతిపాదిస్తున్నదని, ఆర్థికంగా ధనవంతులు – దరిద్రులు అనే వర్గ దృష్టికి భారతీయ సమాజ స్వభావాన్ని కలుపుకుని ఈ నవల పై విధమైన వర్గీకరణ చేస్తున్నట్టు వివరించారు.(పుట;31) నిజానికి సాంఘిక సంస్కరణ అంటే సమాజ పునర్నిర్మాణమనీ, అట్టి సమాజ పునర్నిర్మాణానికే ముందు ప్రాముఖ్యం ఇవ్వాలి. గానీ దానికి ముందు రాజకీయ సంస్కరణ చేపట్టడం వాంఛనీయం కాదని[11] అంబేద్కర్ అంటారు. అంబేద్కర్ సూచించిన ఆలోచనా స్రవంతినే బోయ జంగయ్య *'జగడం'* నవలలో స్పష్టం చేసినట్టుగా తెలుస్తుంది. భారత సమాజంలో గుణాత్మకమైన మార్పు తేవడానికి దళిత చైతన్యం ఎంతగా ఉపకరిస్తుందో ఈ నవలలో ఆయన వివరించారు. దీనినే రాచపాళెం గుర్తించారు. 'రాచపాళెం కులపీడితుడు కాకపోయినప్పటికీకుల పీడిత సమాజం ఉండకూడదని కోరుకున్నారు. అందుకే మార్క్స నూ, అంబేద్కర్ నూ అంటుగట్టి 'దేశీయ మార్క్సిస్టుగా' ఎదిగారని' మేడిపల్లి రవికుమార్ గారు అన్నారు[12]. ఆర్థిక అసమానతల కన్నా ముందు కుల అంతరాలు నశించాల్సిన అవసరం ఉందని 'జగడం' నవలలోని రాజం పాత్ర ద్వారా రచయిత గుర్తిస్తారు. కుల అసమానతలు తగ్గి కులనిర్మూలన జరిగితే తప్ప వర్గం సమాజం ఏర్పడదు. వర్గ సమాజం ఏర్పడితే తప్ప కమ్యూనిస్టు ఉద్యమాలు విజయం సాధించవనే అర్థం రాజం మాటల్లో ఇమిడి ఉంది[13]. ఈ విధమైన దృక్కోణం నుండే *'జగడం'* నవలను రాచపాళెం విశ్లేషణ చేసినట్టుగా తెలుస్తుంది. అయితే రాచపాళెం సాహిత్య విమర్శలో చేసిన కృషిని గురించి వివరిస్తూ అనేకమంది ఆయనను మార్క్సిస్ట్ విమర్శకుడని, సామాజిక బాధ్యత కలిగిన విమర్శకుడని, నిబద్ధత కలిగిన సాహిత్య విమర్శకుడని అనేక విధాలుగా పేర్కొన్నారు. కానీ సిద్ధాంత సమన్వయ దృక్కోణం నుండి ఎవరూ ఆయన సాహిత్య విమర్శను విశ్లేషించినట్టుగా కనిపించడం లేదు. రాచపాళెంవారి సాహిత్య విమర్శ సిద్ధాంతం ప్రధానంగా మార్క్సిజాన్ని భూమికగా చేసుకుందనే విమర్శకులందరూ

[11] కుల నిర్మూలన, డా,బి ఆర్ అంబేద్కర్, హైదరాబాదు బుక్ ట్రస్ట్.పుట.21

[12] రాచపాళెం కవితా సమీక్ష(వ్యాసం), మేడిపల్లి రవి కుమార్(రాచపాళీయం, షష్టబ్ది అభినందన సంచిక).పుట;150

[13] అంబేద్కర్ అడుగుజాడల్లో 'జగడం' ('జగడం' నవలకు రాచపాళెం రాసిన ముందుమాటలో )

గుర్తించారు.*(చూ.మార్క్సిస్టు విమర్శకుడు రాచపాళెం- బి .తిరుపతిరావు)* అది చాలా వరకు వాస్తవమే అయినా ఆయనను కేవలం ఒక కోణం నుండి మాత్రమే చూడటం సాహిత్య విమర్శ దృక్కోణం నుండి చూసినప్పుడు సమంజసం కాదని అనిపిస్తుంది. అంబేద్కర్ భావజాలాన్ని అధ్యయనం చేసిన రాచపాళెం ఆ భావాలను తన సాహిత్య విమర్శలో నిబిడీకృతం చేసే ప్రయత్నం చేశారు. కాబట్టి ఆ కోణం నుండి కూడా ఈయన సాహిత్య విమర్శను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

సాహిత్య విమర్శకునికి ఒక సామాజిక బాధ్యతను, ఆచరణను సూచించిన విమర్శకులలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఒకరు. విమర్శకులలోని వైవిధ్యాన్ని చెబుతూ ప్రగతిశీల వాదులు, సంప్రదాయవాదుల మధ్య భావజాల పరమైన సంఘర్షణ ఆరోగ్యకరమైనదని ఆయన గుర్తించారు. ఒక ధోరణిలో వెలువడిన సాహిత్యాన్ని స్థల, కాల బద్ధమైన భావజాల పరమైన నేపథ్యంతో విశ్లేషించ వలసిన అవసరాన్ని ఆయన తెలియజేశారు. ఏది సమీక్ష, ఏది విమర్శ అనే విషయంలో స్పష్టతను తెలియజేసి విషయ సామర్థ్యాన్ని బట్టి శక్తివంతమైన సమీక్ష, విమర్శ కంటే గొప్పదని పేర్కొన్నారు. విమర్శలో రాసి కన్నా వాసి ముఖ్యమని ఆయన తెలిపారు. ఒక సాహిత్య విమర్శకుని భావజాలంలోని మార్పుకు సామాజిక నేపథ్యం ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో ఆయన తెలియజేశారు.

## 4.8. తెలుగు సాహిత్య పరిణామాలు

తెలుగులో లిఖిత సాహిత్యం సుమారు 11వ శతాబ్దం నుండి కనిపిస్తుంది. అది నన్నయ అంధ్రమహాభారతం రెండున్నర పర్వాలతో ఒక వ్యవస్థీకృత రూపం పొందింది. నన్నయ రాసినట్లు చెప్పే “అంధ్రశబ్ద చింతామణి”లో ‘విశ్వ శ్రేయః కావ్యం’ అని చెప్పినా, ఆంధ్ర మహాభారతంలో బ్రాహ్మణ ఆధిక్యతను, వైష్ణవ మత తత్వాన్ని అధ్యయనం చేశారు. తర్వాత శివ కవులు శైవాన్ని ప్రచారం చేయగా, తిక్కన హరిహరాద్వైతాన్ని ప్రతిపాదించగా, ఎఱ్ఱన మరలా వైష్ణవాన్నే తన రచనల్లో వర్ణించాడు. శ్రీనాథుని రచనల్లో భక్తినే చోటు చేసుకున్నా సాహిత్య విలువలతో కూడి, అది శైవానికే ప్రాధాన్యమిచ్చింది. ఇంచుమించు అదే

కాలానికి చెందిన పోతన ఆంధ్ర మహా భాగవతంలో వైష్ణవం పునః ప్రాణ ప్రతిష్ఠ పొందింది. కేతన, దండి తదితరులు కథా కావ్యాలు రాసినా, ప్రబంధ యుగంలో పెద్దన, శ్రీకృష్ణదేవరాయలు తదితర ప్రబంధ కవులు తమ వర్ణనా సామర్థ్యాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. దక్షిణాంధ్ర యుగంలో విలాస కావ్యాలు, యక్షగానాలు తదితర దేశీ ప్రక్రియలకు ప్రాధాన్యం లభించింది.

ఆధునిక సాహిత్య యుగంలో పాశ్చాత్య ప్రభావం వల్ల కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్య విమర్శతో తెలుగు సాహిత్యం పునర్మూల్యాంకనం చేయడం ప్రారంభమైంది. ఈ పరిణామంలోనే భావకవిత్వం, అభ్యుదయ, విప్లవ, దిగంబర కవిత్వాలు తెలుగు సాహిత్యాన్ని కొత్త మలుపులు తిప్పాయి. ఆ ధోరణుల తరువాత వచ్చిన స్త్రీవాదం, దళిత, మైనారిటీ వాదాలు తెలుగు సాహిత్యానికి కొత్త విలువల్ని పరిచయం చేశాయి. కేవలం సమకాలీన సాహిత్యాన్నే కాకుండా ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేసే పద్ధతికి పునర్మూల్యాంకన దృక్పథాన్నిచ్చాయి. ఈ పరిణామంలోనే ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తన సాహిత్య విమర్శ ద్వారా తెలుగు సాహిత్యాన్ని ప్రధానంగా ప్రాచీన ఆధునిక సాహిత్య మూల్యాంకనంలో మార్క్సిస్టు దృక్పథాన్ని ప్రదర్శించింది.

సమకాలీన తెలుగు సాహిత్య విమర్శకులలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు ఒకరు. ఈయన వివిధ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన రాసిన ఆధునిక సాహిత్య విమర్శలో వివిధ దృక్పథాలను అధ్యయనం చేసి తనదైన ముద్ర వేసుకున్నారు. ఈయన రాసిన విమర్శా గ్రంథాల్లో ప్రధానమైన కోణం పునర్మూల్యాంకనం. వారు రాసిన *"చర్చ(2006), "మరోచర్చ(2012)"* విమర్శ గ్రంథాలు తెలుగు సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేస్తూ వెలువడిన వాటిలో ముఖ్యమైనవి. సాహిత్యం కాలానుగుణంగా పరిణామం చెందుతుంది. అదేవిధంగా సాహిత్యాన్ని చదివే పాఠకుల ఆలోచనలు కూడా ఆ కాలానికి అనుగుణంగా మారుతుంటాయి. సాధారణంగా మన భావజాలాన్ని బట్టి మనం చూసే చూపునే దృక్పథం అంటాం. సాధారణంగా పాఠకుని భావజాలాన్ని బట్టి ఏ సాహిత్యాన్నైనా పునర్మూల్యాంకనం

చేయవచ్చు. దీనినే ఇటీవల కాలంలో విమర్శకులు 'సాహిత్య పునర్మూల్యాంకనం' అనే పారిభాషిక పదంతో సూచిస్తున్నారు. అయితే ఈ "పునర్మూల్యాంకనం" అనే పదానికి అర్థం తెలుసుకునే ముందు అసలు "మూల్యాంకనం" అంటే ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అనుకుంటున్నాను.

మూల్యాంకనం అనే పదాన్ని ఈ పదాలతో వివరిస్తుంటారు. Act of ascertaining or fixing the value or worth of/valuation/the making of a judgement about the amount, number, or value of something: assessment వీటిలో valuation అంటే the examiners did the valuation of all the papers/ it is wise to obtain an independent valuation అనే వివరణలను చెప్పుకోవచ్చు. దీన్ని మరలా valuation చేయడమే Re – valuation అవుతుంది. దీన్నే తెలుగులో "పునర్మూల్యాంకనం" అంటారు. ఒకసారి ఒక తీర్పుని లేదా ఒక విలువని కలిగించిన దాన్ని మరొకసారి సమకాలీన పరిస్థితులను బట్టి దాని విలువల్ని మదింపు చేయడాన్నే పునర్మూల్యాంకనంగా చెప్పుకోవచ్చని నిఘంటు అర్థాలను బట్టి తెలుస్తుంది.

సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం దృష్టితో విశ్లేషిస్తున్న వారిలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, జి లక్ష్మీ నరసయ్య, కాత్యాయని విద్మహే, బన్న అయిలయ్య, ముదిగంటి సుజాతారెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మేడిపల్లి రవికుమార్, కొలకలూరి మధుజ్యోతి, కొలకలూరి ఆశాజ్యోతి, దార్ల వెంకటేశ్వరరావు, కిన్నెర శ్రీదేవి, సంగిశెట్టి శ్రీనివాస్ మొదలైన వారిని పేర్కొనవచ్చు. సాహిత్య పరిణామంలో భాగంగా వచ్చిన ఈ మూల్యాంకనం, పునర్మూల్యాంకనం అనే పోకడలను రెండింటిని గూర్చి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి "ఒక రచన రాగానే, అప్పటికి అందుబాటులో ఉన్న సాహితీ సామాజిక కొలమానాలతో దానిని విశ్లేషించి, వ్యాఖ్యానించి, అప్పటి సాహిత్యంలో దాని స్థానాన్ని నిర్ణయిస్తే అది మూల్యాంకనం. ఆ తర్వాత కాలంలో సామాజిక సందర్భంగా మారినప్పుడు – అంటే సమాజంలో కొత్త ఉద్యమాలు, కొత్త సాహితీ సామాజిక భావజాలాలు అందుబాటులోకి

వచ్చినప్పుడు, వాటి వెలుగులో అదే రచనను సరికొత్తగా పరామర్శించడం మూల్యాంకనం”[14] అని నిర్వచించారు. అయితే ఈ విషయాలనే విస్తృతార్థంలో వివరిస్తూ మూల్యాంకనం, పునర్మూల్యాంకనం అనేవి విమర్శలో భాగమని చెబుతూ ఇందులో రెండు పార్శ్వాలున్నాయన్నారు. అందులో మొదటి పార్శ్వం సృజనాత్మక సాహిత్య రూపంలో సమాజాన్ని మూల్యాంకన, పునర్మూల్యాంకన చేస్తూ వెలువడుతుందని, రెండో పార్శ్వంలో ఒక రచనను మూల్యాంకన చేస్తూ విమర్శ వెలువడినా మారిన సామాజిక విలువల్ని బట్టి ఆ విమర్శల్ని సైతం పునర్విమర్శ (చర్చ, పుట;132)చేయడం అని వివరించారు.

## 4.9. మూల్యాంకనం, పునర్మూల్యాంకనం అనివార్యం

ఒకరు రాసిన సాహిత్యాన్ని మరొకరు పరిశీలించి, తన దృష్టితో మూల్యంకన చేసినప్పుడు, అవి కాల క్రమంలో పునర్మూల్యాంకనకు గురయ్యే అవకాశం ఉంటుంది. నూతన సిద్ధాంతాలు, నూతన పాఠకులు వచ్చినప్పుడు ఇలా తమ దృష్టికోణంతో ఆ సాహిత్యాన్ని పునర్మూల్యాంకన చేస్తుంటారు. మరొకవైపు ఆ సృజన సాహిత్య లక్ష్యాన్ని సరిగా గుర్తించకుండా చేసే మూల్యాంకనల వల్ల కూడా పునర్మూల్యాంకన జరుగుతుంది. దేన్నీ అంగీకరించడం, అంగీకరించకపోవడమనేది పాఠకుల ఇష్టం. కానీ అలా పునర్మూల్యాంకన జరగడాన్ని ఆహ్వానించడం ఒక ప్రజాస్వామిక సాహితీవేత్తకు మాత్రమే సాధ్యం అవుతుంది. ఆచార్య రాచపాళెం వారిలో ఈ లక్షణం కనిపిస్తుంది. సాహిత్య అభిప్రాయాలను ఒక పట్టాన ఒప్పుకొని రాచపాళెం వారు ప్రతి సాహిత్య విషయాన్నీ మూల్యాంకన, పునర్మూల్యాంకన దృష్టితో చూడాలంటారు. ఇది ఆయన విమర్శలోని ప్రత్యేకాంశం. ఒక వైపు ఆధునిక సాహిత్య విమర్శలో “కవిత్వతత్త్వ విచారం”(క.వి) కొత్త బోదెలు తవ్విందని కవులు, విమర్శకులు కట్టమంచి రామలింగా రెడ్డి గారిని తెగ పొగిడేస్తుంటే రాచపాళెం వారు కట్టమంచి గారి అభిప్రాయాన్ని తోసిపుచ్చుతూ “భారతమునందలి ద్రౌపదిని దృష్టి యందుంచుకొని ప్రభావతిని విమర్శింపరాదు. అర్జునుని చూచిన కన్నులతో ప్రద్యుమ్నుని

[14] మనం దినపత్రిక ‘మన సాహితీ’ 13-08-2018

చూడరాదని"[15]అంటారు. కట్టమంచివారు ప్రద్యుమ్నునిలో విరహంతో రగిలిపోతున్న ప్రబంధ పురుషున్ని మాత్రమే చూడగా[16] రాచపాళెం ప్రద్యుమ్నునిలో ఒక ద్రష్ట, భావుకుడిని చూశారు. అయితే భావం విషయంలో మాత్రం కట్టమంచిని అభినందిస్తూ, భాష విషయంలో మాత్రం వీరిది నన్నయ భాషే అని నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విషయంలో తాపీ ధర్మారావు గారిని సమర్థించారు.

సాహిత్య విమర్శ ప్రయాణించవలసిన మార్గాన్ని రాచపాళెం తన విమర్శ గ్రంథాల ద్వారా నిర్దేశించారు. అది ఎలాంటి నిర్దేశం అంటే ఒక సహేతుకమైన సిద్ధాంత పరమైనది. ఫలానాది తప్పు, ఫలననాది ఒప్పు అని నిక్కచ్చిగా చెప్పే నిర్దేశం అన్నమాట. రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు రచించిన 'కచుడా ఆదర్శం?' అనే వ్యాసంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. నన్నయ భారతంలోని కచుని విద్యాభ్యాస వృత్తాంతాన్ని 2003 – 04 విద్యా సంవత్సరంలోని ఇంటర్మీడియట్ మొదటి పాఠ్యపుస్తకంలో ప్రచురించడాన్ని దుయ్యబట్టారు. ఆపాఠ్యభాగం విద్యార్థులను చెడ్డదారిలో పయనించేట్టుగా ఉందని దీనిని పునర్మూల్యాంకన దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ విషయాన్ని హేతుబద్ధంగా విమర్శిస్తూ "కచుడు ఇంటర్ విద్యార్థులకే కాక ఎవరికీ ఆదర్శ ప్రాయుడే కాదు"[17] అని పేర్కొని దీనిని పునర్మూల్యాంకనం చేయవలసిన అవసరం ఉందని భావించారు. ఇందులో వస్తుగతమైన విమర్శకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. *"శిల్పప్రభావతి"(1980)* తరువాత *"తెలుగు కవిత్వం – నన్నయ ఒరవడి"(1987)* అనే విమర్శ గ్రంథంలో శిల్పానికి సంబధించిన విశ్లేషణ మాత్రమే కనిపిస్తుంది. ఈ గ్రంథం రాసే నాటికి రాచపాళెం వారికి సాహిత్యంలో వస్తుగతమైన అభిప్రాయాలు కనిపించనట్టు తెలుస్తుంది. అయితే ఆ తరువాత గురజాడ పై రాసిన "గురజాడ తొలి కొత్త తెలుగు కథలు" అనే గ్రంథాన్ని కవిజీవిత కావ్య సమన్వయ విమర్శతో విశ్లేషించారు. ఈ గ్రంథ రచనతో

---

[15] శిల్ప ప్రభావతి .పుట: 143

[16] కవిత్వతత్త్వ విచారం. పుట; 79

[17]. కొన్ని కావ్యాలు– కొందరు కవులు. పుట:61

వీరిలో ఆధునిక సాహిత్య భావాల ప్రభావం పడిందని చెప్పవచ్చు. ఈ విధంగా ఇంతవరకు వచ్చిన ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం, నేడు వెలువడుతున్న ఆధునిక సాహిత్యాన్ని మూల్యాంకనం చేయడమే ఈయన విమర్శలోని ప్రధానాంశంగా తెలుస్తుంది.

## 4.10. 'రాచపాళెం' సాహిత్య విమర్శ–చారిత్రక పరిణామం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి విమర్శా ప్రస్థానం శిల్పగతమైన చర్చతో ప్రారంభమై అది వస్తుగతమైన చర్చగా వికాసాన్ని పొందింది. ఆయన రాసిన సాహిత్య విమర్శను దశల వారిగా పరిశీలించినట్లయితే వీరి సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం అర్థమౌతుంది. ఒక వ్యక్తి సామాజిక పరిస్థితులు ఆ వ్యక్తి సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి అన్నది ఎంత సత్యమో, కాలక్రమంలో ఆ వ్యక్తి సాహిత్యం పరిణామం చెందుతుందన్న మాట కూడా అంతే సత్యం. కాబట్టి రాచపాళెం సాహిత్య విమర్శ ఒక చారిత్రక పరిణామాన్ని సంతరించుకుందని చెప్పవచ్చు. రాచపాళెం వ్యక్తిత్వం గురించి సినారె "సంప్రదాయంలో మొలకెత్తిన రాచపాళెం వ్యక్తిత్వం పరిణామ క్రమంలో ప్రయోగశీలాన్ని, ప్రగతి దృక్పథాన్ని తనలో మేలవించుకుందని"[18] అంటారు. ఇక్కడ వ్యక్తిత్వం అంటే కేవలవ్యక్తిత్వం అని కాదు. ప్రతి కవి, విమర్శకుల వ్యక్తిత్వాలు వారి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయని ఆయన అంతరార్థం కావచ్చు. నిజానికి ఆయన సాహిత్య విమర్శ శిల్ప విశ్లేషణతో ప్రారంభమై వస్తు విశ్లేషణతో వికాసాన్ని పొంది సామాజిక దృక్పథంతో ప్రగతిశీల భావాలతో కొనసాగుతుందని చెప్పవచ్చు.

## 4.11. రాచపాళెం సాహిత్య విమర్శ 'మలిదశ' విమర్శలోని ప్రధానాంశాలు

---

[18] రాచపాళీయం గ్రంథానికి రాసిన అభినందన సందర్భంలో

1. రాచపాళెం సాహిత్య విమర్శను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లయితే ఒక చారిత్రక క్రమ పరిణామాన్ని మనం గమనించవచ్చు.

2. ఆయన ప్రారంభంలో రాసిన విమర్శలో లక్షణచర్చకు ప్రాధాన్యత ఇచ్చారు. దీనికి ఉదాహరణగా ఆయన రాసిన *"శిల్ప ప్రభావతీ"(1980)* అనే తన సిద్ధాంత గ్రంథాన్ని చెప్పుకోవచ్చు.

3. ఆ తరువాత కొన్ని సామాజిక పరిస్థితులకు ప్రభావితుడైన ఆయన విమర్శా దృక్పథంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కె. వి. రమణారెడ్డి రాసిన "మహోదయం" అనే గ్రంథ ప్రభావంతో *"గురజాడ – తొలి కొత్త తెలుగు కథలు"(1985)* అనే విమర్శా గ్రంథాన్ని కవిజీవిత విమర్శ దృష్టితో రచించారు.

4. కథలు, నవలలను విమర్శించేటప్పుడు సిద్ధాంత సమన్వయ విమర్శకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది.

5. ఈయన తన విమర్శలో నిచ్చెన మెట్ల సమాజ వ్యవస్థను కేంద్రంగా చేసుకొని, దాన్ని స్వరూపాన్ని గమనించి విమర్శ చేశారు.

6. రాచపాళెం వారు విమర్శకు సంబంధించిన మౌలిక ప్రతిపాదనలు చేయడం వలన రచయితలకు, విమర్శకులకు అవి మార్గదర్శనం అవుతాయి.

7. ఈయన తన విమర్శలో అన్ని విషయాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడాన్ని మనం గమనించవచ్చు. ఏదైనా ఒక గ్రంథాన్ని విమర్శన చేసేటప్పుడు అవసరమైన కొన్ని దశలను ఈయన మౌలికంగా వివరించారు. అవి రచయిత పరిచయం, గ్రంథ నేపథ్యం, విశ్లేషణ, లోపాలు, పరిష్కారాలు, సూత్రీకరణలు మొదలైన వాటిని ఆయన విమర్శలోని సోపానాలుగా చెప్పవచ్చు.

8. ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణాన్ని రచయితకు సూచించడం, దాని బాధ్యతను తెలియజేయడం ఆయన విమర్శలో ప్రధానాంశం.

9. విమర్శకుడు కేవలం ఒక ప్రక్రియకో, ఒక దృక్పథానికో పరిమితం కాకుండా ఉండేలా తన తరువాతి విమర్శకులకు మార్గదర్శనం చేస్తూ అభ్యుదయ, దళిత, స్త్రీ, విప్లవ, మార్క్సిస్టు మొదలైన అన్ని భావజాలాల పట్ల తన దృక్పథాన్ని తెలియజేస్తూ విమర్శ రాసారు.

10. ఒక ప్రాంతంలోని రచయిత కేవలం ఆ ప్రాంతంలోని రచనలను మాత్రమే విమర్శా వస్తువుగా స్వీకరించడం వలన అతని ఆలోచనా ధోరణి అంతగా పరిణతి చెందినట్లుగా కనిపించకపోవచ్చు. కాబట్టి ఈయన జన్మతః రాయలసీమలో జన్మించినప్పటికి ఇతర అన్ని ప్రాంతాల నుండి వెలువడిన సాహిత్యాన్ని నిబద్ధతతో విశ్లేషించారు. ఆ విధంగా వచ్చిన గ్రంథాలలో "కవుల తెలంగాణం" (2016) ముఖ్యమైనది.

11. రచయితలు వారు చెప్పగలిగే వాస్తవాలను, తాత్విక దృక్పథాన్ని, భావజాలాన్ని బయట పెట్టకపోవడాన్ని ఈయన నిరసించారు.

12. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన విమర్శలో వస్తుగతమైన చర్చకు ప్రాధాన్యత ఇచ్చారు.

13. రాచపాళెం వారి సాహిత్య విమర్శ అటు మార్క్సిజం, ఇటు అంబేద్కరిజాన్ని అనుసరించి సమన్వయం చేసే విధంగా ఉంది.

14. ఆయన వట్టికోట ఆళ్వారు స్వామి రచించిన "ప్రజల మనిషి" నవలపై వస్తు, శిల్ప దృష్టితో రాసిన ఒక వ్యాసంలో వస్తుశిల్పాల సమన్వయం కనిపిస్తుంది.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన సాహిత్య విమర్శను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఒక సామాజిక పరిణతిని మనం చూడొచ్చు. సాంప్రదాయ క్షేత్రంలో మొదలైన ఆయన సాహిత్య విమర్శా వ్యవసాయం క్రమంగా ఆధునిక సాహిత్యమనే కొత్త వంగడాలను పుణికి పుచ్చుకొని వాటి ఫలాలను పాఠకులకు అందించాలనే తపన ఆయన విమర్శలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధంగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు నాలుగున్నర దశాబ్దాలుగా తన విమర్శనా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, వివిధ దృక్పథాలను స్పృశిస్తున్నారు.

# అధ్యాయం-5

## అధ్యాయం – 5

# 'రాచపాళెం' సాహిత్య విమర్శ – ఇతరాలు

### 5.0. పరిచయం

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి సాహిత్య విమర్శను చారిత్రక అధ్యయన కోణం నుండి గత అధ్యాయాలలో పరిశీలించి విశ్లేషించాను. ఈ అధ్యాయంలో ఆయన సాహిత్య విమర్శలో భాగంగా వివిధ కావ్యాలకు రాసిన ముందుమాటలను, వివిధ దినపత్రికలలోని సాహితీ పుటలలో వచ్చిన సాహిత్యాన్ని సమీక్షిస్తూ రాసిన వ్యాసాలు, సాహిత్య విమర్శకు సంబంధించిన మరికొన్ని అంశాలను వివరిస్తాను. ఈ అధ్యాయంలో *"విమర్శ -2009", "విమర్శ -2011"*, అనే విమర్శ గ్రంథాలు, రాచపాలెం వారు వివిధ రచయితల పుస్తకాలకు రాసిన పీఠికలను పరిశీలిస్తాను. నా పరిశోధన చారిత్రక అధ్యయన దృష్టితో సాగేది గనుక వాస్తవానికి *"విమర్శ -2009", "విమర్శ - 2011"* అనే విమర్శా గ్రంథాలను రాచపాళెం సాహిత్య విమర్శ తొలిదశలోనే విశ్లేషించాలి. కానీ ఈ రెండు గ్రంథాలు మిగిలిన విమర్శా గ్రంథాల కంటే ప్రత్యేకమైనవి. కాబట్టి వీటిని ఈ అధ్యాయంలో మాత్రమే విశ్లేషించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా ఆయన రాసిన సాహిత్య పీఠికలు కూడా ఇటువంటి ప్రత్యేకతనే కలిగి ఉన్నాయి కాబట్టి వాటిని కూడా ఈ అధ్యాయంలో భాగంగా పరిశీలిస్తాను.

రాచపాళెం తాను విమర్శ రాసే మలిదశ(2001) నుండి ఒక సంవత్సరం పాటు వచ్చిన వివిధ పత్రికల్లో వచ్చిన సాహిత్య విమర్శను సమీక్షిస్తూ వ్యాసాలను రాయడానికి పూనుకున్నారు. ఆ విధంగా 2008 వరకు వచ్చిన సాహిత్య విమర్శను మొత్తాన్ని విశ్లేషించారు. అయితే ఒక ఏడాదిలో వచ్చిన సాహిత్య విమర్శను ఒక చిన్న వ్యాసంలో సమీక్షించడం ఆయనకు అశాస్త్రీయమనిపించింది. అందువల్ల 2009, 2011 సంవత్సరాలలో ఒక్కొక్క సంవత్సరంలో వచ్చిన సాహిత్య విమర్శను సమీక్షిస్తూ ఒక్కొక్క

గ్రంథమే రాసేశారు. సాహిత్య విమర్శలో ఈ విధమైన కొత్త ఆలోచన భవిష్యత్తు తరాలకు మార్గనిర్దేశనం అని చెప్పవచ్చు. ఒక్కొక్క ఏడాదిలో జానపద సాహిత్యం మొదలు సాహిత్య విమర్శా ప్రక్రియ దాకా విమర్శను ప్రక్రియా పరంగా విశ్లేషించడమే *"విమర్శ -2009"*, *"విమర్శ- 2011"* అనే గ్రంథాల లక్ష్యంగా చెప్పవచ్చు.

## 5.1. అధివిమర్శ (Meta Criticism)

తెలుగు సాహిత్య విమర్శా చరిత్రలో ఒకరు రాసిన సాహిత్య విమర్శను మరొకరు పునః పరిశీలన, పునఃసమీక్ష చేస్తూ విమర్శను వెలువరిస్తే దానిని అధివిమర్శ(Meta Criticism) అంటారు.

## 5.2. అధివిమర్శకులు (Meta Critics)

సాహితీ విమర్శకులను గురించి మరికొంతమంది సాహితీ విమర్శకులు విశ్లేషిస్తే వారిని అధి విమర్శకులు (Meta Critics)అని అంటారు. ఈ అయిదవ అధ్యాయంలో ఎక్కువభాగం రాచపాళెం వారి అధివిమర్శను పరిశోధిస్తాను.

## 5.3. దిన పత్రికల్లో వచ్చిన సాహిత్య పుటల సమీక్ష

నేటి ఆధునిక కాలంలో దినపత్రికలు మన జీవితంలో భాగంగా ఉన్నాయి. ఎందుకంటే పొద్దున్నే లేవగానే మన కార్యక్రమాలన్నింటిలో మొదట పూర్తయ్యే కార్యక్రమం దినపత్రికలను చదవటం. పామరుల నుండి పండితుల దాకా అందరూ ఏదో ఒక సందర్భంలో దిన పత్రికలను తిరగేస్తుంటారు. ఈ విధంగా పాఠకులు తాము చదివేది పత్రికయినా, పుస్తకమైనా అది ఏదో ఒక ప్రయోజనాన్ని కలిగి ఉన్నట్లయితే అది ఆ పని సార్థకమైనదని భావించవచ్చు. పుస్తకం హస్తభూషణం కాకూడదని, మస్తకం చేరినపుడే ప్రయోజనం అనే మాట వింటుంటాం. పుస్తకాలైనా, పత్రికలైనా ఏ ఇతర రచనలైనా చదివినపుడే విజ్ఞానవంతులవుతాం, అది మస్తకం చేరుకున్నప్పుడే సమాజానికి ప్రయోజనం. రోజూ మనం ఏదో ఒక దినపత్రిక తెప్పించుకుంటాం, వీలైతే చదువుతాం. అందులో కొన్ని

నచ్చిన శీర్షికలు, నచ్చనివీ ఉంటాయి. వారి వారి అభిరుచిని బట్టి చదువుతారు. భాషా సాహిత్యాలను కొందరే చదువుతారు. ముఖ్యంగా ఆసక్తి ఉన్నవారు మాత్రమే చదువుతారు. అసలు దినపత్రికల్లో కూడా సాహిత్యశీర్షికలు ఉంటాయా? ఉంటే వాటిని ఎంతమంది చదువుతున్నారు? అనే సందేహాలు చాలా మందికి ఉన్నాయి. పత్రికలకు రాజకీయ ప్రయోజనాలొక్కటే కాదు సామాజిక బాధ్యతా ఉంటుంది. ప్రజాస్వామ్య భవనానికి పునాదిరాళ్ళు పత్రికలు. యాజమాన్యాలు ఏ రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉన్నా కొంతలో కొంతైనా భాషా సాహిత్యాన్ని ప్రచురిస్తున్నాయి. అందుకే నార్ల వారు 'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు.. పత్రికొక్కటున్న మిత్ర కోటి' అని అన్నారు.

తెలుగు దిన, మాస, వార పత్రికల్లో వస్తున్న సాహిత్య పుటలను పరిచయం చేస్తూ 2009 సంవత్సరంలో వచ్చిన సాహిత్య విమర్శ మొత్తాన్ని విశ్లేషించి *"విమర్శ-2009"* పేరుతో రాచపాళెంవారు ఒక వ్యాస సంపుటిని రచించారు. ప్రత్యేకించి విమర్శా ప్రక్రియనే ఎందుకు ఎంచుకున్నారంటే ఆయన అది వరకే విమర్శా రంగంలో విశేషమైన కృషి చేసి ఉన్నారు కాబట్టి. అంతే గాక సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి విమర్శ ప్రక్రియ చైతన్యవంతంగా పని చేస్తుందని రాచపాళెం భావిస్తారు. సాహిత్యం ఎక్కువగా రావాలన్నా, వచ్చిన సాహిత్యం మరింత అభివృద్ధి చెందాలన్నా విమర్శ ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని చెప్పవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే 'వర్తమానాన్ని వర్తమానంలోనే వ్యాఖ్యానించడం ఒక కొత్త బాధ్యత'[1] అని అంటారు రాచపాళెం. ఆ విధమైన కొత్తదైన బాధ్యతతోనే 2009 ఏడాదికి సంబంధించి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రభూమి, సూర్య, సాక్షి, విశాలాంధ్ర వంటి దినపత్రికలతో పాటు సాహిత్య ప్రస్థానం, చినుకు, శ్రీశ్రీ బులెటిన్లు, అరుణతార, ప్రజాసాహితీ, చినుకు వంటి మాస పత్రికలను సంప్రదించారు. ఆ విధంగా ఈ ఏడాది లో వచ్చిన సాహిత్య పుటలను పరిశీలించి వాటిని విశ్లేషించారు. అలా

[1] విమర్శ-2009

రాసిన విశ్లేషణాత్మక వ్యాసాలన్నింటినీ కలిపి చినుకు ప్రచురణ సంస్థ‘విమర్శ 2009’ పేరుతో ప్రచురించింది.

## 5.4. విమర్శ 2009

రాచపాళెం వారు వివిధ పత్రికల్లో 2009 ఏడాదిలో వచ్చిన సాహిత్య పుటలను అధ్యయనం చేసిన తరువాత ఈ ఏడాది సాహిత్య విమర్శ చదువుతుంటే మన తెలుగు సాహిత్య విమర్శ పదు నెక్కుతుందనే నమ్మకం కలుగుతుందని, ఎవరో ఒకరిద్దరు తప్ప సాహిత్య విమర్శకులు మొత్తం నాగరికంగా, ప్రజాస్వామికంగా సాహిత్య చర్చ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది తెలుగు సాహిత్య విమర్శ గతం కన్నా మెరుగ్గా ఉంది. అనేక పార్శ్వాల నుండి విభిన్న దృక్పథాలతో అనేకాంశాల మీద ఆసక్తికరంగా ఆలోచనాత్మకంగా సాగిందని వివరించారు. ఈ క్రమంలో వినోదిని, ద్వానాశాస్త్రి, జాన్సన్ చోరగుడి, అక్కిరాజు రమాపతిరావు, ముదిగొండ శివప్రసాద్ వంటి వాళ్ళు తమ తమ దృక్పథాల నుండి సుదీర్ఘమైన చర్చకు అవకాశమిచ్చే విమర్శలు రాసినట్టుగా ఆయన పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది తెలుగు సాహిత్య విమర్శ అంత చురుకుగా పనిచేయడానికి ముఖ్య కారణాల కోసం కూడా రాచపాళెంఅన్వేషించారు. ఈ అన్వేషణలో భాగంగా రెండోతరం ఆధునిక తెలుగు రచయితలు, మొదటి తరం అభ్యుదయ రచయితలు అయిన కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, సుంకర సత్యనారాయణ, మహీధర రామమోహనరావు, త్రిపురనేని గోపీచంద్ వంటి వారి శత జయంతులు, దీనికితోడు దిద్దుబాటు, మీ పేరేమిటి, దేశభక్తి రెండవ కన్యాశుల్కం వంటి గురజాడ రచనల శతజయంతులు, అంతేగాక అజ్ఞాతకవి రాసిన ‘మాలవాండ్రపాట’ శతజయంతి, భరత ఖండంబు చక్కని పాడియావు పద్య కర్తృత్వ వివాదం వంటి అంశాలు ఈ ఏడాది సాహిత్య విమర్శ వికాసానికి దోహదం చేసాయని వ్యాఖ్యానించారు. ననుమాస స్వామి, వాడ్రేవు వీరలక్ష్మి దేవి, జాన్సన్ చోరగుడి, అమ్మంగి వేణుగోపాల్ వంటి వాళ్ళ విమర్శలు సీరియస్గానే వచ్చినట్టుగా తెలిపారు. అంతేగాక దేశ విదేశీ రచయితల మీద వాడ్రేవు వీరలక్ష్మిదేవి, రామతీర్థ, దేవరాజు మహారాజు, నాగ భూషణాచార్యులు వంటి వారు

తమ విమర్శలు రాసి తెలుగువారి సాంస్కృతిక వైశాల్యానికి ప్రతీకలుగా నిలిచారని తెలిపారు.

సాహిత్య విమర్శకు ఉండాల్సిన మౌలికతను గురించి వివరిస్తూ సాహిత్య విమర్శ ఒక గంభీరమైన ప్రక్రియగా అభివర్ణించారు. దాంట్లోకి అసంబద్ధ హాస్యం చొరబడితే సాహితీ రంగం అల్లరి పాలవుతుందని చెప్పారు. అయితే ప్రతి సాహిత్య విమర్శకుడి భావజాలం కాలక్రమంలో కొన్ని మార్పులకు లోనుకావచ్చు. అయితే ఆ విమర్శకుడిని ముందు భావజాలానికి చెందిన వాడిగానే పరిమితం చేయడం సరికాదన్నారు రాచపాళెం. అతన్ని ఆ విధంగా బంధించి మాట్లాడటం వలన సమాజానికి ఎంతో నష్టం జరుగుతుందని అంటారు. సాహిత్య విమర్శలో అసహనానికి చోటు ఉండకూడదు. ఒకవేళ ఉంటే అది తిట్లకు, దౌర్జన్యానికి దారి తీస్తుందని చెప్పవచ్చు. సమాజం వివిధ భావజాలాలతో విభజితమై ఉన్నప్పుడు అన్ని విభాగాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడమే ప్రజాస్వామిక మార్గం అని ఆయన చెప్పారు. సాహిత్య విమర్శ ఆరోగ్యంగా ఎదుగుతుంది అనడానికి 2009 సాహిత్య విమర్శ సాక్షి అని అభిప్రాయపడ్డారు. అయితే దీనికున్న కొంత పరిమితిని గురించి వివరిస్తూ పత్రికల్లో వచ్చే కొన్ని వ్యాసాలకు, వ్యాస శీర్షికకు పొంతనే ఉండదని తెలియజేశారు. ఒక పెద్ద వ్యాసంలో ఎంతో గొప్ప విషయాలు చెప్పడం ఒక రకమైతే, ఒక చిన్న వ్యాసంలో ఒక్క పాయింటును పట్టుకొని ఒక శతాబ్ది చరిత్రకు వారధి నిర్మించే ప్రయత్నం కూడా ఈ ఏడాది జరిగిందని వివరించారు. అయితే ఈ ఏడాది సాహిత్య విమర్శ మొత్తం రాశిలోనేగాక వాసిలోనూ బాగుందని రాచపాళెం వారు విశ్లేషించారు. అయితే ఒక్క మార్క్సిస్టు సాహిత్య విమర్శలోనే స్పష్టమైన గుణదోష విచారణ కనిపిస్తుందని చెప్పిన అభిప్రాయంపై పునరాలోచించుకోవలసిన అవసరం ఉందని అనుకుంటున్నాను.

## 5.5. జానపద, ప్రాచీన సాహిత్య అధ్యయనం – మౌలిక భావనలు

తెలుగు సాహిత్య చరిత్రలో శివకవులుగా ప్రసిద్ధి చెందిన నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు మొదలైన వారి వారి ప్రాచీన కావ్యాల్లో జానపద గేయాల ప్రస్తావన ఉంది

అయితే 19వ శతాబ్దం వరకు కేవలం మౌఖిక ప్రచారంలోనే జీవిస్తున్న జానపద గేయ సాహిత్యాన్ని సేకరించడం కానీ, విశ్లేషించి దానిలోని సాహిత్య విలువలను గుర్తించి వివేచించడం కానీ తెలుగు వారు చేయలేదు. అయితే జానపద సాహిత్య సేకరణకు మొదట పూనుకున్న వారు అంగ్లేయులనే చెప్పవచ్చు. వారిలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ను ప్రథమునిగా చెప్పుకోవచ్చు. బ్రౌన్ తెలుగులోని జానపద కథాగేయాలను, ఐతిహ్యాలను, సామెతలను సేకరించి, విశ్లేషించి తొలి తెలుగు జానపద వాఙ్మయోద్ధారకుడయ్యాడని చెప్పవచ్చు. బ్రౌన్ తరువాత పేర్కొనదగ్గ ఆంగ్లేయ విద్వాంసుడు బోయేల్. ఈయన సేకరించిన గేయాలను "Telugu Ballad Poetry" పేరుతో 1874లో Indian Antiquary లో దానిని ప్రచురించాడు. అయితే ఆంగ్లేయుల తరువాత తెలుగు వారి దృష్టి జానపద సాహిత్య సేకరణ, ప్రచురణ విమర్శ పైనే ప్రసరించింది. ఈ క్రమంలో నంది చలపతిరావు *'స్త్రీల పాటల'* పుస్తకాలు వెలువడ్డాయి. ఆ తరువాత టేకుమళ్ళ అచ్యుతరావుగారు *"ఆంధ్ర పదములు – పాటలు"* అనే వ్యాస సంకలనాన్ని ముద్రించారు. ఈవిధంగా 19వ శతాబ్ది ఉత్తరార్థం నుంచే జానపద సాహిత్యం పైన విమర్శ బహుముఖంగా పరివ్యాప్తమైంది. వీరి తరువాత నేదునూరి గంగాధరం, బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణకుమారి, ఆర్వీయస్ సుందరం, తంగిరాల వెంకట సుబ్బారావు, జి. యస్. మోహన్ వంటి అనేకమంది జానపద సాహిత్య విమర్శ కోసం కృషి చేసారు.[2] అయితే అది కొంతకాలం అవిరామంగా కొనసాగి ఆగిపోయింది. ఒక వ్యవస్థగా మారిపోయిన జానపద విజ్ఞాన విమర్శ వెనక్కి వెళ్ళిపోయింది. అడపాదడపా విశ్వవిద్యాలయాల్లో కొన్ని పరిశోధనలు జరుగుతున్నా అవి కేవలం సిడిలకే పరిమితమవుతున్నాయి. కాబట్టి జానపద విజ్ఞాన పరిశోధనకు, విమర్శకు ప్రత్యేక వ్యవస్థ కావాలి. దానికోసం ఆలోచించాలి అని రాచపాళెంవారంటారు. ఈ నేపథ్యంలో ఆచార్య ననుమాస స్వామి 'వృత్తి పురాణాలు'లు పేరుతో వరుస వ్యాసాలు రాయడం గమనించిన రాచపాళెంవారు ఆయన కృషిని అభినందించారు. అంతేగాక అదొక గొప్ప సామాజిక బాధ్యత అని కొనియాడారు. ఆచార్య

[2] ఆంధ్రుల జానపద విజ్ఞానం., ఆర్వీయస్ సుందరం, పుట;17

నసుమాస స్వామి రాసిన వ్యాసాలను సేకరించి విశ్లేషించిన తరువాత రాచపాళెంవారు జానపద సాహిత్య విమర్శ పైన కొన్ని మౌలికమైన భావనలను తెలియపరిచారు. అవేమంటే జానపద పురాణాలూ, శిష్ట పురాణాలూ మౌఖిక లిఖిత సంప్రదాయాలకు చెందినవైనా వాటి మధ్య ఆదాన ప్రదానాలు జరిగినట్లు చెప్పారు. అంతేగాక స్వామి గారు "చరిత్రనంతా తన పుక్కిటిలో పెట్టుకుని ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ వచ్చిందే వృత్తి పురాగాథ సాహిత్యం" అని చెప్పిన సూత్రీకరణను శాస్త్రీయమైనదిగా రాచపాళెం వారు అభిప్రాయపడ్డారు. ఇదే ఒరవడిలో చొక్కా గంగిరెడ్డి రాసిన *'తెలుగు సామెతల్లో కుటుంబ వ్యవస్థ'* అన్న వ్యాసం కూడా ఆసక్తికరంగా ఉందని చెప్తూ అందులో కుటుంబ సంబంధాల ఆధారంగా వచ్చిన సామెతలను అర్థ వివరణతో వ్యాఖ్యానించిన తీరు బాగుందని వివరించారు.

## 5.6. ప్రాచీన సాహిత్యం – మనువాద ప్రభావం

ఆధునిక సాహిత్యం మీద వచ్చినంత సాహిత్య విమర్శ ప్రాచీన సాహిత్యం జానపద సాహిత్యం మీద వెలువడలేదు. ఎందుకంటే ఆధునిక చారిత్రక దృక్పథంతో సమకాలీన భావజాలాల నేపథ్యంలో ప్రాచీన సాహిత్యాన్ని వివేచించే దశ ఒకటుండేది. అది అయిపోయింది. ఒకవేళ ఎవరైనా అలాంటి ప్రయత్నం చేసినా భూస్వామ్య నిబద్దత గల పండితులు సహించరని మనువాదులను దృష్టిలో ఉంచుకుని రాచపాళెంఈ సూత్రీకరణ చేసినట్టుగా తెలుస్తుంది. సాధారణంగా అణగారిన వర్గాల పక్షం వహించే వారిపై ఆధిపత్యం చెలాయించే వారిని మనువాదులుగా పేర్కొంటారు. మనువాదులు అంటే ఎవరో వాళ్ళ స్పష్టంగా చెప్పకపోయినా కులానికి ప్రాధాన్యత ఇచ్చేవారిని, యోగ్యతకు కాకుండా జన్మ సిద్ధాంతానికి ప్రాధాన్యత ఇచ్చేవారిని మనువాదులుగా పేర్కొంటున్నారు.

బ్రాహ్మణాలు, ధర్మ సూత్రాలు, ధర్మశాస్త్రాలు వంటి తదనంతరపు వైదిక సాహిత్యంలో అంటరానివాళ్ళు అనే పదాన్ని ఉపయోగించడం కనిపిస్తుంది. ఈ గ్రంథాల ప్రకారం చండాలురు కర్మ ఛండాలురు, జన్మ ఛండాలురు అని రెండు రకాల వాళ్ళు ఉంటారు. ఒకరు తాము చేసిన చెడు వల్ల ఛండాలురైతే, మరొకరు పుట్టుకతోనే

ఛండాలురుగా పుట్టిన వాళ్ళు. వశిష్టుని అభిప్రాయం ప్రకారం నాస్తికుడు, లోభి, నీచుడు, నిత్య కోపిష్టి అనే నాలుగు రకాల వాళ్ళు కర్మ ఛండాలురు, కాగా ఐదో రకం వాళ్ళు జన్మ ఛండాలురు. అట్టి వారిని ఊరినుంచి బహిష్కరించాలని అన్నాడు మనువు. అయితే ఈ బహిష్కరణ తొలుత వీధులకే పరిమితమైన కాలక్రమంలో అది మొత్తం సమాజంలో వేల్లానుకుపోయి నేడు విశ్వవిద్యాలయ స్థాయికి చేరింది. ఆ మనువాద పండితుల నిరంకుశ దాడితో విశ్వవిద్యాలయ ఆచార్యులు మౌనం వహించడాన్ని రాచపాళెం తీవ్రంగా నిరసించారు. ప్రజాస్వామ్య యుగంలో జీవించేవాళ్ళు దేన్ని గురించైనా ప్రజాస్వామికంగానే మాట్లాడుకోవాలి. దాని మీద నమ్మకం లేనప్పుడు దబాయింపే ఆయుధమౌతుందని మనువాదుల నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. విభిన్న దృక్పథాలు కలిగిన సాహిత్యంలో విభిన్న భావజాలాలు కలిగిన వ్యక్తులుంటారు. అయితే అందరి భావజాలను గౌరవించాలని ఆయన అభిప్రాయ పడ్డారు.

ప్రాచీన సాహిత్యం మీద వచ్చే విమర్శలో మూడు ధోరణులు కనిపిస్తాయని రాచపాళెం అన్నారు.

అవి 1) ప్రాచీన సాహిత్యాన్ని వర్తమాన దృక్పథంతో పరిశీలించి నేటి సమాజానికి ప్రాచీన సాహిత్యానికి గల సంబంధాన్ని, అందులో నేటి సమాజానికి పనికొచ్చేదీ, పనికిరానిదీ నిర్ధారించడం.

2) వర్తమాన దృష్టిలేకుండా ప్రాచీన సాహిత్యాన్ని పాత పద్ధతిలోనే ఆకాశానికెత్తడం, ప్రశంసలతో ముంచెత్తడం

3) ప్రాచీన సాహిత్యాన్ని అతార్కికంగా, అచారిత్రకంగా వర్తమాన సమాజానికి అన్వయించి అదే నేటికీ దిక్కనీ ఆచరనీయమని దబాయించడం.

పై విధంగా ప్రాచీన సాహిత్య విమర్శలో కనిపించే ధోరణులను గురించి విశ్లేసిస్తూ మొదటి ధోరణి ఆదరణీయమైనదని ఈ రకమైన విమర్శ రాసే వాళ్ళు ప్రాచీన సాహిత్యాన్ని చారిత్రక దృక్పథంతో వర్తమాన భావజాలంతో విశ్లేషిస్తారని, దానిని ఆమోదిస్తే

ఆమోదిస్తారు. లేదా దానికున్న స్థానాన్ని నిర్ణయిస్తారని చెప్పారు. రెండో రకం విమర్శరాసే వాళ్ళు చారిత్రక వర్తమాన దృష్టి లేని అమాయకులుగా అభిప్రాయపడ్డారు. అయితే మూడో రకం విమర్శ రాసే వాళ్ళు బుద్ధి మాంద్యులు అని పేర్కొన్నారు. ప్రాచీన సాహిత్యాన్ని వర్తమాన కాలంలో సాహిత్య రంగం లోకి ప్రవేశించిన విభిన్న సామాజిక వర్గాల వాళ్ళు చదువుతున్నప్పుడు అందులో తమను చూసుకోవడం సహజం. వాళ్ళు వేసే ప్రశ్నలకు ప్రాచీన సాహిత్యం సమాధానం చెబితే దానిపట్ల వారికి గౌరవం పెరుగుతుంది లేదా సహజంగానే వైముఖ్యం కలుగుతుందని చెప్తూ, సాహిత్య రచనలకు కొన్ని పరిమితులు ఉంటాయని వాటిని అర్థం చేసుకుని సంప్రదాయవాదులు వాస్తవాన్ని గుర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ రచనా అన్ని కాలాలకు యథాతథంగా వర్తించదని ఈ సత్యం తెలియని సాంప్రదాయ వాదులే ప్రాచీన సాహిత్యానికి సార్వజనీనత, సర్వకలీనత ఆపాదించారని విమర్శించారు.

యోగివేమన విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డా, ఎం.ఎం. వినోదిని ప్రముఖ స్త్రీవాద దళిత రచయిత్రి. ఈమె రాసిన ఒక వ్యాసం ప్రచురింపబడింది[3]. ఒక దళిత అధ్యాపకురాలిగా దుష్యంతోపాఖ్యానాన్ని తరగతి గదిలో పాఠంగా చెప్పవలసి వచ్చినప్పుడు తనకు కలిగిన అనుభవాలే ఈ వ్యాసం సారాంశం. అయితే దానిని జీర్ణం చేసుకోలేని అగ్రవర్ణ పండితులు అప్రజాస్వామికంగా ఆమెపై దాడి చేసారు. ఈ దాడి కూడా 2009 ఏడాదిలోనే జరిగింది. రాచపాళెం తన దినపత్రికల సమీక్షలో భాగంగా ఈ వ్యాసాన్ని కూడా సమీక్షించారు. అయితే ఆ వ్యాసంతో పాటు దాని మీద దాడికి పూనుకున్న ఇతర భావజాలాలకు సంబంధించిన అన్నింటిని సమీక్షిస్తూ సమన్వయంచేసే ప్రయత్నం చేసినట్టుగా కనిపిస్తుంది. ఈమె రాసిన వ్యాసాన్ని ఖండిస్తూ ఉల్లి బాలరంగయ్య రాసిన "సాంస్కృతిక వ్యతిరేకతలో భాగం" అనే వ్యాసంలో ఆమె వాదం వక్రీకరణ వాదం, అమెది సంకుచిత మనస్తత్వం అని అన్నట్టుగా రాచపాళెం సమీక్షించారు. అదేవిధంగా డా, కృష్ణ(వేదాల పట్ల అవగాహన లేకనే (వ్యాసం) 'ఆమె పుట్టుకనే శంకించాలన్నారు'. ఆయి

---

[3] "బాధించే పాఠాలు బోధించేదేలా?" ఆంధ్రజ్యోతి, 12,జనవరి,2009

కమలమ్మ 'వినోదినిది కువ్యాఖ్య' అన్నారు, పిరాట్ల ఏసుపాదం 'వినోదినిది పేలవమైన విమర్శ' అన్నారు. ఇలా ఇంకా సి హెచ్ వి రమణారెడ్డి, ద్వానాశాస్త్రి మొదలైన అనేకమంది ఆమెని ఖండిస్తూ వ్యాసాలను రాసారు. ఈ వ్యాసాలన్నింటిని సేకరించిన రాచపాళెం వాటిని జాగ్రత్తగా అధ్యయనం చేసి వాటిని సమన్వయం చేసే ప్రయత్నం చేసారు. అయితే ఆ అభిప్రాయం తప్పనిగానీ, అప్రజాస్వామికంగా కానీ అనిపిస్తే నిరభ్యంతరంగా ఖండించారు.

ఇదే అంశంపై దళిత వాదులు ఏ విధంగా ప్రతిస్పందించారో ఆ వ్యాసాలను కూడా సేకరించి వాటిని కూడా సమీక్షించే ప్రయత్నం చేసారు. కొమరన్న అనే దళిత విమర్శకుడు పైన ఖండించిన అగ్రకుల వాళ్ళందరి భావాలను ఖండిస్తూ " భారత సాహిత్యాన్నంతా అయితే సెక్స్ లేదా వార్ చుట్టూ తిప్పుతూ ఎవరికీ అర్థం కానీ ఒక మార్మిక వాదాన్ని అందులోనే ఆనందం ఉందని ఘోసిస్తుంది. డా, వినోదిని వ్యాసాన్ని విమర్శించే ఉద్దండ పండితులకు రస బ్రాహ్మణులకు నేను వేసే ప్రశ్న ఏమిటంటే 'ఆ అద్భుత శృంగార వర్ణనలను క్లాస్ రూంలో మీచెల్లెలో తల్లో కూతురో కూర్చుని ఉంటే విశదీకరించగలరా? మీ అక్కో తల్లో అధ్యాపకురాలిగా ఆ పాఠాల్ని మగ పిల్లలకు భోదించగలరా? అని ప్రశ్నించారు. ఖండించిన వారిలో బాలరంగయ్య మొదలుకొని పిరాట్ల ఏసుదాసు దాక ఎవరైనా సమాధానం చెప్పగలరా? అని సవాలు విసిరారు. దేనిని గురించి సమీక్ష చేసిన రాచపాళెంవారు ప్రాచీన కావ్యాల్లోని అసంబద్ధమైన అంశాలను నిర్దిష్ట సామాజిక వర్గాలను న్యూనత పరిచే పాఠ్య భాగాలను నిర్ద్వంద్వంగాఎదుర్కోవాలి అన్న కోయి కోటీశ్వరరావు మాటలతో ఏకీభవించి ఆయన హెచ్చరికను ఆమోదించి మన పాఠ్య ప్రణాళికను ప్రతి విశ్వవిద్యాలయమూ ఆధునికరించాలని పేర్కొన్నారు.

## 5.7. కథా విమర్శ

2009 ఏడాదిలో కథానిక మీద విమర్శలు మొత్తం వందకు మించి వ్యాసాలు వచ్చినట్టు రాచపాళెంఅన్నారు. కథానికకు సంబంధించిన సైద్ధాంతిక విషయం నుండి తులనాత్మక అధ్యయనం దాకా అనేక పార్శ్వాలలో కథానిక అధ్యయనం జరిగినట్టుగా

ఆయన సమీక్షించారు. కథకు సంబంధించిన సైద్ధాంతిక చర్చకు సంబంధించి ‘కథలో కవిత్వం ఉండకూడదా?’ అనే కమలాకర్ రాసిన వ్యాసంతో మొదలై సి.హెచ్ మధు రాసిన ‘ప్రతి కథ ఓ జీవితం’ అనే వ్యాసంతో ముగుస్తుంది. అయితే కథా విమర్శలో కీలకాంశం అన్న విహారి వ్యాసం తెలుగు కథా విమర్శలోని బలహీనమైన ధోరణులను బలహీనతలను ఎత్తిచూపుతూ కథా విమర్శ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లుగా రాచపాళెంవిశ్లేసించారు.

## 5.8 తొలి తెలుగు కథపై వచ్చిన విమర్శలు – విశ్లేషణ

గురజాడ అప్పారావు 1910 లోరాసిన ‘దిద్దుబాటు’ కథను సాహిత్య విమర్శకులు తొలి కథ అని చాలా కాలం భావించారు. అయితే ఆ భావనను వ్యతిరేకిస్తూ ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మ వ్రాసిన 'లలిత', భండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య' మొదలైన కథలు ఒక్కొక్కటిగా లభ్యమవుతూ వచ్చాయి. తెలుగులో తొలి తెలుగు కథ ఏది అన్న విషయాన్ని పక్కన పెట్టి, గురజాడ అప్పారావు రాసిన ‘దిద్దుబాటు’ కథకు ముందు వచ్చిన వాటిని సేకరించడం అవసరమని భావించారు ప్రముఖ కథా రచయిత వివినమూర్తి. ఈ ప్రయత్నంలో భాగంగా ‘దిద్దుబాటలు’ అన్న కథా సంకలనాన్ని వెలువరించారు. ఈ సంకలనంలో ‘దిద్దుబాటుకు ముందు కథలు 92’ ఉన్నాయి. ఆ తరువాత . కొంతకాలంగా తెలుగులో తలెత్తిన అస్తిత్వ ఉద్యమాల వెలుతురులో తేదీల ప్రకారం 1910కి ముందే కొన్ని కథలు ప్రచురితమైన విషయం బయటకు వచ్చింది. 2009 సంవత్సరం నాటికి కూడా తొలి తెలుగు కథ ఏది? అనే చర్చలు కొనసాగుతున్నట్టుగా రాచపాళెంవారి విమర్శ 2009 గ్రంథంలో కథా విమర్శ విశ్లేషణను బట్టి చూస్తే అర్థమవుతుంది. ఈ ఏడాదిలో కూడా కొంతమంది విమర్శకులు గురజాడ రచించిన దిద్దిబాటు కథనే తొలి కథగా అంగీకరించారు. వారిలో మధురాంతకం నరేంద్ర, అంబల్ల జనార్ధన్, ఐ. మురళీమోహన్ రావ్, కాలువ మల్లయ్య, గంటేడు గౌరు నాయుడు, జరుపుల రమేష్ మొదలైన వారు ఉన్నారు. అయితే వారందరూ దిద్దుబాటు కథను కేవలం తొలి కథగానే పేర్కొన్నారు. అందులోని సామంజస్యాన్ని మాత్రం కాలువ మల్లయ్య వివరిస్తూ 1910లో వచ్చిన గురజాడ

దిద్దుబాటు కథకు ముందే భండారు అచ్చమాంబ రాసిన 'ధన త్రయోదశి' , 'స్త్రీవిద్య' లాంటి కథలు ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ రాసిన కథలు వచ్చాయి.అయినా గురజాడ కథను మొదటి కథగా పరిగణించడానికి గల కారణం ఆ కథకున్న ఆధునిక లక్షణాలు అని నిర్ధారించారు. అంతే గాక గురజాడకు ముందే కథలు రాసిన భండారు అచ్చమాంబ, ఆచంట కీర్తి ప్రతిష్ఠలకు ఏ మాత్రం భంగం కలగకుండానే, అవీ కథానికలని ఒప్పుకుంటూనే, అంతకంటే మెరుగ్గా అన్ని విషయాలలో కథానిక లక్షణాలను కలిగి ఉన్న 'దిద్దుబాటు'ను మొదటి కథగా విమర్శకులు నిర్దేశించినట్టుగా కాలువ మల్లయ్య అన్న మాటలను రాచపాళెం వ్యాఖ్యానించారు. ఇదే వరుసలో దార్ల వెంకటేశ్వరరావు రావు తొలి తెలుగు కథానిక చర్చలో భాగంగా గురజాడ, ఆచంట, భండారు కథల్ని వివరంగా విశ్లేషించారు. ఈయన అన్ని కథానికలను పరీక్షించి ఆధునిక కథానికలో ఉండవలసిన వస్తు శిల్పాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే దిద్దుబాటు ముందు తక్కినవి నిలవవు అని దార్ల వెంకటేశ్వరరావు అభిప్రాయపడినట్లు రాచపాళెం వ్యక్తం చేశారు. చారిత్రక దృష్టితో చూసినప్పుడు 'ధన త్రయోదశి'ని ఆధునిక కథానిక లక్షణాల దృష్టితో 'దిద్దుబాటు'ను తొలి తెలుగు కథలుగా నిర్ణయించవచ్చని, తొలి కథ చర్చ చేసుకోవడం కన్నా ఆ కథలు నిర్వహించే భూమికను చూడటం మంచిదని  దార్ల వారు అభిప్రాయపడినట్టు రాచపాళెంచెప్పారు. అయితే వీరే కాక వీరికంటే ముందు కొంతమంది విమర్శకులు దీనికి సంబంధించిన చర్చ చేసి ఉన్నారు. వీటిని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. 'దిద్దుబాటు' మొదటి కథ అనే పరికల్పనతో తెలుగు కథా పరిణామాన్ని గురించి ఆలోచించాలి. అని అంటారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య. తెలుగు కథకు బాల్యం లేదని, నన్నయ మొదటి పద్యంలా తెలుగు కథ సర్వాంగ సుందరంగా అవతరించిందనీ, కథకు మంచి లక్షణాలుగా అనుకున్న క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం ఇవన్నీ లక్షణాలుగా గల కథ దిద్దుబాటు అని అంటారాయన.[4]

---

[4] కథాశిల్పం.వల్లంపాటి వెంకటసుబ్బయ్య.పుట: 104

ఇంతవరకు పరిశీలించిన విషయాలను బట్టి మనం ఒక విషయాన్ని గమనించాలి. గురజాడ మొదటి కథకుడు కాకపోవడం వల్ల ఆయనకు గానీ, ఆయన కథలకు గానీ వచ్చే నష్టమేమే లేదు.గురజాడకు ముందు కథలున్నాయి. కానీ ఆయన కథలకు నమూనాలు లేవు. వస్తు విషయంగా తాత్వికంగా గురజాడ కథలను నమూనా చేసుకున్న ఆ తరువాత కూడా లేవని చెప్పాలి. గురజాడ కథల్లోని విశిష్టత అదే అని చెప్పవచ్చు. గురజాడ కథలకు నమూనాలు ఇతర భాషల్లో కూడా ఉన్నట్టు కనిపించదు.గురజాడ మొదటి కథకుడు కాకపోవడం వల్ల ఆయనకున్న ఈ విశిష్టత తొలగిపోయే అవకాశం లేదు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి "అప్పారావు రాసిన చిన్న కథల్లో దిద్దుబాటు ఒకటని, అది అద్వితీయమని అంటారు. దిద్దుబాటు మొట్టమొదటి 'ఆంధ్రభారతి' మొదటి సంచికలో వచ్చిందని"[5] కూడా చెప్పాడు. కానీ అది దిద్దుబాటు మొట్ట మొదటి కథ అని చెప్పినట్లు కనిపించదు.

అదేవిధంగా భండారు అచ్చమాంబ రాసిన కథలనే తొలి కథలుగా నిర్ధారించిన వారిలో ముదిగంటి సుజాతా రెడ్డి, ఎస్వీ రామారావు మొదలైన వారు తెలంగాణా ప్రాంత నేపథ్య దృష్టితో నిర్దారించి నట్టుగా తెలుస్తుంది.

పై రెండు వాదాలు వేటికవే చర్చోపచర్చలు, వాదోపవాదాలు చేసుకుంటుండగా మూడో వాదం ఒకటి బయలుదేరింది. *"బ్రౌన్ కొలువులోనే తెలుగు కథ పుట్టుక. తొలి కథకుడు తాతాచారి"* అనే వ్యాసంలో ఈతకోట సుబ్బారావు ఈ మూడో వాదాన్ని లేవదీశారు.

కందుకూరి వీరేశలింగం సాహిత్యం పై సమగ్రమైన పరిశోధన చేసిన అక్కిరాజు రమాపతి రావు కథా రచయితా గురించి కథ గురించి నాలుగో వాదం లేవదీసి "తొలి కథా రచయిత వీరేశలింగం, గురజాడ కాదు"(ఆంధ్రజ్యోతి, ఆగస్టు 10) అనే వ్యాసంలో భాష, శిల్పం, నిడివి వంటి వాటిని విస్మరించి కథా వస్తువులోని ప్రగతిశీలాంశాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని తొలి కథను నిర్ణయించే పనైతే 1883లో వచ్చిన కందుకూరి కథ

---

[5]. కె.కె రంగనాథాచార్యులు, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు. పుట:22

"సత్యవతీ చరిత్రం" తొలి తెలుగుకథ అవుతుందని, ఆ రకంగా కందుకూరి తొలి తెలుగు కథకుడౌతాడని అక్కిరాజు ప్రతిపాదించినట్టు రాచపాళెంపేర్కొన్నారు.

పై విధంగా తెలుగు కథ అద్యతను గురించి, ప్రాచీనతను గురించి వివిధ రకాలైన వాదాలు వినిపిస్తుండగా తెలుగు కథకు వెయ్యేళ్ళు అనే కొత్తవాదాన్ని నరసింహారావు అనే వ్యక్తి లేవదీసారు. అయితే తెలుగు సాహిత్యానికే వెయ్యేళ్ళు అనుకుంటున్న క్రమంలో కథకు వెయ్యేళ్ళు అనడం అచారిత్రక వాదం అని రాచపాళెంకొట్టి పారేశారు. అదే విషయాన్నీ ద్వానా శాస్త్రి, వేదగిరి రాంబాబు లు కూడా వ్యతిరేకించారు. అంతకుముందు కందుకూరి వీరేశలింగమే తొలి తెలుగు కథకుడు అని తీర్మానించిన అక్కిరాజు రమాపతి రావు గారే, ఆ తరువాత కాలంలో ఆచంట, భండారు లను ఈ విధమైన చర్చలకు సాధనంగా వాడుకున్నారు.

2009 ఏడాదిలో కథా విమర్శకు సంబంధించిన చాలా విలువైన వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చినట్టుగా తెలుస్తుంది. వీటిని అన్నింటిని సేకరించి రాచపాళెంసమీక్షాత్మకంగా విమర్శ రాసారు. ఆ విధంగా కథానిక ఆవిర్భావంతో మొదలుపెట్టి దాని దశ, దిశలను సూచించారు. ఈ ఏడాదిలో ఎక్కువగా విప్లవ దళిత దృక్పథాలతోతెలుగు కథానికను వివేచించే ప్రయత్నం జరిగిందని వివరించారు. తులనాత్మక అధ్యయనానికి సంబంధించి ఈ ఏడాదిలో కేవలం ఒక్క వ్యాసం మాత్రమే వచ్చిందని రాచపాళెం వివరించారు. అది వెన్నా వల్లభరావు రచించిన *"హిందీ – తెలుగు కథ ప్రారంభ వికాసాలు"* ఈ వ్యాసంలో మనకు హిందీ కథా సాహిత్యానికి సంబంధించిన సమాచారం కొంతవరకు లభిస్తుంది. తెలుగులో 1910 లో గురజాడ రచించిన దిద్దుబాటు కథను మొదటి కథగా విమర్శకులు పేర్కొంటే, హిందీలో 1900 లోనే కిశోరీ లాల్ గోస్వామి రచించిన 'ఇందుమతి' కథను మొదటి కథగా పేర్కొన్నారు. 19వ శతాబ్దంలోనే కథా రచనకు సంబంధించిన ప్రయత్నం జరిగినట్టు ఇటీవల తెలంగాణా సాహిటీ మిత్రులు రుజువులు చూపిస్తున్నారని వల్లభరావు చెబుతూ 1900–1910 మధ్య వచ్చిన హిందీ కథల్లో ఎక్కువ భాగం అనువాద కథలే అని వివరించారు. 'ఇందుమతి' కథ కూడా చారిత్రక అభాసుగానే ఉండటం వల్ల తెలుగులోనే

హిందీ కన్నా ముందు ఆధునిక కథ రాసే ప్రయత్నం జరిందని చెప్పడానికి అవకాశం ఉందని ఈ వ్యాసకర్త పేర్కొన్నట్టు రాచపాళెం చెప్పారు.

ఈ ఏడాదిలో కొడవటిగంటి కుటుంబ రావు శతజయంతి ఉత్సవాలు జరిగాయి. సాహిత్య విమర్శ రచనలో భాగంగా మొదటి నుండి కూడా కొకు ప్రభావం రాచపాళెం పై అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. దాన్ని మరింత పరిపుష్టం చేయడానికే అన్నట్టు కొడవటిగంటి కథా సాహిత్యంపై అనేక వ్యాసాలను విమర్శకులు రాశారు. వారిలో కాత్యాయని విద్మహే(కొడవటిగంటి కుటుంబరావు కథానికలు – రాజకీయార్థిక సంబంధాలు), ఎ.సీతారత్నం (కుటుంబరావు కథలు –స్త్రీ పాత్రలు), కొత్తపల్లి రవిబాబు (కొడవటిగంటికుటుంబరావు–సంకేతాత్మక దిబ్బకథలు), ఏ. ఎన్ నాగేశ్వరరావు('కులంగాడి అంత్యక్రియలు' ఒక పరిశీలన), సింగమనేని నారాయణ(కొడవటిగంటి కుటుంబరావు–మార్క్సిస్టు దృక్పథం) మొదలైన వారు ఉన్నారు. కుటుంబరావు కథలనే గాక ఆయన మొత్తం కల్పనా సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసాలు తోడ్పడతాయని రాచపాళెం సమీక్షించారు.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రచించిన 'సెజ్' అనే కథపై విమర్శకులు అనేక చర్చలను చేసారు. తెలుగు కథా సాహిత్య చరిత్రలో ఈ విధమైన విస్తృత చర్చలు అంతకు ముందు కొకు రాసిన' కొత్త జీవితాలు', కారా 'యజ్ఞం' కథల మీదనే జరిగినట్టుగా రాచపాళెం నిర్ధారిస్తూ తుమ్మేటి రఘోత్తమ రెడ్డే రచించిన 'పనిపిల్ల' కథను కూడా ఈ వరుసలోనే చేర్చారు. ఈ మూడు కథల తరువాత మళ్ళీ అంతటి విస్తృత చర్చలు జరిగింది ఈ 'సెజ్' కథ మీదే అని రాచపాళెం చెప్పారు. మట్టిమనిసిని ఆరాధించే సంస్కృతికి ఈ కథ భిన్నమైనదని ఈయన విమర్శిస్తున్నారు. అదే రీతిలో ఈ కథను ఎంతోమంది విమర్శించారు. అన్యాయమైన కథ (కొత్తపల్లి రవిబాబు) అని కొందరు, 'భూమి గురించి ఎందుకో కొత్తబెంగ'(విరసం సభ్యుడు ప్రశాంత్) అంటూ ఆ కథను ఉద్దేశించి మరికొందరు విమర్శించగా, 'రచయితలూ రఘోత్తంతో జాగ్రత్త'(గీతాంజలి) అని ఇంకొంతమంది అన్నారు.

అయితే పై విమర్శల అన్నింటికి భిన్నంగా పాణి అనే విమర్శకుడు సెజ్ కథపై సానుకూలమైన అభిప్రాయాలను వెల్లడించినట్టుగా రాచపాళెం చెప్పారు. "సెజ్ కథ సందర్భంలో కథకుని వైఖరి పట్ల విమర్శనాత్మకంగా ఉంటూనే మొత్తంగా ప్రపంచీకరణ గురించి మన అవగాహన పట్ల కూడా లోతైన అంతర్మథనం జరిగితే బాగుంటుందని తుమ్మేటి రఘోత్తమరెడ్డి ప్రతిపాదించినట్టు" పాణి అనే విమర్శకుడు విశ్లేషించాడు.[6]

అదేవిధంగా శ్రీశ్రీ శత జయంతి సందర్భంగా తెలకపల్లి రవి రాసిన శ్రీ శ్రీ సాహిత్యం– సమకాలీనత అనే వ్యాసంలో రచయిత శ్రీశ్రీ కవితా దృక్పథాన్ని, వివరిస్తూ ఆయనలోని లోపాలను పూర్వ పక్షం చేసిన విధానాన్ని గురించి రాచపాళెం సమీక్షించారు. ముఖ్యంగా తెలంగాణా విమోచనోద్యమం మీద శ్రీశ్రీ ఏమీ రాయలేదన్న విమర్శకు బదులుగా శ్రీశ్రీ ఆ పోరాటానికి సంబంధించి నిరంతరం ఏదో ఒక రకంగా స్పందిస్తూనే ఉన్నారని బదులు చెప్పినట్లు రాచపాళెం వివరించారు. దళితుల గురించి శ్రీశ్రీ నిర్దిష్టమైన రచనలు ఒక్కటి కూడా చేయలేదన్న అపవాదును కూడా తెలకపల్లి రవి కొట్టిపడేశారు. "గురజాడ వలే శ్రీశ్రీ దళితుల సమస్యలు నేరుగా ప్రస్తావించని మాట నిజమే కానీ దానికి మూలకారణమైన బ్రాహ్మణీయ వ్యవస్థను శ్రీశ్రీ కవిత్వం చావుదెబ్బ కొట్టింది. మిథ్యావాదిని నిలదీసిన ఉదంతం ఒక్కటి చాలును" అని దళితులకు సమాధానం చెప్పినట్టు ఈ విమర్శకులు గుర్తించారు.

శ్రీశ్రీ తన 'మహాప్రస్థానం' రచన తరువాత ఏమీ రాయలేదనే అపవాదును పటాపంచలు చేస్తూ వచ్చిన మరొక వ్యాసం వి. చెంచయ్య రాసిన "మహాప్రస్థానం నుండి మరో ప్రస్థానం దాకా" అనే వ్యాసం. ఈ వ్యాసంలో మహాప్రస్థానానంతర సాహిత్యాన్ని చారిత్రక దృష్టితో వివరించినట్లు రాచపాళెం నిర్ధారించారు. మహాప్రస్థానం తరువాత శ్రీశ్రీ రాసిన 'సిరి సిరి మువ్వ' పద్యాలు, ప్రాస క్రీడలు, ప్రపంచ పదులు, లిమరిక్కులు, వంటి

[6] ఈ వ్యాసాలన్నీ 'ఒక కథకుడు-నూరుగురు విమర్శకులు' (తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల చర్చా సర్వస్వం)అనే గ్రంథంలో ఉన్నాయి.(391-534 పుటలలో 'సెజ్' కథకు సంబంధించి దాదాపు 50 మంది రాసిన వ్యాసాలున్నాయి.)

రచనలు పైకి సరదాగా రాసినట్టుగానే కనిపించినా అవి ఒక సామాజిక బాధతో రాసినవే అని చెంచయ్య ఈ వ్యాసంలో నిరూపించినట్లు విమర్శకులు పేర్కొన్నారు.

మహాకవి శ్రీశ్రీ కేవలం ఒక కవిగానే సమాజం గుర్తిస్తుంది. ఆయనలో విమర్శకుడు అనే మరో కోణం కూడా ఉందని నిరూపిస్తూ వెలమల సిమ్మన్న రాసిన *"ఉత్తమ విమర్శకుడిగా శ్రీశ్రీ"(చినుకు,ఆగస్టు)*, రాపోలు సుదర్శన్ రాసిన *"గురజాడబాటే గురువుజాడగా శ్రీశ్రీ" (సాహిత్య ప్రస్థానం,అక్టోబర్)* అనే రెండు వ్యాసాలను కూడా రాచపాళెం సమీక్షించారు. గురజాడ మీద శ్రీ శ్రీ రాసిన ఆధునిక గద్య వాఙ్మయ ప్రవర్తకుడు, గురజాడ ఆధిక్యానికి కారణాలు, ముత్యాల సరాలు అనే మూడు వ్యాసాల ద్వారా శ్రీశ్రీ సాహిత్య విమర్శ ఔన్నత్యాన్ని నిరూపించవచ్చని సిమ్మన్న అభిప్రాయపడినట్టు రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు చెప్పారు. రసన సిద్ధాంతం, కొత్తను ఆహ్వానించే సహృదయత, బలమైన వచన శైలి, మార్క్సీయ పరిజ్ఞానం, నిలకడగా వివేచించగల శక్తి శ్రీశ్రీ సాహిత్య విమర్శలోని మేలిమి గుణాలని సిమ్మన్న ఈ వ్యాసంలో గుర్తించారు.

అదేవిధంగా ఈ ఒరవడిలోనే సుంకర శ్రీనివాస్ అనే అభ్యుదయ కవిలో కూడా విమర్శకుడు ఉన్నట్లు మరికొంతమంది విమర్శిస్తూ ఎన్నో వ్యాసాలను రాసారు.

## 5.9. కవిత్వంపై వచ్చిన వ్యాసాల అనుశీలన

ఇది వరకే ఆధునికాంధ్ర కవిత్వంపై విస్తృత స్థాయిలో విమర్శను రాసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు 2009 ఏడాదిలో కవిత్వంపై వచ్చిన వివిధ సాహిత్య వ్యాసాలను సమీక్షించారు. ఈ వ్యాసాల సమీక్ష తెలుగు దళిత కవిత్వంలోనే మొదటిదిగా భావిస్తున్న మాలవాండ్ర పాటతో ప్రారంభమైంది. మాలవాండ్ర పాట శత జయంతి సందర్భంగా సాహితీపరులు ఎవరూ కూడా దానిని గుర్తించుకునే ప్రయత్నం చేయలేదు. ఈ సమయంలోనే ప్రముఖ దళితకవులు, విమర్శకులుగా ప్రసిద్ధిగాంచిన కొలకలూరి ఇనాక్ రాసిన 'తొలి దళిత గీతం' అనే వ్యాసాన్ని, దార్ల వెంకటేశ్వరరావు రాసిన 'తొలి దళిత గేయమా నీ జాడెక్కడ' (విశాలాంధ్ర, మే 4) వ్యాసాలను సమీక్షించారు. ఇనాక్ గారు

మాలవాండ్ర పాటలో అభ్యర్థనతో పాటు, ప్రశ్న ప్రతి ఘటనలున్నాయని చెప్తూ, ఈ పాట దళితులదరికీ చెందే పాట అని చెప్పడం వెనుక దళితుల అంతర్గత వైరుధ్యాల నేపథ్యం కనిపిస్తుందని ఈ విమర్శకుడు గుర్తించాడు. అయితే దార్ల వెంకటేశ్వరరావు ఇందుకు భిన్నంగా ఈ పాట రచయిత దళితుడు కాదని భావినట్టుగా రాచపాళెం చెప్పారు. సాహిత్యాన్ని అర్థం చేసుకోవాల్సిన కోణాన్ని కూడా దార్ల ఈ వ్యాసంలో చెప్పినట్టుగా తెలుస్తుంది.

గురజాడ రచించిన 'దిద్దుబాటు' శత జయంతులను కూడా ఈ ఏడాదిలో నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన రచించిన 'దేశభక్తి' గేయాన్ని తెలుగు విమర్శకులు విస్మరించారని తెలుస్తుంది. వందేమాతర గేయం రచింప బడిన నాటికే దేశభక్తి గేయం కూడా రచింపబడింది. అయితే కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' గేయాన్ని గుర్తించి, గురజాడ రచించిన దేశభక్తి గేయాన్ని విస్మరించింది. వందేమాతరం కన్నా ఆరోగ్యకరమైన ప్రగతి శీల లక్షణాలు గల కవిత 'దేశభక్తి' అని రాచపాళెం కీర్తించారు. ఈ కవిత పాలకుల దేశభక్తికి భిన్నమైన దేశభక్తిని ప్రతిపాదించిందని దీనిని తెలుగు విమర్శకులు గుర్తించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం మాలవాండ్ర పాట, దేశభక్తి కవితల శతవార్షికోత్సవాలను అధికారికంగా నిర్వహించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ ఏడాదిలో దేశభక్తి కవితకు సంబంధించి రాచపాళెం వారు "నూరేళ్ళ దేశభక్తి కవిత" అనే వ్యాసాన్ని రాశారు. ఈ వ్యాసంలో తెలుగువాళ్ళ సాహితీ సాంస్కృతిక జీవితాలలో ఆధునికత అనే దినుసును ప్రవేశపెట్టింది గురజాడేనని హేతువాద, శాస్త్రీయ మానవతా దృక్పథాలను మూడింటిని కలగలిపిన భావాన్ని గురజాడ ప్రవేశపెట్టారని చెప్పి, దేశభక్తిలోని భావాలను డి.డి కోశాంబి అభిప్రాయాలతో సమన్వయం చేసి చెప్పినట్టుగా చెప్పవచ్చు. 'భరత ఖండంబు' కర్తృత్వ వివాదం అనే విభాగంలో 2009 మార్చిలో కరణం సుబ్బారావు గారు రాసిన "ఈ పద్యాన్ని రాసిందెవరు?" అనే వ్యాసంతో మొదలైన ఈ చర్చదీని రచయితా చెన్నా ప్రగడ భానుమూర్తి అనేంతవరకు వెళ్లి , ఎస్వీ సత్యనారాయణ "అది చిలకమర్తి రచన కాదు" అనే వరకు కొనసాగింది. ఈ చర్చలో అనేకమంది విమర్శకులు పాల్గొన్నారు. ఈ చర్చలన్నింటిని

విశ్లేషణ చేసి రంగనాయకమ్మ గారు ఈ పద్యానికి సంబంధించిన సకల సమాచారాన్ని సేకరించి సమీక్ష చేసారు. ఇది సమగ్రమైనదని రాచపాళెం వారు అభిప్రాయపడ్డారు.

కవిత్వంపై రాజకీయాల ప్రభావం ఏవిధంగా ఉందో కొన్ని వ్యాసాల విశ్లేషణ వల్ల వివరించాడు. రైతుల సమస్యలపై వచ్చిన కవితలను విశ్లేసిస్తూ వచ్చిన వ్యాసాలను, చెట్టు, రైతు వంటి వస్తువులపై వచ్చిన కవితలను విమర్శిస్తూ వచ్చిన వ్యాసాలను, సామాజిక సమస్యలైన ఈతిబాధలు, చదువులు మొదలైన అంశాలపై వచ్చిన వ్యాసాలను విశ్లేసించారు.

## 5.10. వచన కవిత్వం – ప్రక్రియల అనుశీలన

వివిధ వచన కవిత్వ ప్రక్రియలైన నానీలు, రెక్కలు, హైకూలు, మినీ కవితలపై వచ్చిన వ్యాసాలను గురించి ఈ కింది విభాగంలో వివరిస్తాను.

### 5.10.1 నానీలు

కన్నోజు లక్ష్మీకాంతం రాసిన "నానీలలో కవిత్వం" అనే వ్యాసాన్ని వివరిస్తూ నానీలలో నవ్యతతో పాటు నాణ్యత చాలా అవసరమని, లోతైన భావంతో పాటు చక్కటి శిల్పం కూడా అవసరమని, నానీల పేరుతో ఏదో ఒకటి రాసి చెడ్డ పేరు తెచ్చుకోవద్దని, నానీలు కవిత్వ ప్రక్రియ అనే విషయం మర్చిపోవద్దని ఈ వ్యాస కర్త మంచి సూచనలు చేసినట్టు రాచపాళెం సమీక్ష చేసారు. "నానీలు సమకాలీన జీవిత చిత్రణ" అనే వ్యాసాన్ని రాసిన ఎస్.ఆర్ పృథ్వీ వస్తుపరంగా చేసిన విశ్లేషణ, పి. లక్ష్మణ రావు "నానీల్లో మానవ సంబంధాలు" అనే వ్యాసంలో నానీలలో ప్రతిబింబించే మనవ సంబంధాలు ఎలా ఉన్నాయి అనే విషయాన్నీ గురించి చెప్పినట్లు రాచపాళెం సమీక్షించారు.

### 5.10.2. రెక్కలు

ఈ ఏడాదిలో రెక్కలు ప్రక్రియపై సుగంబాబు "రెక్క విప్పిన మినీ కవితా విప్లవం" శీర్షికతో వ్యాసాన్ని రాసి 'రెక్కలు' కవిత్వాన్ని పరామర్శించారని, అదేవిధంగా "వచన కవితలో మరో ప్రయోగం" అనే మరో వ్యాసాన్ని కూడా సుగంబాబు రచించినట్టు రాచపాళెం

వివరించారు. రెక్కలు ప్రక్రియను అర్థం చేసుకోవడానికి అద్దేపల్లి రామమోహనరావు రాసిన "రెక్కలు: తాత్విక వస్తువు అనే వ్యాసాన్ని చదవాలని రాచపాళెం సూచించారు.

## 5.10.3. మినీ కవితలు

ఈ ఏడాదిలో ప్రపంచీకరణను, మినీ కవితను కలిపి "నేటి ప్రపంచీకరణ – మినీ కవిత్వం" అనే వ్యాసాన్ని రాసిన అద్దేపల్లి రామమోహనరావు గారు ప్రపంచీకరణ నేపథ్యం నుండి మినీ కవిత్వాన్ని విశ్లేషణ చేసినట్టు రాచపాళెం సమీక్షించారు.

## 5.10.4. హైకూలు

హైకూల మీద మనసుపెట్టి నిర్మాణాత్మకంగా విమర్శ రాస్తున్న వారిలో ఒకరిగా రెంటాల వెంకటేశ్వరరావు ను పేర్కొన్నారు. "హైకూ – వస్తువు" పేరుతో ఈయన రాసిన వ్యాసంలో హైకూకు ముఖ్యంగా నాలుగు ప్రయోజనాలున్నట్లు పేర్కొన్నారు. అవి 1)సామాన్య వస్తువులలోని అసామాన్యతను గుర్తించడం. 2) మృదువైన అనుభూతుల్ని తట్టిలేపడం 3) జీవిత తత్వాన్ని గుర్తింప జేసి దైనందిన జీవితాన్ని స్పృహాత్మకంగా ఉంచడం.4) ఆలోచనల బరువును తగ్గించి మనసును ప్రశాంత పరచడం. అని హైకూకు ఉన్న ప్రయోజనాలను గురించి చెప్పారు. అదే విధంగా వచన కవిత్వం గురించి ద్వానా శాస్త్రి రాసిన "వచన కవిత్వంలో వెంటాడే వాక్యాలు" అనే వ్యాసాన్ని రాసారు.

అదేవిధంగా వివిధ కవిత్వోద్యమాల గురించి, తెలంగాణ రచయితలను గురించి, దళిత, అభ్యుదయ రచయితలను గురించి వివిధ పత్రికల్లో వచ్చిన సాహిత్య వ్యాసాలను ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు సమీక్షించారు.

## 5.11. నవలా విమర్శ

తెలుగు సాహిత్య విమర్శలో నవలపై వెలువడిన విమర్శ తక్కువేనని చెప్పవచ్చు. అదేవిధంగా 2009 ఏడాదిలో కూడా నవలపై అతి తక్కువ విమర్శే వచ్చినట్టు రాచపాళెం వారి సమీక్షా వ్యాసాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఇదే విషయాన్నీ రాచపాళెం వారు

ప్రస్తావిస్తూ తెలుగు సాహిత్య విమర్శలో కవిత్వం, కథా విమర్శ తరువాతి స్థానమే నవలా విమర్శకు దక్కుతుందని చెప్పారు. నవలా విమర్శకు సంబంధించి కృషి చేసిన వారిలో మొదలి నాగభూషణ శర్మ, బొడ్డపాటి కుటుంబరాయశర్మ చేసిన కృషిని కొనియాడారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్య విమర్శ దృక్పథాన్ని ఇది వరకే చాలా వ్యాసాల్లో వివరించిన రాచపాళెం ఈ ఏడాదిలో(2009) లో ఆయన నవలా సాహిత్యం పై వచ్చిన వ్యాసాలను సమీక్షించారు. అదేవిధంగా త్రిపురనేని గోపీచంద్ జీవితాన్ని, సాహిత్యాన్ని విశ్లేసిస్తూ వచ్చిన కొన్ని వ్యాసాలను కూడా సమీక్షించారు. అవేమిటో ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. భూమిక అనే మాసపత్రిక నవంబరు 2009 సంచిక కొకు శత జయంతి సంచికగా వచ్చింది. ఈ క్రమంలో కొకు నవలా సాహిత్యాన్ని కడియాల రామమోహనరాయ్ సమీక్షించగా, కొకునే రాసిన 'ఐశ్వర్యం' నవల మీద ఓల్గా ఒక వ్యాసం రాయగా, 'వారసత్వం' అనే నవలలోని స్త్రీ పురుష సంబంధాల మీద కాత్యాయనీ విద్మహే ఒక వ్యాసం రాసినట్టుగా తెలుస్తుంది. కొకు రచించిన 'చదువు' నవల 1952లో వచ్చినా నేటి సామాజిక చరిత్రకు సాక్ష్యంగా ఉందని, ఆ నవలలో కథనం అద్భుతంగా చేసారని బివియన్ స్వామి అనే విమర్శకుడు అభిప్రాయపడినట్టు తెలుస్తుంది. అదేవిధంగా కొకు మార్క్సిస్టు దృక్పథాన్ని వివరిస్తూ సింగమనేని నారాయణ కూడా ఒక వ్యాసం రాసారని రాచపాళెం వివరించారు.

ప్రముఖ రచయిత త్రిపురనేని గోపీచంద్. ఈయన హేతువాదం నుండి రాయిజం దాకా అక్కడి నుండి ఆధ్యాత్మికవాదం వైపు ప్రయాణించిన రచయిత అని రాచపాళెం పేర్కొన్నారు. ఈయన సాహిత్యాన్ని విశ్లేషిస్తూ మృణాళిని రాసిన "మేధా హృదయాల మేలు కలయిక"(ఆంధ్రజ్యోతి, సెప్టెంబర్ 7), అమ్మంగి వేణుగోపాల్ రాసిన "త్రిపురనేని గోపీచంద్ మజిలీలు"(సూర్య, సెప్టెంబర్ 7), పోలవరపు శ్రీహరిరావు రాసిన "ఆయన ఒక మహా చైతన్య స్రవంతి(ఆంధ్రప్రభ, సెప్టెంబర్ 7), త్రిపురనేని హనుమాన్ చౌదరి "తండ్రికి తలమానికమైన తనయుడు"(ఆంధ్రభూమి, సెప్టెంబర్ 21), ఎం.శ్రీధర్ "పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా – ఆ లక్ష రూపాయల విలువెంత?"(ఆంధ్రజ్యోతి, అక్టోబరు 19) అనే వ్యాసాలు వచ్చాయి. ఈ వ్యాసాలు ఆయన వ్యక్తిగత జీవితాన్ని, సాహిత్యం

మొత్తాన్ని వ్యాఖ్యానిస్తాయని రాచపాళెం పేర్కొన్నారు. తెలుగు నవలా చరిత్రను వివరిస్తూ లింగాల రామ తీర్థ రాసిన "తెలుగు నవలా చరిత్ర సాగిందిలా.." అంటూ రాసిన వ్యాసం కాల క్రమాలను సరిగా సూచించకపోవడంతో విఫల యత్నానికి గురయిందని చెప్పారు. "రచనలో రాజకీయ స్పర్శ ఏ మేరకు వాంఛనీయం?" అనే చందు సుబ్బారావు రాసిన వ్యాసం ఇంతవరకు నవల సాహిత్యం మీద చర్చించుకున్న విమర్శలకంటే భిన్నమైందని చెప్పారు. అయితే తెలుగు సాహిత్య విమర్శలో ఇదొక ఆలోచనాత్మక ప్రతిపాదన అని రాచపాళెం అంటారు.

## 5.12. నాటక విమర్శ

గురజాడ రాసిన కన్యాశుల్కం ఆధునిక తెలుగు సాహిత్యంలోనేకాక, నాటక ప్రక్రియలోనూ పెనుమార్పులకు కారణం అయింది. ఈ నాటకం తెలుగు సాహిత్యంలో చెప్పలేనంత సంచలనాత్మకమైన విప్లవం తెచ్చింది. ఈ నాటకం మీద వచ్చినంత విమర్శ, ప్రతివిమర్శలు మరి ఏ నాటకం మీద, ఇతర గ్రంథం మీద కూడా రాలేదు. అంతేకాదు ఒక రచయిత రాసిన ఒక గ్రంథం మీద ఇన్ని వేల పేజీల విమర్శ కూడా రాలేదు. ఇది గొప్పేకాదు, ఒక రికార్డు కూడా. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం వచ్చి ఈ ఏడాదికి(2009)కి నూరో సంవత్సరం కనుక ఈ నాటకం పై రామతీర్థ అనే వ్యాసకర్త ఒక్కడే ఏడు వ్యాసాలను రాసారు. ఈ సందర్భంలో 2009 ని రామతీర్థ సాహిత్య విమర్శ సంవత్సరంగా ప్రకటించవచ్చని, అంతేగాక విశ్వవిద్యాలయాలు చేయవలసిన పనిని రామతీర్థ ఒక్కడే చేయడం విశేషం అని ఆయన కృషిని రాచపాళెం కొనియాడారు. కన్యాశుల్కంలోని మధురవాణి పాత్రపై ఇంతవరకు వచ్చిన విమర్శలకు కొంచెం కొత్త దృష్టితో ఓల్గా రాసిన గొప్ప వ్యాసమే "మానవత్వం పరిమళించే మధురవాణి" అని ఈ విమర్శకుడు అన్నాడు. అయితే కందుకూరి, గురజాడ ల తరువాత నాటకాన్ని సామాజిక విమర్శకు ఆయుధంగా ఉపయోగించుకున్న సంస్కరణ వాద రచయిత కాళ్ళకూరి నారాయణ రావు అని ఆయన సాహిత్య సేవను ఈ సందర్భంలో గుర్తు చేసారు.

## 5.13. విమర్శ -2011

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి సాహిత్య విమర్శ పరామర్శను పరిశీలించినట్లయితే తెలుగు సాహిత్య విమర్శ ప్రతి సంవత్సరం విస్తృతం అవుతున్నట్టుగా తెలుస్తుంది. సామాజిక వికాసానికి అవరోధమైన ఎన్ని భావజాలాలు వచ్చినప్పటికీ సాహిత్య విమర్శ తనదైన బాధ్యతను నిర్వహిస్తూ పోతుంది. సాహిత్యాన్ని కేవలం సామాజిక అవగాహనకు మాత్రమే పరిమితం చేయకుండా,ఆ రెండింటికీ సాహిత్య విమర్శకు మధ్యగల సంబంధాన్ని రుజువు చేస్తున్నట్టుగా తెలుస్తుంది. విమర్శ కూడా సాహిత్యంలో ఒక సామాజికాచరణ అని, అదొక సామాజిక బాధ్యత అని చరిత్ర నిరూపించింది.

తెలుగు సాహిత్య, సాహిత్యేతర పత్రికలు విమర్శకు అర్థవంతమైన ప్రాధాన్యమిస్తున్నాయి. సమీక్షలు, ముందు మాటలు, పరిచయాలు, విశ్లేషణల రూపంలో తెలుగుపత్రికలలో విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. అందులో ఎక్కువభాగం వివిధ సందర్భాను సారంగా రాసినట్టుగా తెలుస్తుంది. పండుగలు, జాతీయ దినాలను గుర్తుకు చేసుకుంటూ రాసిన వ్యాసాలు విస్తృతంగా ఉన్నట్టు రాచపాళెం వారి "విమర్శ -2011" గ్రంథాన్ని బట్టి తెలుస్తుంది. సాహిత్యాభివృద్ధికి సాహిత్యాభిప్రాయాలను స్వీకరించి, ఇతరుల ఆలోచనలను అందిపుచ్చుకోవడం చాలా అవసరమని ఈ ఏడాదిలో వివిధ సాహిత్య విమర్శకులు చేసిన చర్చలను విశ్లేషించారు. సాహిత్యచరిత్రలోనూ, రచయితల జీవితాలలోను వచ్చే ప్రత్యేక సందర్భాలను తెలుగుసాహిత్య విమర్శకులు విశేషంగా గుర్తుచేసుకుంటున్నారు.

2011వ సంవత్సరంలో తెలుగు సాహిత్య విమర్శ మరో ముందడుగు వేసింది. సాహిత్య తత్వ చర్చలో భాగంగా ఈ ఏడాది బి.ఎస్ రాములు, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సి. హెచ్. మధు, దార్ల వెంకటేశ్వరరావు లు ఉన్నట్లు రాచపాళెం గుర్తించారు. బి. ఎస్ రాములు సమాజానికి సాహిత్యం దారి చూపాలంటూ రాసిన ఒక వ్యాసం, సాహిత్యం అభివృద్ధి చెందడానికి సామాజిక శాస్త్రాల అధ్యయనం అవసరమని మరొక వ్యాసంలో

ప్రతిపాదించినట్లు తెలుస్తుంది. అదే విధంగా సాహిత్యంలో నిరంతరం ప్రాంతీయతను గురించి మాట్లాడే బి. ఎస్ రాములు ఇటీవల భారతీయత, విశ్వజనీనత, సార్వకాలీనతల గురించి మాట్లాడటం విశేషంగా గుర్తించి అనేక స్థానికతల సమాహారమే సార్వజనీనత అన్నదే ఆయన అవగాహన అని రాచపాళెం భావించారు. కొండ్రెడ్డి సాహిత్య తత్వ వివేచనలో భాగంగా సాహిత్య సిద్ధాంతాలకు ప్రవాహ గుణముండాలని అవి ఎప్పటికప్పుడు వర్తమాన స్వభావాన్ని సంతరించుకోవాలని ప్రతిపాదించారు. అయితే అన్ని సాహిత్య సిద్ధాంతాలను ఒకే గాట్లో కట్టేస్తున్నారా అంటూ తనదైన సందేహాన్ని మార్క్సిస్టు సిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యక్తం చేసారు.

సి. హెచ్ మధు తెలుగు సాహిత్యాన్ని ప్రజా సాహిత్యమని, కార్పోరేట్ సాహిత్యమని వింగడించారు. పాలక వర్గాల సాహిత్యాన్ని కార్పోరేట్ సాహిత్యమని విశ్లేషించారు. ఈ అవగాహన నుండి ప్రపంచీకరణకు అనుకూలంగా రాసే సాహిత్యమంతా కార్పోరేట్ సాహిత్యమేనని, ప్రతికూలంగా రాసేది ప్రజాసాహిత్యమవుతుందని అభిప్రాయ పడినట్టు రాచపాళెం వివరించారు. “అస్తిత్వ ఉద్యమాల్లో కుల సాహిత్యం” అనే వ్యాసంలో వర్ణాధిపత్య స్థాపక మహా భారతాన్ని కుల సాహిత్యం అనకుండా, కుల నిర్మూలనను కోరే దళిత సాహిత్యాన్ని కుల సాహిత్యమనడంలోని అసంబద్ధతను దార్ల వారు లేవనెత్తారని, వీర శైవం, కుల వివక్షను వ్యతిరేకించినా, అది కులం మీద పెతనాన్ని చెలాయించిందనడం ఆయనలోని విశిష్టమైన ఆలోచన అని రాచపాళెం అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఇదే ఏడాది రాసిన “సంకెళ్ళు కాకూడని సాహిత్య నియమాలు” అనే వ్యాసంలో వచన సాహిత్యంలో జరుగుతున్న ప్రయోగాల గురించి దార్ల వారు చర్చించారు. ఈ వ్యాసంలో “కవిత్వాన్ని నిత్య నూతనం చేయడంలో కొత్త కొత్త కవితా రూపాలు అవసరమే. అలాగని ఆ రూపాలు కవిత్వాన్ని ఎక్కువ మందికి అందించకుండా పోకూడదు. కవిత్వం రాయడం కొందరికి మాత్రమే సాధ్యమనే భ్రమని పెంచకూడదు.” అనే అభిప్రాయాన్ని చెప్పారు. దీని గురించి కవిత్వ ప్రయోగావాదులు ఆలోచించాల్సిన అవసరం ఉందని రాచపాళెం వారు తనదైన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

## 5.14. పీఠికలు – సమీక్షలు

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో పీఠిక ఒక ప్రత్యేక ప్రక్రియగా ప్రసిద్ధి పొందింది. ప్రస్తావన, ఆముఖం, ప్రవేశిక, ప్రకాశిక, పరిచయం, ముందుమాట, తొలిపలుకులు మొదలైన పేర్లతో దీనిని వ్యవహరిస్తారు. పీఠికలోని విషయాన్ని బట్టి కొన్ని ప్రత్యేకమైన శీర్షికలతో ఇవి పాఠకులను అలరిస్తాయి. ఆధునిక సాహిత్య విమర్శలో పీఠికల పాత్ర అద్వితీయమైనదని చెప్పవచ్చు. సాహిత్యంలోని ఏ ప్రక్రియకు సంబంధించిన రచననైనా అర్థం చేసుకోవడానికి ఈ పీఠిక అనేక విధాలుగా దోహదం చేస్తుంది. అంతేకాదు ఆయా గ్రంథాల సౌందర్యాన్ని వెలికితీసి ఆ గ్రంథాన్ని చదవడానికి రంగాన్ని సిద్ధం చేసేది పీఠికని గ్రంథ పఠనకు పూనుకున్న పాఠకుణ్ణి మానసికంగా తయారు చేసే విశిష్ట ప్రక్రియ పీఠిక అని ఆచార్య ఎస్వీ రామారావు గారు విశ్లేసిస్తున్నారు[7]. కందుకూరి వీరేశలింగం మొదలుకొని నేటి వరకు అనేక ప్రామాణికమైన పీఠికలను వెలువరించిన రచయితలు అనేకమంది ఉన్నారు. వారిలో వేదం వెంకటరాయ శాస్త్రి, నిడదవోలు వెంకటరావు, వేటూరి ప్రభాకర శాస్త్రి, చిలుకూరి నారాయణరావు, బండారు తమ్మయ్య, విశ్వనాథ సత్యనారాయణ, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, శ్రీశ్రీ, కుందుర్తి మొదలైన వారు అనేక పీఠికలను రచించి ఆధునిక విమర్శ లోకంలో మంచి స్థాయిని, స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఆధునిక సాహిత్య విమర్శకుల్లో పేరెన్నిక గన్న వారు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి. ఈయన పీఠికా ప్రక్రియను తనదైన శైలిలో పోషించి ఎన్నో గ్రంథాలకు పీఠికలను రాశారు. ఆ విధంగా రాసినవి దాదాపు వందకు పైగా ఉంటాయి. అయితే వాటిలో కొన్నింటిని వారి దగ్గర పరిశోధన చేసిన విద్యార్థులు వాటిని వివిధ విభాగాలుగా సేకరించి, తన్నీరు నాగేంద్ర సంపాదకత్వంలో "రాచపాళెం పీఠికలు" పేరుతో ఒక గ్రంథంగా, ఆధునిక కవిత్వ సంపుటులకు రాసిన ముందు మాటలను మరొక గ్రంథంగా ప్రచురించారు. ఎ. ఎ

[7] కృత్యాలోకనం, ఆచార్య ఎస్వీ రామారావు పుట:iv

నాగేంద్ర సంపాదకత్వంలో ఆధునిక కావ్యాలకు రాసిన ముందు మాటలను ఒక గ్రంథంగా, రాచపాళెం వారి పీఠిక గ్రంథాలలోని విమర్శనాత్మక దృక్పథాన్ని ఈ కింద పరిశీలిద్దాం.

## 5.15. సాహిత్య పీఠికలు

ఏదైనా ఒక గ్రంథానికి సంబంధించిన మొత్తం విషయాన్ని క్లుప్తంగా పరిచయం చేస్తూ అందులోని గుణ దోషాలను వివేచించి సూచన ప్రాయంగా రాసే పత్రాన్ని పీఠిక అనవచ్చు. ప్రాచీన కాలంలో అవతారికలు, ప్రస్తావనలు ఎలాంటి ప్రాధాన్యతను కలిగి ఉన్నాయో నేటి ఆధునిక కాలంలోని వివిధ గ్రంథాలకు రాసిన పీఠికలు అంతే ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. ఈ ఆధునిక కాలంలో పీఠికా రచనకు విశిష్టత కల్పించిన వారిలో కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ ముఖ్యులు. ఆ తరువాత జి.యన్ రెడ్డి, కుందుర్తి, రారా, వేటూరి విశ్వనాథ కూడా పీఠిక రచనలో తమదైన ముద్రను వేసుకున్నారు. ఒకప్పుడు పీఠికలు సమకాలీన సమజాన్ని వివరించేవి. నేడు కేవలం గ్రంథ రచయిత, గ్రంథ పరిచయానికే పరిమితమైన ఈ పీఠిక దాని పరిధిని సంకుచితం చేసుకుందని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యంలో పీఠికలపై డి. చంద్రశేఖర రెడ్డి గారు పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంథంలో పీఠిక స్వరూపం, ఉత్పత్తి వికాసాలు మొదలైన అంశాలను సమగ్రంగా వివరించారు.(చంద్రశేఖర రెడ్డి. డి, *తెలుగు పీఠిక*). ఈ సిద్ధాంత గ్రంథాన్ని ***'తెలుగు పీఠిక'*** పేరుతో ఆంధ్ర సారస్వత పరిషత్తు హైదరాబాదు వారు ప్రచురించారు. ఈ పీఠిక అనే పదానికి మున్నుడి, ముందుమాట, ప్రస్తావన, ఉపోద్ఘాతం అనే సమానార్థకాలున్నాయి. పీఠికకు ఆంగ్లంలో Preface, Prologue, Forword, Introduction, Preamble అనే సమానార్థక పదాలున్నాయి. పై విధంగా పీఠిక అనే పదానికి అనేకమైన సమానార్థకాలు ఉన్నప్పటికీ వాటి మధ్య వ్యత్యాసాలు ఉన్నట్టుగా కనపడవు.

తెలుగులో పీఠిక ఉత్పత్తి వికాసాలను గురించి తెలుపుతూ "పీఠిక హఠాత్తుగా ఆధునిక సాహిత్యంలో బయటపడింది కాదు. ప్రాచీన కావ్య, నాటక అవతారికల్లో, ప్రస్తావనలలో, ప్రోలాగులలో ఆధునిక పీఠికా లక్షణాలు గోచరించడం వల్ల ఆధునిక పీఠిక

శతాబ్దాల పరిణామ క్రమంలో రూపుదిద్దుకున్నదే తప్ప ప్రత్యేకంగా ఎవరి సృష్టీ కాదు"[8] అని డి. చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. పీఠికలు రచయిత స్వయంగా కానీ, ఇతరుల చేతకానీ రాయించడం కానీ విరివిగా జరుగుతుంటుంది. అయితే ఈ పీఠికలకు పేర్లను నిర్ణయించే విషయంలో ఎవరి ప్రత్యేకత వారిది. శ్రీశ్రీ *మహాప్రస్థానాని* కి చలం పీఠికను రాస్తూ దానికి "యోగ్యతా పత్రం" అని పేరు పెట్టడంలో అతని ప్రత్యేకత తెలుస్తుంది. అదే విధంగా *నవ్యాంధ్ర సాహిత్య వీధులు* గ్రంథకర్త కురుగంటి సీతారామయ్య పీఠికకు సంబంధించిన అధ్యయనాన్ని గురించి రాస్తూ దాన్ని "ఉపోద్ఘాతీకరణం" అని సంభోదించాడు. ఈ విధంగా ఒక గ్రంథానికి గల పీఠికకు పెట్టిన పేర్లు గ్రంథసారాన్ని సూచన ప్రాయంగా తెలియజేస్తాయి. "పీఠికకు ఏపేరు పెట్టినా, ఎవరు రాసినా విషయ విధానంలో భేదం కనిపించదు. గ్రంథంలోని విషయంలో ఉండే భేదం వాళ్ళ పీఠికలో కనిపించే చిన్న చిన్న భేదాలే తప్ప పీఠిక పేర్లకు విశిష్టార్థాన్నిచ్చే భేదం మాత్రం కనిపించదు"[9] అనేకమైన సాహిత్య పీఠికలను చదవడం ద్వారా ఈ విధమైన ప్రత్యేకత తెలుస్తుంది.

## 5.16. పీఠికా రచయితగా రాచపాళెం

చాలా మందికి ఆయన కేవలం ఒక సాహిత్య విమర్శకునిగా మాత్రమే తెలుసు, కానీ రాచపాళెం గొప్ప కవి, అనువాదకుడు, వ్యాఖ్యాతకుడు. రాచపాళెం వారు విమర్శ రంగంలో చేసిన కృషి ఒక గొప్ప మైలురాయి. ఈ క్రమంలో ఆయన ఎన్నో గొప్ప గ్రంథాలకు పీఠికలను రాసారు. వీటిలో ఆయన శిష్యులు, శిష్య సమానులు రాసిన పుస్తకాలకు రాసిన పీఠికలు ఒక ఎత్తయితే, ఆయనకంటే వయసులోనూ మేథలోనూ అగ్రగణ్యులైన వారి పుస్తకాలకు రాసిన పీఠికలు మరో ఎత్తని చెప్పవచ్చు. ఆ విధంగా రాసిన పీఠికలలో బోయ జంగయ్య *'జగడం'* నవలకు రాసిన ముందుమాట, వల్లంపాటి వెంకటసుబ్బయ్య *'సాహిత్య వ్యాసాలు సంపుటి'* కి రాసిన ముందుమాటలే కాక మిగిలిన గ్రంథాలకు రాసిన ముందుమాటలు అనేకమైనవి ప్రసిద్ధంగా ఉన్నాయి. రాచపాళెం వారు ఇప్పటివరకు నూటయాభై పుస్తకాలకు పైగా పీఠికలు రాసారు. వాటిలో కొన్ని దాదాపు 45 ముఖ్యమైన వాటిని ఏరుకొని ఆయన శిష్యుడు డా॥

---

[8] చంద్రశేఖర రెడ్డి. డి, *తెలుగు పీఠిక*, పుట:34

[9] చంద్రశేఖర రెడ్డి. డి *తెలుగు పీఠిక*, పుట:10

తన్నీరు నాగేంద్ర *"రాచపాళెం పీఠికలు"* అనే పేరుతో పుస్తకాన్ని తన సంపాదకత్వంలో ప్రచురించారు.

రాచపాళెం వారి చేత ముందుమాటలు రాయించుకోవడానికి వచ్చిన రచయితల పుస్తకాలను ఆయన నిశితంగా పరిశీలించి అర్హమైన వాటికి తప్పకుండా ముందుమాటలు రాసేవారు. అనర్హమైన వాటికి అడిగిన వెంటనే ముందుమాటలు రాయకుండా వాటిని తిరిగి రచయిత దగ్గరకు పంపి వారికి తగిన సూచనలు, సలహాలను ఇవ్వడాన్ని గమనించవచ్చు. ఆయన ముందు మాటలకు నోచుకోని రచయితలు కూడా ఏ మాత్రం నొచ్చుకోకుండా ఆ సలహాలను సహృదయంతో స్వీకరించే వారు. అయితే రాచపాళెం వారు రాసిన ప్రతి పీఠికను పరిశీలించినట్లయితే దేనికది ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఇక్కడ వస్తువును బట్టి వివిధ పీఠికలు విభిన్నతను సంతరించుకున్నా, ఆ గ్రంథాల్ని పరిచయం చేసే తీరు దగ్గర నుంచి వాటి పరిమితులను ఎత్తి చూపే వరకు ఆసాంతం ఆయన విశ్లేషించే తీరు ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. రచయిత సాహిత్య కృషిని ప్రశంసిస్తూనే, ఆయన ఆ రంగంలో ఏ వర్గానికి చెందుతాడో వివరిస్తారు. రాసే ముందుమాట ఏ ప్రక్రియకు చెందినదైనా అందులో రెండు విభాగాలను గుర్తించి ప్రస్తుతం రచయిత ఈ విభాగానికి చెందుతాడని సహేతుకంగా నిర్ణయిస్తారు. *"మేధావిగా ఆలోచించు గొప్పగా రాయి"* అని సోక్రటీసు ఒక సందర్భంలో అంటాడు. ఈవాక్యం రాచపాళెం వారి సాహిత్య కృషికి అన్వయించదగినది. ఎందుకంటే ఆయన మేధావిగా ఆలోచించి గొప్పగా రాస్తారని ఆయన రాసిన పీఠికలను చదివితే తెలుస్తుంది. ఏదైనా అంశాన్ని గురించి విశ్లేషించేటప్పుడు దాని చారిత్రక మూలాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించడం రాచపాళెంవారి విమర్శలోని ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చును. సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడానికి అవసరమైన సరళీకృత విధానాలను, మూల్యాంకనం చేయడానికి గల పరిమితులను ఈ పీఠికల్లో రాచపాళెం వారు స్పష్టంగా వివరించారు. ఒకవైపు రచయితను మెచ్చుకుంటూనే అతని లోపాలను చెబుతూ వాటికి తగిన పరిష్కార మార్గాలను కూడా సూచించడం రాచపాళెం విమర్శలోని విశిష్ట లక్షణంగా చెప్పవచ్చును.

రచయిత తన రచనలో అవలంభించిన పరిశోధనా విధానాన్ని పాఠకులకు తెలియజేస్తూ, రచయిత విధి విధానాలను నిరూపించడానికి ప్రయత్నించినట్టుగా ప్రతి పీఠికలో కనిపిస్తుంది. “ఏ కవి యొక్క ఆవిర్భావం వల్ల ఈ ప్రపంచం ఇంకో అడుగు ముందుకు వేసిందో ఆ కవే మహాకవి”[10] అని శ్రీశ్రీ అన్నారు. అదే విధంగా ఏ విమర్శకుని విమర్శా విధానాలు సాహిత్య విమర్శా ప్రస్థానాన్ని ఇంకో అడుగు ముందుకు తీసుకెళతాయో ఆ విమర్శకుడే గొప్ప విమర్శకునిగా చెప్పవచ్చు. పై అభిప్రాయాన్ని అనుసరించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారిని గొప్ప విమర్శకుల జాబితాలో నిస్సకోచంగా చేర్చవచ్చు. ఎందుకంటే సాహిత్య విమర్శ రంగంలో ఆయన చూపిన మార్గం ఆచరణీయమైనది.

## 5.17. రాచపాళెం పీఠికలు – నిర్మాణ ద్వైవిధ్యం

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు రాసిన పీఠికలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఒక ప్రత్యేకమైన “నిర్మాణ ద్వైవిధ్యత” కనిపిస్తుంది. నిర్మాణ వైవిధ్యం, నిర్మాణ ద్వైవిధ్యం రెండూ వేర్వేరు అర్థాలను కలిగి ఉన్నాయి. నిర్మాణ వైవిధ్యం అంటే అంతకుముందు ఉన్నవాటి కంటే కొంత ప్రత్యేకత ఉండేలా నిర్మించడం. నిర్మాణ ద్వైవిధ్యం అంటే అందులోని ప్రత్యేక నిర్మాణత రెండు విధాలుగా ఉంటుంది. రాచపాళెం వారి పీఠికలలో కూడా సరిగ్గా అటువంటి ప్రత్యేకతే కనిపిస్తుంది. రచయిత గ్రంథానికి గల విశిష్ట లక్షణాన్ని మొదట తెలియజేసి, తరువాత ఫలానా విధంగా ఉండి ఉంటే బాగుండేది అని స్పష్టంగా, సంక్షిప్తంగా, సరళంగా తెలియజేసే ఆయన పీఠికలు పాఠకుల్ని కార్యోన్ముఖులుకుల్ని చేస్తాయి. రాచపాళెం సాహిత్య విమర్శకుడు అవడం వల్ల ఆయన రాసిన పీఠికలలో ఒక ఉత్తమ విమర్శనా విధానం కనిపిస్తుంది. ముఖ్యంగా తన పీఠిక రచనలో అవలంభించిన ‘మెథడాలజి’ సమకాలీన పీఠికా రచయితలకు మార్గదర్శనంగా ఉంటుంది.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు తరచుగా చెప్పే సాహిత్య సిద్ధాంతం ఏమిటంటే ప్రతి రచయితకు ఒక సామాజిక దృక్పథం ఉండాలన్నది. అయితే సామాజిక వస్తువును స్వీకరించడం కవులకు, రచయితలకు ఎంత ఆవశ్యకమో, శిల్పం కూడా అంతే ఆవశ్యకం అని చెబుతారు. ‘సామాజిక వాస్తవికతను స్వీకరించడమే గాక, దానికి అనుకూలమైన

[10] *కవిత్రయం’ శ్రీశ్రీ*, తెలుగుతల్లి, పుట:12

శిల్పాన్ని అధిక సంఖ్యాకులకు వస్తువును చేరవేయగలిగిన దాన్ని స్వీకరించడం కూడా అవసరమై శిల్పం రచయితకు పాఠకున్ని నిర్ణయించి పెడుతుందని'[11] రాచపాళెం అంటారు.

అదే విధంగా వల్లంపాటి సాహిత్య వ్యాసాలకు రాసిన పీఠికలో కూడా శిల్ప ప్రాధాన్యాన్ని గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు తన *నవలా శిల్పం, కథా శిల్పం* గ్రంథాల ద్వారా  ఏ విధంగా వివరించారో తెలుపుతూ విమర్శకులను థియోరిటికల్ విమర్శకులని, అప్లైడ్ విమర్శకులని విభజించుకుంటే వల్లంపాటి రెండో రకం విమర్శకులని చెప్పారు.[12] ఇదే గ్రంథానికి రాసిన ముందు మాటలోనే  విమర్శను అకడెమిక్, నాన్ అకడెమిక్ అని రెండు రకాలుగా విభజించి, విమర్శలో రాజకీయాలను గురించి ఎక్కువ చర్చ చేస్తే అది నాన్ అకడెమిక్ అని, రాజకీయాల ప్రసక్తి తగ్గించి రచన గురించి ఎక్కువగా మాట్లాడితే దానిని అకడెమిక్ విమర్శ అని చెప్పి, వల్లంపాటి సాహిత్య విమర్శ ఈ రెండు ధోరణుల మధ్య సమన్వయం చేసేదిగా ఉందని చెప్పారు. సాహిత్య విమర్శలో సమన్వయ ధోరణిని రాచపాళెం ఎక్కువగా ఆదరించినట్టుగా తెలుస్తుంది.

తెలుగు సాహిత్య విమర్శలో ఒకరు చెప్పిన అభిప్రాయాలను ఇంకొకరు స్వీకరించడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. కానీ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన దగ్గరికి ముందుమాట రాయించుకోవడానికి వచ్చిన రచయితల అభిప్రాయాలను సహేతుకంగా భావించి, అవి ఏ విధంగా సహేతుకమో వివరిస్తారు. ఈ విధమైన లక్షణాన్ని ఆయన పీఠికా రచనలోని విలక్షణతను తెలియజేస్తుంది. ఉదాహరణకు ఎన్. ఈశ్వర్ రెడ్డి *"సోమసుందర్ సాహిత్య దృక్పథం"* అనే గ్రంథానికి పీఠిక రాస్తూ మానవీయ లక్షణాలు లేకుండా ఏ కవీ అభ్యుదయ కవిగా రాణించలేడనే రచయిత అభిప్రాయాన్ని సహేతుకంగా స్వీకరిస్తూ "మానవతావాది కాకుండా అభ్యుదయవాది కావడం సాధ్యం కాదని పేర్కొన్నారు"[13] పరిశోధనా పద్ధతులు, విధానాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు తెలుగులో వచ్చినవి అతి తక్కువే అని చెప్పవచ్చు. ఆ వచ్చిన వాటిలో కూడా పరిశోధన అంటే ఏమిటో ఎంతమంది ఎన్ని విధాలుగా నిర్వచించినా నేటికీ ఒక అస్పష్టత అనేది

---

[11] డా, నాగేంద్ర తన్నీరు, *రాచపాళెం పీఠికలు,* పుట:13

[12] డా, నాగేంద్ర తన్నీరు, *రాచపాళెం పీఠికలు*, పుట:19

[13] డా, నాగేంద్ర తన్నీరు(సంపా), *రాచపాళెం పీఠికలు*, పుట:24

ఉండనే ఉంది. అయితే రాచపాళెం వారు పరిశోధన అంటే ఏమిటో ఈ కింది విధంగా వివరించారు. "పరిశోధకులు తాము పరిశోధనకు తీసుకున్న అంశానికి సంబంధించిన నేపథ్య విజ్ఞానాన్ని సేకరించి దానిని సమన్వయం చేసుకోవాలి. తాము పరిశోధనకు తీసుకున్న అంశం మీద ఇది వరకే జరిగిన పరిశోధనలను, వచ్చిన విమర్శలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తామెక్కడి నుంచి బయలుదేరాలో నిర్ణయించుకోవాలి తమ పరిశోధనకు పూర్వ సామగ్రిగా గానీ, మూల సామగ్రిగా గానీ పూర్వ పరిశోధనలను, విమర్శలను వినియోగించుకుంటూ, తమదైన మౌలికతను ప్రదర్శించాలి"[14]అని వివరించారు. అంతే గాకుండా ఆధునిక విద్యా లక్ష్యాలుగా బోధన, పరిశోధన, విస్తరణలను పేర్కొన్నారు. పరిశోధన మౌలికతను గురించి రాచపాళెం వారు పైన చెప్పిన నిర్వచనం నేటి, భావి పరిశోధకులకు దిశానిర్దేశం చేసేదిగా ఉందని చెప్పవచ్చు.

పైన వివరించినట్టుగా ప్రతి పీఠికలోనూ తనవైన నిర్మాణ ద్వైవిధ్యతతో కూడుకున్న అభిప్రాయాలను స్పష్టంగా, సూటిగా చెప్పడం రాచపాళెం సాహిత్య విమర్శలోని ముఖ్య లక్షణం. 'యథా ఆచార్య తథా శిష్య' అన్నట్లు ఆచార్యుల నడవడిక కూడా శిష్యుల ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన గురువులైన ఆచార్య జి. యన్ రెడ్డిగారి పీఠికలను సేకరించి ప్రచురించి తన శిష్య వాత్సల్యాన్ని చాటుకున్నారు. అదే బాటలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి శిష్యుడు డా॥ తన్నీరు నాగేంద్ర రాచపాళెం పీఠికలను సేకరించి ప్రచురించి తన శిష్య వాత్సల్యాన్ని చాటుకున్నారు.

పీఠిక రాసేటప్పుడు పూర్తిగా చదవాలనే అభిలాష కలిగించడం, కేవలం ప్రశంసలే కాకుండా సూచనలు చేయడం కూడా ఒక ప్రత్యేకత. కుల, మత, ప్రాంతీయ భేధాలు లేకుండా అన్ని వర్గాల రచయితలకు పీఠికలు రాయడం రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారి లౌకికతను తెలియజేస్తుంది. కానీ ఆయన తన అభ్యుదయ దృక్పథాన్ని విస్మరించటానికి ఏ మాత్రం ఇష్టపడరు. అంటే ఆయన విమర్శ చారిత్రక, గతితార్కిక భౌతికవాదనికి సంబంధించినదిగా చెప్పవచ్చు. రాచపాళెం పీఠికల్లో కూడా ఆ గుణం కనిపించడం మరో ప్రత్యేకత. సాహిత్యపీఠికలపై సాధికారమైన కృషి చేసినట్లు ఆయన విమర్శ పీఠికలు

---

[14] డా, నాగేంద్ర తన్నీరు(సంపా), *రాచపాళెం పీఠికలు*, పుట:41

స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పీఠికలు ఎలా రాయాలో ఎలా రాయకూడదో తెలుసుకోవడానికి రాచపాళెం పీఠికలు మార్గదర్శనంగా నిలుస్తాయి.

## 5.18. ఆధునిక కావ్యాలకు రాసిన ముందుమాటలు

రాచపాళెంవారు ఇది వరకే రాసిన ముందుమాటలు "రాచపాళెం పీఠికలు" అనే పేరుతో ప్రచురితమయ్యాయి. అందులో విమర్శ, సమీక్ష, పరిశోధన మొదలైన అంశాలపైన స్థూలమైన అవగాహనతో కొన్ని సైద్ధాంతిక సూత్రీకరణలను చేసినట్టుగా ఇంతకుముందే విశ్లేషించు కున్నాం. ఆ తరువాత రాచపాళెం వారి మరో శిష్యుడు ఎ.ఎ నాగేంద్ర సంపాదకత్వంలో ఆధునిక కావ్యాలకు  రాచపాళెం రాసిన ముందుమాటలను పుస్తకంగా తీసుకొచ్చారు. ఈ పుస్తకంలో మూడు తరాలకు చెందిన రచయితల రచనలకు రాసిన ముందుమాటలు ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 40 కావ్యాలకు రాసిన ముందు మాటలున్నాయి. ప్రతి ముందుమాటలో ఏదో ఒక చోట కవికి ఉండాల్సిన సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూనే ఉన్నారు రాచపాళెం. పల్లెటూళ్ళ నుండి ప్రపంచీకరణ వరకు అనేక అంశాల మీద వచ్చిన కవిత్వ సంపుటులకు వివిధ సందర్భాల్లో రాసినవి ఈ పుస్తకంలో దర్శనమిస్తాయి. ముందుమాట ఆరంభంలో కవిలోని విశిష్టతను పేర్కొని, ఆ తరువాత అతని కావ్యంలోని లోపాలను చెప్పడం ఈయన పీఠికల్లోని ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు. వర్తమాన కవులు రాసిన కవిత్వాన్ని ప్రోత్సహించే విధంగా ఈయన పలు సూచనలు చేయడం ఆదర్శప్రాయంగా ఉంది. కవిత్వంలో కవి సమాజంలోని సమస్యలను సూచించడమే కాకుండా వాటికి పరిష్కార మార్గాలను కూడా సూచిస్తే ఆ కవిత్వం ఫలించినట్టే అని రాచపాళెం భావిస్తారు.  ఆధునిక కవితా గుణాలను విశ్లేషిస్తూ వారి కవితలను అనేక కోణాలలో. పరిశీలిస్తూ రాచపాళెం ముందుమాటలను రాస్తారు. వీరి ముందుమాటల్లో వస్తు వివేచనలు పూర్తిగా ఉంటాయి. అంతేగాక  కావ్యానికి సంబంధించిన విషయాలే గాక కావ్యానికి బయట గల అనేక విషయాలను వారి ముందుమాటల్లో చేర్చి రాసారు. కవికి, కవి రాసిన కావ్యానికి, ఆ కావ్యానికి సంబంధించిన పురోగమనాన్ని పూర్తిగా కోరుతూ ముందుమాటలు రాసే వ్యక్తి రాచపాళెంవారు. అందుకే. ఎవరు ముందుమాట రాయమన్నా కాదనకుండా రాస్తారు.

'సమీక్షకుడైన వాడు విమర్శకుడౌతాడు'– యిదొక నానుడి. అయితే నేటి సమీక్షకులే రేపటి విమర్శకులు కావడాన్ని మనం చూస్తూనే ఉన్నాం. విమర్శ, సమీక్ష పరస్పర విరుద్ధాంశాలు కానప్పటికీ రెండిటి మధ్య సమతౌల్యాన్ని పాటించి సామరస్య పూర్వక సమన్వయం సాధించడం, దానికి ప్రణాళికాబద్ధమైన పరిశోధనని జోడించడం రాచపాళెంలోని ప్రత్యేక లక్షణంగా చెప్పుకోవచ్చు. అయినా ఆయన తన సాహిత్య విమర్శలో భావజాలాన్ని ప్రదర్శించడానికి ఎక్కడా రాజీ పడినట్టుగా కనిపించడం లేదు. మొన్నటి కట్టమంచి, నిన్నటి రారా లలోనే ఇటువంటి సాహిత్య విమర్శను సృజించే ప్రత్యేకమైన గుణముందేమోనని అనిపిస్తుంది. ఆ ఒరవడి నుంచే మరో బలమైన చేర్పు రాచపాళెం. ప్రవహించే జ్ఞాపకాన్నీ రారా సాహిత్య పరిశోధననీ యేకకాలంలో సవ్యసాచిగా తవ్విపోసి అందించిన రాచపాళెం విమర్శకుడిగా, పరిశోధకుడిగా తన కర్తవ్యాన్ని అతి జాగరూకతతో నిర్వహిస్తున్నాడనడానికి ***"విమర్శ-2009", "విమర్శ-2011", "రాచపాళెం పీఠికలు"*** అనే గ్రంథాలను సాక్ష్యాలుగా చెప్పవచ్చు.

తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శ సాగిన తీరు తెన్నుల్నీ దాని లోతు పాతుల్నీ యెప్పటికప్పుడు ప్రచలితమైన కొత్త కొత్త వాదాల్నీ ధోరణుల్నీ మొత్తం దాని ప్రస్థానాన్ని విమర్శకుల లోటుపాట్లతో సహా తెలుసుకోడానికి రాచపాళెం గ్రంథాలు మార్గదర్శనం లాగా రెడీ రికనీర్(Ready reckoner) లాగా తోడ్పడతాయనడంలో యెలాంటి సందేహం లేదు. సంస్కృత అలంకార శాస్త్రం చదువుకోవడం దగ్గర సాహిత్య విద్యార్థిగా ప్రారంభమైన రాచపాళెంకు మార్క్సిజం మనస్తత్వ శాస్త్రం మొదలైన సామాజిక – వైజ్ఞానిక శాస్త్రాల వెలుగులో ఆధునిక సాహిత్య విమర్శలోని భిన్న ధోరణులు పరిచయమయ్యాకే సాంప్రదాయిక ఆలంకారిక శాస్త్రంలోని పరిమితులు తెలిశాయి. భరతుడి దగ్గర్నుంచి జగన్నాథుడి వరకూ సంస్కృతాలంకారికులు అలంకారాలు రీతి వృత్తి గుణ-దోష విచారాలు వక్రోక్తి వైచిత్ర్యాలు గురించి చేసిన చర్చంతా రూపానికీ శైలీ శాస్త్రానికి సంబంధించినదే. నిర్వచించిన లక్షణాలకు శ్లోకాల్ని శ్లోకాల్లో భాగాల్ని పదాల్ని పదాంశాల్ని లక్ష్యాలుగా యెత్తిపట్టడం మీదే ఆయన యెక్కువగా దృష్టి సారించారు తప్పితే కావ్యాన్ని వొక యూనిట్ గా చూసింది లేదు. ఒక కవి గురించో రచయిత గురించో సమగ్రంగా విచారించిదీ లేదు.

# ఉపసంహారం

# ఉపసంహారం

*'రాచపాళెం సాహిత్య విమర్శ – చారిత్రక అధ్యయనం'* అనే ఈ సిద్ధాంత వ్యాసం అయిదు  అధ్యాయాలుగా విభజించాను. ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి పరిశీలించిన అంశాలను కింద పొందుపరుస్తున్నాను.

మొదటి అధ్యాయం *'రాచపాళెం చంద్రశేఖరరెడ్డి  జీవితం, రచనలు – పరిచయం'* లో రాచపాళెంవారి జీవితంలోని కొన్ని దశలు స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. రాచపాళెంగారి కలం నుండి వెలువడిన సృజనాత్మక, విమర్శనాత్మ రచనల సంక్షిప్త సమాచారం ఇవ్వబడింది. రాచపాళెం వారి అపూరూపమైన విమర్శా గ్రంథ రచనల నేపథ్యాలను, వాటిలోని విశేషాలను సంక్షిప్తంగా తెలుపబడింది. అదేవిధంగా ఆయన సాహిత్య విమర్శా రచనకు దారితీసిన పరిస్థితులను ఈ అధ్యాయంలో క్రోడీకరించడం జరిగింది.

రెండవ అధ్యాయం *'తెలుగు సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం'* లో తెలుగులో సాహిత్య విమర్శకు సంబంధించి లభ్యమైన రచనల ఆధారంగా సాహిత్య విమర్శ పూర్వాపరాలు పరిశీలించబడ్డాయి. తెలుగు సాహిత్యవిమర్శ పుట్టుక నేపథ్యం వివరించబడింది. నిర్వచనాలు, లక్షణాలు, భేదాల్నీ పేర్కొంటూ సాహిత్య విమర్శలు రాసిన ప్రముఖుల పేర్లను స్మరించుకొన్నాం. రాచపాళెంగారి సమకాలికులు రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, సింగమనేని నారాయణల విమర్శా రచనా విధానాలు ఉదాహరణ సహితంగా  పరిశీలించబడ్డాయి. వివిధ సాహిత్య విమర్శ ధోరణులను సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. అంతేకాక ప్రాచీన సాహిత్య విమర్శ నిర్మాణాన్ని కూడా విశ్లేషించడం జరిగింది. ఆధునిక సాహిత్య విమర్శ లక్షణాలను గుర్తించడం జరిగింది. రాచపాళెంవారి *'శిల్ప ప్రభావతీ' 'తెలుగు కవిత్వం నన్నయ ఒరవడి', 'ప్రాచీనాంధ్ర కవులు సాహిత్యాభిప్రాయాలు'*, అనే విమర్శా గ్రంథాలను వాటి గొప్పతనాలు పరిచయం చేయబడ్డాయి. పాశ్చాత్య సాహిత్య విమర్శ ప్రభావంతో తెలుగులో సాహిత్య విమర్శ ఆవిర్భవించిన విధానాన్ని పరిచయం చేయబడింది. సాహిత్య విమర్శ తొలిదశలో వచ్చిన కొన్ని విమర్శలను సమీక్షించడం జరిగింది.

మూడవ అధ్యాయం *'రాచపాళెం సాహిత్య విమర్శ –తొలిదశ(1972-2000)'* లో రాచపాళెం తొలిదశలో రాసిన విమర్శలను స్వీకరించి వాటిలోని ప్రత్యేకతను తెలియజేశాను. కాలక్రమంలో ఆయన సాహిత్య విమర్శ ఏ విధమైన పరిణామం పొందిందో ఆధారాలతో సహా నిరూపించాను. ఆయన సాహిత్య విమర్శ స్వరూప స్వభావాలను ఆధారాలతో నిరూపించడం జరిగింది. సాంప్రదాయ సాహిత్యంతో మొదలైన ఆయన సాహిత్య విమర్శ ఆధునికతను ఏ విధంగా సంతరించుకుందో వివరించాను. మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా ఆయన పుట్టుకను, అందుకు దారి తీసిన పరిస్థితులను వివరించాను.

నాల్గవ అధ్యాయం *'రాచపాళెం సాహిత్య విమర్శ –మలిదశ(2001-2017)'* లో రాచపాళెం సాహిత్య సాహిత్య విమర్శ తొలిదశను విశ్లేషించిన నేపథ్యం నుండి ఆయన సాహిత్య విమర్శలోని మౌలికమైనలక్షణాలను గుర్తించడం జరిగింది. రాచమల్లు రామచంద్రారెడ్డి తమ మార్క్సిస్టు భావజాలంతో తెలుగు సాహిత్య విమర్శకు కొత్త దారిని చూపిస్తే, రాచపాళెంవారు ఆ కొత్త దారికి, శిల్పం, వస్తువు అనే కొత్త అంశాలను జోడించి ఓ పటిష్ఠమైన మార్గాన్ని ఏర్పరచి ముందుకు తీసుకెళ్ళిన క్రమాన్ని సుస్పష్టంగా వివరించడం జరిగింది. కాగా రాచపాళెంవారు తమ సాహితీ వ్యాసంగంలో కనబరిచిన ప్రాపంచిక దృక్పథం, శాస్త్రీయ అవగాహన, వివేచనా దృష్టి, సాహిత్య సిద్ధాంతాల సమన్వయం, సామాజిక నేపథ్యాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది. దరిమిలా కట్టమంచి, రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య మొదలైన వారి సాహిత్య విమర్శా, భావజాల ప్రభావాలు రాచపాళెంగారిపై ప్రసరించిన పరిస్థితులను కళ్లకుకట్టించం జరిగింది.

ఐదవ అధ్యాయం ***'రాచపాళెం' ఇతర సాహిత్య విమర్శలు'*** లో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు తొలి నుంచి తుది దాకా చేసిన సాహిత్య కృషిని సంక్షిప్తంగా వివరించబడి, ఆ కృషికి అదనంగా చేసిన దినపత్రికల్లోని సాహితీ పుటల సమీక్ష, వివిధ గ్రంథాలకు రాసిన ముందుమాటలను గురించి స్థూలంగా విశ్లేషించి చెప్పడం జరిగింది. అందులో భాగంగా విమర్శ-2009, విమర్శ – 2011, రాచపాళెం వారు వివిధ గ్రంథాలకు రాసిన పీఠికలను విశ్లేషించడం జరిగింది.

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథ సూచి

# (Bibliography)

## ఆధార గ్రంథాలు:


1. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***మన నవలలు- మన కథానికలు***. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2016.
2. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు సందర్భాలు.*** హైదరాబాదు: పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2002.
3. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***దీపదారి గురజాడ***. హైదారాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్, 2010.
4. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం***, తులనాత్మక దాక్షిణాత్య సాహిత్య వ్యాసాలు***. కుప్పం: ద్రవిడ విశ్వవిద్యాలయం, 2009.
5. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం***, జాషువా స్వప్నం సందేశం***. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్, 2015.
6. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***రాచపాళెం పీఠికలు.*** అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, 2017.
7. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***ఎన్.గోపి సాహిత్యనుశీలనం.*** విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్, 2017.
8. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***కొన్ని కావ్యాలు కొందరు కవులు***. అనంతపురం: లక్ష్మీ గ్రాఫిక్స్, 2008.
9. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయలు – అభిరుచులు***. హైదరాబాదు: తెలుగు అకాడెమీ, 1992.
10. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, **చర్చ**. హైదరాబాదు: విశాలాంధ్ర బుక్ హౌస్, 2006.

11. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***భారత జాతీయోద్యమ సాహిత్యం***. హైదరాబాదు: తెలుగుఅకాడెమి, 2012.

12. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***శిల్ప ప్రభావతీ.*** అనంతపురం: శిల్పప్రచురణలు,1980.

13. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***కథాంశం.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2006.

14. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***మరోచర్చ***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012.

15. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***ప్రతిఫలనం.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,2014.

16. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***తెలుగు కవిత్వం – నన్నయ్య ఒరవడి.*** హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1987.

17. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***గురజాడ తొలి కొత్త తెలుగు కథలు.*** అనంతపురం: శిల్ప ప్రచురణలు, 1985.

18. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***విమర్శ –2009.*** విజయవాడ: చినుకు ప్రచురణలు, 2010.

19. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***విమర్శ –2011.*** విజయవాడ: చినుకు ప్రచురణలు, 2012.

20. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***పొలి.*** హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్, 2007.

21. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం, ***దేవుడే బాలుడైతే.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.

22. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం(సంపా), ***విమర్శ – ప్రతి విమర్శ (సర్దేశాయి తిరుమలరావు).*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2002.

23. చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం(సంపా), ***ఆచార్య జి. యన్, రెడ్డి పీఠికలు.*** విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్, 2017.

24. మల్లయ్య. కాలువ, ***మార్క్స్ అంబేద్కర్ భారతదేశంలో ఆర్థిక సామాజిక విప్లవాలు.*** హైదరాబాదు: భూమి బుక్ ట్రస్ట్, 2019.
25. సత్యనారాయణ. ఎస్వీ, ***తెలుగు సమాజం–మార్క్సిజం.*** హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, 2016.
26. సుబ్బారావు. దుర్గం, ***పూలే, పెరియార్, అంబేద్కరిజం.*** హైదరాబాదు: భూమి బుక్ ట్రస్ట్, 2000.
27. రవీంద్రారెడ్డి. ఎం, ***తెలుగు కవిత్వంపై మార్క్సిజం ప్రభావం.*** హైదరాబాదు: ఫ్రెండ్స్ పబ్లికేషన్స్, 1988.
28. సుబ్బారావు. మక్కెన, ***మార్క్సిజం అంటే ఏమిటి?.*** హైదారాబాదు: విశాలాంధ్ర విజ్ఞాన సమితి, 2007.
29. ప్రసాద్. చలసాని, ***మన గురజాడ.*** హైదరాబాదు: విరసం ప్రచురణలు, 1988.
30. ప్రతాపరెడ్డి. కాసుల, ***బోయ జంగయ్య 'జగడం' సందర్భం.*** హైదారాబాదు: చరిత ఇంప్రెషన్స్.
31. భీమన్న. బోయి(అను.), ***కుల నిర్మూలన.*** హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్, 1969.
32. లక్ష్మీకాంతం. పింగళి, ***సాహిత్య శిల్ప సమీక్ష.*** హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, 2016.
33. రామచంద్రారావు. వెన్నెటి, ***మను వసు చరిత్ర రచనా విమర్శనము.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1995.
34. నారాయణ. సింగమనేని, ***కథావరణం.*** కడప: పెన్నేటి పబ్లికేషన్స్, 2013.
35. రామారావు. ఎస్వీ, ***తెలుగులో సాహిత్య విమర్శ.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 2014.
36. నాగభూషణశర్మ. మొదలి, ***నాటక శిల్పం.*** హైదరాబాదు: క్రియేటీవ్ లింక్స్ పబ్లికేషన్స్, 2008.
37. సుబ్రహ్మణ్యం.జి.వి (సంపా), ***సాహిత్య వ్యాసాలు.*** హైదారాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2003.
38. రాసాని. వి. ఆర్ (సంపా), ***తెలుగు కథ – దళిత, మైనారిటీ, గిరిజన,***

***బహుజన జీవితం.*** చౌడేపల్లి: విజయవాణి ప్రింటర్స్, 2012.

39. మందేశ్వరరావు. వడలి, ***పాశ్చాత్య సాహిత్య విమర్శ – చరిత్ర – సిద్ధాంతాలు.*** హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1994.
40. శివశంకర్. పాపినేని, ***ద్రవాధునికత.*** విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2015.
41. లక్ష్మణ చక్రవర్తి. సిహెచ్(ప్ర. సంపా), ***ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు.*** హైదరాబాదు: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, 2005.
42. వీరభద్రయ్య. ముదిగొండ, ***జీవియస్ విమర్శాదర్శనం.*** హైదరాబాదు: శ్రీ సాయి ప్రాసెస్, 2000.
43. వీరభద్రయ్య. ముదిగొండ, ***సంపత్కుమార విమర్శ దేశీయతా భూమిక.*** హైదరాబాదు: శ్రీసాయి ప్రాసెస్, 2000.
44. వీరభద్రయ్య. ముదిగొండ, ***సాహితీ విమర్శ సూత్రం – అన్వయం.*** విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్, 1998.
45. వీరభద్రయ్య. ముదిగొండ, ***సుప్రసన్న సమన్విత విమర్శ.*** హైదరాబాదు: మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2000.
46. వెంకటయ్య. తవ్వా, ***సీమకథా తొలకరి (వ్యాససంపుటి).*** తవ్వారుపల్లి(కడప): అక్షర దీపిక పబ్లికేషన్స్, 2014.
47. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, ***కథాశిల్పం.*** విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2016
48. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, ***రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2006.
49. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, ***విమర్శా శిల్పం.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2002.
50. సంపత్కుమారాచార్య. కోవెల, ***ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ – సంప్రదాయిక రీతి.*** హైదరాబాదు: దక్షిణ భారత ప్రెస్, 1981.
51. సిమ్మన్న. వెలమల, ***తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 2005.

52. సుబ్రహ్మణ్యం. జి. వి, ***ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం.***
సికిందరాబాదు: యువభారతి, 1983.

53. హరినాథరెడ్డి. అప్పిరెడ్డి, ***సీమసాహితీ స్వరం.*** అనంతపురం:
శ్రీమతి జెన్నె (ఎం) మాణిక్యమ్మ పబ్లికేషన్స్, 2014.

54. అహోబలరావు. కల్లూరు, ***రాయలసీమ రచయితల చరిత్ర.*** హిందూపూరు:
శ్రీకృష్ణ దేవరాయ గ్రంథమాల, 1977.

55. నిత్యానందరావు. వెలుదండ, ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.***
హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 2013.

56. భాస్కర చౌదరి. బి, ***సాహితీ మూర్తి కట్టమంచి.*** విజయవాడ:
నవోదయ పబ్లిషర్స్, 1983.

57. భూమయ్య. అనుమాండ్ల, ***ఆద్యుడు కట్టమంచి.*** హైదరాబాదు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1992.

58. కాత్యాయని విద్మహే, ***సాహిత్యాకాశంలో సగం.*** హైదరాబాదు:
నవోదయ బుక్ హౌస్, 2010.

59. సుందరం. ఆర్వీయస్, ***ఆంధ్రుల జానపద విజ్ఞానం.*** హైదరాబాదు:
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1983.

60. వెంకటేశ్వరరావు. దార్ల, ***బహుజన సాహిత్య దృక్పథం.*** హైదరాబాదు:
సొసైటీ &ఎడ్యుకేషనల్ ట్రస్ట్, 2012.

61. వెంకటేశ్వరరావు. దార్ల, ***సాహితీ మూర్తులు స్ఫూర్తులు.*** హైదరాబాదు:
సొసైటీ &ఎడ్యుకేషనల్ ట్రస్ట్, 2015.

62. రమణారెడ్డి. కె. వి, ***మహోదయం.*** విజయవాడ:
నాగేంద్ర ప్రెస్, 1969.

63. రామచంద్రారెడ్డి, రాచమల్లు, ***సారస్వత వివేచన (సాహిత్య వ్యాసాలు).*** ప్రొద్దుటూరు:
యువ సాహితీ, రారా స్మారక సమితి సంయుక్త ప్రచురణ, 2012.

64. బాలగోపాల్. కే, ***దళిత.*** హైదరాబాదు: పర్స్పెక్టివ్ పబ్లికేషన్స్, 2016.

65. శ్రీరామ చంద్రుడు. పుల్లెల(వ్యాఖ్య), ***కావ్య ప్రకాశం(మమ్మటుడు).***
హైదరాబాదు: సంస్కృత భాషా ప్రచార సమితి, 2009.

66. వీరేశలింగం. కందుకూరి, ***ఆంధ్రకవుల చరిత్ర***. హైదరాబాదు.
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1937.
67. నాగయ్య. జి, ***తెలుగు సాహిత్య సమీక్ష (ప్ర. సం).*** తిరుపతి:
నవ్య పరిశోధన ప్రచురణలు, 1983 (ప్ర. ము).
68. నాగయ్య. జి, ***తెలుగు సాహిత్య సమీక్ష (ద్వి. సం).*** తిరుపతి:
నవ్య పరిశోధన ప్రచురణలు, 1995 (ప్ర. ము).

# అనుబంధం –1

## *ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారితో 20.11.2019 వతేదీన జరిపిన ఇంటర్వ్యూ*

1. **సాంప్రదాయ సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వైపో వెళ్ళడానికి దారి తీసిన తక్షణ పరిస్థితులు ఏవి?**

**జ.** నేను సాహిత్య రంగంలో ప్రవేశించే సమయానికి నా చుట్టూ సంప్రదాయమే ఆవరించి ఉంది. నేను బాల్యం నుంచి మంచి భక్తుడిని. మా ఊరంతా సంప్రదాయమే అలా నేను సాంప్రదాయ సాహిత్యంలోకి ప్రవేశించాను.ప్రభావతీ ప్రద్యుమ్నం మీద పరిశోధన చేశాను.పరిశోధనలో చేరాలని మా శాఖాధ్యక్షులు ఆచార్య జి యన్ రెడ్డి గారిని కలిసి అడిగాను.ఆయన నా కోరికను మన్నిస్తూ ప్రాచీన సాహిత్యం మీద చేస్తావా? ఆధునిక సాహిత్యం మీద చేస్తావా? అని అడిగారు నేను చాలా సహజంగానే ప్రాచీన సాహిత్యం మీదనే చేస్తాను అన్నాను.అయితే తుమ్మపూడి కోటీశ్వర రావు గారి దగ్గరికి వెళ్ళు అన్నారు. నేను గురువు గారిని కలుసుకున్నాను. ప్రభావతి ప్రద్యుమ్నం మీద పరిశోధించు అన్నారు. సరే అన్నాను. చేశాను. అనంతపురం కు లెక్చరర్ గా వచ్చినాక, ఎం ఏ విద్యార్థులకు గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని పాఠంగా చెప్పడం, అనంతపురం జిల్లాలో మంచి రెడ్డి శివరాం, రాయుడు, బోస్, పుత్ర, స్వామి, రఘుబాబు వంటి మిత్రులు పరిచయం కావడంశ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో వామపక్ష విద్యార్ధి సంఘాల కార్య కలాపాలు, తెలంగాణా నుండి ప్రగతిశీల భావాలు గల నాగేశ్వరాచారి, గౌరీ శంకర్ వంటి విద్యార్థులు నా దగ్గరికి రావడం, అనంతపురం జిల్లా లోని

రాజకీయ వాతావరణం, శేషయ్య వంటి మిత్రుల పరిచయం –ఈ నేపథ్యం నన్ను ఆధునిక సాహిత్యం వైపు మళ్ళించింది.

2. **ఆధునికాంధ్ర కవిత్వం పైనే ఎక్కువగా విమర్శ రాయడానికి గల కారణాలు?**

**జ.** భారత దేశంలో ప్రాచీన కాలంలోనే కాదు, ఆధునిక కాలంలో కూడా కవిత్వానికే పెద్ద పీట. ఆధునిక తెలుగు సాహిత్యంలో నేను కవిత్వం మీదనే ఎక్కువగా విమర్శ రాయడానికి కారణం ఇదే. నేను రాసిన విమర్శలో సగానికి సగం కవిత్వం పైన్నే.

3. **సంఘ సంస్కరణ దృక్పథంతో వచ్చిన నాటకాలు ఎన్నో ఉన్నాయి కానీ ఆ ప్రక్రియపై విమర్శ రాయకపోవడానికి కారణం?**

**జ.** నాటక ప్రక్రియ మీద నా కృషి దాదాపు శూన్యం.భవిష్యత్తులో నాటకం మీద విమర్శ రాస్తాను.

4. **మీ దృష్టిలో మంచి విమర్శ అంటే?**

**జ.** పాఠకుల చేత సాహిత్యాన్ని చదివింపజేసేది. రచయితలను, పాఠకులను మార్చేది. పరివర్తన కలిగించేది. ఆలోచింప జేసేది.

5. **విమర్శకి, పరిశోధనకు ఉన్న స్థూలమైన తేడా ఏమిటి?**

**జ.** విమర్శ పరిశోధనల మధ్య ఎక్కువ తక్కువలు లేవు. నా తెలివిని మాత్రమే ఉపయోగించి విమర్శ రాయగలను.కానీ నా తెలివితో మాత్రమే పరిశోధన చేయలేను.

6. **జానపద సాహిత్యం పై కేవలం ఒకే ఒక్క వ్యాసాన్ని రాశారు. కారణం?**

**జ.** తెలంగాణా జానపద గేయాలు అనే పుస్తకం చదవగానే దాని మీద ఒక వ్యాసం రాశాను. అప్పటికే ఆర్వీయస్ సుందరం, నాయని కృష్ణకుమారి

లాంటి నిపుణులు ఆ రంగంలో కృషి చేస్తున్నారు. అందువల్ల నా దృష్టి అటువైపు పోలేదు.

**7. జానపద సాహిత్యంలో సామాజిక స్పృహ లేదంటారా?**

**జ.** జానపద సాహిత్యంలో సామాజిక స్పృహ పుష్కలంగా ఉంటుంది. తెలంగాణా జానపద గేయాలు సంపుటి అక్కడి భూస్వామ్య వ్యవస్థను బాగా ఆవిష్కరించింది.

**8. గురజాడ కంటే ముందే కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణ నేపథ్యంలో అనేక రచనలు చేసారు? అయితే గురజాడ సాహిత్యానికే ఎందుకు ఎక్కువగా ఆకర్షితులయ్యారు?**

**జ.** ఏమీ లేదు ఎం.ఏలో కన్యాశుల్కం నాటకం, ఆ తర్వాత ఆయన మొత్తం సాహిత్యం పాఠంగా చెప్పవలసిరావడం. నేను గురజాడను ఎక్కువగా అభిమానించేడానికి కారణం. కందుకూరిని నేను ఆలస్యంగా చదువుకున్నాను. అయితే విమర్శ అంతగా రాయలేదు.

**9. సాహిత్య పునర్మూల్యాంకనానికి సంబంధించిన సాహిత్య విమర్శను ఎక్కువగా రాసినట్టుగా తెలుస్తుంది అందుకు పునాది?**

**జ.** చాలామంది గుర్తించినట్లుగా నాకు కొంత చారిత్రక దృష్టి ఉంది. ఒక రచన వచ్చిన కాలానికి, దానితో నేటి సమాజానికి గల సంబంధం చూడటం అలవాటయింది. గత సాహిత్యాన్ని ఎవరైనా మళ్లీ పరామర్శించాల్సి వస్తే పునర్మూల్యాంకనమే మంచి పద్ధతి. లేకుంటే పాడిందే పాడినట్లుగా ఉంటుంది.

**10. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులందరూ తప్పనిసరిగా అభ్యుదయ వాదులై ఉండాల్సిందేనా?**

**జ.** మార్క్సిస్టు సాహిత్య విమర్శకులంటేనే అభ్యుదయవాదులు, విప్లవవాదులు. అభ్యుదయవాదుల మార్క్సిస్టు కావడానికి వీలులేదు అభ్యుదయవాదులు మార్క్సిజం, అంబేద్కరిజంల మీద విశ్వాసమున్నవాళ్లే.

11. **మార్క్సిజం సిద్ధాంతం అందరికీ అమోదయోగ్యమైనదని మీరు భావిస్తారా?**

**జ.** విభజిత సమాజంలో ఏ సిద్ధాంతమూ అందరికీ సమానంగా నచ్చదు. మనువాదం కూడా ఆనాడు అందరికీ నచ్చలేదు. చార్వాకులు, బౌద్ధులు, శాలంకాయనులు వ్యతిరేకించారు. అలాగే ఇవాళ మార్క్సిజాన్ని, అంబేద్కరిజాన్ని అందరూ ఆమోదించరు. అవి ఏ ప్రజలకూ సహాయపడతాయో వాళ్లే ఆమోదిస్తారు. ఏ సిద్ధాంతమైన అది ఎవరికి ఉపయోగపడుతుందో వాళ్లే దానిని ఆమోదిస్తారు. ఆ సిద్ధాంతం వల్ల నష్టపోయేవాళ్లు దాన్ని ఆమోదించరు.

12. **మీ సాహిత్య విమర్శపై అంబేద్కరిజం ప్రభావం పడటానికి గల కారణాలు?**

**జ.** భారతీయ సామాజిక పరిస్థితులే నన్ను అంబేద్కరిజానికి దగ్గర చేశాయి.

13. **దళిత సాహిత్య విమర్శను ఇటీవల దళితేతరులు కూడా రాస్తున్నారు. అందులో ఎంతవరకు సప్రమానత ఉందంటారు?**

**జ.** ఏ రకమైన సాహిత్యాన్నైనా ఎవరైనా విమర్శించవచ్చు. ప్రామాణికత అనేది కులం మీద ఆధారపడి ఉండదు. అయితే అనుభవాన్ని మనం తిరస్కరించలేము.

**14. మీ సాహిత్య విమర్శ చారిత్రక పరిణామంలో మార్క్సిజం అంబేద్కరిజాన్ని సమన్వయిస్తూ రాస్తున్నట్టుగా ఉంది. ఆ సమన్వయ ధోరణి ఎప్పటినుండి అలవడింది?**

**జ.** నేను 1980 ప్రాంతాల నుంచి మార్క్సిజాన్ని అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టాను.1990 వచ్చేసరికి మనదేశంలో కాన్షీరాం ఉద్యమం, అంబేద్కర్ శతజయంతి ముందుకు వచ్చాయి. ఆర్థిక వాదానికి, సాంఘిక వాదం తోడయింది. రెండింటినీ సమన్వయం చేసుకోవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. చేసుకుంటున్నాను లాల్ నీల్ సలాం అనడం అనివార్యం.

**15. రచయిత ఒక భావజాలానికి కట్టుబడి ఉన్నప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలడు అని చాలా సందర్భాల్లో చెప్పారు. కానీ ఎటువంటి భావజాలం లేకుండా రచనలు చేసేవారు, ఒక భావజాలానికి కట్టుబడని వాళ్ళు కూడా ఉన్నత స్థానాల్లో ఉండటం మనం ఈరోజు చూస్తున్నాం. వారి గురించి మీ అభిప్రాయం?**

**జ.** ఏ భావజాలానికి కట్టుబడని వాళ్లు ప్రపంచంలో ఎవరూ ఉండరు. ఏ భావజాలము లేకుండా ఎవరూ ఏమీ మాట్లాడలేరు. రాయలేరు ఎవరి భావజాలం ఏదో ప్రకటించుకోవడమే ఎవరైనా చేయవలసింది.

**16. సామాజికమైన మార్పు కోసం మార్క్సిజం, అంబేద్కరిజం కాకుండా మరేవైనా సాహిత్య సిద్ధాంతాలు ఉన్నాయని మీరు భావిస్తున్నారా?**

**జ.** ఫెమినిజం కూడా సామాజిక మార్పును కోరే కదా మైనారిటీవాదం కూడా భారతీయ సమాజంలో రావలసిన మార్పునే చెబుతుంది.

**17. మీ సాహిత్య విమర్శ తెలుగు సాహిత్య విమర్శ పరిణామాన్ని పోలి ఉంది అది అనివార్యమేనా లేక యాదృచ్ఛికమా?**

**జ.** తెలుగు సాహిత్య విమర్శలో చిన్న భాగమే నా విమర్శ పోలి ఉంది అనడం సరికాదు.

**18. భవిష్యత్తు విమర్శకులు, వారు రాసే విమర్శ ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?**

**జ.** సాహిత్య విమర్శకులకు సహృదయత నిర్మోహమాటమి రెండూ ఉండాలి. సాహిత్యాన్ని అర్థం చేసుకునేటప్పుడు సహృదయత అభిప్రాయ ప్రకటన చేసినప్పుడు నిర్మోహమాటమి ఉండాలి. నేటి విమర్శకులు కూడా విమర్శను పాఠకుల చేత చదివించేటట్లు, ఆలోచింపజేసేటట్లు రాయాలి.

**19. సాహిత్యంలో సాహిత్యేతర శాస్త్రాల ప్రమేయం ఎంతవరకు సబబు?**

**జ.** సాహిత్య విమర్శలో సాహిత్య శాస్త్రల ప్రమేయం ఎంత అవసరమో, సామాజిక, వైజ్ఞానిక శాస్త్రాల ప్రమేయం కూడా అంతే అవసరం. లేకుంటే సాహిత్య అధ్యయనం సమగ్రం కాదు.

**20. సాహిత్యానికి సామాజిక పునాదిని చూపించడంలో మార్క్సిజం విజయం సాధించింది. అయితే ఆ పని స్థూల పరిధి (Macro Level)లో చేయగలిగినట్లు సూక్ష్మ పరిధి (Micro Level)లో చేయలేదు. అనే చేకూరి రామారావు గారి అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? (వచన రచన తత్త్వాన్వేషణ. 'ఇది సంజాయిషీకాదు వ్యాసం' పుట 52.)**

**జ.** చేరా గారి అభిప్రాయంతో ఏకీభవించలేను. స్థూల పరిధిలోనైనా, సూక్ష్మ పరిధిలోనైనా మార్క్సిజం లోతుగా చదువుకున్న విమర్శకులు

విమర్శలు రాయగలరు. ఆయన చేరాతలు రాసే కాలానికి మార్క్సిస్టు బాట నుంచి కొంచెం పక్కకు జరిగే దశలో ఉండి అలా రాశారు.

**21. వల్లంపాటి సాహిత్య విమర్శ లక్షణాలు మీ సాహిత్య విమర్శలో కనిపిస్తున్నాయి. మీపై ఆయన ప్రభావం ఎంతవరకు ఉంది?**

**జ.** నన్ను తొలినాళ్ళలో విమర్శలో నడిపించిన వారు వల్లంపాటి, సర్దేశాయి తిరుమలరావులు. ఆ తర్వాత రారా, త్రిపురనేని వంటి వాళ్లు. మొదటి ఇద్దరూ సున్నిత వాదులు. తరువాత ఇద్దరూ ప్రచండవాదులు. వల్లంపాటి నాకన్నా పెద్దవారు. కేతు విశ్వనాథరెడ్డి గారి ద్వారా పరిచయమయ్యారు. నన్ను వ్యక్తిగతంగా బాగా అభిమానించేవారు. తన సాహిత్య వ్యాసాలు పుస్తకానికి నాతో ముందుమాట రాయించుకున్నారు. నేను భయపడుతూ రాశాను. ఆయన నా ముందుమాట చదివి Splendid అన్నారు. ఆయన "రాయలసీమ ఆధునిక సాహిత్యం" మీద నేను సమీక్ష రాయాలని అభిలషించారు. ఎందుకో రాయలేక పోయాను నేను. సాహిత్య విమర్శలో సహనం అలవాటు చేసిన వారు వల్లంపాటి.

# అనుబంధం –2

అనుబంధం –2

సదస్సులు మరియు పరిశోధన వ్యాసాలు

# S.K.S.D. MAHILA KALASALA Degree & P.G (A), TANUKU

*(Thrice-Accredited by NAAC with 'B++' Level at 2.82 CGPA)*

DEPARTMENTS OF TELUGU, HINDI , SANSKRIT

&

INTERNAL QUALITY ASSURANCE CELL

TWO-DAY NATIONAL SEMINAR

(Autonomous Grant)

ON



## " NATURE AND ENVIRONMENTAL CONSERVATION IN ANCIENT AND MODERN INDIAN LITERATURE – A STUDY "

6th and 7th September, 2019

## CERTIFICATE

*This is to certify that Kum./Smt./Sri/Dr./Prof.* అల్లూరు మస్తాన్ *has participated as Resource Person / Chairperson / Delegate / Author / Co-Author, presented a Paper on* ఆచార్య 'రాచపాళెం' దృష్టిలో సాహిత్య ప్రయోజనం *in the Two- Day National Seminar (Autonomous Grant) Organized by the Depts. of Telugu, Hindi, Sanskrit & Internal Quality Assurance Cell (IQAC), S.K.S.D. Mahila Kalasala Degree & PG (A), Tanuku on 6th and 7th September, 2019.*

G. Amruthavalli
Dr. G. Amruthavalli
Convener

B. N P
Dr. B. Nagapadmavathy
Principal & Chairperson

Scanned with CamScanner

స్నేహక్లబ్, ఆం.ప్ర. షెడ్యూల్డ్ కులాల సంక్షేమసంఘం, మహాబోధి సాహిత్యవేదిక & జి.ర.సం – అనంతపురము. సంయుక్తంగా

SNEHA CLUB, A.P.SC. WELFARE ASSOCIATION, MAHABODHI SAAHITHYA VEDIKA & ZIRASAM - ANANTHAPURAMU JOINTLY ORGANIZED

## రెండురోజుల అంతర్జాతీయ సదస్సు

## TWO DAY INTERNATIONAL SEMINAR

PAY BACK TO SOCIETY SNEHA CLUB

ISBN 978-93-5321-987-1

9 789353 219871 >

# CERTIFICATE

*This is to certify that Prof./Dr./ Mr./Mrs/Ms* అట్లూరు మస్తాన్ ........ *has participated and presented a paper entitled* ప్రాచీన తెలుగు సాహిత్యం – 'దార్ల' పునర్మూల్యాంకన దృక్పథం ........ *in the International Seminar* **"RE-ASSESSMENT OF CLASSICAL LITERATURE BY MODERN WRITERS"** (ప్రాచీన తెలుగుసాహిత్యం – ఆధునికుల పునర్మూల్యాంకనం) *jointly organized by Sneha Club, A.P.SC.Welfare Association, Mahabodhi Saahithya Vedika & Zilla Rachaithala Sangham - Ananthapuramu, A.P - INDIA, during 27th & 28th February, 2019.*

| | | | | |
|---|---|---|---|---|
| Sri. Dr. K.S. BHAGYA RAO, IRS<br>Founder & Chairman<br>SNEHA GROUPS | NAGISETTY DHARMAIAH<br>STATE PRESIDENT<br>A.P. SC.WELFARE ASSOCIATION | DASANNAGARI KRISHNAMURTHY<br>FOUNDER PRESIDENT<br>MAHABODHI SAAHITHYA VEDIKA | Dr. B. ASHOK KUMAR<br>CO-ORDINATOR | Prof. G. BALASUBRAMANYAM<br>DIRECTOR |

Scanned with CamScanner


RNI No. APTEL/2003/12253

# భావ వీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

## BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 14 Issue No. 11 (3) Monthly November 2017 ISSN No. : 2456-4702

## చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్)

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

International Journal of Telugu Literary, Culture & Language Study

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : KOLLA SRIKRISHNA RAO

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9440033715
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 14 - Issue. 11 (3) - November 2017 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

**EDITORIAL BOARD**

*Chief Editor*
**Dr.B.VENKATASWAMY,**
*M.A.(Tel), M.A. (San), M.A. (Ling), M.A. (Mcj), Ph.D.,*
HOD, Dept. of Telugu,
P. A. S. College, PEDANANDIPADU - 522 235, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept. of Telugu, Madras
   University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman, Telangana University,
   Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
   Asst. Professor, Dept. of Telugu,
   Yogi Vemana University, Kadapa.
9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
   Dept. of Telugu,
   Regional Institute of Education (NCRT)
   Manasa Gangothri, Mysore, Karnataka.
10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
    Dept. of Telugu,
    Dravidian University, Kuppam, Chittor Dist.
11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
    Asst.Professor, Dept. of Telugu,
    Adikavi Nannaya University,
    RAJAMUNDRY, East Godavari, A.P.
12. **Mr.D.ESWARA RAO,** M.A.,
    Associate Professor, Dept.of English,
    P.A.S.College, PEDANANDIPADU-522 235,
    Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu, Silver Jubilee Govt. Degree College, Kurnool District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College, West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu, Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal, Govt .Degree College, Chebrole , Guntur, A.P.

17. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu, Andhra University, Visakhapathan.

18. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu, Kakatiya University, Warangal.

19. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu, University of Hyderabad, Hyderabad.

20. **Dr. T. Sailamma,** M.A., M.Phil., PhD.
Asst. Professor, Dept. of Telugu, Dravidian University, Kuppam, Chittoor Dist.

21. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu, University of Hyderabad, Hyderabad.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Associate Professor
Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**
G.L.S. ENTERPRISES, Guntur.
970 330 1698.

గమనిక: రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

-అలూరు మస్తాన్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నాలుగున్నర దశాబ్దాలుగా విమర్శా రంగంలో నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రసిద్ధ విమర్శకులలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ప్రముఖులు. ఈయన ప్రాచీన సాహిత్యం మొదలుకొని నేటి ఆధునిక సాహిత్యం వరకు కావ్యం, కథ, నవల, కవిత్వం, అనువాదం, భారతీయ సాహిత్యాల తులనాత్మక అధ్యయనం మొదలైన ప్రక్రియలను స్పృశిస్తూ వివిధ కోణాల్లో, తనదైన దృక్పథంతో, విమర్శ రాస్తున్నారు. వీరి సాహిత్యకృషిని, దీనిలోనూ ఈయన చేసిన సాహిత్య విమర్శ కృషిని ఈ వ్యాసంలో పరిచయం చేయాలనుకుంటున్నాను.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు 1948 అక్టోబర్ 16 న చిత్తూరు జిల్లాలోని తిరుపతికి సమీపాన ఉన్న కుంట్రపాకం గ్రామంలో జన్మించారు. అధ్యాపక వృత్తిలో 38 సంవత్సరాలు కొనసాగి, ఈ కాలంలోనే అనేక విమర్శ వ్యాసాలను రచించిన గొప్ప అధ్యయనశీలి. వీరు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం. ఏ చదువుతున్న రోజుల్లో వారి గురువులు తరగతి గదిలో నిర్వహించే వారాంతపు సదస్సుల ప్రోత్సాహంతో 1972 లో "సినిమా కవిత్వం - సాహిత్య విలువలు" అనే అంశంపై తన తొలి ప్రయత్న పూర్వక వ్యాసాన్ని సమర్పించారు. ఆ తరువాత 1973 జనవరిలో పరిశోధనా రంగంలోకి ప్రవేశించి ఆచార్య తుమ్మపూడి కోటీశ్వర రావు గారి పర్యవేక్షణలో పింగళి సూరన రచించిన "ప్రభావతీ ప్రద్యుమ్నం" కావ్యం మీద తన పరిశోధనను పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు ఆంగ్లం, తమిళ, కన్నడ భాషలలో అనువాదాలు కూడా చేసారు. ఈ పరంపరలో మహర్షి దేవేంద్రనాథ ఠాగూర్(1988) రాసిన ఒక మోనోగ్రాఫ్‌ను తెలుగులోకి అనువదించారు. అలాగే ప్రముఖ పంజాబీ కవి, విమర్శకుడు కర్తార్ సింగ్ దుగ్గల్ రచించిన కథల సంపుటిని ''*పున్నమిరాత్రి*" (2005) పేరుతో తెలుగులోకి అనువదించారు. ఒక తమిళ నవలను కూడా ''*రక్తనది*" (2006) అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇలా కాల్పనిక సాహిత్యాన్ని కొంత, విమర్శను కొంత ఇతర భాషల నుండి అనువాదం చేసిన రాచపాళెం వారు రాసిన విమర్శన గ్రంథాలలో ముఖ్యమైనవి ''*తెలుగు కవిత్వం -నన్నయ్య ఒరవడి*" (1985), "*గురజాడ - తొలి కొత్త తెలుగు కథలు*' (1985), "*ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు - అభిరుచులు*" (1992), "*కథాంశం*' (2006), "చర్చ" (2010), "తులనాత్మక దాక్షిణాత్య సాహిత్య వ్యాసాలు" (2009), "మన నవలలు - మన కథానికలు" (2010), మరో చర్చ (2012), ప్రతిఫలనం (2014), "కవుల తెలంగాణం" (2016) ఇవే గాక దాదాపు ఇరవైకి పైగా విమర్శన గ్రంథాలు, నాలుగు కవిత్వ సంపుటాలు రచించారు. ఈ గ్రంథాలను బట్టి ఆయన విమర్శన ప్రాపంచిక దృక్పథాన్ని తెలుసుకోవచ్చు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు 1986 - 87 సంవత్సరానికి గాను ఇచ్చే ఉత్తమ వ్రాతపతి అవార్డు "*ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు - అభిరుచులు*" (1992) గ్రంథానికి లభించింది. అదే విశ్వవిద్యాలయం నుండి 2008 లో "చర్చ" అనే గ్రంథానికి గాను ఉత్తమ విమర్శ గ్రంథ పురస్కారం లభించింది. అదే విధంగా ఆయన విమర్శ రంగంలో చేసిన కృషికి గాను "మన నవలలు - మన కథానికలు" (2010), అనే విమర్శన గ్రంథానికి గాను 2014లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. ఈ విధంగా సృజనాత్మక సాహిత్యాన్ని, విమర్శన దృక్పథాన్ని, మార్క్సిస్టు భావజాలాన్ని ఆసరాగా చేసుకొని రచనలు చేసారు. సాహిత్య విమర్శకునికి ఒక సామాజిక బాధ్యతను, ఆచరణను సూచించిన విమర్శకులలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఒకరు. విమర్శకులలోని వైవిధ్యాన్ని చెబుతూ ప్రగతిశీలవాదులు, సంప్రదాయవాదుల మధ్య భావజాల పరమైన సంఘర్షణ ఆరోగ్యకరమైనదని ఆయన గుర్తించారు. ఒక ధోరణిలో వెలువడిన సాహిత్యాన్ని స్థల, కాల బద్ధమైన భావజాల పరమైన నేపథ్యంతో విశ్లేషించ వలసిన అవసరాన్ని ఆయన తెలియజేశారు. ఏది సమీక్ష, ఏది విమర్శ అనే విషయంలో స్పష్టతను తెలియజేసి విషయ సామర్థ్యాన్ని బట్టి శక్తివంతమైన సమీక్ష, విమర్శ కంటే గొప్పదని పేర్కొన్నారు. విమర్శలో రాసి కన్నా వాసి ముఖ్యమని ఆయన తెలిపారు. ఒక సాహిత్య విమర్శకుని భావజాలంలోని మార్పుకు సామాజిక నేపథ్యం ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో ఆయన తెలియజేశారు.

## మూల్యాంకనం, పునర్మూల్యాంకనం అనివార్యం :

ఒకరు రాసిన సాహిత్యాన్ని మరొకరు పరిశీలించి, తన దృష్టితో మూల్యాంకన చేసినప్పుడు, అవి కాలక్రమంలో పునర్మూల్యాంకనకు కూడా గురయ్యే అవకాశం ఉంటుంది. నూతన సిద్ధాంతాలు, నూతన పాఠకులు వచ్చినప్పుడు ఇలా తమ దృష్టికోణంతా ఆ సాహిత్యాన్ని పునర్మూల్యాంకన చేస్తుం

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


టారు. మరొకవైపు ఆ సృజన సాహిత్య లక్ష్యాన్ని సరిగా గుర్తించకుండా చేసే మూల్యాంకనల వల్ల కూడా పునర్మూల్యాంకన జరుగుతుంది. దీన్ని అంగీకరించడం, అంగీకరించకపోవడమేది పాఠకుల ఇష్టం. కానీ అలా పునర్మూల్యాంకన జరగడాన్ని ఆహ్వానించడం ఒక ప్రజాస్వామిక సాహితీవేత్తకు మాత్రమే సాధ్యమవుతుంది. ఆచార్య రాచపాళెం వారిలో ఈ లక్షణం కనిపిస్తుంది. ఒక వైపు ఆధునిక సాహిత్య విమర్శలో "*కవిత్వ తత్త్వ విచారము*"(1914) కొత్త బోదెలు తవ్విందని కవులు, విమర్శకులు కట్టమంచి రామలింగా రెడ్డి గారిని ప్రశంసిస్తుంటే, అదే పంథాలో పోకుండా రాచపాళెం వారు కట్టమంచి గారి అభిప్రాయాన్ని తోసిపుచ్చుతూ "*భారతమునందలి ద్రౌపదిని దృష్టియందుంచుకొని ప్రభావతిని విమర్శింపరాదు. అర్జునుని చూచిన కన్నులతో ప్రద్యుమ్నుని చూడరాదని*"('శిల్ప ప్రభావతి' పుట:143) అంటారు. కట్టమంచివారు ప్రద్యుమ్నునిలో విరహంతో రగిలిపోతున్న ప్రబంధ పురుషున్ని మాత్రమే చూడగా (క.వి పుట :79) రాచపాళెం ప్రద్యుమ్నునిలో ఒక ద్రష్ట, భావుకుడిని చూశారు. అయితే భావం విషయంలో మాత్రం కట్టమంచిని అభినందిస్తూ, భాష విషయంలో మాత్రం వీరిది నన్నయ భాషే అని నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విషయంలో తాపీ ధర్మారావు గారిని సమర్థించారు.

సాహిత్య విమర్శ ప్రయాణించవలసిన మార్గాన్ని రాచపాళెం తన విమర్శ గ్రంథాల ద్వారా నిర్దేశించారు. అది ఎలాంటి నిర్దేశం అంటే ఒక సహేతుకమైన సిద్ధాంత పరమైనది. ఫలానాది తప్పు, ఫలననాది ఒప్పు అని నిక్కచ్చిగా చెప్పే లక్షణమనుకుంటున్నాను. రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు రచించిన '*కచుడా ఆదర్శం?*' అనే వ్యాసంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. నన్నయ భారతంలోని కచుని విద్యాభ్యాసవృత్తాంతాన్ని 2003 - 04 విద్యా సంవత్సరంలోని ఇంటర్మీడియట్ మొదటి పాఠ్యపుస్తకంలో ప్రచురించడాన్ని దుయ్యబట్టారు. ఆ పాఠ్య భాగం విద్యార్థులను చెడ్డదారిలో పయనించేట్టుగా ఉందని దీనిని పునర్మూల్యాంకన దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ విషయాన్ని హేతుబద్ధంగా విమర్శిస్తూ "కచుడు ఇంటర్ విద్యార్థులకే కాక ఎవరికీ ఆదర్శప్రాయుడే కాడు" (పుట:61-కొన్ని కావ్యాలు కొందరు కవులు) అని పేర్కొని దీనిని పునర్మూల్యాంకనం చేయవలసిన అవసరం ఉందని భావించారు. ఇందులో వస్తుగతమైన విమర్శకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. "*శిల్ప ప్రభావతి*" (1980) తరువాత "*తెలుగు కవిత్వం - నన్నయ ఒరవడి*" (1987) అనే విమర్శ గ్రంథంలో శిల్పానికి సంబధించిన విశ్లేషణ మాత్రమే కనిపిస్తుంది. అయితే, ఆ తరువాత గురజాడ పై రాసిన '*గురజాడ తొలి కొత్త తెలుగు కథలు*' (1985) అనే గ్రంథాన్ని కవి జీవిత కావ్య సమన్వయ విమర్శతో విశ్లేషించారు. ఈ గ్రంథ రచనతో వీరిలో ఆధునిక సాహిత్య భావాల ప్రభావం పడిందని చెప్పవచ్చు. ఈ విధంగా ఇంతవరకు వచ్చిన ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం, నేడు వెలువడుతున్న ఆధునిక సాహిత్యాన్ని మూల్యాంకనం చేయడమే ఈయన విమర్శలోని ప్రధానాంశంగా తెలుస్తుంది.

### 'రాచపాళెం' సాహిత్య విమర్శ-చారిత్రక పరిణామం:

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి విమర్శా ప్రస్థానం శిల్పగతమైన చర్చతో ప్రారంభమై అది వస్తుగతమైన చర్చగా వికాసాన్ని పొందింది. ఆయన రాసిన సాహిత్య విమర్శను దశలవారిగా పరిశీలించినట్లయితే వీరి సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం అర్థమౌతుంది. ఒక వ్యక్తి సామాజిక పరిస్థితులు ఆ వ్యక్తి సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి అన్నది ఎంత సత్యమో, కాలక్రమంలో ఆ వ్యక్తి సాహిత్యం పరిణామం చెందుతుందన్న మాట కూడా అంతే సత్యం. కాబట్టి రాచపాళెం సాహిత్య విమర్శ ఒక చారిత్రక పరిణామాన్ని సంతరించుకుందని చెప్పవచ్చు. రాచపాళెం వ్యక్తిత్వం గురించి సినారె ''*సంప్రదాయంలో మొలకెత్తిన రాచపాళెం వ్యక్తిత్వం పరిణామ క్రమంలో ప్రయోగశీలాన్ని, ప్రగతి ద ృక్పథాన్ని తనలో మేలవించుకుందని*" అంటారు. ఇక్కడ వ్యక్తిత్వం అంటే కేవలవ్యక్తిత్వం అని కాదు. ప్రతి కవి, విమర్శకుల వ్యక్తిత్వాలు వారి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయని ఆయన అంతరార్థం కావచ్చు. నిజానికి ఆయన సాహిత్య విమర్శ శిల్ప విశ్లేషణతో ప్రారంభమై వస్తు విశ్లేషణతో వికాసాన్ని పొంది సామాజిక దృక్పథంతో ప్రగతి శీల భావాలతో కొనసాగుతుందని చెప్పవచ్చు. మొదటి రచన నుండి నేటివరకు వచ్చిన వివిధ రచనల పరిణామాన్ని విశ్లేషించినప్పుడు మాత్రమే రాచపాళెంవారి చారిత్రక విమర్శన ద ృక్పథం స్పష్టమవుతుంది. ఒకప్పుడు కొంత శిల్పద ృష్టిని ప్రదర్శించినా, కాలక్రమంలో చారిత్రక, గతితార్కిక భౌతికవాద సాహిత్య విమర్శవైపే ఆయన పయనం కొనసాగింది. వీటిని మరింత సోదాహరణంగా వివరించాల్సిన అవసరం ఉంది. అది మరొక వ్యాసం అవుతుంది.

### రాచపాళెం వారి విమర్శలోని ప్రధానాంశాలు :

ప్రస్తుత అధ్యయన ఫలితంగా నాకు అనిపిస్తున్న రాచపాళెంవారి విమర్శనాంశాల్లో కొన్నిముఖ్యాంశాలుగా కిందివాటిని గమనించాను.

1. ఈయన తన విమర్శలో నిచ్చెన మెట్ల సమాజ వ్యవస్థను కేంద్రంగా చేసుకొని, దాన్ని స్వరూపాన్ని గమనించి విమర్శ చేసారు.
2. కథలు, నవలలను విమర్శించేటప్పుడు సిద్ధాంత సమన్వయ విమర్శకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది.
3. రాచపాళెం వారు విమర్శకు సంబంధించిన మౌలిక ప్రతిపాదనలు చేయడం వలన రచయితలకు, విమర్శకులకు అవి మార్గదర్శనం అవుతాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



4. ఈయన తన విమర్శలో అన్ని విషయాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడాన్ని మనం గమనించవచ్చు. ఏదైనా ఒక గ్రంథాన్ని విమర్శన చేసేటప్పుడు అవసరమైన కొన్ని దశలను ఈయన మౌలికంగా వివరించారు. అవి రచయిత పరిచయం, గ్రంథ నేపథ్యం, విశ్లేషణ, లోపాలు, పరిష్కారాలు, సూత్రీకరణలు మొదలైన వాటిని ఆయన విమర్శలోని సోపానాలుగా చెప్పవచ్చు.
5. ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణాన్ని రచయితకు సూచించడం, దాని బాధ్యతను తెలియజేయడం ఆయన విమర్శలో ప్రధానాంశం.
6. విమర్శకుడు కేవలం ఒక ప్రక్రియకో, ఒక ద ృక్పథానికో పరిమితం కాకుండా ఉండేలా తన తరువాతి విమర్శకులకు మార్గదర్శనం చేస్తూ అభ్యదయ, దళిత, స్త్రీ, విప్లవ, మార్క్సిస్టు మొదలైన అన్ని భావజాలాల పట్ల తన దృక్పథాన్ని తెలియజేస్తూ విమర్శ రాసారు.
7. ఒక ప్రాంతంలోని రచయిత కేవలం ఆ ప్రాంతంలోని రచనలను మాత్రమే విమర్శా వస్తువుగా స్వీకరించడం వలన ఒక విమర్శకుని ఆలోచనా ధోరణి అంతగా పరిణతి చెందినట్లుగా కనిపించకపోవచ్చు. కాబట్టి ఈయన జన్మతః రాయలసీమలో జన్మించినప్పటికి ఇతర అన్ని ప్రాంతాల నుండి వెలువడిన సాహిత్యాన్ని నిబద్ధతతో విశ్లేషించారు. ఆ విధంగా వచ్చిన గ్రంథాలలో "కవుల తెలంగాణం" (2016) ముఖ్యమైనది.
8. రచయితలు వారు చెప్పగలిగే వాస్తవాలను, తాత్విక దృక్పథాన్ని, భావజాలాన్ని బయట పెట్టకపోవడాన్ని ఈయన నిరసించారు.
9. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన విమర్శలో వస్తుగతమైన చర్చకు ప్రాధాన్యత ఇచ్చారు.
10. రాచపాళెం వారి సాహిత్య విమర్శ అటు మార్క్సిజం, ఇటు అంబేద్కరిజాన్ని అనుసరించి సమన్వయం చేసే విధంగా ఉంది.
11. రాచపాళెం సాహిత్య విమర్శను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లయితే ఒక చారిత్రక పరిణామాన్ని మనం గమనించవచ్చు.
12. ఆయన ప్రారంభంలో రాసిన విమర్శలో లక్షణచర్చకు ప్రాధాన్యత ఇచ్చారు. దీనికి ఉదాహరణగా ఆయన రాసిన "శిల్ప ప్రభావతి" (1980) అనే తన సిద్ధాంత గ్రంథాన్ని చెప్పుకోవచ్చు.
13. ఆ తరువాత కొన్ని సామాజిక పరిస్థితులకు ప్రభావితుడైన ఆయన విమర్శా దృక్పథంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కె. వి. రమణారెడ్డి రాసిన "మహోదయం" అనే గ్రంథ ప్రభావంతో "గురజాడ - తొలి కొత్త తెలుగు కథలు" (1985) అనే విమర్శా గ్రంథాన్ని కవి జీవిత విమర్శ ద ృష్టితో రచించారు.
14. ఆయన వట్టికోట ఆళ్వారు స్వామి రచించిన "ప్రజల మనిషి" నవలపై వస్తు శిల్ప దృష్టితో రాసిన ఒక వ్యాసంలో వస్తుశిల్పాల సమన్వయం కనిపిస్తుంది.
15. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన సాహిత్య విమర్శను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఒక సామాజిక పరిణతిని మనం చూడొచ్చు.

సాంప్రదాయ క్షేత్రంలో మొదలైన ఆయన సాహిత్య విమర్శా వ్యవసాయం క్రమంగా ఆధునిక సాహిత్యమనే కొత్త వంగడాలను పుణికి పుచ్చుకొని వాటి ఫలాలను పాఠకులకు అందించాలనే తపన ఆయన విమర్శలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధంగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు నాలుగున్నర దశాబ్దాలుగా తన విమర్శనా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, వివిధ దృక్పథాలను స్పృశిస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. అనిల్ రాజింవాలె. *మార్క్సిజం అంటే ఏమిటి ?*. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్.2007.
2. గోపి. ఎన్ (గౌ. సంపా) సత్యనారాయణ ఎస్.వి (సంపా), *రాచపాళీయం (షష్ట్యబ్దిఅభినందనసంచిక)*: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 2008.
3. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, *కథాంశం* . హైదరాబాదు బీవిశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2006
4. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, *గురజాడ తొలి కొత్త తెలుగు కథలు* .అనంతపురం: ఆంధ్ర భారతి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం. 1985.
5. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, *మన నవలలు - మన కథానికలు*. విజయవాడ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2016.
6. భీమన్న బోయి(అను), *కుల నిర్మూలన* .హైదరాబాదు : హైదరాబాదు బుక్ ట్రస్ట్. 1969.
7. వెంకటేశ్వర రావు కొల్లు, *విమర్శకుడిగా కె.వి రమణారెడ్డి*. హైదరాబాదు : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.2004.
8. రామలింగారెడ్డి కట్టమంచి, *కవిత్వ తత్త్వ విచారము*. వాల్తేరు బీ ఆంధ్ర విశ్వకళా పరిషత్ . 1973


Dr. B. Naga Padmavathy
Dr. G. Amruthavalli Tayaru
Smt. K.V. Syamala Devi
P. Siva Prasad
Nature and Environmental Conservation
in Ancient and Modern Indian Literature
(Part - 1)
RP
Roshan Publications

No part of this work may be reproduced, stored in a retrieval system, or transmitted in any form or by any means, electronic, mechanical photocopying, recording or otherwise, without the prior written permission of the copyright owner and the publishers.

First Edition 2015
© The Author
All rights reserved
ISBN: 978-81-942990-9-7

Published by
Roshan Publications
Visakhapatnam
E-mail: roshanpublications@gmail.com

Typeset and Design by
SS Xerox, Visakhapatnam

Scanned with CamScanner

# విషయ సూచిక


| Sl. No | | Pg. No |
|---|---|---|
| 1 | తెలుగు సాహిత్యంలో ప్రకృతి వర్ణన - సామాజిక చైతన్యం : డా॥ **నేలటూరి అనిత మార్గరెట్** | 1 |
| 2 | మనుచరిత్ర - ప్రకృతి వర్ణన: **షేక్ జరీనా బేగం** | 7 |
| 3 | ఆధునిక భావకవిత్వం - ప్రకృతి వర్ణన : **ఎం.మాధవి** | 9 |
| 4 | 'చెట్టు' శతకం - పర్యావరణ దృక్పథంయ:**కొలిపాక అరుణ** | 13 |
| 5 | పర్యావరణ పరిరక్షణ - సాహితీ కారుల బాధ్యత: **బిలసాని నాగరాజు** | 17 |
| 6 | భాగవతం - ఋతు వర్ణనలు :డా॥ **పాలపర్తి శ్రీనివాసరావు** | 22 |
| 7 | విశ్వానాధవారి కిన్నెర వడకలలో ప్రకృతి వర్ణన: **నెమ్మలూరి భవాని** | 28 |
| 8 | రామాయణంలో ప్రకృతి పర్యావరణం : **పి. గంగా భవాని** | 32 |
| 9 | ఇతిహాసాలు - ప్రకృతివర్ణన : **డా.ఎన్. సుజాత** | 34 |
| 10 | డా.ఎమ్.హరికిషన్ కథలు-రాయలసీమ ప్రకృతిజన్యకష్టాలు:**కాటంరెడ్డి రామలింగారెడ్డి** | 37 |
| 11 | కవి చంద్రులు ఋతువర్ణన :**అన్నపరెడ్డి వీరకుమారి** | 41 |
| 12 | ప్రకృతి పర్యావరణ పరిరక్షణలో నాడు-నేడు : **కడిమం అజుబా మమతకుమారి** | 46 |
| 13 | దేవులపల్లి వారి సినిమాగీతాలలోని ప్రకృతి వర్ణన:**బలుపూరి మరియమ్మ** | 51 |
| 14 | ఆధునిక కవులు - ప్రకృతి వర్ణన: **రెడ్డి నీలిమ** | 56 |
| 15 | ప్రకృతి హితమ్ - వేదవాఙ్మయమ్:**పూషడపు సుబ్బారావు** | 60 |
| 16 | ఆధునిక తెలుగు సాహిత్యంలో జటగీతం కావ్యం - ప్రకృతి పరిశీతన:**డా.పి.ముకుందరావు** | 66 |
| 17 | పుట్టపర్తి నారాయణాచార్యుల వారి ప్రకృతివర్ణన: **ఎం.ఎన్.వి. సూర్య కుమారి** | 73 |
| 18 | ప్రకృతి - పర్యావరణ పరిరక్షణ - నాడు - నెడు : **డి. రామారావు** | 76 |
| 19 | రామాయణంలో ప్రకృతి వర్ణన : **దారపురెడ్డి కనక మహాలక్ష్మి** | 79 |
| 20 | వెద సాహిత్యం - ప్రకృతి పర్యావరణ పరిరక్షణ : **నెమ్మికంటి సంధ్యారాణి** | 81 |
| 21 | ఏకవీర - ప్రతీకాత్మక ప్రకృతి వర్ణనలు : డా॥ **వి.ఎన్. మంగాదేవి** | 84 |
| 22 | దీర్ఘకవితల్లో ప్రకృతి చిత్రణ : **సుంకర గోపాలయ్య** | 88 |
| 23 | ప్రకృతితో చెలిమి మానవాళికి కలిమి: డా॥. **రెంటపల్లి రవీంద్రభాన్** | 93 |
| 24 | ప్రకృతి పర్యావరణ పరిరక్షణ నాడు నేడు : **పెదప్రోలు శివ ప్రసాద్** | 99 |


Scanned with CamScanner

| | | |
|---|---|---|
| 25 | ఆధునిక భావకవిత్వం – ప్రకృతి వర్ణన : **తోట రామకృష్ణ** | 104 |
| 26 | నదీప్రాశస్త్యం – కవులవర్ణన : **డా॥ ఏ. నాగజ్యోతి** | 109 |
| 27 | ఇతిహాసాలు – ప్రకృతి వర్ణన : **వనంతాడ ఎన్.కె.ఆచారి** | 113 |
| 28 | విశ్వనాధవారి ఆంధ్రప్రశస్తిలో ప్రకృతి వర్ణన : **పి. భువనేశ్వరి** | 116 |
| 29 | ఆధునిక భావ కవిత్వంలో ప్రకృతి వర్ణన : **డా॥ పుట్ట శ్రీనివాసులు** | 119 |
| 30 | భావకవుల – ప్రకృతి వర్ణన : **డా॥ జూరెడ్డి నిర్మల** | 124 |
| 31 | ఆది కావ్యము..... అష్టాదశవర్ణనలు :**డా॥డి.జీవనశ్రీ** | 129 |
| 32 | ఆధునిక తెలుగు సాహిత్యం– ప్రకృతి రమణీయత : **డా॥ జి. వెంకట రమణ** | 133 |
| 33 | యశోధర మహాకావ్యంలోని ఋతుఘోషణ : **వై. బుజ్జి** | 142 |
| 34 | ఆముక్త మాల్యదలో ప్రకృతి రమణీయత – పరిశీలన : **డా॥ మోగంటి సుధామయి** | 147 |
| 35 | ఆచార్య 'రాచపాళెం' దృష్టిలో సాహిత్య ప్రయోజనం : **అల్లూరు మస్తాన్** | 151 |
| 36 | చెట్టు సృజనాత్మక విశ్లేషణ : **పి.ఎ. సత్యనారాయణ** | 155 |
| 37 | రవీంద్రుని భావకవిత్వం – ప్రకృతి దర్శనం : **డా॥ ముచ్చర్ల రాజ్యలక్ష్మి** | 157 |
| 38 | ఆధునిక సాహిత్యంలో ప్రకృతి వర్ణన : **నత్తి సుమ** | 161 |


CS Scanned with CamScanner

# ఆచార్య 'రాచపాళెం' దృష్టిలో సాహిత్య ప్రయోజనం

-అల్లూరు మస్తాన్,
పరిశోధక విద్యార్థి,
తెలుగు విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్.

ప్రవేశం:

ఒక నిర్దిష్టమైన సాహిత్య రచనకు ప్రేరణ, ప్రోత్సాహం, ప్రతిఫలం అందించగలిగే శక్తి ఒక్క విమర్శకి మాత్రమే సాధ్యం. ఆధునిక సాహిత్యంలో ఈ ప్రక్రియను ప్రారంభించిన కట్టమంచి వారి నుండి నేటి విమర్శకుల వరకూ ఉన్న విమర్శకులలో విశిష్టమైన వ్యక్తి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. ఈయన మొదట సాంప్రదాయవాదిగా సాహిత్య విమర్శను 1972లో మొదలుపెట్టారు. ఆ తరువాత మూడు దశాబ్దాలకు అంటే 1997 నాటికి తన భావజాలంలో మార్పు చేర్పు చేసుకుని మార్క్సిస్టు సిద్ధాంతం పైన స్పష్టమైన అవగాహనను ఏర్పరచుకున్నారు.

## సాహిత్య ప్రయోజనం:

'సాహిత్య చరిత్రను సామాజిక చరిత్రలో భాగంగానే అధ్యయనం చేయాలి' అంటారు. త్రిపురనేని మధుసూదనరావు. తెలుగులో మార్క్సిస్టు సిద్ధాంతాల అన్వయ విమర్శకులుగా ప్రసిద్ధిగాంచిన త్రిపురనేని మధుసూదనరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య వంటివారి సరసన చేర్చదగిన మరొక గొప్ప నిబద్ధత కలిగిన సాహితీ విమర్శకులు రాచపాళెం'. సాహిత్యం 'సామాజిక ప్రయోజనం'గా ఉండాలని రాచపాళెం ఎప్పుడు భావిస్తూ ఉంటారు. ఏదో ఒక ప్రయోజనాన్ని సాధిస్తేనే ఆ రచన శిల్పవంతం అవుతుందని ఆయనంటారు. ఈ విధమైన భావజాల భూమిక ఆయన రాసిన ప్రతి వ్యాసంలో ఏదో ఒకచోట దర్శనమిస్తుంది కాబట్టి ఆయన రాసేది మార్క్సిస్టు సిద్ధాంత అన్వయ విమర్శగానూ, ఆయనను మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగానూ చెప్పవచ్చు.

## సాహిత్యం- సామాజిక ప్రయోజనం:

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారికి విమర్శరంగంలో చేసిన కృషికిగానూ "మన నవలలు మన కథానికలు(2015)" అనే విమర్శా గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ విమర్శా వ్యాససంపుటిలోని కొన్ని వ్యాసాలలో సాహిత్యం సమాజానికి ఏ విధంగా ప్రయోజనాన్ని చేకూరుస్తుందనే విషయాన్ని వ్యక్తం చేసారు.

తాను పుట్టిన ప్రాంతమైన రాయలసీమ రచయితల రచనలను ఈ గ్రంథంలో విమర్శించారు. అప్పటికే రాయలసీమ నుండి ఒక స్పష్టమైన భావజాలంతో రచనలు చేస్తున్న రచయితల్లో స్వామి రాసిన *'గద్దలాడతండాయి'*, చిలుకూరి దేవపుత్ర 'పంచమం'; సి. హెచ్. వెంకట రత్నం *'పల్లె పిలిచింది'*, వి. ఆర్. రాసాని *'చీకటి రాజ్యం'*, కేతు విశ్వనాథరెడ్డి రచించిన 'వేర్లు'; 'బోధి'; మొదలైన నవలలను మార్క్సిస్టు దృక్పథం నుండి విమర్శించారు. అయితే అప్పటికి ఆయనకున్న అవగాహన కేవలం ప్రాంతీయ సాహిత్యానికే పరిమితమైనట్టుగా తెలుస్తుంది. "స్థానికత, ప్రాంతీయ సాహిత్య విమర్శకు రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ అనువర్తన ద్వారా పునర్మూల్యాంకనం చేయగలిగే మార్గాన్ని సూచించగలగటం" అనేది వల్లంపాటి వెంకటసుబ్బయ్య సాహిత్య విమర్శలోని ముఖ్యాంశంగా దార్ల వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. "తెలుగు నవలపై మార్క్సిజం ప్రభావం" అనే వ్యాసంలో నిఖిలేశ్వర్ గారన్నట్లు నూరేళ్ళ తెలుగు నవలా చరిత్రలో వేలాది నవలలు పాఠకులను అలరించినా, మార్క్సిజం ప్రభావంతో వచ్చిన నవలలు తక్కువేనని చెప్పవచ్చు. సంఘ సంస్కరణ మూల సూత్రంగా వెలువడిన నవలల సంఖ్య మాత్రం ఎక్కువగా ఉన్నా అధిక సంఖ్యలో మాత్రం కథా కాలక్షేపానికి పనికొచ్చినవే! అయితే ఈ వ్యాసంలో నిఖిలేశ్వర్ గారు భారతీయ సామాజిక వ్యవస్థలో అంతర్ వైరుధ్యాలను

Scanned with CamScanner

వర్గ పోరాట ద ృక్పథంతో చిత్రించిన నవలలు ఇరవై వరకే ఉన్నాయని చెబుతూ ఆ ఇరవై నవలల పట్టికను ఇచ్చారు. అయితే ఆ పట్టికలో రాచపాళెం వారు మార్క్సిస్టు విమర్శా ద ృక్పథంతో విమర్శించిన రచనల్లో ఒక్కటైనా లేకపోవడం గమనార్హం. బహుషా ఆయన వ్యాస పరిమితిని దృష్టిలో ఉంచుకొని అలా చేసారేమో అనుకున్నా కూడా ఆయన నిర్ణయించిన నవలల సంఖ్య దానిని కొట్టిపడేస్తుందని చెప్పవచ్చు.

కేవలం ప్రసిద్ధులైన నవలా రచయితల నవలలను మాత్రమే పరిగణిలోకి తీసుకొని విమర్శించడం కాకుండా సమకాలీన రచయితల రచనలను కూడా తన విమర్శా వస్తువుగా స్వీకరించడం రాచపాళెం విమర్శలోని ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు.

'సమాజాన్ని విడిచి ఏ రచయితా ఏదీ మాట్లాడలేదు' అనే ఆయనలోని నిశ్చితాభిప్రాయమే ఈ లక్షణానికి కారణం కావచ్చని అనుకుంటున్నాను. రాయలసీమకు చెందిన రచయితల నవలలను విమర్శించి పాశ్చాత్య మార్క్సిస్టు భావన మీద నిర్మాణమైన తెలుగు సాహిత్య విమర్శకు రాచపాళెం ప్రాదేశికం చేసాడు. స్వామి రాసిన *'గద్దలాడ తండాయి'* నవలలో ఒక కులం తన పై కులం చేత పీడింప బడుతూ తన కింది కులాన్ని పీడించడానికి ప్రయత్నిస్తుందని ఈ విధమైన విపరీత ధోరణికి ఫ్యూడల్ బ్రాహ్మణీయ భావజాలమే కారణమని, ఇదే నిచ్చెనమెట్ల సమాజ లక్షణం అని, ఈ నవలను విశ్లేషించి ఆ లక్షణాన్ని ఇందులో నిరూపించారు. భౌతికవాద దృక్పథంతో ఈ నవలను విశ్లేషించి ఒక రచయిత తాను రచనలో చెప్పబోయే అంశం ఏ విధంగా ఉండాలి అనే విషయాన్నీ గురించి చెబుతూ రచయిత ఉన్న సామాజిక పరిస్థితిని చిత్రించడమే గాక, దానిని మార్చడానికి తనదైన ఆలోచనలను బయటపెట్టడం ఈ రచనలో కనిపిస్తున్నాయని చెబుతూ ప్రత్యామ్నాయ సమాజాన్ని సూచించడం అన్నది ఏ రచయితకైనా కనీస బాధ్యత అని ఈనవలలోని లోపాన్ని సున్నితంగా విమర్శించారు. రచయిత ఈ నవలలో వాస్తవాలను, తను అర్థం చేసుకొనే తాత్విక దృక్పథాన్ని భావజాలాన్ని ఎక్కడా బయట పెట్టకపోవడం, రచయిత ఏ పాత్రలోనైనా దాగున్నాడా అని వెదికితే ఎక్కడా కనిపించలేదని చెబుతూ రచయితకు ఉండాల్సిన నిబద్ధతను గుర్తుకు చేస్తున్నారు. "రచనతో బాటు రచయిత కూడా విప్లవోద్యమంలో భాగస్వామి కావడం నిబద్ధత ప్రధాన లక్షణం" అని త్రిపురనేని మధుసూదనరావు అంటారు. రచయిత తన రచనలో ఏదో ఒక సందర్భంలో పాత్రలకు ప్రతినిధిగా ఉండాల్సిన ఆవశ్యకతను 'రాచపాళెం' తెలియజేస్తున్నారు.

*'అద్దంలో చందమామ'* నవల అప్పటి ఆంధ్రదేశంలో ఉన్న లోపభూయిష్టమైన భూ సంస్కరణలను వివరిస్తుంది. అదేవిధంగా భూసంస్కరణల చట్టం పేరుతో ప్రజలను దళారులు ప్రజలను ఏ విధంగా మోసగించింది రచయిత ఈనవలలో చిత్రించారు. రాచపాళెం మార్క్సిస్టు దృక్పథంతో దీనిని విశ్లేషించి మానవతా దృష్టి, ప్రజాస్వామిక ఆలోచన, సామాజిక మార్పు పట్ల నిబద్ధత సామాజిక న్యాయ దృక్పథం కలగలిసిన దేవపుత్ర రచనలు సామాజిక వాస్తవికతను విమర్శనాత్మకంగా ప్రతిఫలిస్తున్నాయని వివరించారు. చిలుకూరి దేవపుత్ర రచించిన *'అద్దంలో చందమామ'* నవల మనిషి మనుగడకు సమాజ ప్రగతికి మూలమైన భూమి కొందరి సొత్తైనప్పుడు, అది అందరికీ చెందాలంటే ఆ కొందరు చేసే ఆగడాలు, పాలక వర్గం ఆ కొందరి కొమ్ము కాయడం ప్రచారాలతో, ఆర్భాటాలతో పేదల్ని దగాచేయడం, దళారులు సంపన్నుల ప్రయోజనాలకు ఉపయోగపడటం వంటి వాస్తవాలను సృజనాత్మకంగా విశ్లేషించి ప్రజల్ని భూమి రాజకీయాల్లో జ్ఞానుల్ని చేయడం అది సాధించిన 'సామాజిక ప్రయోజనం' అని రాచపాళెం విమర్శించారు.

సి. హెచ్. వెంకటరత్నం రచించిన *'పల్లె పిలిచింది'* నవలలో ప్రసాద్ అనే ఒక ఉపాధ్యాయుడు ఒక మారుమూల పల్లెటూరిని తనకున్న పరిమితమైన జ్ఞానంతో సంస్కరించిన తీరును ఈ నవలలో రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ విధమైన సంస్కరణ భావజాలంతో ఉన్న ఉపాధ్యాయుని చేత అలా చేయించడం ద్వారా అతనిలో 'భౌతిక తాత్విక దృక్పథం' ఉందని రాచపాళెం అంటారు. సమాజంలో ఇప్పటికే పాతుకుపోయిన ఆయారంగాలను సంస్కరించాలంటే భౌతిక తాత్విక దృక్పథం ఎంతైనా అవసరం అని రాచపాళెం సూచిస్తున్నారు.

మార్క్సిస్టు సాహిత్యవిమర్శ ప్రధాన లక్షణం సామ్యవాదం. ఈ సామ్యవాదాన్ని సాధించాలంటే వర్గ, వర్ణ వ్యవస్థలు సమూలంగా అంతమవ్వాలి. భారతీయ సమాజంలో వర్ణ వ్యవస్థ ఏవిధమైన పర్యావసానాలకు దారితీసిందో చెబుతూ

Scanned with CamScanner

భారతీయ సమాజం వర్ణ సమాజం మనుధర్మం దీనిని శాశ్వతం చేసింది. వర్ణవ్యవస్థ మనుషుల్ని విభజించింది. శారీరక శ్రమ చేసే అత్యధిక సంఖ్యాకులను సామాజిక గౌరవానికి సుఖానికి దూరం చేసింది అంటూ ఆవేదన చెందారు. ఎప్పుడు పేదల పక్షం ఉండే తన కలాన్ని కదిలించే రాచపాళెం శ్రామికుల మీద శాశ్వతంగా అగ్రవర్ణ భూస్వాముల పెత్తనం కొనసాగటానికి కులాలలో ఉపకులాలను సృష్టించి, కర్మ సిద్ధాంతంతో దానిని సమర్థించిందని దానిని వర్ణవ్యవస్థపై విరుచుకుపడ్డారు. ఇటువంటి సామాజిక వాస్తవికతనే *'చీకటిరాజ్యం'* నవల ప్రతిబింబిస్తుందని దానిని మార్క్సియ కోణం నుండి విమర్శించారు. ఈ నవలను రాయలసీమలో ప్రముఖులైన రచయితలలో ఒకరైన వి. ఆర్ రాసాని రాసారు. స్వయంగా ప్రగతిశీల భావాలూ కలిగిన రచయిత రచించిన ఈనవలను 'శ్రామికులు, పీడితులు ఏకమై పడకుల పీచమణచాలన్న ప్రబోధంతో ముగించటం అనేది ప్రగతిశీల నవలా సాహిత్యంలో భాగంగా రాచపాళెం భావించారు.

సామాజిక నేపథ్యమే - మార్క్సిస్టు విమర్శా?

సామాజిక నేపథ్యాన్ని భూమికగా చేసుకుని రాసే విమర్శను మార్క్సిస్టు విమర్శగా విమర్శకులు భావించారు. మార్క్సిస్టు విమర్శ సాహిత్యాన్ని సామాజిక చైతన్య రూపంగా గుర్తించి పరిశీలిస్తుందని రాచపాళెం వారంటారు. మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని పరిశీలించటమంటే ప్రకృతిని, చరిత్రను, సాహిత్యాన్ని గతితార్కిక భౌతికవాదపరంగా పరిశీలించడమని మరికొందరంటారు. ఇక్కడ ప్రకృతి, చరిత్ర అనేవి కూడా సమాజంలోని అంతర్భాగాలే అని అర్థం చేసుకోవాల్సి ఉంది. మరి కేవలం సామాజిక నేపథ్యంలోనే సాహిత్యాన్ని పరిశీలిస్తే మార్క్సిస్టు సాహిత్య విమర్శ అవుతుందా? అనే ప్రశ్నకు బాలగోపాల్ గారు ఈ విధంగా సమాధానమిస్తున్నారు. "సాహిత్యాన్ని సామాజిక నేపథ్యంలో పరిశీలించడం తప్పనిసరిగా అవసరమే. కానీ ఆ నేపథ్యాన్ని వివరించడంతో మార్క్సిస్టు సాహిత్య విమర్శ అయిపోదు." అని అంటారు. అయితే ఇక్కడ సామాజిక నేపథ్యం అనేది కేవలం ఆ విమర్శకు వస్తువుగా మాత్రమే ఉంటుంది. సమాజం నేరుగా సాహిత్య వస్తువు అయినప్పుడు ఆ సాహిత్యం అంత సంతృప్తికరంగా ఉండదు. అంటే ఇక్కడ మార్క్సిస్టు సాహిత్య విమర్శకు వస్తు, శిల్పాల సమన్వయం అవసరం అనే అర్థం స్ఫురిస్తుంది.

సాహిత్యం - శాస్త్రీయ దృక్పథం:

సామాజిక, విజ్ఞానశాస్త్రాలు సాధించిన విజయాల వెలుగులో సాహిత్య ప్రయోజనాన్ని పరిశీలించటాన్ని 'శాస్త్రీయ దృక్పథం' అంటారు త్రిపురనేని మధుసూధనరావు. రుజువు చేయగలగటం, ప్రత్యక్ష ప్రమాణానికి, ఆచరణకు సన్నిహితంగా ఉండటం శాస్త్రీయ దృక్పథం ప్రధాన లక్షణమని ఆయనే చెప్పారు. ఈ విధమైన శాస్త్రీయ దృక్పథంతో ఏ రచననైనా పరిశీలించినప్పుడే ఆ రచన సాధించే సామాజిక ప్రయోజనం అర్థమవుతుంది. అసలు దృక్పథమే లేకపోవడమనేది సాహిత్యం పట్ల జీవితం పట్ల సరైన అవగాహన లేకపోవడమేనని ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య అభిప్రాయపడ్డారు. రాచపాళెం వారి సాహిత్య విమర్శకు భూమిక భౌతిక దృక్పథంతో కూడిన 'సామాజిక ప్రయోజనం' ఇలాంటి దృష్టికోణంతో ఏ విమర్శకుడైన తెలుగు సాహిత్య విమర్శా చరిత్రలో కనబడితే వారిని వెతికిపట్టుకోవడం మొదలుపెట్టారు. దీనినే సాహిత్య విమర్శ పరిభాషలో మూల్యాంకన విమర్శగా చెప్పవచ్చు.

'సాహిత్య ప్రయోజనం' గురించీ మార్క్సిస్టు దృక్పథంలో ప్రత్యేకమైన సైద్ధాంతిక అవగాహన ఉంది. ఆ అవగాహన మార్క్స్,ఏంగెల్స్ రచనలతోనే ప్రారంభమై, గత నూట అరవై సంవత్సరాలలో ఎంతగానో విస్తరించింది. సోవియట్ యూనియన్, చైనా వంటి దేశాలలో ఆచరణలోకి వచ్చి, ఆ ఆచరణ క్రమంలో మార్పులు చేర్పులకు గురయిన సాహిత్య సైద్ధాంతిక అవగాహన ఒకవైపు ఉండగా, జర్మనీ. ఫ్రాన్స్, హంగేరీ, బ్రిటన్, చెకొస్లవేకియా, అమెరికాలలోని విశ్వవిద్యాలయాలలోనూ, కమ్యూనిస్టుపార్టీలలోనూ మేధావుల విశ్లేషణా కృషిలో అనేక కొత్త అంశాలు, ఆలోచనలు వెలికివచ్చాయి. ఇరవయో శతాబ్ది పొడవునా అద్భుతంగా వికసించిన ఈ మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్నంతా మదింపు వేసి, మన సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతలతో జతచేసి మనకై మనం ఒక విస్పష్టమైన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్ని రూపొందించుకోవలసి ఉంది.

Scanned with CamScanner

ముగింపు:

పైన చెప్పిన విధంగా వివిధ రకాల విమర్శకులు వివిధ రకాలైన సామాజిక ప్రయోజనాలను సాహిత్యం నుండి ఉండాలని వ్యక్తం చేసారు. వారందరి సాహిత్య ప్రయోజన సిద్ధాంతాలను వివరించడానికి ఈ వ్యాస విస్తృతి సరిపోదు. ఈ వ్యాసం కేవలం రాచపాళెం వారి దృష్టిలో సాహిత్యం నుండి పొందే ప్రయోజనాన్ని గురించి విమర్శనాత్మక దృష్టితో రాశాను.

ఆధార గ్రంథాలు:


1. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. చర్చ, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాదు. 2010(ద్వి.ము) పుట:149.
2. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. మన నవలలు – మన కథానికలు, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాదు. 2015. పుట:16
3. బాలగోపాల్, రూపం – సారం, హైదరాబాదు బుక్ ట్రస్ట్. హైదరాబాదు. 2011. పుట:116
4. మధుసూధన రావు. త్రిపురనేని, సాహిత్యంలో వస్తు శిల్పాలు, పుట:27




Scanned with CamScanner

# అనుబంధం –3

# అనుబంధం -3

## రచయిత రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారితో మరియు ఇతర సమకాలీన సాహిత్య విమర్శకులతో కలిసి తీసుకున్న ఛాయాచిత్రాలు



సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారితో



సాహితీ విమర్శకులు ముదిగంటి సుజాతారెడ్డి గారితో



ప్రముఖ విమర్శకులు, కథకులు సింగమనేని నారాయణ గారితో



సాహితీ విమర్శకులు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు గారితో



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డా, నందిని సిధారెడ్డి గార్లతో